

ఈ గ్రంథములో 1980-85 మధ్యకాలమునకు సంబంధించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి అవతార గాథను ఒక క్రమపద్ధతిలో, అత్యంత ప్రామాణికతతో వివరించడానికి ప్రయత్నం జరిగింది. ప్రతి అధ్యాయములోను భగవాన్ బాబావారి దివ్య లీలలు, మహిమలు పన్నీటి జల్లులవలె జాలువారుతాయి. పాఠకులు ఈ గ్రంథమును చదువుతున్నప్పుడు అవతార వైభవమును ప్రతిఫలించే భక్తుల కథలు ఈ గ్రంథ రచనకు ఉపకరణములుగా వినియోగింపబడటాన్ని గ్రహించగలరు. ఇందులో ఒక్కొక్క భక్తుని కథ భగవాన్ బాబావారి ప్రేమానుగ్రహములకు పాత్రులైన వందలు, వేల అదృష్టవంతులైన భక్తులకు ప్రతీకలని చెప్పవచ్చును.

- కస్తూరి

Prasanthi Nilayam

T00TEL013002
SSSBPT
7834
Rs. 75

ISBN 978-81-7208-559-9
978-81-7208-533-9(Set)


1980-85

సత్యం శివం సుందరం (ఐదవ భాగం)

Prasanthi Nilayam

సత్యం శివం సుందరం

(ఐదవ భాగం)



₹. 260

సత్యం శివం సుందరం

(అయిదవ భాగం)

(Sathyam Sivam Sundaram - Part V)

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి
దివ్య జీవిత చరిత్ర
(1980-85)

ఆంగ్లమూలం

బి.ఎన్. నరసింహమూర్తి

PRASANTHI NILAYAM

శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్

ప్రశాంతి నిలయం (పోస్ట్) 515 134
అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ నెం : 287375 ఫ్యాక్స్ : 287236
యస్.టి.డి. 08555, ఐ.యస్.టి.డి. 91-8555
ఇ-మెయిల్ : **enquiry@sssbpt.org**

© శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్

ప్రశాంతి నిలయం పోస్ట్ - 515 134,
అనంతపురం జిల్లా, ఆంధ్రప్రదేశ్, ఇండియా.

ప్రచురణ సర్వహక్కులు శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్‌వారివే. ప్రచురణాధికారము మరియు ఇతర భాషలలోకి అనువదించు అధికారములన్నియు ప్రచురణ కర్తవే. ఈ పుస్తకమునకు సంబంధించిన ఏ భాగముకాని, పూర్తిగాకాని, చిత్రపటములుగాని, కళాకౌశల్యముగాని నకలు తీయరాదు. కన్వీనరు, శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్, ప్రశాంతినిలయం, ఆంధ్రప్రదేశ్, ఇండియా - 515134, వారి లిఖితపూర్వక అనుమతి లేనిదే ఈ పుస్తకమును ఇతర భాషలలోకి అనువదించరాదు. మరి ఏ ఇతర రూపములోనైనా, ఫోటో కాపీ, రికార్డింగ్ మరియు ఏ ఇతర సాధనమువలనగాని ఈ పుస్తకములోని ఏ భాగమునూ ఉపయోగించరాదు. గ్రంథసమీక్షకు మాత్రం ఈ నిషేధము వర్తించదు. ఈ పుస్తకమును భారతదేశమునుండి ఎగుమతి చేయు అధికారము కేవలము ప్రచురణాధికారి, శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్, ప్రశాంతినిలయమువారికి మాత్రమే కలదు.

ISBN 978 - 81 - 7208 - 559 - 9
978 - 81 - 7208 - 533 - 9(Set)

కన్వీనర్, శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్,
ప్రశాంతి నిలయం, ఇండియా - 515 134

వారిచే ఇండియాలో ప్రచురింపబడినది.

ద్వితీయ ప్రచురణ : **July, 2008**

ముద్రణ :

ఓంకార్ ఆఫ్‌సెట్ ప్రింటర్స్
3/4, I మైన్, ఎన్.టి.పేట్, బెంగళూరు - 2
ఫోన్ : 2670 8186, 2670 9026
e-mail : omkaroffset@gmail.com

సమర్పణ

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య జీవిత చరిత్రను "సత్యం, శివం, సుందరం" అనే శీర్షికతో కీ॥శే॥ ఎన్. కస్తూరి నాలుగు భాగములలో రచించారు. అందులో ప్రథమ భాగము యొక్క 1982వ సంవత్సరమునకు చెందిన సంపుటమునకు పీఠికలో శ్రీ కస్తూరి ఈ విధంగా వ్రాశారు :

> "భగవాన్ బాబావారి దివ్య జీవితంలో అవతార
> ప్రారంభము నుండి 1960వ సంవత్సరము వరకు గల
> ప్రథమ భాగము 1961వ సంవత్సరములో ప్రచురింపబడింది.
> ఆ తరువాత 1979వ సంవత్సరము వరకు కొనసాగిన
> స్వామి దివ్య జీవిత చరిత్ర వరుసగా ద్వితీయ, తృతీయ,
> చతుర్థ భాగములుగా ప్రచురింపబడి పాఠకులకు
> అందజేయడం జరిగింది. ఆ తరువాయి సంవత్సరాలకు
> సంబంధించిన దివ్యగాథ పంచమ భాగముగా
> ప్రచురింపబడుతుంది. అదే విధంగా ఇతర భాగములు
> కూడా వరుసగా ఒక దాని తరువాత ఒకటి
> ప్రచురింపబడుతాయి."

ఈ వరుస క్రమంలో ఇప్పటివరకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, చతుర్థ భాగములు ప్రచురింపబడి భక్తులకు అందజేయడం జరిగింది. అందులో చతుర్థ భాగము 1980వ సంవత్సరం గురుపూర్ణిమ పర్వదినం నాడు ఆవిష్కరింపబడింది. ఆ తరువాత సరిగ్గా 25 సంవత్సరముల అనంతరం 1980-85 సంవత్సరాలకు సంబంధించిన భగవాన్ బాబావారి దివ్య జీవిత చరిత్ర ఇప్పుడు అదే గురుపూర్ణిమ పర్వదిన సందర్భంగా అవతార పురుషుని 80వ జన్మదినోత్సవ సంవత్సరములో స్వామి దివ్య చరణారవిందములకు సమర్పించబడుతున్నది. ఈ కార్యమును ఇంతకు ముందే సరియైన సమయంలో

నిరవేర్చలేక పోయినందుకు భగవాన్ బాబావారికి మరియు ఆయన భక్తులకు కూడా మేము క్షమాపణలు చెప్పుకుంటున్నాము. ఈ దివ్యగాథను ఇకపై వీలైనికప్పుడు గ్రంథరూపంలో అందజేసేందుకు కృషి చేయగలమని సవినయంగా మనవి చేసుకుంటున్నాము. భగవాన్ బాబావారి దివ్యజీవితంలో ఐదునుండి పది సంవత్సరాల కాలమునకు సంబంధించి ఒక్కొక్క భాగము దొరుకుట వెంట వెంటనే ప్రచురించేందుకు కృషి చేయగలమని వాగ్దానం చేస్తున్నాము. ఈ మా కృషిలో స్వామి దివ్య కాంతి మాకు పథ నిర్దేశం చేస్తూ ముమ్మల్ని ముందుకు నడిపించగలదని విశ్వసిస్తున్నాము.

భగవాన్ బాబావారి దివ్యాశీస్సులతో 2003వ సంవత్సరం అక్టోబరు నెలలో భగవాన్ దివ్య జీవిత చరిత్రకు సంబంధించిన తరువాయి భాగములను సంకలనం చేసి వెలువరించేందుకుగాను చిరకాలముగా స్వామి భక్తులైన డా॥ జి. వెంకటరామన్, డా॥ జయలక్ష్మీ గోపీనాథ్, శ్రీ బి.ఎన్. నరసింహమూర్తి మరియు శ్రీమతి ఆర్. సీతాలక్ష్మిగార్లతో కలసి ఒక కమిటీని ఏర్పాటుచేయడం జరిగింది. ఈ ఒక్కొక్క భాగములో పొందుపరుపబడే విషయ వివరణను తయారుచేసే బాధ్యత శ్రీ నరసింహమూర్తికి అప్పగించడం జరిగింది. ఈ కృషిలో కమిటీ సభ్యులు మరియు శ్రీ వి.ఎన్. ప్రహ్లాద్ ఆయనకు అవసరమైన సహాయ సహకారములు అందిస్తారు. ఈ విధంగా అప్పటినుండి శ్రీ నరసింహమూర్తి ఈ గ్రంథ రచనను ప్రేమ పూర్వకమైన కృషిగా చేపట్టారు. పంచమ భాగమునకు ముందు పొందుపరుపబడిన తన తొలిపలుకులో ఆయన అవతార పురుషులైన భగవాన్ బాబావారి దివ్య చరిత్ర రచనలో తాను అవలంబించిన విధి విధానమును వివరించియున్నారు. శ్రీ నరసింహమూర్తి గారు ఆంగ్లభాషలో రచించిన ఈ 'సత్యం శివం సుందరం – పంచమ భాగము'ను శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్ ట్రస్టు కార్యాలయము ఇపుడు తెలుగులోనికి అనువదించి భక్తులకు అందజేస్తున్నది.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య జీవిత చరిత్రను గురించి వరుసగా ప్రచురింపబడే ఈ "సత్యం, శివం, సుందరం" గ్రంథము యొక్క భాగములన్నిటిని భగవాన్ బాబావారికి మరియు భక్తులకు కూడా పరిపూర్ణంగా తృప్తిని కలిగించే రీతిలో ఇకపై సకాలములో అందించేందుకు మేము చేసే కృషిలో స్వామి దివ్యానుగ్రహ, ఆశీస్సులు లభించాలని భక్తి, వినయ, ప్రేమ పూర్వకంగా స్వామిని వేడుకుంటున్నాము.

ప్రశాంతి నిలయము, **కన్వీనర్,**

తేదీ : 10-7-2006 **శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్**

తొలి పలుకు

ఈ గ్రంథ రచనకు ఉపక్రమించేముందు, దీనివలన ప్రప్రథమంగా మేలును పొందిన వ్యక్తిగా నేను భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య చరణారవిందములకు కృతజ్ఞతా పూర్వకమైన ప్రణామములు అర్పించుకోవలసియున్నది. ఈ గ్రంథరచన ప్రారంభించినప్పటినుండి ఇందలి కథా వస్తువు నన్ను మంత్ర ముగ్ధుడిని చేసివేసింది. గ్రంథ రచనకు అవసరమైన విషయసేకరణ మరియు ఆ అంశములను గురించిన నిరంతర చింతనవలన, ఈ రచనా వ్యాసంగము నాకు ఒక స్వయంప్రేరితమైన తపస్సుగా మారింది. ఈ పవిత్ర కర్తవ్య నిర్వహణలో నేను కేవలం నిమిత్తమాత్రుడిని మాత్రమేనన్న యథార్థము నేను పొందిన అనేక అనుభూతులద్వారా బుజువైంది. అనేక పర్యాయములు ఈ గ్రంథ రచన అసంకల్పితముగా నిరాఘాటముగా సాగిపోతూంటే నేను మౌనంగా, కేవలం ఒక సాక్షీభూతునిగా నిలిచాను. ఇంకా, కొన్ని బలహీన క్షణాలలో భగవదనుగ్రహము ద్వారా నిరంతరాయంగా సాగిపోతున్న ఈ గ్రంథ రచనా ప్రవాహమునకు నేను ఆటంకముగా ఉన్నానేమోనని కూడా అనిపించింది. అటువంటి సమయాల్లో నేనే ఈ గ్రంథమునకు రచయితనేమో అన్న భ్రాంతికి లోనై స్వకపోల కల్పితమును చొప్పించడానికి ప్రయత్నం చేశానేమోననిపించింది. పాఠకులు ఈ గ్రంథమును చదువుతున్నప్పుడు నా అంతరంగ అనుభూతులలోని అటువంటి నిమ్నోన్నతములను సులభంగా గ్రహించగలరు.

వైవిధ్యభరితమైన ఈ జగన్నాటకమునకు సూత్రధారియై నా అంతరంగమునందు అధివసించియున్న ఆ అంతరంగ సాయిని అంతర్దృష్టిచే లోతుగా అన్వేషించి సాక్షాత్కరింపజేసుకునేందుకు ఈ గ్రంథ రచన నాకు దోహదం చేసిందని ఖచ్చితంగా చెప్పగలను. ఈ సందర్భంగా "సాయితత్త్వము మరియు సాయి సందేశము ఒక్కటే – అదే ప్రేమ. సాయి అంటే కేవలం జడమైన దేహము కాదు; అమృతమయమైన ఆత్మతత్త్వము" అని స్వామి తమ

నిజతత్త్వమును వెల్లడి చేస్తూ పలికిన పలుకులు నాకు పదేపదే జ్ఞప్తికి వస్తున్నాయి. అటువంటప్పుడు అవతార పురుషులైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య చరిత్రను ఎంతటి ఉత్తమ గ్రంథమైనా ఏవిధంగా పరిపూర్ణంగా వెల్లడించగలదు? "జీసస్ గురించి మాట్లాడండి అని ఎంతో ప్రేమతో మీరు నన్ను అడుగుతున్నారు. అయితే, విశ్వమంతా నిండియున్న ఆ దివ్యప్రేమ గీతమును కేవలం ఒక శూన్య వేణువు ద్వారా నేను ఏవిధంగా పలికించగలను?" అని జీసస్ ప్రియశిష్యుడైన జాన్ ఒకసారి ప్రశ్నించినట్లు ఖలీల్ జిబ్రాన్ వ్రాసిన "సన్ ఆఫ్ మేన్" అనే గ్రంథములో వ్రాయబడియున్నది. భగవాన్ బాబావారి దివ్యతత్త్వము మరియు విభూతులు మనకు తెలిసిన ఈ భౌతిక జగత్తుకు మాత్రమే పరిమితం కాకపోవటంచేత ఎటువంటి గ్రంథము కూడా వాటిని పరిపూర్ణముగా వర్ణించలేదన్న విషయము యథార్థమే!

1980-85 సంవత్సరాల మధ్యకాలములో భగవాన్ బాబావారు తమ దివ్య సంకల్పముననుసరించి చేపట్టిన కార్యక్రమములను గురించి ఈ చిన్న గ్రంథములో విశదీకరించడానికి చేసే ఈ నా కృషి అత్యల్పమైనదని విన్నవించుకుంటున్నాను. భగవాన్ దివ్య జీవితములోని ఈ ఐదు సంవత్సరముల కాలములో భౌతిక పరిధిలో ఆయన చేపట్టిన ముఖ్య పథకముల వివరణ పట్టిక ఈ పుస్తకమునకు అనుబంధముగా చేర్చడం జరిగింది. ఈ పట్టిక ఆయా తేదీలలో బాబావారు ఎక్కడెక్కడ ఉన్నారో ఏయే కార్యక్రమాలు చేపట్టారో తెలుపుతుంది. ఈ గ్రంథము పన్నెండు అధ్యాయములుగా విభజింపబడింది. అందులో భగవాన్ బాబావారి దివ్య జీవితములోని కొన్ని ముఖ్య ఘట్టములు మరియు ఆయన అవతార కార్యక్రమములోని ప్రధాన అంశములు వివరింపబడినాయి.

ఈ గ్రంథములో చారిత్రికాధారములతో కూడిన భగవాన్ శ్రీ సత్యసాయి అవతార గాథను ఒక క్రమపద్ధతిలో అత్యంత ప్రామాణికతతో వివరించడానికి ప్రయత్నం జరిగింది. ప్రతి అధ్యాయములోను భగవాన్ బాబావారి దివ్యలీలలు,

మహిమలు విరివిగా వస్నీటి జల్లులవలె జాలువారుతాయి. వీటి పరమ ప్రయోజనం, భౌతిక పరిధిలో కూడా ఈ వస్తు ప్రపంచమును చైతన్యపరచి ముందుకు నడిపించే ఒక దివ్యశక్తి ఉన్నదనే విశ్వాసమును సంశయాత్ముల మనస్సులలో నెలకొల్పటమే! సూఫీ మతమునకు చెందిన రూమీ అనే ఒక నిగూఢతత్త్వ వేత్త "ఏ విషయమైనా హృదయాన్ని స్పృశించి అక్కడ హత్తుకున్న తరువాతనే మేధస్సు గ్రహించాలి", అని ఉద్ఘాటించాడు. ఈ విధంగా మేధస్సును నొప్పించకుండా హృదయానికి హత్తుకునే రీతిలో ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తున్న సాధకుని ముందుకు నడిపించడమే ఈ గ్రంథము యొక్క ప్రధాన లక్ష్యము.

మొదటి అధ్యాయమైన "నేను ఎవరు?" లో భగవాన్ బాబావారి అవతార ప్రారంభమునుండి ఇప్పటివరకు తన నిజతత్త్వమును గురించి ఆయన అప్పుడప్పుడు స్వయంగా వెల్లడించిన సంఘటనలను గురించిన సింహావలోకనము పొందుపరుపబడింది. అంతేకాక, ఇందలి కథా వస్తువుపట్ల రచయితయొక్క వైఖరిని స్పష్టపరుస్తూ రాబోయే అధ్యాయములలో ప్రస్ఫుటమయ్యే శైలి మరియు రీతులకు మార్గదర్శకంగా ఉంటుంది. రెండవ అధ్యాయములో భగవాన్ బాబావారి బాల్యంలో జరిగిన కొన్ని ముఖ్య సంఘటనల (ఇంతకు ముందు "సత్యం శివం, సుందరం" పుస్తకము యొక్క నాలుగు సంపుటములలో గ్రంథస్థము చేయబడనివి) వివరణ ఉన్నది. మూడవ అధ్యాయమైన "భూతల స్వర్గము కాశ్మీరులోయ సందర్శనము"లో భగవాన్ బాబా వారు 1980వ సంవత్సరము జూన్ నెలలో జరిపిన ఢిల్లీ మరియు కాశ్మీరు పర్యటనయొక్క వృత్తాంతము వర్ణింపబడింది. 1980-85 సంవత్సరాలమధ్య కాశ్మీరునుండి కన్యాకుమారివరకు భారతదేశమంతటా భగవాన్ బాబావారు జరిపిన విస్తృతమైన పర్యటనకు ఈ అధ్యాయము ప్రతీక.

ఇదే సమయంలో భారతప్రభుత్వములోని విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషన్‌చే విశ్వవిద్యాలయముగా పరిగణింపబడిన శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా

సంస్థ (Sri Sathya Sai Institute of Higher Learning) ను నెలకొల్పడం నిస్సందేహంగా అతి ముఖ్యమైన సంఘటన. అందువలన, నాలుగు, అయిదు, ఆరు అధ్యాయములు ఈ పరిగణిత విశ్వవిద్యాలయ ఆవిర్భావము మరియు నిర్వహణలకు సంబంధించిన ఇతివృత్తముయొక్క వివరణకు నియోగించబడినాయి. ఈ మూడు అధ్యాయములు, విశ్వవిద్యాలయ ఆవిర్భావమును గురించియే కాక భగవాన్ తమ విద్యార్థులు, అధ్యాపకులు మరియు విశ్వవిద్యాలయ పరిపాలనా సిబ్బందియొక్క భవితవ్యమును ఏవిధంగా తీర్చిదిద్దుతున్నారో, తద్వారా సంస్థయొక్క భవిష్యత్తుకు ఏవిధంగా గట్టి పునాది వేశారో వివరిస్తాయి. ఆ తరువాత రెండు అధ్యాయములు, అనగా "విశ్వవ్యాప్తమైన దివ్య ప్రేమతత్త్వము" మరియు "ప్రాపంచికమైన పేరు ప్రతిష్ఠలు - భగవంతుని దివ్యాశీస్సులు" అనే శీర్షికలు గలవి, భగవాన్ బాబావారి అవతారోద్యమంలోని అత్యంత ప్రధాన అంశమైన 'మానవ హృదయాలలో ప్రవేశించి వారి జీవితాలలో పరివర్తన తేవడం' అనే మహత్తర కార్యమును స్వామి ఏవిధంగా అత్యంత నైపుణ్యముతో నిర్వహిస్తున్నారో తెలియజేస్తాయి.

1984వ సంవత్సరం భగవాన్ బాబావారి అవతార కార్యక్రమంలో వైద్యరంగమునకు సంబంధించి ఒక మైలురాయి వంటిది. ఆ సంవత్సరంలో ప్రశాంతి నిలయములోని శ్రీ సత్యసాయి జనరల్ హాస్పిటల్‌యొక్క విశాలమైన నూతన భవనమునకు ప్రారంభోత్సవం జరిగింది. తొమ్మిదవ అధ్యాయమైన "దివ్య భిషగ్వరులు"లో భగవాన్ బాబావారిచే నెలకొల్పబడిన ప్రశాంతి నిలయము మరియు వైట్‌ఫీల్డులలో గల శ్రీసత్యసాయి జనరల్ హాస్పిటల్సుయొక్క వివరణ ఉంటుంది. అంతేకాక, ఆరోగ్య పరిరక్షణ గురించి భగవాన్ బాబావారి ఆలోచనా విధానము మరియు వారి అనూహ్యమైన వ్యాధి నివారణ శక్తి కూడా ఈ అధ్యాయములో వివరింపబడినాయి. పదవ అధ్యాయమైన "బృందావనంలో నూతన మందిర నిర్మాణం" భగవాన్ బాబావారు 1944వ సంవత్సరంలో మొట్టమొదటిసారి బెంగుళూరుకు విచ్చేయడంతో ప్రారంభమై తేదీ 26-4-1984న జరిగిన త్రయీ బృందావనం ప్రారంభోత్సవంతో ముగుస్తుంది.

ఇక, పదునొకటవ అధ్యాయము "నమే పార్థాస్తి కర్తవ్యం"లో శ్రీసత్యసాయి సేవా సంస్థల ప్రధాన కార్యక్రమాలు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల నాలుగవ ప్రపంచ సమ్మేళనం మరియు 1985వ సంవత్సరంలో అత్యంత వైభవోపేతంగా జరిగిన భగవాన్ బాబావారి 60వ జన్మదినోత్సవముల వర్ణన ఉంటుంది. చివరగా పన్నెండవ అధ్యాయమైన "జగద్గురువు" 1980-85 సంవత్సరముల మధ్య భగవాన్ బాబావారి దివ్యప్రబోధల సారాంశమును అందిస్తుంది.

పాఠకులు ఈ గ్రంథమును చదువుతున్నప్పుడు, అవతార పురుషుని వైభవమును ప్రతిఫలించే భక్తుల కథలు భగవాన్ బాబావారి దివ్య జీవిత గ్రంథ రచనకు ఉపకరణములుగా వినియోగింపబడటాన్ని గమనించగలరు. ఇందులో ఒక్కొక్క భక్తుని కథ, భగవాన్ బాబావారి ప్రేమానుగ్రహములకు పాత్రులైన వందలు, వేల అదృష్టవంతులైన భక్తులకు ప్రతీకలని చెప్పవచ్చును. ఈ గ్రంథములోని అంశములయొక్క ప్రామాణికతను కాపాడేందుకు గాను ఇందులో నేను కేవలం ప్రత్యక్షంగా ఇంటర్వ్యూ చేసి సేకరించిన భక్తుల (ప్రపంచ ప్రఖ్యాతి చెందిన ఒకరిద్దరు భక్తులు తప్ప) అనుభవాలను మాత్రమే పొందుపరచాను. అంతేకాక, ఒక ప్రశ్నావళిని కూడా తయారు చేసి భక్తులకు అందజేసి వారినుండి స్వయంగా సమాధానాలు సేకరించాను.

శ్రీ సత్యసాయి సాహిత్యమునకు పితామహునిగా పేర్కొనదగిన శ్రీ ఎన్.కస్తూరి నాకు పితృసమానులు. వారి జీవితము మరియు రచనలు నాకు స్ఫూర్తిదాయకములు. ఆయనకు నేను ప్రప్రథమంగా కృతజ్ఞతాభివందనములను అర్పించవలసియున్నది. ఆ తరువాత, భగవాన్ బాబావారి యందు తమకు గల అపారమైన ప్రేమతో ఈ గ్రంథరచనకు సహకరించిన అనేకమంది భక్తులకు నేను ఋణపడియున్నాను. ఇందలి కథావస్తువు మరియు రచనాపరమైన అనేక అమూల్య సలహాలు అందించిన శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్ కన్వీనరు శ్రీ కె.ఎస్. రాజన్, ట్రస్టు సభ్యులు మరియు 'సత్యం, శివం, సుందరం' కమిటీ సభ్యులకు నా కృతజ్ఞతలు. విషయ సేకరణలో విస్తృత కృషి

చేసి, గ్రంథరచన సక్రమమైన పద్ధతిలో కొనసాగేటట్లు చేసి, కథా వస్తువు యొక్క రూపకల్పనలో అమూల్యమైన సహాయము అందించిన శ్రీ వి.ఎన్. ప్రహ్లాద్‌కు నేను ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెప్పుకుంటున్నాను.

ఈ గ్రంథ రచనకు పిన్నలు, పెద్దలు, వయోవృద్ధులు, ఎందరో మహానుభావులు నాకు ఎన్నో విధాలుగా తోడ్పడ్డారు. వారందరికీ నా కృతజ్ఞతలు. అనేకమంది ప్రముఖ వ్యక్తులు అమూల్యమైన తమ కాలమును వెచ్చించి తమ దివ్యానుభూతులను నాతో పంచుకున్నారు. ఇంకా కొందరు భగవాన్ బాబావారు స్వదస్తూరీతో తమకు వ్రాసిన లేఖలను, అరుదైన చక్కని ఫొటోలను నాకు పంపారు. అందులో కొందరిని గురించి ఈ గ్రంథములో అక్కడక్కడా ప్రస్తావించడం జరిగింది. అన్నిటిని మించి గ్రంథరచనకు సంబంధించిన విషయములను నాతో చర్చించి, నాకు ఎంతో స్ఫూర్తిని, మనో ధైర్యమును అందించి చక్కని భావాలను స్ఫురింపజేసిన సాయి సోదరులు శ్రీ సి.శ్రీనివాస్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి.

బృందావనంలో నా సహోద్యోగులు శ్రీయుతులు సంజయ్ సహానీ, రుచిర్ దేశాయిలు గ్రంథరచనలో భాష మరియు విషయపరమైన ఉపయుక్త సలహాలను అందించారు. శ్రీ సత్యసాయి గ్రామము, ముద్దెనహళ్ళిలోని నా పూర్వ సహోద్యోగి శ్రీ కె. వసంతరాజ్ శ్రద్ధతో గ్రంథమును ఆమూలాగ్రముగా చదివి అవసరమైన చోట్ల మార్పులు, చేర్పులు చేయడంలో నాకు సహకరించారు. వీరందరికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ పూర్వవిద్యార్థులు మరియు ప్రస్తుతం నా సహోద్యోగులు అయిన శ్రీ రాజీవ్ రాజన్, సాయి మనోహర్, రఘుపతిరావులు అనేక విధాలుగా నాకు తోడ్పడ్డారు. ముఖ్యంగా శ్రీ రాజీవ్ రాజన్ గ్రంథ రచనకు సంబంధించి అన్ని విధాల శ్రమించారు.

బెంగుళూరుకు చెందిన చిత్రకారులు శ్రీ సురేష్ గ్రంథమునకు ముఖపత్ర రచన చేశారు. శ్రీ కేకే మిస్త్రీ మరియు నా సహోద్యోగి డా॥ సి.ఎన్. సుందరేశన్

తమ వద్దనున్న ఫోటోలను ఈ గ్రంథములో ప్రచురించుటకు అందజేశారు. ఏ అధ్యాయములో ఏ పుటలో ఏ ఫోటోను పొందుపరచాలనే విషయంలో శ్రీ సాయిరూపక్, శ్రీ మహాబలేశ్వర్ మరియు శ్రీ రవి సహకరించారు. బెంగుళూరుకు చెందిన శ్రీ టి.ఎస్. వెంకట్రామన్, శ్రీమతి & శ్రీ జయశంకర్‌లు నేను ఇంటర్వ్యూ చేసిన వ్యక్తుల కథనమును వ్రాసిపెట్టారు. నేను వీరందరికి ఋణపడియున్నాను.

చివరగా మనకు అత్యంత ప్రీతిపాత్రులైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి ప్రేమవనంలో పుష్పించిన "సత్యం, శివం, సుందరం - పంచమ భాగము" అనే ఈ ప్రేమ కుసుమమును ఒక తోటమాలిగా ఆ ప్రభువు దివ్యచరణారవిందములవద్ద భక్తి, వినయపూర్వకంగా సమర్పించుకుంటున్నాను.

ప్రశాంతి నిలయం — బి.ఎన్. నరసింహమూర్తి

తేదీ : 21-7-2005 (గురుపూర్ణిమ)

విషయసూచిక

1. "నేను ఎవరు?" 1
2. నవ నవోన్మేష సుమ సౌరభం 25
3. భూతల స్వర్గము కాశ్మీరులోయ సందర్శనము 41
4. ఉన్నత విద్యకు మహోన్నత స్థాయిని కల్పించే విశ్వవిద్యాలయము 69
5. విశ్వవిద్యాలయ స్థాపనలో భగవానుని ఉపకరణములు 101
6. భగవాన్ ఎంచుకున్న అధ్యాపకులు 141
7. విశ్వవ్యాప్తమైన దివ్య ప్రేమతత్త్వము 183
8. ప్రాపంచికమైన పేరు ప్రతిష్ఠలు - భగవంతుని దివ్యాశీస్సులు 229
9. దివ్య భిషగ్వరులు 267
10. బృందావనంలో నూతన మందిర నిర్మాణము 297
11. "న మే పార్థాస్తి కర్తవ్యం..." 329
12. జగద్గురువు 373

అనుబంధము : భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య జీవితచరిత్రలోని 1980 -85 సంవత్సరాలకు సంబంధించిన ముఖ్య సంఘటనలు, వరుసగా

1

"నేను ఎవరు?"

అది మేనెల ప్రారంభంలో కొడైకెనాల్‌లో ఒకనాటి రమణీయ ప్రభాతసమయం. 'సాయిశ్రుతి' భవనంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా హాలులో ఆసీనులై యున్నారు. ఆ వేసవిలో మనోహరమైన వేసవి విడిది కొడైకెనాల్‌కు స్వామితోబాటు వెళ్ళిన అదృష్టవంతులైన కొందరు విద్యార్థులు, అధ్యాపకులు మరియు భక్తులు స్వామిని పరివేష్టించి ఉన్నారు. ఉదయంపూట అల్పాహారం పూర్తయిన తరువాత అప్పుడప్పుడు జరిగే ఉల్లాసభరితమైన ఇష్టాగోష్ఠి సమయం అది. స్వామి విద్యార్థులను ఉద్దేశించి "నా ప్రశ్నకు సరియైన సమాధానము చెప్పినవారికి ఒక ప్రత్యేక బహుమతిని ఇస్తాను" అని చెప్పారు.

ఆ సమయంలో అక్కడున్న వారందరిలో, ముఖ్యంగా విద్యార్థుల మనస్సులలో స్వామి అడగబోయే ప్రశ్నను గురించి ఊహాగానముతో బాటు ఉత్కంఠత కూడా నెలకొంది. సాధారణంగా స్వామి ఇటువంటి సందర్భాలలో పురాణేతిహాసాలనుండి కొన్ని సన్నివేశముల గురించి గాని, కొన్ని పాత్రల గురించిగాని విద్యార్థులను ప్రశ్నిస్తారు. కాని, ఆరోజు మాత్రం స్వామి వేసిన ప్రశ్న చాలా విలక్షణమైనది, విశిష్టమైనదీను. విద్యార్థులకు తనను చూపిస్తూ 'నేను ఎవరు?' అని ప్రశ్నించారు.

ఆ ప్రశ్న వినీవినగానే విద్యార్థులందరూ తడుముకోకుండా ముక్తకంఠంతో 'భగవంతుడు' అని హాలు ప్రతిధ్వనించేలా గట్టిగా సమాధానం చెప్పారు. ఆ ప్రశ్న చాలా సామాన్యమైనదని వారి భావన. కానీ, బాబా చిరునవ్వు నవ్వి 'సరైన జవాబు కాదు' అన్నారు. దాంతో ప్రతి ఒక్కరూ దిగ్భ్రాంతి చెందారు. ఆలోచనలో పడ్డారు.


ఇంతలో ఒక విద్యార్థి 'స్వామీ! మీరు శివశక్తి స్వరూపులు' అన్నాడు. ఈ సమాధానం స్వామికి ఆమోదయోగ్య మవుతుందన్నట్లు అందరూ స్వామివైపు చూశారు. స్వామి సుందర వదనారవిందముపై అందమైన ఒక చిరుదరహాసం మెరిసింది. 'సరైన జవాబు కాదు' అన్నారు మళ్ళీ, స్వామి.

స్వామి యొక్క దివ్య చమత్కారభరితమైన చిలిపితనం అభివ్యక్త మవుతున్న అనుభూతి కలిగింది, అక్కడ చేరిన చాలామందికి. ఒక విద్యార్థి కొంచెం ధైర్యం తెచ్చుకుని 'స్వామీ! మీరు శ్రీకృష్ణ భగవానుని పునరవతారం' అన్నాడు. అప్పుడు స్వామి బిగ్గరగా నవ్వి 'సరైన జవాబు కాదు' అని మరలా చెప్పారు. అక్కడ ఉన్న ఒక వయోవృద్ధుడైన భక్తుడు 'స్వామీ! మీరు సర్వదేవతా స్వరూపులు' అన్నాడు. స్వామి నుండి మళ్ళీ అదే వ్యాఖ్య: 'సరైన జవాబు కాదు'. దీంతో అక్కడున్న చిన్నాపెద్దా అంతా నిశ్చేష్టులయ్యారు. వాతావరణం అంతా గంభీరంగా మారిపోయింది. ఇంతలో ఒక భక్తుడు 'స్వామీ! మీరు ఎవరో మీరే మాకు తెలియజెయ్యండి' అని నిస్సహాయంగా అభ్యర్థించాడు.

అప్పుడు భగవాన్ గంభీరమైన స్వరంతో భావగర్భితంగా 'నేను నేనే' అని ప్రకటించారు. అక్కడున్న ప్రతి ఒక్కరూ 'ఇదా సమాధానం' అన్నట్లు మనసారా ఆనందించారు. ఆ హాలంతా హాస్యభరిత, ఆనందపూరిత వాతావరణం నెలకొన్నది. కాని, స్వామి మాత్రం తమ గంభీరముద్రను వీడలేదు. స్వామియొక్క గాంభీర్యాన్ని చూసి అందరూ సర్దుకుని కూర్చున్నారు. స్వామి యిచ్చిన ఈ క్రింది వివరణతో వాతావరణమంతా పూర్తిగా అలౌకికంగా మారిపోయింది.

"సర్వమునకు 'నేను' ఆధారము. ఈ 'నేను'ను అది, ఇది అని వ్యవహరించడం ద్వైత భావముతో కూడినది. 'నేను నేనే' అని చెప్పడం అద్వైతము లేక ఏకత్వభావన. ఇదే పరమ సత్యము. ఈ 'నేను' అనే తత్త్వమే భగవంతుడు, ఆత్మ, పరమాత్మ, బ్రహ్మ, రామ, కృష్ణ, అల్లా, యెహోవా అనే వివిధ నామములతో వ్యవహరింపబడుతున్నది".


"అవతార తత్త్వము మర్మగర్భమైనది మరియు నిగూఢమైనది. దీని



"కొడైకెనాల్‌లోని 'సాయిశ్రుతి' మందిరము ముందు భగవాన్ బాబా"



"కొడైకెనాల్‌లో భగవాన్ బాబాతో విద్యార్థులు"



"నా నిజతత్త్వమును మీరు తెలియలేరు"

రహస్యమును ఎవరూ ఛేదించలేరు. అవతార పురుషుడెప్పుడూ మానవాళికి ఒక చిక్కుప్రశ్నగానే మిగిలి ఉంటాడు. ఇప్పుడు గాని లేదా భవిష్యత్తులో గాని మానవాళి అంతా ఏకమై వేలకొలది సంవత్సరాలు తపస్సు చేసినా, అన్వేషించినాగాని నా నిజతత్త్వమును మీరు గ్రహించలేరు" అని భగవాన్ ఒక సందర్భంలో ప్రకటించారు.

"అవతార మూర్తి తన, భూత, భవిష్యత్తులతో పాటు సకల జీవరాసుల భూత, భవిష్యద్వర్తమాన జీవితముల ఎఱుకను కలిగి యుంటారు. అయితే, మానవునికి తన భూత, భవిష్యజ్జీవితములను గురించే తెలియదు. చివరకు, తన వర్తమాన జీవితములో ముందు జరగబోయేదేమిటో కూడా అతనికి తెలియదు. అటువంటిది, మానవుడు అవతార తత్త్వమును ఏవిధంగా అర్థం చేసుకోగలడు?

నేను ఎటువంటి తీవ్ర అన్వేషణలకూ అతీతుడను. ఎట్టి కొలమానములకు అందనివాడను. నా దివ్య ప్రేమ తత్త్వమును గుర్తించి, ఏ కొద్దిగానైనా ఆ ప్రేమను అనుభవించినవారు మాత్రమే నా దివ్య తత్త్వమును అణుమాత్రంగానైనా తెలుసుకునే అవకాశమున్నది".

భగవద్గీతలో శ్రీ కృష్ణపరమాత్మ ఇటువంటి సత్యమునే వెల్లడి చేశాడు. "దేవగణములు, మహాఋషులు సైతం నా మూలాధార తత్త్వమును గ్రహించలేరు. సమస్త దేవతలకు, ఋషులకు కూడా నేనే ఆధారమును. ఓ అర్జునా! ప్రాణికోటియొక్క భూత భవిష్యద్వర్తమానములన్నీ నాకు తెలుసు. కాని, నన్ను ఎవరూ తెలుసుకోలేరు".

ప్రఖ్యాత హాలీవుడ్ చలన చిత్రరచయిత, నాటక రచయిత అయిన ఆర్నాల్డ్ షూమన్ ఒకసారి భగవాన్ బాబా వారిని 'మీరు భగవంతుడా?' అని సూటిగా ప్రశ్నించాడు. స్వామి ఆ ప్రశ్నకు "ఒక చీమ సముద్రపు లోతును కొలవగలదా? ఒక చేప ఆకాశము యొక్క స్వరూపమును కనుగొనగలదా? నేను భగవంతుడినే. ఇది సగం వరకు మాత్రమే నిజం. నీవు కూడా భగవంతుడివే! ఇది పూర్తి

నిజం!" అని జవాబు చెప్పారు. మరొక సందర్భంలో మరొకరితో "నన్ను గురించి తెలుసుకోవడానికి ప్రయత్నించడం కంటె నీవెవరో తెలుసుకునే ప్రయత్నం చెయ్యి. నిన్ను నీవు తెలుసుకుంటే నన్ను గురించి తెలుసుకోగలవు" అని చెప్పారు.

మన గురించి మనం ఎంతవరకు తెలుసుకోగలిగామో, బాబా తన గురించి తనంతట తాను ఎంత వరకు మనకు ఎఱుక పరచారో అంత పరిధి వరకే మనము బాబాను అర్థం చేసుకోగలము. బాబా తన జీవితంలోని వివిధ దశలలో విభిన్న వ్యక్తులకు విభిన్న పద్ధతులలో తన దివ్యత్వమును గురించి ఎఱుకపరచారు. ఈ విధంగా చేయడానికి గల కారణం కూడా స్వామియే ఒక సందర్భంలో ఇలా వివరించారు:

"అన్ని అవతారముల వలె శ్రీ కృష్ణుడు కూడా తన అవతార తత్త్వమును గురించి చుట్టూవున్న ప్రజలు తాను వెల్లడించే వాస్తవాలను ఎంతవరకు అంగీకరించగల స్థితిలో వున్నారో పరీక్షిస్తూ మెట్టు మెట్టుగా, కొద్ది కొద్దిగా, క్రమ క్రమంగా తెలియజేస్తూ వచ్చాడు. ప్రస్తుత అవతారములో కూడా ఇదే జరుగుతున్నది. ఆనాడే కాదు, ఈనాడు కూడా దివ్యత్వ చిహ్నములు, లీలలు, మహిమలు అవతార పురుషుల దివ్యతత్త్వమును జన బాహుళ్యమునకు తెలియజేసే నిమిత్తమే. ఈ సాయిబాబా ఎవరో మరొక సాయిబాబా మాత్రమే సమగ్రంగా తెలుసుకొనగలరు". అంతే కాదు, స్వామి ఈ సందర్భంగా "నా గురించి నేను చెప్పకపోతే మరెవరు చెప్పగలరు?" అని కూడా ప్రశ్నించారు.

తన అవతారోద్యమ వ్యాప్తికి అవసరం అని భావించినప్పుడల్లా మానవాళిపై అపారమైన కరుణతో స్వామి తనను గురించి తాను ఎన్నోసార్లు తెలియజెప్పడం జరిగింది. భక్తులపట్ల ప్రేమాతిశయము చేత స్వామి తనను గురించి తాను అనేక సత్యములను వెల్లడించినప్పుడు, భక్తులు అపారమైన ఆనందాబ్ధిలో ఓలలాడేవారు.

భగవాన్ బాబావారు స్వయంగా ప్రకటించినట్లుగా స్వతస్సిద్ధమైన దివ్యశక్తులు, ప్రజ్ఞానము కలిగివున్నప్పటికి, తాను వెల్లడించే సత్యాలను ప్రజలు అర్థం చేసుకుని ఆమోదించగల స్థితికి చేరుకునేటట్లు వారిని సిద్ధపరచిన తరువాతనే స్వామి క్రమక్రమంగా అంచెలంచెలుగా తన దివ్యత్వమును బహిర్గతం చేసేవారు. ఈ పద్ధతి ఈనాటికీ కొనసాగుతూనే ఉంది.

1968వ సంవత్సరం జూన్ మాసంలో బాబా బొంబాయిలో వున్న సమయంలో 'నవకాల్' అనే గుజరాతీ పత్రికా సంపాదకుడు తన మహిమలను గురించి అడిగిన కొన్ని ప్రశ్నలకు స్వామి ఎంతో దయతో ఈ విధంగా సమాధానమిచ్చారు :

ప్రశ్న : మీరు ఈ దివ్య శక్తులను ఎప్పటినుండి ప్రకటిస్తూన్నారు?

స్వామి : నా బాల్యం నుండి, బడిలో నా చుట్టూ చేరిన పిల్లలకు నేను చాక్లెట్లు, గోళీలు, యింకా కొన్ని వస్తువులను సృష్టించి యిచ్చేవాడిని.

ప్రశ్న : బాబా! ఏ వయస్సులో మీకు ఈ శక్తి సంక్రమించింది?

స్వామి : నా పుట్టుక నుండి.... (అని చెపుతూ కొన్ని క్షణాలు ఆగి మళ్ళీ) అంతకు పూర్వము నుండి.....

ప్రశ్న : అంటే మీరు చెప్పేది..... (అంటూ అర్ధోక్తిలో ఆగిపోయాడు; ఆశ్చర్య చకితుడైనాడు.)

స్వామి : అంటే నేను చెప్పేది..... నా జన్మను నేనే సంకల్పించుకున్నాను. సామాన్య మానవులు తమకు కాబోయే భార్యను గాని, భర్తనుగాని ఎంచుకోగలరు. రామ, కృష్ణ అవతారములలో కుమారుడే తన తల్లిని నిర్ణయించుకోవడం జరిగింది. ఆ అవతారముల ఆవిర్భావము కూడా సర్వులపై ప్రేమను వర్షించడానికి, ఆ ప్రేమద్వారా ధార్మిక జీవనమును పెంపొందించడానికి.

విద్యార్థిగా – బాల్యంలో సత్యం తన తోటి విద్యార్థులకు అసంఖ్యాకంగా మిఠాయిలు, పెన్నులు, ఇతర వస్తువులు తన సంచీ నుండి తీసి పంచిపెడుతూంటే వాళ్ళు సహజంగానే ఆశ్చర్యంలో మునిగిపోయేవారు. వాటిలో చాలా వస్తువులు ఆ ప్రాంతంలో ఎక్కడా లభ్యమయ్యేవి కావు. "నీకు యివన్నీ ఎక్కడినుండి వస్తున్నాయి?" అని వారు అడిగినప్పుడు "నా అధీనంలో ఒక గ్రామదేవత ఉన్నది. ఆవిడ నేను ఏది కోరితే వాటిని యిస్తుంది" అని చాలా సహజమైన రీతిలో జవాబిచ్చేవాడు. ఆ జవాబుతో వారు తృప్తిపడేవారు. అనాడు ఆవిధంగా వారు అర్థం చేసుకుని అంగీకరించే రీతిలోనే వారికి సమాధానం చెప్పేవాడినని తరువాత ఒక సందర్భంలో స్వామి వెల్లడించారు. కేవలము తిండి తీర్థాదులు, భౌతిక సుఖాలలోనే తమ జీవితాలకు క్షేమము, భద్రత ఇమిడి యున్నవనే అజ్ఞానములో మునిగి దయనీయ స్థితిలో ఉంటూ నిగూఢము, అత్యంత వైభవోపేతము, ఉన్నతము మరియు శాశ్వతము అయిన అమృతత్వ స్థితి అంటూ ఒకటి ఉన్నదనే ఎరుకయే లేని సమకాలీన జనాన్ని నునులేత వయస్సులో నున్న ఈ అవతారమూర్తి విశేష శ్రమకోర్చి తమ దివ్యతత్త్వము మరియు అవతార కార్యక్రమమును గురించి తాను చేసే సత్య ప్రకటనలను స్వీకరించగల మానసిక స్థాయికి ఎదిగేటట్లు తీర్చిదిద్దారు. వ్యధాభరితమైన ప్రాపంచిక మనుగడనే పట్టుకుని వ్రేలాడుతున్న మానవుని తన నిజతత్త్వమును గుర్తించే ఉన్నత స్థాయికి చేర్చడానికి ఆ సత్యసాయి ప్రభువు ఎంతటి ఓర్పును ప్రదర్శిస్తున్నారో, హృదయ వేదనను అనుభవిస్తున్నారో మనం ఊహించుకోవలసిందే! అయితే, 'ఇంతటి శ్రమను, వేదనను స్వామి ఎందుకు అనుభవిస్తున్నారు' అని ప్రశ్నించుకుంటే, అది స్వామి తనంతట తాను మానవజాతి ఉద్ధరణ కొరకు చేపట్టిన అవతార కార్యక్రమం కావడం వలననే! ఈ విషయాన్ని గురించి భగవాన్ బాబావారు ఒకసారి "నేను నటరాజును. ప్రప్రథమ నాట్యాచార్యుడను. ఆ విశ్వ నృత్యములో మీకు ఒక్కొక్క అడుగును నేర్పడంలో నేను పడే శ్రమ, ఆవేదన నా కొక్కనికే తెలుసు", అని ఉద్ఘాటించారు.


పెద్దలు, పిన్నలు అనే తారతమ్యం లేక ప్రతి ఒక్కరికి ధార్మిక జీవన ఆవశ్యకతను గురించి నిరంతరాయంగా బోధించాలని సత్యం పడే తపన మరియు అత్యున్నత ఆదర్శములను ప్రతిఫలించే అతని జీవన విధానము కేవలం పదేళ్ళ ప్రాయంలోనే స్నేహితులు, పెద్దల నుండి అతనికి 'గురువు', 'బ్రహ్మజ్ఞాని' అనే బిరుదులను సంపాదించిపెట్టాయి. సత్యం ప్రారంభించిన పండరి భజన బృందములోని పిల్లలకు అతడు నేర్పిన పాటలలో కొన్ని ఆ ప్రాంత వాసులకు పూర్తిగా అపరిచితమైన షిరిడీ పుణ్యక్షేత్రము మరియు అక్కడి దేవతామూర్తి 'సాయిబాబా' యొక్క మహిమలకు సంబంధించి ఉండేవి. ఎవరైనా ఈ షిరిడీ క్షేత్రమును గురించి, క్రొత్తగా తాము వింటున్న 'సాయిబాబా' అనే దేవుని గురించి ఏవైనా ప్రశ్నలు అడిగితే సత్యం వారికి ఎంతో ఆసక్తికరమైన కథలు చెప్పేవాడు. ఆ విధంగా రాబోయే మూడు సంవత్సరాలలో తాను 'సాయిబాబా'నని అవతార ప్రకటన చేసేందుకు రంగము సిద్ధము చేసుకున్నాడు.

ఉరవకొండ హైస్కూలులో విద్యాభ్యాసం చేస్తున్న సమయంలో పదమూడు సంవత్సరాల సత్యం తన దివ్యత్వ ప్రకటన ఘట్టమునకు నాంది పలికాడు. ఈ దివ్యత్వ ప్రకటన 1940వ సంవత్సరంలో మార్చి, అక్టోబరు నెలల మధ్య మూడు దశలలో జరిగింది. మార్చి నెల 8వ తేదీ సాయం సంధ్యా సమయం భగవాన్ బాబావారి జీవితంలో ఒక విశేష ప్రాముఖ్యతను సంతరించుకున్న దినము. ఆ రోజున చాలా విషపూరితమైన ఒక నల్ల తేలు సత్యంను కుట్టింది. ఇక, ఇక్కడి నుండి ప్రారంభమవుతుంది అసలు కథ! అయితే, తనను ఏ తేలు కుట్టనేలేదని చాలా సంవత్సరాల తరువాత స్వయంగా భగవాన్ బాబావారే వెల్లడించారు. ఈ సంఘటన జరిగిన కొన్ని నెలల తరువాత తాను చేయబోయే చరిత్రాత్మకమైన ప్రకటనను స్వీకరించడానికి వీలుగా అక్కడి వారి దృష్టిని ఆకర్షించి వారిని సిద్ధము చేసేందుకే తాను ఈ సంఘటనను కల్పించానని స్వామి చెప్పారు. ఈ విషయాన్ని ఆయన మాటలలోనే చెప్పాలంటే "నేను విషానికి, విషయాలకు అతీతుడనని నిరూపించాలనుకున్నాను", అన్నారు.


1940వ సంవత్సరం వేసవిలో 14 ఏండ్ల బాలుడైన సత్యం ఆశ్చర్యకరమైన మనఃస్థైర్యము, ఓరిమితో అత్యంత బాధాకరమైన పరిస్థితులను ఎదుర్కొన్నాడు. సత్యం యొక్క ప్రవర్తనలో కలిగిన అసాధారణ మార్పును చుట్టూ ఉన్న ప్రజలు అపార్థం చేసుకున్నారు. గ్రామ పెద్దలలో కొందరు సత్యం యొక్క విచిత్ర ప్రవర్తనకు, విపరీత ధోరణికి అతనిని ఆవహించిన కొన్ని దుష్టశక్తులే కారణమని భావించారు. లేత వయసులోనున్న తమ కుమారుడు ఈ విచిత్ర పరిస్థితి నుండి బయటపడి తొందరలో కోలుకోవాలనే ఆకాంక్షతో అతని తల్లిదండ్రులు, బంధువుల సలహాననుసరించి అతనికి భూత వైద్యులచే చికిత్స చేయించాలనుకున్నారు. అంతేకాని, అతని ఆప్త బంధువులు కాని, చుట్టూ ఉన్న జనం కాని సత్యం నిజానికి మానవాళిని పట్టి పీడిస్తున్న దుష్టశక్తులను పారద్రోలడానికే ఈ భువిపై అవతరించాడని గ్రహించలేకపోయారు. దెయ్యాలను, భూతాలను పారద్రోలే భూత వైద్యులుగా చెలామణి అవుతున్న ఆ నరరూప రాక్షసుల చేతులలో పదునాలుగేండ్ల బాలుడు సత్యం అనుభవించిన నరకయాతనను తలుచుకుంటేనే ఒళ్ళు గగుర్పొడుస్తుంది. అయితే, సత్యం మాత్రం ఆ బాధలనన్నిటిని ఎటువంటి జంకుగొంకు లేకుండా ధైర్యంగా అనుభవించాడు. తప్పుద్రోవలో నడుస్తున్న మానవజాతియందు అపారమైన దయతో, సానుభూతితో భగవంతుడు చూపే ఓరిమికి ఇది ఒక తార్కాణము.

ఆనాడు తాను ఎదుర్కొన్న అటువంటి కఠిన పరీక్షలను గురించి కొన్ని నెలల తరువాత అప్పటికీ తన దివ్యత్వమునందు నమ్మకం కుదరని చుట్టు ప్రక్కల జనంతో భగవాన్ ఇలా చెప్పారు:

> **"ఒక చిన్న పిల్లవాడు అంతటి దుర్భరమైన, కఠినాతి కఠినమైన భూత వైద్యమునకు గురై అసాధారణమైన ఓర్పు, మనఃస్థైర్యముతో ఆ హింసను భరించి క్షేమముగా బయట పడిన ఆ అద్భుత దృశ్యమును కళ్ళారా చూచి కూడా నేను సాయిబాబానని మీరు నమ్మలేకపోతున్నారు. అటువంటి పరిస్థితులలో**



"నేను సాయిబాబాను"



"సమస్త రూప,నామములు సాయియే"

ఒకానొక శుభదినాన అకస్మాత్తుగా నా దివ్యత్వమును
ప్రకటించి యుండినట్లైతే మీరు ఏ విధంగా ప్రతిస్పందించి
యుండేవారో! నేను సుఖ దుఃఖములకు, మానవ సహజమైన
బాధకు అతీతమైన దివ్యత్వముననే యథార్థమును
మీకు తెలియజెప్పడానికే అలా ప్రవర్తించాను".

మానవాళిని ఇటువంటి దోషములు మరియు దుర్బలత్వము నుండి విముక్తి చేయడానికి అవతరించిన ఏ అవతారమూర్తికైనా ఈ బాధలు తప్పవనే యథార్థమును భగవాన్ బాబా వాక్కులు ఋజువు చేస్తాయి. తమ జ్యేష్ఠ సోదరులు శ్రీ శేషమరాజుకు తేదీ 25-5-1947న వ్రాసిన సుప్రసిద్ధమైన లేఖలో బాబా "సర్వేసర్వత్రా మహాత్ములు, అవతార పురుషులు ఇట్టి బాధలను ఎదుర్కొనక తప్పదు" అని వ్రాశారు. ఇతరుల పాపాలను ప్రక్షాళనం చేయడానికి తాను సమస్త బాధలను మౌనంగా, శాంతంగా, ఆనందంగా అనుభవించడమనేది ప్రపంచంలో ఎక్కడ చూసినా ఏ ప్రవక్తకైనా ఒక ముఖ్య లక్షణం.

1940వ సంవత్సరం మే నెల 23వ తేదీన సత్యం మానవ జాతి అంతా ఎదురుచూస్తున్న ఒక చరిత్రాత్మకమైన ప్రకటన చేశాడు. ఆ రోజున అతడు "నేను సాయిబాబాను, ఆపస్తంబ సూత్రుడను, భారద్వాజసగోత్రుడను" అని ప్రకటించాడు. ఆ తరువాత అదే సంవత్సరం అక్టోబరు 20వ తేదీన బాలబాబా తన అవతార ఆవిర్భావమునకు ఎంచుకున్న రత్నాకర కుటుంబముతో తనకు గల ప్రాపంచిక బంధములనన్నిటిని త్రెంచుకుని బడిని, ఇంటిని వదలిపెట్టి "నేను మీ సత్యమును కాను, సాయిని. నేను వెడుతున్నాను. మీకు, నాకు ఎటువంటి సంబంధము లేదు. మాయ మాయమైనది. నా భక్తులు నన్ను పిలుస్తున్నారు. నా అవతార కార్యక్రమం ప్రారంభించవలసియున్నది" అని అవతార ప్రకటన చేశాడు.

అయితే, "శ్రీ సత్యసాయి కేవలం షిరిడీ సాయిని మాత్రమే తన పూర్వావతారముగా ఎందుకు పేర్కొన్నారు? ఇతర అవతారములను ఎందుకు

పేర్కొనలేదు?" అని ఒక ప్రశ్న కొందరు భక్తుల మనస్సులలో ఉదయించవచ్చు. స్వామి స్వయంగా ఈ ప్రశ్నకు జవాబు చెపుతూ "ఈ అవతారమునకు కొద్ది సంవత్సరాల ముందు ఈ భువిపై సంచరించిన అవతారమూర్తి యొక్క పేరును చెప్పడంలో నా ఉద్దేశ్యం షిరిడీ సాయియే మరల సత్యసాయిగా అవతరించారని తెలియజేయుటకే. ఇంతేకాదు; సాయి అవతారత్రయంలో రాబోయే అవతారం ప్రేమసాయి", అని ఉద్ఘాటించారు.

1962వ సంవత్సరంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి 37వ జన్మదినోత్సవం నాడు అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రణాళికా శాఖ మంత్రి డా॥ ఎం. చెన్నారెడ్డి పుట్టపర్తిలో భగవాన్ బాబావారు గ్రామానికి అనుగ్రహించిన ప్రాథమిక పాఠశాల భవనమునకు ప్రారంభోత్సవం చేస్తూ సభికుల నుద్దేశించి "నేను ఇటీవలనే షిరిడీ వెళ్ళాను. షిరిడీ యాత్ర చేసిన కొద్ది రోజులకే పుట్టపర్తి రాగలగడం నా అదృష్టముగా భావిస్తున్నాను. ఎందుకంటే, షిరిడీ సాయియే సత్యసాయిగా అవతరించారు కదా!", అని చెప్పారు. తరువాత భగవాన్ బాబా తమ దివ్యోపన్యాసంలో డా॥ చెన్నారెడ్డి మరియు సభికుల నుద్దేశించి "షిర్డీసాయి, సత్యసాయి – ఈ రెండే కాదు, అన్ని నామములు నాకు చెందినవే! ఆనాటి అవతార మూర్తిని షిరిడీసాయి అని, ప్రస్తుత అవతారమును సత్యసాయి అని వ్యవహరించడం కేవలం ఆయా అవతార మూర్తులను గుర్తించే ఒక పద్ధతి మాత్రమే. నాడు, నేడు కూడ సమస్త రూపములు, నామములు సాయికి చెందినవే", అని వివరించారు. ఈ వివరణ అవతారతత్త్వముయొక్క విశ్వజనీనతను మనకు తెలియజేస్తుంది. అంతేకాకుండా, భగవాన్ బాబావారు అనేక సందర్భాలలో తన అవతారతత్త్వమునకు సంబంధించిన ఈ పరమ సత్యమును నిరూపించే ఎన్నియో చిహ్నములను బహిర్గతం చేశారు. శ్రీ మహా విష్ణువు యొక్క దశావతారములతో సహా, భక్తుల కోరిక ననుసరించి వారి వారి ఇష్టదైవముల రూపములలో భగవాన్ బాబావారు ఎన్నో సందర్భాలలో భక్తులకు దర్శన మిచ్చినట్లు ఇంతకు పూర్వము కీ॥శే॥ శ్రీ కస్తూరి రచించిన "సత్యం శివం సుందరం" నాలుగు భాగములలో పేర్కొనబడింది.

భగవాన్ బాబా 20-10-1940వ తేదీన తన అవతార ప్రకటన చేసిన తరువాత, భక్తులకు మర్రొక విషయం కూడా చెప్పారు: "భగవంతుడు ఎక్కడుంటాడని నిజమైన సాధకులు ఎవరైనా ప్రశ్నించినప్పుడు వెంటనే తడుముకోకుండా మీ అంతరంగపు లోతులనుండి పుట్టపర్తిలో ఉన్నాడనే సమాధానం చెప్పండి. మీతోపాటు అక్కడికి వచ్చి ఆనందము ననుభవించమని చెప్పండి". నిత్య శంకితులైన సంశయాత్ముల సందేహ నివృత్తికై అపారమైన కరుణతో భగవాన్ బాబా తన దివ్యతత్త్వము మరియు అవతార కార్యక్రమములను గురించి విసుగు, విరామం లేకుండా ఎన్నోమార్లు స్పష్టంగా ప్రకటించారు. తాను బహిరంగముగా ఉపన్యాసములు ఇవ్వడం ప్రారంభించకముందే "నా అంతట నేనుగా నేను యీ ప్రపంచములోనికి రాలేదు. అన్ని దేశములు, మతములలోని సాధు పురుషులు, పావన పురుషులు, ఋషులు, మహర్షులు, సత్పురుషులు, మహనీయుల ప్రార్థనలను మన్నించి నేను అవతరించాను", అని భగవాన్ బాబా ఒక సందర్భంలో చెప్పారు. ఇంకా దైవము మానుష రూపములో అవతరించుటలో గల పరమార్థమును వివరిస్తూ "నేను శంఖు చక్ర గదాధరుడనై కమలహస్తుడనై చతుర్భుజములతో నారాయణునిగా మీ మధ్యన అవతరించినట్లయితే, బహుశా మీరు నన్ను ఏదైనా ఒక మ్యూజియంలో పెట్టి నాదర్శనం కోసం వచ్చేవారినుండి కొంత పైకం వసూలు చేసేవారు. అలా కాకుండా, కేవలం మానవ మాత్రునిగా మీ మధ్యకు వచ్చినట్లయితే నా బోధలకు విలువ నివ్వకుండా వాటిని మీ స్వలాభముకొరకు వినియోగించుకొనేవారు. అందువలన మానవ రూపములో మానవాతీతమైన జ్ఞానంతో, శక్తులతో మీ మధ్య అవతరించవలసి వచ్చింది", అని వెల్లడించారు.

1955వ సంవత్సరంలో మహాశివరాత్రి పర్వదినంనాడు భగవాన్ "సాయికి ఎటువంటి జప, తప, ధ్యాన, యోగములు అవసరం లేదు. పూజ, పురస్కారములు, ప్రార్థనలు చేయనక్కరలేదు. ఎందువల్లనంటే, సాయియే స్వయంగా మహోన్నత అవతారమూర్తి. మీరంతా ప్రార్థనలు, పూజలు ఏ విధంగా చేయాలో బోధించడమే ఆయన అవతార కార్యక్రమం. ఇది

బోధనావతారము. ఈ అవతారములో దుష్టులు, దుర్మార్గులను నిర్మూలించడం జరుగదు. సన్మార్గమును వీడి చరించే వారిని సరిదిద్ది, సంస్కరించి, వారికి ఉత్తమ విలువలు బోధించి మరల వారిని సన్మార్గములోనికి మళ్ళించడమే ఈ అవతార లక్ష్యము. చెదలు పట్టిన వృక్షమును నరికివేయడం కాక, చెదపురుగులను తొలగించి అట్టి వృక్షమును జాగ్రత్తతో సంరక్షించడమే నా పని", అని ఉద్ఘాటించారు.

1958వ సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీనాడు చిత్రావతీ నదీగర్భమునందు సమావేశమైన కొందరు భక్తుల నుద్దేశించి మాట్లాడుతూ "నా నిజతత్త్వము, మహిమలు వర్ణనాతీతములు. శాస్త్రాధ్యయనము చేసి భగవంతుని అవతార లక్షణముల గురించిన పరిజ్ఞానము సంపాదించగలిగితే, నా నిజతత్త్వమును మీరు కొంతవరకు గ్రహించగలరు", అని స్వామి వెల్లడించారు.

మరొక సందర్భంలో తేదీ 21-10-1961న ప్రశాంతి నిలయంలో దివ్యోపన్యాసము చేస్తూ "రామకృష్ణాద్యవతారములు, సాయిబాబా మీకు వేరువేరుగా కనపడవచ్చు. దీనికి కారణం, ఆయా అవతారములు తమ దివ్య సంకల్పముచేత ధరించి వచ్చిన ఉపాధులు వేరు వేరుగా ఉండడమే! అయితే, ఈ అన్ని అవతారములలోని దివ్యతత్త్వము ఒక్కటే. ఇప్పుడు నేను వెల్లడిస్తున్న సత్యమును దృఢముగా విశ్వసించండి. ఎటువంటి అవిశ్వాసమునకు, పొరపాటుకు చోటివ్వకండి. ఈ ప్రశాంతి నిలయమును సందర్శించ వచ్చే భక్తజన సందోహమునకు ఆశ్రయం కల్పించడానికి ఎంతటి విశాలమైన భవనమైనా సరిపోని రోజు తొందరలోనే వస్తుంది. భవిష్యత్తులో స్వామిని దర్శించవచ్చే భక్తులకు ఆకాశమే పైకప్పుగా ఉండే సభా ప్రాంగణము అవసరమవుతుంది".

"ఈ పుట్టపర్తి గ్రామమే మధురా నగరంగా మారడం మీరు చూస్తారు. ఈ అభివృద్ధిని ఎవరూ ఆపలేరు. ఈ పరిణామమునకు ఎవరూ అడ్డుకట్ట

వెయ్యలేరు. నేను మిమ్మల్ని వదలను; మీరు కూడా నన్ను విడిచిపెట్టి పోలేరు. ప్రేమయే నా ప్రాణశక్తి. నేను దయానిధిని. నన్ను, నా నిజతత్త్వమును సరిగా అర్థం చేసుకోండి. మీ జీవితాలు ఈ భువిపై నా అవతార కార్యక్రమంతో ముడిపడి ఉన్నాయి. ఈ మహదవకాశమునకు అనుగుణంగా మీ జీవితాలను తీర్చిదిద్దుకోండి", అని స్వామి ఉద్ఘాటించారు. మరొక సందర్భంలో 24-11-1961వ తేదీన భగవాన్ బాబా "మానవ జీవన ప్రవంతి దారి తప్పి వ్యర్థంగా ఇసుక నేలలోనికి ప్రవహిస్తున్నప్పుడు అవతార పురుషుడు దిగివచ్చి తన దివ్యబోధల ద్వారా వారిని హెచ్చరించి దిశా నిర్దేశం చేస్తాడు. ఇదే అవతార కార్యక్రమం", అని వివరించారు.

"నా దివ్యత్వమును ముందుగా మీకు నిరూపించి, ఆ తరువాత మాత్రమే మిమ్మల్ని సరిదిద్దే ప్రయత్నం చేస్తాను. అందువలననే అప్పుడప్పుడు నా నిజతత్త్వమును మీకు ఎఱుకపరచి అందుకు తగినట్లుగా నా దివ్య శక్తికి చిహ్నములైన, మీ పరిభాషలో 'లీలలు, మహిమల' ను చూపిస్తూంటాను. నా దివ్య శక్తులను ప్రదర్శించాలనే కోరిక నాకు ఎంత మాత్రము లేదు. మిమ్మల్ని నా వైపు ఆకర్షించి మీ హృదయాలను నా యందు లగ్నమయ్యేటట్లు చెయ్యడమే వీటి పరమార్థం" అని కూడా స్వామి తెలియజేశారు.

1962వ సం॥ ఏప్రిల్ నెల 28వ తేదీన భగవాన్ ప్రశాంతి నిలయములోని ఆశ్రమవాసుల నుద్దేశించి ప్రసంగిస్తూ "భగవంతుని అవతారమును ప్రత్యక్షముగా దర్శించి, భగవత్తత్త్వమును అనుభవించి, మీ జీవితాలను ధన్యము చేసుకునే మహత్తరమైన అవకాశము మీకు లభించింది. ఈ అదృష్టము మీకు జన్మజన్మల పుణ్యఫలము వలన సంప్రాప్తించింది. ఇటువంటి సుకృతము కొరకు మహర్షులు, దేవతలు కూడా ఎంతగానో ప్రార్థించారు. ఇంతటి అదృష్టము మీకు సంప్రాప్తించినందుకు భగవత్తత్త్వములోని మాధుర్యమును చవిచూసి, సాయుజ్యమనే మహదానందమును పొందడానికి తీవ్ర కృషి చేయండి. అదే మీ జన్మలకు సార్థకత", అని ఉద్బోధించారు. ఇంకా "నా నుండి వెలువడే దివ్య కాంతి కిరణాలు మూడు విధములుగా ఉంటాయి – ఒకటి, ప్రశాంతి

నిలయమంతా ఆవరించియుండే స్థూల కిరణాలు; రెండు, సమస్త భూమండలమందు వ్యాపించియుండే సూక్ష్మకిరణాలు; మూడు, విశ్వవ్యాప్తమైన కారణ కిరణాలు. ఈ స్థూల కిరణాలు మానవుని సాధకునిగా మారుస్తాయి. సూక్ష్మకిరణాలు అతనిని మహాత్మునిగా తీర్చిదిద్దుతాయి. ఇక కారణ కిరణాలు మానవుడు పరమహంసగా పరిణామం చెందేటట్లు చేస్తాయి", అని స్వామి వెల్లడించారు.

1963వ సంవత్సరం జులై నెల 6వ తేదీన గురుపూర్ణిమ పర్వదినం నాడు స్వామి మెదడులో రక్తము గడ్డ కట్టడం (సెరిబ్రల్ థ్రాంబోసిస్) అనే ఒక ప్రాణాంతక వ్యాధినుండి అత్యద్భుత రీతిలో కోలుకోవడం జరిగింది. ఈ వ్యాధి స్వామికి వచ్చినది కాదు. భక్తవత్సలుడు ఒక నిస్సహాయ స్థితిలో నున్న భక్తుని రక్షించడానికి తనకు తానుగా స్వీకరించిన వ్యాధి. నిస్సహాయుడు, అత్యంత ప్రీతిపాత్రుడు ఐన ఒక భక్తునియందు అపారమైన ప్రేమతో, కరుణతో స్వామి ఆ భక్తుని వ్యాధిని తాను స్వీకరించి ఎనిమిది రోజుల పాటు తన గదినుండి బయటకు రాలేని స్థితిలో బాధననుభవించారు. చివరకు తొమ్మిదవ రోజున తనంతట తానే తాను స్వీకరించిన ఆ వ్యాధిని నయం చేసుకుని భక్తులకు దివ్యోపన్యాసము ఇచ్చారు. ఆ సందర్భంగా స్వామి భక్తుల నుద్దేశించి "నేను శివశక్తి స్వరూపుడను. భరద్వాజ మహర్షికి ఆనాడు ప్రసాదించిన వరమును పురస్కరించుకుని నేను యీ శివశక్తి స్వరూపముతో అవతరించాను. గతంలో షిరిడీలో భరద్వాజ గోత్రమున శివస్వరూపముగాను, నేడు అదే గోత్రమున పుట్టపర్తిలో శివశక్తి స్వరూపముగాను అవతరించాను. తిరిగి మూడవసారి ఆ భరద్వాజ గోత్రమునందే శక్తి స్వరూపమైన ప్రేమసాయిగా మైసూరు (నేటి కర్ణాటక) రాష్ట్రము నందు అవతరిస్తాను", అని వెల్లడించారు.

1964వ సంవత్సరములో జన్మదిన సందర్భముగా దివ్యోపన్యాసం చేస్తూ ప్రారంభంలో ఆశువుగా తెలుగులో ఈ పద్యం చెప్పారు :

ఏ గుణంబు గణించి యేతెంచెనో నాడు
ప్రహ్లాదు పాలింప పరమ పురుషు

డే గుణంబు గణించి యేతెంచెనో నాడు
కరిని గాచెడి తరి కమలనయను
డే గుణంబు గణించి యేతెంచెనో నాడు
పేద కుచేలుని బ్రోవ వేదచరితు
డే గుణంబు గణించి యేతెంచెనో నాడు
బలి చక్రవర్తి కావంగనోర్చి
ఆ గుణంబె గణించి అమరవంద్యు
దార్త జనులను పాలించ నవతరించె
అనాథ నాథ శ్రీనాథ లోకనాథ
సచ్చిదానంద మూర్తి పుట్టపర్తి సత్యసాయి

శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రథమ ప్రపంచ సమ్మేళనములో పాల్గొన్న ప్రతినిధుల నుద్దేశించి భగవాన్ తేదీ 17-5-1968న చేసిన దివ్యోపన్యాసము చాలా విశిష్టమైనది. దేవభాషయైన సంస్కృతములో స్వామి తమ ఉపన్యాసమును ప్రారంభించారు. స్వామి ఉపన్యాసమును సాధారణంగా ఆంగ్లములోనికి అనువాదము చేసే శ్రీ కస్తూరితో సహా అందరూ ఆశ్చర్యంతో నిశ్చేష్టులయ్యారు. స్వామి తిరిగి తెలుగులో మాట్లాడడం ప్రారంభించేదాకా అందరూ అలాగే ఉండిపోయారు. యుగావతారి అయిన సాయి తనను గురించి భక్తులకు తెలియని ఎన్నో విషయాలను అనర్గళంగా వెల్లడిస్తూంటే ప్రపంచం నలుమూలలనుండి వచ్చిన ప్రతినిధులు భావాతీతమైన ఆత్మానందములో మునిగిపోయారు. ఆనాటి స్వామి దివ్యోపన్యాసములోని కొన్ని ముఖ్యాంశములను ఇక్కడ పొందుపరుస్తున్నాను :

"నా గురించి ఎటువంటి ప్రచారము అవసరం లేదు. నా పేరు ప్రఖ్యాతులు ప్రచారము చేయబడాలని నేను కోరుకోవడం లేదు. నేను ఏదో ఒక క్రొత్త ఆరాధనా విధానమును నెలకొల్పడానికి అవతరించలేదు. సృష్ట్యాది నుండి మానవుడు ఏయే రూప, నామములతో భగవంతుని ఆరాధిస్తూ వచ్చాడో ఆ రూపనామములన్నీ ఈ సాయి స్వరూపములో నిక్షిప్తమైయున్నాయని గ్రహించండి.

ఆ కారణం చేతనే రామ, కృష్ణ, ఈశ్వర, సాయి మొదలగు అనంత రూప నామముల మధ్య ఎట్టి భేద భావము కలిగియుండవలసిన అవసరం లేదని నేను మీకు బోధిస్తున్నాను. సర్వరూపములు; సర్వ నామములు నాకు చెందినవే! నాయందున్న సమత్వము, శాంతి, ప్రేమ, సహనము, ఆనందము మొదలగు దివ్య లక్షణములను మీరు అలవరచుకొనకపోయినట్లయితే నా రూప నామములను ఆరాధించి ఏమి ప్రయోజనం?"

"అనేకమంది భక్తులు, సమాజములోని వివిధ వర్గాలకు చెందిన ప్రజలు ఈనాడు ఈ సమావేశములో పాల్గొన్నారు. ఇక్కడ చేరిన భక్తులలో నూటికి తొంభై తొమ్మిది మందికి నా నిజతత్త్వమేమిటో తెలియదు. నా నిజతత్త్వమును గ్రహించుట మీకు అసాధ్యమైన పని కనుక, నా గురించి నేనే తెలుపవలసిన అవసరం ఏర్పడింది. నా నిజతత్త్వమును మీరు గ్రహించలేకపోయినప్పటికి పవిత్రమైన యీ నామరూపోపాధిని ధరించిన దివ్యతత్త్వము అందించే ఆనందమును మీరు అందుకొనగలరు. మీరు పొందిన ఈ అదృష్టము సాధు సత్పురుషులు, సన్యాసులు, ఋషులు, మహర్షులు, చివరకు దేవతలకు కూడా లభ్యము కానిది".

"మీరు చూస్తున్న ఈ మానవరూపములో ప్రతి ఒక్క దివ్యరూపము, ప్రతి ఒక్క దివ్యతత్త్వము అంటే మానవుడు భగవంతునికి ఆపాదించే సమస్త రూప, నామములు ఇమిడియున్నాయి. ఈ నా స్వరూపము సర్వదేవతా స్వరూపము. దీనిని గురించి మీకు ఎటువంటి సంశయము ఉండవలసిన అవసరం లేదు. నా దివ్యత్వము పట్ల మీరు హృదయ పీఠము నందు విశ్వాసమును ప్రతిష్ఠించుకున్నప్పుడే నా దివ్యత్వము మీకు గోచరమవుతుంది. అలాకాక, మీరు గడియారములో పెండ్యులం వలె విశ్వాసము, అవిశ్వాసముల మధ్య ఊగిసలాడుతూంటే మీరెన్నటికి నా నిజతత్త్వమును గ్రహించలేరు. ఆనందము ననుభవించలేరు. సర్వదేవతా స్వరూపమైన ఈ సాయి సన్నిధిలో మీరు ఈ జన్మలోనే దివ్యానందమును అనుభవించగలగడం ఎంతటి అదృష్టమో మీకు తెలియదు".

"ఈ సత్యసాయి అవతారమును గురించి మీరు ఒక్కక్షణం ఆలోచించండి. పెచ్చు పెరిగిన భౌతికవాదము, కయ్యానికి కాలుదువ్వే అవిశ్వాసము మరియు నాస్తికత ప్రబలిపోయిన 'కలహయుగ'మైన ఈ కలియుగంలో ప్రపంచమంతటినుండి అసంఖ్యాకంగా లక్షలాదిమంది భక్తులను ఆరాధనా భావంతో స్వామి సన్నిధికి చేర్చే దివ్యశక్తి ఏమిటి? దీనికి మూలకారణం భగవంతుడు మానవరూపములో అవతరించి ప్రత్యక్షంగా మీ ముందు నిలవడమేనని మీరు తప్పక గ్రహించగలరు".

"ఈనాడు ప్రపంచమంతా భారతదేశమునకు అభివాదం చెయ్యడం; శ్రీ సత్యసాయి మీ ముందే, మీతోనే, మీ మధ్యనే నడయాడుతూన్నప్పుడే ఆయన దివ్యనామము ప్రపంచము నలుమూలలా, వాడవాడలా దిక్కులు పిక్కటిల్లేటట్లు ఆరాధనా భావంతో కీర్తింపబడడం ప్రత్యక్షంగా చూస్తున్న మీరు ఎంతటి అదృష్టవంతులు!"

తన 55వ జన్మదినోత్సవ సందర్భంగా భగవాన్ బాబా ఇలా ఉద్ఘాటించారు:

చావు పుట్టుక లేనట్టి శాశ్వతుండు
ఆది మధ్యాంత రహితుడనాదివాడు
తాను చావక పుట్టక చంపబడక
అంతటను సర్వసాక్షియై వెలుగుచుండు

మరొకసారి దివ్యోపన్యాసం చేస్తూ స్వామి తన నిజతత్త్వమును తెలిపే యీ సంస్కృత శ్లోకమును చదివారు :

నాహం మనుష్యో నచ దేవయక్షః
న బ్రాహ్మణ క్షత్రియ వైశ్య శూద్రః
న బ్రహ్మచారీ గృహీ వనస్థః
అహం సత్య బోధకః
సత్యం శివం సుందరమ్

దీని అర్థము "నేను మానవుడను కాను; దేవ, యక్ష, గంధర్వులలో చేరినవాడను కాను. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర సంజాతుడను కాను. నేను బ్రహ్మచారిని కాను, గృహస్థుడను కాను, వానప్రస్థుడను కూడా కాను. నేను సత్య బోధకుడను. సత్య శివ సుందర స్వరూపుడను".

మరొక సందర్భములో కొందరు పార్లమెంటు సభ్యులు ప్రశాంతి నిలయంలో బాబావారిని కలుసుకుని "మీ గురించి మాకు కొంచెం తెలియజెప్పండి" అని అడిగినప్పుడు స్వామి ఈ విధంగా చెప్పారు:

నేను పురుషులలో పురుషుడను; స్త్రీల మధ్య ఉన్నప్పుడు స్త్రీని;
పిల్లల మధ్య ఒక బిడ్డను; ఏకాంతముగా ఉన్నప్పుడు పరబ్రహ్మను.

ఈ ఉద్ఘాటన వలన భగవాన్ బాబా వయస్సు, లింగ భేదము, భాష, మతము లేక జాతికి అతీతంగా ప్రతి ఒక్కరితోను అత్యంత సన్నిహిత సంబంధము నెలకొల్పుకొనగలరని మనకు స్పష్టమవుతుంది.

'మానవుడు దివ్యత్వస్థాయికి చేరుకునేందుకు దోహదం చేసేందుకే భగవంతుని అవతరణ', అని ఒక సూక్తి ఉన్నది. జీవ, బ్రహ్మల అభేదత్వమును నిరూపించుటయే అవతార లక్ష్యము. "మీకు, నాకు మధ్య దూరం ఉన్నదని భావించకండి. మన మధ్య గురుశిష్య సంప్రదాయాలను, సంబంధమును ప్రవేశపెట్టకండి. నేను గురువునూ కాను; భగవంతుడనూ కాను. నేనే మీరు, మీరే నేను. అదే సత్యము. మీరు మీ లక్ష్యమైన ఆత్మసాక్షాత్కారమును పొందిన తరువాత ఈ సత్యమును గుర్తిస్తారు. నేను సాగరమును, మీరు అలలు", అని స్వామి ఒకసారి ప్రకటించారు.

భగవాన్ బాబా తన నిజతత్వమును గురించి ఎన్నిసార్లు ప్రకటించినా, ఎంతగా వెల్లడించినా, అవతారతత్వము మానవునికి అగమ్యగోచరంగాను, మర్మగర్భంగాను ఉంటుంది. అవతార మూర్తి సముద్రమైతే, మానవుడు అందులో ఒక అలవంటివాడు. అల సముద్రము యొక్క ఉనికిని ఏ విధంగా తెలుసుకోగలదు? సముద్రముతో తనకు గల ఏకత్వమును అవగాహన

చేసుకున్నప్పుడే! ఆ విధంగా ఏకత్వ భావనను పెంపొందించుకోవాలంటే అల తాను సముద్రము కంటె భిన్నమైనదనే భేద భావమును, అహంకారమును తొలగించుకోవాలి.

ఇది, అటువంటి అజ్ఞానములో మునిగిన ఒక అల యొక్క గాథ. ఆ అల అజ్ఞానముతో సముద్రము కొరకు వెదకుతున్నది! అజ్ఞాని అయిన మానవునికి మరియు దయాసాగరుడైన అవతారమూర్తికి మధ్య నడచిన యీ కథ అవతార పురుషుని నిగూఢతత్వము మరియు ఆయనను ఆవరించియున్న యోగ మాయను గురించి వివరిస్తుంది.

భగవానుని సంకల్పము ననుసరించి తేదీ 7-8-1983 నా జీవితములో ఒక నూతనాధ్యాయము ప్రారంభము కానున్న రోజు. ఆ రోజున నేను ముద్దెనహళ్ళిలోని శ్రీ సత్యసాయి గ్రామం వదలి ప్రశాంతి నిలయములోని శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ మరియు శ్రీ సత్యసాయి హయ్యర్ సెకండరీ స్కూలులో చదివే విద్యార్థులు నివసించే హాస్టల్‌కు వార్డెన్‌గా సేవ చేయడానికి వచ్చాను.

ఆ రోజు రాత్రి 9 గంటల ప్రాంతంలో నాకు ప్రశాంతి నిలయంలోని మందిరం దగ్గరకు వెళ్ళాలనిపించింది. ఆ సమయంలో అక్కడ గాఢ నిశ్శబ్దము, ప్రశాంతత నెలకొని ఉన్నాయి. నేను వెళ్ళి మందిరమునకు అభిముఖంగా ఉన్న దశావతారముల గేటుకు ఎడమవైపు స్తంభమునకు ఆనుకుని కూర్చున్నాను. ఇంతలో హఠాత్తుగా 18 సంవత్సరముల క్రిందట నేను విద్యార్థిగా ఉన్నప్పుడు అదే సమయంలో, అదే ప్రదేశంలో కూర్చున్నప్పుడు జరిగిన ఒక ముఖ్యమైన సంఘటన నా స్మృతి పథంలో మెదిలింది. నా వయస్సు అప్పుడు సుమారు 20 సంవత్సరములు. నేనక్కడ కూర్చుని కన్నీరు ధారాపాతంగా వర్షిస్తూండగా నాకు తమ దివ్యచరణారవిందముల వద్ద కృపాశ్రయము కల్పించుమని శ్రీ సత్యసాయి భగవానుని ఆర్తితో ప్రార్థిస్తున్నాను. ఇంతలో కొన్ని నిమిషాల తరువాత తెల్లని కుర్తా, ధోవతి ధరించి నెరిసిన తలచుట్టూ తలపాగా చుట్టుకొని

వున్న ఒక వృద్ధుడు నా సమీపమునకు వచ్చి నిలుచున్నాడు. నేను వెంటనే నా కన్నీళ్ళను తుడుచుకుంటూ ఆయనవంక ప్రశ్నార్థకంగా చూశాను. ఆ మసక వెలుతురులో ఆయన ముఖ కవళికలను నేను సరిగా గుర్తించలేకపోయాను. ఆ వ్యక్తి వ్యావహారిక తెలుగులో మృదువైన కంఠస్వరంతో ఇలా అన్నాడు : "నాయనా! ఇంత చిన్న వయసులోనే బాబా సన్నిధికి చేరుకోగలగడం నీ అదృష్టం. చాలామంది ఇక్కడకు వచ్చి తిరిగి వెళ్ళిపోతూంటారు. అయితే, ఎవరైతే విశ్వాసంతో, పట్టుదలతో స్వామిని అంటిపెట్టుకొని వుండి ఆయనతో సన్నిహిత సంబంధమును ఏర్పరచుకుంటారో అటువంటివారు సులభంగా భవసాగరాన్ని దాటగలరు. స్వామి పాదాలు వదలిపెట్టకు; గట్టిగా పట్టుకో", అని సలహాయిచ్చి అక్కడి నుండి వెళ్ళిపోయాడు. అప్పటి నా మానసిక స్థితిని బట్టి ఆ వ్యక్తి ఎవరై ఉంటారని కూడా నేను యోచించలేకపోయాను. కానీ 18 సంవత్సరాల తరువాత అదే సమయంలో అదే ప్రదేశంలో కూర్చుని ఆ సంఘటనను గుర్తు తెచ్చుకున్నప్పుడు ఆ వ్యక్తి పట్ల నాకు ఎనలేని కృతజ్ఞతా భావము ఏర్పడింది. భగవంతుని దివ్య సన్నిధిలో వుంటూ సేవ చేయగలిగే వరము లభించడం నాకు గొప్ప అదృష్టము. అదే నా జీవిత ధ్యేయమని భావించాను. ఆ దివ్య పెన్నిధిని నా చివరి శ్వాసవరకు నిలుపుకోవాలన్నదే నా తీవ్రమైన ఆకాంక్ష. అదే నేను నిరంతరం స్వామికి చేసే ప్రార్థన.

మరునాడు స్వామి దర్శనానంతరం ఒక వృద్ధ భక్తుడు నన్ను అభినందిస్తూ "నీవు చాలా అదృష్టవంతుడవు. కానీ, ఈ విషయం గుర్తుంచుకో! బాబా అగ్ని వంటివారు. ఆయనకు నీవు చాలా సమీపముగా వచ్చావు. బాబాకు సన్నిహితులైన భక్తులు చాలామందిలో క్రమంగా పవిత్రత లోపించడం వలన వారు ఆయనకు దూరమయ్యారు. తమ దివ్య సన్నిధిలో నీవు జీవితాంతమువరకు ఉంటూ సేవ చేసుకోగలిగే శక్తిని ప్రసాదించి స్వామి నీకు అండగా ఉండుగాక!" అని ఆశీర్వదించాడు. ఆయన నన్ను ఆ విధంగా ఆశీర్వదించినందుకు ఆయనకు నా కృతజ్ఞతలు తెలిపాను. స్వామి సమక్షంలో ఉపన్యసిస్తున్నప్పుడు కూడా తరుచు ఆయన ఈ విషయాన్నే ప్రస్తావిస్తూ "స్వామి అగ్నిహోత్రము వంటివారు.

ఆయనకు మరీ దగ్గరగా వెళితే కాలుతుంది. అలాగని దూరం దూరంగా వుంటే వేడి తగలదు", అంటూండేవారు. అంతేకాదు, ఆయన అవతారమూర్తిని ఆవరించియున్న యోగ మాయను గురించి కూడా ప్రస్తావించేవారు. "యోగమాయ స్వామికి అతి సన్నిహితంగా మెలగుతూ సేవ చేసుకునేవారిని కూడా అవతారతత్త్వమును తెలుసుకోనీయక అయోమయ స్థితిలో పడవేస్తుంది", అని చెప్పేవారు. ఆయన ఈ మాటలు సదుద్దేశంతో చెప్పినా, అవి నాలో ఆలోచనాపరంపరను రేకెత్తించాయి. నా మీద నాకే అపనమ్మకమును, వ్యాకులతను కలిగించాయి. అయితే, నేను మాత్రం స్వామిని ప్రార్థించుకుంటూ కాలము గడపసాగాను.

ఈ సందర్భంలో భగవద్గీతలోని శ్రీ కృష్ణపరమాత్మయొక్క దివ్య వాక్కులను నేను గుర్తు చేసుకున్నాను : "నన్ను యోగమాయ పరివేష్టించియుండటంచేత, నా దివ్యతత్త్వము అందరికి గోచరం కాదు. నేను జనన, మరణముల కతీతమైన, సకల చరాచర సృష్టికి మూలాధారమైన దివ్యతత్త్వమేనని మాయలో మునిగిన ఈ జగత్తు గుర్తించలేదు. నేను మానవ రూపములో అవతరించినప్పుడు సకల జీవులకు ప్రభువునని భ్రాంతిలో మునిగిన మానవాళి గుర్తించ లేదు".

భగవాన్ బాబా ఒకసారి తన నిజతత్త్వమును వెల్లడి చేస్తూ "నేను మీతో పాటు తింటూ, తిరుగుతూ, మాట్లాడుతూ కలసి మెలసి ఉండడంవలన నన్ను ఒక సామాన్య మానవునిగా భావిస్తున్నారు. ఇది చాలా పొరపాటని నేను మిమ్మల్ని హెచ్చరిస్తున్నాను. అంతేకాదు, మీతో ఆడుతూ, పాడుతూ, కలసి పనిచేస్తూ మిమ్మల్ని భ్రాంతిలో ముంచివేస్తున్నాను. అయితే, ఏదో ఒక రోజు హఠాత్తుగా నా దివ్యత్వమును నేను మీకు వెల్లడి చేయవచ్చును. ఆ దివ్య క్షణమునకై మీరు సంసిద్ధులుగా ఉండాలి. దైవము మానవ రూపములో అవతరించినపుడు ఆ దివ్యత్వమును తెలుసుకొనకుండా అడ్డు తగిలే మాయను మీరు అధిగమించాలి", అని ఉద్ఘాటించారు.

ఇంకా "కొంతమందికి అవతార పురుషుని కదలికలు మరియు కార్యకలాపాలు చాలా సామాన్యమైనవిగా, ప్రతి నిత్యం జరిగే సర్వ సాధారణమైన పనులుగా గోచరిస్తాయి. కాని, అవతారపురుషుల జీవితాలలో సామాన్యమైనవి, సాధారణమైనవి అంటూ లేనే లేవు. సర్వమూ అవతార కార్యక్రమంలోని అంశములే! నిరాకార నిర్గుణ పరబ్రహ్మ సాకారుడై మానవ రూపములో అవతరించుటకు కారణం, మానవులతో కలిసి మెలసి తిరుగుతూ మానవాళికి ఆదర్శమును నిరూపిస్తూ వారు తెలుసుకోవలసిన సమస్త విషయాలను వారికి బోధించుటకే! భగవంతుడు మానవ రూపములో అవతరించినప్పుడు ఇతర మానవులు తనతో సాన్నిహిత్యమును పెంచుకుని వారుకూడా తన స్థాయికి ఎదగడానికి కృషిచేసే నిమిత్తమై ఆయన మానవుని వలెనే ప్రవర్తిస్తూ మానవాతీత స్థాయికి చేరుకుంటాడు", అని భగవాన్ బాబా వివరించారు.

ఆ తరువాత రెండు రోజులూ నేను అవతారతత్త్వము మరియు యోగమాయను గురించి చింతిస్తూ కాలం గడిపాను. ఇంతలో భగవాన్ బాబావారు శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు కార్యదర్శి, స్వామికి అత్యంత సన్నిహిత సేవకుడు అయిన శ్రీ వై.వి. కుటుంబరావుగారిని పిలిచి నేను హాస్టలులో స్థిరపడేవరకు నా యోగక్షేమాలు చూడుమని ఆదేశించారు. నేను ఒక రోజు ఆయనతో "సార్! చాలామంది స్వామిని యోగమాయ పరివేష్టించి ఉందని అంటారు. దీనిని గురించి మీరేమనుకుంటున్నారు?" అని ప్రశ్నించాను. ఆయన నన్ను రెప్ప వాల్చకుండా చూస్తూ "నరసింహమూర్తీ! అది మాయ కాదు, మహామాయ!" అన్నారు. ఆయన సమాధానంతో నేను నివ్వెరపోయాను. "అటువంటప్పుడు నేను ఏవిధంగా మాయను అధిగమించగలను?" అని తిరిగి నేను ఆయనను ప్రశ్నించాను. ఆయన నావైపు చూసి చిరుదరహాసంతో "ఏమీ భయం లేదు; నిరంతరం స్వామిని ప్రార్థిస్తూ ఉండాలి. ఆయన దయామయుడు. నిరంతరం తన సన్నిధిలో ఉంటూ సేవ చేసేవారి పట్ల ఆయన ప్రత్యేక శ్రద్ధ, దయ చూపిస్తారు. మన బలహీనతలు ఆయనకు బాగా తెలుసు", అని నాకు ధైర్యం చెప్పారు.

శ్రీ కుటుంబరావుగారు చెప్పిన మాటలను గురించి ఆ రోజు రాత్రి చాలాసేపు ఆలోచించాను. చివరకు స్వామినే ఈ విషయము ప్రశ్నించి తెలుసుకోవాలనే నిర్ణయానికి వచ్చి, అందుకు ఆయన అనుగ్రహ ఆశీస్సులను కోరుకున్నాను. ఆ మరునాడు నేను హాస్టల్ వార్డెన్‌గా బాధ్యతలు స్వీకరించవలసిన రోజు. ఆ ఉదయం స్వామి నన్ను ఇంటర్వ్యూకు పిలిచారు. ఆయన చాలా ఆనందంగా, దయామయునిగా నాకు కనిపించారు. "నువ్వంటే నాకు చాలా ఇష్టం. స్వామియొక్క ఒక్క మాటతో నీవు ముద్దెనహళ్ళి పాఠశాలను విడిచిపెట్టి యిక్కడకు వచ్చి చేరావు. నిజమైన సాధకునికి ఇటువంటి వైరాగ్యమే ఉండాలి. అది సరే! నీకు ఏమి కావాలో కోరుకో, యిస్తాను. సమస్తమూ ఇందులోనే వున్నాయి" అంటూ తమ దక్షిణ హస్తముయొక్క పిడికిలిని మూసి చూపారు. అప్పుడు నేను "స్వామీ! మీరు నాకు సమస్తమును ప్రసాదించారు. మిమ్మల్ని సేవించుకోవాలనే నా మనసులోని కోరికను తీర్చారు. నాకు ఇంకేమి కావాలి?" అన్నాను. అందుకు స్వామి మళ్ళీ "మంచిది, 'గుడ్ బాయ్' (మంచి బాలుడవు); కానీ, ఏదో ఒకటి కోరుకో," అన్నారు.

అప్పుడు నేను "స్వామీ! మీ దివ్య చరణ సన్నిధిలో ఎప్పటికీ సేవ చేసుకుంటూ ఉండిపోవాలని ఆశీర్వదించండి", అని కోరాను. ఆ మాటలు నా హృదయాంతరాళమునుండి అప్రయత్నంగా వెలువడ్డాయి. తరువాత స్వామి తమ కుడి అరచేతిని నా శిరస్సు మీద ఉంచి "తథాస్తు" అని ఆశీర్వదించారు. నేను పరమానంద భరితుడనయ్యాను. కొన్ని రోజులుగా నన్ను మథనపెడుతున్న ఏకైక ప్రశ్నను అడగడానికి అదే సరియైన తరుణమని భావించి సంకోచిస్తూనే "స్వామీ! ఒక చిన్న సందేహము. చాలా శక్తివంతమైన యోగమాయ స్వామిని ఆవరించి ఉంటుందని అందరూ అంటున్నారు", అని నెమ్మదిగా నా మనసులోని సంశయమును వెలిబుచ్చాను. స్వామి బిగ్గరగా నవ్వుతూ "ఎవరన్నారు?" అని ప్రశ్నించారు. అందుకు నేను మళ్ళీ "స్వామీ! ఆ విషయం భగవద్గీతలో కూడా ఉంది కదా!" అన్నాను. అప్పుడు స్వామి "దానిని గురించి చింతించకు. సంపూర్ణ శరణాగతి తత్త్వమును అలవరచుకుంటే ఏ మాయా నిన్ను ప్రభావితం

చెయ్యలేదు. అందువలన అటువంటి శరణాగతితత్త్వమును అభివృద్ధి పరచుకో", అని ఆదేశించారు.

నేను ఇంటర్వ్యూ గదినుండి వెలుపలికి వస్తూంటే భగవద్గీతలో "త్రిగుణములచే బంధింపబడిన మీకు మాయను అధిగమించడం చాలా కష్టము. అయితే, నాకు శరణాగతులైనవారు, నన్ను శరణు జొచ్చినవారు మాయను సులువుగా అధిగమించగలరు", అనే శ్రీకృష్ణ భగవానుని అభయవాక్కు జ్ఞప్తికి వచ్చింది.

అవతార పురుషుని దివ్య సన్నిధిలో జీవితాలను గడపగలిగే అదృష్టవంతులకు, ఆయన దివ్యానుగ్రహమును పొందినవారికి స్వామి ఆదేశించినట్లుగా విశ్వాసము మరియు ప్రేమలతో కూడిన సాధనా ఫలితమైన సంపూర్ణ శరణాగతియే తరణోపాయము. అయితే, శరణాగతి మార్గమునకు అహంకారము అడ్డుగా నిలుస్తుంది. ఇటువంటి అహంకారమును జయించడానికి కరుణా సింధువైన అవతారమూర్తి యొక్క అనుగ్రహ, ఆశీస్సులు అవసరం. వాటిని అనుగ్రహించడానికి భగవాన్ బాబా సర్వదా సిద్ధంగా ఉంటారు.

"నా వైపు ఒక్క అడుగువేస్తే, నేను వంద అడుగులు నడిచి నీవైపు వస్తాను", అని ప్రేమమూర్తి, కరుణామయులు అయిన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు మనకు అభయమిస్తూ దారి చూపిస్తున్నారు. ఆయనే మన ఆశాజ్యోతి!

2

నవనవోన్మేష సుమ సౌరభం

భగవంతుడు మానవాకారములో ఈ భువిపై అవతరించినప్పుడు, సాధారణ మానవులవలె కాక పరిపూర్ణముగా వికసించిన పుష్పమువలె ఉంటాడు. అందువలన, 'నవనవోన్మేష సుమ సౌరభం' అనే వర్ణన అవతార పురుషుని అవరోహణకు వర్తించదు. ఇది దివ్యత్వ ఆవిర్భావమునకు కేవలం ఒక సూచిక మాత్రమే! నిజానికి, దివ్యత్వ ఆవిర్భావము అవతార పురుషుని ఆగమమునకు పూర్వమే ప్రారంభమై కాలాతీతమైన అనంత దివ్యతత్త్వముగా సాగిపోతుంది. అందువలన, ఏ మానవుడు కూడా ఏ నాటికి అవతార వైభవమును పరిపూర్ణంగా అవగాహన చేసుకోలేడు.

మానవాళియందు అపార కరుణ, వాత్సల్యములతో ఆ ప్రభువు తన దివ్యతత్త్వమును గురించి తాను స్వయంగా వెల్లడించినంత వరకే తప్ప అంతకు మించి ప్రపంచానికి అవగతం కాదు. ఈ కారణంగా అవతార పురుషుని దివ్య చరిత్ర వ్రాయాలనే భ్రాంతి ఎవరికైనా కలిగితే, అది దుస్తరమైన పర్వతారోహణవంటి సాహస కృత్యమే కాగలదు. అట్టి సాహసమునకు పూనుకున్న రచయితకు ఆ గ్రంథ రచన కొంత మానసిక తృప్తిని కలిగించవచ్చునేమోగాని, వాస్తవానికి ఆ బాధ్యతను ఎవ్వరూ సంతృప్తికరంగా నెరవేర్చలేరు. ఎందుకంటే, అవతార పురుషుని దివ్య చరిత్ర ఆద్యంతములు లేని దివ్య జీవన స్రవంతి. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య జీవిత చరిత్రకూడా ఇందుకు భిన్నమైనది కాదు.

ఈ అధ్యాయములో భగవాన్ బాబావారు అప్పుడప్పుడు స్వయంగా వెల్లడించిన తమ జీవిత విశేషాలు మరియు 'సత్యం శివం సుందరం' గ్రంథముయొక్క మొదటి నాలుగు భాగములలో పొందుపరుపబడని స్వామి

బాల్య జీవితమునకు సంబంధించి భక్తులు వెల్లడించిన కొన్ని అనుభవాలు ఒక క్రమ పద్ధతిలో కూర్చడం జరిగింది. ఈ నవనవోన్మేష సుమమాలలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య వైభవము, అపార జ్ఞాన సంపద మరియు కరుణలను ప్రతిబింబించే కొన్ని అద్భుత లీలలు మరియు చిహ్నముల దివ్య సుమ సౌరభం వెల్లివిరుస్తుంది. ఇందులో అవతార పురుషుని మాతృమూర్తి శ్రీమతి ఈశ్వరమ్మ ముప్పయి సంవత్సరాల క్రితం జరిగిన ఒక అద్భుత సంఘటనను గుర్తు చేసుకుని చెప్పిన వివరణ పొందుపరుపబడింది. ఈ విషయమును ఆమె బయటకు వెల్లడించకూడదనే ఆంక్ష కారణంగా ఇంతకాలంగా ఈ సంఘటన గ్రంథస్థము చేయబడలేదు. మొట్టమొదటిసారిగా కీ॥శే॥ కస్తూరి "Easwaramma - The Chosen Mother" అనే తన పుస్తకంలో ఆమె పొందిన ఆనాటి దివ్యానుభూతిని ఆమె మాటల్లోనే పొందుపరచారు.

"అప్పుడు స్వామి 9 నెలల పసిబిడ్డ. నాకు ఆనాటి సంఘటన నిత్య నూతనంగా, ఇటీవలనే జరిగినట్లుగా చాలా స్పష్టంగా గుర్తుండిపోయింది. బాబుకు అప్పుడే స్నానం చేయించి, దుస్తులు తొడిగి, కంటికి కాటుక దిద్ది, నుదుట శివాలయంనుండి తెచ్చిన విభూతి, సత్తెమ్మ గుడినుండి తెచ్చిన కుంకుమ పెట్టి ఊయలలో పరుండబెట్టాను. ఒకసారి ఉయ్యాల ఊపి, వంట యింటిలో పొయ్యి మీద మరుగుతున్న పాలను చూడడానికి వెళ్ళాను. ఇంతలో ఉన్నట్లుండి బాబు ఏడవడం మొదలుపెట్టాడు. అంతవరకు ఏనాడు కూడా ఆకలితోగాని, బాధతోగాని లేక ఎటువంటి అసౌకర్యంతో గాని ఏడ్చియెరుగని బిడ్డ ఆ రోజున హఠాత్తుగా ఏడ్వడం విన్న నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. వెంటనే నేను బాబును ఉయ్యాలలో నుండి తీసి ఎత్తుకుని ఒడిలో కూర్చోబెట్టుకోగానే ఏడుపు ఆపేశాడు. బాబుచుట్టూ నాకు కాంతివంతమైన ఒక దివ్య తేజోవలయం కనిపించింది. ఆ దివ్య కాంతివలయం నాకు ఎంతో సమీపంగా, ఉజ్వలంగా ఉన్నప్పటికి అది చాలా చల్లగా, హాయిగా, ప్రశాంతంగా ఉండి నాలో అనిర్వచనీయమైన ఆనందమును నింపింది. నాకు ఎట్టి అసౌకర్యము కలుగలేదు. నేను ఆ ఆనందానుభూతిలో మైమరిచి నిశ్చలంగా కూర్చుండిపోయాను. ఆ

Bhagawan Sri Sathya Sai Baba

PHONE NO. 30
PRASANTHI NILAYAM P.O. ANANTPUR DISTRICT. (A.P.) PINCODE 515134

My dear Boys! Accept my love and Blessings
I received letters from Narasimha Murthy. I was
so happy. My dears! Every one of you is
the very embodiment of divinity. Your
True being is Sat-Chit-Ananda, Absolute
Existince, Consciousness and bliss. You
have forgotten about this Truth. Therefore
remember it by taking the holy and
powerful name of the Reality until your
mind disappears and enjoy as Sai has
been enjoying that infinite bliss which
never exhausts itself.
Sai's grace is necessary. It is therefore
important that you should join hands
together to whatever country or race
you belong. I am always with, around,
and in.. But.... what can I do?
You are not following

With love
Bsh.

"1984 ఫిబ్రవరి నెలలో భగవాన్ బాబా విద్యార్థులకు వ్రాసిన లేఖ"



"అవతార పురుషుడు పరిపూర్ణముగా వికసించిన పుష్పము
వలె ఈ భువిపై అవతరిస్తాడు"



"మాతృదేవో భవ; పితృదేవో భవ"

దివ్య కాంతివలయం చాలాసేపు అలాగే ఉండి, తరువాత కనుమరుగైపోయింది. నేను కళ్ళు మూసుకుని ఆ విధంగా దివ్యమైన ఆనందము ననుభవిస్తూ ఎంతసేపు ఉండిపోయానో, చుట్టు ప్రక్కల ఏమి జరుగుతున్నదో నాకు స్పృహే లేదు. మా అత్తగారు వచ్చి తట్టి లేపేవరకు నా పరిస్థితి అలాగే వున్నది. ఇంతలో బిడ్డ మాత్రం హాయిగా నిద్రపోయాడు. ఆమె ఏమి జరిగిందని ప్రశ్నించగా నేను అప్పటికీ స్పష్టంగా ఒక కాంతి రేఖ వలె కనపడుతున్న ఆ దివ్య కాంతివలయం గురించి చెప్పాను. అప్పుడు ఆమె తన చేతివ్రేలిని పెదవులపై ఉంచి "ఈ సంగతి ఎవరికీ చెప్పవద్దు. జనానికి అర్థం కాకపోయినా రకరకాలుగా కథలు అల్లుతారు", అని చెప్పి నన్ను వారించింది. అయితే, తాను మాత్రం ఈ విషయాన్ని మామగారైన కొండమరాజు గారికి చెప్పినట్లున్నది. తరువాత ఆయన యీ విషయం గురించి నన్ను అడిగారు".

అవతారమూర్తికి జన్మనిచ్చిన మాతృమూర్తిగా ఆమె అనుభవించిన దివ్యానందమును, భయాందోళనలను, ఆమె ఆధ్యాత్మిక ప్రస్థానమును, తుదకు ఆమె పొందిన జీవిత సాఫల్యమును శ్రీ కస్తూరి తన గ్రంథములో అత్యంత రమణీయంగా పాఠకుల హృదయాలను కదిలించేటట్లుగా వర్ణించారు.

1985వ సంవత్సరములో భగవాన్ బాబావారు తమ 60వ జన్మదినోత్సవ సందర్భంగా శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క హాస్టలు భవనము దాటిన తరువాత "కరణం సుబ్బమ్మ నగర్" పేరుతో నిర్మింపబడిన 60 మంది నిరుపేద కుటుంబాల నివాస గృహ సముదాయాన్ని ప్రారంభించారు. అలనాటి బృందావన గోపాలునికి యశోదవలె పుట్టపర్తిలో చిన్నారి సత్యానికి శ్రీమతి కరణం సుబ్బమ్మ పెంచిన తల్లి. భగవాన్ బాబా ఆమెపట్ల కృతజ్ఞతా సూచకంగా యీ నివాస గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టారు. బాల్యము నుండి సత్యం, కరణం సుబ్బమ్మలమధ్య సహజసిద్ధమైన ఆత్మీయతతో కూడిన తల్లీబిడ్డల వాత్సల్య బంధం అల్లుకొని పోయింది.

సంతానంలేని కరణం సుబ్బమ్మ తప్పటడుగులు వేస్తున్న ఈ దివ్య శిశువు యొక్క ఆలనా పాలనా చూస్తూ మాతృత్వ భావనలోని పరిపూర్ణమైన తృప్తిని

అనుభవిస్తూ తనకు స్వంత బిడ్డలు లేని లోటును మరచింది. క్షత్రియ కుటుంబమునకు చెందిన ఒక బాలుని బ్రాహ్మణ కుటుంబమునకు చెందిన ఈమె తన వంటయింటిలోనికి తీసికొనిపోయి ఇంటిని మైలపరుస్తున్నదనే విమర్శలను దూరంగా ఉంచే ఉద్దేశ్యంతో సుబ్బమ్మ సత్యానికి రహస్యంగా తాను చేసిన వంటకాలను తినిపించేది. సత్యం కొంత పెద్దవాడయిన తరువాత అతనిని వారి యింటి డాబా పైకి రమ్మని తన యింటి ఎత్తైన కిటికీ గుండా రకరకాల తినుబండారాలను అతనికి తినిపించేది. సత్యంకు ఆరేళ్ళ వయస్సున్నప్పుడు ఆవిధంగా ఆమె అతనికి ఆహారం అందించే సమయంలో ఒకసారి సత్యంలోని దివ్యత్వం ఆమెకు లీలా మాత్రంగా గోచరమైంది. సుబ్బమ్మ చేతిలోని మంచినీళ్ళ గ్లాసుతో నీరు త్రాగడానికి సత్యం నోరు తెరచినప్పుడు ఆ చిన్నారి నోటిలో ఆమెకు విశ్వమంతా గోచరించింది. ఆ నోటిలో ఆమె ఆకాశంలో పరిభ్రమిస్తున్న దివ్యగోళములను చూడగలిగింది. ఆ అద్భుత దృశ్యమును చూచిన ఆమె దిగ్భ్రాంతితో, ఆనంద పారవశ్యంలో మునిగిపోయింది. కొద్ది నిమిషముల తరువాత ఆమె ఇంటి వెలుపలకు పరుగెత్తి, అక్కడ వీధిలో ఉన్న సత్యంను చూచి ఎవరేమనుకున్నా లెక్క చేయక ఆ దివ్య బాలుని చిరుపాదములను తన ఆనంద బాష్పములతో అభిషేకించింది. ఆనాటి ఆ ఆనందానుభూతి చాలారోజులవరకు ఆమెను వెన్నంటి ఉండింది.

ఈ విధంగా ఆమె హృదయ క్షేత్రంలో ఆనాడు నాటబడిన అవతారమూర్తియందు విశ్వాసమనే విత్తనం మొలకెత్తి, పెరిగి క్రమంగా నిర్మల నిశ్చల భక్తి ప్రపత్తులనే మహావృక్షంగా ఎదిగి, భగవంతుని పట్ల సంపూర్ణ శరణాగతి అనే ఫలమును అందించింది. చివరకు, జీవిత చరమదశలో తనకు అత్యంత ప్రీతిపాత్రుడైన సాయి ప్రభువు దివ్యహస్తాల మీదుగా ఆమె అత్యున్నతమైన ముక్తిఫలమును పొందింది.

సత్యంలో నాయకత్వ లక్షణాలు పుట్టుకనుండే ప్రస్ఫుటమయ్యాయి. బాల్యములోనే గ్రామంలోని పిల్లలందరికి గురువుగా ఉంటూ వారిని సన్మార్గంలో, భక్తి మార్గంలో నడిపించాడు. ఇటీవలి కాలంలో ఒక ఆసక్తికరమైన తన

చిన్ననాటి సంఘటనను వెల్లడిస్తూ భగవాన్ బాబా ఆ సంఘటన తన నిజతత్వమును బహిర్గతం చేసే ప్రక్రియలో ఒక మైలురాయి వంటిదన్నారు. స్వామి మాటలలోనే ఆ సంఘటన గురించి తెలుసుకుందాం :

"నేను చిన్నప్పటినుండి గ్రామంలోని పిల్లలందరికి స్ఫూర్తి దాయకంగా ఉంటూ వారు నిర్వర్తించవలసిన కర్తవ్య కర్మలను ప్రబోధిస్తూ ఎవరిని నొప్పించరాదని చెప్పేవాడిని. చిన్నతనము నుండి నేను ఆధ్యాత్మిక తత్త్వ ప్రచార ప్రబోధలతోనే కాలం గడుపుతూ వచ్చాను.

మాఘమాసం ప్రారంభమైంది. నేను పిల్లలతో 'మాఘస్నానం చాలా పవిత్రమైనది. కేవలం స్నానం చేసినంత మాత్రాన సరిపోదు. మీరు దైవ ప్రదక్షిణ కూడా చేయాలి', అని చెప్పాను. తెల్లవారుఝామున నాలుగు గంటలకే మేము ఆంజనేయస్వామి గుడికి వెళ్ళేవారము. అక్కడొక పెద్ద కొలను ఉండేది. చిన్న చిన్న పిల్లలు ఎంత లేపినా లేవలేకపోయేవారు, పాపం! అలాంటి పిల్లలను నేను ఎత్తుకొనిపోయి స్నానం చేయించేవాడిని. అందరం కలసి గుడికి వెళ్ళాము. 'ఆంజనేయస్వామికి మీరు ప్రదక్షిణలు చేసుకుని రండి. నేనిక్కడే ఉంటాను', అని చెప్పాను. వారు ప్రదక్షిణలు చేయడానికి వెళ్ళారు. కాని, 'రాజు కూడా మనతో ఎందుకు రాకూడదు? రాజు మనకు ఎన్నో పనులు నేర్పించాడు. అతను లేకుండా మనం ఏ పని చేయలేము. కాబట్టి అతను ముందు, మనం వెనుక నడవాలి' అని వారిలో వారు అనుకున్నారు. వెంటనే నా వద్దకు పరుగెత్తుకుని వచ్చారు. 'రాజూ! నీవు కూడా మాతో పాటు రావాలి' అన్నారు. 'నేను వస్తాను, మీరు ముందు ప్రదక్షిణలు చేసుకుని రండి' అన్నాను. 'నీవు వస్తేకాని మేము పోము' అని మొండికెత్తారు పిల్లలు. 'నాకు కాళ్ళు నొప్పిగా ఉన్నాయి' అన్నాను. 'మేము ఎత్తుకొని తీసుకువెళతాము' అన్నారు. ఈ విధంగా వారు ఎంతో ప్రేమతో బలవంతం చేయడంచేత నేనుకూడా ఆంజనేయస్వామి గుడికి వెళ్ళి ప్రదక్షిణ చేయడానికి ఉపక్రమించాను. మీరు నమ్మవచ్చు, నమ్మకపోవచ్చు; కాని, ఒక పెద్ద కోతి వచ్చి నాకు అడ్డం నిల్చుంది. 'ఇంత పెద్ద కోతిని మేము ఈ ఊర్లో ఎప్పుడూ చూడలేదే! ఇది ఎక్కడి నుండి

వచ్చింది?' అని పిల్లలు ఆశ్చర్యపోయారు. దానిని తరిమివేయడానికి ఎంతో ప్రయత్నము చేశారు. కాని, అది కదల్లేదు. ఆ కోతి ఎవరు? సాక్షాత్తూ హనుమంతుడే! వారికి తెలియదు. హనుమంతుడే వచ్చాడు. 'స్వామీ! నేను మీకు ప్రదక్షిణ చేయవలసినవాడను. మీరు నాకు చేయకూడదు', అన్నాడు. సరే, నేను పిల్లలకు చెప్పాను. 'నేను ప్రదక్షిణలు చేయడం హనుమంతునికి ఇష్టం లేదు. కాబట్టి నేను మానేస్తాను' అన్నాను. ఆనాటినుండి పిల్లలలో చాలా పరివర్తన కలిగింది. వారిలో దివ్యమైన భావాలు కలిగాయి. వాళ్ళు తమ ఇళ్ళకు తిరిగి వెళ్ళేటప్పుడు 'రాజు మాతో కలసి హనుమంతుని గుడికి ప్రదక్షిణ చేస్తూంటే ఒక పెద్ద కోతి అడ్డు వచ్చి అతనిని ప్రదక్షిణ చేయనివ్వలేదు' అని అందరికీ చెప్పారు.

1980వ సంవత్సరములో ప్రప్రథమంగా భగవాన్ బాబా 1937 సం॥లో బాల్యంలో ఉల్ఫు మెస్సింగ్ తనను కలుసుకున్న సంఘటన గురించి వెల్లడించారు. ఉల్ఫు గ్రిగరీవిచ్ మెస్సింగ్ 20వ శతాబ్దమునకు చెందిన ఒక నిగూఢమైన, ఎవరికీ అర్థం కాని వ్యక్తి. ఆయనకు అద్భుతమైన ఎన్నో మానసిక, అతీంద్రియ శక్తులున్నవని ప్రతీతి. ఆ కారణంగా ఆయన ఒక ఐతిహాసిక వ్యక్తిగా చరిత్రలో నిలిచిపోయాడు. 1899వ సంవత్సరములో పోలెండ్ దేశములో జన్మించిన మెస్సింగ్ యూదు మతస్థుడు. 1939వ సంవత్సరంవరకు ఆయన అద్భుతమైన తన మానసిక శక్తులను ప్రదర్శిస్తూ విస్తృతంగా ప్రపంచ పర్యటన చేశాడు. ఆ పర్యటన సందర్భంగా ఆయన ఆల్బర్ట్ ఐన్‌స్టీన్, సిగ్మండ్ ఫ్రాయిడ్, మహాత్మా గాంధీవంటి ప్రపంచ ప్రఖ్యాత వ్యక్తులను కలుసుకున్నాడు. ఇంకా, హిట్లరు యొక్క పతనాన్ని గురించి జోస్యం చెప్పిన కారణంగా ఆయనను పట్టి యిచ్చినవారికి హిట్లర్ నగదు బహుమతిని కూడా ప్రకటించాడు. 1939వ సంవత్సరంలో హిట్లర్ పోలెండును వశపరచుకున్న తరువాత మెస్సింగ్ రష్యా దేశమునకు వెళ్ళిపోయి అక్కడ స్థిరపడ్డాడు. అక్కడ ఆయన అద్భుతమైన తన మానసిక శక్తులను స్టాలిన్‌వద్ద ప్రదర్శించి ఆయన అభిమానమును, విశ్వాసమును చూరగొన్నాడు. చివరకు, తన 75వ ఏట మాస్కోలో తుదిశ్వాస విడిచాడు.

భగవాన్ బాబావారు ప్రశాంతి నిలయంలో 22-11-1980వ తేదీన ప్రపంచమంతటినుండి వచ్చిన అశేష భక్తజన సందోహము నుద్దేశించి మాట్లాడుతూ ప్రపంచానికి అంతవరకు తెలియని మెస్సింగ్‌యొక్క వ్యక్తిత్వములోని ఒక అంశమును వెల్లడించారు. మెస్సింగ్ గొప్ప ఆధ్యాత్మిక చింతనాపరుడు, సాధకుడు. ఆత్మజ్ఞానమును పొందే నిమిత్తమై అతడు భారతదేశమునకు వచ్చాడు. హిమాలయ పర్వతాలలో తపస్సు చేసుకుంటున్న అనేక మంది యోగులను, ఋషులను అతడు సందర్శించాడు. తాను కూడా పలు సాధనలు చేశాడు. చివరకు ఆత్మసాక్షాత్కారమును పొందాడు. ఆ ఉదంతాన్ని భగవాన్ ఇలా ఉటంకించారు:

"నేను యింతవరకు ఈ సంఘటన గురించి ఎవరికి చెప్పలేదు. అది 1937వ సంవత్సరం. నేను కమలాపురంలో ఉన్నాను. నేను ఎక్కడికి వెళ్ళినా స్నేహితులు నా వెంట వచ్చేవారు. ఒక రోజు నేను నా సహచరులతో కలసి కమలాపురం రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్నాను. నన్ను చూచి ఒక వ్యక్తి నావద్దకు పరుగెత్తుకుని వచ్చి తన చేతులతో నన్ను చుట్టివేసి ముద్దుపెట్టుకున్నాడు. 'నాకు ఎంతో సంతోషంగా ఉంది, నాకు ఎంతో సంతోషంగా ఉంది' అంటూ ఆనందబాష్పాలు విడిచాడు. అంతటితో ఆగక ఆనందంతో నాట్యం చేస్తూ 'నేను నిన్ను ప్రేమిస్తున్నాను, నేను నిన్ను ప్రేమిస్తున్నాను' అని పదే పదే వల్లించాడు. నా సహచరులు ఆ ఆగంతకుని వింత చేష్టలను గమనించి ఆశ్చర్య చకితులై 'ఈ తెల్లదొర ఎవరు? ఎవరో పిచ్చివాడివలె ఉన్నాడే! బహుశా ఇతడు మన సత్యంను ఎత్తుకొనిపోవడానికి వచ్చి ఉంటాడు' అని భయపడుతూ నన్ను అక్కడినుండి తరలించుకుపోయారు. మేము అలా వచ్చేస్తూంటే అతడు నేలకు అతుక్కునిపోయినట్లు అక్కడే నిల్చుని నేను కనుమరుగైపోయేంతవరకు విస్ఫారిత నేత్రాలతో నన్ను చూస్తూ ఉండిపోయాడు. అతడే ఉల్ఫుమెస్సింగ్".

అంతేకాక, ఉల్ఫుమెస్సింగ్ స్టాలిన్‌ను కలుసుకున్నట్లు కూడా భగవాన్ బాబా తమ ఉపన్యాసంలో వెల్లడించారు. అప్పట్లో 'సనాతన సారథి' మాసపత్రికకు సహసంపాదకులైన శ్రీ వి.కె. నరసింహన్ కూడా ఆనాడు సభలో

కూర్చొనియున్నారు. ఆయన అసలు సిసలైన పాత్రికేయుడు కావడం చేత భగవాన్ బాబావారు వెల్లడించినట్లు మెస్సింగ్ స్టాలిన్‌ను ఎక్కడ, ఏవిధంగా కలుసుకున్నాడో ఆ ఉదంతము తాలూకు వివరాలు ఇంకా తెలుసుకోవాలనే జిజ్ఞాస ఆయనకు కలిగింది. ఆ రోజు సాయంత్రం ఆయన ఆ వ్యక్తిని గురించి తనకు అందుబాటులో వున్న గ్రంథాలను కొన్నిటిని పరిశోధించి కొంత సమాచారం సేకరించాడు. మరునాడు ఉదయమే తాను సేకరించిన ఈ క్రింది విషయాలను స్వామికి నివేదించాడు :

"ఒకసారి ఉల్ఫుమెస్సింగ్ కొన్ని రోజుల తరువాత ఫలాన తేదీ ఫలాన సమయానికి స్టాలిన్‌ను అతని క్రెమ్లిన్ కార్యాలయములో కలుస్తానని సవాలు చేశాడు. అయితే, స్టాలిన్ ముందుగానే తగు జాగ్రత్తలు తీసికొని మెస్సింగ్ ఖచ్చితంగా తనను కలుస్తానని చెప్పిన తారీఖున ఎవ్వరినీ తన వద్దకు పంపవద్దని, తనను తప్పించి యింకెవ్వరిని తన కార్యాలయములోనికి అనుమతించవద్దని సెక్యూరిటీ గార్డులకు గట్టి ఆదేశాలు జారీ చేశాడు. కాని, చివరకు ఎన్ని కట్టుదిట్టమయిన చర్యలు చేపట్టినప్పటికి మెస్సింగ్ తాను నిర్దేశించిన తేదీన నిర్ణీత సమయానికి స్టాలిన్ కార్యాలయములో అతని కళ్ళ యెదుట నిలిచాడు. అది చూచి నిర్ఘాంతపోయిన స్టాలిన్ 'ఇంత మంది భద్రతా సిబ్బంది కళ్ళుగప్పి లోపలికి ఎలా రాగలిగావు?' అని మెస్సింగ్‌ను ప్రశ్నించాడు. మెస్సింగ్, తాను లోపలికి వస్తున్నప్పుడు భద్రతా సిబ్బందికి స్టాలినే తమ ముందు నుండి నడిచి వెడుతున్నట్లు భ్రాంతి కల్పించానని సమాధానం చెప్పాడు".

అయితే, శ్రీ నరసింహన్ తాను సేకరించిన విషయాలను బాబాకు విన్నవించినప్పుడు, బాబా అంతగా వాటియందు ఆసక్తి కనబరచలేదు. పైగా, తన మాటలను విశ్వసించనందుకు శ్రీ నరసింహన్‌ను సున్నితంగా మందలించారు కూడా! అంతేకాక, స్టాలిన్ పరిపాలన త్వరలోనే అంతమవుతుందని, అతడు నెలకొల్పిన మత వ్యతిరేక వ్యవస్థ కుప్పకూలిపోతుందని మెస్సింగ్ జోస్యం చెప్పినట్లుగా కూడా భగవాన్ బాబా వెల్లడించారు.

"నన్ను పరిపూర్ణంగా నమ్మి, తమ జీవితాలను నాకు అర్పణ చేసిన వారికి అన్నము, అమృతము – రెండింటిని నేను అనుగ్రహిస్తాను", అని భగవాన్ బాబా ఒక సందర్భంలో ఉద్ఘాటించారు. ఈ వాగ్దానం ఎంత సత్య ప్రమాణమైనదో అనే విషయానికి ప్రపంచమంతటా ఉన్న అసంఖ్యాకులైన భక్తుల జీవితాలే నిదర్శనము. "నా యందు పరిపూర్ణ విశ్వాసమును ఉంచిన వారిని నేనెప్పటికి విడిచిపెట్టను. నమ్మక చెడిన వారెందరో ఉన్నారు. కాని, దైవాన్ని నమ్మి చెడిన వారెవ్వరూ లేరు. జీవితములో ఎన్నో కడగండ్లు ఎదురు కావచ్చు. కాని, నిజమైన భక్తుడు చివరకు విజయాన్నే సాధిస్తాడు", అని భగవాన్ ఒకసారి ప్రకటించారు. అందుకు ఉదాహరణగా ఉరవకొండ స్కూలులో తన సహాధ్యాయులైన రమేష్, సురేష్‌ల జీవితాలను గురించి ప్రస్తావించారు. స్వామి యందు అచంచల విశ్వాసముతో వారు ఏ విధంగా తమ జీవితాలను ధన్యము చేసుకున్నారో వివరించారు.

తమ తరగతి గదిలో రమేష్, సురేష్ అనే ఇరువురు విద్యార్థులు ఎప్పుడూ బెంచిమీద సత్యంకు యిరువైపులా కూర్చునేవారు. వాళ్ళు సత్యంను అమితంగా ప్రేమించేవారు. ప్రతి చిన్న విషయంలోను సత్యంపై ఆధారపడియుండేవారు. వారి హృదయాలు పవిత్రములయినా, వారికి తెలివితేటలు మాత్రం శూన్యం. ఆ రోజుల్లో పబ్లిక్ పరీక్షలో ఉత్తీర్ణులయిన వారికే E.S.L.C. (ఎలిమెంటరీ స్కూలు లీవింగ్ సర్టిఫికేటు) ఇచ్చేవారు. ఆ పరీక్ష అంటే అందరికి భయమే! దాంట్లో చాలామంది ఫెయిలై కొద్దిమంది మాత్రమే పాసయ్యేవారు. రమేష్, సురేష్‌లకు ఈ పరీక్ష నిజంగా ఒక పెనుభూతమే! సత్యం చిన్నప్పటినుండి అందరికీ కొండంత అండగా ఉంటూ ధైర్యాన్ని అందిస్తూ మసలుకుంటూండడంచేత వాళ్ళిద్దరూ ఈ పరీక్షాగండమునుండి తమను గట్టెక్కించుమని సత్యంను శరణువేడారు. "నా మీద అచంచలమైన విశ్వాసముతో ఉండండి. మీ సమస్యలనన్నిటిని నేను చూచుకుంటాను", అని సత్యం వాళ్ళకు మాటిచ్చాడు.

పరీక్ష హాలులో సత్యం వాళ్ళను రక్షించిన తీరు 'చట్టము కంటె ప్రేమ ఉన్నతమైనది', అనే సత్యమును బుజువు చేసింది. పరీక్ష హాలులో ప్రవేశించేముందు సత్యం వారితో 'అన్సరు పేపరు మీద ఏమీ వ్రాయవద్దని, పరీక్షాధికారికి తమ అన్సరు పేపర్లు యివ్వవద్దని చెప్పాడు. తాను పరీక్ష హాలునుండి బయటకు వచ్చేటప్పుడే వారు కూడా తనతో పాటే బయటకు రావాలని కూడా ఆదేశించాడు. పబ్లిక్ పరీక్ష అనే పెనుభూతమును ఎదుర్కోవడం ఇంత తేలికైనపనని రమేష్, సురేష్‌లు కలలోనైనా ఊహించలేదు. బాలుడైన సత్యంను వారు తమ ఆపద్భాంధవునిగా భావించి, మారు మాట్లాడకుండా అతను చెప్పినట్లే చెయ్యాలనుకున్నారు. పరీక్ష హాలులో వీరికి కేటాయించబడిన రిజిష్టరు నంబర్లు ఒకదానికొకటి చాలా దూరంగా ఉండడం వలన, వాళ్ళు కూర్చొనవలసిన బెంచీలు కూడా దూరం దూరంగానే ఉన్నాయి. పరీక్ష ప్రారంభమైన రెండు గంటల వ్యవధిలో సత్యం మూడు జవాబు పత్రాలను వ్రాయడం పూర్తి చేసాడు. ఒకటి తన దస్తూరితో, మిగతా రెండింటిని రమేష్, సురేష్‌ల దస్తూరీలతో వ్రాసి, వాటిపై ముగ్గురి పేర్లు, రిజిష్టరు నంబర్లు వ్రాసాడు. పరీక్షా సమయం ముగియగానే బెల్లు మ్రోగింది. ఇన్విజిలేటర్ పేపర్లు యివ్వమని ఆదేశించాడు. సత్యం మూడు సమాధాన పత్రాలను ఆయన బల్లపై ఉంచాడు.

పది రోజుల అనంతరం పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. పాఠశాల మొత్తంమీద ముగ్గురే ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు – సత్యం, రమేష్, సురేష్‌లు. గ్రామ ప్రజలు వాళ్ళు ముగ్గురికి పూలమాలలు వేసి ఊరేగించి, ఘనంగా సత్కరించారు. ఈ అనుభవం ద్వారా రమేష్, సురేష్‌లు శరణాగతి యొక్క విశిష్టతను గ్రహించారు. తరువాత, వాళ్ళు తమ జీవితాలలో ఆఖరి క్షణము వరకు చిన్న, పెద్ద అన్ని విషయాల్లో ఆ మార్గాన్నే అనుసరించారు. ఈ విధంగా సత్యం వారి జీవితాలకు కేంద్ర బిందువుగా, కాదు కాదు, సాక్షాత్తూ వారి ప్రాణమే అయ్యాడు. ఫలితంగా, ఆ శరణాగతవత్సలుడు వారిని కేవలము లౌకికమైన పబ్లిక్ పరీక్షల నుండి గట్టెక్కించడమే కాక, వారిని భవసాగరమునుండి

తరింపజేయాలని కూడా సంకల్పించాడు. దీనికి కారణం, వాళ్ళు E.S.L.C. (Eligibility in Surrender, Love and Confidence) అనే అత్యున్నతమైన అర్హత కలిగియుండడమే! ఇక్కడ 'S' అంటే శరణాగతి (Surrender), 'L' అంటే ప్రేమ (Love) మరియు 'C' అంటే విశ్వాసము (Confidence). నిజానికి, ఆ చిన్న పిల్లలకు ఇది అగ్నిపరీక్షే! అయితే, సత్యం ఆదేశించినట్లుగా వాళ్ళు అతనియందు పరిపూర్ణ విశ్వాసము, ప్రేమ, శరణాగతి పెంచుకోవడంచేత ఈ అగ్నిపరీక్షలో నెగ్గి, చివరకు భగవంతునిలో ఐక్యమయ్యే స్థాయికి చేరుకున్నారు.

సత్యం పాఠశాలను, ఇంటిని త్యజించి, ఉరవకొండ వదలి పెట్టి మానవజాతి ఉద్ధరణ అనే తన అవతార కార్యక్రమాన్ని ప్రారంభించడానికి పుట్టపర్తికి ప్రయాణమైనప్పుడు, తమ జీవితాలకు ఇంతవరకు ఆలంబనగా ఉన్న వృక్షమునుండి వేరయిన లతలవలె రమేష్, సురేష్‌లు నిరాధారులయ్యారు, నిస్సహాయులయ్యారు. తమ ఆప్త మిత్రుడు, గురువు అయిన సత్యంయొక్క వియోగమును వారి లేత మనస్సులు తట్టుకొనలేకపోయాయి. ఫలితంగా, వారిలో ఒకడు వెంటనే బావిలో పడి ప్రాణాలు వదిలాడు. రెండవవాడు నిరంతరం 'రాజూ! సత్యం!' అని రెండే రెండు మాటలు వల్లిస్తూ, 'నేను సత్యంను తప్పించి వేరే ఏమీ చూడను' అని మనస్సులో దృఢ నిశ్చయం చేసుకుని కళ్ళు మూసేసుకుని పిచ్చివాడయిపోయాడు. చివరకు, ఆ బాలుని తల్లిదండ్రుల ప్రార్థనను మన్నించి 'శ్రీ సత్యసాయిబాబా'గా రూపొందిన సత్యం అతనిని ఒకసారి చూడడానికి రాగా ఆ బాలుడు ఒక్కసారి కళ్ళు తెరచి తన ప్రియ మిత్రుణ్ణి తనివితీరా తిలకించి ఆ తరువాత శాశ్వతంగా కన్నుమూశాడు.

అయితే వీరికథ ఇంతటితో ముగియలేదు. కొన్ని సంవత్సరాల తరువాత భగవాన్‌బాబా వారిగురించి ఒక దివ్యోపన్యాసములో ఇలా వెల్లడించారు: "సత్యం సన్నిధిలో ఉండాలనే తీవ్రమైన తపన చేత ఆనాటి రమేష్, సురేష్ తిరిగి 'జాక్' మరియు 'జిల్' అనే పేర్లతో కుక్కపిల్లలుగా పుట్టారు. నిజానికి నేనే వాటికి ఆపేర్లు పెట్టాను. అప్పట్లో నేను పాతమందిరంలో నివసించేవాడిని. ఈ

కుక్కపిల్లలు ఒకటి నాపాదముల వద్ద, రెండవది నాతల వైపున రాత్రి వేళల్లో నిద్రించేవి. అవి ఎప్పుడూ నా వెంటే ఉంటూండేవి. ఒక రోజు మైసూరు మహారాణి నాదర్శనార్థం వచ్చింది. ఆ రోజుల్లో పుట్టపర్తికి రోడ్డు సౌకర్యం ఉండేది కాదు. కర్ణాట నాగేపల్లివద్దనే కారు దిగి ఆమె నడుచుకుంటూ వచ్చింది. ఆ ప్రాంతంలో ఎక్కడా ఆనాడు హోటల్సు ఉండేవి కావు. అందువలన కారు డ్రైవరుకూడా ఆశ్రమానికే వచ్చి భోజనం చేసి వెళ్ళాలి. అప్పటికి చీకటి పడింది. డ్రైవరుకు త్రోవ తెలియదు. దారిలో విద్యుద్దీపాలు లేవు. అరవై సంవత్సరాలకు పూర్వం ఇదొక కుగ్రామం. నేను జాక్‌ని పిలిచి డ్రైవరుకు సహాయంగా వెళ్ళమన్నాను. 'జాక్! నీవు ఈ డ్రైవర్ వెంట వెళ్ళి దారి చూపించు' అని చెప్పాను. జాక్ ముందు నడుస్తూ దారిచూపగా డ్రైవరు దాని వెనుక నడుచుకుంటూ వెళ్ళి కారులో పడుకున్నాడు. ఆరాత్రి బాగా వర్షం కురిసింది. ఈ కుక్క కారుక్రింద టైరుదగ్గర పడుకుంది. డ్రైవరు తెల్లవారుఝామున లేచాడు. అది చలికాలం. రాణీగారు వచ్చేలోగా కారును స్టార్టు చేసి కొంచెం త్రిప్పాలని ముందుకు నడిపాడు. కారు టైరు జాక్ నడుముపైనుండి పోయింది. దాని వెన్నెముక విరిగిపోయింది. ఆ బాధను భరించలేక జాక్ అరుచుకుంటూ మందిరానికి బయలుదేరింది. మధ్యలో చిత్రావతీనది. ఆ ఇసుకలో అది తన శరీరాన్ని ఈడ్చుకుంటూ వస్తున్నది. ఆరోజుల్లో పాతమందిరం గేటుదగ్గర చాకలి సుబ్బన్న ఉండేవాడు. అతడు ఆదుర్దాగా లోపలికి వచ్చి 'స్వామీ! మన జాక్ నడుము విరిగి ఏడ్చుకుంటూ వస్తోంది' అని చెప్పాడు. నేను లోపలి నుండి బయటకు వచ్చాను. అది బాధతో అరుచుకుంటూ వచ్చి నాపాదాలపై పడింది. నన్నే చూస్తూ తన ముందు కాళ్ళను నా చేతులపై పెట్టి ప్రాణాలను విడిచింది. జాక్ పోయిందనే బాధతో జిల్ తిండి మానేసి కొన్ని దినముల తరువాత అది కూడా ప్రాణం విడిచింది. వాటిని పాత మందిరం వెనుకనున్న స్థలంలో సమాధి చేయించి అక్కడొక బృందావనం కట్టించి, తులసీమొక్క పెట్టించాను."

ఈ విధంగా ఆరెండు పుణ్యజీవులు తమ శాశ్వత సంరక్షకుడైన దేవదేవుని పాద పద్మములలో లీనమై ధన్య జీవులయ్యాయి.

రమేష్, సురేష్‌లు శరణాగతి, ప్రేమ మరియు అచంచలమైన విశ్వాసమనే అగ్నిపరీక్షను ఎదుర్కొని భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి దివ్య చరణారవిందములలో లీనము కావడమనే తమ అంతిమ లక్ష్యమును చేరుకోగలిగితే, అవతార పురుషుని తాతగారైన శ్రీ కొండమరాజు తమ అంతిమ క్షణాలలో స్వామి దివ్య హస్తముల నుండి పవిత్ర తీర్థమును సేవించి స్వామిలో ఐక్యమయ్యారు. శ్రీ కొండమరాజు గారు చాలా పవిత్రమైన జీవితం గడిపారని అందరికీ తెలుసు. సాధు సత్పురుషుల జీవిత ఔన్నత్యం వారు మరణించే తీరును బట్టి, అనగా ఈ ప్రపంచమునుండి వారు నిష్క్రమించే పద్ధతిని బట్టి నిర్ణయింపబడుతుందని ప్రతీతి. భగవాన్ బాబావారే స్వయంగా ఒక ఉపన్యాసంలో శ్రీ కొండమరాజుగారి అంతిమ క్షణాలను గురించి చాలా స్పష్టంగా వివరించారు :

"ఈ దేహానికి తాతగారైన కొండమరాజు గొప్పభక్తుడు. ఆయన112 సంవత్సరాలు జీవించాడు. నేను క్రొత్త మందిరం కట్టించిన తరువాతకూడా కొండమరాజు ఉదయం, సాయంత్రం రెండు పూటలా వచ్చి నన్ను దర్శించుకుని వెళ్ళేవాడు.

ఒక పర్యాయం కొండమరాజు 'స్వామీ! నేనింకా ఎంతకాలం వుంటాను? ఎప్పుడీ దేహాన్ని వదులుతాను?' అని అడిగాడు. దానికి నేను 'నీకు మరణంగురించి ఇప్పటినుండి ఆలోచన దేనికి? ఆరోగ్యంగానే వున్నావు కదా! ఆసమయం వచ్చినపుడు నీకే తెలుస్తుందిలే', అని సమాధానం చెప్పాను.

ఆయన మళ్ళీ 'స్వామీ! మీరు సామాన్యమైన బిడ్డ కాదు, సాక్షాత్తూ ఈశ్వరుడే అని నాకు తెలుసు. మమ్మల్ని తరింపజేసే నిమిత్తమై మీరు మా వంశంలో ఉద్భవించారు. నాదొక చిన్న కోరిక ఉన్నది. అలనాడు దశరథుడు రాముని చేతులమీదుగా నీరు త్రాగి ప్రాణం వదలాలని ఆశించాడు. కాని, అతనికి అట్టి ప్రాప్తి లేక పోయింది. జటాయువుకు మాత్రమే అట్టి ప్రాప్తి చిక్కింది. నాకు కూడా అట్టి ప్రాప్తిని అనుగ్రహించవలసిందిగా ప్రార్థిస్తున్నాను. నేను ప్రాణం

వదిలేముందు మీ అమృత హస్తంతో నా నోటిలో నీరు పోయాలి' అన్నాడు. తప్పక అదే విధంగా జరుగుతుందని నేను అతనికి మాట ఇచ్చాను.

ఒకరోజు తెల్లవారుఝామునే మందిరానికి వచ్చి నా దర్శనం చేసుకున్నాడు. ఇంటికి తిరిగి వెళ్ళి పడుకున్నాడు. కొంతసేపైన తరువాత ఈశ్వరమ్మను పిలిచి 'సత్యమ్మ గుడితట్టు స్వామి వస్తున్నారేమో చూడు', అని చెప్పాడు. ఈశ్వరమ్మ బయటకు వచ్చి చూచి 'స్వామి కారులో వస్తున్నారు' అని చెప్పింది. కొండమరాజు 'ఈశ్వరమ్మా! నన్ను తీసుకుపోవడానికి దేవుడొస్తున్నాడు. నాకిచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి వస్తున్నాడు. ఒక గ్లాసులో నీళ్ళు తీసుకురా. అతను నా నోట్లో పోస్తాడు. నేను వెళ్ళిపోతాను' అన్నాడు. ఈ ముసలాయనతో వాదించడమెందుకని ఈశ్వరమ్మ ఆయన కోరినట్లుగా ఒక గ్లాసులో నీరు తీసుకు వచ్చింది. అందులో ఒక తులసీదళం వేయించాడు. స్వామి తనను పంపించేకోసమే వస్తున్నాడని ఆయనకు తెలుసు.

ఆయన టంబ్లరును చేతిలో పట్టుకుని నాకోసం కాచుకున్నాడు. నేను వెడుతూనే 'స్వామి! నేను సిద్ధంగా ఉన్నాను', అన్నాడు. 'నేను కూడా రెడీ' అన్నాను. ఆ నీళ్ళు తీసుకొని ఆయన నోట్లో పోయబోతూంటే' 'వద్దు, వద్దు. ముందు మీరు త్రాగి తరువాత నా నోట్లో పోయాలి' అన్నాడు. అప్పుడు నేను కొంచెం త్రాగి అతని నోట్లో పోశాను. అప్పుడు కొండమరాజు 'స్వామీ! మీ చేతులతో నీరు త్రాగి ప్రాణం వదలడం ఎంత అదృష్టం! ఇంతటి అదృష్టం అందరికీ చిక్కదు. దశరథ మహారాజంతటి వాడికే చిక్కలేదు. కాని నాకు చిక్కింది. నా జన్మ సార్థకమైంది' అని చెప్పి నవ్వుతూ నవ్వుతూ కన్నుమూశాడు.

భగవంతునిలో ఐక్యము చెందాలనే ఆర్తితో తపించే జీవులందరికి తమ జీవిత పరమార్థమైన మోక్షమును ప్రసాదించే మన ప్రభువు మరియు యుగావతారి అయిన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారికి ప్రణమిల్లుతూ ఈ పుస్తకాంశమైన 1980 సంవత్సరము నుండి ప్రారంభమయ్యే ఆ స్వామి దివ్యగాథను ఇక నేను ప్రారంభిస్తాను. అయితే, ఇక్కడ నేను ఒక విషయం

గుర్తు చేసుకోవలసిన అవసరం ఉన్నది. సుప్రసిద్ధ నిగూఢ తత్త్వవేత్త మరియు కవి అయిన ఖలీల్ జిబ్రాన్ చెప్పినట్లుగా

" ఆద్యంతములు లేని ఆ ప్రభువు దివ్యగాథను
వర్ణించడానికి సాహసం చేస్తున్న నన్ను క్షమించండి.
విశ్వవ్యాప్తమైన ఆ దివ్య ప్రేమ గీతము అనంత వాహినిలా
సాగిపోతూనే ఉంటుంది."





3

భూతల స్వర్గము
కాశ్మీరు లోయ సందర్శనము

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు తమ స్వహస్తాలతో తెలుగులో వ్రాసిన ఒక లేఖ 31-1-1984వ తేదీన నాకు అందింది. ప్రశాంతి నిలయం విడిచిపెట్టి స్వామి బయట ప్రాంతములలో పట్టణములు, పల్లెలను సందర్శించడానికి వెళ్ళినపుడు అడుగడుగునా అసంఖ్యాక భక్తజన సందోహము స్వామికి తమ నివాళులర్పించే సమయంలో జలపాతంలా క్రిందకు దుమికే దివిజ గంగా ప్రవాహము వంటి ఆయన దివ్య ప్రేమానందములు ఈ లేఖలో వర్ణింపబడినవి. నిజానికి, స్వామి దివ్య జీవితమే ప్రేమానందముల సుధాప్రపూర్ణ గాథ! అయితే, తమ అవతార కార్యక్రమ నిర్వహణలో భాగంగా సుదూర ప్రాంతాలలో స్వామి పర్యటించే సందర్భాలలో ఆయన యొక్క విశ్వవ్యాప్తమైన దివ్య ప్రేమానందముల వైభవం ఆవిష్కృతమవుతుంది. ఇది, పది రోజుల తమిళనాడు పర్యటన ముగించుకొని బృందావనం చేరిన తరువాత స్వామి వ్రాసిన లేఖ. ఆ లేఖ ఈ విధంగా సాగిపోతుంది :

> నరసింహమూర్తీ! అందుకో ఆశీర్వాదములు. నేను 18వ తేదీ మద్రాసు చేరి అక్కడ అత్యంత వైభవంగా కార్యక్రమములు జరిపించి, 20వ తేదీ చంగల్‌పట్టుకు వెళ్ళి అక్కడ లక్షలాది ప్రజలను ఆనందమున ముంచి వారు చేయుచున్న విలేజీ పనులు తిలకించితిని. వారి భక్తి ప్రపత్తులు వర్ణనాతీతములు. అక్కడినుండి తిరుచి, మధుర, కొడైకెనాల్, దిండిగల్లు, పళని, కోయంబత్తూరు, సేలం, కృష్ణగిరి, ధర్మపురి, ఇత్యాది పట్టణములన్నీ జన సముద్రముగా నిండి సాయి రాకకోసం మైళ్ళ దూరం నిలిచి భజనలతో, నృత్యాలతో

స్వామిరాకకు కాచియుండి, స్వామి ఆయా పట్టణాలు చేరగానే సాయి నామముతో జయజయధ్వనులతో మిన్ను ముట్టినట్లు వాటి మధ్యలో మతాబులు కాల్చటం, వారి ఆనందము అవధులు దాటి తన్మయాత్ములు, ఉన్మత్తులుగా కంటి ధారలు కార్చుచూ, వారు ఉండిన దృశ్యములను చూచిన యెట్టివారికైనను మనస్సు కరుగక పోదు. ఎక్కడకు వెళ్ళినా 4,5 లక్షలకు తక్కువ కాకుండా గుంపులు అనేక పల్లెలనుండి, పట్టణాలనుండి స్పెషల్ బస్సులు, కార్లు, బండ్లు, లారీలు, జటకాలతో చేరి ఉందురు. మద్రాసు రాష్ట్రము 300 గ్రామాలు దత్తత తీసుకొన్నారు. అన్ని గ్రామాలకు వెళ్ళితిని. అందరిని ఆనంద పరచితిని. 30 ఐ క్యాంపులు, 9 లక్షల మందికి ఆపరేషన్. వారందరికీ చీరలు, పంచెలు అయా క్యాంపులో వున్న సమితులవారు ఇచ్చిరి. ఆ దృశ్యము చూడ వలసినదే గాని వ్రాయ వీలుకాదు. స్వామిని బైట ప్రాంతాలలో చూడాలి. ప్రశాంతి నిలయంలో బావిలోని కప్పలవలె వుండి స్వామి సులభంగా లభించుటచేత వారలకు ఆ విలువ తెలియదు. ప్రాణాలపై ఆశలు వదలి సాయి పాదాలపై పడుటకు కోట్లకు పరితపించుచున్నారు. డిసిప్లిను, ఆదర్శవంతంగా వుండినది. భజనలు కర్ణానందం. దృశ్యము కన్నుల పండుగ. హృదయమా? కరిగి, కదిలి ప్రవహించినది. యేర్పాట్లు చాలా అద్భుతము. ఈ విధంగా దిగ్విజయము గావించి నిన్ననే బెంగుళూరు చేరితిని. 5వ తేదీ మన హాస్టల్ వార్షికోత్సవము జరుపుకొనుచున్నామని పిల్లలందరూ ప్రార్థించుటచేత 5వ తేదీ ఆ కార్యక్రమము ముగించుకొని ప్రశాంతి నిలయం వస్తున్నాను. పిల్లలందరికీ ఆశీర్వాదములు.

ఇట్లు

బాబా

ఈ లేఖలో వర్ణింపబడిన అద్భుతమైన దృశ్యములు 1980-85 సంవత్సరాలమధ్య గల ఆరు సంవత్సరాలలో భారతదేశము నలుమూలలా స్వామి జరిపిన పర్యటనలలో అనేకమార్లు అభివ్యక్తమైనాయి. 1980వ సంవత్సరం జూన్ 1వ తేదీ నుండి 18వ తేదీ వరకు స్వామి జరిపిన ఢిల్లీ, కాశ్మీరు లోయల పర్యటన యొక్క అత్యంత మనోహరమైన గాథ ఈ అధ్యాయములో వర్ణింపబడుతుంది.

బృందావనంలో బాలభానుని నునులేత కిరణాలు భక్తులకు వెచ్చని స్పర్శను అందిస్తూ హాయిని గొల్పుతున్న ఒకనాటి ప్రభాత సమయం. ఆ రోజు ఆదివారం. సాయి పరంధాముని దివ్య సన్నిధానము! ముంగిట విద్యార్థుల నిరీక్షణ! స్వామి శుభాగమ సూచకంగా చిరు సందడి! అల్లంత దూరాన సాయిరాం షెడ్డు నుండి మృదుమధురంగా వీనులకు విందు చేస్తున్న భక్తుల భజన గీతాలాపన! ఇంతలో సాయి సుందరులు స్మిత వదనులై మందిరాంతర్భాగమునుండి మెల్లమెల్లగా నడిచి వస్తున్నారు. ఆ క్షణంలో స్వామి కన్నులలో ఒక వింత మెరుపు! చిలిపితనం మేళవించిన తళుకు!

"పరీక్షలు ఎప్పుడు ప్రారంభమవుతున్నాయి?" విద్యార్థులకు ప్రశ్న.

"వచ్చేవారం స్వామీ!" ముక్త కంఠంతో విద్యార్థుల ప్రత్యుత్తరం.

"బాగా చదివి ఫస్టుక్లాసు తెచ్చుకోండి. నేను కాశ్మీరు వెళ్ళబోతున్నాను. ఫస్టుక్లాసు తెచ్చుకున్నవారినే నాతో తీసుకొని వెళ్తాను. ఏర్పాట్లు జరుగుతున్నాయి. అందరం కలసి ఒక ఛార్టర్డు విమానంలో వెళ్తాము", అని చెపుతూ స్వామి మందగమనంతో భక్తులు కూర్చున్న సాయిరాం షెడ్డువైపు బయలుదేరారు. దారికి ఇరువైపులా వినమ్రతతో అంజలి ఘటిస్తూ విద్యార్థులు వరుసగా నిల్చుని ఉన్నారు. స్వామి నడుస్తూ పదేపదే "కాశ్మీర్ - ఫస్ట్‌క్లాస్, ఫస్ట్ క్లాస్ - కాశ్మీర్" అనడం వినిపించింది.

విద్యార్థుల హృదయాలలో స్వామితో కలసి కాశ్మీరు పర్యటనను గురించి ఉత్కంఠతతో కూడిన ఆనందం వెల్లివిరిసింది. భూలోక స్వర్గమైన సుందర

స్వప్నసీమ కాశ్మీరుకు స్వామితో ప్రయాణం! తలుచుకుంటేనే మనస్సు ఆనందంతో ఏదో దివ్య లోకాలలో విహరిస్తుంది!


ఆ రోజు సాయంత్రం స్వామి మళ్ళీ "ఫస్ట్‌క్లాసు వచ్చిన వారినే నాతో కాశ్మీరు తీసికొని వెళ్తాను. మీలో ఎంతమంది వస్తారు?" అని ప్రశ్నించారు. తక్షణమే విద్యార్థులందరూ మేమంటే మేమని చేతులు పైకెత్తారు.

"నిజంగానా?" అని స్వామి కొంచెం వాళ్ళను చిలిపిగా ప్రశ్నించారు. "అవును, స్వామీ!" అంటూ అందరూ ఆనందోత్సాహాలతో గట్టిగా కేక పెట్టారు.

"చూద్దాం! చూద్దాం! నాతో రావాలంటే మీరు మంచి భక్తి, క్రమశిక్షణ అభివృద్ధి పరచుకోవాలి", అని హెచ్చరించారు, బాబా. దీని అర్థం, భగవానునితో కాశ్మీర్ వెళ్ళాలని ఆశించే విద్యార్థులు కేవలము విశ్వవిద్యాలయమువారు నిర్వహించే పరీక్షలో ఫస్ట్ క్లాస్ సాధించడమే కాక స్వామి నిర్వహించే జీవిత పరీక్షలో కూడా ఫస్ట్ క్లాస్ తెచ్చుకోవాలని ఆయన ఆకాంక్ష.


ఇంతలో కొన్ని సంవత్సరాలు గడిచిపోయాయి. కాని, కాశ్మీరు యాత్ర మాత్రం 1980వ సంవత్సరం జూన్ నెల 1వ తేదీ వరకు విద్యార్థులకు ఒక స్వప్నముగానే మిగిలిపోయింది. కొంతమంది విద్యార్థులు అప్పటికి విద్యాభ్యాసం పూర్తి చేసుకుని అక్కడి కళాశాలలో అధ్యాపకులయ్యారు కూడా! ఎట్టకేలకు వారి కల నిజమయ్యే శుభముహూర్తం ఆసన్నమయింది. స్వామి తనతో కాశ్మీరు వచ్చేవారిని లెక్కపెట్టడం మొదలుపెట్టారు. విద్యార్థులతో బాటు కొంతమంది పెద్దలకు కూడా స్వామి ఈ పర్యటనలో అవకాశమిచ్చారు. బాబా "1,2,3....." అని ఒక్కొక్కరిని లెక్కిస్తూ మొత్తం 17 మంది విద్యార్థులను, అధ్యాపకులను ఎంపికచేసి తనతో కలిపి "18 మంది ..... దివ్యమైన సంఖ్య", అని వ్యాఖ్యానించారు.

బృందావనంనుండి బయలుదేరే ముందు బాబా సన్నిధిలో అందరూ సమావేశమయ్యారు. స్వామితో కాశ్మీరు పర్యటనకు ఎంపిక చేయబడిన



Bhagawan Sri Sathya Sai Baba

PHONE NO. 30
PRASANTHI NILAYAM P.O, ANANTPUR DISTRICT, (A.P.) PINCODE: 515134

"1984 జనవరి నెలలో భగవాన్ బాబావారు రచయితకు వ్రాసిన లేఖ"



"బృందావనంలోని మందిర ద్వారమునుండి వెలుపలికి వస్తున్న భగవాన్ - బారులు తీరి నిల్చున్న ఏద్యార్థులు"



"బాగా చదివి ఫస్టుక్లాసు తెచ్చుకోండి"

భాగ్యశాలురైన ఆ బృందములో ఒక విద్యార్థి ఒడలు పులకరించే, అవధులు లేని భావోద్రేకముతో నిండిన ఆ మధుర క్షణాలను వర్ణిస్తూ "స్వామితో కాశ్మీరు పర్యటనకు వెడుతున్నానంటే నన్ను నేనే నమ్మలేకపోయాను. ఈ పర్యటనతో ఎన్ని చిత్ర విచిత్రమైన దృశ్యములు మేము చూడబోతున్నామో, దిగ్భ్రాంతిని కలిగించే ఎటువంటి సృష్టి రహస్యాలను వీక్షించబోతున్నామో, ఎట్టి లీలలు, మహిమలు దర్శించబోతున్నావో, ఎన్ని అద్భుతాలు, వైభవాలు ఆవిష్కరింపబడతాయో అనే ఉత్కంఠభరితమైన ఆలోచనలు మా మనస్సులలో తేలియాడుతున్నాయి", అని తన డైరీలో వ్రాసుకున్నాడు.

భగవాన్ బాబావారిని మరియు ఆయనతో కాశ్మీరు పర్యటనకు ఎంపిక చేయబడిన బృందమును తీసుకువెళ్ళే విమానం తేదీ 1-6-1980న ఉదయం గం॥ 11-45 ని॥లకు బెంగుళూరు విమానాశ్రయమునుండి ఢిల్లీకి బయలుదేరింది. మధ్యలో హైదరాబాదు విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగింది. ఆ సమయాన్ని భక్తజన బాంధవుడైన స్వామి అక్కడ గుమికూడిన అశేష జనావళికి దర్శనం అనుగ్రహించడానికి వినియోగించారు. తామెన్నడూ ఊహించని ఈ మహద్భాగ్యానికి భాగ్యనగరవాసులు ఉప్పొంగిపోయారు. ఆనందం వెల్లి విరిసింది.

విమానం మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని పాలం విమానాశ్రయానికి చేరింది. భగవాన్ బాబా విమానంనుండి బయటకు వస్తూంటే విమానాశ్రయములో వేలాది భక్తులు ఎక్కడ అవకాశం దొరికితే అక్కడ చేరి దిక్కులు పిక్కటిల్లేటట్లు జయ జయ ధ్వానాలు చేశారు. చిరకాలమునుండి భగవాన్ బాబావారికి భక్తుడుగా ఉంటూ ఢిల్లీలోని శ్రీ సత్యసాయి సేవా సమితి అధ్యక్షులుగా సేవలందిస్తున్న శ్రీ సోహన్‌లాల్‌కు గోల్ఫ్‌లింక్స్ ప్రాంతములోని 16వ నంబరు గల తన స్వగృహములో భగవాన్ బాబావారికి, ఆయన వెంటవున్న బృందమునకు ఆతిథ్య మివ్వగలిగే మహద్భాగ్యం లభించింది. నిజానికి, భగవాన్ బాబావారి ఢిల్లీ, కాశ్మీరు పర్యటనకు రూపకల్పన చేసింది ఆయనే! భగవాన్

మరియు ఆయన వెంటనున్న భక్త బృందము ప్రయాణిస్తున్న కార్లు గోల్ఫ్‌లింక్స్ చేరేటప్పటికి, ఆ మార్గమంతా రోడ్డుకిరువైపులా రెండు కిలోమీటర్ల దూరంవరకు వందలాది వాహనాలు నిలిచిపోయాయి. ఎక్కడ చూచినా నేల యీనినట్లు అంగుళం మేర ఖాళీ లేకుండా జనం నిండిపోయారు. వేలాదిమంది స్త్రీ, పురుషులు, పిన్నలు, పెద్దలు, అందరూ కేవలం ఒక్క లిప్తపాటు కాలము అవతార పురుషుని దివ్య దర్శనము చేసుకోవడానికి ఆ మండుటెండలో వేచియున్న ఆ దృశ్యం ఎటువంటివారికైనా దిగ్భ్రాంతిని కలిగించక మానదు. భగవంతుడు తాను భువిపై అవతరించడానికి మళ్ళీ మళ్ళీ భారతదేశమునే ఎందుకు ఎంచుకున్నాడనే సందేహమునకు ఈ అద్భుత దృశ్యమే సరియైన వివరణ ఇస్తుంది. ప్రఖ్యాత ఫ్రెంచి తత్త్వవేత్త మరియు రచయిత అయిన రోమారోలా (Romain Rolland) "అనాది కాలమునుండి మానవులందరి అత్యున్నత స్వప్నములకు నిలయమైన ప్రదేశం ఏదైనా ఈ భువిపై ఉన్నట్లయితే, అది భారతదేశమే"నని ఒక సందర్భంలో వ్యాఖ్యానించారు.

భౌతికవాదము పెచ్చు పెరిగిపోతున్న ఈ ఆధునిక యుగంలో కూడా ఢిల్లీలోని గోల్ఫ్‌లింక్స్‌లో గల 16వ నంబరు గృహ పరిసరాలలో ఆనాటి అద్భుత దృశ్యం దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాలకు, పరంపరాగతమైన మహోన్నత సంస్కృతికి అద్దం పట్టింది. ఆ రోజున, ఆ తరువాత కొన్నిరోజులవరకు కూడా అక్కడ గోచరమైన హృదయాలను కదిలించివేసే అటువంటి దృశ్యాలు భారతదేశమునకు ఆత్మసదృశమైన భక్తిభావము ఎల్లెడలా పొంగి పొరలి వరదలై ప్రవహించిందా, అన్న భావమును కలుగజేశాయి.

ఆ రోజు సాయంత్రం భారత రాజధానిలోని వివిధ వర్గాల ప్రజలు ఆ బంగళా ఆవరణలోను, బయటకూడా ఇసుక వేస్తే రాలనంతగా క్రిక్కిరిసి కూర్చున్నారు. వారంతా యుగావతారి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారికి తమ భక్త్యంజలి సమర్పించి, వారికి తమ బాధలను, సమస్యలను నివేదించుకుని

వారు అందించే సలహాలను, సూచనలను, ఓదార్పును, మానసిక శాంతిని అందుకోవాలనే ఆర్తితో తరలివచ్చారు. ఆ ప్రజా సమూహంలో రాజులు, పేదలు; పండితులు, పామరులు; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములలోని మంత్రులు, పార్లమెంటు సభ్యులు, న్యాయమూర్తులు, దౌత్యవేత్తలు, రాజకీయ నాయకులు, విభిన్న రాజకీయ సిద్ధాంతములకు చెందిన ప్రతినిధులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారస్థులు, విదేశీ ప్రముఖులు – ఇలా సమాజంలోని అన్ని వర్గాలకు చెందిన ప్రజలు ఉన్నారు. బాబా రాచఠీవితో నెమ్మదిగా వారిమధ్య నడయాడుతూ వారిలో ప్రతి ఒక్కరిపైన దివ్య ప్రేమజల్లులు కురిపించారు. ఇంకా, ఆయన మాటలలోనే చెప్పాలంటే "స్తబ్దులుగా ఉన్న దేశ పరిపాలకుల బ్యాటరీలను ఛార్జి చేశారు". అందులో కొంతమందికి అమూల్యమైన తమతో ప్రత్యేక సంభాషణావకాశమును అనుగ్రహించారు. అట్టి వారిలో శ్రీ సంజయ్ గాంధీ కూడా ఉన్నారు. భగవాన్ ఆయనను, ఆయన కుటుంబ సభ్యులను ఆశీర్వదించారు కూడా!

ఆ మరునాడు ఉదయం రాజధానిలోని వివిధ ప్రాంతములు మరియు చుట్టుప్రక్కల పల్లెలు, పట్టణాలనుండి జనం తండోప తండములుగా భగవాన్ దర్శన భాగ్యముకొరకు తరలివచ్చారు. దర్శనానంతరం భగవాన్ బాబావారు హారతి తీసుకుని ఢిల్లీలో నెలకొల్పబోయే శ్రీ సత్యసాయి అంతర్జాతీయ పాఠశాల భవన నిర్మాణానికి అనువైన స్థలమును చూడడానికి వెళ్ళారు. ఆ సమయంలో స్వామి తనతో ఢిల్లీ వచ్చిన బృందమును ఆ మహానగరంలోని దర్శనీయ స్థలాలైన బిర్లామందిరం, ఎర్రకోట, కుతుబ్‌మినార్ మొదలగు ముఖ్యమైన ప్రదేశాలను చూచి రమ్మని పంపించారు. ఆ రోజు సాయంకాలం కూడా దర్శన, భజన కార్యక్రమాలు జరిగినాయి.

ఆ సాయంత్రం భగవాన్ బాబావారితో కాశ్మీరు పర్యటనకు వెళ్ళే బృందములోని సభ్యులకు ఒక్కొక్కరికి ఒక్కొక్క స్వెట్టర్ ఇస్తూ స్వామి "శ్రీనగర్‌లో చలి విపరీతంగా ఉంటుంది. అందువలన మీకందరికి ఉన్ని దుస్తులు అవసరం.

రేపు మనం కాశ్మీర్ వెడుతున్నాం. మీరందరూ తెల్లవారుఝామున తొందరగా నిద్రలేవాలి", అని చెప్పారు. మరునాడు స్వామితోపాటు తాము చేయబోయే కాశ్మీరు ప్రయాణమును ఊహించుకుంటూ చాలామందికి ఆ రాత్రి కంటి మీద కునుకే లేదు. మరునాడు తెల్లవారుఝామున 3-30 గంటలకే స్వామి వారందరూ ఏమేరకు ప్రయాణ సన్నాహాలు చేసుకున్నారో గమనించడానికి వాళ్ళ గదుల్లోకి వెళ్ళారు.

జూన్ నెల 3వ తేదీన భగవాన్ బాబావారు, వారి బృందము ప్రయాణం చేస్తున్న విమానం ఢిల్లీనుండి జమ్మూ విమానాశ్రయంవైపు బయలుదేరింది. దారిలో చండీఘర్ విమానాశ్రయంలో కొద్దిసేపు ఆగింది. అక్కడ మళ్ళీ సూర్యోదయానికి ముందే విమానాశ్రయం చేరిన స్త్రీలు, పురుషులు, పెద్దలు, పిన్నలతో నిండిన అసంఖ్యాకమైన భక్తజన సందోహం భజనలు పాడుతూ భగవాన్ దర్శనం కొరకు వేచియున్నారు. స్వామి ప్రయాణిస్తున్న విమానం వినువీధిలో దృగ్గోచరమవగానే భగవాన్ దర్శనంకొరకు ఆర్తితో వేచియున్న భక్తులందరూ ఒక్క పెట్టున "భగవాన్ శ్రీ సత్యసాయి బాబాజీకి జై!" అని జయజయధ్వానాలు చేశారు. మొదట బాబా విమానం కిటికీనుండి చేతి రుమాలును భక్తులకు ఆశీఃపూర్వకంగా ఊపారు. అయితే గాఢమైన దర్శనార్తితో తహతహలాడుతున్న ఆ అశేష భక్త జనావళికి ఆ సంజ్ఞతో తృప్తి కలుగలేదు. దాంతో భక్తులు మళ్ళీ "దర్శన దో బాబా" అంటే "బాబా మాకు దర్శనం ప్రసాదించండి" అని ఆర్తితో ఎలుగెత్తి మొరపెట్టుకున్నారు. వారి నిస్వార్థ నిర్మల భక్తికి, ప్రపత్తికి మనసు కరిగిన బాబా భక్తుల మొరాలకించి ఆ అరుణోదయవేళ విమానం దిగారు. ఉదయభానుని స్వర్ణ కిరణాలు తమపై ప్రసరిస్తూండగా ప్రేమమూర్తి, భక్త పరాధీనుడు అయిన భగవాన్ బాబా భక్తుల కోరిక తీర్చే నిమిత్తమై నెమ్మదిగా నడిచి వచ్చారు. ఆ సమయంలో భక్తులలో వెల్లివిరిసిన భావావేశం, ఆనంద పారవశ్యం, ఆ పారవశ్యంలో పొంగిపొరలిన ఆనందాశ్రువులు! ఆ దృశ్యం ఏ కవి లేఖినికి అందనిది, వర్ణనాతీతమైనది! అదే సమయంలో విమానాశ్రయ అధికారులనుకూడా భగవాన్ బాబా ప్రేమతో

పలుకరించి ఆశీర్వదించారు. భగవాన్ ఈ విధంగా అశేష భక్త జనావళికి తమ దివ్య దర్శనం ప్రసాదించి విమానంవద్దకు తిరిగి వస్తూండగా అక్కడ చేరిన వారందరి మనస్సులలో స్వామి దర్శనంతో తమ జీవితాలు సార్థకమయ్యాయనే ఆనందం, సంతృప్తి నెలకొన్నాయి. ఆ బృందంలోని వయోవృద్ధులైన స్వామి కారుణ్యానంద ఆ భక్తి పారవశ్య సన్నివేశాన్ని వీక్షించి విచలితులయ్యారు. వారి భక్తి, ప్రపత్తులకు ఆనందబాష్పాలు విడుస్తూ, కరుణామూర్తి అయిన భగవాన్ బాబావారి భక్తవాత్సల్యమును కన్నుల పండుగగా తిలకిస్తూ "దీనిని ఎవరైనా కలియుగమని అనగలరా! ఇది సాక్షాత్తూ సత్యయుగమే!" అని వ్యాఖ్యానించారు.

మహోన్నతమైన హిమాలయ పర్వతశ్రేణులు, అత్యంత శోభాయమానమైన సట్‌లెజ్ నది మరియు భాక్రానంగల్ డామ్‌ల మీద ఎగురుతూ భగవాన్ బాబావారు, వారి బృందము ప్రయాణిస్తున్న విమానము ఉదయం 9-15 గం॥లకు జమ్మూ విమానాశ్రయం చేరింది. భగవాన్ బాబా విమానమునుండి దిగుతూండగా విమానాశ్రయమంతా అక్కడ పెద్ద సంఖ్యలో చేరిన భక్త సమూహము చేసిన "జై సాయిరాం! జై సాయిరాం!" అనే దివ్యనామంతో ప్రతిధ్వనించింది. విమానాశ్రయంలో భగవాన్‌కు, వారి బృందమునకు నార్తరన్ కమాండ్‌యొక్క ఆర్మీ కమాండర్ లెఫ్టినెంట్ జనరల్ ఎస్.పి. మల్హోత్రా స్వాగతం పలికారు. స్వామికి, వారిని అనుసరించిన భక్త బృందమునకు జమ్మూ, కాశ్మీర్‌లలో ఆతిథ్యము సమర్పించే విశేష భాగ్యము జనరల్ మల్హోత్రాకు దక్కింది. ఆయన ఆ బాధ్యతను ఎంతో సమర్థవంతంగా అత్యంత నైపుణ్యంతో నిర్వహించారు.

కల్నల్ బెరీ నడుపుతున్న తెల్లటి బెంజికారులో స్వామి ఆసీనులై యుండగా వారివెంట మిగతా మోటారుకార్లన్నీ ఒకదాని వెనుక ఒకటి ప్రయాణిస్తూ అక్కడికి 10 కిలోమీటర్ల దూరములోనున్న సైనికాధికారుల భోజనశాలకు తరలి వెళ్ళాయి. అక్కడ అప్పటికే వందల సంఖ్యలో సైనిక సిబ్బంది స్వామి దర్శనంకొరకు

వేచియున్నారు. వారిలో చాలామంది అంతకుముందు స్వామిని దర్శించినవారే! స్వామి వారిని గుర్తించి, పలకరించి, ప్రేమతో ఆశీర్వదించగా వారంతా పులకించిపోయారు. వారి ఆనందానికి అవధులు లేవు. అక్కడ ఉదయం ఫలహారం పూర్తయిన తరువాత స్వామి, వారివెంట ఉన్న బృందము ఉద్ధంపూర్‌లో ఉన్న ఆర్మీహెడ్ క్వార్టర్సుకు బయలుదేరారు. దారి పొడుగునా ప్రయాణమంతా వరుసగా ఉన్న బూరుగు, దేవదారు వృక్షాల మధ్య చిన్న చిన్న కొండలు, లోయలమధ్య ఉన్న పల్లెలగుండా నేత్రపర్వమైన ప్రకృతి మధ్య సాగింది. చివరకు అందరూ తారామౌంట్‌వద్ద వున్న జనరల్ మల్హోత్రా నివాస గృహమునకు చేరుకున్నారు. ఆరోజు వారికి బస అక్కడే ఏర్పాటు చేయబడింది. కారు దిగగానే స్వామి ఒకసారి ఆ బంగళా అంతా చుట్టివచ్చి అక్కడి ఏర్పాట్లకు సంతృప్తిని వ్యక్తపరచారు. తరువాత బంగళా చుట్టూ ఉన్న ప్రకృతి రామణీయకత అలరారుతున్న, అత్యంత శోభాయమానంగా ఉన్న ఉద్యానవనంలో స్వామి తన బృందముతో కలసి అక్కడి వృక్ష సంపదను, జంతువులను, పక్షులను ఆనందంతో తిలకిస్తూ కొంతసేపు గడిపారు. ఈ దృశ్యము చూస్తూ ఉంటే ప్రకృతి, పురుషుల అపురూపమైన సమాగమమునకు ఇది ప్రతీకయా అనిపించింది.

ఆరోజు సాయంత్రం ఉద్ధంపూర్‌లోని ఆర్మీ జింఖానాక్లబ్‌లో బహిరంగ సభ ఏర్పాటు చేయబడింది. ఆ క్లబ్ ఆవరణలోని పచ్చికమైదానంలో పట్టణవాసులందరూ వచ్చి చేరారు. అక్కడి ఆరుబయలు రంగస్థలం మహోన్నతమైన పర్వతాల మధ్య ఉండడం చేత, అది ఒక గిన్నె ఆకారంలో చూపరులకు గోచరించింది. సభా ప్రారంభానికి ముందు జనరల్ మల్హోత్రా భగవాన్‌కు వినమ్రులై స్వాగతం పలుకుతూ సాక్షాత్తూ పరమాత్ముని సాన్నిధ్యమును పొందగలిగిన ఆ పట్టణవాసుల అదృష్టమును కొనియాడారు. తరువాత స్వామి తమ దివ్యోపన్యాసమును ప్రారంభించగానే ఆ దివ్యవాణి ఆ చల్లని మలయమారుతంలో మిళితమై అక్కడ చేరిన ప్రతి ఒక్కరి హృదయములోను సూటిగా హత్తుకున్నది. ఆ సభకు హాజరయిన వారిలో అధిక సంఖ్యాకులు

సైన్యమునకు చెందినవారు కావడంచేత, వారు భగవంతునియందు తమకు గల ప్రేమను, భక్తిని నిత్యజీవితంలో నీతి, నిజాయితీలు మరియు క్షమ మొదలగు సద్గుణములుగా మార్చుకుని మహోన్నతమైన మాతృభూమి సేవకు అంకితం కావాలని భగవాన్ బాబా వారికి పిలుపునిచ్చారు. తమ ప్రసంగం చివరలో భగవాన్ కొన్ని భజనలను పాడి సైనికులను, అధికారులను తన్మయులను చేశారు.


అక్కడినుండి తారామౌంటుకు తిరిగి వచ్చిన తరువాత స్వామి జనరల్ మల్హోత్రా బంగళా అంతా తిరిగి వారి పూజగదిలో కొద్దిసేపు గడిపారు. తరువాత ఆయనతో కలిసి విశాలమైన తోటలోని పచ్చికపై అటూ, ఇటూ పచార్లు చేశారు. ఆ ప్రశాంత గంభీర రమణీయ ప్రదేశం స్వర్గాన్ని తలపించేదిగా ఉంది. జనరల్ మల్హోత్రా అభ్యర్థనను మన్నించి స్వామి అక్కడ చేరిన తీవ్ర శారీరక, మానసిక రుగ్మతలతో బాధపడుతున్న కొందరిని పలకరించి ఆశీర్వదించారు. ఆ ఒక్కరోజులోనే న్యూఢిల్లీ, చండీఘర్, జమ్మూ, ఉద్ధంపూర్ మరియు ఆ చుట్టుప్రక్కల పల్లెలలో నివసించే వేలాదిమందికి భగవాన్ బాబా తమ దివ్యాశీస్సులను, మనశ్శాంతిని, ఓదార్పును అనుగ్రహించారు.

4వ తేదీ బుధవారం ఉదయం భగవాన్ బాబా మరియు బృందావనంనుండి వారి వెంట వచ్చిన బృందము జమ్మూ-శ్రీనగర్ రహదారిపై ప్రయాణం చేస్తూ కాశ్మీరువైపు ప్రయాణం కొనసాగించారు. కాశ్మీర్‌లోని ప్రకృతి సోయగాలకు ముగ్ధుడైన మొగలాయి చక్రవర్తి ఆ అందచందాలను తలుచుకుంటూ భావోద్వేగంతో "నిత్య వసంతముతో అలరారే ఉద్యానవనాలు, పచ్చిక మైదానాలు, మనోహరమైన గలగలపారే సెలయేళ్ళతో నయనాభిరామమైన కాశ్మీరులోయ ప్రకృతి సౌందర్యం వర్ణనాతీతం" అని వ్యాఖ్యానించాడు.


భగవాన్ బాబా, వారిని అనుసరించి వస్తున్న బృందం ప్రయాణిస్తున్న వాహనాలు దారిలో సముద్రమట్టమునకు ఎనిమిది వేల అడుగుల ఎత్తున పేట్నీటాప్ అనే పేరుగల ఒక రమణీయమైన పచ్చిక మైదానంలో కొంతసేపు ఆగాయి. తరువాత మళ్లీ ప్రయాణం మొదలుపెట్టగానే భగవాన్ తమ వెంట

పర్యటనలో పాల్గొన్న భాగ్యశాలురతో కొంచెంసేపు గడపాలని భావించి వారు ప్రయాణిస్తున్న బస్సులోనికి ఎక్కారు. బస్సులో అటూ ఇటూ నడుస్తూ అందులో ఉన్న ప్రతి ఒక్కరిని ప్రేమగా పలుకరించారు. ఇంతలోనే ప్రకృతి సౌందర్యమునందు బాబాకు గల మక్కువ మరొక్కసారి అభివ్యక్తమైంది. స్వామి బస్సులో ప్రయాణిస్తున్న వారికి, అడుగడుగునా గోచరించే కాశ్మీరులోయ ప్రకృతి సౌందర్యమును వర్ణించి చెపుతూ "అదిగో చూడండి! దూరంగా అక్కడ వెండికొండ శిఖరం! ఇదిగో ఈ వైపు చూడండి, గలగలపారే సెలయేరు! అదిగదిగో స్వేచ్ఛగా ఎగిరే విహంగాలు!" అంటూ మొత్తం ప్రయాణమంతా ఆనందోత్సాహాలతో పండుగ సంబరంలా సాగిపోయేలా చేశారు. ఈ విధంగా స్వామి ఎక్కిన బస్సు ముందు దారి తీయగా, కారు దానిని అనుసరించింది.


వాహనాలు బనిహాల్ సొరంగమార్గమునుండి బయటకు వచ్చేటప్పటికి ఊపిరి పీల్చడంకూడా మరచిపోయేటట్లు చేసే కనుచూపు మేరవరకు పరచుకున్న అద్భుత మాయాజాలమువంటి కాశ్మీరులోయయొక్క మనోహర సౌందర్యం దర్శనమిచ్చింది. మొఘల్ చక్రవర్తులు యీ లోయను భూలోకస్వర్గమని ఎందుకు అభివర్ణించారో తెలుసుకోవాలంటే కవి హృదయమే అవసరం లేదు. కాశ్మీరులోయ అంతా పచ్చని వరిపైరు పొలాలతో, మధ్య మధ్యన ఆకాశాన్నంటే ఎత్తైన బూరుగు, దేవదారు వృక్షాలతో, అక్కడక్కడా మధుర ఫలభరితమైన ఏపిల్, కిస్‌మిస్ మరియు బాదం చెట్లతో అత్యంత మనోహరంగా గోచరించింది. చుట్టూ ఎత్తైన పర్వతశ్రేణులతో, గలగల పారే సెలయేరులతో లోయ అంతా ప్రకృతి సౌందర్యము ఉట్టిపడే అద్భుత దృశ్యంగా గోచరించింది. మధ్యాహ్నమయ్యేటప్పటికి ఆ బృందంలోని వారందరూ హిందూకుష్ పర్వత శ్రేణులమధ్యనున్న వెరినాగ్ అనే ఒక చిన్న పల్లె చేరుకున్నారు. అక్కడినుండే జీలం నది అనేక వందలమైళ్ళు సాగే తన సాగర సంగమయాత్రను ప్రారంభిస్తుంది. అక్కడ భగవాన్ బాబావారి ఆగమనంకొరకు వందలాది భక్తులు ఉదయంనుండి ఎదురు చూస్తున్నారు. చివరకు స్వామి అక్కడకు చేరుకుని బస్సు దిగగానే వారందరు ముక్తకంఠంతో దిక్కులు పిక్కటిల్లేటట్లు




"సత్య, శివ, సుందర స్వరూపులు భగవాన్ బాబా"



"డచ్చిగామ్ సైకతస్థలిలో దివ్యసృష్టి"



"స్ఫటిక లింగము"



"లక్ష్మీ సమేత శ్రీ బదరీనారాయణస్వామి చిత్ర
గల బంగారు పళ్ళెము"

జయజయధ్వానాలు చేస్తూ వివిధ వర్ణముల గులాబీ మాలలతో స్వామికి స్వాగతం చెప్పారు. బాబా ఆ భక్తులందరి దగ్గరకు వెళ్ళి వారిని ఆశీర్వదించారు. అక్కడి భక్తులు స్వామికి, ఆయన వెంట వచ్చిన వారందరికి అత్యంత భక్తి, శ్రద్ధలతో మంచి రుచికరమైన వంటకాలతో విందు భోజనం ఏర్పాటు చేశారు. భోజనం అయిన తరువాత స్వామి మళ్ళీ శ్రీనగర్‌వైపు ప్రయాణం కొనసాగించారు.

సాయంత్రం 4 గంటలు దాటిన కొద్ది నిమిషాలకు అందరూ శ్రీనగర్ చేరుకున్నారు. అక్కడ ఆర్మీ కమాండర్ నివాసమైన 'ప్రసాద్ విల్లా' స్వామికి స్వాగతం పలికేందుకు అత్యంత శోభాయమానంగా సింగారించుకుని ఎదురు చూస్తున్నది. స్వామి ఆ భవన ప్రాంగణములో ప్రవేశిస్తూండగా అక్కడ ఏర్పాటు చేయబడిన ఒక పెద్ద పందిరిలో ఆసీనులై వందలాది భక్తులు అమితోత్సాహంతో ఆలపిస్తున్న భజనలు వినవచ్చాయి. జనరల్ మల్హోత్రా భార్య శ్రీమతి ప్రేమ మల్హోత్రా స్వామికి భక్తిప్రపత్తులతో సాంప్రదాయికంగా పూలమాల అర్పించి, హారతి ఇచ్చి విల్లాలోనికి ఆహ్వానించారు. స్వామి లోపలికి వెళ్ళిన కొద్ది నిమిషాలలోనే బయటకు వచ్చి అక్కడి పచ్చికబయలుపై నిలబడి చుట్టూ పరికిస్తూ ఆ ప్రశాంత గంభీర పవిత్ర వాతావరణమును ప్రశంసించారు. అక్కడికి దగ్గరలోనే ఉన్న కొండపైన శ్రీ ఆదిశంకరాచార్యులవారు నెలకొల్పిన దేవాలయం స్పష్టంగా కనపడుతుంది. చాలా శతాబ్దాలకు పూర్వం కేరళ రాష్ట్రమునకు చెందిన ఆ మహోన్నత అద్వైతమత స్థాపనాచార్యులవారు అక్కడికి విచ్చేసి ఆ ప్రాంతమును పావనం చేశారు. భగవాన్ బాబా భక్తి పారవశ్యంతో నిలువెల్లా పులకించిన ఆ అశేష భక్తజన సందోహమును సమీపించి వారికి తమ దివ్యాశీస్సులను అందించారు.

ఆరోజు సాయంత్రం స్వామివెంట ఉన్న బృందములోని కొందరు పెద్దలు ఆ నగరములో చాలా ప్రసిద్ధి చెందిన షాలిమార్ గార్డెన్స్ ఉద్యానవనమును దర్శించవలసిందని భగవాన్ బాబావారిని ప్రార్థించారు. బాబా వారి అభ్యర్థనను నిరాకరిస్తూ "ఆ ఉద్యానవనం స్వతస్సిద్ధముగా ఏర్పడిన నీటి ఊటలతో, అందమైన సరస్సులతో చాలా చక్కగా నిర్వహింపబడుతున్నది. నేను అక్కడికి

వచ్చినట్లయితే జనం విపరీతంగా చేరతారు. అంతమంది జన సందోహం అక్కడ చేరితే ఆ ఉద్యానవనమంతా పాడైపోతుంది", అని చెప్పారు. కాని, విద్యార్థులు, పెద్దలు స్వామి రావాలని పట్టుబట్టారు. స్వామి ఆగమన వార్త అంత తొందరగా పట్టణం అంతా వ్యాప్తి చెంది ఉండదని వారి ఊహ. ఎట్టకేలకు వారి ప్రార్థనను మన్నించి స్వామి షాలిమార్ బాగ్‌ను సందర్శించడానికి అంగీకరించారు. ఆ మరునాడు ప్రత్యూష పవనాంకురములు పైకొనువేళ ఇంకా పట్టణంలో జనం మేల్కొనక పూర్వమే అక్కడికి చేరుకుంటే అప్పటికి జనం పెద్ద సంఖ్యలో అక్కడికి రాలేరని, వారిని తప్పించుకోవచ్చని విద్యార్థుల ఆశ.

మరునాడు ఉదయం 7 గంటలకు స్వామి, ఆయన వెంట విద్యార్థి బృందం ఉద్యానవనం గేటు దగ్గరకు చేరుకున్నారు. నిజానికి, ఆ సమయంలో తోటలో ఎక్కువ జన సంచారం లేదు. భగవాన్ బాబావారు ఉద్యానవనంలోకి ప్రవేశిస్తూండగానే అక్కడి కాపలాదారు దగ్గరలో ఉన్న ఒక గులాబీ పొదనుండి కొన్ని గులాబీ పువ్వులను హడావుడిగా కోసి ఆ తొందరలో ముళ్ళు గ్రుచ్చుకుని బాధగా ఉన్నా లెక్క చేయక పరుగెత్తుకుని భగవాన్ బాబావారి వద్దకు వెళ్ళి ఆయనకు సమర్పించి, ఆయన పాదాలపై వ్రాలిపోయాడు. తరువాత ఆ బృందసభ్యులు కొంచెం ముందుకు సాగారు. ఇంతలో వారి కెదురుగా కొంచెం అధునాతన పద్ధతిలో కనపడే ఇరువురు యువకులు రాసాగారు. వారి వేషభాషలు, తీరుతెన్నులు చూచి విద్యార్థులకు కొద్దిగా జంకు కలిగింది. అయితే, వారు బాబాను చూస్తూనే ముందుకు పరుగెత్తుకుని వచ్చి బాబా పాదాలపై వ్రాలిపోయారు. ఇంతలో అకస్మాత్తుగా వెనుకనుండి జయజయ నినాదాలు మారుమ్రోగాయి. పెద్ద సంచలనం రేగింది. హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనకు దిగ్భ్రాంతి చెందిన పెద్దలు, విద్యార్థులు వెనుదిరిగి చూచారు. అంతా గందర గోళంగా ఉంది. వందలాదిమంది మూసిన గేట్లు దూకి తోటలో ప్రవేశించడం చూసి వారు గాభరాపడిపోయారు. ఆ తోటలో పెంచబడుతున్న అందమైన పూల మొక్కలు, అక్కడక్కడా ఉండే బురద, ముళ్ళ పొదలు – ఇవేవీ

ఏమాత్రం పట్టించుకోకుండా ఆ జనం ఒక్కసారి మూకుమ్మడిగా గులాబీ పువ్వులను కోసి స్వామికి సమర్పించాలని పిచ్చిగా పరుగులు పెట్టారు. ఎలాగో అలాగ గులాబీ పువ్వులు కొన్ని చేజిక్కించుకోగలిగిన కొందరు వాటిని స్వామికి సమర్పించాలని ఆయనవైపు పరుగెట్టారు. అప్పుడు స్వామి విద్యార్థులవైపు భావగర్భితంగా ఒక చూపు చూసి "నేను నిన్ననే మీకు చెప్పాను. మీరు నా మాట వినలేదు. ఇప్పుడు చూడండి; ఈ తోట పాడయితే దీనికి కారణం సాయిబాబాయే అని అందరూ అంటారు" అని చెప్పి వాళ్ళను తోట చూసి రమ్మని తాను మాత్రం తక్షణమే ప్రసాద్ విల్లాకు వెళ్ళిపోయారు. బృందంలోని వారంతా స్వామి మాటలను విననందుకు పర్యవసానంగా జరిగినదానికి చింతిస్తూ తాము చేసిన పొరపాటును గ్రహించారు. భగవాన్ బాబావారి అతిలోక అద్భుత ఆకర్షణ శక్తిని అంతవరకు తాము గుర్తించలేకపోయినందుకు చాలా బాధపడ్డారు. ఆ రోజు, ఆ తరువాత కూడా అనేక సందర్భాలలో భగవాన్ బాబావారి మహత్తర శక్తిని వారు ప్రత్యక్షంగా దర్శించగలిగారు.

శ్రీనగర్‌లోని శ్రీ సత్యసాయి సేవాసమితి మహిళా విభాగ్, సేవాదళ్, బాలవికాస్ విభాగములతో చాలా చురుకుగా సేవలందిస్తున్నది. నగరంలోని చాలా ప్రాంతాలలో క్రమం తప్పకుండా భజనలు జరుగుతాయి. ఆసుపత్రులలో, స్కూళ్ళలో, జైళ్ళలో సమితి సభ్యులు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. మానవులందరూ ఒకే తల్లి బిడ్డలమనే సోదరభావంతో అన్ని మతములవారు శ్రీ సత్యసాయి సేవా సమితి కార్యకలాపాలలో పాల్గొంటారు.

1980వ సంవత్సరం జూన్ నెల 4వ తేదీన వారు దైవ పితృత్వమును ప్రత్యక్షంగా అనుభవించారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబా శ్రీనగర్‌కు విచ్చేసారనే వార్త నగరమంతా పాకిన తరువాత, భగవాన్ దర్శనార్థం ప్రసాద్ విల్లాకు వచ్చే జనుల సంఖ్య అధికమైంది. హిందువులు, ముస్లిములు, క్రైస్తవులు, ఇలా ఎట్టి మతభేదం లేకుండా వేలాదిమంది ఆ 'నడయాడే దైవము'ను దర్శించుకోవడానికి 'ప్రసాద్ విల్లా' అనే ఆ మందిరానికి తండోపతండాలుగా

రాసాగారు. వారిలో విదేశీయులుకూడా చాలామంది ఉన్నారు. ప్రేమస్వరూపులైన భగవాన్ బాబావారు నివాసముంటున్న ఆ మందిరానికి వెళ్ళే దారులన్నీ జనంతో క్రిక్కిరిసిపోయాయి. ఎక్కడ చూసినా జనం ఒకరినొకరు త్రోసుకుంటూ నెట్టుకుంటూ ఆ కాషాయాంబరధారిని ఒక్క లిప్తపాటు కాలమైనా దర్శించుకోవాలని తపించారు. భగవాన్ బాబావారు కూడా వారిని ఏమాత్రము నిరాశపరచలేదు.

ఆ సన్నివేశాన్ని కళ్ళారా చూడగలిగిన భాగ్యశాలురలో ఒక యువ అధ్యాపకుడు హృదయాలను కదిలించే ఆ దృశ్యాలను "భగవాన్ రోగులకు స్వస్థత చేకూరుస్తూ, కష్టాలలో ఉన్నవారిని ఓదారుస్తూ, దుఃఖముతో విలపించేవారికి ఉపశమనం కలిగిస్తూ ప్రతి ఒక్కరి హృదయఫలకముపై తమ దివ్యత్వ ముద్ర శాశ్వతంగా నిలచిపోయేటట్లు చెరగని ముద్రవేస్తూ వారందరి మధ్య తిరిగారు", అని వర్ణించాడు. ఇంతకు పూర్వంకూడా ఎన్నో పర్యాయములు జనం వెల్లువలా త్రోసుకువచ్చే సన్నివేశాలను మనం చూచి ఉండవచ్చును. అయితే, ఈ సన్నివేశము అటువంటిది కాదు. భగవాన్ బాబావారి కాషాయాంబరపు అంచు కన్పిస్తే చాలు, జనం ఆనందపారవశ్యంతో ఏడ్చేశారు. వారిలో చాలామంది తమను ఆశీర్వదించుమని స్వామిని ప్రార్థిస్తూ భావావేశం పట్టలేక బిగ్గరగా ఏడ్చారు. ఇంకా కొందరు తమ అంతరంగములో వినిపించిన భగవానుని పిలుపును తట్టుకొనలేక, జనాన్ని అదుపుచేయడానికి అక్కడ ఏర్పాటు చేయబడిన అడ్డుకట్టలను ఛేదించుకుని స్వామి పాదాలచెంత వ్రాలి తమ కష్టాలను, బాధలను ఆయనకు నివేదించుకుని స్వామివారినుండి అనుగ్రహ, ఆశీస్సులను, విభూతిని పొందారు. 'భగవంతుడు తమ నగరమునకు విచ్చేసాడు' అనే ఒక్క మాట ఆఘమేఘాల మీద సర్వత్ర వ్యాపించింది. అంతే! మొత్తం నగరానికి నగరమే నిత్యసత్యమైన దివ్యత్వ శోభతో జ్వాజ్వల్యమానంగా వెలిగిపోయింది.

భగవాన్ బాబావారిని దర్శించుకోవాలని వచ్చే జన ప్రవాహానికి అంతులేకుండా పోయింది. ఆ సందర్శకులలో సైన్యంలోని అధికారులు, జవాన్లు,

వ్యాపారస్థులు, ప్రభుత్వోద్యోగులు, పల్లెవాసులు, ఆశ్రమాలలో నివసించే ఋషులు, పరివ్రాజకులు, రోగగ్రస్తులు, వ్యధాభరితులు – ఇలా సమాజంలో వివిధ వర్గాలకు చెందినవారు స్వామి ఎక్కడికి వెళ్ళితే అక్కడకు ఆయనను అనుసరించేవారు. జమ్మూ కాశ్మీర్ రాష్ట్ర పరిపాలకులు కూడా ఈ మహాప్రస్థానంలో వెనుకబడలేదు. రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ షేక్ అబ్దుల్లా జూన్‌లో స్వామిని దర్శించుకుని తమ రాష్ట్రమును సందర్శించ వచ్చిన ఆ దివ్య అతిథికి తమ వినమ్రాంజలిని అర్పించారు. ఆ తరువాత రెండు రోజులు వరుసగా తన కుటుంబ సభ్యులతో, మంత్రివర్గ సభ్యులతో విచ్చేసి భగవాన్ బాబావారి అనుగ్రహ, ఆశీస్సులను పొందారు. చివరగా, జూన్ 10వ తేదీన జమ్మూ, కాశ్మీర్ రాష్ట్ర గవర్నర్ గౌరవనీయులు శ్రీ యల్.కె. ఝా సతీ సమేతంగా విచ్చేసి స్వామికి ప్రణామము లర్పించారు.

తేదీ 4-6-1980 నుండి తేదీ 14-6-1980 వరకు భగవాన్ బాబావారు జరిపిన పర్యటన అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకున్నది. కేవలం బాబా ఉనికితోనే కాశ్మీరు లోయ అంతా అణువణువునా సుఖశాంతులు వెల్లివిరిసాయి. భగవాన్ బాబావారి వెంట ఆ పర్యటనలో పాల్గొన్న భాగ్యశాలుర జీవితాలలో ఆ పది రోజులు ఎంతో ప్రత్యేకమైనవి మరియు అమూల్యమైనవి. స్వామియొక్క ప్రేమానురాగాలను విశేషంగా పొందడంతోబాటు, స్వామి చేసే ఎన్నో అద్భుతాలను, లీలలను ప్రత్యక్షంగా వీక్షించడానికి వారికి ఒక అరుదైన అవకాశం లభించింది. ఆ సమయంలో వారు స్వామియొక్క దివ్యత్వమును పరిపూర్ణంగా అనుభవించగలిగారు. ఈ సందర్భంగా ఆ బృందములోని ఒక యువ అధ్యాపకుడు వర్ణించిన ఆ దివ్యానుభూతిని మనం కూడా పంచుకుందాం :

"ఆ పదిహేను రోజుల కాశ్మీరు పర్యటనలో ప్రకృతి మరియు పంచభూతములపై భగవాన్ బాబావారి ఆధిపత్యమునకు సంకేతములైన ఎన్నో అద్భుతాలు, లీలలు, మహిమలు మరియు ఆయన దివ్య హస్తముతో సృష్టించిన ఎన్నో వస్తువులను చూచి తరించే సుకృతం కలిగింది. భగవాన్ తమ దివ్య

ప్రేమానుగ్రహ సూచకంగా ఎందరో భక్తులకు ఎన్నో వస్తువులను సృష్టించి ప్రసాదించారు. ఆ సంఘటనలలో కొన్ని అద్వితీయమైనవి. అవి, అలనాడు చిత్రావతీ నదీ సైకతాలలో స్వామి ప్రదర్శించిన కొన్ని అద్భుత లీలలను స్మరణకు తెచ్చాయి. అపురూపమైన అట్టి లీలలలో మొట్టమొదటిది అత్యంత రమణీయమైన విశ్రాంతి ప్రదేశమగు దచిగామ్‌లో జరిగింది. ఆ ప్రాంతమంతా ఆధ్యాత్మికపరమైన ప్రశాంత గంభీర నిశ్శబ్ద వాతావరణం నెలకొని ఉంది. సాక్షాత్తూ సృష్టికర్తయే తన దివ్య కళాకౌశలమునకు ప్రతీకయైన ప్రకృతి సౌందర్యము విరాజిల్లే ఆ అద్భుత సృష్టి మధ్య నిలుచున్నప్పుడు, ప్రకృతి, పురుషుల సౌందర్యహేలను వర్ణిస్తూ ప్రఖ్యాత ఆంగ్ల కవి జాన్ కీట్స్ "సుందరమే సత్యము, సత్యమే సుందరము; ఈ భువిపైన తెలుసుకోగలిగినది, తెలుసుకోవలసినది ఇంతే!" అని చెప్పిన మాటలు యథార్థమేననిపిస్తుంది. ఏమా అనిర్వచనీయ ఆనందం! ఏమా వర్ణనాతీతమైన సంతోషము! ప్రకృతియే మౌనంగా పరమాత్మను కీర్తిస్తూ స్తుతి గీతాలను ఆలపించిందేమో ననిపించింది. పుష్పాలు కొద్దికాలమైనా ఆయన సామీప్యమును పొందాలని తహతహలాడాయేమో ననిపించింది. జీవకోటి అంతా ఆ దివ్యానందానుభూతిలో తాదాత్మ్యము చెందాయేమోననిపించింది. దైవమే సుందరము; సుందరమే దైవము – అదే సత్యం శివం సుందరం. ప్రత్యక్షం, పరోక్షం, బింబం, ప్రతిబింబం ఏకమై ఒక సుందరాకృతి దాల్చినట్లు గోచరించింది. విశ్వాత్మనుండి వేరయిన శకలాలు తమ అస్థిత్వాన్ని కోల్పోయి తిరిగి ఆ పరమాత్మలో ఐక్యమైనట్లు అనుభూతి కలిగింది....."

ఇంతలో స్వామి "ఈ దగ్గరలో ఎక్కడైనా ఇసుక ఉన్నదా?" అని అడిగారు.

"ఉన్నది స్వామీ! ఈ దగ్గరలోనే ఒక సెలయేరు ఉన్నది. అక్కడ కొద్దిగా ఇసుక ఉన్నది" అన్నారు, ఎవరో!

"అయితే రండి! అక్కడికి వెళ్దాం" అని స్వామి అందరినీ ఆ సెలయేటి దగ్గరకు తీసికొని వెళ్ళారు.

ప్రతి ఒక్కరిలో ఉత్కంఠత! "పచ్చని పరిసరాలతో ఇక్కడ ప్రకృతి అంతా నిండి ఉంటే, ఇంత హఠాత్తుగా ఇసుక ప్రదేశానికి వెళ్ళడం దేనికి?" అని అందరిలో ఒకే ఆలోచన! సరే! ఏమైతేనేం, అందరూ స్వామివెంట వెళ్ళి సెలయేరు ఒడ్డున ఇసుకపై కూర్చున్నారు. ప్రతి ఒక్కరి మనసులోను 'ఇక్కడేమి జరుగనున్నది?' అనే ఆత్రుతయే! ఇంతలో సూర్యుడు భగవానుని ముందు వినమ్రుడై నిలిచి, ఆయన చుట్టూ వలయాకారంలో సమావేశమైన మా మధ్యనుండి స్వామి యొక్క కిరీటమువంటి కేశరాశిపై తన కాంతి కిరణాలను ప్రసరింపజేశాడు. ప్రకాశవంతమైన ఆ సూర్యకాంతిలో స్వామి చుట్టూ దేదీప్యమానమైన ఒక దివ్య తేజోవలయం గోచరించింది. అందరూ చుట్టూ చేరి స్థిమితంగా కూర్చున్న తరువాత భగవాన్ బాబా తన వ్రేలితో ఇసుకలో ఏవో గీతలు గీయసాగారు. స్వామి సాధారణంగా ఏదైనా వస్తువును సృష్టించేటప్పుడు హస్త చాలనంతో సృష్టిస్తారు. కాని, ఇప్పుడు ఇసుక మీద ఒక నమూనా ప్రకారం గీతలు గీయసాగారు. ఆ విధంగా రేఖా చిత్రం గీయడం పూర్తయిన తరువాత స్వామి ఇసుకలోనికి తమ రిక్త హస్తములను చొప్పించి అక్కడి నుండి ఏదో త్రవ్వి తీస్తున్నట్లు చేయి దులుపుకుని 4"×4" వైశాల్యముగల ఒక బంగారు పళ్ళెమును పైకి తీశారు. ఆ పళ్ళెముపై లక్ష్మీ సమేత శ్రీ బదరీ నారాయణుని రూపం చెక్కబడి ఉన్నది. తరువాత "అందరికీ చూపండి" అంటూ ఆ సృష్టితో తనకేమీ సంబంధం లేనట్లు, అసలేమీ జరుగనట్లు బాబా చిద్విలాసంగా కూర్చున్నారు. ఆ అద్భుత సృష్టిని తిలకించిన మేమందరం తన్మయత్వంలో మునిగాము. మాలో కొందరు కెమెరాలు క్లిక్ చేశారు. మరి కొందరు స్వామి దివ్య వైభవాన్ని కీర్తించారు. ఆ అద్భుత సృష్టిని స్పృశిస్తూ కొందరు, ఆరాధనా భావంతో కొందరు, ఆ దివ్యానుభూతిని హృదయంలో పదిల పరచుకుంటూ మరి కొందరు, ఇంకా దిగ్భ్రాంతి చెందిన కొందరు – ఇలా అనేక హావభావాలు మిళితమైన ఆ సన్నివేశము ఒక విభిన్న దృశ్యమాలికగా మాలో చాలామందికి గోచరించింది. ఇలాంటి అద్భుత సృష్టిని వీక్షించడం యిదే ప్రథమం. అయితే, ఆ దివ్యానుభూతి ఇంతటితోనే ముగిసిపోలేదు.

ఇంతలో స్వామి "ఎవరి దగ్గరైనా పెన్ను వుందా?" అన్నారు. దగ్గరలో కూర్చున్న ఒకరు వెంటనే బాబాకు పెన్ను అందించారు. ఆయన పెన్నును తన చేతుల్లోనికి తీసుకుని దానితో ఇసుకలో ఏదో గుండ్రంగా గీసి, ఒకటి రెండు చోట్ల పెన్నుతో స్పృశించి, తన కోమల హస్తాలను మళ్ళీ ఇసుకలోనికి దూర్చారు.

స్వామి మళ్ళీ ఏమి సృష్టించబోతున్నారు? అవధులు లేని ఉత్కంఠతతో మా గుండె కొట్టుకోవడం మానేసింది. ప్రతి ఒక్కరు మెడలు నిక్కించి చూడసాగారు. కొద్ది క్షణాలలోనే ఆవిష్కరింపబడే ఆ అద్భుత సృష్టిని చిత్రీకరించడానికి కెమెరాలు రెడీగా ఉన్నాయి. మేమందరం విస్ఫారిత నేత్రాలతో జరుగబోయే అద్భుతం కొరకు నిరీక్షిస్తున్నాము. ఇంతలో మేమందరం చూస్తూండగానే రెండంగుళముల పరిమాణము గల స్ఫటిక లింగము ఒకటి స్వామి దివ్యహస్తాలలో ప్రత్యక్షమైంది. స్వామి ఆ లింగమును చేతిలో ఎత్తి పట్టుకుని సూర్యుని వెలుతురుకు అభిముఖంగా పెట్టి అందరికి చూపించారు. అద్భుతమైన ఆ దివ్య స్ఫటిక లింగమును తిలకించిన ఆనందంలో ఎవ్వరికీ నోట మాటలు రావడం లేదు. కొద్ది క్షణాల తరువాత భగవాన్ బాబావారే అది "శ్రీ ఆదిశంకరుల వారిచే అమరనాథ్ గుహలోని హిమలింగముక్రింద ప్రతిష్ఠింపబడిన స్ఫటిక లింగము" అని వివరించారు.

మరొక సందర్భంలో పహల్‌గాం సమీపమున ఒక గొల్లపల్లె దగ్గర లిద్దర్ నదీ తీరములో మేమందరం కూర్చొని ఉండగా, భగవాన్ బాబా శ్రీ ఆదిశంకరాచార్యులవారు మరియు ఆయన స్థాపించిన పీఠములను గురించి మాట్లాడుతూ శ్రీ శంకరాచార్యులవారు చిదంబరంలో గొప్ప ఆధ్యాత్మికశక్తి గల ఒక లింగమును ప్రతిష్ఠించారని చెప్పారు. ఇంతలో హఠాత్తుగా స్వామి మా వైపు తిరిగి "ఇప్పుడు ఆ లింగమునే నేను మీకు చూపబోతున్నాను" అని చెప్పారు. తక్షణమే తళతళలాడే తెల్లని ఇసుక నుండి 3 అంగుళముల పరిమాణము గల ఒక లింగము స్వామి దివ్య హస్తాలలో ఆవిర్భవించింది. ఆ అద్భుత లింగమును దర్శించుకున్న మేమంతా భక్తి, ప్రపత్తులతో ఒక్క క్షణంపాటు కళ్ళు

మూసుకున్నాము. ఆ లింగమును సృష్టించిన శివశక్తి స్వరూపులైన భగవాన్ బాబావారికి శిరస్సులు వంచి వినమ్రంగా ప్రణామములు అర్పించాము. తరువాత స్వామి 'ఇదంతా తమాషా! వినోదం!' అని వ్యాఖ్యానించారు. అవును! విశ్వాధినేతయైన ఆ విశ్వావతారికి ఇది కేవలం ఒక విలాసహేల కాక మరేమవుతుంది? ప్రభువుతో కలసి సాగించిన ఆ 15 రోజుల కాశ్మీర్ పర్యటనలో స్వామి దివ్య హస్తాలనుండి వెలువడిన ఇటువంటి 'తమాషా'లు ఎన్నో! ఎన్నెన్నో!

జూన్ 9వ తేదీన లిద్దర్ నది సమీపములోని అతిథి గృహమునకు ఆనుకుని ఉన్న ఉద్యానవనంలో స్వామి ఒక గులాబీ పువ్వు తీసుకుని దాని మీద నోటితో గట్టిగా ఊదారు. అంతే! ఆ పువ్వు ఒక శివలింగముగా మారిపోయింది. స్వామి ఆ శివలింగమును కల్నల్ బెరీకి ఇచ్చారు. అదే రోజున మళ్ళీ ఆ నదీ తీరములోనే కూర్చుని స్వామి శ్రీచక్రము చెక్కబడిన ఒక పతకమును సృష్టించారు. ఇంకా తమ అక్షయ హస్తమునుండి జనరల్ మల్హోత్రా, శ్రీ సోహన్‌లాల్‌లకు చేతి గడియారాలు, మల్హోత్రాకు మరియు మేజర్ కౌల్‌కు ఉంగరాలు, శ్రీ సోహన్‌లాల్, శ్రీ బెరీలకు అక్షయ విభూతి భరిణలు సృష్టించి ఇచ్చారు".

ఇంకా, ఆ అధ్యాపకుని కథనం యీ విధంగా కొనసాగింది :

"ఆ 15 రోజులూ ఇలా ప్రతిరోజూ స్వామియొక్క ఏదో ఒక దివ్య సృష్టితో 15 క్షణాల్లా గడిచిపోయాయి. ప్రతి రోజు ప్రపంచము పునఃసృష్టి జరిగి నిత్య నూతనమై ఒక నూతనాధ్యాయానికి నాంది పలికిందా అన్నట్లు గోచరించింది. సాయంత్ర సమయాలలో ఒక్కొక్క రోజు ఆరు బయట పచ్చిక మైదానంలో, ఒక్కొక్కసారి తమ నివాస గృహములోని గదిలో ఆసీనులై స్వామి మహోన్నతమైన వేదాంత సత్యాలను లేదా గాయత్రి మంత్రముయొక్క అర్థమును వివరించేవారు. మరికొన్ని రోజులలో మానవ జీవిత లక్ష్యము మరియు పరమార్థమును గురించి, కేవలం ప్రాపంచికమైన సుఖ సంతోషములకొరకు ప్రాకులాడితే కలిగే విపరీత పరిణామాలను గురించి మాట్లాడేవారు. తరచుగా సాధకుల సందేహాలను నివృత్తి చేసేవారు. స్వామి మానవ జీవితములో బుద్ధియొక్క విశిష్ట భూమికను గురించి అనేక విషయాలను బోధిస్తూంటే మేమంతా గతంలో ఎన్నడూ

అధిరోహించని ఆధ్యాత్మిక శిఖరాలను చేరుకున్నామా అనిపించింది. ఇక, మరికొన్ని రోజులలో భగవాన్ తమ గంభీరమైన కంఠస్వరముతో భజన గీతములను ఆలపించారు. ఈ విధంగా ప్రతి రోజు, ప్రతి క్షణం దివ్యమైన ఆనందంతో పులకించిపోయాము. ఆనందపుటంచులను చూశాము!"

జూన్ 13వ తేదీ సాయంత్రం శ్రీనగర్ పట్టణానికి చాలా దూరంగా పరవళ్ళు త్రొక్కుతూ వేగంగా ప్రవహించే పవిత్ర సింధునదీ తీరమున భగవాన్ బాబావారి సరసనే నడుస్తూ వెళ్ళడం నిజంగా ఒక అనిర్వచనీయమైన ఆనందానుభూతి. ఆ నదీ తీరమున అత్యంత రమణీయమైన ఒక ప్రదేశములో భగవాన్ తమతో కాశ్మీరు పర్యటనకు వచ్చిన బృంద సభ్యుల కోరికను మన్నించి వారితో కలసి ఫోటో తీయించుకున్నారు. సింధునదిలో నీళ్ళు ఎంత స్వచ్ఛంగా ఉన్నాయంటే, ఆ నీళ్ళ క్రింద ఉన్న ఇసుక రేణువులను స్పష్టంగా చూడవచ్చు. సమీపములో నున్న ఉన్నత పర్వత శిఖరముల నుండి జాలువారే ఆ నీటి ప్రవాహం ఎక్కువ లోతు లేదు. నదిలో కొన్ని చోట్ల ఒక్క అడుగులోతు నీరు మాత్రమే ఉండేది. అక్కడి నుండి మానసబల్ తటాకమును చేరుకోవాలంటే ఒక చోట ఈ నదిని దాటవలసి వస్తుంది. అందువలన భగవాన్ బాబా తన అంగీని రెండు చేతులతో కొద్దిగా పైకి ఎత్తి రాజహంసలా ఠీవిగా ఆ నదిలో మందగమనంతో నడిచి వెడుతూంటే ఆ రమణీయ దృశ్యము మరపురానిది. లలితా సహస్రనామములోని 'మరాళీ మందగమనా! మహాలావణ్య శేవధిః!' అనే వర్ణనకు ఆ దృశ్యము అద్దంపడుతుంది. భగవాన్ బాబావారు ప్రవాహం మధ్యలో నిలబడి ఆ స్వచ్ఛమైన, చల్లని నీటిని చూస్తూ కొద్దిసేపు గడిపారు. చుట్టూ ఉన్న విద్యార్థులు, పెద్దలు నీటి అడుగున తళతళా మెరుస్తున్న భగవాన్ సుందర పాదపద్మములను తిలకిస్తూ మైమరచిపోయారు. వారి గుండె లోతులలోని భావాలను ఎరిగిన సర్వజ్ఞులైన స్వామి వారిని చూసి ఆనందంగా చిరునవ్వు నవ్వారు. తరువాత అందరూ కలసి నది ఆవలి ఒడ్డుకు వెళ్ళేముందు అవతార మూర్తి దివ్య పాదపద్మములను అభిషేకించిన పవిత్రమైన ఆ నీటిని కొద్దిగా చేతులతో తీసుకుని తమ శిరస్సులపై జల్లుకున్నారు. దానితో వారు


ప్రాపంచిక బంధాలనుండి విముక్తులై భగవానునితోను, ఆయన దివ్య సృష్టిలోను ఐక్యమైనట్లు అనుభూతిని పొందారు.

జూన్ 14వ తేదీ సూర్యోదయవేళ ఆ సుందర ప్రకృతి రామణీయకతకు వీడ్కోలు చెప్పే సమయం వచ్చింది. ఏదైనా మంచికి గాని, చెడుకు గాని, ముగింపు అనివార్యం కదా! భగవాన్ బాబావారితో కాశ్మీరు పర్యటనకు వెళ్ళిన బృందంలోని ప్రతి వ్యక్తికి ఆ 14 రోజుల కాలం అతివేగంగా గడిచిపోయినట్లయింది. ఆ రోజు మధ్యాహ్నం భగవాన్ తమ బృందముతో కలసి శ్రీనగర్ విమానాశ్రయమునకు చేరుకోగానే అక్కడ మళ్ళీ అసంఖ్యాకమైన జనం చేరారు. స్వామి తమనుండి దూరంగా వెళ్ళిపోతున్నారన్న వేదన ప్రతి ఒక్కరి వదనాలలోను వ్యక్తమవుతూ వారిని అంతులేని విచారంలో ముంచివేసింది. తమ ప్రియతమ స్వామి తిరుగు ప్రయాణం కొరకు విమానం ఎక్కుతూన్న దృశ్యమును చూచిన ఆ భక్తులు కొందరు కన్నీరు పెట్టుకున్నారు. మరి కొందరు నిగ్రహం కోల్పోయి గట్టిగా ఏడ్చేశారు. సర్వమతములకు చెందిన స్త్రీలు, పురుషులు ఆ కరుణామూర్తియొక్క దర్శన భాగ్యమును మరొక్కసారి పొందాలన్న తపనతో భద్రతా సిబ్బందిని, నియంత్రణా రేఖను కూడా అతిక్రమించి దూసుకుపోవడానికి ప్రయత్నించారు. వారందరి ఆర్తికి స్పందించిన స్వామి విమాన ప్రవేశ ద్వారము తెరువమని సిబ్బందిని ఆదేశించారు. సర్వకాల, సర్వావస్థలలోను తాను వారి ఇంట, వెంట, కంట, జంట ఉన్నాననే భావాన్ని తెలియజేస్తూ వారి వైపు తమ అభయ హస్తమును ఊపారు. విమానం బయలుదేరేవరకు స్వామి అలాగే నిలబడి దర్శనాన్ని ప్రసాదించారు. చివరకు సాయంత్రం 4-30 గం॥లకు విమానం ఢిల్లీ విమానాశ్రయానికి బయలుదేరింది. శ్రీనగర్ విమానాశ్రయంలో స్వామికి వీడ్కోలు చెప్పడానికి చేరిన అసంఖ్యాకమైన భక్తులు ఆవిధంగా గగనతలంలో విమానం కనుమరుగయ్యేవరకు దానిని చూస్తూనే ఉండిపోయారు.

తిరుగు ప్రయాణంలో భగవాన్ 15,16 తేదీలు రెండు రోజులు ఢిల్లీలో గడిపారు. తనతో వచ్చిన బృందములోని వారినందరిని ఢిల్లీలోను, చుట్టు ప్రక్కల ఉన్న దర్శనీయ స్థలాలను చూసి రమ్మని పంపించి, తానుమాత్రం తమ

దర్శనంకొరకు వచ్చినవారిని సంతృప్తిపరచి వారిపై అపారమైన ప్రేమను, ఆనందమును వర్షింపజేశారు. 16వ తేదీన స్వామి కొంతమంది అదృష్టవంతులైన భక్తుల గృహములకు వెళ్ళారు. 17వ తేదీన తన బృందముతో కలసి విమానంలో బొంబాయి చేరుకుని అక్కడి ధర్మక్షేత్రంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల సభ్యులు మరియు త్వరలో జరుగబోయే తృతీయ ప్రపంచ సమ్మేళనమును నిర్వహించే కార్యకర్తలతో చర్చలు జరిపారు. 18వ తేదీ ఉదయం అక్కడ ధర్మక్షేత్రంలో ఒక హాలు నిర్మాణమునకు శంకుస్థాపన గావించి అక్కడ సమావేశమైన అశేష జనావళికి వీడ్కోలు చెప్పి, ఆ రోజు మధ్యాహ్నం విమానంలో బృందావనం చేరుకున్నారు. ఆ విధంగా భగవాన్ బాబావారి 17 రోజుల కాశ్మీరు పర్యటన చిరస్మరణీయమైన, దివ్యానందము వెల్లివిరిసిన ఒక పండుగలా గడిచిపోయింది. తమ పర్యటన సందర్భంగా అవతారమూర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా లక్షలాది భక్తుల హృదయ క్షేత్రములలో తమ దివ్య సందేశ బీజములను నాటారు.


లెఫ్టినెంట్ జనరల్ మల్హోత్రా 1980వ సంవత్సరం జనవరి నెలలో నార్తరన్ కమాండ్‌కు ఆర్మీ కమాండర్‌గా నియమింపబడినప్పుడు, అచిరకాలములోనే తనకు పట్టబోయే అదృష్టమును గురించి ఆయనకు ఇసుమంతయినా తెలియదు. ఉదక మండలములోని వెల్లింగ్టన్‌లో గల డిఫెన్సు సర్వీసెస్ స్టాఫ్ కాలేజీకి కమాండెంట్‌గా పనిచేస్తున్నప్పుడు జనరల్ మల్హోత్రా తన భార్యతో కలసి 1974వ సంవత్సరములో మొట్టమొదటిసారిగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దర్శనం చేసుకున్నారు. అయినప్పటికి, 1976వ సంవత్సరంలో మహాశివరాత్రి పర్వదినం నాడు ఆ దంపతులు ప్రశాంతి నిలయంలో భగవాన్ దర్శనం చేసుకున్న తరువాతనే వారి జీవితాలు ఒక ముఖ్యమైన మలుపు తిరిగాయి. 1980వ సంవత్సరం అక్టోబరు మాసంలో జనరల్ మల్హోత్రా నాగపూర్ జిల్లాలో గల కాంప్టీ ప్రాంతములో అధికార పర్యటన చేస్తున్నప్పుడు, ఆయన కళ్ళల్లో కురుపులు లేచి ఒక రకం చర్మ వ్యాధికి (Herpes) గురయ్యారు. అయితే, కర్తవ్య నిర్వహణలో మునిగిపోయిన ఆయన



"మహాలావణ్య శేవధి"



"శ్రీనగర్ విమానాశ్రయంలో భక్తులకు వీడ్కోలు చెపుతూ భగవాన్ బాబా"



"బొంబాయిలోని ధర్మక్షేత్రంలో భగవాన్ బాబా"

దీనిని పట్టించుకోలేదు. చివరకు, ఆ వ్యాధి ముదిరి తలలోను, ముఖం మీద చీముకారే బొబ్బలు లేచాయి. దాంతో ఆయనను ఢిల్లీలోని ఆర్మీ హాస్పిటలుకు తరలించారు. ఎంతో నిపుణులైన వైద్యులు వైద్యము చేసినప్పటికి ఆయన పరిస్థితి నానాటికి దిగజారి చివరకు కంటిచూపు కూడా పోయే దుస్థితి ఏర్పడింది. వైద్యులు అన్ని ఆశలు వదులుకున్నారు. ఆస్పత్రిలో మంచం మీద ఉన్న జనరల్ మల్హోత్రా పూర్తిగా నిస్సహాయులైనారు. ఆ సమయంలో ఆయనకు ఉద్ధాంపూర్‌లోను, శ్రీనగర్‌లోను భగవాన్ బాబావారి దివ్య సన్నిధిలో స్వామిని కనుల విందుగా దర్శించుకున్న ఆనందకరమైన రోజులు గుర్తుకు వచ్చాయి. ఆందోళనతో కన్నీటి ధారలు విడుస్తూ తనను కాపాడుమని ఆయన బాబాను ప్రార్థించసాగారు. అదే సమయంలో ఆయన భార్య శ్రీమతి ప్రేమా మల్హోత్రా తన భర్త వ్యాధి నివారణకు భగవాన్ బాబావారి అనుగ్రహమును అర్థించే నిమిత్తము హుటాహుటిన ప్రశాంతి నిలయం చేరుకున్నారు. నిరాశా నిస్పృహలు నిండిన హృదయంతో ఆమె మందిరం వెలుపల కూర్చున్నారు. ఇంతలో భగవాన్ ఆమె చెంతకు వచ్చి "నీకెందుకీ విచారం? అతను త్వరలోనే కోలుకుంటాడు. కొద్ది రోజుల సమయం పట్టవచ్చు", అని అభయమిచ్చారు. ఆ అభయవాక్కు స్వామి నోటినుండి వెలువడగానే పరిస్థితులన్నీ జనరల్ మల్హోత్రాకు అనుకూలంగా మారడం మొదలుపెట్టాయి. ఆయనకు వైద్యం చేస్తున్న డా॥ కల్నల్ బొపరాయ్‌కి గతంలో అదే వ్యాధితో బాధపడుతున్న చాలామంది రోగులకు ఇచ్చినా ఫలించని ఒకానొక ఇంజక్షన్ జనరల్ మల్హోత్రాకు ఇచ్చి మరొక ప్రయత్నం చేయాలని అంతరంగములో స్ఫురించింది. అద్భుతమైన రీతిలో ఆ ఇంజక్షన్ మల్హోత్రా విషయంలో చాలా చక్కగా పనిచేసింది. వ్యాధి ఉధృతాన్ని అరికట్టగలిగింది. అయితే, ఈ వ్యాధిమూలంగా ఆయన ముఖంపై ఏర్పడిన మచ్చలు జీవితాంతమువరకు ఉండిపోతాయని వైద్యులు చెప్పారు. అంతేకాక, వ్యాధి తగ్గుముఖం పట్టేటప్పుడు కన్నులలో సూదులు గ్రుచ్చినట్లు భరించరాని బాధ ఉండటంకూడా సహజమేనని చెప్పారు. చివరగా, వైద్యులు ఆయనను హాస్పిటలునుండి డిశ్చార్జి చేస్తూ ప్రయాణం చేయకూడదని, దుమ్ము, ధూళినుండి కళ్ళను కాపాడుకోవాలని హెచ్చరించారు.


కాని, జనరల్ మల్హోత్రా వైద్యుల సలహాలను ప్రక్కన పెట్టి దివ్యభిషగ్వరులైన తన స్వామి సన్నిధిలో కొంతకాలం గడపాలని విమానంలోను, తరువాత రోడ్డుద్వారాను ప్రయాణం చేసి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. మందిరం వరండాలో ఆయనను చూచిన వెంటనే భగవాన్ బాబావారు ఆయన వద్దకు వచ్చి "నేను నీకు నేత్రదానం చేశాను" అని చెప్పి, ఇకపై అన్ని రకాల మందులు మానేయమన్నారు. అంతేకాక, ప్రతి రోజు తనతో పాటు కూర్చుని భోజనం చేయమని ఆహ్వానించారు కూడా! అహేతుక కరుణా సింధువైన భగవాన్ బాబావారి కరుణతో తన్మయుడైన జనరల్ మల్హోత్రా వ్యాధి ఆయన అనుగ్రహంవల్ల పూర్తిగా నివారణ అయ్యింది. వారం రోజులపాటు ఈ విధంగా స్వామితో కలసి భోజనం చేసే సమయంలో భగవాన్ తమ దయార్ద్ర దృక్కులను మల్హోత్రా కన్నులలోనికి సూటిగా ప్రసరింపజేసేవారు. ఫలితంగా ఆయన కన్నులలోని భరింపరాని బాధ క్రమంగా తగ్గుముఖం పట్టి వారాంతానికి పూర్తిగా మాయమైంది. అంతేకాదు, ఆయన ముఖం మీది మచ్చలన్నీ మటుమాయమయ్యాయి. జనరల్ మల్హోత్రా శ్రీనగర్ తిరిగి వచ్చిన తరువాత, భగవాన్ బాబావారి దివ్యానుగ్రహంవలన అద్భుతమైన రీతిలో ఆయన వ్యాధి నివారణ కావడం చూసి వైద్యులంతా నిశ్చేష్టులయ్యారు.

చివరకు, 2004వ సంవత్సరంలో మల్హోత్రా దంపతులు చెప్పగలిగింది యిదే:

"మొట్టమొదటిసారి మేము భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దర్శనం చేసుకుని 30 సంవత్సరాలు గడిచిపోయాయి. బాబా సంపర్కముతో మా జీవితాలు పరిపూర్ణమైన పరివర్తన చెందాయి. మేము క్రమం తప్పకుండా ప్రతి సంవత్సరం రెండు సార్లు, అంటే గురుపూర్ణిమ మరియు భగవాన్

జన్మదినోత్సవంనాడు, బాబా దర్శనం చేసుకుంటాము. అలా వెళ్ళిన ప్రతిసారి భగవాన్ మా నిరాశా నిస్పృహలను దూరం చేసి మమ్మల్ని చైతన్యవంతులను చేస్తారు. మాకు శక్తిని ప్రసాదిస్తారు. నిత్య జీవితంలోని సమస్యలను, సవాళ్ళను ఎదుర్కొనే ధైర్యస్థైర్యాలను స్వామి దర్శనం మాకు చేకూరుస్తుంది".





4

ఉన్నత విద్యకు మహోన్నత స్థాయిని కల్పించే విశ్వవిద్యాలయము

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు విద్య యొక్క పరమార్థమును గురించి బోధిస్తూ ఒక సందర్భంలో "మానవునికి సత్ప్రవర్తన, దైవభక్తితో కూడిన జీవితము గడపడం నేర్పకుండా కేవలము వృత్తిపరమైన నైపుణ్యము మరియు యుక్తులను మాత్రమే బోధిస్తే, అటువంటి విద్య ఆ వ్యక్తికి, సమాజానికి కూడా హానికరం" అని విద్యాబోధకులను, విద్యారంగములోని నిపుణులను హెచ్చరించారు.

ఈ హెచ్చరికలోని యథార్థము రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో హిట్లరు సైనికులు నడిపిన మృత్యు గహ్వరంవంటి ఒక కాన్సన్‌ట్రేషన్ కేంపునుండి తప్పించుకుని బ్రతికి బయట పడిన ఒక వ్యక్తి విద్యాబోధకుల కనువిప్పుకొరకు వ్రాసిన ఒక బహిరంగ లేఖలో స్పష్టంగా గోచరిస్తుంది:

"ప్రియ అధ్యాపక మిత్రమా! నేను నాజీ సైనికులు హిట్లరు ఆధ్వర్యంలో నడిపిన కాన్సన్‌ట్రేషన్ కేంపునుండి అనూహ్యమైన రీతిలో బయటపడిన వ్యక్తిని. ఏనాడూ ఏ మానవుడూ చూడకూడని ఎన్నో అమానుష దృశ్యాలకు నేను ప్రత్యక్ష సాక్షిని. నేను సాక్షాత్తూ మానవునిలో దానవుని విశ్వరూపం దర్శించాను. విద్యాధికులైన ఇంజనీర్లు దారుణ మారణ హోమానికి ఒడిగట్టే విషపూరిత గ్యాస్ ఛేంబర్సును నిర్మించడం, వైద్య నిపుణులు అమాయకులైన పసి పిల్లలకు విషపూరిత ఇంజక్షన్లు యివ్వడం, సుశిక్షితులైన నర్సులు శిశు హత్యలకు పూనుకొనడం, హైస్కూలు మరియు కళాశాల విద్య పూర్తిచేసి డిగ్రీలు పొందిన యువకులు మహిళలను, పసికందులను తుపాకీలతో కాల్చిచంపి, ఆ శవాలను మూకుమ్మడిగా మంటబెట్టడం వంటి ఘోరదృశ్యాలను నేను చూశాను. ఈ

ప్రత్యక్ష నరక దృశ్యాలను వీక్షించిన తరువాత నాలో అసలు విద్యపట్లనే ఎన్నో అపోహలు చెలరేగుతున్నాయి. మీరు మీ విద్యార్థులకు, మానవతా వాదులుగా, మానవులుగా ఎదగడానికి దోహదం· చేసే మానవతా విలువల విద్యను బోధించండి. మీ కృషి, చదువు నేర్చిన రాక్షసులను, నైపుణ్యము వెర్రితలలు వేసి మానవజాతి వినాశానికి దారితీసే మనోవైకల్యముగల కుటిల స్వభావులను తయారు చేయడానికి దోహదపడకూడదు. పిల్లలలో మానవత్వమును పెంపొందించగలిగినప్పుడే వారు నేర్చిన చదువుగాని, గణితము కాని సార్థకమవుతాయి". మానవుని అమానుషత్వ చర్యలకు మనసు గాయపడి, పరితాపము చెందుతున్న మానవజాతి వ్యధాభరిత ఆర్తనాదానికి ప్రతీక, యీ లేఖ. మానవాళి ఎదుర్కొంటున్న ఈ దయనీయమైన పరిస్థితికి పరిష్కారము అధ్యాపకుల, విద్యాబోధకుల చేతులలో ఉన్నదనే సత్యాన్ని ఆ లేఖకుడు సరిగా ఊహించగలిగాడు. సమస్యల వలయంలో చిక్కుకుని దిక్కుతోచని స్థితిలో మానవజాతి మొత్తం చేసిన జాలిగొలిపే ప్రార్థనల నాలకించిన జగద్గురువు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఈ పరిస్థితిని చక్కదిద్దేందుకు ప్రపంచ విద్యావ్యవస్థనే సమూలంగా మార్చివేయగల సంస్కరణలను విద్యారంగములో ప్రవేశపెట్టారు. ఇది ఒక నిశ్శబ్ద విప్లవం. సమకాలీన సమాజాన్ని పట్టి పీడిస్తున్న రుగ్మతలను గురించి మాట్లాడుతూ స్వామి "ఈనాడు మనకు కావలసినది నూతనమైన ఒక సాంఘిక వ్యవస్థకాని, రాజకీయ ఆర్థిక విప్లవంకాని కాదు. సచ్ఛీలవంతులైన స్త్రీ, పురుషులు ఈనాడు సమాజానికి అత్యవసరం", అని చెప్పారు. ఈనాడు మానవజాతి ఎదుర్కొంటున్న అతిపెద్ద సమస్య, శీలమునకు విపత్తు ఏర్పడడమే! (It is a crisis of character). ఇంతవరకు కని, విని ఎరుగని ఈ ఘోర విపత్తు ఆధునిక మానవుని 'నూతన ప్రపంచము కావాలా లేక అసలు ప్రపంచమే అంతమైపోవాలా?' అనే సందిగ్ధావస్థలో పడవేసింది.

ఏమిటి ఈ నూతన ప్రపంచం? దీని అర్థం ఏమిటి? నిజం చెప్పాలంటే, నూతన ప్రపంచమంటే బాధారహితమైన ప్రపంచము కాదు, మానవుడు తన తోటి మానవులను బాధలకు గురి చేయని, హింసారహితమైన లోకం! ఇది,

అంధకార రహితమైన లోకంకాదు, అజ్ఞానాంధకారమును దూరం చేసి జ్ఞాన ప్రకాశమును ప్రపంచమంతటా నింపగలమనే ఆత్మవిశ్వాసమును పెంపొందించుకున్న మానవులు గల లోకం. ఇది, మృత్యురహిత లోకం·కాదు, శాశ్వతమైన అమృతత్వమును సాధించే జ్ఞాన సంపదను పెంపొందించుకున్న లోకం. ఇది, ముక్తికోసం స్వర్గములోని దైవసహాయాన్ని అర్థించే లోకం కాదు, దివి నుండి భువికి దిగి వచ్చిన అవతార పురుషునితో చేయి చేయి కలిపి భువిపై దివిని స్థాపన చేయగల మానవులు గల లోకం. ఈ భూలోక స్వర్గంలో తిండి, బట్ట, ఆశ్రయం లేనివారు ఒక్కరు కూడా ఉండరు. అవసరంలో ఉన్న ప్రతి ఒక్కరికి వైద్యసహాయము, మందులు అందించబడతాయి. ఈ నూతన ప్రపంచములో కన్ను తెరచిన శిశువు లెవ్వరికి సరస్వతీ సదన ద్వారాలు మూయబడి ఉండవు. ప్రతి ఒక్కరికి సరియైన విద్యావకాశాలు కల్పించ బడతాయి. క్లుప్తంగా చెప్పాలంటే, ప్రతి వ్యక్తి యొక్క మౌలికావసరములు తీర్చడం, ప్రతి ఒక్క వ్యక్తి సహజీవన సూత్రాన్ని అలవరచుకుని, అంతరంగములో శాంతిని, సాటివారితో ప్రకృతి మాతతో సామరస్యంతో జీవించే కళను అభ్యసించడం ఈ నూతన ప్రపంచముయొక్క ధ్యేయం. నిజానికి, 'నూతన మానవుడే నూతన ప్రపంచము'ను నిర్మించగలడు. నూతన విద్య ద్వారానే అట్టి నూతన మానవ ఆవిర్భావం జరుగుతుంది. ఆధునిక భారత దేశములోని విద్యావేత్తలు మరియు సాహితీవేత్తలకు మూలపురుషుని వంటివాడు, శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థయొక్క మొట్టమొదటి వైస్ ఛాన్సలరు అయిన శ్రీ వి.కె. గోకాక్ దృష్టిలో నూతన మానవుడు నిజంగా నూతనుడు కాడు. అతడు పాతకొత్తల మేలు కలయికే! అదే విధంగా, నూతన విద్య కూడా ప్రాచీన, ఆధునిక విద్యల సమ్మిళితమే! భగవాన్ బాబావారు ఇట్టి నూతన విద్యను తమ ఉన్నత విద్యా సంస్థద్వారా ఇప్పటికే ప్రపంచానికి కానుకగా ప్రసాదించియున్నారు. "ఆత్మవిద్యయే విద్యయొక్క పరమావధి" (The soul of education is the education of the Soul) అని ఉద్ఘాటించి ప్రపంచములోని అన్ని దేశములు, అన్ని కాలములకు చెందిన విద్యావేత్తలందరియొక్క కలలపంటగా భగవాన్ శ్రీ

సత్యసాయిబాబా వారు ఈ నూతన విద్యావిధానమును రూపొందించారు. ఆధునిక యుగంలో అత్యంత వాస్తవిక దృక్పథంగల చింతనాపరుడు, తత్త్వవేత్త అయిన శ్రీ ఇ.ఎఫ్. షూమాచర్ 'సూక్ష్మమే సౌందర్యభరితం' (Small is beautiful) అనే తన రచనలో "నేటి విద్యా విషయిక సమస్యలు యీ యుగమును పట్టి పీడిస్తున్న తీవ్ర సమస్యలయొక్క ప్రతిబింబాలు", అని వ్యాఖ్యానించాడు. ప్రస్తుతం మనమందరం 'ఆధ్యాత్మిక చింతనా విముఖత' అనే వ్యాధితో బాధపడుతున్నాము. కనుక, దీని నివారణ కూడా ఆధ్యాత్మికతనుండే రావాలి. విస్తృతంగా ప్రబలియున్న ఈ వైఖరి ఇలాగే కొనసాగినట్లయితే, 'విద్య' అనే మహత్తర శక్తి మానవుని ఉద్ధరణకు కాక, ప్రపంచముయొక్క వినాశనమునకు కారణమవుతుంది. భగవాన్ బాబావారు ఆధునిక ప్రపంచానికి ప్రసాదించిన నూతన విద్యా విధానము లౌకిక, ఆధ్యాత్మిక విద్యల నవ్య భవ్య సమ్మేళనాత్మకమైనది. ఇది భగవాన్ బాబావారు నెలకొల్పిన స్కూళ్ళు, కాలేజీలలో బోధింపబడుచున్న శ్రీ సత్యసాయి సమగ్ర విద్యావిధానముపై ఆధారపడియున్నది. స్వామి ప్రవేశపెట్టిన ఈ నూతన విద్యావిధానము లక్ష్యసాధనలో ఆదర్శవంతము, సిద్ధాంత రీత్యా ఆచరణ యోగ్యము మరియు దేశకాల పరిస్థితులకు అనుకూలము ఐన విధానము. మానవుని వ్యక్తిత్వములో అతి ముఖ్యమైన అంశములగు శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తుల వికాసమునకు దోహదం చేసే సమగ్రమైన విద్యను బోధించి స్త్రీ, పురుషులను పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చి దిద్దడమే ఈ విద్యా విధానము యొక్క ధ్యేయము. ఈ వినూత్న విద్యా విధానమునకు పునాదులుగా పేర్కొనదగిన సిద్ధాంతముల వివరణ భగవాన్ బాబావారి దివ్యలేఖినినుండి వెలువడిన "విద్యా వాహిని"లో పొందుపరుపబడినది.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు ప్రప్రథమంగా నెలకొల్పిన ఉన్నత విద్యాసంస్థ, 1968వ సంవత్సరములో అనంతపురములో స్థాపించబడిన శ్రీ సత్యసాయి మహిళా కళాశాల. రెండవది 1969వ సంవత్సరములో బృందావనంలో నెలకొల్పబడిన బాలుర కళాశాల. విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి నివసించే ఈ రెసిడెన్షియల్ కళాశాలలలో ప్రాచీన గురుకులములు ఆధునిక

పద్ధతులలో, పరిసరాలలో తిరిగి ప్రత్యక్షము కావడం మనం చూడగలము. భగవాన్ బాబావారు నెలకొల్పిన ఈ ఆధునిక గురుకులములలో విద్యాబోధన పూర్తిగా ఉచితంగా జరగాలనే మౌలిక సూత్రము చాలా ఖచ్చితంగా పాటింపబడుతుంది. విద్యా రంగములో కూడా వ్యాపార ధోరణి విస్తరిస్తున్న ప్రస్తుత తరుణంలో ప్రాథమిక స్థాయినుండి పోస్టుగ్రాడ్యుయేటు స్థాయివరకు పూర్తిగా ఉచిత విద్య గరపడం ఒక అద్భుత విషయం. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఈ విద్యా సంస్థలు అచిరకాలంలోనే ఉన్నత విద్యారంగంలో శీలనిర్మాణమనే ప్రక్రియలో గొప్ప పేరు పొందాయి.

1979వ సంవత్సరంలో ప్రశాంతి నిలయం (పుట్టపర్తి) లో పురుషుల కళాశాల స్థాపించబడింది. ఈ మూడు కళాశాలలలో ఆంధ్రప్రదేశ్‌లోని రెండు కళాశాలలు శ్రీ వేంకటేశ్వర విశ్వ విద్యాలయమునకు, కర్ణాటక రాష్ట్రములోని బృందావనం (బెంగుళూరు) కళాశాల బెంగుళూరు విశ్వవిద్యాలయానికి అనుబంధంగా ఉండేవి. ప్రశాంతి నిలయంలో బాలుర కళాశాల నెలకొల్పి సంవత్సరం తిరక్కుండానే అక్కడ ఈ మూడు కళాశాలలను కలిపి ఒక స్వయం ప్రతిపత్తి గల విశ్వవిద్యాలయముగా రూపొందించాలని భగవాన్ తన సంకల్పమును వెల్లడించినప్పుడు ఆయనకు అత్యంత సన్నిహితులైన అనుయాయులు కూడా 'ఇది సంభవమా?' అని ఆశ్చర్య చకితులయినారు. ఆ రోజుల్లో స్వయం ప్రతిపత్తి గల కళాశాలల సంఖ్యయే చాలా తక్కువ. రెండు దశాబ్దాల క్రితం స్థాపించబడి పి.జి. కోర్సులు నిర్వహిస్తున్న కళాశాలలకు కూడా స్వయం ప్రతిపత్తి లభించలేదు. పైగా అప్పట్లో ప్రశాంతి నిలయము మరియు బృందావనంలోని కాలేజీలలో అండర్ గ్రాడ్యుయేటు కోర్సులు మాత్రమే నడుపబడేవి. అలాగే అనంతపురంలోని మహిళా కళాశాలలో అండర్ గ్రాడ్యుయేటు కోర్సులతో పాటు ఒక్క తెలుగు భాషలోనే పోష్ట గ్రాడ్యుయేటు కోర్సు ఉండేది. అయితే, పుట్టపర్తిలో నెలకొల్పబోయే విశ్వవిద్యాలయమును గురించి స్వామి ప్రస్తావించడం అదే మొదటి సారి కాదు. అప్పటికి దాదాపు 30 సంవత్సరాల క్రిందటే, అంటే 1951వ సంవత్సరం డిశంబరు నెలలోనే

భగవాన్ బాబా ఈ విషయాన్ని ప్రస్తావించారు. కీ॥శే॥ శ్రీ కస్తూరి వివరించిన ఆ కథ ఈ విధంగా ఉన్నది:

"బాలబాలికలకొరకు విద్యాసంస్థలను నెలకొల్పే ప్రయత్నంలో బుక్కపట్నంలో హైస్కూలును నెలకొల్పడం భగవాన్ బాబావారు చేపట్టిన మొట్టమొదటి కార్యక్రమం. ఆ పాఠశాల కమిటీ అధ్యక్షులు, పోషకులు, వ్యవస్థాపకులు సర్వము స్వామియే! ప్రారంభమునుండి ఆ పాఠశాలను ఎంతో జాగ్రత్తగా పెంచి పోషిస్తూ సర్వతోముఖాభివృద్ధి గాంచేటట్లు చేసి, విద్యారంగములోను, ఇతరత్రా కూడా ఆ జిల్లాలోనే ఆదర్శవంతమైన పాఠశాలగా పేరు తెచ్చుకునేందుకు బాబా ఎంతో కృషి చేశారు.

ఒకసారి, ఆ పాఠశాల వార్షికోత్సవ సభలో నేను వక్తగా పాల్గొనవలసి వచ్చింది. సభకు ఆనాటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రెవిన్యూ మంత్రి శ్రీ కోటిరెడ్డి అధ్యక్షులుగా విచ్చేస్తున్నారు. భగవాన్ బాబావారు అచ్చువేయించిన ఆహ్వాన పత్రికలో నా పేరు క్రింద 'పిహెచ్.డి' అనే గౌరవ పట్టాను చేర్చారు. అంతే కాకుండా నా హోదాను ప్రిన్సిపాలు అని కూడా ఆ పత్రికలో ముద్రించారు. ఆహ్వాన పత్రికలో 'ఎన్. కస్తూరి, ఎం.ఏ., బి.యల్., పిహెచ్.డి., ప్రిన్సిపాల్, డి.ఆర్.యం కళాశాల, దావణగేరే' అని ప్రచురితమై ఉండడం చూసి ఒక్కసారిగా నాకు కన్నీరు పెల్లుబికింది. అయితే, మద్రాసు, మైసూరు విశ్వవిద్యాలయాలనుండి పిహెచ్.డి. డిగ్రీ తీసుకోవాలనే కోరికతో అప్పట్లో నేను నా కిష్టమైన కొన్ని అంశాలపై పరిశోధనా వ్యాసాలు (Theses) వ్రాసి పెట్టుకున్న మాట మాత్రం నిజం! కాని, అవన్నీ అసంపూర్ణంగానే మిగిలిపోయాయి. పిహెచ్.డి. డిగ్రీ కొరకు నేను చేసిన ప్రయత్నాలన్నీ విఫలమైనాయి. ఆ కార్డు తీసుకుని స్వామి పాదాలపై పడి "స్వామీ! నేను పిహెచ్.డి. చేయలేదు. నాకు ఆ అర్హత లేదు" అని నిజం వెల్లడించాను. బాబా నవ్వుతూ నా వీపు తట్టి 'కాదు, నువ్వు పిహెచ్.డి. వే', అన్నారు. అక్కడే వున్న నా పాత మిత్రుడు శ్రీ కేశవ్ విఠల్ మధ్యలో అందుకుని 'స్వామీ! ఏ


విశ్వవిద్యాలయం నుండి?' అని అడిగాడు. అప్పుడు స్వామి అతని వైపు తిరిగి చూచి 'పుట్టపర్తి విశ్వవిద్యాలయం నుండి' అన్నారు. అంటే, పుట్టపర్తిలో విశ్వవిద్యాలయమును స్థాపించే సంకల్పము అప్పటికే ఆయన బృహత్ప్రణాళికలో ఉన్నది!"

1980వ సంవత్సరములో ప్రశాంతి నిలయంలో విశ్వవిద్యాలయము స్థాపించాలని భగవాన్ బాబావారు సంకల్పించే నాటికి, అందులో ఏయే పదవులలో ఏయే వ్యక్తులు పనిచేయాలనే విషయం అప్పటికే నిర్ణయమై స్వామి దివ్య సంకల్పమును నెరవేర్చేందుకు సమర్థులైన వ్యక్తులు తయారుగా ఉన్నారు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి ధర్మ సంస్థాపనోద్యమ ప్రస్థానంలో విశ్వవిద్యాలయ స్థాపన ఒక ముఖ్యమైన మైలురాయి. ఆధునిక యుగంలో శాస్త్ర, సాంకేతిక రంగాలలో ప్రగతికి అత్యంతావశ్యకమైన ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి ముఖ్య ఉపకరణమైన కంప్యూటర్ విద్యను (Computer Education), సనాతనమైన భారతీయ సంస్కృతిని బోధించే కల్చర్ విద్య (Culture Education) తో మేళవించి, ఆధ్యాత్మిక, నైతిక విలువలను ఉన్నత విద్యలో అంతర్భాగంగా అందించాలంటే స్వామి కళాశాలలకు స్వయం ప్రతిపత్తి (Autonomy) అత్యవసరం. చాలా సంవత్సరాల క్రితమే భగవాన్ బాబావారు తమ దివ్య లేఖిని నుండి వెలువడిన "విద్యావాహిని" లో ఈవిధంగా వ్రాశారు :


"విద్యార్థి పరిపూర్ణమైన ఆనందమును జీవిత సాఫల్యమును పొందాలంటే, రెండు విధములైన పరిజ్ఞానములలో ప్రావీణ్యతను సంపాదించాలి – మొదటిది, సృష్టిని గురించిన పరిజ్ఞానము; రెండవది సృష్టికర్తను గురించిన పరిజ్ఞానము. ఇందులో ఒకటి జీవనోపాధిని, రెండవది జీవిత పరమావధిని అందిస్తుంది".

అప్పట్లో కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖామాత్యులుగా ఉన్న శ్రీ యస్.బి. చవాన్ భగవాన్ బాబావారు రూపొందించిన నూతన విద్యా విధానమువలన ఒనగూడే విశేషమైన ఫలితమును గుర్తించి, ప్రశాంతి నిలయంలో విశ్వవిద్యాలయ స్థాపనలో

ప్రముఖ పాత్ర వహించారు. శ్రీ సత్యసాయి విద్యాసంస్థల పని తీరును పరిశీలించడానికి బెనారస్ హిందూ విశ్వవిద్యాలయ మాజీ వైస్ ఛాన్సెలరు, ప్రముఖ విద్యావేత్త అయిన శ్రీ వి.ఎస్. ఝా నాయకత్వంలో విశ్వవిద్యాలయ గ్రాంట్ల కమీషన్ ఒక కమిటీని నియమించింది. ప్రశాంతి నిలయం, అనంతపురం మరియు బృందావన్ కేంపస్‌లను మూడింటిని సందర్శించిన శ్రీ వి.యస్.ఝా, భగవాన్ బాబావారి వ్యక్తిత్వము మరియు దివ్యబోధలు అసమాన ఉదాత్త రీతిలో ఆ విద్యాలయాల్లోని అధ్యాపకులు మరియు విద్యార్థులను ప్రభావితం చేసిన తీరుకు ఆనందపరవశులయినారు. 1981వ సంవత్సరం ఆగష్టు నెలలో బృందావనం కళాశాలలో "ఉన్నత విద్యాబోధన – మానవతా విలువలు" (Value Orientation to Higher Education) అనే అంశముపై భగవాన్ బాబావారి ఆధ్వర్యంలో నిర్వహింపబడిన ఒక సదస్సులో శ్రీ వి.యస్. ఝా "నేను ఒక విమర్శకునిగా ఇక్కడకు వచ్చాను; కాని, ఆరాధకుడనయ్యాను", అని అంగీకరించారు. తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ "ఉన్నత విద్యా బోధనలో మానవతా విలువలను గురించిన అవగాహనను పెంపొందించడంలో ఎదురవుతున్న సమస్యలను బాబావారి విద్యాసంస్థలు సమర్థవంతంగా పరిష్కరించ గలుగుతున్నాయి. ఈ విద్యాలయం విశ్వవిద్యాలయంగా ఆవిర్భవించిన నాడు, ఇది భారతదేశములోని విశ్వవిద్యాలయాలకే కాదు, యావత్ప్రపంచములోని విశ్వవిద్యాలయాలకే వెలుగు చూపే విద్యా సంస్థగా ప్రకాశిస్తుంది", అని ఉద్ఘాటించారు. బృందావనం కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు కలసి అత్యంత సమర్థవంతముగా మూడు రోజులపాటు నిర్వహించిన ఆ సదస్సులో భారతదేశమంతటినుండి వచ్చిన ఎంతోమంది ప్రముఖ విద్యావేత్తలు పాల్గొన్నారు. సదస్సు ముగింపు సందర్భంగా బృందావన కళాశాల అధ్యాపకులతో శ్రీ ఝా ప్రశంసా పూర్వకంగా "మిమ్మల్నందరిని చూసిన తరువాత నేను యిక ఈ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సెలరును చూడాల్సిన అవసరం కనిపించడం లేదు", అని చెప్పారు. శ్రీ వి.యస్. ఝా కమిటీ సమర్పించిన ఆ సుప్రసిద్ధ నివేదిక ప్రపంచము ఇంతవరకు కని, విని యెరుగని



"ఉన్నత విద్యాలయాలు"



" 1969వ సంవత్సరంలో బృందావనంలోని కళాశాల ప్రారంభోత్సవం"



"భగవాన్ బాబావారిచే 1980వ సంవత్సరంలో ప్రశాంతినిలయంలోని ఉన్నత విద్యాసంస్థ భవనమునకు ప్రారంభోత్సవం"

మహోన్నత విద్యావేత్త యగు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారికి ఘనమైన నివాళి!

విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘము (University Grants Commission) యొక్క సిఫార్సు మేరకు భారత ప్రభుత్వము శ్రీ సత్యసాయి కళాశాలలను ప్రశాంతి నిలయము కేంద్ర స్థానముగా ఒక డీమ్డ్ యూనివర్సిటీ (పరిగణిత విశ్వవిద్యాలయము)గా పరిగణిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 1981వ సంవత్సరములో నిర్వహింపబడిన దసరా ఉత్సవాల సందర్భంగా పవిత్రమైన విజయదశమి పండుగ నాడు (8-10-1981 తేది) క్రిక్కిరిసిన జన సందోహంతో నిండిన పూర్ణ చంద్ర సభా మంటపంలో భగవాన్ బాబా ఈ శుభవార్తను ప్రకటించారు. అదే రోజున ప్రశాంతి మందిరానికి దక్షిణ దిగ్భాగములో ఉన్న కొండమీద విశ్వ విద్యాలయ పరిపాలనా భవన నిర్మాణమునకు 'భూమి పూజ' జరిగింది. 22-11-1981వ తేదీన గౌరవనీయులైన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ వై.వి. చంద్రచూడ్ గారిచే భగవాన్ బాబావారి దివ్య సన్నిధిలో సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ (Sri Sathya Sai Institute of Higher Learning) పేరుతో డీమ్డ్ యూనివర్సిటీ (పరిగణిత విశ్వవిద్యాలయం) ప్రారంభోత్సవం ప్రపంచ వ్యాప్తమైన శ్రీ సత్యసాయి విద్యా విప్లవంలో ఒక ప్రధానమైన ముందడుగు. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు ఈ విశ్వవిద్యాలయానికి కులపతిగా (Chancellor) ఉండటానికి అంగీకరిస్తూ శుభాశీస్సులను అందించారు. తరువాత వైస్ ఛాన్సెలరు శ్రీ గోకాక్ ఒక సందర్భంలో విద్యార్థులతో మాట్లాడుతూ "సాక్షాత్తూ ఆ జగత్పతినే మీ విశ్వవిద్యాలయానికి కులపతిగా పొందిన మీ రెంతటి భాగ్యశాలురు!" అని వర్ణించారు.

శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ ప్రారంభోత్సవ సమారోహంలో స్వామి అనుగ్రహ భాషణం చేస్తూ "సిద్ధాంతపరంగా నిజమైన విద్య అంటే ఏమిటి, ఆ సిద్ధాంతములను ఏవిధంగా ఆచరణలో పెట్టాలి" అనే విషయాన్ని గురించి వివరించారు. ఆ సందర్భంగా భగవాన్ తమ దివ్యోపన్యాసంలో "ఈనాడు శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ ప్రారంభ శుభదినం. ఈ రోజున 'విద్య' అనే

మొక్కను నాటాము. ఈ విద్యా వృక్షమునకు విద్యార్థులు వేళ్ళవంటివారు. ఈ వృక్షము శాఖోపశాఖలుగా విస్తరించి, ఫలపుష్పాదులతో నిండి, జగత్తునకు శాంతి, భద్రతలను అందిస్తుంది. అలా జరగాలంటే వృక్షానికి దృఢమైన వ్రేళ్ళవలె విద్యార్థులు దృఢ సంకల్పంతో కృషి చేయాలి. కాని, నాకు తెలుసు వేళ్ళకు నీరు అందించాలని! ఆ పని నాది. విద్యార్థులే నా సర్వస్వం. శ్రీ సత్యసాయి యొక్క ప్రోపర్టీ ఏమిటి అనే ప్రశ్నకు సమాధానంగా అనేకమంది 'అబ్బో! ఇన్ని బిల్డింగులున్నాయి, ఇన్ని భూములున్నాయి' అని చెపుతూంటారు. ఇవన్నీ వట్టి మాటలే! నా ప్రోపర్టీ అంతా నా పిల్లలే! అదే నా జవాబు. నేను విద్యార్థులకే అర్పితమయ్యాను. నా సమస్తం విద్యార్థులేనని నేను విశ్వసిస్తున్నాను. విద్యార్థులు, అధ్యాపకులే ఈ విశ్వవిద్యాలయముయొక్క అత్యంత విలువైన ఆస్తి. వారు మాత్రమే ఈ సంస్థను ఆదర్శ విశ్వ విద్యాలయముగా తీర్చిదిద్దగలరు. ఈ విశ్వవిద్యాలయములో లౌకిక విద్యలతో బాటు ఆధ్యాత్మిక, నైతిక, ధార్మిక విలువల ఆచరణాత్మక బోధన కూడా జరుగుతుంది. విద్యార్థులలో చిత్తశుద్ధి, సత్యనిరతి, దైవభక్తి, క్రమశిక్షణ, అంకిత భావముతో కూడిన కర్తవ్యపాలన మొదలగు సద్గుణములను పెంచి పోషించుట ఈ విశ్వవిద్యాలయ లక్ష్యము", అని ఉద్ఘాటించారు. తేదీ 22-11-1981న భగవాన్ బాబావారిచే ఆయన జన్మదినోత్సవానికి ముందు రోజున ప్రారంభింపబడిన ఈ డీమ్డ్ యూనివర్సిటీ (Deemed University), జాతి యొక్క పునరుజ్జీవనోద్యమ (National Renaissance Movement) సమయంలో భారతీయ ఆధ్యాత్మికాకాశంలో ధ్రువతారలుగా వెలిగిన స్వామి దయానంద సరస్వతి, వివేకానంద, శ్రీ అరవింద యోగి, మహాత్మా గాంధీ మరియు విశ్వకవి రవీంద్రనాథ్ టాగూరు వంటి మహాపురుషుల కలల పంట (Dream University)గా ఆవిర్భవించింది.

శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలో 1982వ సంవత్సరం జూన్ నెలలో విజ్ఞాన శాస్త్రము మరియు మానవ సంస్కృతీ శాస్త్రములకు (Science and Humanities) సంబంధించిన పోష్ట గ్రాడ్యుయేటు కోర్సులు ప్రారంభింపబడినాయి. విశ్వవిద్యాలయ ప్రారంభోత్సవం జరిగిన సరిగ్గా

సంవత్సరం నాటికి మొట్టమొదటి స్నాతకోత్సవం జరిగింది. అద్వితీయమైన ఈ విశ్వవిద్యాలయము యొక్క విశిష్ట సాంప్రదాయాలలో ఒకటి, విద్యా సంవత్సర ప్రారంభ, ముగింపు తేదీలు మరియు స్నాతకోత్సవ తేదీ ఏనాడూ మారవు. విద్యా సంవత్సరం ఖచ్చితంగా జూన్ నెల మొదటి పనిదినాన ప్రారంభమై మార్చి నెల 31వ తేదీన ముగుస్తుంది. అలాగే, స్నాతకోత్సవం ప్రతి సంవత్సరం నవంబరు 22వ తేదీన జరుగుతుంది. ప్రశాంతి నిలయము, అనంతపురం కేంపస్‌లతో ప్రారంభింపబడిన ఈ విశ్వవిద్యాలయము సంవత్సరం తిరక్కుండానే కర్ణాటక రాష్ట్రములోని బృందావన్ కళాశాలను కూడ అక్కడి ప్రభుత్వ అనుమతితో మూడవ కేంపస్‌గా అనుబంధము చేసుకుంది. ఈ విధంగా రెండు వేర్వేరు రాష్ట్రాలలో విస్తరింపబడియున్న కళాశాలలు ఒకే విశ్వవిద్యాలయ పరిధిలోనికి రావడం విశ్వవిద్యాలయాల చరిత్రలో ఒక అపూర్వమైన ఘట్టము!

శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయ పరిపాలనా భవనమునకు 22-11-1982వ తేదీన ప్రథమ స్నాతకోత్సవ సందర్భముగా ప్రారంభోత్సవం జరిగింది. పర్వత శిఖరముపై మహోన్నతముగా ఒక రాజప్రాసాదము వలె గోచరించే ఈ పరిపాలనా భవనము కేవలం పన్నెండు మాసముల వ్యవధిలో నిర్మింపబడింది. పూర్ణచంద్ర సభా మంటపమంతా పూర్తిగా నిండిపోయిన ఆనాటి అశేష జన సందోహమునకు స్వాగతం పలుకుతూ డా॥ వి.కె. గోకాక్ "ఈ భవనం ప్రపంచ వ్యాప్తంగా విద్యా వేత్తలందరికీ దీప స్తంభమై పథనిర్దేశిని కాగలదు. అపురూప శిల్పకళా వైభవంతో విరాజిల్లే ఈ భవనము ప్రపంచమంతటినుండి జిజ్ఞాసువులను ఆధ్యాత్మిక యాత్రకు పురికొల్పుతూ సంకేతములు పంపిస్తుంది", అన్నారు. ఇండో-సార్సనిక్ మరియు విభిన్న శిల్పకళారీతులు మేళవించి నిర్మించిన ఈ అద్భుత నిర్మాణము ప్రపంచములోని విభిన్న మతములమధ్య నుండే సామరస్యమును ప్రతిబింబిస్తుంది. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారివలె ఇది సనాతన సాంప్రదాయములు మరియు ఆధునికతల మేలుకలయిక" అని అన్నారు. ఆనాడు సాయంత్రం ప్రఖ్యాత న్యాయశాస్త్రవేత్త శ్రీ ఎన్.ఎ. పాల్కీవాలా విశ్వవిద్యాలయ మొట్టమొదటి

స్నాతకోపన్యాసం చేస్తూ "శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క ప్రారంభము భారతదేశములో నైతిక, ఆధ్యాత్మిక పునరుజ్జీవనమునకు నాంది. ఈ విశ్వవిద్యాలయ స్థాపన, భగవాన్ బాబావారు ప్రవచించే సత్య, ధర్మ, శాంతి, ప్రేమ, అహింసలనే ఆదర్శములను సాధించే కృషిలో ఒక మహత్తరమైన ప్రయోగము వంటిది. ఈ ఐదు పదములకు ఆంగ్ల భాషలో సరియైన అర్థం వచ్చే పదాలు లేవు. 'ధర్మ' మనగా చట్టాల ద్వారా అమలు పరచటానికి వీలులేని సూత్రములకు ఐచ్ఛికంగా కట్టుబడి యుండడమే! అటువంటి ధర్మాన్ని అలవరచుకొన్న ఈ విశ్వవిద్యాలయములోని విద్యార్థులు జాతియొక్క సర్వతోముఖమైన సుఖ, శాంతులకు (Gross National Happiness) దోహదం చేయగలరు. అనేక శతాబ్దాలనుండి భారతదేశ సమైక్యతను కాపాడినది ఈ ధర్మమే! 'శాంతి' అంటే కేవలం ఇంగ్లీషు భాషలో పేర్కొనబడే 'పీస్' (Peace) మాత్రమే కాదు. భగవంతునియందు ప్రేమ అనే సూత్రము ఆధారంగా విశ్వ మానవులందరు ఏకత్రాటిపై నిలచి "వసుధైక కుటుంబకమ్" అనే సనాతన భారతీయ ఆదర్శమును సాధించడం. 'అహింస' అనగా విశాల సృష్టిలోని సమస్త జీవరాశులతోను ఏకాత్మ భావము కలిగియుండడం" అని ఉద్ఘాటించారు. చివరగా, జ్ఞానదీప్తిని కలిగించే తన ఉపన్యాసమును ముగిస్తూ శ్రీ పాల్కీవాలా "మున్ముందు ఈ విద్యాసంస్థ అంకిత భావము గల, సుశిక్షితులైన, జాతి పునర్నిర్మాణమునకు నడుం కట్టే స్త్రీ, పురుషులను అందిస్తుంది. భారత జాతి నైతిక, ఆధ్యాత్మిక తిరోగమన పథంలో పయనిస్తున్న ప్రస్తుత తరుణంలో జాతిని తిరిగి పురోగమన మార్గంలో నడిపించ గల శక్తిమంతులైన నాయకులను ఈ విద్యాసంస్థ అందించగలదు", అని ఆశాభావం వ్యక్తము చేశారు. ఉన్నత విద్యారంగములో ఈ విశ్వవిద్యాలయము చేస్తున్న ఉత్కృష్టమైన ప్రయోగమును ఎంతో ఆపేక్షతో గమనిస్తున్న ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేకమంది ఆలోచనాపరులైన స్త్రీ, పురుషుల ఆకాంక్ష కూడా అదే! అయితే, వారి నమ్మకం వమ్ముకాలేదు.

సంవత్సరాలు గడిచే కొలది, శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ అన్ని రంగాలలోను ఆశించిన ఫలితాలను సాధించడంలో వేగవంతమైన ప్రగతిని సాధించింది. శీల నిర్మాణమే పునాదిగా ఉన్నత ప్రమాణాలతో కూడిన విద్యా బోధన జరిగింది. 1984వ సంవత్సరములో ఉత్తీర్ణులైన మొట్టమొదటి బ్యాచ్ పోస్ట్ గ్రాడ్యుయేటు విద్యార్థులకు రీసెర్చి అవకాశాలు కల్పించి పిహెచ్.డి. డిగ్రీలు ప్రదానం చేయడానికి కూడా వీలుపడింది. ఆ విద్యార్థులు చేపట్టిన పరిశోధనాంశములు (Research Projects) సామాజిక అవసరాలకు తగినట్లుగా,. సామాన్య ప్రజలకు ప్రయోజనకరంగా ఉండేటట్లు ఎన్నుకోబడినాయి. ఈ ఉన్నత విద్యాసంస్థ విద్యార్థులలో ఆదర్శవాదమును (Idealism) నెలకొల్పడంలో విశేషంగా కృతకృత్యురాలైంది. ఈ విజయ పరంపరలకు మూలకారణం స్వామికి విద్యార్థులపై గల అసమానమైన ప్రేమయేనని వేరే చెప్పనవసరం లేదు. ఈ విశ్వవిద్యాలయ ప్రాంగణంలో అడుగుపెట్టిన ఆధునిక తరంలోని యువత స్వామియొక్క దివ్య ప్రేమ బంధమునకు కట్టుబడి దైవభక్తి, సాటి మానవులయందు కరుణ అనే సద్గుణములను అలవరచుకుని తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. 1983వ సంవత్సరంనుండి భగవాన్ బాబావారి అనుగ్రహంతో ప్రశాంతి నిలయంలో, బృందావనంలో హాస్టల్ వార్డెన్‌గా పని చేయడం వలన, భగవాన్ అనేకమంది విద్యార్థులలో ఆధ్యాత్మిక పరివర్తన తీసికొని వచ్చే అత్యద్భుత మహిమను ప్రత్యక్షంగా దర్శించుకునే భాగ్యం నాకు కలిగింది. ఈ సందర్భంగా 1983వ సంవత్సరంలో పోస్ట్ గ్రాడ్యుయేటు కోర్సులో చేరిన ఒక విద్యార్థియొక్క కథనాన్ని ఇక్కడ వివరిస్తాను.

ఆ విషయం ప్రస్తావించే ముందు, దాని పూర్వాపరాలు కొంచెం మీకు వివరించాలి. ఈ విద్యాసంస్థలో చేరిన ప్రతి విద్యార్థి స్వామి తరచు తమతో మాట్లాడాలని, తాము స్వామికి సన్నిహితంగా ఉండాలని కోరుకుంటారు. ఈ కోరికయొక్క తీవ్రత ఒక్కొక్క విద్యార్థిలో ఒక్కో రకంగా ఉంటుంది. ఇంకా, కొంతమంది విద్యార్థులలో వారు ఈ విద్యాసంస్థలో గడిపే సమయాన్ని బట్టికూడా

వారి కోరికయొక్క తీవ్రతలో కొన్ని మార్పులు జరుగవచ్చు. గత రెండు దశాబ్దాలలో నేను అనుభవపూర్వకంగా తెలుసుకున్నది, ఏ విద్యార్థి అయినా తనపట్ల అచంచల విశ్వాసము, ఆసక్తి కలిగియున్నట్లైతే, ఆ విద్యార్థి మనసులోని కోరికను భగవాన్ బాబా సరియైన సమయంలో తప్పక నెరవేరుస్తారు. వ్యక్తిగతంగా ఆధ్యాత్మిక ఆశయ సిద్ధికి ఈ నియమం వర్తిస్తుంది. ఇది, ఆధ్యాత్మిక సాధనకు సంబంధించిన నిత్య సత్యమైన "అన్వేషించు, నీకు తప్పక లభిస్తుంది మరియు తలుపు తట్టు, తెరువబడుతుంది" అనే సూత్రమునకు అనుగుణంగా ఉంటుంది. అయితే, ఎవరైనా సరే ఓర్పు, సహనము, విశ్వాసములతో ఆ ఆశయ సిద్ధికై నిరీక్షించాలి. అసహనము, నిరాశా నిస్పృహలకు దారి తీస్తుంది.

ప్రాచీన కాలంలో జ్ఞాన వృద్ధులైన ఆచార్యులు నడిపే గురు కులములలో విద్యాభ్యాసం చేసే విద్యార్థులలో కొందరు, విద్యాభ్యాసం పూర్తయిన తరువాతకూడా అక్కడే ఉంటూ గురుకుల నిర్వహణలో గాని లేక వాటికి సంబంధించిన ఇతర కార్యక్రమాలలో గాని గురువులకు సహాయపడే సంప్రదాయము ఉండేది. అటువంటి విద్యార్థులను 'అంతేవాసులు' అంటారు. గురువు పట్ల, ఆయన బోధించే ఆదర్శములపట్ల ఆ శిష్యులకు గల ప్రేమాభిమానములే దానికి కారణం. ఈనాడు కూడా భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి ఆధ్వర్యంలో నడుపబడుతున్న శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ అనే అధునాతన గురుకులములో చాలామంది విద్యార్థులు తమ కులపతిపై తమకు గల ప్రేమవలన 'అంతేవాసులు'గా ఉండిపోయారు. నేను ఈ అధ్యాయమును వ్రాస్తున్న సమయానికి నూరు మందికి పైగా ఈ సంస్థలో విద్యాభ్యాసము చేసిన పూర్వ విద్యార్థులు ప్రశాంతి నిలయము మరియు బృందావనములో స్వామి నెలకొల్పిన వివిధ సంస్థలలో సేవ చేయడానికి ఉండిపోయారు. వారు స్వామి ఆశ్రమాలలో, స్కూళ్ళలో, కాలేజీలలో, హాస్టళ్ళలో, హాస్పిటల్సులో వివిధ హోదాలలో సేవ లందిస్తున్నారు. ఆ విధంగా స్వామి సేవలో తన జీవితాన్ని ధన్యము చేసుకుంటున్న నాగేశ్వరరావు అనే పూర్వ విద్యార్థియొక్క హృదయాలను కదిలించే గాథ యిది :

నాగేశ్వరరావు ఆంధ్ర విశ్వవిద్యాలయమునుండి విజ్ఞాన శాస్త్రములో ఉత్తమశ్రేణిలో అండర్ గ్రాడ్యుయేటు కోర్సు పూర్తి చేశాడు. అతడు ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాజిల్లాలలో ఒక వ్యవసాయ కుటుంబమునకు చెందినవాడు. చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకున్నాడు. శారీరకంగా దుర్బలుడైనా గట్టి మనోబలం గలవాడు. విద్యా విషయంలో మంచి ప్రతిభాశాలి. 1983వ సంవత్సరం సెప్టెంబరు నెలలో ఒక ఆదివారమునాడు ఇన్‌స్టిట్యూట్ కేంపస్‌లో సమాజసేవ చేస్తూండగా అతని అంకిత భావము అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ రోజు ఉదయం విద్యార్థులందరూ కలసి హాస్టల్ పరిసరాలను శుభ్రం చేస్తున్నారు. ఒక టాయిలెట్ కాలువ నుండి ప్రవహించే మురుగు నీటికి ఏదో అడ్డుపడి వ్యర్థ పదార్థముతో బాటు మురుగు నీరంతా హాస్టల్ వెనుక భాగంలో చేరిపోయింది. నాగేశ్వరరావు నాయకత్వంలో కొంతమంది అండర్ గ్రాడ్యుయేటు విద్యార్థులు ఆ ప్రాంతమును శుభ్రం చేయడానికి వెళ్ళారు. అయితే, అక్కడ చేరిన మురికి, దుర్గంధము వల్ల ఆ పని చేయడానికి విద్యార్థులు మొదట్లో కొంచెం సంశయించారు. ఇంతలో నాగేశ్వరరావు తగిన పరికరాలు తీసుకుని ఆ మురికి ప్రదేశంలో ప్రవేశించి శుభ్రం చేయడం మొదలు పెట్టాడు. వెంటనే మిగిలినవారు అతనిని అనుసరించారు. కొద్దిసేపట్లోనే ఆ ప్రదేశమంతా శుభ్రపరచి డ్రెయిన్ పైపులో ఏర్పడిన అడ్డును కూడా తొలగించారు. తరువాత నేను అతనిని పిలిచి అతని నిస్వార్థ సేవకు అతనిని ప్రశంసించాను. దానికి అతడు ఎంతో వినయంతో "సార్! నేను చేసింది ఏమీ గొప్ప సేవ కాదు. మన ఇళ్ళల్లో మనం చేసుకోమా! ఈ హాస్టల్ స్వామి మాకు ప్రసాదించిన ఇల్లు", అన్నాడు. అతని వినయం, బాబా పట్ల అతనికి గల భక్తి, ప్రపత్తులు నా హృదయాన్ని కదిలించివేశాయి.

నాగేశ్వరరావు ఇన్‌స్టిట్యూట్‌లో చదువుకుంటూ క్రమం తప్పకుండా ఆధ్యాత్మిక సాధన కొనసాగిస్తూ తరచుగా నన్ను కలసి నా సహాయము, సలహా అర్థిస్తూ ఉండేవాడు. ఒకసారి అతడు సగుణ సాకార ధ్యానం చేయాలనుకుని ప్రారంభించాడు. ఆ సాధనకు తన ఇష్టదైవమైన భగవాన్ బాబావారిని ఎంచుకుని

ప్రతిరోజు ఆయన గురించి ధ్యానం చేసేవాడు. అంతేకాకుండా, స్వామి దివ్యబోధలను నిత్య జీవితంలో ఆచరించడానికి కృషి చేశాడు. ఇలా కొన్నాళ్ళు సాగిన తరువాత సహజంగానే భగవాన్ బాబావారి సాన్నిహిత్యం పొందాలని తీవ్రంగా కాంక్షించాడు. అప్పట్లో బాబావారు ప్రశాంతి మందిరం ముందు గల పోర్టికోలో కూర్చుని విద్యార్థులతో ఎక్కువసేపు సంభాషిస్తూ గడిపేవారు. విద్యార్థుల చదువుకు, ఇతర కార్యకలాపాలకు సంబంధించిన ప్రశ్నలు అడిగేవారు. ఒక్కొక్కసారి ఆధ్యాత్మికపరమైన అంశములను గురించి వివరించేవారు. అటువంటి సంభాషణ ఒక్కొక్క రోజున ఒక గంటకు పైగా సాగేది. భగవాన్ చాలామంది విద్యార్థులను వారి పేర్లతో సహా గుర్తుపెట్టుకొనేవారు. ఆధ్యాత్మికంగా ఉన్నత స్థాయికి చేర్చే అటువంటి సమావేశాల్లో ప్రతి విద్యార్థి భగవాన్ బాబావారితో సంభాషించే అవకాశముకొరకు ఎదురు చూస్తుండేవారు. వారిలో నాగేశ్వరరావుకూడా ఒకడు. అయితే, రెండు సంవత్సరాల కోర్సులో మొదటి సంవత్సరం గడిచినా నాగేశ్వరరావుకు స్వామితో సంభాషించే అదృష్టం లభించలేదు. ఈ సంవత్సర కాలంలోను బాబా అనేకసార్లు తన తోటి విద్యార్థులతో సంభాషించడం అతడు చూశాడు. కాని, అతనికి మాత్రం ఆ అవకాశం దొరకలేదు. అతని ఆశ నిరాశే అయింది. నేను మాత్రం అతనిని ఓర్మితో వేచియుండమని ప్రోత్సహించాను. భగవాన్ బాబావారి దర్శనం చేసుకుంటూ, ఆయనతో సంభాషించే ఆ శుభముహూర్తంకొరకు ఎదురు చూస్తూ అతడు వేసవి సెలవుల్లో కూడా ఇంటికి వెళ్ళకుండా ప్రశాంతి నిలయంలో హాస్టల్‌లోనే ఉండడానికి నిశ్చయించుకున్నాడు. అయితే, బాబావారు విద్యార్థులందరిని వారి వారి ఇళ్ళకు వెళ్ళి సెలవులలో వారి తల్లిదండ్రులతో గడపమని ఆదేశించారు. అందువలన అతడు అయిష్టంగానే ఇంటికి వెళ్ళాడు. కాని, తొందరలోనే హాస్టల్‌కు తిరిగి వచ్చాడు. అలా తిరిగి వచ్చిన వారిలో అతనే మొట్ట మొదటివాడు.

రెండవ సంవత్సరంలోనైనా భగవాన్ బాబావారితో మాట్లాడే అవకాశం దొరుకుతుందేమోనని నాగేశ్వరరావు ఆశించాడు. కాని, అలా జరగలేదు. రెండవ సంవత్సరం కూడా పూర్తికావచ్చింది. దాంతో అతడు తీవ్రమైన ఆందోళనకు గురయ్యాడు. సంవత్సరాంత పరీక్షలు పూర్తయిన తరువాత నా వద్దకు వచ్చి దుఃఖం ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడ్చేశాడు. నోట మాట రాలేదు. ఆ సమయంలో నాకు మీరాబాయి పాటలోని ఒక పంక్తి జ్ఞాపకం వచ్చింది : 'ప్రేమ అనే సున్నితమైన లతను నా హృదయంలో నాటి కన్నీరనే నీటితో పెంచి పోషించాను. ఆ లత ఇప్పుడు చక్కగా అంతటా అల్లుకుని ఆనందమనే ఫలములను అందిస్తున్నది". "ప్రేమతో నిండిన నిర్మలమైన పసిపాపవంటి హృదయం భగవానుని తనవైపు ఆకర్షించుకోగల అద్భుత శక్తిని కలిగియుంటుంది. భగవాన్ బాబావారు ఇప్పటికే నీకు అట్టి పెన్నిధిని అనుగ్రహించారు. నీ హృదయపూర్వకమైన కోరికను స్వామి తప్పక తీరుస్తారనే నమ్మకం నాకుంది", అని చెప్పి నేను అతనికి ధైర్యం చెప్పాను. అంతటితో ఆగక, అతని మనస్సులో నిజంగా ఏమున్నదో తెలుసుకోవాలనే కుతూహలంతో "అసలు స్వామినుండి నీవు ఏమి కోరుకుంటున్నావు?" అని ప్రశ్నించాను. దానికి సమాధానంగా అతను "నా జీవితమంతా స్వామి సన్నిధిలోనే ఉంటూ ఆయన అవతార కార్యక్రమంలో పాలు పంచుకోవాలని ఉంది. నా పూర్వజన్మ సుకృతం వలన ఎలాగో అలాగ స్వామివద్దకు చేరాను. ఇక ఆయనను విడిచి వెళ్ళడం నాకు ఇష్టం లేదు", అని స్పష్టంగా చెప్పాడు. ఈ మాటలు చెపుతూంటే తళతళమని ముత్యాల్లా మెరుస్తున్న కన్నీటి బిందువులు అతని చెంపల మీదుగా జారాయి. నా హృదయం అతనికొరకు ఆక్రోశించింది. అతని వేదనామయ మానసిక స్థితికి సాంత్వన చేకూర్చాలనే బలమైన కోరిక నాలో కలిగింది.

వెంటనే నేను "నీకు, స్వామికి మధ్య ఎటువంటి అడ్డు ఉండదు. మూర్తీభవించిన ప్రేమ, కరుణలే స్వామి. నీ హృదయంలో స్వామికి నిన్ను నీవు అర్పించుకోవాలనే ఉదాత్తమైన ఆశయాన్ని పెంచుకున్నప్పుడు, స్వామి దానిని సిద్ధింపజేయకుండా ఎలా ఉంటారు? నా స్వానుభవమును బట్టి నే

చెపుతున్నాను విను. నీ హృదయ పూర్వకమైన ప్రార్థన తప్పక ఫలించగలదు", అని చెప్పి అతనిని అనునయించాను. ఆ సందర్భంలో నేను నా జీవితము నుండి ప్రార్థనయొక్క ప్రభావమును తెలిపే కొన్ని అనుభవాలు అతనికి వివరించాను. చివరగా అతను నా గదిలోనుండి బయటకు వెడుతున్నప్పుడు అతని కన్నుల్లో వెలిగే ఆశాకిరణమును స్పష్టంగా చూడగలిగాను.

ఆ సంవత్సరము, భగవాన్ విద్యార్థులను వేసవి సెలవుల్లో హాస్టల్‌లో ఉండడానికి అనుమతించారు. అది, అవతార మూర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి 60వ జన్మదిన సంవత్సరం. భగవాన్ బాబా కూడా ప్రశాంతి నిలయంలోనే ఉండి విద్యార్థులను, అధ్యాపకులను చుట్టు ప్రక్కల గ్రామాలలో సమాజసేవ చేయుమని చెప్పారు. తాను కూడా స్వయంగా కమ్మవారిపల్లె మరియు అమ్మగొండ పాల్యం అనే రెండు గ్రామాలను సందర్శించి, మొదటి గ్రామంలో ఉపన్యాసం ఇచ్చారు. రెండవ గ్రామంలో నూతనంగా నిర్మింపబడిన ఒక దేవాలయమునకు ప్రారంభోత్సవం చేశారు. నిజానికి భగవాన్ బాబావారే ఆ గ్రామంలో ఒక కొండ దిగువన ప్రశాంత రమణీయ పరిసరాల మధ్య ఆ దేవాలయమును నిర్మింపజేశారు. విద్యార్థులు ఆ వేసవి సెలవులు చాలా ఆనందంగా గడిపారు. బాబా ప్రతి రోజూ ఆ గ్రామాలలో సేవ చేసే విద్యార్థులకు రాను పోను రెండు బస్సులు ఏర్పాటు చేశారు. ప్రతి రోజు ఉదయం వారిని సేవా కార్యక్రమాలకు ఆశీర్వదించి పంపేవారు. మరల సాయంకాలం వారు తిరిగి రాగానే ఒక్కొక్కరికి తానే స్వయంగా పండ్లు, స్వీట్లు పంచిపెట్టేవారు. నాగేశ్వరరావుకు అది చాలా ఉత్సాహకరమైన అనుభూతి. ఆ సమాజ సేవా కార్యక్రమంలో అతడు అందరికంటె ముందుండేవాడు.

సెలవుల అనంతరము పరీక్షా ఫలితాలు వెలువడ్డాయి. నాగేశ్వరరావు తన తరగతిలోని విద్యార్థులందరిలోకి ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణుడయ్యాడు. అతని జీవితానికి ఒక అర్థం తెలియజేసే అమూల్యమైన క్షణం ఆ రోజు సాయంకాలం వచ్చింది. భగవాన్ బాబా మందిరం బయటకు వచ్చి తమ దర్శనార్థమై ఎదురు

చూస్తున్న విద్యార్థులను 'నాగేశ్వరరావు ఎవరు?' అని ప్రశ్నించారు. నా గుండె లయ తప్పింది. నాగేశ్వరరావు విద్యార్థులమధ్యనుండి లేచి స్వామి వైపు వెళ్ళడం చూశాను. స్వామి పిలుపుకు ఒక్కసారిగా అతని కళ్ళల్లో నీళ్ళు పొంగి పొరలి ప్రవహించడం మొదలుపెట్టాయి. హఠాత్తుగా వర్షించిన స్వామి అనుగ్రహానికి తట్టుకోలేక అతడు ఆనందంతో షాకయ్యాడు. ఆ షాకుకి అతని పెదవులు వణకడం మొదలుపెట్టాయి. తన వద్దకు రాగానే స్వామి అతనిని "పాద నమస్కారం చేసుకో" అని చాలా మృదువైన కంఠస్వరంతో ఆదేశించారు. నాగేశ్వరరావు స్వామి పాదాలపై వ్రాలి, వాటిని కన్నీటితో అభిషేకించాడు. స్వామి అతనిని పైకి లేవనెత్తుతూ "నీకు ఏమి కావాలి?" అని అడిగారు. తన జీవితంలో అత్యంత వైభవోపేతమైన ఆ మధుర క్షణాలలో అతని గొంతు మూగపోయి, ఎన్నో సంవత్సరాలుగా తన మనస్సులో దాచుకున్న కోరికను పైకి చెప్పలేకపోయాడు. సర్వజ్ఞులైన స్వామి అతని హృదయపు లోతులను స్పృశించి ప్రేమతో "అదేమిటో నాకు తెలుసు. నిన్ను నా వద్దనే ఉంచుకుంటాను. నువ్వు ఈ సంస్థలోనే అధ్యాపకునిగా చేరి పనిచేస్తూ పిహెచ్.డి. కూడా పూర్తిచేయి" అని చెప్పారు. స్వామి ఆజ్ఞ ననుసరించి నాగేశ్వరరావు శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలో అధ్యాపకునిగా చేరాడు. చిరస్మరణీయమైన ఆ సాయంకాలం తరువాత మూడేళ్ళలోనే పిహెచ్.డి. కూడా పూర్తి చేశాడు. భగవాన్ బాబావారి దివ్యహస్తాలలో ఒక ఉపకరణముగా ఉంటూ ఆయన అవతార కార్యక్రమంలో పాల్గొనడంద్వారా అతని జీవితం సఫలమైంది. నాగేశ్వరరావు దృష్టాంతము ఎందరో అటువంటి భాగ్యశాలుర ధన్య జీవితాలకు మచ్చుతునక వంటిది.

భగవాన్ బాబావారు స్థాపించిన కళాశాలల్లో చదివిన చాలామంది విద్యార్థులు స్వామియొక్క మానవోద్ధరణ ఉద్యమంలో విశిష్ట పాత్రను నిర్వహిస్తున్నారు. వారిలో ప్రతి ఒక్కరు స్వామి చేత స్వయంగా తీర్చిదిద్దబడి ఆయనయొక్క అవతార కార్యక్రమంలో సమర్థవంతమైన, ఉత్తమమైన ఉపకరణములుగా సేవలందిస్తున్నవారే! 1984వ సంవత్సరంవరకు బృందావనం కళాశాలలోని హాస్టల్‌కు వార్డెన్‌గా పనిచేసిన శ్రీ సి. శ్రీనివాస్

అటువంటి ఒక విశిష్ట వ్యక్తి. స్వామి అతనిని ఏవిధంగా ఎంపిక చేశారు, ఎలా తీర్చిదిద్దారు అనే విషయం చాలా ఆసక్తికరంగా, స్ఫూర్తిదాయకంగా ఉంటుంది.

శ్రీనివాస్ ఏడు సంవత్సరాల బాలుడుగా ఉన్నప్పుడు మొట్టమొదటిసారిగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దర్శనం చేసుకున్నాడు. అది కూడా 1963వ సంవత్సరంలో బాబా వారింటికి విచ్చేసినపుడు. అప్పట్లో అతని తండ్రి శ్రీ రాఘవేంద్రరావు హైదరాబాదులో ఒక ఐ.పి.యస్. అధికారిగా పనిచేస్తున్నారు. ఆయన చాలా సౌమ్యంగా, నాజూకుగా ఉంటూ అందరితో కలసిపోయే వ్యక్తి. ఆ కారణంగా ఆయన పోలీసు ఉద్యోగిలా కాక, ఒక వేదాంతిలా కనపడేవారు. మత విషయాలలో ఆయనకు విశేషమైన అవగాహన ఉండేది. ఆయన నిజమైన ఆధ్యాత్మిక సాధకుడు. శ్రీనివాస్ తల్లి డా॥ రాజేశ్వరి ఆబ్‌స్టెట్రిక్స్ మరియు గైనకాలజీ విభాగములో గొప్ప అంకిత భావంతో పనిచేసే నిపుణురాలైన డాక్టరు. ఆమె 'కర్తవ్యమే ఆరాధన' (Duty is Worship) అను సూక్తిని మనసారా విశ్వసించి ఆచరణలో నిరూపించిన గొప్ప వైద్యురాలు. కొంతకాలం గడిచిన తరువాత ఆమె భగవాన్ బాబావారి ఉచిత వైద్య సహాయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించారు. ఆవిడ జీవిత గాథ వేరొక అధ్యాయంలో వివరింపబడింది.

శ్రీనివాస్‌లో తల్లిదండ్రు లిద్దరి గుణాలలో చాలా భాగం విద్యార్థి దశలో నిద్రాణమై యుండి తరువాయి సంవత్సరాలలో బహిర్గతమైనాయి. హైదరాబాదు పబ్లిక్ స్కూలులో అతని తోటి విద్యార్థులు, అధ్యాపకులు అతనిని చాలా సరదాగా, హుషారుగా ఉండే వ్యక్తిగా భావించేవారు. అక్కడే అతను 1970వ సంవత్సరంలో పాఠశాల విద్యను పూర్తిచేశాడు. శ్రీనివాస్ ప్రతిభావంతుడైనప్పటికి, చుట్టూ ఉండే కొన్ని ఆకర్షణలకులోనై చదువులో అంతగా రాణించలేకపోయాడు. ఫలితంగా అతను I.S.C. పరీక్షలో చాలా తక్కువ గ్రేడులో పాసయ్యాడు. అతడు, అతని స్నేహితులు కొందరు కలసి బెంగుళూరు నగరములోని నవ నాగరిక జీవితంపై మోజుపడి అక్కడ కాలేజి

విద్యాభ్యాసం కొనసాగించాలని అనుకున్నారు. తల్లిదండ్రులు కూడా బాల్యం నుండి అతని ఇష్టానుసారము చదువుకునే స్వేచ్ఛయిచ్చారు.

రాఘవేంద్రరావు తన కుమారునితో కలసి బెంగుళూరు వెళ్ళి అక్కడ ఏదైనా మంచి రెసిడెన్షియల్ కాలేజిలో కామర్సు గ్రూపులో డిగ్రీ కోర్సులో సీటు సంపాదించాలని ప్రయత్నించాడు. శ్రీనివాస్ చిన్నాయన శ్రీరమణయ్య కూడా వారి ప్రయత్నాలలో పాలుపంచుకోవడానికి వారితో కలసి చాలా కళాశాలలకు వెళ్ళాడు. కాని, I.S.C. పరీక్షలో అతి తక్కువ మార్కులు తెచ్చుకున్న శ్రీనివాస్‌కు బెంగుళూరువంటి మహానగరంలో కాలేజి జీవితం గడపాలనే తీపి కలలు ఫలించలేదు. చేసేది ఏమీ లేక చివరకు బెంగుళూరు విడిచిపెట్టి వెళ్ళిపోవాలనే ప్రయత్నంలో ఉన్నప్పుడు వారి దూరపు బంధువైన కల్నల్ జోగారావును కలుసుకోవడం జరిగింది. అప్పుడు శ్రీ జోగారావు శ్రీ సత్యసాయి కాలేజి భవన నిర్మాణ కార్యక్రమంలో నిమగ్నులైయున్నారు. ఆయన శ్రీనివాస్‌ను ఒకసారి నఖశిఖ పర్యంతం పరీక్షగా చూచి కొంచెం సంకోచిస్తూ "వైట్‌ఫీల్డ్‌లో ఈ మధ్యనే ఒక కళాశాలను ప్రారంభించారు. మీరు వచ్చి ఒకసారి చూడండి. మీరు కావాలనుకుంటే నేను వెళ్ళి ప్రిన్సిపాల్‌తో మాట్లాడుతాను. అయితే, అక్కడి వాతావరణం నీ కొడుక్కి నచ్చుతుందో లేదో", అని చెప్పారు. ఈ ఆఖరి మాట శ్రీనివాస్ యొక్క బాహ్యమైన జుట్టు, దుస్తులు మొదలగు నవ నాగరిక లక్షణాలను గమనించి చెప్పినది.

ఏమైతేనేం, వారందరు కలసి బృందావన కళాశాల ప్రిన్సిపాల్ అయిన శ్రీ నరేంద్రను కలిశారు. అనుకున్నట్లుగానే అక్కడ వారికి అంత సాదరమైన ఆహ్వానం లభించలేదు. ప్రిన్సిపాల్ నరేంద్ర శ్రీనివాస్ యొక్క I.S.C. మార్కులు చూసి ముఖం చాలా ఇబ్బందికరంగా పెట్టారు. అయితే, ఆయన శ్రీనివాస్‌ను కళాశాలలో చేర్చుకోవడానికి విముఖత చూపలేదు. కాని, అక్కడ చదువుకునే విద్యార్థులందరి విషయంలో ఖచ్చితంగా పాటించే నియమాన్ని బట్టి శ్రీనివాస్ హాస్టల్‌లో ఉండడానికి స్వామి అనుమతి, ఆశీస్సులు అవసరమని చెప్పాడు.

అంతే కాకుండా, ఆ సమయంలో స్వామి ప్రశాంతి నిలయంలో ఉన్నారని చెప్పాడు. శ్రీనివాస్, అతని తండ్రి రాఘవేంద్రరావు మరియు చిన్నాయన కలసి ప్రశాంతి నిలయం చేరుకున్నారు. అక్కడ, స్వామి అనంతపురం వెళ్ళారని తెలిసింది. అయినప్పటికి, వారు తమ ప్రయత్నమును విరమించుకోలేదు. అనంతపురం కూడా వెళ్ళారు. వీళ్ళు అక్కడికి చేరుకునేటప్పటికి రాత్రి 8 గంటలు అయ్యింది. స్వామి అప్పటికే విశ్రమించడానికి వెళ్ళిపోయారని తెలిసింది. శ్రీ రాఘవేంద్రరావు యొక్క పరపతి, భగవాన్ బాబావారు హైదరాబాదులో వారి గృహమునకు వెళ్ళిన సంగతి తెలుసుకున్న అక్కడి వాలంటీర్లు ఆయన విజిటింగ్ కార్డు మేడమీదకు తీసుకువెళ్ళారు. వాళ్ళు వాలంటీర్ల రాకకొరకు ఎదురు చూస్తూ క్రింది పోర్టికోలో నిల్చున్నారు. ఇంతలో భగవాన్ బాబా మేడమెట్లు దిగి "రాఘవేంద్రరావు! ఎట్లా ఉన్నావు?" అని ఆప్యాయంగా పలుకరించారు.

రాఘవేంద్రరావు ముందుకు జరిగి బాబా పాదాలను స్పృశించి వినయ విధేతయలతో తన కుమారుని బృందావన్ కళాశాలలో హాస్టల్లో చేర్పించాలని వచ్చానని విన్నవించుకున్నాడు. అప్పుడు స్వామి "మీ అబ్బాయి ఎక్కడ?" అని ప్రశ్నించారు. అప్పుడు రాఘవేంద్రరావు చేతులు జోడించి దూరంగా నిల్చున్న తన కుమారుణ్ణి చూపించాడు. బాబా నేరుగా శ్రీనివాస్‌వద్దకు వెళ్ళి చిరునవ్వుతో అతని కళ్ళల్లోకి చూస్తూ "You are my boy" (నీవు నా వాడివే!) అన్నారు. ఆ నాలుగు మాటలు శ్రీనివాస్‌ని మంత్రముగ్ధుణ్ణి చేశాయి. అతనికి చాలా సంతోషమైంది. అయితే, స్వామి మాటలు అతనికి అప్పట్లో సరిగా అర్థం కాలేదు. ఆ బాలుని బాహ్య స్వరూపము, నవ నాగరిక వేషధారణ చూసి బాబా విముఖత ప్రదర్శించలేదు సరికదా, ప్రథమ వీక్షణంలోనే వారిరువురి మధ్య ఒక ఆప్యాయత నెలకొంది. ఫలితంగా భగవాన్ బాబా శ్రీనివాస్ తండ్రితో "మీ పిల్లవాడు బృందావనం కేంపస్‌లో చేరవచ్చు" అని చెప్పారు.

ఆ తరువాత స్వామి దృష్టి శ్రీనివాస్ చిన్నాయన రమణయ్య మీద పడింది. అతనిని చేయిపట్టుకుని మేడమెట్ల క్రిందికి తీసికొని వెళ్ళారు. శ్రీ రమణయ్య

బాబావారివద్దకు రావడం అదే ప్రథమం. సుమారు ఒక పది నిమిషాలు వారిద్దరిమధ్య ఉద్వేగ పూరితమైన సంభాషణ సాగింది. అక్కడ ఉన్న వారందరూ 'వారిద్దరూ దేనిని గురించి మాట్లాడుకుంటున్నారా' అని ఆశ్చర్యపోయారు. రమణయ్య 28 ఏళ్ళ యువకుడు. పట్టణ వాతావరణంలో పుట్టి పెరిగిన అతను ఇతర ఆధునిక యువకుల్లాగే హాయిగా ఆడుతూ పాడుతూ కాలం గడిపే వ్యక్తి. వారిద్దరిమధ్య జరిగిన సంభాషణ అంత లోతుగా, ఆధ్యాత్మిక పరమైనదిగా ఉండకపోవచ్చునని వారి భావన. పది నిమిషాల తర్వాత రమణయ్య బాబాకు వీడ్కోలు చెప్పి సెలవు తీసుకున్నాడు. బాబా అనుగ్రహపూర్వకంగా చిరునవ్వు నవ్వుతూ అభయ హస్తం ఎత్తి అందరినీ ఆశీర్వదించి మేడ మీదికి వెళ్ళిపోయారు. మత, ఆధ్యాత్మికపరమైన విషయాలకు దూరంగా ఉండే రమణయ్యకు, బాబావారికి మధ్య జరిగిన సంభాషణ ఏమిటో తెలుసుకోవాలని తండ్రి, కొడుకులిద్దరు చాలా ఆత్రుతగా ఉన్నారు. ఏమి మాట్లాడారని రమణయ్యను అడిగారు, రాఘవేంద్రరావు. దానికి రమణయ్య "ఈ బాబా సంగతేమిటో నాకు ఏమీ అర్థం కావడం లేదు. త్రాగుడువలన కలిగే దుష్పరిణామాలను గురించి, త్రాగరాదని నాకెందుకు చెప్పాలి? నేనేమైనా చిన్న పిల్లవాడినా? ఏదో అప్పుడప్పుడు సరదాగా కొంచెం త్రాగుతాను. అంతమాత్రానికే నేనెట్లా నాశనమవుతాను? చివరగా, ఈ వ్యసనాన్ని వదలిపెట్టకపోతే నాకు చాలా ప్రమాదం జరుగగలదని హెచ్చరించారు కూడాను", అని చెప్పాడు.

బాబా ఈ విధంగా తనకు ఉచిత సలహాలివ్వడం రమణయ్యకు ఏమాత్రం నచ్చలేదు. అయితే, అతని మనస్సు కొంత కలత చెందిన మాట నిజం. ఈ సంఘటన జరిగిన సంవత్సరం లోపునే భగవాన్ బాబావారు చెప్పిన మాటలు నిజమయ్యాయి. రమణయ్య మద్యపాన వ్యసనానికి బానిసై, చివరకు 30 ఏళ్ళ వయస్సులోనే చిన్న వయస్సులో ఉన్న భార్యను, ఉయ్యాలలోని పసిబిడ్డను వారి కర్మకు వారిని వదలి మరణించాడు.

బృందావనం కళాశాలలో చేరిన శ్రీనివాస్‌కు అక్కడి వాతావరణానికి, హైదరాబాదులోని పబ్లిక్ స్కూలు వాతావరణానికి మధ్య ఎంతో వైరుధ్యం కనిపించింది. అతను కళాశాలలో చేరినప్పుడు స్వామి బృందావన ఆశ్రమంలో లేరు. బయటి వ్యక్తులు ఎవరూ సాధారణంగా బృందావనం ఆవరణలోనికి వచ్చేవారు కారు. సుమారు ఒక వందకు లోపు విద్యార్థులు, తమ అధ్యాపకులతో కలసి హాస్టల్‌లో నివసించేవారు. కళాశాల భవనం మరియు హాస్టల్ కూడా ఆశ్రమానికి దగ్గరగానే ఉండేవి. ఆ రోజుల్లో ఈ భవనాలు, వాటిలోని సౌకర్యాలు మరియు ఇక్కడి వాతావరణం హైదరాబాదులోని పబ్లిక్ స్కూలుతో పోల్చుకుంటే చాలా ప్రాథమిక స్థాయిలో ఉన్నట్లు అనిపించేది. కాలేజీ కాంపౌండులో ఉండే బ్రహ్మాండమైన మర్రి వృక్షం, అక్కడికి దగ్గరలోనే ఉత్తర దిక్కులో ఉన్న హాస్టల్ భవనం కంటె చాలా ఎత్తుగా ఉండేది. బాల్యావస్థలో ఉన్న ఆ కేంపస్‌లో కొన్ని మార్పులు, చేర్పులు జరుగగలవని శ్రీనివాస్‌కు తెలుసు.

అయితే, ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే శ్రీనివాస్ ఈ క్రొత్త పరిసరాలకు, నియమ నిబంధనలకు చాలా తొందరగా అలవాటుపడిపోయాడు. అతని స్వభావంలో ఉన్న గొప్ప సుగుణం ఇదే! అతడు జీవితంలో ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా నడుచుకునే మనిషి. కేంపస్‌లో జరిగే సామూహిక ప్రార్థనలు మరియు అక్కడి ప్రశాంతమైన వాతావరణం, అతనికి తెలియకుండానే గతంలో తాను అనుభవించిన సమస్త సౌకర్యములతో కూడిన సుఖ జీవితముకంటె భిన్నమైన జీవితం కొరకు అతని అంతరంగము పడే తపనకు కొంత సాంత్వనను కలిగించాయి. అతను పుట్టిన వెంటనే మిగతా అందరు పిల్లలవలె ఏడవలేదట! దాంతో కంగారుపడిన తల్లిదండ్రులు కొన్ని కృత్రిమమైన ప్రక్రియలద్వారా అతనిని ఏదో ఒక విధంగా ఏడిపించడానికి ప్రయత్నించారు. కాని, ఆ పిల్లవాడు ఏడవడం మొదలుపెట్టిన తరువాత ఇక ఆపనేలేదు! ఈ అసాధారణ పరిస్థితికి కలత చెందిన అతని తండ్రి ఒక సాధువును సంప్రదించగా, ఆయన "ఈ బాలుడు పూర్వజన్మలో ఒక యోగి అయివుండవచ్చును. భగవంతునితో సంసర్గము చెంది దివ్యమైన ఆనందము ననుభవిస్తున్న తరుణంలో

ఆ దివ్యానుభూతికి అంతరాయము ఏర్పడి తిరిగి ఈ లౌకిక ప్రపంచములోనికి ప్రవేశించినందుకు విచారంతో ఉండియుండవచ్చు", అని వివరించాడు. శ్రీనివాస్ తన ఆధ్యాత్మిక స్వగృహమైన బృందావనమునకు చేరుకోక పూర్వము గడిపిన స్వేచ్ఛా జీవితము, అతని అంతరంగములో నిశ్చలంగా వెలుగుతున్న ఆధ్యాత్మిక జ్యోతిని ఆర్పివేయలేకపోయింది.

కొన్ని నెలల తరువాత భగవాన్ బాబా బృందావనమునకు విచ్చేశారు. స్వామి రాకతో బృందావనంలోని ఆశ్రమ వాతావరణం పూర్తిగా మారిపోవడం శ్రీనివాస్ గమనించాడు. అంతవరకు నిస్తేజంగా ఉన్న వాతావరణం అంతా బాబా రాకతో ఒక్కసారిగా చైతన్యవంతమై ఆధ్యాత్మిక వాతావరణంతో నిండిపోయింది. భక్తుల రాకపోకలతో ఆశ్రమమంతా చాలా సందడిగా ఉంది. కొన్ని నెలలుగా ప్రతి నిత్యము చూస్తున్న పరిచయస్థుల ముఖాలు ఒక నూతనోత్తేజముతో వెలిగిపోవడం శ్రీనివాస్ గమనించాడు. అక్కడ చేరిన ప్రతి ఒక్కరి ఆలోచనలు, భావాలలో భగవాన్ బాబావారే పూర్తిగా నిండియున్నారు. 'ఏదో జరుగబోతోంది, తమ కోరికలు ఫలించబోతున్నాయి', అనే చెప్పలేని ఆత్రుత, ఆనందం ఆ వాతావరణమంతా నిండిపోయింది. కాషాయ వేషధారియై స్వామి అక్కడున్న మర్రిచెట్టుక్రింద ఏర్పాటు చేయబడిన సింహాసనంలో ఆసీనులైనప్పుడు లేదా అక్కడ కూర్చున్న భక్తులమధ్య నెమ్మదిగా నడిచి వెడుతున్నప్పుడు, ప్రతిరోజూ చూసే ఆ మర్రిచెట్టు కూడా తన ఉనికికి ఒక క్రొత్త అర్థము, ప్రయోజనము సంతరించుకున్నదా అన్నట్లు కనపడింది. ఒక రోజు ఉదయం శ్రీనివాస్ ఇతర విద్యార్థులతో కలసి మందిరం బయట స్వామి దర్శనంకొరకు ఎదురుచూస్తూ కూర్చున్నప్పుడు, తన చిరకాల మనోవాంఛ నెరవేరబోతున్నదనే ఒక అనిర్వచనీయమైన ఆశాభావము అతని హృదయమంతా నిండిపోయింది. ఇంతలో భగవాన్ బాబావారు బయటకు వచ్చి విద్యార్థులు కూర్చున్న వరుసలమధ్య నెమ్మదిగా నడిచి వెడుతున్నారు. ఆ సమయంలో స్వామి ఒక్కసారి తనవైపు అనుగ్రహపూర్వకంగా చూస్తే చాలుననే తీవ్రమైన ఆకాంక్ష అతని హృదయంలో ఉత్పన్నమైంది. వెంటనే భగవాన్ బాబావారు

సూటిగా అతని కళ్ళలోకి చూస్తూ చిరునవ్వు నవ్వారు. శ్రీనివాస్‌యొక్క చిరకాల వాంఛ నెరవేరింది. అనుకోకుండా లభించిన ఈ అదృష్టానికి శ్రీనివాస్ ఆనందం పట్టలేక కన్నీటి ధారలు పొంగిపొరలి ప్రవహిస్తూండగా వెక్కివెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. అటువంటి అనుభవం అతనికి అంతకు మునుపు ఎప్పుడూ కలుగలేదు. మన జీవితాలకు అర్థము, పరమార్థము కల్పించి, మనల్ని తీర్చిదిద్దే అటువంటి అంతరంగ అనుభూతులు ప్రతి చిన్న విషయానికి కారణాలు వెతికే మన విమర్శనాత్మక మనస్సులకు అర్థం కావు. శ్రీనివాస్ హృదయంలోని భాషకందని భావాలకు, ఆధ్యాత్మిక జిజ్ఞాసాపరుడైన ఆ యువకుని ఆర్తికి స్వామి కరిగిపోయారు. అతని వద్దకు వచ్చి తలమీద మృదువుగా స్పృశిస్తూ 'వద్దు, వద్దు' అని ఓదార్చారు. నిజానికి అందరికి కనపడింది, బాహ్యంగా జరిగింది అంతే! కాని, అంతకు మించిన పరమార్థమేదో ఆ అనిర్వచనీయమైన సంఘటనలో ఇమిడియున్నది.

అదే క్షణంలో, భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య మంగళ స్వరూపమును సదా తన హృదయ మందిరంలో నిలుపుకోవాలనే తీవ్రమైన కోరిక అతనిని ఉన్మత్తుడిని చేసింది. ఆ కోరికను అతడు అణిచిపెట్టదల్చుకోలేదు. ఆ విధంగా అతను చెయ్యలేడు కూడా! తనను ఆవేశించిన తీవ్రమైన ఆ కోరికకు అతడు మనస్ఫూర్తిగానే లొంగిపోయాడు. ఆ కోరిక తనకు ఆనందమును చేకూర్చిందా లేక పరితాపము కలుగజేసిందా అన్న విషయం అతను తేల్చుకోలేకపోయాడు. ఒకవేళ అది పరితాపమును కలిగించే కోరికే అయినా, ఆ పరితాపంలోకూడా ఒక మాధుర్యమున్నది. ఆ క్షణంనుండి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారే శ్రీనివాస్‌కు జీవిత సర్వస్వమైపోయారు. భగవాన్ బృందావనంలో నివసించే రోజుల్లో అతడు ప్రతిరోజూ స్వామి మందిరానికి ఉండే కిటికీ ఎదురుగా రోజుకు 12 నుండి 14 గంటలసేపు ఉదయంనుండి సాయంకాలంవరకు స్వామి దర్శనంకొరకు ఎదురుచూస్తూ నిల్చుని ఉండిపోయేవాడు. ఇలా రోజులు, నెలలు గడిచిపోయేవి. ఆ సమయంలో అతనికి ఆకలి, దప్పికలను గురించిన ఆలోచనే ఉండేది కాదు. ఒక్కొక్కసారి

స్వామి ఆ కిటికీ తెరను తొలగించి అతని ఉనికిని గుర్తించినట్లుగా చిరునవ్వు నవ్వడమో, చెయ్యెత్తి ఆశీర్వదించడమో చేసేవారు. కొన్ని రోజులు ఈ దర్శనంకూడా లభించేదికాదు. అయినప్పటికి, అతను తన తపస్సును కొనసాగించాడు. స్వామి అతని ఓరిమికి, పట్టుదలకు బాగా పరీక్ష పెట్టారు. చివరకు, అతని తపస్సు ఫలించి అతనికి భగవాన్ సాన్నిధ్యం లభించింది. బాబా అప్పుడప్పుడు అతన్ని తన గదిలోనికి పిలిచి అపారమైన ప్రేమను, అనుగ్రహాన్ని అతనిపై వర్షించేవారు. దినదినానికి వీరిరువురిమధ్య గల సున్నితమైన బంధము గట్టి పడుతూ వచ్చింది. స్వామి ఎన్నో విషయాలను బోధించడమూ, శ్రీనివాస్ నేర్చుకోవడమూ జరిగింది. అవసరం వస్తే స్వామి చాలా కఠినంగా వ్యవహరించగలరని, చిన్నదైనా పెద్దదైనా అన్ని విషయాలలోను తమ ఆదేశాలను పూర్తిగా పాటించినప్పుడే స్వామి తృప్తి చెందుతారని శ్రీనివాస్ తెలుసుకున్నాడు. నిజానికి, స్వామికి సంబంధించినంతవరకు చిన్న విషయం, పెద్ద విషయం అంటూ ఏమీలేదు. సర్వకాల, సర్వావస్థలలోను జీవితంలో పూర్తి నిజాయితీని కలిగియుండడమే స్వామి ఆశించేది. బాబాయొక్క సర్వజ్ఞత్వమును, సర్వవ్యాపకత్వమును నిరూపించే ఎన్నో అనుభవాలను అతడు చవిచూచాడు. ఒక్కొక్కప్పుడు ఆ అనుభూతులు అతనికి దిగ్భ్రాంతిని కలిగించేవి; మరికొన్ని సమయాలలో బెదురు పుట్టించేవి కూడా! అయినప్పటికి, తన ప్రభువును తృప్తిపరచడానికి అతడు ఏమైనా చేసే స్థితికి చేరుకున్నాడు. శ్రీనివాస్ అన్ని విధాలుగా, ముఖ్యంగా చదువులో బాగా రాణించాలని భగవాన్ బాబావారు కాంక్షించడం వలన అతను కష్టపడి చదువవలసి వచ్చింది. ఆ సంవత్సరం బెంగుళూరు విశ్వవిద్యాలయం నిర్వహించిన సంవత్సరాంతపు పరీక్షలలో అన్ని పేపర్లను అతడు సంతృప్తికరంగానే వ్రాశాడు.

శ్రీనివాస్‌కు జీవితం చాలా సాఫీగా గడిచిపోతోంది; లేదా అతనే అలా భావించాడేమో! ఆ సమయంలో అతడు జీవితంలో ఎన్నో మధురక్షణాలను, ఆనంద పారవశ్యమును అనుభవించాడు. అయితే, భగవంతునిపై ప్రేమ అనే రహదారిలో పయనించి గమ్యస్థానం చేరాలంటే మధ్యలో ఎన్నో ఆటంకాలు,

ఆవేదనలు అనే సొరంగముల గుండా ప్రయాణం చేయవలసి వస్తుంది కూడా! బృందావనంలో అతను డిగ్రీ కోర్సులో రెండవ సంవత్సరం చదువుతున్నప్పుడు అటువంటి తీవ్రమైన ఆవేదనను ఒకసారి అనుభవించవలసి వచ్చింది. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఆ సంవత్సరం చాలా రోజులు మధ్యంతర సెలవులు ఇచ్చారు. భగవాన్ బాబావారి అనుమతిని, ఆశీస్సులను తీసుకుని, శ్రీనివాస్ ఘనాదేశములోని కుమాసి ప్రాంతంలో ఒక జనరల్ హాస్పిటలుకు డైరక్టరుగా పనిచేస్తున్న తన తల్లి దగ్గర కొన్ని రోజులు గడపడానికి వెళ్ళాడు. అయితే, యవ్వనంలో సహజంగా ఉండే చంచల స్వభావం చేత అక్కడ ఒక సందర్భంలో బాబా తనకు నిర్దేశించిన మార్గానికి భిన్నంగా ప్రవర్తించాడు. బహుశా బాల్యచాపల్యం చేత తానున్న ప్రదేశం పుట్టపర్తికి చాలా దూరంలో ఉన్నది కాబట్టి తాను ఏమి చేసినా స్వామికి తెలియదని భావించియుండవచ్చు. కాని, తొందరలోనే తన పొరపాటును గుర్తించాడు. రోజులు గడిచే కొద్ది భగవానుని దివ్య సన్నిధికొరకు అతని హృదయం ఆక్రోశించింది. రోజులు భారంగా గడుస్తున్నాయి. అతని మనస్సు రెక్కలు కట్టుకుని శరీరంకంటె ముందుగానే ప్రశాంతి నిలయంలోని తన చిత్తచోరుని చేరుకుంది.

నవరాత్రి ఉత్సవాలకు రెండు వారాలు ముందుగానే శ్రీనివాస్ ప్రశాంతి నిలయం చేరుకున్నాడు. కాని, బాబా అప్పటికే అతనిని 'రిపేరు షాపు'లో పెట్టేశారు! భగవాన్ బాబా అతనితో మాట్లాడకపోగా, అతనిని చూడడానికికూడా ఇష్టపడలేదు. స్వామి అసలు తన ఉనికినే మర్చిపోయారా అనిపించింది, శ్రీనివాస్‌కు. ఆగ్రహం నటించడంలోను, అనుగ్రహం కురిపించడంలోను స్వామికి స్వామియే సాటి! బాబా భక్తులను పరీక్షించే విధానం చాలా కఠినంగాను, దుర్భరంగాను ఉంటుంది. ఈ విషయంలో ఆయన చూపించే కాఠిన్యము భక్తులను వివశులను చేసే స్థాయికి చేరుకుంటుంది. కాని, చివరకు స్వామి వారిని నిరాశానిస్పృహల నుండి తేల్చి ఆనందపుటంచులను చూపిస్తారు. శ్రీనివాస్ ఆ సమయంలో ఎదుర్కొన్న కఠిన పరీక్ష కారణంగా అతని సున్నిత హృదయం ప్రక్కలయినట్టనిపించింది. ఈ అనుభవం అతనికి పూర్తిగా క్రొత్తది,

ఊహించనిదీను. పగలంతా అర్థంలేని స్తబ్ధత, రాత్రిపూట గాఢ నిశీధిలోని నిశ్శబ్దతలో తన హృదయము అనుభవిస్తున్న తీవ్రవేదన తొలగిపోయి తొందరలోనే ఉషోదయమవుతుందని తెలుసుకోగలిగే పరిపక్వము చెందిన వయస్సు కాదు, అతనిది. ఎల్లప్పుడు సరదాగా నవ్వుతూ, త్రుళ్ళుతూ ఆనందంగా ఉండే శ్రీనివాస్ ప్రవృత్తిలో అదొక నీలి నీడ.

ఆ రోజు నవరాత్రి ఉత్సవాల ముగింపురోజు. శ్రీనివాస్ తోటి విద్యార్థులతో కలసి ప్రశాంతి మందిరం వెనుక ఒక నూతన నిర్మాణ సందర్భంగా సేవా కార్యక్రమంలో పాల్గొంటున్నాడు. విద్యార్థులందరూ వరుసగా నిలబడి ఒకరి చేతిలోనుండి మరొకరి చేతిలోనికి ఇసుక తట్టలను అందిస్తూ నిర్మాణ స్థలానికి ఇసుకను చేరవేస్తున్నారు. సరిగ్గా అదే సమయంలో అతని మనస్సులో నిరాశా జనకమైన పిచ్చిపిచ్చి ఆలోచనలు ముసురుకున్నాయి. "నాలాంటివాడు ఉండవలసిన స్థలం కాదిది. బహుశా నాకిక్కడ ఉండే అర్హత లేదేమో! అటువంటప్పుడు నేనిక్కడ ఉండి ఏమి చేయాలి?" అని ఆలోచిస్తూ ఆ రోజు సాయంత్రం ప్రశాంతి నిలయం వదలిపెట్టి వెళ్ళిపోవాలని, మళ్ళీ ఇంకెప్పుడూ ఆ ఛాయలకు రాకూడదని మనసులో ఒక గట్టి నిర్ణయం చేసుకున్నాడు. సర్వజ్ఞులైన సత్యసాయి ప్రభువు ఈ లీలా వినోదమునకు ఇంక స్వస్తి పలకాలనుకున్నారు. ఆ అమాయక యువకుని పవిత్ర హృదయమును పరీక్షించే నాటకమును ముగించాలనుకున్నారు. ఈ సంకల్పము ఆయన హృదయంలో కలిగిన రెండు నిమిషాల లోపుగానే "శ్రీనివాస్ ఎవరు? స్వామి పిలుస్తున్నారు. మందిరానికి పరుగెత్తు", అన్న మాటలు శ్రీనివాస్‌కు వినిపించాయి. వెంటనే అతడు ఒక్క ఉదుటున స్వామి దగ్గరకు పరుగెత్తాడు. నిజానికి, అతడు అంతకు ముందెన్నడు అంత వేగంగా పరుగెత్త లేదు! అలా పరుగెత్తి మందిరం దగ్గరకు చేరుకోగానే అతణ్ణి మేడపై బాబా నివసిస్తున్న గదివద్దకు తీసుకువెళ్ళారు. ఇంతలో బాబా ఎదురు వచ్చి అతనిని చాలా ఆప్యాయంగా పలకరించి, ఈ మధ్యకాలంలో తమమధ్య అసలు ఏమీ జరుగనట్లే చాలా ప్రేమగా మాట్లాడారు. శ్రీనివాస్‌కు తన ప్రభువైన భగవాన్ బాబావారితో కలసి ఉండే మంచి రోజులు మళ్ళీ

నచ్చాయి. నిజానికి, వారిద్దరిమధ్య బంధము మరింత దృఢమై శ్రీనివాస్‌కు భగవత్సాన్నిధ్యం అంతకంతకు అధికంగా లభించింది.

బృందావనంలో శ్రీనివాస్ తృతీయ సంవత్సరం విద్యాభ్యాస కాలము ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నది. స్వామి, తమ సన్నిధిలో ఎన్నో గంటల సమయం గడిపే మహత్తర అవకాశం అతనికి అనుగ్రహించారు. ఇక, సెలవులలో కూడా బృందావనంలో గాని, ప్రశాంతి నిలయంలోగాని ఇంచుమించుగా తన సమయమంతా స్వామితోనే గడిపేవాడు. స్వామి అవతార కార్యక్రమంలో తానొక ముఖ్యపాత్ర వహించేందుకుగాను తనను తీర్చిదిద్దుతున్నారనే విషయాన్ని అతడు గ్రహించలేకపోయాడు. తన జీవిత గమ్యమైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య సన్నిధిలో ఉంటూ అతడు ఆనందంగా కాలం గడిపేశాడు. ఆ రోజు, ప్రశాంతి నిలయంలో అటువంటి ఒక ఆనందదాయకమైన రోజు, శ్రీనివాస్‌కు. అతను మరొక విద్యార్థితో కలసి భగవాన్ బాబావారి పాదాల చెంత కూర్చున్నాడు. ఆ సమయంలో స్వామి వారిని ఉద్దేశించి "భగవంతుడు తన సంకల్పమాత్రం చేత ఒకే వస్తువును అనేక వస్తువులుగా మార్చగలడని శాస్త్రాలు చెపుతున్న విషయం మీకు తెలుసా?" అని ప్రశ్నించారు. వెంటనే వాళ్ళిద్దరూ "అవును స్వామీ! మీరేది సంకల్పిస్తే అది సంభవిస్తుంది", అని చెప్పారు. అప్పుడు బాబా తమ హస్త చాలనంతో ఒక ఉంగరం సృష్టించి వారికి చూపించారు. తరువాత దానిని కుడి అరచేతిలో ఉంచుకుని ఒక్కసారి దాని మీద నోటితో ఊదారు. స్వామి పిడికిలి తెరచి చూచేటప్పటికి అయన అరచేతిలో రెండు ఉంగరాలు ఉన్నాయి. స్వామి చిరునవ్వు నవ్వుతూ తిరిగి వాటిని తమ అరచేతిలో ఉంచుకుని మళ్ళీ వాటిపై నోటితో ఊదారు. రెండు ఉంగరాలు నాలుగయ్యాయి. ఇలా ఒక్కొక్కసారి స్వామి ఊదినప్పుడల్లా నాలుగు, ఎనిమిది; ఎనిమిది, పదహారు ఉంగరాలు అయ్యాయి. చివరిసారిగా మరొక్కసారి ఆ పదహారు ఉంగరాలపై స్వామి ఊదగా, అక్కడ మళ్ళీ రెండు ఉంగరాలే మిగిలాయి. అప్పుడు స్వామి ఆ విద్యార్థులవైపు చూసి అమాయకంగా అగుపించే చిరునవ్వు నవ్వుతూ "ఇదంతా

ఒక తమాషా" అని వ్యాఖ్యానించి ఆ రెండు ఉంగరాలను వారిద్దరికి బహూకరించారు. తరువాత, చాలా గంభీరంగా "మీ హృదయాంతరాళములో దాగియున్న తీవ్రమైన కోరిక ఏమిటో మీకు తెలుసా?" అని ప్రశ్నించారు. అది వాళ్ళు ఊహించని ప్రశ్న. జీవితంలో వాళ్ళకు స్వామి తప్పించి మరొక ధ్యాసలేదు. అయినప్పటికి, స్వామి ప్రశ్నకు సరైన సమాధానం చెప్పలేమేమోననే భయంతో వాళ్ళు మౌనంగా ఉండిపోయారు. అప్పుడు భగవాన్ బాబా "ఆ కోరిక ఏమిటో నేను మీకు వ్రాసి చూపిస్తాను" అంటూ ఒక విద్యార్థిని పిలిచి అక్కడ బల్లమీద ఉన్న లెటర్ పాడ్ తెమ్మని అందులో ఒక కాగితాన్ని చింపి ఖాళీగా ఉన్న కాగితమును వాళ్ళిద్దరికి చూపించారు. తరువాత ఆ కాగితాన్ని ఒక సన్నని చుట్టలాగ చుట్టి ప్రక్కనే ఉన్న వెండి గ్లాసులోని నీటిలో ముంచారు. ఒకటి, రెండు క్షణాల తరువాత ఆ కాగితాన్ని తీసి మొదటి విద్యార్థికి ఇచ్చారు, చూసుకోమని! దానిని అందుకుని అతడు మడత విప్పి చూడగానే అందమైన దస్తూరితో ఆంగ్లభాషలో వ్రాయబడిన ఈ పంక్తులు కనిపించాయి :

"Grant me the perseverence to be by Thy door
all day and night" (స్వామీ! రాత్రింబగళ్ళు మీ ముంగిట
నిలువగలిగే పట్టుదలను నాకు ప్రసాదించండి!)

తిరిగి అదే లీలను స్వామి, శ్రీనివాస్‌కొరకు ప్రదర్శించారు. ఈసారి కాగితముపై ఈ విధంగా వ్రాయబడియున్నది :

"Grant me the strength to love Thee
with all my heart" (స్వామీ! హృదయపూర్వకంగా మిమ్మల్ని
ప్రేమించే శక్తిని నాకు ప్రసాదించండి!)

ఇదే శ్రీనివాస్ యొక్క ప్రగాఢమైన ఆకాంక్ష అని వేరే చెప్పనవసరం లేదు. "ప్రార్థన యొక్క పరమార్థము ప్రేమ; ప్రేమ యొక్క పరమార్థము ఆచరణ" ("The truth of Prayer is Love and the truth of Love is Action") అని ఒక సూక్తి ఉన్నది. స్వామిపై దినదిన ప్రవర్ధమానమవుతూన్న తన ప్రేమను శ్రీనివాస్

సుమారు మూడు దశాబ్దాలుగా ఆయన అవతార కార్యక్రమంలో పాలు పంచుకోవడం ద్వారా ఆచరణ పూర్వకంగా నిరూపించుకుంటున్నాడు.

ఏతావాతా, పరిగణిత విశ్వవిద్యాలయమైన (Deemed University) శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ భారతదేశములో ఉన్నత విద్యారంగములో మకుటాయమానమై ప్రకాశించడానికి ముఖ్య కారణం, భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారికి తమ విద్యార్థులపై గల అవ్యాజ, అసమాన ప్రేమయే! పాఠకులెవరైనా ఈ విషయమును గురించి ఇంకా ఎక్కువగా తెలుసుకోవాలనుకుంటే స్వామి విద్యార్థులను ఎవరినైనా అడగండి. ఆ విద్యార్థులలో ఒక్కొక్కరు ఒక్కొక్క కథకు, కాదు కాదు, ఏకంగా ఒక గ్రంథానికే సరిపడిన సమాచారం అందిస్తారు.



5

విశ్వవిద్యాలయ స్థాపనలో భగవానుని ఉపకరణములు

"భగవంతుని మార్గములో నడవాలనుకునేవారిని భగవంతుడే ఎంచుకుంటాడు", అని ఒక సందర్భంలో శ్రీ అరవింద యోగి పుంగవులు ఉద్ఘాటించారు. అదేవిధముగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు కూడా "నా సంకల్పము లేనిదే ఎవ్వరు నా వద్దకు రాలేరు", అని వెల్లడించారు. భగవాన్ బాబావారి అవతార కార్యక్రమంలో స్వయంగా స్వామిచేతనే ఉపకరణములుగా ఎంపిక చేయబడిన అదృష్టవంతులు కొంతమంది ఉన్నారు. బాలబాలికలు మరియు యువతీయువకుల విద్యకు భగవాన్ బాబావారి అవతార కార్యక్రమంలో ప్రత్యేకమైన స్థానం ఉన్నది. ఈ విషయాన్ని గురించి "నేను మూడువంతుల కాలాన్ని, శక్తిని నా విద్యార్థుల కొరకే వినియోగిస్తాను", అని స్వామియే ఎన్నోసార్లు చెప్పారు. ఉన్నత విద్యారంగములో తమ అవతార లక్ష్య సాధనకై స్వామి స్వయంగా ఎంపిక చేసిన కొందరు వ్యక్తులను గురించి ఈ అధ్యాయములో వివరింపబడుతుంది.

శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ (Deemed University) యొక్క మొట్టమొదటి వైస్ ఛాన్సెలరు డా॥ వినాయక కృష్ణ గోకాక్ శారీరకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా ఒక మహోన్నత వ్యక్తి. 1969వ సంవత్సరం ఆగష్టు నెలలో శ్రీ గోకాక్ 60వ జన్మదిన సందర్భంగా భగవాన్ బాబా మాట్లాడుతూ శ్రీ గోకాక్‌ను వసిష్ఠ మహర్షితో పోల్చారు. ఇంకా, ఆయనకు వ్యాస మహర్షికివలె విశాలమైన బుద్ధికూడా కలదని, స్వామి ప్రశంసించారు.

శ్రీ గోకాక్ యొక్క ఉన్నతమైన, ఉదాత్తమైన మేధాసంపత్తిని గురించి 1979వ సంవత్సరంలో ఒక రోజు సాయంసంధ్యా సమయంలో జరిగిన ఒక సంఘటనద్వారా నేను తెలుసుకున్నాను. భగవాన్ బాబావారు ఆ రోజున తమ కార్యక్రమాలు ముగించుకుని మందిరంలోనికి వెళ్ళిపోయినతరువాత, బయట తోటలో నేను, శ్రీ గోకాక్ కూర్చున్నాము. శ్రీ గోకాక్ కన్నడ భాషలో "భారత సింధురశ్మి" అనే ఇతిహాసమును రచిస్తున్న రోజులవి. ఆ ఇతిహాసము యొక్క ఇతివృత్తము "వేదకాలము నాటి మహర్షులు మరియు చక్రవర్తులయొక్క జీవితము – ఆలోచనా విధానము". ఆ సందర్భంలో మా ఇద్దరి మధ్య సంభాషణ ఈ విధంగా కొనసాగింది :

"సార్! మీ గ్రంథము ఎప్పుడు ప్రచురితమవుతుంది?" అని నేను అడిగాను.

శ్రీ గోకాక్ కొద్దిసేపు ఆలోచించి ఆకాశమువంక దృష్టిని సారిస్తూ "నరసింహమూర్తీ! ఒక్కసారి ఆకాశంవంక చూడు" అని చెప్పారు. అది సాయంసంధ్యవేళ. నేను ఆకాశంలోనికి చూడగా అక్కడక్కడా కొన్ని నక్షత్రాలు మిణుకుమిణుకుమంటూ ప్రకాశిస్తున్నాయి. నేను సమాధానం చెప్పే లోపలే ఆయన మళ్ళీ "నీకేం కనపడుతోందక్కడ?" అని ప్రశ్నించారు.

"సార్! ఆకాశవీధిలో నక్షత్రాలు కనిపిస్తున్నాయి", అని నేను సమాధానం చెప్పాను.

శ్రీ గోకాక్ "కేవలం నక్షత్రాలు కనిపించడమే కాదు, ఆకాశమనే కేన్వాస్‌పై భగవంతుడు రచిస్తున్న దివ్య వర్ణచిత్రం అది. సూర్యోదయమైన తరువాత ఆ నక్షత్రాలను నీవు మళ్ళీ చూడగలవా?" అని మరొక ప్రశ్న వేశారు.

"సార్! చూడలేను", అని అంగీకరించాను, నేను.

అప్పుడు శ్రీ గోకాక్ ఆ సన్నివేశమును వివరిస్తూ "భగవంతుడు ప్రతిరోజు సాయంసంధ్యవేళ తాను ఆకాశంలో రచించే చిత్రాన్ని మరునాడు ఉదయమే చెరిపివేస్తాడు. ఆ దృశ్యం, ఒక చిన్నారి బాలుడు పలక మీద ఒక పద్యమును వ్రాసి, కొంచెంసేపయిన తరువాత తుడిచివేయడం వంటిది. తాను వ్రాసిన

ఆ పద్యమును ప్రచురించాలనే కోరిక ఆ బాలునికి ఉంటుందా?" అని వ్యాఖ్యానించారు. శ్రీ గోకాక్ చేసిన వ్యాఖ్యలో ఇమిడియున్న మహోన్నత సత్యమును అర్థం చేసుకునే ప్రయత్నములో నన్ను నేనే మరచిపోయాను. ఆ మహాకవి ప్రశ్నకు నా వద్ద ప్రత్యుత్తరం లేదు.

శ్రీ గోకాక్ తిరిగి "ప్రతిరోజు ఆకాశంలో భగవంతుడు తన అద్భుత రచన అందించే ఆనందము కొరకే ఈ వైభవోపేతమైన చిత్రమును రచిస్తాడు; అవునా?" అని ప్రశ్నించారు. అందుకు నేను "అవును, సార్!" అని అంగీకరించాను.

ఈ సంభాషణను పొడిగిస్తూ శ్రీ గోకాక్ "తన అద్భుత సృష్టి యొక్క దివ్య సౌందర్యమును ఎవరైనా గమనిస్తున్నారా, లేదా అనే విషయం కూడా ఆయన పట్టించుకోడు. అంతేకదా!" అని వ్యాఖ్యానించారు. అందుకు నేను మళ్ళీ "అవును సార్!" అని తలూపాను.

శ్రీ గోకాక్ తిరిగి "మనం మానవమాత్రులం కాబట్టి మన చిన్న చిన్న రచనలను ప్రచురించాలని మనం ఉబలాటపడుతూంటాము. అంతేనా?" అని ప్రశ్నించారు. అందుకు నేను "అవును సార్!" అని అంగీకరించక తప్పలేదు.

మళ్ళీ శ్రీ గోకాక్ "ఎందుకో తెలుసా?" అని ప్రశ్నించారు. నిజం చెప్పాలంటే, ఆ ప్రశ్నకు సమాధానం నాకు తెలియదు. అందువలన "దయచేసి నాకు తెలియజేయండి" అని శ్రీ గోకాక్‌ను నేను అడిగాను.

"ఎందుకంటే, మానవ జన్మలోని ఆనందమును మనము పరిపూర్ణముగా గ్రహించే శక్తిలేనివారం కనుక", అని శ్రీ గోకాక్ సమాధానం చెప్పారు.

మహోన్నతమైన ఆయన ఆలోచనావిధానము మరియు భావౌన్నత్యము నన్ను పూర్తిగా వివశుణ్ణి చేశాయి. పరిపూర్ణమైన ఆ దివ్యానందముయొక్క వైభవము ఒక్క క్షణంపాటు లీలా మాత్రంగా నాకు గోచరించింది. మరుక్షణంలో

మా ఇద్దరిమధ్య నడిచిన ఈ సంభాషణ అంతా నిశ్చల, నీరవ నిశ్శబ్దతలో లయమైంది.

ఎట్టకేలకు, 1982వ సంవత్సరంలో "భారత సింధురశ్మి" గ్రంథము ముద్రితమై శ్రీ గోకాక్‌కు భారతదేశములోని అత్యున్నత సాహితీ పురస్కారమైన "జ్ఞానపీఠ్" పురస్కారమును సంపాదించి పెట్టింది.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు తమ విద్యావిధానములోని తత్వమును ప్రపంచానికి విశదీకరించడానికి మహామేధావియైన ఒక కవిపుంగవుణ్ణి ఎంచుకున్నారంటే, అందులో ఆశ్చర్యమేముంది? శ్రీ వినాయక కృష్ణ గోకాక్ ఆ బాధ్యతను అత్యంత సున్నితంగా, సమచిత్తముతో నిర్వహించారు. శ్రీ సత్యసాయి సమగ్ర విద్యావిధానమును గురించి, మానవతా విలువలను గురించి ఆయన రచించిన గ్రంథాలు విషయ వివరణలోగాని లేక విషయ పరిజ్ఞానములోగాని సాటిలేనివి. ప్రపంచవ్యాప్తముగా విద్యారంగములో ఒక వినూత్నమైన విప్లవమును సాధించడానికి ఆ గ్రంథాలు దోహదం చేశాయి. 1981వ సంవత్సరంనుండి 1984వ సంవత్సరం వరకు శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ (Sri Sathya Sai Institute of Higher Learning) కు వైస్ ఛాన్సెలర్‌గా పనిచేసిన పదవీకాలము శ్రీ గోకాక్‌కు ఒక ప్రేమపూర్వకమైన కృషి మాత్రమే. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి ప్రత్యక్ష మార్గదర్శకత్వము మరియు అనుగ్రహముతో శ్రీ గోకాక్ సలిపిన ఆ కృషి ఆయనకు ఒక గొప్ప విద్యావేత్తగా కీర్తి, ప్రతిష్ఠలు తెచ్చి, పరిపూర్ణమైన తృప్తిని అందించింది. అంతేకాక, ఆ విశ్వవిద్యాలయమును భారతదేశములోని విశ్వవిద్యాలయము లన్నింటిలోను అగ్రస్థానంలో నిలబెట్టింది.

1965వ సంవత్సరంలో శ్రీ గోకాక్ హైదరాబాదులోని సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లేంగ్వేజెస్ (CIEFL) కు డైరక్టరుగా పనిచేస్తున్నప్పుడు మొట్టమొదటిసారి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దర్శనం చేసుకున్నారు. కేరళ మరియు ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల మాజీ గవర్నరైన శ్రీ

బూర్గుల రామకృష్ణారావు శ్రీ గోకాక్‌ను ప్రశాంతి విద్వన్మహాసభలో భగవాన్ బాబావారి సన్నిధిలో ఉపన్యాసం ఇమ్మని కోరినప్పుడు, అప్పటికే ఒక తీవ్రమైన వ్యక్తిగత సమస్య విషయంలో భగవాన్ బాబావారిని కలుసుకుని ఆయన ఆశీస్సులు పొందాలని శ్రీ గోకాక్ అనుకున్నారు. ఆయన కుమార్తె మాల శారీరకంగా తీవ్ర అనారోగ్యమునకు గురై చివరికి అది మానసిక వ్యాధిగా పరిణమించింది. అనేకమంది వైద్యులు ఇచ్చిన సలహాలు, చేసిన చికిత్సలు ఏవీ ఫలించలేదు. అందువలన ఆయన తన సమస్యకు పరిష్కారము కొరకై భగవంతుని సహాయమును అర్థిస్తున్న తరుణంలో ఆయన శ్రేయోభిలాషులు ఇద్దరు భగవాన్ బాబావారివద్దకు వెళ్ళమని ఒకే నెలలో ఉత్తరాలు వ్రాశారు.

"కష్ట సమయాలలోనే మానవుడు ఎక్కువగా భగవంతుని చింతిస్తాడు", అనే ఒక నానుడి ఉన్నది. శ్రీ గోకాక్ జీవితములో ఏర్పడిన వ్యక్తిగత సమస్యలు ఆయనను భగవాన్ బాబావారి సన్నిధికి చేర్చాయి. అయితే, ఈ సాన్నిహిత్యం రెండు ఉన్నతమైన ప్రయోజనాలకు, అంటే శ్రీ గోకాక్‌యొక్క వ్యక్తిగత పరిణామ సాధనకు మరియు ప్రపంచవ్యాప్తమైన విద్యా విప్లవ సాధనకు దోహదం చేసింది. శ్రీ అరవిందులు, శ్రీ మాతలయొక్క గొప్ప భక్తుడు మరియు ఆధ్యాత్మిక సాధకుడు అయిన శ్రీ గోకాక్ ఈ విషయాన్ని చాలా శీఘ్రంగా గ్రహించగలిగారు. శ్రీ గోకాక్, భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య సన్నిధిలో ప్రశాంతి విద్వన్మహాసభలో ఉపన్యసిస్తూండగా ఆయనకు ఒక ఉత్తేజపూరితమైన అనుభూతి కలిగింది. తన వ్యక్తిగత చైతన్యము క్రమంగా వికసించి, ఉపన్యాసం పూర్తయ్యేటప్పటికి అంతకు పూర్వం శ్రీ అరవిందుల భౌతిక శరీర నిష్క్రమణచే తన హృదయంలో ఏర్పడిన శూన్యమును భగవాన్ బాబావారి దివ్య చైతన్యము నింపివేస్తున్నట్లు ఒక దివ్యమైన అనుభూతి కలిగింది. భగవాన్ బాబా అప్పటికే ఆయన హృదయంలో ప్రవేశించారు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి ప్రథమ దర్శనముచేత కలిగిన తన్మయత్వము వలన శ్రీ గోకాక్ హృదయమునుండి ఆనందస్రవంతి పొంగిపొరలి "దర్శన్" (Darshan) అనే ఒక ఆంగ్ల కవితగా బయల్వెడలింది :

"Have you seen Baba
who sets cities aflame with longing
And drenches them with the delight of existence?
you've missed the very meaning of your life
If you haven't seen him and been spoken to by him".

పై పద్యముయొక్క భావము ఇంచుమించుగా ఈ విధంగా ఉంటుంది :

"నగరాలకు నగరాలే ఆయన దర్శనంకోసం తపిస్తూ
అట్టుడికి పోతూంటాయి. అట్టి బాబాను మీరు చూచారా?
తమ దర్శనంతో ఆనంద సాగరంలో ముంచే బాబాను మీరు చూచారా?
ఆయన దర్శనం చేసుకోకపోయినా, ఆయన మీతో మాట్లాడక పోయినా
మీ జీవితానికి అర్థమే లేదు".

కొన్ని రోజుల తరువాత భగవాన్ బాబా శ్రీ గోకాక్‌ను, ఆయన భార్య శ్రీమతి శారదను ఇంటర్వ్యూకు పిలిచారు. ఆ ఇంటర్వ్యూ వారి ఆధ్యాత్మిక జీవయాత్రలో ఒక మైలురాయివంటిది. శ్రీమతి శారద కొన్ని సంవత్సరాల తరువాత, తన భర్త తన జీవితంలో దైవభక్తి మరియు ప్రేమకు ప్రాముఖ్యతను ఇచ్చేటట్లు చేసింది భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారేనని, మేధోపరమైన పరిశోధనలకు భక్తి ఆటంకము కాబోదనే సత్యమును బాబా ఆయనకు బోధించారని తన ఆత్మకథలో వ్రాసుకున్నారు. ఈ సంఘటన జరిగిన ఒక సంవత్సరంలోపుగానే శ్రీ గోకాక్ మరియు ఆయన భార్య, భగవాన్ బాబావారిలోనే శ్రీ అరవిందులు, శ్రీ మాత ఇద్దరూ ఉన్నారని తెలియజెప్పే అనేక అనుభూతులు పొందారు. అందులో కొన్ని స్వప్నములో జరిగినవి కూడా ఉన్నాయి. ఈ సత్యము, శ్రీ గోకాక్ బెంగుళూరు విశ్వవిద్యాలయమునకు వైస్ ఛాన్సెలరుగా పనిచేయడానికి వచ్చినపుడు వారి ఇంటిలోని పూజగదిలో ప్రత్యక్షంగా నిరూపింపబడింది. భగవాన్ బాబా మొట్టమొదటిసారి బెంగుళూరులోని శ్రీ గోకాక్ ఇంటికి వెళ్ళినప్పుడు, నేరుగా వారి పూజగదిలోనికి వెళ్ళారు. అక్కడ పూజా వేదికపై ఉన్నతస్థానంలో శ్రీ అరవిందుల ఫోటో ఉండి, భగవాన్ బాబావారి ఫోటో కొంచెం ప్రక్కగా అమర్చబడి యుండడంచేత స్వామి అక్కడికి వచ్చినపుడు

శ్రీ గోకాక్ కొంచెం ఇబ్బందిగా ఫీలయ్యారు. పూజగదిలోనికి వెళ్ళిన బాబా అక్కడ అమర్చబడిన దేవతామూర్తుల ఫోటోలలో ఒక ఫోటోనుండి క్రిందకు జారిపడిన గులాబీ పువ్వును తీసుకుని శ్రీ అరవిందుల ఫోటోపై ఉంచారు. అంతవరకు ఆందోళనతో సతమతమవుతున్న శ్రీ గోకాక్ మనస్సులో ఒక్కసారిగా అనిర్వచనీయమైన ప్రశాంతత నెలకొంది.

భగవాన్ బాబావారు అతిత్వరలోనే శ్రీ గోకాక్ కుటుంబమునకు పెద్ద దిక్కు మరియు ఇలవేల్పు అయ్యారు. ఆయన తమ దివ్యశక్తితో వారందరిని ప్రభావితం చేసి ఆ కుటుంబ సభ్యులందరి హృదయాలలో గొప్ప పరివర్తన తీసికొనివచ్చారు. శ్రీ గోకాక్ కుమారుడు అనిల్ 1966వ సంవత్సరములో మహారాష్ట్రలో ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులో చేరారు. ఆయన హేతువాది కావడంచేత, భగవంతునియందు ఆయనకు నమ్మకం ఉండేది కాదు. ఆయన 1966వ సంవత్సరంలో ఒకసారి తన తల్లిదండ్రులను చూడడానికి వచ్చినపుడు తన సోదరి మాలయొక్క శారీరక, మానసిక స్థితి చాలా అనూహ్యంగా మెరుగ్గా ఉండటం చూచి ఆశ్చర్యపోయారు. ఆయనకు చాలా సంతోషమైంది. అదంతా భగవాన్ బాబావారి అనుగ్రహ ఫలితమేనని ఆయన తల్లిదండ్రుల విశ్వాసం. ఈ పరిస్థితులలో శ్రీ అనిల్‌కు భగవాన్ బాబావారితో ప్రథమ పరిచయం ఏర్పడింది. అప్పటినుండి భగవాన్ శ్రీసత్యసాయి బాబావారిలో ఏదో ఒక మానవాతీతమైన దివ్యశక్తి నిక్షిప్తమైయున్నదనే చింతన ఆయనలో ప్రారంభమైంది. ఈ సంఘటన జరిగిన కొన్ని నెలల తరువాత మాల తన ఇహలోక యాత్రను ముగించుకొని భగవంతుని దివ్యధామం చేరుకుంది. ఆమె కుటుంబసభ్యులు, ఆమె అనుభవిస్తున్న దుర్భరమైన శారీరక, మానసిక వేదననుండి ఆమెకు విముక్తి కలిగించడానికే భగవాన్ బాబావారు తమలో ఐక్యం చేసుకున్నారని భావించారు. తన తండ్రి తార్కిక బుద్ధి మరియు శాస్త్రీయ దృక్పథం కలిగిన వ్యక్తి అయినప్పటికి భగవాన్ శ్రీసత్యసాయిబాబావారిపట్ల ప్రగాఢమైన విశ్వాసమును పెంచుకున్న తీరు చూసి శ్రీ అనిల్ మనస్సులో బాబావారిని గురించి, భగవంతుని ఉనికిని గురించి వినూత్నమైన ఒక ఆలోచనా పరంపర ప్రారంభమైంది.

1969వ సంవత్సరం ఆగష్టు నెలలో అనిల్ దంపతులు బృందావనంలో మొట్టమొదటిసారి భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్నారు. ఆ సందర్భంలో భగవాన్ తమ హస్తచాలనంతో ఒక అందమైన నెక్లెసును సృష్టించి శ్రీమతి అనిల్‌కు బహూకరించారు. తరువాత, గాలిలోనుండి ఒక పెద్ద ఆపిల్‌పండును సృష్టించి వారికి ప్రసాదించారు. అయితే, వీటన్నింటికంటె భగవాన్ బాబావారి అపారమైన ప్రేమశక్తి శ్రీ అనిల్ హృదయాన్ని వశం చేసుకుంది. భగవాన్ బాబావారి అనంతమైన దివ్యశక్తికి మూలాధారం ఆయన యొక్క అపారమైన ప్రేమయేనని, శ్రీ అనిల్ తన అంతరాత్మ ప్రబోధముచేత గ్రహించారు. దానికి తోడు, ఆయన తండ్రి శ్రీవినాయక్ కృష్ణ గోకాక్ కూడా భగవాన్ బాబావారి మహిమలు కేవలం ఆయనయొక్క దివ్యత్వమునకు నిదర్శనములేనని, అసలు భగవాన్‌యొక్క బహుముఖమైన దివ్యత్వ వైభవమును గురించి తెలుసుకోవాలంటే నిరంతర సాధనద్వారానే అది సాధ్యపడుతుందని తెలియజెప్పారు. ఈ విధంగా శ్రీ అనిల్ అంతరంగములో ఒక నూతనమైన పరిణామ ప్రక్రియకు నాందీప్రస్తావన జరిగింది.

1976వ సంవత్సరంలో శ్రీమతి శారదాగోకాక్ తీవ్ర అస్వస్థతకు గురి అయ్యారు. ఆమెకు సపర్యలు చేయడానికి అనిల్ దంపతులు బెంగుళూరు వచ్చారు. వైద్యులు శ్రీమతి శారదకు పరీక్షలు జరిపి ఆమెకు ఫ్లూరసీ వ్యాధి సోకిందని మూడు నెలల కంటె ఆమె జీవించడం సాధ్యంకాదని అభిప్రాయపడ్డారు. అయినప్పటికి, ఆమెకు శస్త్ర చికిత్స వలన కొంత ప్రయోజనం చేకూరవచ్చని సలహా ఇచ్చారు. అనిల్ మామగారు వృత్తిరీత్యా వైద్యశాస్త్రంలో పేరుగాంచిన ప్రొఫెసర్. ఆయనకూడా ఈ ప్రతిపాదన వైపు మొగ్గు చూపారు. ఆ పరిస్థితులలో శ్రీగోకాక్ కుటుంబమంతా కలిసి భగవాన్ బాబావారి ఆశీస్సులు మరియు సలహాకొరకు బృందావనం చేరారు. భగవాన్ బాబా వారిని చూచి శ్రీమతి శారదకు విభూతిని సృష్టించి యిచ్చి " ఆమెకు తొందరలోనే నయమవుతుంది. ఎటువంటి శస్త్ర చికిత్స అవసరం లేదు" అని చెప్పారు. ఆ మరునాడు ఆమె ఛాతీకి ఎక్స్‌రే తీసి పరిశీలించగా అక్కడ ఎటువంటి ఇన్ఫెక్షన్

లేకపోవడం గమనించిన వైద్యనిపుణులు విస్తుపోయారు. ఈ సంఘటన జరిగిన తరువాత ఆమె 18 సంవత్సరాలు జీవించారు. తన సహధర్మచారిణికి ఆరోగ్యమును, తన కుమారునికి భగవంతునియందు విశ్వాసమనే భాగ్యమును ప్రసాదించిన భగవాన్ బాబావారికి శ్రీ గోకాక్ కృతజ్ఞతాంజలి ఘటించారు.

బెంగుళూరు విశ్వవిద్యాలయమునకు వైస్ ఛాన్సెలరుగా, సిమ్లాలోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఎడ్వాన్స్‌డ్ స్టడీస్‌కు డైరెక్టరుగా పనిచేసి పదవీ బాధ్యతలనుండి విముక్తులైన తరువాత శ్రీ గోకాక్ తన భార్యతో కలసి బృందావనంలో భగవాన్ బాబావారి దివ్యసన్నిధిలో కాలం గడుపుతున్న సమయంలో భగవాన్ దివ్యశక్తికి నిదర్శనములైన ఎన్నో మహిమలను దర్శించుకునే భాగ్యం ఆయనకు కలిగింది. శ్రీ గోకాక్ వివరించిన అటువంటి అద్భుత సంఘటన ఒకటి ఈ విధంగా ఉన్నది:


"భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి దివ్యసన్నిధిలో ఉండడం వలన కలిగే ప్రత్యక్ష ప్రభావము లేక సమగ్రమైన ప్రభావము అనే పదములకు నా దృష్టిలో భావమును వివరించడానికి ఒక సంఘటనను ఉదాహరిస్తాను. ఒకసారి ఇటలీ దేశమునుండి 40 మంది భక్తులు స్వామిని దర్శించుకోవడానికి బృందావనం వచ్చారు. ఆ సమయంలో నేను అక్కడే ఉన్నాను. వారిలో చాలా మందికి ఇంగ్లీషులో ఒక్క మాట మాట్లాడటంగాని, అర్థం చేసుకోవడంగాని చేతకాదు. భగవంతుడు మానవరూపం ధరించి వచ్చిన అవతార పురుషుని సందర్శన భాగ్యం కొరకే వారు సుదూర ప్రాంతము నుండి ప్రగాఢమైన భక్తితో వచ్చారు. స్వామి వారందరిని ఇంటర్వ్యూకు పిలిచారు. ఇంటర్వ్యూ గదిలో వారందరూ కలసి క్రిక్కిరిసి కూర్చున్నారు. నేను కూడా ఆ గదిలో ఒక మూలగా కూర్చున్నాను. భగవాన్ ముందుగా అనుగ్రహపూర్వకమైన చిరునవ్వుతో వారందరిని ఆశీర్వదించి, తరువాత వారిలో కొద్దిపాటి ఆంగ్లభాషా పరిజ్ఞానముగలవారితో కొంచెంసేపు ఇంగ్లీషులో మాట్లాడారు. తరువాత, ఆ బృందములో అనేక సంవత్సరాలుగా క్రచెస్ (ఊత కర్రలు) సహాయంతో మాత్రమే లేచి నించోవడం,

నడవటం చేస్తున్న ఒక వ్యక్తిని పిలిచి ఆ క్రచెస్‌ను తనకు ఇచ్చివేయుమని ఆదేశించారు. వాటిని తీసుకున్న తరువాత బయట భజన హాలువైపు చూపిస్తూ "నీవిప్పుడు భజన హాలులో కూర్చున్న భక్తులవద్దకు నడిచి వెళ్ళి వాళ్ళదగ్గర కూర్చో" అని చెప్పారు. చాలాకాలంగా అంగవైకల్యంతో బాధపడుతూ ఒక్క అడుగుకూడా వేయలేని స్థితిలో ఉన్న ఆ వ్యక్తి అతి కష్టంమీద లేచి నిలుచుని సందేహిస్తూనే తన కాళ్ళను కదిలించడానికి ప్రయత్నం చేశాడు. కొద్దిగా కదిలించగలిగాడు. క్రొత్తగా నడక నేర్చుకుంటున్న పసిపిల్లవాడివలె తప్పటడుగులు వేస్తూ నెమ్మదిగా నడక ప్రారంభించాడు. ఆ తరువాత భజన బృందము వద్దకు మెల్లగా, ఆత్మవిశ్వాసంతో నడుచుకుంటూ వెళ్లగలిగాడు. అనేక సంవత్సరాలుగా అంగవైకల్యముతో నడవలేని స్థితిలో ఉన్న తమ తోటి వ్యక్తి తనంతటతాను లేచి నిలబడడం, నడవడం చూచిన ఆ ఇటలీ భక్త బృందం అవధులు లేని ఆనందోత్సాహాలతో "జీసస్ మళ్ళీ వచ్చేశారు" అని ఎలుగెత్తి చాటారు. భాషకు అతీతమైన తమ భావాలను, ఆనందమును తమ చుట్టూఉన్నవారితో పంచుకోవడానికి ఎన్నో రకాల సంజ్ఞలతో ప్రయత్నం చేశారు. భగవాన్ బాబా సాక్షాత్తూ దివ్య పురుషుడే (God man) నని గ్రహించడానికి వారికి ఈ ఒక్క మహిమయే చాలు.


అత్యంత ఆనందోత్సాహములు, ఉత్కంఠతతో నిండిన ఆ దృశ్యము, బైబిలుయొక్క క్రొత్త నిబంధన (New Testament) లో ఉటంకింపబడిన ఏసుక్రీస్తుయొక్క "నీవు పరిపూర్ణ ఆరోగ్యవంతుడవు కమ్ము" (Be thou whole) అనే వాక్యమును, తక్షణమే ఆ వ్యక్తి అద్భుతమైన రీతిలో రోగ విముక్తుడైన దృశ్యమును నాకు స్ఫురణకు తెచ్చింది. ఏసుక్రీస్తు జీవితకాలములో అలనాడు జరిగిన ఆ అద్భుత సంఘటన ఎంత స్పష్టంగా ఆయన చుట్టూ చేరిన జనులకు గోచరించిందో, అంత స్పష్టంగా ఇప్పుడు జరిగిన ఈ సంఘటన నాకు గోచరించింది. భగవాన్ బాబావారి మహిమలయొక్క ప్రత్యక్ష ప్రభావం అంటే ఇదే అని నా ఉద్దేశ్యం. ఈ అద్భుత దృశ్యము నా మనసులో చెరగని ముద్రవేసింది. శ్రీ సత్యసాయిబాబా సాక్షాత్తూ భగవంతుడే అనే యథార్థ




"బెంగుళూరులోని డా॥ గోకాక్ గృహంలో భగవాన్ బాబా"



"డా॥ గోకాక్ మనుమని ఉపనయన సందర్భంగా
భగవాన్ బాబాతో వటువు"



"అనంత దివ్యశక్తి సంపన్నుడైన ప్రేమమూర్తి"



విషయమునందు విశ్వాసము పెంచుకోవడానికి మనం ఎవరితోను వాదోపవాదములకు దిగవలసిన అవసరం లేదు, ఎవరినీ నమ్మించవలసిన అవసరం కూడా లేదు. ఇటువంటి ఒక అద్భుత దృశ్యమును ఒక్కసారి చూస్తే చాలు, ఎవరికైనా జీవితంలో ఎన్నటికీ చెరిగిపోని విశ్వాసం కలుగుతుంది. పండితులు, పామరులు అనే భేదంలేక ప్రతి ఒక్కరిలో ఇటువంటి పరివర్తన కలుగుతుంది".

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యప్రేమ, అపార జ్ఞానసంపద మరియు మానవాతీత శక్తులకు నిదర్శనములైన అటువంటి ఎన్నో అనుభవాలు శ్రీ గోకాక్‌కు భగవంతునియందు సంపూర్ణ శరణాగతిని నేర్పాయి.

శ్రీ గోకాక్ శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయమునకు వైస్ ఛాన్సెలరుగా ఉన్నప్పుడు, ప్రశాంతి నిలయం కేంపస్‌లోని హాస్టల్‌కు వార్డెన్‌గా పనిచేసే అద్భుతమైన అవకాశం నాకు లభించింది. ఆ సమయంలో నేను శ్రీ గోకాక్‌నుండి ఉన్నత విద్యారంగమునకు సంబంధించిన అనేక అమూల్యమైన విషయాలను నేర్చుకున్నాను. అంతేకాకుండా ఆయనకు, ఆయన గురువైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారికి మధ్య గల మధురమైన అనుబంధమును గుర్తించాను. ప్రశాంతి నిలయం హాస్టల్ వార్డెన్‌గా పనిచేసే సమయంలో మొదట కొన్ని నెలలపాటు విద్యార్థుల శీల నిర్మాణం విషయంలో శ్రీ గోకాక్ స్వయంగా ఇంకా ఎక్కువ చొరవ తీసికొని ఉంటే బాగుంటుందని నా మనసుకు అనిపించింది. పరిపక్వత చెందని ఆనాటి నా యవ్వన దశలో నేను కొద్దిగా స్వతంత్రించి శ్రీ గోకాక్‌తో "సార్! నేనేమైనా తప్పుగా మాట్లాడితే దయచేసి నన్ను క్షమించండి. విద్యార్థుల శీల నిర్మాణమును గురించి మీరు పెద్దగా పట్టించుకున్నట్లు నా మనసుకు తోచడం లేదు. దీనికి తప్పక ఏదో కారణం ఉండి ఉంటుందని నేను అనుకుంటున్నాను", అని నివేదించుకున్నాను. శ్రీ గోకాక్ నా అజ్ఞానానికి, అమాయకత్వానికి జాలితో చిరునవ్వు నవ్వుతూ "నీవీ విషయం నా దగ్గర ప్రస్తావించడం నాకు సంతోషదాయకమే! నా స్వానుభవంతో నేను గ్రహించిన

విషయమేమిటంటే, స్వామి ఒక్కరే విద్యార్థుల వ్యక్తిత్వమును తీర్చిదిద్దగల దివ్య శిల్పి. మన పని, ఈ విషయంలో ఆయనకు సహాయపడడం వరకే! ఈ సత్యాన్ని నీవు తొందరలోనే తెలుసుకుంటావని నాకు తెలుసు. మరొక్క విషయం. ఈ సత్యాన్ని నీవు ఎంత త్వరగా గ్రహిస్తే నీకు, విద్యార్థులకు కూడా అంత మంచిది. భగవానుని మార్గానికి అడ్డురాకుండా ఉండేటట్లు మనం నిరంతరం కృషిచేయాలి", అని హితవు చెప్పారు. భగవాన్ దివ్య సన్నిధిలో ఉంటూ ఆయన తలపెట్టిన ఏదో ఒక కార్యక్రమంలో సేవచేసే అదృష్టమును పొందిన వారందరికి ఈ హెచ్చరిక వర్తిస్తుంది.

శ్రీ వి.కె. గోకాక్ యొక్క 75వ జన్మదిన సందర్భంగా భగవాన్ బాబావారు ఏర్పాటుచేసిన ఒక సభలో మాట్లాడుతూ శ్రీ గోకాక్ "నేను నా జీవితంలో ఒక ముఖ్యమైన పాఠం నేర్చుకున్నాను. అది, స్వామి దివ్యచరణారవిందములవద్ద సంపూర్ణ శరణాగతిని చెందడం, ఆయన ఆదేశములననుసరించి నడుచుకోవడమును. అందులోనే నా జీవితానికి సాఫల్యము ఉందని నేను గ్రహించాను", అని ఉద్ఘాటించారు.

కల్నల్ జోగారావు కూడా భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి అవతార కార్యక్రమంలో అంకిత భావంతో సేవలందించి తన జీవితమును సఫలం చేసుకున్న ధన్యజీవి. డా॥ వి.కె. గోకాక్ విద్వాంసుడు (Man of letters) అయితే, కల్నల్ జోగారావు భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి అవతార కార్యక్రమంలో భాగంగా నిర్మింపబడే వివిధ సంస్థల భవనాల నిర్మాణమును పర్యవేక్షించే ఇంజనీరు (Man of Drawings). ఉద్యోగరీత్యా ఆయన సివిల్ ఇంజనీరు కావడంచేత, డీమ్డ్ యూనివర్సిటీ అయిన శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ యొక్క ప్రశాంతి నిలయం, అనంతపురం మరియు బృందావన్ కేంపస్‌లలో నిర్మింపబడిన బ్రహ్మాండమైన భవన సముదాయములు మరియు విద్యాగిరిపై నిర్మింపబడిన మహోన్నతమైన రాజప్రాసాదమువలె అగుపించే విశ్వవిద్యాలయ పరిపాలనా భవనముయొక్క నిర్మాణంలో ఆయన సారథ్యం వహించారు.

అంతేకాకుండా విశ్వమంతటిని నిర్మాణము చేసిన విశ్వశిల్పి (Architect of the Universe) భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారితో కల్నల్ జోగారావుకు గల అనుబంధము అత్యంత సన్నిహితమైనది, మధురమైనది మరియు సాటిలేనిది. కల్నల్ జోగారావుకు భగవాన్ బాబావారియందు గల భక్తి, ప్రపత్తులు, నవవిధ భక్తులలోని సఖ్య భక్తికి నిదర్శనంగా ఉంటాయి.

శ్రీ జోగారావు బాల్యమునుండి కృష్ణ భక్తుడు. అయినప్పటికి, ఆయనకు సన్యాసులన్నా, కాషాయాంబరధారులన్నా అంతగా ఇష్టం ఉండేది కాదు. బెంగుళూరు నగరములోని హిందుస్థాన్ ఏరోనాటిక్సు సంస్థలో ఇంజనీరుగా బాధ్యతలనుండి విరమించుకున్న తరువాత, ఆయన ఇంజనీరింగ్ నిర్మాణపనులు (Construction) మరియు యాజమాన్య (Management) విభాగములకు చెందిన కొందరు నిపుణులతో కలసి ఒక ఇంజనీరింగ్ కన్సల్టెన్సీ సంస్థను ప్రారంభించారు. 1969వ సంవత్సరములో ఒక రోజు ఆయన ఆఫీసునుండి రాగానే తన పూజగదిలో పీఠముపైన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి చిత్రపటము అమర్చబడియుండడం చూశాడు. ఆ ఫోటోను ఆయన భార్యకు ప్రక్క ఇంట్లో ఉండే బాబా భక్తురాలైన శ్రీమతి రామస్వామి ఇచ్చారు. శ్రీ రామస్వామి దంపతులు చిరకాలంగా బాబా భక్తులుగా ఉంటూ బృందావనంలో అనేక సేవా కార్యక్రమాలలో పాల్గొనేవారు. భగవాన్ బాబా చిత్రపటం తన పూజా మందిరంలో ఉండడం చూచిన శ్రీ జోగారావు కొద్దిగా కలత చెందారు. దాంతో ఆయన భార్య ఆ పటమును అక్కడినుండి తీసి తన బీరువాలో దాచిపెట్టింది.

కొన్ని దినముల తరువాత భగవాన్ బాబావారు శ్రీ జోగారావు ఇంటికి పొరుగున ఉన్న శ్రీ రామస్వామి ఇంటికి విచ్చేశారు. ఆయన అక్కడ ఆ కుటుంబ సభ్యులతో కలసి భోజనం చేశారు. శ్రీ జోగారావు మరియు ఆయన భార్యనుకూడా ఆ విందుకు ఆహ్వానించడం జరిగినా, శ్రీ జోగారావు అక్కడికి వెళ్ళడానికి ఇష్టపడలేదు. కాని, తన భార్య పట్టుపట్టడంవలన ఆయన వెళ్ళారు. అక్కడ భగవాన్ బాబావారు శ్రీ జోగారావుతో చాలా ప్రేమగా మాట్లాడారు. ఆయనను బృందావనమునకు రమ్మని ఆహ్వానించారు. భగవాన్ బాబావారి

సరళ, సౌజన్య వైఖరి శ్రీ జోగారావు హృదయాన్ని ఆకట్టుకుంది. అనతికాలంలోనే ఆయన భగవాన్ బాబావారి ఆశ్రమమైన బృందావనానికి వెళ్ళారు. ఆ ఆశ్రమంలోని భక్తి పూర్వక ప్రశాంత వాతావరణము, అక్కడ చేరిన జనసందోహంలో నెలకొనియున్న క్రమశిక్షణ శ్రీ జోగారావుపై గొప్ప ప్రభావము చూపాయి. శ్రీ జోగారావును చూడగానే భగవాన్ బాబావారు ఆప్యాయంగా పలుకరించి లోనికి ఆహ్వానించారు. వారిరువురి సంభాషణలో యాదృచ్ఛికంగా భగవాన్ బాబా అనంతపురంలో నిర్మింపబడుతున్న స్త్రీల కళాశాల భవన నిర్మాణ కార్యక్రమాన్ని పర్యవేక్షించమని శ్రీ జోగారావును ఆదేశించారు. ఇంజనీరింగు వృత్తిపట్ల ప్రగాఢమైన అభిరుచి, ఆసక్తి గల శ్రీ జోగారావు ఈ ఆహ్వానమును అంగీకరించారు. ఈ సంఘటన శ్రీ జోగారావు జీవితంలో ఒక నూతనాధ్యాయమునకు నాంది పలికింది.

ప్రతిభాశాలియైన ఆ ఇంజనీరుకు భగవాన్ బాబావారి దివ్యత్వమును గుర్తించడానికి ఎంతో కాలం పట్టలేదు. అయితే, ఇదే సమయంలో కరుణామయులైన సాయి ప్రభువు తమ దివ్యతత్త్వమును వెల్లడించే ఎన్నో అనుభూతులను శ్రీ జోగారావుకు అనుగ్రహించారు. ఈ సందర్భంగా శ్రీ జోగారావే స్వయంగా వెల్లడించిన అటువంటి ఒక దివ్యానుభూతిని గురించి తెలుసుకుందాం :

"అనంతపురంలో స్త్రీల కళాశాలయొక్క భవన నిర్మాణం జరుగుతున్న రోజుల్లో అక్కడి పనుల అభివృద్ధిని పర్యవేక్షించేందుకు నేను తరుచు అనంతపురం వెళ్ళేవాడిని. ఒకసారి నేను బెంగుళూరు నుండి అక్కడికి బయలుదేరుతూండగా స్వామి 'నీ ప్రయాణం ఒక్కరోజు వాయిదా వేసుకో' అని చెప్పారు. కాని, నాకు మరునాడు కంపెనీలో అతి ముఖ్యమైన మీటింగు ఉండడంవలన నేను నా ప్రయాణాన్ని మరునాటికి వాయిదా వేసుకునే పరిస్థితిలో లేను. అందువలన నేను తప్పనిసరిగా ఆ రోజే అనంతపురం బయలుదేరాను. పెనుగొండ చేరేదాకా ప్రశాంతంగా ఉన్న వాతావరణం ఉన్నట్లుండి ఒక్కసారి మారిపోయి ఆకాశమంతా

మబ్బులు క్రమ్మి మరుక్షణంనుండి ఎడతెరిపి లేకుండా వర్షం కురియసాగింది. అప్పటికప్పుడు భారీ వర్షం కురిసిన కారణంగా ఆ ప్రాంతమంతా నీరు పొంగిపొరలి ప్రవహిస్తూండడంవలన, నా కారు అక్కడే పల్లంలో ఉన్న ఒక కాలువలో కూరుకుపోయింది. అప్పుడు నేను భగవాన్ బాబావారిని తలుచుకుని నాకు సహాయం చేయుమని ఆయనను ప్రార్థించాను. తక్షణమే సమీప గ్రామము నుండి అనేక మంది వ్యక్తులు అక్కడ ప్రత్యక్షమై నా కారుతో సహా నేను ఆ కాలువను దాటడానికి సహాయము చేశారు. అనుకున్నట్లుగా నేను అనంతపురం వెళ్ళి చేయవలసిన పనిని పూర్తిచేశాను.

నేను బృందావనమునకు తిరిగి వస్తున్నప్పుడు మళ్ళీ భారీ వర్షం కురవసాగింది. పెనుగాలులు కూడా వీచాయి. ఆ గాలికి ఒక పెద్ద చెట్టు రోడ్డుకు అడ్డంగా పడిపోయినందువలన నేను కారును ఆపవలసి వచ్చింది. అప్పటికే చీకటి పడింది. ఈ పరిస్థితులలో నాకేం చెయ్యాలో తోచలేదు. భగవాన్ బాబావారి హెచ్చరికను పాటించి ఉండవలసిందని అప్పుడు నేను అనుకున్నాను. ఏమయితేనేం మళ్ళీ స్వామి నామస్మరణ ప్రారంభించి నాకు సహాయం చేయుమని ప్రార్థించాను. అంతే! మళ్ళీ అదే సన్నివేశం! కొందరు స్థానిక ప్రజలు ఆ వర్షంలో ఎక్కడినుంచో వచ్చి నాకు సహాయపడ్డారు. వాళ్ళందరూ కలసి రోడ్డుప్రక్కనుండి కారు వెళ్ళడానికి వీలుగా వేరే ఒక దారి ఏర్పరచి ప్రయాణానికి అనుకూలంగా చేశారు. ఆ ప్రక్కదారిలో నేను నెమ్మదిగా కారు నడుపుతూండగా కుడివైపున నీటిలో మునిగిపోయిన రోడ్డు వంపును గమనించలేదు. ఫలితంగా ఆ క్షణంలో నా కారు మళ్ళీ ఒక గుంటలోనికి కూరుకుపోయేదే! ఇంతలో హఠాత్తుగా నా ప్రమేయం లేకుండానే కారు దానంతట అది ఆగిపోయింది. అంతేకాకుండా ఎవరో అడ్డదారిలో ఉన్న నా కారును అమాంతం పైకి ఎత్తి సరైన దారిలో ఉంచారు. నిశ్చయంగా భగవాన్ బాబావారి అదృశ్యహస్తమే ఆ పరిస్థితులలో నన్ను రక్షించిందని నేను నమ్మాను. చివరకు, రాత్రి చాలా పొద్దుపోయిన తరువాత నేను బెంగుళూరు చేరగలిగాను. ఇక్కడొక విషయం చెప్పాలి. అసలు ఈ మొత్తం ప్రయాణమంతా దారి

పొడుగునా నేను స్వామి నామజపం చేస్తూనే ఉన్నాను. మరునాడు ఉదయం నేను బాబాను చూడడానికి వెళ్ళినపుడు, బాబా క్రితంరోజు నేను ప్రయాణంలో ఎదుర్కొన్న కష్టాలన్నీ పూసగ్రుచ్చినట్లు వర్ణించారు. తాను నా వెంట, జంట ఉండి నన్ను కాపాడానని చెప్పారు. నేను డ్రైవ్ చేస్తున్న కారు రోడ్డు ప్రక్కన గుంటలో పడిపోవడానికి సిద్ధంగా ఉన్నప్పుడు, తానే దానిని ఎత్తి మళ్ళీ సరియైన దారిలో ఉంచానని కూడా ధ్రువీకరించారు! నా జీవితంలో అటువంటి ప్రమాదాలనుండి తప్పించి స్వామి నన్ను రక్షించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. అవన్నీ స్వామి యొక్క దివ్యత్వమునకు నిదర్శనములే!"

శ్రీ జోగారావుయొక్క నిస్వార్థమైన అంకితభావము మరియు నైపుణ్యము విషయంలో ఎన్నడూ రాజీపడకూడదనే దృఢవైఖరి ఆయనను భగవాన్ బాబావారికి అత్యంత విశ్వాసపాత్రుడైన సేవకునిగా నిలబెట్టాయి. ఫలితంగా భగవాన్ బాబావారు శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయముయొక్క మూడు కేంపస్‌లు మరియు ప్రశాంతి నిలయము, బృందావనములలోని ఆశ్రమాలను అభివృద్ధి చేసే ప్రణాళికలలో శ్రీ జోగారావుకు సంపూర్ణ సహాయ, సహకారములందించి ఆయన సేవలను పూర్తిగా వినియోగించుకున్నారు. శ్రీ జోగారావు మాటలలో చెప్పాలంటే "బాబా ప్రతి ఒక్క ప్రణాళికను ఒక చిన్న పథకముగా ప్రారంభించి, నిర్మాణ సమయంలో దానిని జాగ్రత్తగా పరిశీలించి, తరువాత క్రమంగా అభివృద్ధి పరుస్తారు. ఆయన ఏదైనా ఒక పథకము ఒక తేదీ నాటికి పూర్తి కావాలనుకుంటే ఆ తేదీ నాటికి అది ఖచ్చితంగా పూర్తయి తీరుతుంది. ఆయన వజ్ర సంకల్పముయొక్క శక్తి అటువంటిది. ఆ పథకము కార్యరూపం దాల్చేటప్పుడు ఎన్నైనా సమస్యలు ఎదురవవచ్చును; కాని స్వామి సంకల్పించిన తేదీ నాటికి ఆ పథకము పూర్తయ్యే తీరుతుంది".

1972వ సంవత్సరములో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు యొక్క దస్తావేజు పత్రమును రిజిష్టరు చేయించడానికి శ్రీ జోగారావు హైదరాబాదు వెళ్ళవలసి వచ్చింది. దానికి సంబంధించిన మిగతా పనులను సమన్వయం చేసుకుంటూ

తమ హైదరాబాదు ప్రయాణానికి కూడా ఏర్పాట్లను చేయడానికి స్వామి శ్రీ జోగారావును నియోగించారు. ఈ డాక్యుమెంటు రిజిస్ట్రేషను చేసే సమయంలో ట్రస్టు సభ్యులందరూ అక్కడ హాజరుకావలసి ఉంది. అందువలన, శ్రీ జోగారావు ఆ సమయంలో బొంబాయిలో ఉన్న నవానగర్ రాజమాతకు ఫోన్ చేసి శ్రీ నానీ పాల్కీవాలా మరియు శ్రీ ఇందూలాల్ షాతో కలసి హైదరాబాదు రమ్మని చెప్పారు. శ్రీ పాల్కీవాలా బొంబాయిలో లేరని, తాను మాత్రం ఇందూలాల్‌తో కలసి హైదరాబాదు వస్తానని రాజమాత ఆ రోజు రాత్రి శ్రీ జోగారావుకు ఫోనులో చెప్పారు. ఆ ఫోనుకాల్ వచ్చేటప్పటికి భగవాన్ బాబా విశ్రాంతికై తమ గదిలోనికి వెళ్ళిపోవడంచేత శ్రీ జోగారావు ఈ సమాచారమును ఆయనకు అందజేయలేకపోయారు. ఆ మరునాడు రాజమాత తాను వస్తున్నట్లుగా భగవాన్ బాబావారికి తెలుపుతూ పంపిన టెలిగ్రాంను శ్రీ జోగారావు అందుకున్నారు. ఆ సమయంలో అక్కడే ఉన్న ఆంధ్రప్రదేశ్ శ్రీ సత్యసాయిసేవా సంస్థల రాష్ట్ర అధ్యక్షులు శ్రీ ప్రసాదరావుకూడా ఈ టెలిగ్రాంను చూశారు. వాళ్ళిద్దరూ కలిసి ఈ టెలిగ్రాంను భగవాన్ బాబావారి వద్దకు తీసికొని వెళ్ళారు. భగవాన్ ఆ టెలిగ్రాం చదివి "జోగారావ్! వాళ్ళు రావడం లేదు!" అని వ్యాఖ్యానించారు. శ్రీ జోగారావు సంభ్రమాశ్చర్యములు ముప్పిరిగొనగా ఆ టెలిగ్రాంను పదేపదే చదివారు. టెలిగ్రాంలో సరిగ్గా బాబా చెప్పినట్లే ఉంది. శ్రీ జోగారావు, ప్రసాదరావు ఆశ్చర్యంతో నోట మాటరాక ఒకరి నొకరు చూచుకున్నారు. తరువాత మధ్యాహ్న భోజన సమయంలో బాబా నవ్వుతూ ఆ టెలిగ్రాంను మళ్ళీ వీళ్ళ చేతికిచ్చి చదువమన్నారు. అందులో మళ్ళీ పోష్టాఫీసులో తాము టెలిగ్రాం తీసుకున్నప్పుడు ఏ మాటలు చూచారో, చదివారో సరిగ్గా అలాగే ఉన్నాయి. బాబా వీళ్ళతో పరిహాసమాడే తీరు అదే మరి!

శ్రీ జోగారావు ఒక సందర్భంలో భగవాన్ బాబావారిని "స్వామీ! మీ నిజస్వరూపమును గురించి తెలియజేయండి", అని అడిగారు. దానికి సమాధానంగా బాబా నవ్వుతూ "బంగారూ! ఏదో ఒక రోజు నేను నీకు చూపిస్తానులే" అన్నారు. ఆ రోజు చాలాకాలం తరువాత వచ్చింది. అది,

1978వ సంవత్సరం మహాశివరాత్రి పర్వదినం. అంతకు ముందు సంవత్సరం, అంటే, 1977వ సంవత్సరం శివరాత్రి పర్వదినమున ప్రశాంతి నిలయంలో స్వామి నోటినుండి లింగము వెలువడే లింగోద్భవ పవిత్ర దృశ్యమును ఒక్క క్షణంపాటు దర్శించుకోవడానికి అసంఖ్యాకమైన జనం వచ్చి త్రొక్కిసలాట జరిగిన విషయాన్ని, ఆ కారణంగా భక్తులకు కలిగిన కష్టమును దృష్టిలో ఉంచుకుని స్వామి ఇకపై శివరాత్రి ఉత్సవాలు బహిరంగ ప్రదేశములలో జరుగవని, వచ్చే సంవత్సరమునుండి భక్తులు తమ తమ ఊళ్ళలోనే శివరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలని ప్రకటించారు. అందువలన, 1978వ సంవత్సరం మార్చి 7వ తేదీన గురువారమునాడు జరుగవలసిన శివరాత్రి ఉత్సవాలు జరుగుతాయా, ఆ సమయంలో స్వామి ఎక్కడుంటారు, అని భక్తులు అనుకొంటూండగా మార్చి 4వ తేదీ తెల్లవారుఝామున 4 గంటలకు స్వామి తన వెంట కొద్దిమంది విద్యార్థులను, భక్తులను తీసికొని ఊటీ వెళ్ళిపోయారు. తరువాత 7వ తేదీ ఉదయం స్వామి ఊటీ నుండి ముదుమలై అరణ్యమునకు తన బృందముతో బయలుదేరారు. ఈ అరణ్యము ఊటీనుండి మైసూరు వెళ్ళే దారిలో ఉంది. కొంతదూరం ప్రయాణం చేసిన తరువాత స్వామి అక్కడ ఒక కొండమీద నిర్మింపబడిన అతిథి గృహంలో కొంచెంసేపు విశ్రాంతికై ఆగారు.

అక్కడ ఉదయపు ఫలహారం తీసుకున్న తరువాత భగవాన్ బాబా అతిథి గృహమునకు ముందున్న పచ్చిక మైదానములోనికి వెళ్ళి అక్కడ తన వెంట వచ్చిన విద్యార్థులు, భక్తులలో ప్రతి ఒక్కరితోను విడివిడిగా ఫోటోలు తీయించుకున్నారు. ఆ ఫోటోలన్నీ ఒక విద్యార్థి తన వద్దనున్న పోలరాయిడ్ కెమెరాతో తీశాడు. అందువలన ఫోటోలన్నీ వెంటవెంటనే ఎవరివి వారికి ఇచ్చివేయడం జరిగింది. చివరగా, భగవాన్ బాబా ఆ విద్యార్థిని తనను కూడా ఒక ఫోటో తీయుమని చెప్పారు. ఇంతలో ఆయన ధరించిన అంగీయొక్క అంచు అక్కడున్న ముళ్ళపొదలో చిక్కుకుంది. అందువలన, స్వామిని ఫోటో తీయడానికి ఆ విద్యార్థి కెమెరాను క్లిక్ మనిపించేముందు శ్రీమతి రతన్‌లాల్ గబగబా స్వామి చెంతకు పరుగెత్తి అంగీ మడతలు సరిచేసేందుకు

ప్రయత్నించింది. సరిగ్గా ఆమె ముందుకు దూసుకువస్తున్న సమయంలో స్వామి ఒక్కసారి "నన్ను ముట్టుకోవద్దు" అని తీవ్ర స్వరంతో వారించారు. వెంటనే ఆమె వెనుకకు తగ్గింది. సాధారణంగా ఎప్పుడూ పరమశాంతంగా ఉండే స్వామి ఆవిధంగా కేక పెట్టేటప్పటికి, అందరూ ఆశ్చర్యపోయారు. కెమెరా క్లిక్ చేయబడి అందులోనుండి ఫోటో బయటికి వస్తూండగా భగవాన్ బాబా దానిని తీసికొని శ్రీ జోగారావుకిచ్చారు. అయన ఫోటోను తన అరచేతిలోనికి తీసుకోగానే అది డెవలప్ అవడం ప్రారంభించింది.

అయితే, ఆ ఫోటోలో కనపడిన దృశ్యం శ్రీ జోగారావును ఆశ్చర్య చకితుని చేసింది. ఆ బ్లాక్ అండ్ వైట్ ఫోటోలో కాషాయాంబరధారియైన భగవాన్ బాబావారికి బదులు ఒక యువకుని రూపం కనపడింది. నేలవరకు జీరాడుతున్న శ్వేత వస్త్రము ధరించిన ఆ దివ్యమూర్తికి మూడు శిరస్సులు, ఆరు హస్తములు ఉన్నాయి! ప్రతి హస్తములోను ఒక్కొక్క దివ్యత్వచిహ్నమున్నది. ఎడమవైపు మోచెయ్యి ఠీవిగా నించున్న ఒక గోవుపై ఆనించియున్నది. ఆ దివ్యమూర్తి వెనుక భాగములో నాలుగు శునకములు కనపడుతున్నాయి. అయితే, మూడు శిరస్సులలోని మధ్య శిరస్సుయొక్క ముఖ భాగము భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి ముఖమును పోలియున్నది! ఈ దివ్య రూపము పురాణములలో వర్ణింపబడిన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల త్రిమూర్తి స్వరూపమైన దత్తాత్రేయునిది. ఈ విధంగా భగవాన్ బాబావారు తమ నిజస్వరూపమును, శ్రీ జోగారావు చాలాకాలం క్రిందట వేసిన ప్రశ్నకు సమాధానంగా చూపించారు. అదే ఆయన నిజస్వరూపము. అపురూపమైన ఆ దివ్య సృష్టిని కనుల విందుగా తిలకించి ఆ దివ్యరూపమును అక్కడున్న వారందరూ తమ హృదయాలలో పదిలపరచుకున్న తరువాత, ఆ ఫోటో అదృశ్యమైపోయింది. ఆ మరునాడు ఉదయం బృందావనంలో విద్యార్థులతో మాట్లాడుతూ భగవాన్ బాబా నిజానికి ఆ ఫోటోలో ఉన్నదే తమ నిజస్వరూపమని ధ్రువీకరించారు. మరొక్క విశేషమేమిటంటే, ఆ సమయంలో కనుక శ్రీమతి రతన్‌లాల్ తనను తాకివుంటే ఆమె జీవించియుండేది కాదని భగవాన్ బాబా వివరించారు.

శ్రీ జోగారావు కుటుంబసభ్యులను భగవాన్ బాబావారు ఆపదలో ఆదుకున్న సందర్భాలు ఎన్నో ఉన్నాయి. ఆయన పెద్ద కుమార్తెకు ఒక మూత్రపిండము (Kidney) సరిగా పనిచేయకపోవడం వలన శస్త్రచికిత్స ద్వారా దానిని తొలగించాలని బెంగుళూరులోని ఒక నర్సింగ్‌హోమ్‌లో వైద్యులు అభిప్రాయపడ్డారు. శస్త్రచికిత్స జరగడానికి ముందు రోజున శ్రీ జోగారావు ప్రశాంతి నిలయం వెళ్ళి భగవాన్ బాబావారిని కలుసుకున్నారు. ఆయన ఇంకా ఏమీ మాట్లాడక ముందే భగవాన్ బాబా "జోగారావ్! మూత్రపిండమును తొలగించనవసరం లేదు. ధైర్యంగా ఉండు; అన్నీ చక్కబడతాయి", అని చెప్పి ఆయన కుమార్తెకు విభూతిని సృష్టించి యిచ్చారు. ఆ మరునాడు ఉదయం శ్రీ జోగారావు బెంగుళూరు తిరిగి వచ్చి నర్సింగ్‌హోమ్‌లో ఉన్న తన కుమార్తెను చూడడానికి వెళ్ళినపుడు ఆమె చిరునవ్వులు చిందిస్తున్న ముఖంతో "నాన్నగారూ! స్వామి నా కోసం సృష్టించి యిచ్చిన విభూతి ఇవ్వండి. స్వామి నిన్న రాత్రి యిక్కడికి వచ్చి నా కిడ్నీ తీసివేయవలసిన అవసరంలేదని, విభూతిని పంపిస్తానని చెప్పారు", అని చెప్పింది. అంతే! ఆ తరువాత అంతా సవ్యంగా జరిగిపోయిందని వేరే చెప్పాలా!

ఒకసారి, శ్రీ జోగారావుకు తీవ్రమైన ఛాతినొప్పి వచ్చి గుండె జబ్బు లక్షణాలు అన్నీ కనిపించాయి. వెంటనే ఆయనను బెంగుళూరులోని ఒక పేరు పొందిన ప్రైవేటు హాస్పిటలులో చేర్పించి ఐ.సి.యు (Intensive care unit) లో ఉంచారు. ఆ సమయంలో భగవాన్ బాబా ప్రశాంతి నిలయంలో ఉన్నారు. భగవాన్ తప్పక శ్రీ జోగారావును చూడడానికి వెడతారని అక్కడ అందరూ అనుకున్నారు. నిజానికి, బెంగుళూరులోని హాస్పిటలు సిబ్బంది సైతం బాబావారి రాకకు ఎదురు చూస్తూ అవసరమైన ఏర్పాట్లు చేయసాగారు. ఇంతలో ప్రశాంతి నిలయంలో సాయంకాల దర్శన సమయంలో మందిరం పోర్టికోలో ఉన్న పెద్దలు, విద్యార్థులతో స్వామి "జోగారావుకు బాగాలేదు. అతనిని చూడడానికి నేను బెంగుళూరు వెళ్ళాలి", అని చెప్పారు. డ్రైవరు అప్పటికే స్వామి బెంగుళూరు వెళ్ళడానికి కారు సిద్ధం చేశాడు. ఇక, భగవాన్ బాబా


బెంగుళూరు వెళ్ళడం ఖాయమని అందరూ అనుకున్నారు. అంతలో బాబా తన గదిలోనికి వెళ్ళి కొంతసేపైన తరువాత బయటకు వచ్చి "నేను బెంగుళూరు వెళ్ళి జోగారావును చూచి వచ్చాను. అతను బాగానే వున్నాడు. నేను బెడ్‌మీద అతని ప్రక్కనే కూర్చున్నాను. అక్కడ నాకు కుర్చీ ఏర్పాటు చేయలేదని అతడు చాలా బాధపడ్డాడు", అని చెప్పారు. ఆ రోజు మధ్యాహ్నం శ్రీ జోగారావు అల్లుడు ఆయనను చూడడానికి హాస్పిటలుకు వెళ్ళగా "స్వామి వచ్చి నన్ను ఆశీర్వదించి వెళ్ళారు. ఇక్కడ ఒక కుర్చీకూడా లేకపోడంచేత స్వామి నా పడకమీదనే కూర్చోవలసి వచ్చింది" అని చెప్పారు. కొన్ని రోజులు పోయాక శ్రీ జోగారావును ఐ.సి.యునుండి ప్రత్యేకమైన గదిలోనికి తరలించిన తరువాత భగవాన్ బాబా బెంగుళూరు వెళ్ళి ఆస్పత్రిలో జోగారావును పరామర్శించి వచ్చారు.

ఒక రోజు సాయంకాలం శ్రీ జోగారావు భగవాన్ బాబావారితో కలసి భోజనం చేయడానికి డైనింగ్ హాలుకు వెళ్ళినపుడు బాబా "జోగారావ్! ఇప్పటికే చాలా ఆలస్యమైంది. తక్షణమే ఇంటికి వెళ్ళు" అని ఆయనను ఆదేశించారు. సాధారణంగా ప్రతిరోజూ భగవాన్ బాబావారితో కలసి భోజనం చేసే అలవాటున్న శ్రీ జోగారావు ఆ రోజున స్వామి అలా ఆదేశించేటప్పటికి చాలా ఆశ్చర్యపోయారు. అయినప్పటికి స్వామి ఆజ్ఞను తప్పనిసరిగా పాటించవలసిన అవసరం ఉన్నందున, కొంచెం చిన్నపుచ్చుకున్న మనస్సుతో మందిరం విడిచివెళ్ళారు. ఇంటికి వెళ్ళడానికి కారు దగ్గరకు వెడుతూండగా ఆశ్రమంలోని కాటేజిలో నివసించే స్నేహితుడొకాయన తన ఇంటికి వచ్చి కొంచెం ఫలహారం చేసి వెళ్ళుమని ఆహ్వానించాడు. ఆయన ఆహ్వానాన్ని అంగీకరించి శ్రీ జోగారావు ఆయన ఇంటికి వెళ్ళారు. కొంతసేపయిన తరువాత, తన భార్య హఠాత్తుగా ఇంటి వద్ద స్వర్గస్థురాలైనట్లు ఆయనకు అక్కడికి ఫోనులో సమాచారం అందింది. వెంటనే ఆయన అఘమేఘాలమీద ఇంటికి చేరుకున్నారు. అయితే, భగవాన్ బాబావారు అప్పటికే అక్కడ ఉన్నారు. అంతేకాకుండా, భగవాన్ ఆమె మృత శరీరముపై కప్పడానికి ఒక అందమైన కంచిపట్టు చీర కూడా తెచ్చారు! శ్రీ

జోగారావును చూచిన వెంటనే భగవాన్ బాబా "జోగారావ్! నిన్ను వెంటనే ఇంటికి వెళ్ళమని చెప్పాను కదా! నువ్వు నా మాట వినలేదు", అని చెప్పారు. భగవాన్ బాబావారి ఆజ్ఞను పాటించకుండా తాను చాలా తప్పు చేశానని తెలుసుకున్న శ్రీ జోగారావు పశ్చాత్తాపముతో వెంటనే ఆయన పాదాలపై పడ్డారు.

భగవాన్ బాబావారు ఒక సంవత్సరం తమ జన్మదినోత్సవ సందర్భంగా శ్రీ జోగారావును సన్మానిస్తూ అక్కడ చేరిన అసంఖ్యాక జనం ముందు ఉపన్యసిస్తూ "మీకందరకు ఈయన కల్నల్ జోగారావుగా మాత్రమే తెలుసు. కాని నాకు మాత్రం ఈయన కర్మయోగి జోగారావు" అని ఉద్ఘాటించారు. ఆ సందర్భంగా ఆయన శ్రీ జోగారావుకు రెండు స్వర్ణకంకణములు మరియు ఒక వెండికంచము ఇచ్చి సత్కరించారు. ఆనాటి సభలో భారత రాష్ట్రపతి శ్రీ ఆర్. వెంకటరామన్ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి డా॥ మర్రి చెన్నారెడ్డి వేదికపై ఆసీనులైయున్నారు. ఆ తరువాత రాష్ట్రపతి శ్రీ వెంకటరామన్ ప్రోద్బలంపై ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డి శ్రీ జోగారావు చేసిన నిస్వార్థ సేవలకు గుర్తింపుగా ఒక జాతీయ అవార్డును స్వీకరింపుమని కోరారు. అయితే, శ్రీ జోగారావు రాష్ట్రపతి మరియు ముఖ్యమంత్రికి తమ కృతజ్ఞతలు తెలుపుకుంటూనే "నేను సాక్షాత్తూ భగవంతుని చేతుల మీదుగా అత్యున్నతమైన పురస్కారమును ఇప్పుడే అందుకున్నాను. మరే ఇతర పురస్కారములు అందుకునే ఆలోచన కూడా పెట్టుకోవడం సమంజసం కాదని నేను భావిస్తున్నాను", అని చెప్పి మర్యాదపూర్వకంగా వారి కోరికను తిరస్కరించారు. అదీ, కర్మయోగి శ్రీ జోగారావు యొక్క అసలైన వ్యక్తిత్వం!

1983వ సంవత్సరం నవంబరు 22వ తేదీన డీమ్డ్ యూనివర్సిటీ అయిన శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క ద్వితీయ స్నాతకోత్సవ సందర్భముగా ఛాన్సెలరు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా అనుగ్రహభాషణం (Benedictory Address) చేస్తూ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సెలరుగా డా॥ వి.కె. గోకాక్ అందించిన నిస్వార్థ సేవలను కొనియాడుతూ "శ్రీరామునికి లక్ష్మణునివలె, వైస్ ఛాన్సెలరు



"ముదుమలై వనంలో భగవాన్ బాబా"



" దత్తాత్రేయ స్వరూపంతో భగవాన్ బాబా-పోలరాయిడ్ ఫోటో"



"ప్రభువు వెంట శ్రీ జోగారావు"

గోకాక్‌తో రిజిస్ట్రారు చక్రవర్తి చెయ్యిచెయ్యి కలిపి పనిచేశారు", అని ఉద్ఘాటించారు. శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయమునకు మొట్టమొదటి రిజిస్ట్రారుగా ఎంపిక చేయబడిన శ్రీ కె. చక్రవర్తి "వివేకము, భావోద్వేగము మరియు కార్యదక్షత సమపాళ్ళలో మేళవించబడి, సమచిత్తము కలిగిన ఉత్తమ వ్యక్తి. బాహ్యంగా గంభీర హృదయుడైన మేధావిగా కనిపించే శ్రీ చక్రవర్తి మనస్సు అతి సున్నితమైనది, కోమలమైనదీను. శ్రీ చక్రవర్తి తన అంతరంగములోని పిలుపు ననుసరించి కేవలం 45 సంవత్సరాల నడివయసులోనే ఇంకా ఎన్నో ఉన్నత పదవులు అలంకరించవలసిన ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీస్‌ను స్వచ్ఛందంగా విడిచిపెట్టి ప్రభుత్వ సర్వీసునుండి భగవంతుని సేవకు (From Government to God) తరలివచ్చారు.

భక్తి, ప్రపత్తులు గల వైష్ణవ కుటుంబములో జన్మించిన శ్రీ చక్రవర్తికి భగవద్విశ్వాసము మరియు నైతిక, ఆధ్యాత్మిక విలువలపట్ల గౌరవము సహజంగానే అలవడినాయి. శ్రీ చక్రవర్తి ఆర్థిక, న్యాయశాస్త్రములలో విశ్వవిద్యాలయ పట్టా తీసికొని 1960వ సంవత్సరములో 24 ఏళ్ళ వయస్సులో ఐ.ఏ.యస్. కు సెలక్టయి ఆంధ్రరాష్ట్రములో పనిచేయడానికి నిశ్చయించుకున్న ముఖ్య కారణం, ఈ రాష్ట్రంలో తిరుమల తిరుపతి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దివ్యధామము ఉండడమే! కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో 15 సంవత్సరాలపాటు అనేక పదవులు నిర్వహించిన శ్రీ చక్రవర్తిని 1975వ సంవత్సరములో అనంతపురం జిల్లాకు కలెక్టరుగా నియమించారు. ఆయన తన పదవీకాలములో అత్యంత సమర్థుడు, నిజాయితీపరుడు అయిన ఐ.ఏ.యస్. అధికారిగా పేరుపొందారు.

శ్రీ చక్రవర్తి తన జీవితంలో దర్శించిన మొట్టమొదటి ఆశ్రమము, పుట్టపర్తి గ్రామంలోని ప్రశాంతి నిలయము. అంతకు ముందు ఆయన ఎన్నో దేవాలయాలు సందర్శించారు కాని, అప్పటివరకు ఏ ఆశ్రమంలోగాని, మఠంలోగాని ఏ మత గురువు లేక ఆధ్యాత్మిక గురువును గాని దర్శించియుండలేదు. తన భార్య శ్రీమతి సుధయొక్క బలవంతముచేత మరియు

అనంతపురం జిల్లా పోలీసు సూపరింటెండెంటు, తన తోటి ఆఫీసరు అయిన మేజరు విశ్వనాథ్ తరుచుగా చేసే ప్రోద్బలంవలన శ్రీ చక్రవర్తి ప్రశాంతి నిలయం వెళ్ళి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దర్శనం చేసుకోవడానికి నిశ్చయించుకున్నారు. అనంతపురంనుండి ప్రశాంతి నిలయానికి వెళ్ళే దారిలో ఆయన తన భార్యతో తనకు గనుక భగవాన్ బాబావారితో సంభాషించే అవకాశము లభిస్తే ఆయనను భగవద్గీతలోని 18వ అధ్యాయమును గురించి ఒక ప్రశ్న అడుగుతానని చెప్పారు. శ్రీ చక్రవర్తి తన భార్య శ్రీమతి సుధతో కలసి ప్రశాంతి నిలయము చేరుకున్న తరువాత భగవాన్ బాబా వారిద్దరిని ఇంటర్వ్యూకు పిలిచారు. ఆ ఇంటర్వ్యూలో స్వామి శ్రీ చక్రవర్తితో మాట్లాడిన మొట్టమొదటి మాట "నేను నీకు క్రొత్త కావచ్చు; కాని నువ్వు నాకు క్రొత్త కాదు" అని. ఆ భార్యాభర్తలిద్దరూ ఇంటర్వ్యూ గదిలో స్వామితో గడిపిన ఆ గంట వ్యవధిలోను స్వామి వాళ్ళిద్దరికి తన ఆప్యాయతతో, మృదుమధుర సంభాషణతో తన మాటలలోని యథార్థమును వాళ్ళు గ్రహించేటట్లు చేశారు. యుగయుగాల నుండి తాము ప్రేమిస్తున్న, సాన్నిహిత్యం పెంచుకున్న భగవంతుని దర్శించుకోవడంలో గల సంతోషము, ఆనందము వారిద్దరి హృదయాలలో వెల్లువై పొంగిపొరలి, వారి జీవితాలకు అర్థము, పరమార్థము తెలిపాయి. సుమారు గంటకు పైగా కొనసాగిన ఆ ఇంటర్వ్యూ వారికి ఎంతో తృప్తి నిచ్చి, ఉత్తరకాలంలో వారి జీవితాలను కట్టి పడవేసే లంగరైంది. ఆ ఇంటర్వ్యూలో స్వామి తమంతట తామే భగవద్గీతలోని 18వ అధ్యాయమును గురించి చర్చించడం చూసి శ్రీ చక్రవర్తి దంపతులు ఆశ్చర్యపోయారు. శ్రీ చక్రవర్తి భార్య భక్తి, వినమ్రతలతో బాబా పాదాలచెంత వ్రాలగా భగవాన్ "నీకేమి కావాలి?" అని ఆమెను అడిగారు. ఆమె ఒకే ఒక్క కోరిక "నేను సుమంగళిగా చనిపోవాలి" అని కోరింది. ప్రతి భారతీయ స్త్రీ కోరుకునే ఆ పవిత్రమైన కోరికను అనుగ్రహిస్తూ భగవాన్ బాబా "తథాస్తు" అన్నారు. తన తల్లి మరియు సోదరి ఇద్దరూ చిన్నతనంలోనే వైధవ్యము ననుభవించిన కారణంగా ఆమె మనస్సులో ఆ కోరిక ఏనాటినుండో గూడుకట్టుకుని ఉంది.

శ్రీ చక్రవర్తి మరొకసారి ప్రశాంతి నిలయంవచ్చి స్వామి దర్శనం చేసుకునే లోపలే ఆయన భార్య శ్రీమతి సుధ మేజర్ విశ్వనాథ్ కుటుంబ సభ్యులతో కలసి రెండుసార్లు ఆశ్రమానికి వచ్చి స్వామి దర్శనం చేసుకున్నారు. ఒకసారి ఆవిధంగా వచ్చినపుడు బాబావారి సన్నిధిలో కూర్చుండగా ఆమె మనస్సులో "భగవాన్ బాబా కేవలం విభూతిని మాత్రమే సృష్టిస్తున్నారు. కుంకుమను ఎందుకు సృష్టించకూడదు?" అని ఒక వింత ఆలోచన మెదిలింది. తక్షణమే భగవాన్ బాబా తమ హస్త చాలనంచేత కెంపు పొదగబడిన ఒక బంగారు ఉంగరమును సృష్టించి ఇస్తూ "నువ్వు కుంకుమను కోరుకున్నావు కదూ! ఇదుగో! ఈ శాశ్వతమైన కుంకుమను తీసుకో!" అని చెప్పారు. అనంతపురంకు తిరిగి వచ్చిన తరువాత ఆమె తన భర్తకు ఆ ఉంగరమును చూపించి భగవాన్ బాబావారు తన మనసులోని కోరికను ఏవిధంగా తీర్చారో వర్ణించి చెప్పింది. అప్పుడు శ్రీ చక్రవర్తి కొద్దిగా పరిహాసధోరణిలో "అయితే, నేను బాబానుండి వజ్రపుటుంగరం మాత్రమే కోరుకుంటాను" అని చెప్పారు. ఆ తరువాత శ్రీ చక్రవర్తి ప్రశాంతి నిలయంకు వెళ్ళి భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్నప్పుడు ఆయన ఒక ఉంగరమును సృష్టించి ఇస్తూ "ఇదుగో! అందమైన వజ్రపుటుంగరం! ఈ ఉంగరం నీకోసమే, తీసుకో!" అని చెప్పారు.

కాలం గడిచేకొద్దీ, ఆ దంపతులు తరుచు పుట్టపర్తి రావడం మొదలుపెట్టారు. దానికి కారణం, భగవాన్ బాబావారితో పెంచుకున్న అనిర్వచనీయమైన ప్రేమానుబంధమే! ఈ విషయాన్నే శ్రీ చక్రవర్తి మాటలలో చెప్పాలంటే, "మానవుల మధ్య నెలకొనే ఏ బంధముకంటె అది చాలా మధురమైనది". అది "భగవాన్ సన్నిధిలో మనల్ని చుట్టివేసి మైమరపించే ప్రేమానుబంధం". చివరకు, వాళ్ళు వారానికొకసారి ప్రశాంతి నిలయానికి రావడం మొదలుపెట్టారు. వాళ్ళు వచ్చినప్పుడు భగవాన్ బాబావారు వాళ్ళను ఎంతో ప్రేమతో, దయతో ఆదరించేవారు. అంతేకాక, 1975వ సంవత్సరం అక్టోబరు నెలలో విజయదశమి పర్వదినంనాడు భగవాన్ బాబా వారి ఇద్దరి కుమారులకు ఉపనయనం కూడా చేశారు. భగవాన్ బాబా అప్పుడప్పుడు

ప్రశాంతి నిలయంలో జరుగుతున్న నిర్మాణపు పనులను తనిఖీ చేయడానికి వెళ్ళినపుడు, పూర్ణచంద్ర సభామంటపము ప్రక్కనే ఉన్న శ్రీ చక్రవర్తి ఫ్లాట్‌కు వెళ్ళి ఆ దంపతులను పలుకరించి వచ్చేవారు. ఆ విధంగా ఆ దంపతులు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యానుగ్రహ కిరణములు సోకి పునీతులైనారు.

1976వ సంవత్సరంలో ఒక ఆదివారంనాడు శ్రీ చక్రవర్తి దంపతులు ప్రశాంతి నిలయం సందర్శించారు. అది వారి జీవితాలలో మరపురాని దివ్య అనుభూతి. ఆ రోజున బాబా వాళ్ళను చూచినప్పటికి, ఇంటర్వ్యూకు పిలువలేదు. అలా జరగడం వాళ్ళకు అదే మొదటిసారి. ఆ రోజు ఉదయం దర్శనానంతరం వాళ్ళు తమ ఫ్లాట్‌కు తిరిగి వచ్చేశారు. అప్పుడు భగవాన్ బాబా ఏదో పనిమీద పూర్ణచంద్ర సభామంటపమునకు వెళ్ళి అక్కడ అనేక గంటలపాటు ఉండిపోయారు. ఆ సమయంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టుయొక్క కార్యదర్శి శ్రీ కుటుంబరావు గంటకొకసారి శ్రీ చక్రవర్తివద్దకు వచ్చి "ఈ రోజు స్వామి చాలా బిజీగా ఉన్నారు. మిమ్మల్ని ఎప్పుడు చూడగలుగుతారో తెలియదు. అనంతపురంలో మీకేమైనా తొందరపని ఉంటే వెళ్ళి చూచుకోమని స్వామి మీతో చెప్పమన్నారు", అని చెబుతూ వచ్చారు. శ్రీ కుటుంబరావు ఈ కబురు చెప్పినప్పుడల్లా దానికి శ్రీ చక్రవర్తి "నాకేమీ తొందరలేదని, స్వామి కొరకు ఎంతసేపైనా వేచియుండగలనని దయచేసి స్వామితో చెప్పండి. ఈ రోజంతా నాకు ఖాళీయే! నాకేమీ తొందరలేదు", అని సమాధానం చెబుతూ వచ్చారు. సుమారు ఒక మూడు గంటల కాలంలో మూడుసార్లు ఈ డైలాగ్ నడిచింది.

చివరకు, మధ్యాహ్నం 12 గంటల సమయంలో శ్రీ కుటుంబరావు వచ్చి "స్వామి మిమ్మల్ని పూర్ణచంద్ర సభా మంటపమునకు రమ్మని చెప్పారు", అని శ్రీ చక్రవర్తికి ఒక సందేశమును తీసికొని వచ్చారు. ఆ దంపతులిద్దరూ శ్రీ కుటుంబరావువెంట పూర్ణచంద్ర సభామంటపమునకు వెళ్ళారు. అక్కడ స్వామి, విద్యార్థులు ప్రదర్శించబోతున్న ఒక నాటకమును పర్యవేక్షిస్తున్నారు. వాళ్ళను చూచినవెంటనే భగవాన్ బాబా చిరునవ్వు నవ్వుతూ ఆప్యాయంగా పలకరించి

వేడివేడి బూందీ లడ్డును సృష్టించి శ్రీ చక్రవర్తి చేతిలో పెట్టారు. భగవాన్ బాబావారు శ్రీ చక్రవర్తితో ఆ రోజు నడిపిన నాటకంలోని అతిముఖ్యమైన ఘట్టమును స్వామి ప్రక్కనే పూర్ణచంద్ర సభా మంటపంలో కూర్చున్న డా॥ సూరి భగవంతం ఒక సంవత్సరం తరువాత శ్రీ చక్రవర్తికి తెలియజేశారు. ఆ రోజు ఉదయం స్వామి సందేశమునకు బదులుగా శ్రీ చక్రపర్తి చెప్పిన సమాధానమును శ్రీ కుటుంబరావు వచ్చి స్వామికి నివేదించగా ఆయన "చక్రవర్తి ఇప్పుడు ఇక్కడే ఉన్నాడు. నేనేమో అతనిని వెళ్ళిపోమని చెపుతున్నాను. అయితే, అతను గనుక ఈ రోజు ఇక్కడే ఉంటే, అతని జీవితం ఒక దిశగా మలుపు తిరుగుతుంది. అలా కాకుండా, అతను వెళ్ళిపోతే అతని జీవితం వేరే ఒక మలుపు తిరుగుతుంది", అని వ్యాఖ్యానించారు. శ్రీ చక్రవర్తి ఈనాడు వెనుకకు తిరిగి ఒకసారి చూసుకుంటే తన జీవితం ఈ మలుపు తిరిగినందుకు ఆయన చాలా సంతోషించారు. కేవలం భగవాన్ బాబావారి అనుగ్రహంవల్లనే తాను ఆ రోజు సరియైన నిర్ణయం తీసుకోగలిగానని ఆయన ఇప్పటికీ అనుకుంటూంటారు. నిజానికి, అది స్వామి నిర్ణయమేనని, తనది కాదని ఆయన అభిప్రాయం.

శ్రీ చక్రవర్తి చిన్నప్పటినుండి శ్రీ వేంకటేశ్వరస్వామి భక్తుడు కావడంచేత, చిన్నతనంలో తిరుమలకు కొండ ఎక్కి వెళ్ళేవారు. ఆ తరువాతకూడా ఆయన తరుచుగా శ్రీ వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడానికి వెళ్ళేవారు. శ్రీ చక్రవర్తి అనంతపురం జిల్లా కలెక్టరుగా పనిచేస్తున్నప్పుడు ఆ స్వామియే ఆయనకు స్వప్నములో ఒక అద్భుతమైన దివ్యానుభూతిని ప్రసాదించారు. ప్రశాంతి నిలయంలో భగవాన్ బాబావారి ప్రథమ దర్శనం అయిన ఒక సంవత్సరం తరువాత ఆయనకు ఈ అనుభవం కలిగింది. ఆ స్వప్నానుభూతి ఈనాటికి ఆయన హృదయంలో ఒక అమూల్యమైన నిధివలె ప్రకాశిస్తూంటుంది. శ్రీ చక్రవర్తి ఆ స్వప్నమును గుర్తు చేసుకుంటూ "అప్పుడు నేను తిరుమలలోని పవిత్రమైన గర్భగుడిలో శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహమునకు సమీపములో నిల్చుని ఉన్నాను. ఇంతలో హఠాత్తుగా భగవాన్ బాబావారు ఆ విగ్రహము

నుండి బయల్వెడలి నాకేసి చూస్తూ "చూడు! నేనిక్కడ ఉన్నాను" అని చెపుతూ మరల ఆ స్వామి విగ్రహములో కలిసిపోయారు. ఆ స్వప్నావస్థ నుండి నేను లేచేటప్పటికి అలౌకికమైన ఆనందాబ్ధి నాలో పొంగిపొరలింది. ఆ సమయంలో నాకు ప్రఖ్యాత ఆంగ్ల కవి షెల్లీ మాటలు 'was it a dream or vision?' జ్ఞాపకం వచ్చి 'ఇది స్వప్నమా లేక సాక్షాత్కారమా?' అని నన్ను నేను ప్రశ్నించుకున్నాను".

శ్రీ చక్రవర్తి 1976వ సంవత్సరములో అనంతపురంనుండి హైదరాబాదుకు రాష్ట్రమంతటా విస్తరింపబడిన పదవీ బాధ్యతలతో డైరక్టర్ ఆఫ్ టెక్స్‌టైల్స్‌గా ట్రాన్స్‌ఫరు అయినప్పుడు, వారం వారం ప్రశాంతి నిలయం వెళ్ళి భగవాన్ బాబావారి దర్శనం చేసుకునే అవకాశం ఇంక లభ్యము కాదని చాలా బాధపడ్డారు. ఆశ్రమానికి దగ్గరలోనే మరేదైనా స్థలానికి ట్రాన్స్‌ఫరు కొరకు ప్రయత్నిద్దామా అనే ఆలోచన మనసులో ఒక క్షణం పాటు మెదిలినా, ఆయన ఆ ఆలోచనను ప్రక్కకు నెట్టి హైదరాబాదు వెళ్ళడానికే నిశ్చయించుకున్నారు. ఆయన ఉద్దేశం, ప్రభుత్వం ఎక్కడ ఏ పదవిలో పనిచేయుమని ఆదేశించినా అక్కడ పనిచేయడమే! నాకు ఫలానా చోటు లేదా పదవి కావాలని కోరుకునే అధికారం తనకు లేదని ఆయన మనస్ఫూర్తిగా నమ్మారు. శ్రీ చక్రవర్తి హైదరాబాదుకు వెళ్ళేముందు ఆయనకు, ఆయన భార్యకు ప్రశాంతి నిలయంలోను, బృందావనంలోను తనకు అత్యంత సన్నిహితంగా ఉండే అవకాశం భగవాన్ బాబా కల్పించారు. అంతేకాకుండా "నాతో సన్నిహితంగా ఉండే అవకాశం తప్పిపోయిందని మీరు బాధపడవద్దు. ఇంతకు పదిరెట్లు సన్నిహితంగా ఉండే అవకాశం నేను మీకు కల్పిస్తాను", అని భగవాన్ బాబా వారికి అభయమిచ్చారు. అనతికాలంలోనే అది నిజమైంది!

హైదరాబాదులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు నెలకొల్పిన 'శ్రీ సత్యసాయి విద్యా విహార్' అనే స్కూలు ఉన్నది. చుట్టూ కనుచూపు మేర దూరంవరకు అద్భుతమైన దృశ్యము కనపడే ఒక ఎత్తైన కొండమీద నిర్మింపబడిన విశాలమైన భవనములోని క్రింది అంతస్తులో ఈ స్కూలు నడుపబడుతోంది.

ఈ భవనములోని మొదటి అంతస్తులో ఎవరూ నివసించకపోవడంచేత ఖాళీగా ఉంది. ఆర్థిక శాస్త్రములో మాష్టర్ డిగ్రీ తీసుకుని పోష్టు గ్రాడ్యుయేటు డిప్లొమా ఇన్ సోషల్ సర్వీస్ చేసిన శ్రీ చక్రవర్తి భార్య శ్రీమతి సుధను ఈ స్కూలుకు డైరక్టరు మరియు కరెస్పాండెంటుగా నియమించి భగవాన్ బాబా ఆ దంపతులకు తమ అవతార కార్యక్రమంలో పాలుపంచుకునే అవకాశం కల్పించి ఆశీర్వదించారు. అంతేకాకుండా, శ్రీ చక్రవర్తిని తన కుటుంబముతో ఆ భవనం మొదటి అంతస్తులో నివాసం ఉండమని చెప్పారు. భగవాన్ బాబావారు ఆ దంపతులను పిలిచి "ఇన్ని సంవత్సరాలు మీరు అద్దె ఇంట్లో ఉన్నారు. ఇప్పటినుండి మీరు మీ సొంత భవనంలో ఉండవచ్చు" అని చెప్పినప్పుడు వారి హృదయాలు ఆర్ద్రమైనాయి. ఆ సంవత్సరం భగవాన్ బాబావారు రెండుసార్లు హైదరాబాదు వచ్చి ఆ భవనంలో వారితో కలసి ఉన్నారు.

శ్రీ చక్రవర్తి దంపతులు హైదరాబాదులో నివసించిన సమయంలో భగవాన్ బాబావారు సర్వకాల సర్వావస్థలలోను తమ ఇంట, వెంట, జంట, కంట ఉండి తమను రక్షించి కాపాడుతున్నారనే అనుభూతికి నిదర్శనంగా వారికి ఎన్నో అద్భుతమైన అనుభవాలు కలిగినాయి. శ్రీ చక్రవర్తి వాటిని "భగవంతుని యొక్క సహజమైన దివ్యత్వమును ప్రస్ఫుటింపజేసే లీలలు"గా భావిస్తారు. అయితే, ఆ దంపతులు నెలకొకసారి తప్పకుండా బృందావనమో, ప్రశాంతి నిలయమో వచ్చి భగవాన్ బాబావారి దర్శనం చేసుకోవడం మాత్రం మానలేదు.

1977వ సంవత్సరములో శ్రీ చక్రవర్తి కొన్ని పునశ్చరణ తరగతులకు (Orientation Course) హాజరయ్యేందుకు ముస్సోరీ వెళ్ళారు. ఒక రోజు రాత్రి సుమారు 8 గంటల ప్రాంతములో ఆయన బాత్‌రూంలో స్పృహతప్పి క్రింద పడిపోయారు. ఆ సమయంలో ఆయన కోర్సు ముగింపు సందర్భంగా ఒక విందుకు వెళ్ళవలసి ఉంది. ఆయనకు స్పృహ వచ్చేటప్పటికి, గడ్డంక్రింద చాలా నొప్పిగా ఉన్నట్లు అనిపించింది. ఎదురుగుండా ఉన్న అద్దంలో చూసుకుంటే గడ్డం నిలువునా చీలి ఎముక బయటికి పొడుచుకు వచ్చింది.

అప్పుడు ఆయనను డెహ్రాడూన్‌లోని ఆస్పత్రికి తీసుకొని వెళ్ళి గడ్డం పగిలిన చోట కుట్లుకుట్టి తలచుట్టూ బేండేజి చుట్టబెట్టారు. తనకు దెబ్బ తగిలిన విషయం తన భార్యకు తెలిస్తే ఆమె చాలా ఆందోళన చెందుతుందని ఆమెకు తెలుపలేదు.

సరిగ్గా ఇక్కడ శ్రీ చక్రవర్తికి దెబ్బతగిలిన సమయంలోనే, అక్కడ హైదరాబాదులో ఆయన భార్య శ్రీమతి సుధ తన ఇంట్లో కుక్క పిల్లలతో ఆడుకుంటూండగా ఆమె మెడలోని మంగళసూత్రము తెగి క్రింద పడిపోయింది. దాంతో ఆమె తన భర్తకేమైనా ఆపద సంభవించిందేమోనని భయపడిపోయింది. వెంటనే ఆమెకు భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు తనకు, తన భర్తకు కలిపి యిచ్చిన మొట్టమొదటి ఇంటర్వ్యూలో అభయ మిచ్చిన సంగతి జ్ఞాపకం వచ్చింది. తన మనసులోని ఆందోళనను భగవాన్ బాబావారికి తెలియజేయుమని శ్రీ కుటుంబరావుగారిని కోరదామనుకుని ప్రశాంతి నిలయానికి ఒక ట్రంక్‌కాల్ బుక్ చేసింది. ఆ రోజుల్లో నేరుగా ప్రశాంతి నిలయానికి టెలిఫోనులో మాట్లాడే ఎస్.టి.డి. సౌకర్యంలేదు. తక్షణమే ఆమెకు టెలిఫోను కనెక్షను దొరికింది. శ్రీ కుటుంబరావు అప్పుడే ఆ రోజులో ఆఖరుసారిగా స్వామితో మాట్లాడడానికి వెళ్ళబోతున్నారు. ఈ సమయంలో ఆమె శ్రీ కుటుంబరావుగారితో మాట్లాడి తన మనస్సులో చెలరేగే భయాందోళనలు ఆయనకు చెప్పుకోగలిగింది. శ్రీ కుటుంబరావు ఆమె చెప్పిన విషయాలను స్వామికి నివేదించారు. ఇది జరిగిన ఒక గంటలోపుగా భగవాన్ బాబావారు ఆమెకు అభయమిస్తూ పంపిన "నీవు కంగారు పడవద్దు. స్వామి ఎల్లప్పుడూ చక్రవర్తితో ఉన్నారు. ఆయన ఇంటా, వెంట, జంట ఉన్నారు. ఆయన కెటువంటి ఆపద సంభవించదు. నీవు ఎటువంటి నిద్ర మాత్రలు మ్రింగవలసిన అవసరం లేదు", అనే సందేశము ఆమెకు అందింది.

శ్రీ చక్రవర్తి రెండు రోజుల తరువాత హైదరాబాదుకు తిరిగి వచ్చిన తరువాతనే ఆయనకు దెబ్బ తగిలిన సంగతి ఆయన భార్య శ్రీమతి సుధకు

తెలిసింది. వెంటనే వాళ్ళిద్దరూ తమ రక్షకుడైన భగవాన్ బాబావారికి కృతజ్ఞతలు తెలుపుకోవడానికి బయలుదేరి వెళ్ళారు. శ్రీ చక్రవర్తికి ముస్సోరిలో ప్రమాదం జరిగిన మరునాడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శ్రీ సత్యసాయి సేవా సంస్థల కార్యకర్త శ్రీ సత్యమూర్తి హైదరాబాదునుండి ప్రశాంతి నిలయం వెళ్ళి భగవాన్ బాబావారి దర్శనం చేసుకుని శ్రీమతి సుధ మనసులోని భయాందోళనలను ఆయనకు తెలియజేశారు. అప్పుడు భగవాన్ బాబా ఆయనతో "ఆమె మంగళసూత్రం తెగిపడిపోయినప్పుడు ఆమె చక్రవర్తిని గాని, తన తల్లిని గాని లేక ఇతర బంధువులను గాని పిలువలేదు. ఆ సమయంలో ఆమె కేవలం స్వామిని మాత్రమే జ్ఞాపకం చేసుకుని ఆయనను ప్రార్థించింది. నిజమైన భక్తురాలు అంటే అలా ఉండాలి", అని చెప్పారు.

1978వ సంవత్సరం అక్టోబరు నెలలో ఒకరోజు సాయంకాలం నాలుగు గంటలకు బృందావనంలో శ్రీచక్రవర్తి భగవాన్ బాబా వారిని కలిసి హైదరాబాదుకు విమానంలో తిరిగి వెళ్ళడానికి అనుమతి కోరాడు. అప్పుడు స్వామి "నీఫ్లైట్ ఎన్ని గంటలకు"? అని అడిగారు. "స్వామీ! నాలుగు గంటల 15 నిమిషాలకు" అని ఆయన సమాధానం చెప్పాడు. భగవాన్ బాబా ఒక్కక్షణం పాటు ఆలోచించి "నీకారు ఇక్కడకు తీసుకురా!" అని చెప్పారు. శ్రీచక్రవర్తి తన కారును మందిరంలోని పోర్టికో దగ్గరకు తీసుకొని రాగానే భగవాన్ బాబా కారు ఎక్కి కాలేజీ ఆడిటోరియంవద్దకు పోనిమ్మని ఆదేశించారు. అక్కడ భగవాన్ బాబావారు శ్రీ చక్రవర్తితో కలసి విద్యార్థులు వేస్తున్న ఒక నాటకముయొక్క రిహార్సలును చూచారు. వారు మందిరానికి తిరిగి వచ్చేటప్పటికి 6 గంటలైపోయింది. ఇక ఆరోజు ఫ్లైట్ ఎలాగూ అందదు కాబట్టి రేపటికి తన ప్రయాణం వాయిదా వేసుకుందామని శ్రీ చక్రవర్తి అనుకుంటున్న సమయంలో భగవాన్ బాబావారు ఆయనతో "ఇప్పుడు నీవు హైదరాబాద్‌కు వెళ్ళవచ్చు" అని చెప్పారు. తాను ఎయిర్‌పోర్టుకి వెళ్లే సమయానికి విమానం బయలుదేరిపోతుందని స్వామితో చెప్పడం శ్రీ చక్రవర్తికి ఇష్టంలేదు. అందువలన ఆయన స్వామి ఆదేశముననుసరించి ఎయిర్ పోర్టుకు కారులో

వెళ్ళారు. ఆయన అక్కడకు చేరుకునేటప్పటికి టైము ఏడు గంటలైంది. అక్కడ ప్రయాణీకులు వేచియుండే లౌంజ్‌లో ఈయన అడుగుపెట్టగానే కొన్ని అనివార్య కారణాల వలన హైదరాబాదు వెళ్ళే ఫ్లైటు ఆలస్యమైందని, ఇప్పుడు బయలుదేరడానికి సిద్ధంగా ఉందని, ప్రయాణీకులు విమానంలోకి వెళ్ళి కూర్చోవచ్చని ఒక ప్రకటన వినపడింది!

మరొకసారి 1979వ సంవత్సరంలో ఇటువంటి సంఘటనే జరిగింది. ఆరోజున శ్రీ చక్రవర్తి స్వామివద్ద సెలవు తీసుకోవడానికి వెళ్ళినపుడు స్వామి "క్షేమంగా వెళ్ళి ఆనందంగా తిరిగిరా" అని ఆశీర్వదించారు. శ్రీ చక్రవర్తి బెంగుళూరు ఎయిర్ పోర్టులో విమానం ఎక్కారు. విమానం సరిగ్గా సమయానికి బయలుదేరింది. అయితే, హైదరాబాదు ఎయిర్‌పోర్టుకు విమానం చేరుకునేటప్పటికి చక్రాలవద్ద ఏదో సాంకేతిక లోపమువల్ల విమానం క్రిందకు దిగలేక గాలిలో చక్కర్లు కొట్టడం మొదలెట్టింది. 45 నిమిషాల తరువాత కూడా విమానం చక్రాలలోని లోపం సరిదిద్దడానికి వీలుపడక విమానమును బలవంతంగా బెల్లీలాండింగ్ (Belly landing అనగా చక్రాల అవసరం లేకుండానే విమానము యొక్క మధ్యభాగము "నేలపై ఆనేటట్లు దింపడం" చేయించడానికి ఏర్పాట్లు జరగడంతో విమానంలోని ప్రయాణీకులందరూ భయాందోళనలతో నిండిపోయారు. కాని, శ్రీ చక్రవర్తి మాత్రం తనకేమీ పట్టనట్లు ఏదో పుస్తకం చదువుకుంటూ ఉండిపోయారు. ఆ సమయంలో ఆయన తన ప్రభువు, సంరక్షకుడు అయిన భగవాన్ బాబావారు తాను బృందావనంనుండి బయలుదేరేముందు చెప్పిన, అభయపూర్వకమైన మాటలను గుర్తు చేసుకున్నారు. చివరకు, విమానాన్ని బలవంతంగా క్రిందకు దింపించే ఆఖరు క్షణంలో ఉన్నట్లుండి విమానముయొక్క చక్రాలు వాటంతట అవి బయటకు వచ్చి విమానం మామూలు పద్ధతిలో సురక్షితంగా క్రిందకు దిగింది. శ్రీ చక్రవర్తి భగవాన్ బాబావారికి కృతజ్ఞతలు చెప్పుకుంటూ విమానం దిగి బయటకు వచ్చేటప్పటికి, చుట్టూ ఏదైనా ప్రమాదం సంభవిస్తే దానిని ఎదుర్కొనడానికి సిద్ధంగా ఫైర్ ఇంజన్లు అంబులెన్సులు బారులు తీరి ఉండడం కనిపించింది.


1980 వ సంవత్సరంలో శ్రీ చక్రవర్తి ఇండియన్ అడ్మినిస్ట్రేటివ్ సర్వీసులో 20 సంవత్సరాలు పూర్తి చేసేనాటికి, ఆయన ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వములో ఫైనాన్స్ సెక్రటరీ పదవి నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ఆయన మనస్సులో భగవంతుని ప్రభుత్వ సర్వీసు ద్వారా సేవించుకోవడంకంటె పదవీ విరమణ చేసి నేరుగా సేవించుకుంటే బాగుంటుందని తీవ్రమైన కోరిక బయలుదేరింది. భగవాన్ బాబావారికి తన ఆకాంక్షను తెలియజేసుకోగా ఆయన "నీవు ఐ.ఏ.యస్‌నుండి ఇంత తొందరగా రిటైరవాలని ఎందుకు కోరుకుంటున్నావు? నీవు ప్రభుత్వ సర్వీసులో కొనసాగితే రాష్ట్ర ప్రభుత్వ ఛీఫ్ సెక్రెటరీ కూడా కాగలవు. అంతగా కావాలనుకుంటే రిటైరయిన తర్వాత నువ్వు ఇక్కడకు రావచ్చు", అని చెప్పారు. అప్పుడు శ్రీ చక్రవర్తి "స్వామీ! నా ఒంట్లో ఆరోగ్యం, శక్తి, ఉత్సాహము ఇంకా మిగిలి ఉండగానే నేను పరమాత్ముని సేవించుకోవాలనుకుంటున్నాను. రిటైరయిన తరువాత నేను ఎంతవరకు స్వామి సేవ చేసుకోగలనో నాకు తెలియదు", అని వినయ పూర్వకంగా స్వామికి నివేదించుకున్నాడు. అయినప్పటికి, ఆ ధన్యజీవియొక్క ఆర్తితో కూడిన ప్రార్థనను స్వామి వెంటనే అంగీకరించలేదు. బహుశా ఆ మానవ హృదయంలోని పవిత్ర స్వప్నము సఫలమై సాకారము దాల్చడానికి ఇంకా తీవ్రమైన తపస్సు అవసరమేమో!

ఎట్టకేలకు, 1981వ సంవత్సరములో శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ స్థాపనతో శ్రీ చక్రవర్తి చిరకాల నిరీక్షణకు తెరపడింది. భగవాన్ బాబావారు 1981వ సంవత్సరం జూలై నెలలో శ్రీ చక్రవర్తిని శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థను డీమ్డ్ యూనివర్సిటీగా రూపొందించేందుకు అవసరమైన నియమావళిని తయారు చేసే కమిటీ సభ్యులతో కలిసి పనిచేయుమని ఆదేశించారు. కొన్ని నెలల తరువాత ఆయనను శ్రీ సత్యసాయి డీమ్డ్ యూనివర్సిటీ యొక్క మొట్టమొదటి రిజిస్ట్రారుగా నియమించారు. శ్రీ చక్రవర్తికి తాను కోరుకున్నట్లుగా ఐ.ఏ.ఎస్. (I.A.S.) నుండి ఎస్.ఏ.ఐ. (S.A.I.) సన్నిధికి చేరుకునే పదోన్నతి (Promotion) దక్కింది. శ్రీ చక్రవర్తి విశ్వవిద్యాలయ రిజిస్ట్రారుగా

నియమింపబడకపూర్వం కూడా ఆయనకు భగవాన్ బాబావారి దివ్యసన్నిధిలో ఉంటూ స్వామి దివ్యాశీస్సులు పొందే అవకాశము లభించినప్పటికి, అద్వితీయమైన శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయముయొక్క అద్వితీయమైన ఛాన్సెలరు అగు భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారితో కలసి రిజిస్ట్రారుగా పనిచేయడం ఒక అపూర్వమైన అవకాశం. ఆ సమయంలో ఆయన భగవాన్ బాబావారిని గురించి అంతకు పూర్వము తనకు తెలియని ఎన్నో విషయాలు తెలుసుకున్నారు. శ్రీ చక్రవర్తి మాటల్లో చెప్పాలంటే "భగవాన్ బాబావారిలో స్వతస్సిద్ధముగా ప్రస్ఫుటమయ్యే అత్యున్నత ఆధ్యాత్మిక జ్ఞానసంపదతో కూడిన యుక్తియుక్తమైన యాజమాన్య నైపుణ్యం, విశాల దృక్పథం, నిశిత దృష్టి మరియు పరిపాలనా దక్షత నన్ను ముగ్ధుణ్ణి చేశాయి". శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయమునకు ఛాన్సెలరు అయిన భగవాన్ బాబావారిలో తాను చూసిన అనూహ్యమైన లక్షణాలను శ్రీ చక్రవర్తి వర్ణించి చెపుతూంటే, స్వామి గురించి మనకు తెలియని ఎన్నో అపూర్వమైన విషయాలు మనకు తెలుస్తాయి.

"భగవాన్ బాబావారు కేవలం నామమాత్రపు ఛాన్సెలరుగా ఉండటానికి సుతరాము అంగీకరించరని విశ్వవిద్యాలయ కమిటీలోని ఒక అనుభవజ్ఞుడైన సభ్యుడు నాతో చెప్పాడు. ఈమాట ముమ్మాటికీ నిజం. శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థకు నేను రిజిస్ట్రారుగా పని చేసిన కొలది సంవత్సరాలలో భగవాన్ బాబా అత్యంత చురుకైన ఛాన్సెలరుగా అవిశ్రామంగా పనిచేయడం నేను చూశాను. విశ్వవిద్యాలయ నిర్వహణకు సంబంధించిన అధికారులందరిలోను అత్యంత శక్తి, సామర్థ్యములతో పనిచేసే వ్యక్తి భగవాన్ బాబావారే!


"ఒకసారి ఛాన్సెలరు భగవాన్ బాబా, వైస్ ఛాన్సెలరు, రిజిస్ట్రారు, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు సభ్యులు మరియు అకడమిక్ కౌన్సిలు సభ్యులకు స్నాతకోత్సవ సమయంలో ధరించే దుస్తులను కుట్టించి తయారుగా ఉంచమని నన్ను ఆదేశించారు. అందుకుగాను నాకు కేవలం కొద్దివారాల సమయం మాత్రమే ఇచ్చారు. విశ్వవిద్యాలయ స్నాతకోత్సవ ఊరేగింపులో రిజిస్ట్రారు పట్టుకోవలసిన వెండిగదను తయారుచేయించడం గురించి కూడా భగవాన్



"అద్వితీయ విశ్వవిద్యాలయమునకు అద్వితీయ కులపతి"



"వార్షిక క్రీడోత్సవమునాడు వేదికపై ఛాన్సెలరు భగవాన్ బాబాతో శ్రీచక్రవర్తి"



"విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్సు ప్రదర్శనను తిలకిస్తున్న భగవాన్ బాబా"

బాబా స్వయంగా ఆదేశాలిచ్చారు. ఈ మొత్తం వ్యవహారంలో ఒక్క విషయాన్నికూడా ఆయన మరచిపోలేదు. కొద్ది రోజులలో జరుగబోయే విశ్వవిద్యాలయ ప్రారంభోత్సవ ఏర్పాట్లను గురించి ఆయన చాలా ఉత్సాహంగా ముచ్చటించారు. ఊరేగింపులో ఎవరి తరువాత ఎవరు నించోవాలి, వేదికపై అతిథులకు, విశ్వవిద్యాలయాధికారులకు కూర్చునేందుకు ఏ పద్ధతిలో ఏర్పాట్లు చెయ్యాలి, ఇలా అతి చిన్న విషయంనుండి పెద్ద విషయంవరకు అన్ని విషయాలలోను భగవాన్ బాబావారు ఆదేశాలిస్తూ, మార్గదర్శకత్వం నెరపుతూ అంతటా అన్నీ తానే అయి నిల్చారు.

"భగవాన్ బాబావారు అనేక సందర్భాలలో విశ్వవిద్యాలయ గవర్నింగ్ బాడీ (Governing Body) మరియు అకడమిక్ కౌన్సిలు (Academic council) యొక్క సమావేశములకు హాజరై తమ దివ్యాశీస్సులను అందించేవారు. ఈ సందర్భంగా రెండు విషయాలు నా హృదయఫలకముపై చెరగని ముద్రవేశాయి. (1) ఎంతో మర్యాద పూర్వకంగా ఆయన చేసే అతిథి సత్కారములు మరియు (2) ఈ సమావేశములలో చర్చింపబడే అంశములను అత్యంత శ్రద్ధతో ఆలకించడం. ఈ సంస్థల సమావేశములలో స్వామి పాల్గొనడంవలన సభ్యులకు గొప్ప ఆనందము, స్ఫూర్తి లభిస్తాయి. సమావేశాలు పూర్తి కాగానే సభ్యులందరూ ముక్తకంఠంతో "ఓహ్! ఎంతటి అద్వితీయ ఛాన్సెలరు!" అని ప్రశంసలు కురిపిస్తారు. విశ్వవిద్యాలయ ఛాన్సెలరుగా భగవాన్ బాబావారు పాలకవర్గ సభ్యులందరి అభిప్రాయములు గౌరవపూర్వకముగా స్వీకరించి, వాటి యొక్క పూర్వాపరాలు, సాధ్యాసాధ్యములు విచారించి, తొందరగా వాటిపై నిర్ణయాలు తీసుకుని, వాటిని ఆచరణలో పెట్టడానికి వైస్ ఛాన్సెలరు మరియు ఇతర అధికారులకు ఆదేశాలు జారీ చేస్తారు. అనేక సంవత్సరాలుగా ఇతర విశ్వవిద్యాలయాల్లో కారణాంతరాలవలన అమలు చేయబడని సంస్థాగత సంస్కరణలను (Structural reforms) భగవాన్ బాబావారి అనుగ్రహంవల్ల మన విశ్వవిద్యాలయ ప్రారంభమునుండి అమలు పరచడం జరిగింది.

"విద్యార్థులు ఈ విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసము చేయడం ద్వారా గరిష్ఠస్థాయిలో ప్రయోజనం పొందాలని ఛాన్సెలరు తీవ్రంగా అభిలషిస్తారు. వయస్సులో బాగా పెద్దవారైనా వైస్ ఛాన్సెలరు శ్రీ గోకాక్ క్రొత్త క్రొత్త ఆలోచనలతో ఉత్సాహంగా పనిచేయడం చూస్తే చాలా ఆనందంగా ఉంటుంది. అయితే, అంతకంటె ప్రోత్సాహకరమైన విషయం, ఆ ఆలోచనలను ఆచరణలో పెట్టడానికి ఛాన్సెలరు భగవాన్ బాబా వైస్ ఛాన్సెలరుకు స్వేచ్ఛయివ్వడం. విశ్వ విద్యాలయ నిర్వహణకు సంబంధించి మేము ఎంతో ఉత్సాహంగా నివేదించుకున్న ప్రతిపాదనలను, ఛాన్సెలరు భగవాన్ బాబా అంతకు రెట్టింపు ఉత్సాహముతో ఆమోదించేవారు.

"ఇక ఆర్థిక విషయాలకు వస్తే భగవాన్ బాబా సాటిలేని మేటి ఫైనాన్షియల్ కంట్రోలరు (Financial controller). ఏయే అంశాలలో ధనము వృథా అవుతోందో, దుర్వినియోగం అవుతోందో ఆయనకు క్షుణ్ణంగా తెలుసు. వివిధ పథకాలకు డబ్బు ఖర్చు పెట్టడంలో ఎక్కడ అవసరమో అక్కడ ఉదారంగా వ్యవహరిస్తారు. అదే సమయంలో మితవ్యయమును పాటిస్తారు. 'ధనాన్ని దుర్వినియోగము చేయడం మహాపాపం', అనే తన సిద్ధాంతాని కనుగుణంగా ఆయన డబ్బు ఖర్చుచేస్తూనే మితవ్యయం పాటిస్తారు. ఇది భగవాన్ బాబా వారొక్కరికే సాధ్యమైన అద్వితీయ లక్షణం. అన్నిటికి మించి, విశ్వవిద్యాలయ నిర్వహణలో పొదుపు మరియు జవాబుదారితనంతో కూడిన వాతావరణం నెలకొనాలని భగవాన్ బాబా అభిలషిస్తారు. ఏపని చేసినా అందంగా ఉండాలి, అలాగని ఆడంబరం కూడదు; ఠీవిగా ఉండాలి, విలాసము కూడదు, నిరాడంబరతతో కూడిన అందము, ఇదీ స్వామి సిద్ధాంతము.

"ఛాన్సెలరు భగవాన్ బాబావారు విశ్వవిద్యాలయ ప్రారంభములోనే సంస్థ నిర్వహణకయ్యే ఖర్చునంతా శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు భరిస్తుందని, కేవలం విశ్వవిద్యాలయ అభివృద్ధి కొరకే విశ్వవిద్యాలయ గ్రాంట్ల సంఘమునుండి ఆర్థిక సహాయము స్వీకరించాలని, ఒక విధి విధాన సూత్రము (Policy Guide-

line)ను నిర్దేశించారు. అంతేకాదు ఎట్టి పరిస్థితులలోను ప్రభుత్వమునుండి నిధులు స్వీకరించరాదని ఒక నియమం పెట్టారు. విద్యా విషయకమైన స్వయం ప్రతిపత్తికి ఆర్థికపరమైన స్వయం ప్రతిపత్తి ప్రథమ సోపానమని భగవాన్ అభిప్రాయం.

" భగవాన్ బాబావారు నెలకొల్పిన విద్యా సంస్థలలో కేవలం విద్యా విషయికమైన ప్రతిభ ఒకటే ప్రాధాన్యత గల అంశము కాదు. తాము ఏర్పరచిన ప్రవర్తనా నియమావళిని పాటించకుండా కేవలం చదువులో మాత్రమే ప్రతిభ కనబరచే విద్యార్థులను ఆయన "నాకు మీరు తెచ్చుకొనే మార్కులు కాదు ముఖ్యం, రిమార్కులు రాకుండా చూచుకోవాలి" అని హెచ్చరిస్తారు. పరీక్షలలో ర్యాంకులు తెచ్చుకోలేకపోయినప్పటికి తన ఆజ్ఞలను, ఆదేశాలను ఎల్లవేళలా విడువకుండా పాటించే విద్యార్థులను ఆయన మెచ్చుకుంటారు. ఇదంతా విద్యార్థుల భావి జీవితానికి సరియైన పునాదివేసి, వారిలో సమచిత్తమును నెలకొల్పేందుకే! తమ విద్యాసంస్థలలోని విద్యార్థులు మరియు ఉపాధ్యాయుల విషయంలో ఆయన అనుసరించే 'తప్పు చేసినప్పుడు దండన, మంచిగా ఉన్నప్పుడు మెచ్చుకోలు' ఈ రెండూ కలిసిన విధానము చాలా సమర్థవంతముగా పనిచేస్తుంది. దీనిని ఆయన యశోద బాలకృష్ణని విషయంలో అనుసరించిన 'ఒక చేతిలో వెన్న, మరొక చేతిలో కర్ర' అనే విధానముగా అభివర్ణిస్తారు. విశ్వవిద్యాలయములో పనిచేసే ఆచార్యులకు, భగవాన్ అవతారోద్యమంలో తాము నిర్వహించవలసిన పాత్రను గురించి సరియైన అవగాహన పెంపొందించేందుకుగాను సనాతన ధర్మమును 'తుచ'. తప్పకుండా పాటిస్తూ ఇతరులకు ఆదర్శప్రాయమైన జీవితమును గడుపుమని, ఛాన్సెలరు భగవాన్ బాబా ఉద్బోధిస్తారు.

"భగవాన్ బాబావారు విద్యార్థులలోని సృజనాత్మక ప్రతిభను ఎంతో ప్రేమగా పెంచి పోషిస్తారు. విద్యార్థులుకూడా కేవలం తమ ప్రియతమ ఛాన్సెలరు ప్రీతికొరకే తమ సర్వశక్తులు ధారపోసి కృషి చేస్తారు. విశ్వవిద్యాలయ జీవితములోని వివిధ రంగాలలో విద్యార్థులకు, ఛాన్సెలరు భగవాన్ బాబావారికి

మధ్యగల శాశ్వత సంబంధమును ఈ సందర్భంగా మనం గుర్తించవచ్చు. ఈ విధంగా కాలచక్రం నడిచిపోతూంటుంది. విద్యార్థులు విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తున్నంతసేపు ఛాన్సెలరుగా భగవాన్‌బాబా వారితో అనుబంధము ఏర్పరచుకుంటారు. ఆ తరువాత విశాల విశ్వంలో జీవయాత్ర సాగిస్తూ విశ్వానికే ఛాన్సెలరు అయిన భగవాన్ బాబావారితో తమ ప్రేమబంధమును కొనసాగిస్తారు. వారిద్దరి మధ్యనున్న అనుబంధము వర్తమాన జీవితములోను, రాబోయే జన్మలలోను కూడా దృఢంగా నిలిచియుండే శాశ్వత ప్రేమబంధము.....

"ఛాన్సెలరు భగవాన్ బాబావారి ప్రబోధలన్నీ ఆయనయొక్క విశ్వ జనీనమైన ప్రేమధారకు నిదర్శనములే! భగవాన్ నెలకొల్పిన విశ్వవిద్యాలయముయొక్క పరమ ప్రయోజనం, తమ అవతారోద్యమంలో పాత్రధారులుగా తాము ఎంపిక చేసిన వ్యక్తులను తమవైపు ఆకర్షించి, వారిలో తాను ఆశించిన పరిణామమును సాధించి, చివరకు వారిని ఉత్తమమైన పరికరములుగా తీర్చిదిద్దేందుకే! ఈ విశ్వవిద్యాలయ ఛాన్సెలరు సాక్షాత్తూ జగద్గురువు, మార్గదర్శకులు మరియు మానవజాతి ఉద్ధరణకై అవతరించిన అవతార పురుషుడు. ఇటువంటి ఛాన్సెలరు 'నభూతో నభవిష్యతి'."

శ్రీ చక్రవర్తి, భగవాన్ బాబావారిచే ఎంపిక చేయబడిన అటువంటి ధన్యజీవి!

ఒకరోజు సాయంత్రం ఆయన రిజిస్ట్రారు నివాసమునుండి మందిరానికి కారు డ్రైవుచేసుకుంటూ వస్తున్నారు. భగవాన్ బాబావారు భజనానంతరం తమ నివాసములోనికి వెళ్ళిపోయే ముందు ఆయన దర్శనం చేసుకోవాలనే ఆత్రుతతో శ్రీ చక్రవర్తి చాలా వేగంగా కారు నడుపుకుంటూ వస్తున్నారు. ఆయన మెయిన్ గేట్‌వద్దకు వచ్చేసరికే స్వామికి మంగళహారతి ఇవ్వడం జరుగుతోంది. దాంతో ఆయన కారు వేగం కొంచెం హెచ్చించారు. ఇంతలో హఠాత్తుగా రోడ్డుపైన ఒక విదేశీయుడు ఆయన కారుకు అడ్డం వచ్చాడు. అందువలన, శ్రీ చక్రవర్తి కారుకు సడన్‌బ్రేకు వేయవలసి వచ్చింది. కారు కీచుమని చప్పుడు చేస్తూ ఆగింది. శ్రీ చక్రవర్తి తన చికాకును వ్యక్తపరచేలోపుగానే ఆ విదేశీయుడు

చిరునవ్వు నవ్వుతూ "మీరు మీ స్వగృహమునకు రానేవచ్చారు; ఇంక మీరు కొంచెం నెమ్మదిగా వెళ్ళవచ్చు", అని వ్యాఖ్యానించాడు. అత్యున్నతమైన తన జీవిత సత్యమును తనకు గుర్తు చేసినందుకు శ్రీ చక్రవర్తి ఆ విదేశీయునికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు!





6

భగవాన్ ఎంచుకున్న అధ్యాపకులు

"మానవ జాతియొక్క గౌరవముకాని, శక్తి సామర్థ్యములుకాని ఉపాధ్యాయుల గుణశీలములపైననే ఆధారపడియుంటవి", అని జగద్గురువు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు తమ "విద్యా వాహిని"లో ఉద్ఘాటించారు. భగవాన్ బాబావారు రూపకల్పన చేసిన నూతన విద్యా విధానము ఘన విజయం సాధించడానికి మొట్టమొదటి కారణం, ఆ విద్యా విధాన అమలుకు ప్రారంభము నుండి స్వామి పూర్తిగా సారథ్యము వహించడమే! ఇక రెండవ కారణం, అద్వితీయమైన నైపుణ్యముతో తమ విద్యాసంస్థలలో పనిచేయడానికి అర్హత గలిగిన యోగ్యులైన అధ్యాపకులను తామే స్వయంగా ఎంపిక చేయడం. స్వామి కళాశాలలు, హాస్టళ్ళకు ఆధిపత్యం వహించే ప్రతి ఒక్క అధ్యాపకుడు ఆవిధంగా భగవాన్ బాబావారిచే స్వయంగా ఎంపిక చేయబడినవారే! వీరందరు తమ తమ శాఖలకు సంబంధించి విశేష పరిజ్ఞానము మరియు పాండిత్యము గలవారేకాక, తమ వ్యక్తిగత జీవితంలో ఆధ్యాత్మికాదర్శములకు అంకితమైనవారు. వారు పర, అపర విద్యలను రెండింటిని మేళవించి అధ్యయనం చేసి తమ జీవితంలో ఆచరణాత్మకంగా నిరూపించడానికి కృషి చేస్తున్న ప్రతిభావంతులైన విద్యార్థులు.

భగవాన్ బాబావారు ఒక సందర్భంలో 'నిజమైన విద్యార్థి ఎవరు?' అనే ప్రశ్నకు 'ఉపాధ్యాయుడే'నని సమాధానం చెపుతూ, ఉపాధ్యాయులు 'నన్ను చూసి నా విద్యార్థులు నేర్చుకోగలిగే ఆదర్శ విద్యార్థిగా నేను ఉండాలి' అనే దీక్షా వాక్యమునుండి స్ఫూర్తిని పొందాలి, అని వ్రాశారు. భగవాన్ బాబావారు స్వయంగా ఎంపిక చేసిన అటువంటి ఆదర్శప్రాయులైన కొందరు అధ్యాపకులను గురించి ఈ అధ్యాయములో తెలుసుకుందాం. వారందరూ తమ

జీవితాంతమువరకు భక్తి, శ్రద్ధలతో, అంకిత భావంతో భగవాన్ బాబావారికి విద్యార్థులుగా ఉండిపోయినవారే! వారిలో ప్రతి ఒక్కరూ భగవాన్ బాబావారు నెలకొల్పిన విద్యాసంస్థలలో పనిచేస్తున్న అనేకమంది ఉపాధ్యాయులకు ప్రతినిధులవంటివారే!

ప్రొఫెసర్ సుందర్రావు 1940వ సంవత్సరములోనే 'పుట్టపర్తికి చెందిన అద్భుత బాలుని' గురించి విన్నా, రెండు దశాబ్దాల తరువాత అంటే 1960వ సంవత్సరములో మాత్రమే భగవాన్ బాబావారిని మొట్టమొదటిసారి దర్శించుకున్నారు. ఆంగ్ల సాహిత్యమును అధ్యయనం చేసిన ప్రతిభావంతుడైన ఈ విద్యార్థియొక్క ఆధ్యాత్మిక పునాదులు, డా॥ అనిబిసెంటుయందు మరియు ఆమె స్థాపించిన దివ్యజ్ఞాన సమాజమునందు తాను పెంచుకున్న ప్రేమ, ఆరాధనాభావములవలన పదిలం చేయబడినాయి. ఫలితంగా, ఆయన తన స్వస్థలమైన మంగుళూరునుండి అక్కడికి 500 కిలోమీటర్ల దూరములోనున్న శ్రీ జిడ్డు కృష్ణమూర్తి జన్మస్థలముగా ప్రసిద్ధికెక్కిన మదనపల్లికి మకాం మార్చారు. అక్కడ బిసెంటు థియోసాఫికల్ కాలేజిలో 1949వ సంవత్సరమువరకు 20 సంవత్సరాలపాటు ఆంగ్లభాషను, సాహిత్యమును బోధించారు. ముఖ్యంగా ఆయన క్లాసురూములో ప్రఖ్యాత ఆంగ్ల కవి, నాటక రచయిత షేక్స్పియర్ నాటకాలను విద్యార్థులకు బోధిస్తున్నప్పుడు ఆ నాటకాలలోని పాత్రలలో ప్రత్యక్షంగా తాను నటిస్తున్నట్లు చాలా రసవత్తరంగా బోధించేవారు. ఆ కారణంగా విద్యార్థులందరు ఆయనను ప్రేమగా 'షేక్స్పియర్ సుందర్రావు' అని పిలుచుకునేవారు.

పుట్టపర్తి, మదనపల్లికి కేవలం 80 కిలోమీటర్ల దూరములోనే ఉన్నది. ఒకసారి ప్రొఫెసరు సుందర్రావు విద్యార్థులు కొంతమంది పుట్టపర్తికి విహారయాత్రకు వచ్చారు. అక్కడ తమకు కలిగిన అద్భుతమైన అనుభవాన్ని గురించి వాళ్ళు శ్రీ సుందర్రావుకు చాలా ఆసక్తికరంగా నివేదించారు. పదునాలుగు సంవత్సరాల బాల బాబా అక్కడి చిత్రావతి నదిఒడ్డున ఉన్న

ఇసుకలోనుండి చాలా యథాలాపంగా వాళ్ళ కెమెరాకు సరిపడే సరిక్రొత్త ఫిల్ము రోల్సును తీసి వారికిచ్చారు. ఈ అద్భుత సంఘటనను గురించి విద్యార్థులు ప్రొఫెసరు సుందర్రావుకు వర్ణించి చెప్పినపుడు ఆయన ఆ విషయమునందు అంతగా ఆసక్తి చూపలేదు. బహుశా తన జీవిత సారథియైన భగవాన్ బాబావారిని కలుసుకునే సమయం ఇంకా రాలేదేమో!

1949వ సంవత్సరములో ప్రొఫెసర్ సుందర్రావు మదనపల్లి కాలేజిలోని ఇంగ్లీషు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటు పదవినుండి తన స్వస్థలమైన మంగుళూరుకు దగ్గరలో ఉన్న ఉడిపిలో క్రొత్తగా నెలకొల్పబడిన మహాత్మాగాంధీ మెమోరియల్ కాలేజీకి ప్రిన్సిపాలుగా పదవీ బాధ్యతలు స్వీకరించడానికి బయలుదేరి వచ్చారు. అక్కడ ఆయన గొప్ప క్రమశిక్షణను అమలుపరచే వ్యక్తిగా, సమర్థుడైన పరిపాలకునిగా పేరు తెచ్చుకున్నారు. వ్యక్తిగతమైన లేక కుటుంబమునకు సంబంధించిన పనులు చక్కబెట్టుకోవడానికి కూడా ఏనాడూ ఊరు విడిచి వెళ్ళడానికి తీరిక లేనంతగా ఆయన తన బాధ్యతలకు అంకితమై యుండేవారు. అవతార పురుషులైన భగవాన్ బాబావారిని గురించి 1954వ సంవత్సరములో తెలుసుకున్న ఆయన కుమార్తెలు ముగ్గురూ తమ తల్లిదండ్రుల అనుమతితో అనేకసార్లు పుట్టపర్తి వెళ్ళివచ్చారు. తన కుమార్తెలు ముగ్గురూ భగవాన్ బాబావారి దివ్య సన్నిధిలో తాము పొందిన అద్భుతమైన అనుభవాలను చాలా ఆసక్తికరంగా వర్ణించి చెపుతూంటే విన్నప్పుడుకూడా శ్రీ సుందర్రావుకు పుట్టపర్తికి వెళ్ళాలనే కోరిక కలుగలేదు. దీనికి కారణం, ఆయన తన కాలేజీపనికి ఎట్టి పరిస్థితులలోను ఎటువంటి అవరోధము కలుగకూడదని కోరుకోవడమే! ఎట్టకేలకు 1960వ సంవత్సరంలో ఒక రోజున భగవాన్ బాబావారినుండి శ్రీ సుందర్రావుకు పిలుపు వచ్చింది. ఆ రోజున భగవాన్ బాబా పుట్టపర్తిలో ఆయన కుమార్తెలను పిలిచి "మీ నాన్న ఇక్కడికి ఎప్పుడు వస్తున్నాడు?" అని అడిగారు.

భగవాన్ బాబావారి ప్రథమ దర్శనమే శ్రీ సుందర్రావుపై గాఢమైన ప్రభావము చూపింది. భగవాన్ బాబావారు అత్యంత సహజంగా తనపై

కురిపించిన అపారమైన ప్రేమకు శ్రీ సుందర్రావు తన్మయులైనారు. తన అంతరంగములోని అత్యంత సున్నితమైన అనేక అనుభూతులను గురించి పరిపూర్ణమైన జ్ఞానముగల వ్యక్తివలె బాబా వర్ణించి చెపుతూన్నప్పుడు భగవాన్ బాబావారి సర్వజ్ఞత్వము శ్రీ సుందర్రావుకు ఒక్క క్షణంపాటు లీలా మాత్రంగా గోచరమైంది. దాంతో ఆయనకు ఒళ్ళు పులకరించింది. అంతరంగములోని దివ్యత్వమును అన్వేషించే సాధనలో నిమగ్నుడైయున్న ఆ అధ్యాపకుని అన్వేషణ జగద్గురువైన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి పాద సన్నిధిలో పరిసమాప్తి చెందింది. అప్పటినుండి శ్రీ సుందర్రావు తరుచు పుట్టపర్తి వెళ్ళి భగవాన్ బాబావారి దర్శనం చేసుకుంటూండేవారు.

1963వ సంవత్సరంలో ఆవిధంగా ఒకసారి శ్రీ సుందర్రావు తన కుటుంబ సభ్యులతో కలసి పుట్టపర్తి వెళ్ళినపుడు భగవాన్ బాబా తాను ఉడిపిలో వారి ఇంటికి వస్తానని చెప్పారు. 1964వ సంవత్సరంలో భగవాన్ కర్ణాటక రాష్ట్రములోని షిమోగా జిల్లాలో గల నాలూరు వెళ్ళి అక్కడ శ్రీ చిన్నప్ప గౌడ గృహములో కొన్నిరోజులపాటు మకాం చేశారు. ఉడిపి, నాలూరుకు నాలుగు గంటల కారు ప్రయాణమంత దూరంలో ఉన్నది. ఆ సమయంలో శ్రీ సుందర్రావు చాలా రోజులనుండి జ్వరంతో బాధపడుతున్నప్పటికి, తన భార్య రమాబాయి మరియు కుమార్తెలతో కలసి మార్చి 23వ తేదీ ఉదయం నాలూరు వెళ్ళి భగవాన్ బాబావారిని తమ గృహమునకు వేంచేయుమని కోరారు. ఆ రోజు అక్కడ భజన జరుగుతూండగా అంధుడైన ఒక బాలుని తల్లి తన కుమారుని తీసుకొని భగవాన్ బాబావారి వద్దకు పరుగెత్తి వెళ్ళి దురదృష్టవంతుడైన తన కుమారునిపై దయ చూపుమని ప్రార్థించింది. అప్పుడు భగవాన్ ఆ బాలుని నేత్రములపై మృదువుగా తాకి అతనికి దృష్టి ప్రసాదించారు! ఈ వార్త దావానలంలా చుట్టు ప్రక్కల గ్రామాలలో వ్యాపించింది. దాంతో ప్రతి గంటకు జనం గుంపులు గుంపులుగా అక్కడికి చేరారు. వందలకొలది వికలాంగులు భగవాన్ ఉన్నచోట గుమికూడారు. సాయంకాలమయ్యేటప్పటికి జనసందోహంతో ఆ ప్రదేశమంతా నిండిపోయి ఒకరినొకరు తోసుకోవడం

మొదలుపెట్టారు. ఆ అయోమయ పరిస్థితులలో శ్రీ సుందర్రావు, కుటుంబసభ్యులు భగవాన్ బాబావారిని కలుసుకోలేకపోయారు. ఆ రోజు అర్ధ రాత్రి వరకు వారు భగవాన్ దర్శనం కొరకు వేచియుండి, తరువాత నిరాశతో ఉడిపికి తిరిగి వచ్చేశారు.

మరునాడు సాయంత్రం 7 గంటలకు ఎవరో ఉడిపిలోని శ్రీ సుందర్రావు ఇంటి తలుపు తట్టారు. ఆయన కుమార్తెలు కిటికీ తెరలోనుండి బయటకు చూచి కాషాయాంబరము ధరించిన ఒక బుట్టతల వ్యక్తి బయట నుంచున్నట్లు గమనించారు. తలుపు తీసి చూచేటప్పటికి సాక్షాత్తు తమ ప్రియతమ ప్రభువు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు తమ ఇంటి తలుపుదగ్గర నిలబడి ఉండడం వాళ్ళు చూచారు. భగవాన్ బాబావారు లోపలికి వస్తూ "సుందర్రావ్! కేవలం మిమ్మల్ని ఆశీర్వదించడానికే నేనిక్కడికి వచ్చాను! నేనిక్కడ ఒక పదినిమిషాలు మాత్రమే ఉంటాను. మీరు నా గురించి ఎక్కువ శ్రమ తీసుకోవద్దు. నిజానికి, నేను నాలూరు నుండి బెంగుళూరు వెడుతూ ఇప్పటికే 16 కిలోమీటర్ల దూరం ప్రయాణం చేశాను. అయితే, మీ హృదయంలో నెలకొనియున్న తీవ్రమైన ఆర్తి నన్ను కదిలించి నా ప్రయాణాన్ని వెనుకకు మళ్ళించి నన్నిక్కడికి తీసికొని వచ్చింది", అని చెప్పారు. అయితే, శ్రీ సుందర్రావు భార్య రమాబాయి స్వామి తమ ఇంట్లో భోజనం చేసి వెళ్ళాలని పట్టుబట్టి ప్రార్థించడంవల్ల భగవాన్ బాబావారు వారి ఇంట్లో అర్ధరాత్రివరకు గడిపి ఆ తరువాత మైసూరుకు బయలుదేరారు. తమ ఇల్లు చిన్నది కావడంచేత భగవాన్ బాబావారికి, ఆయన వెంట వచ్చిన అతిథులకు ఒక్క రాత్రి అయినా విశ్రమించే అవకాశం కల్పించలేకపోయినందుకు శ్రీ సుందర్రావు చాలా బాధపడ్డారు. అలా తన ఇంటిని గురించి ఆయన బాధపడడం ఆయన జీవితంలో ఆ ఒక్కసారే! అయితే, ఆయన హృదయం మాత్రం విశ్వమంతటికి ప్రభువైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారిని నిలుపుకోగలిగినంత విశాలమైనది.

శ్రీ సుందర్రావు 1964వ సంవత్సరంలో ఉడిపిలోని సుప్రసిద్ధ మహాత్మాగాంధీ మెమోరియల్ కాలేజీనుండి పదవీ విరమణ చేసి తన భార్య

మరియు ఆఖరి కుమార్తె హేమలతతో కలసి పుట్టపర్తి వచ్చి తమ ప్రియతమ ప్రభువు భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య సన్నిధిలో స్థిరంగా ఉండిపోయారు. వృత్తి పరంగా 'రిటైర'యిన శ్రీ సుందర్రావును భగవాన్ 'రీ-టైరు' చేసి ప్రశాంతి నిలయంలో నూతనముగా ప్రారంభింపబడిన కేంటీనులో మేనేజరుగా ఆయన సేవలను వినియోగించుకున్నారు. దానితో బాటు 'సనాతన సారథి' ఇంగ్లీషు మాసపత్రికను నడుపడంలో శ్రీ కస్తూరికి సహాయపడమని ఆదేశించారు. సనాతన సారథియైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు శ్రీ సుందర్రావు జీవితానికి సారథ్యం వహించారు.

1969వ సంవత్సరంలో బెంగుళూరులోని వైట్‌ఫీల్డులో గల బృందావనంలో శ్రీ సత్యసాయి ఆర్ట్స్, సైన్స్ అండ్ కామర్స్ కాలేజీని ప్రారంభించినప్పుడు భగవాన్ బాబావారు శ్రీ సుందర్రావుకు ప్రిన్సిపాలుగా, హాస్టల్ వార్డెన్‌గా ఆ కాలేజీని నడిపే పవిత్రమైన బాధ్యతను అప్పగించారు. అనుభవజ్ఞుడు, ఆదర్శవాదియైన శ్రీ సుందర్రావుకు ఆ బాధ్యతలు తన చిరకాల స్వప్నము నిజమైనట్లు అనిపించింది. పవిత్రమైన ఆ బాధ్యతా నిర్వహణలో స్వభావరీత్యా అధ్యాపకుడైన శ్రీ సుందర్రావు తన జీవిత సాఫల్యమును పొందారు.

1974వ సంవత్సరం వేసవిలో శ్రీ సుందర్రావు ముఖమునకు స్వల్పంగా పక్షవాతం వచ్చి డాక్టర్ల సలహాపై పూర్తిగా మంచముపై పరుండి విశ్రాంతి తీసుకుంటున్నారు. ఆశ్రమంలో వారు నివాసముంటున్న గృహము ప్రవేశ ద్వారమువద్దనే ఉన్నది. అందువలన భగవాన్ బాబావారు ఒక్కసారి తమ నివాసమునకు వచ్చి తన భర్తను ఆశీర్వదించి వెళ్ళవలసినదని శ్రీ సుందర్రావు భార్య స్వామిని చాలా ఆర్తితో ప్రార్థించింది. ఒక రోజు సాయంత్రం భక్తులకు దర్శనమివ్వడం పూర్తయిన తరువాత భగవాన్ బాబా శ్రీ సుందర్రావు నివాస గృహమువైపు నడిచివెళ్ళారు. దారిలో విద్యార్థులు సమర్పించిన పకోడా ప్లేటునుండి ఒక పకోడాను చేతితో తీసుకున్నారు. శ్రీ సుందర్రావు ఇంట్లోకి వెళ్ళి ఆ పకోడాను ఆయనకు కనిపించేటట్లు ఎత్తి పట్టుకున్నారు. వెంటనే ఆయన ఆత్రంతో దానిని అందుకునేందుకు చెయ్యి చాచారు. అయితే, భగవాన్

బాబా ఆయనను ఆట పట్టించడానికి ఆ పకోడాను తన నోట్లో వేసుకున్నారు! ఆ దృశ్యం చూస్తున్న శ్రీ సుందర్రావు భార్య రమాబాయి "సాయిరాం" అని ఆశ్చర్యంతో కేకపెట్టింది. శ్రీ సుందర్రావుకూడా కొంచెం కష్టంగా ఉన్నా, స్వామి పరిహాసానికి నవ్వకుండా ఉండలేకపోయారు. అప్పుడు భగవాన్ బాబా రమాబాయితో "ఇక సుందర్రావును గురించి నీవు చింతించవలసిన పనిలేదు. తొందరలోనే ఆయనకు నయమవుతుంది", అని చెప్పారు. తరువాత ఆయన ఒక వేడి పకోడాను సృష్టించి శ్రీ సుందర్రావుకిచ్చి తినుమని చెప్పారు. శ్రీ సుందర్రావు కొంచెం సందేహిస్తూండగా, స్వామి పరిహాసంగా "నువ్వు తినకపోతే, నేనే దానిని తీసుకుని తినేస్తాను" అని ఆయనను బెదిరించారు. తరువాత స్వామి శ్రీ సుందర్రావును మరుసటి రోజు ఉదయం 'మందిరంలో సేవ' అనే విషయమును గురించి విద్యార్థుల యెదుట ప్రసంగించుమని ఆదేశించారు. తన అస్వస్థత కారణంగా తాను మాట్లాడలేనేమోనని శ్రీ సుందర్రావు భయపడ్డారు. కాని, స్వామి ఆజ్ఞను పాటించి తీరవలసిందే కదా!

మరునాడు భగవాన్ బాబావారి సన్నిధిలో శ్రీ సుందర్రావు విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించడం మొదలుపెట్టారు. ప్రారంభంలో ఆయన గొంతు కొంచెం తడబడినా, క్రమంగా మాట్లాడుతూండగా స్వామి యొక్క అద్భుత లీల ప్రస్ఫుటమైంది. ఇన్నాళ్ళూ పక్షవాతం కారణంగా ముఖంపై ఏర్పడిన వికారము మటుమాయమై ఆయన ముఖము పూర్తిగా మామూలుగా తయారైంది! కొద్దినిమిషాల తరువాత ఆయన చాలా స్పష్టంగా మాట్లాడగలిగారు. సభలో కూర్చున్న విద్యార్థులు మరియు ప్రేక్షకులకు ప్రత్యక్షంగా వాళ్ళ కళ్ళ యెదుటే జరిగిన స్వామి లీలను గురించి చెపుతూ శ్రీ సుందర్రావు స్వామిని చూపించి "ఆయన సంకల్పము వల్లనే నేను ఈ రోజు ఈవిధంగా మామూలుగా మాట్లాడగలుగుతున్నాను", అని చెప్పారు. ఆ సమయంలో సర్వజ్ఞులైన భగవాన్ బాబావారి సుందర ముఖారవిందముపై ఒక్క క్షణం పాటు పసిపిల్లవాని అమాయకత్వం లీలామాత్రంగా గోచరించి మాయమైంది.

బృందావనంలో స్వామి భక్తులకు దర్శనం ఇవ్వడానికి మందిరంనుండి బయటకు వచ్చి భక్తుల వరుసలమధ్య తిరుగుతూన్నప్పుడు ఆయనవెంట నడిచే అరుదైన భాగ్యము శ్రీ సుందర్రావుకు లభించింది. ఆ విధంగా ఆ ఇసుక తిన్నెలలో తన ప్రభువైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి అడుగుజాడలలో ఆయనను అనుసరిస్తూ నడిచి వెళ్ళడం నిగూఢమైన ఆ కవి హృదయానికి ఒక అపూర్వమైన మహత్తర అనుభవం. అద్భుతమైన ఆ అనుభవాన్ని శ్రీ సుందర్రావు "ఇన్ హిజ్ ఫుట్ స్టెప్స్" (In His Footsetps అనగా 'ఆయన అడుగు జాడలలో") అనే ఒక కవితలో శాశ్వతంగా పదిలపరచారు :
'సనాతన సారథి' ఆంగ్ల మాసపత్రికలో ప్రచురింపబడిన ఆ కవితలోని ప్రారంభ పంక్తులయొక్క భావము ఈ విధంగా ఉంటుంది :

"ప్రభూ! మీరు నడుస్తూ వెళ్ళండి,
నేను మిమ్మల్ని అనుసరిస్తూ వస్తాను
తుది శ్వాసవరకు; సత్య ప్రమాణంగా, విశ్వాసంతో"

శ్రీ సుందర్రావు జీవితాంతమువరకు ఆ విధంగానే స్వామి అడుగుజాడలలో నడిచారు. 1975వ సంవత్సరం జనవరి 3వ తేదీన భగవాన్ బాబావారు ఊటీనుండి బృందావనంకు తిరిగి వచ్చి ఆ మరునాడు బొంబాయికి ప్రయాణం పెట్టుకున్నారు. తన హృదయావేదనను భగవాన్ దివ్యచరణారవిందములవద్ద నివేదించుకుని ఆయన అనుగ్రహ, ఆశీస్సులను పొందడానికి శ్రీ సుందర్రావు ఆ రోజు ఉదయం భగవాన్ గదిలోనికి వెళ్ళారు. భగవాన్ బాబావారు ఆయనను ఎంతో ప్రేమతో ఆశీర్వదిస్తూ "నీవింక విశ్రాంతి తీసుకునే సమయం ఆసన్నమైంది. నీ బాధలను, బరువును అన్నిటిని నాకు అప్పగించు", అని చెప్పారు. తరువాత స్వామి బొంబాయి వెళ్ళిపోయారు. అదే రోజు రాత్రి 9 గంటలకు శ్రీ సుందర్రావు ప్రశాంతంగా కన్నుమూశారు. ఆ సమయంలో భగవాన్ బాబావారు బొంబాయిలోని ధర్మక్షేత్రములో కొందరు భక్తులతో మాట్లాడుతున్నారు. ఉన్నట్లుండి ఒక్కసారి ఆయన పైకి చూచి "సుందర్రావు వచ్చేశాడు" అని చెప్పారు. ఆ మాట విని స్వామి చుట్టూ ఉన్న భక్తులు

తలుపువైపు చూచారు; అప్పుడు స్వామి వారితో "అక్కడ కాదు, ఇక్కడ" అని తమ హృదయంవైపు చూపిస్తూ చెప్పారు. నిస్సందేహంగా శ్రీ సుందర్రావు తన ఆఖరి క్షణం వరకే కాదు, ఆ తరువాత కూడా తన ప్రభువును అనుసరించారు!

బెంగుళూరు వద్ద గల వైట్ ఫీల్డులోని బృందావనం కేంపస్ డీమ్డ్ యూనివర్సిటీ అయిన శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థకు 1982వ సంవత్సరంలో అనుబంధము చేయబడినప్పుడు ప్రొఫెసర్ డి. నరేందర్ అక్కడి కళాశాలకు ప్రిన్సిపాల్‌గా ఉండేవారు. నిజానికి ఆయన అప్పటికి 12 సంవత్సరాలనుండి ఆ పదవిలో ఉన్నారు. ఆయన అందరి ప్రేమాభిమానములను, గౌరవమును చూరగొన్న ప్రిన్సిపాల్ అని నేను నిస్సంకోచముగా చెప్పగలను. గంభీరమైన విగ్రహము, సంస్కారము మూర్తీభవించిన నడవడి ఆయన బాహ్య లక్షణాలయితే, పాండిత్య ప్రకర్ష, దయార్ద్ర హృదయము ఆయన అంతరంగ వ్యక్తిత్వముయొక్క లక్షణాలు. ఆయన మంచి సూక్ష్మబుద్ధిగల పరిపాలనాదక్షుడు కావడంచేత తన సహజ లక్షణాలైన మౌనము మరియు మిత భాషిత్వములను కళాశాల యొక్క పరిపాలనా వ్యవహారాలలో చాలా సమర్థవంతముగా ఉపయోగపెట్టారు. మంచి దైవభక్తిగల కుటుంబములో పుట్టినప్పటికి, శ్రీ నరేంద్ర ప్రారంభంలో భగవాన్ బాబావారియందు అవిశ్వాసము మరియు నిరాసక్తత కలిగియుండటంచేత ఆయన స్వామిదగ్గరకు చేరుకోవడానికి చాలా సమయం పట్టింది. మద్రాసులోని ప్రెసిడెన్సీ కాలేజీ నుండి ఆంగ్ల సాహిత్యములో ఆనర్సు డిగ్రీ తీసుకునే నాటికే శ్రీ నరేంద్ర (ఆయన మాటలలోనే చెప్పాలంటే) "భారతీయ సంస్కృతిమీద ఏమాత్రము స్థిరమైన విశ్వాసము లేని, ఆధునిక విద్యనభ్యసించిన యువతకు ప్రతినిధి. పాశ్చాత్య సంస్కృతి, సాహిత్యముల ప్రభావముచేత స్వమతాభిమానము తగ్గిపోయి లేక పూర్తిగా నశించి సమకాలీన సమాజముపై విరక్తి భావము పెంచుకోవడమే ఒక ఫ్యాషన్‌గా అలవాటు చేసుకున్న యువకుడు".

1962వ సంవత్సరములో శ్రీ నరేంద్ర కుటుంబములో ఒక విషాద సంఘటన సంభవించింది. ఆయన నాలుగేళ్ళ కుమారుడు గౌతమ్‌కు వింతైన ఒక నరములకు సంబంధించిన వ్యాధి వచ్చింది. మద్రాసు మరియు బెంగుళూరు నగరములలోని వైద్య నిపుణులందరూ ఆ వ్యాధి నివారణ అయ్యే అవకాశము లేదని, ఆ బాలునికి ఇంక భవిష్యత్తు లేదని ముక్తకంఠంతో చెప్పారు. దాంతో ఏమీ చెయ్యలేని నిస్సహాయత ఆ కుటుంబమును ఆవహించింది. గాఢాంధకారములో దారి, తెన్ను గానక కొట్టుమిట్టాడుతున్న ఆయన శోకతప్త హృదయము, అంతవరకు తనకు అగమ్య గోచరంగా ఉండిపోయిన ఏదో దివ్యతత్త్వమునుండి సహాయమర్థించాలని ఆక్రోశించింది. శ్రీ రామకృష్ణ పరమహంస మరియు శ్రీ రమణ మహర్షియొక్క బోధలను ఆయన అధ్యయనం చెయ్యడం మొదలుపెట్టిన తరువాత, అశాశ్వతమైన ఈ మానవ జీవితంలో శాశ్వతమైన తత్త్వమేదో అన్వేషించాలనే తపన ఆయనలో మొదలైంది. దానితోబాటు భక్తిపరమైన శాస్త్రీయ సంగీతమును ఆలకించడంవలన కూడా ఆయన శోకతప్త హృదయానికి గొప్ప సాంత్వన లభించింది.

కొన్ని నెలల తరువాత భగవాన్ బాబావారు మద్రాసుకు విచ్చేసి ఒక చిరకాల భక్తుని యింట్లో 15 రోజులు బస చేశారు. శ్రీ నరేంద్ర మరియు ఆయన తండ్రి కలసి గౌతమ్‌ను ఆయనవద్దకు తీసుకొనివెళ్ళి ఆ బాలుని ఆశీర్వదించి అనుగ్రహింపుమని ప్రార్థించారు. ఆ సమయంలో భగవాన్ వారికి ఇంటర్వ్యూ అనుగ్రహించారు. కరుణాసముద్రులైన ఆ అవతారమూర్తితో ఆంతరంగిక సంభాషణ ఆనాటినుండి వారి జీవితాలను శాశ్వతంగా మార్చివేసింది. వారి మనసులలో నిరాశకు బదులు ఆశాకుసుమం వికసించింది. శ్రీ నరేంద్ర ఆనాటి తమ మానసిక స్థితిని వర్ణిస్తూ "పెను తుపానులో చిక్కుకున్న ఓడవలె గమ్యం లేకుండా కొట్టుకుపోతున్న నా జీవితంలో భగవాన్ బాబావారు ఒక ప్రచండ వాయువువలె ప్రవేశించి నా మనస్సనే తెరచాప యందు ఒక నూతనోత్తేజమును నింపి అవిశ్వాసము, సందేహము మరియు నిరాసక్తత అనే

సాలెగూళ్ళను నా మనస్సు నుండి తొలగించి నా ఆలోచనా విధానమునకు ఒక దిశా నిర్దేశము చేశారు", అని చెప్పారు.

ఆ తరువాత శ్రీ నరేంద్ర వ్యాధిగ్రస్తుడైన తన కుమారుని తీసికొని కుటుంబ సమేతంగా తరుచు ప్రశాంతి నిలయం రావడం ప్రారంభించారు. భగవాన్ బాబావారియందు గౌతమ్‌కు గల ప్రేమ చాలా మిక్కుటమైనది, స్వాభావికమైనది. భగవాన్ బాబావారు కూడా చాలా తరుచుగా ఆ బాలునితో మాట్లాడుతూండేవారు. అలా స్వామి తనతో మాట్లాడినపుడల్లా అతని ఆనందానికి హద్దులు లేకుండా పోయేవి. అయితే, శారీరకంగా అతని పరిస్థితి రోజు రోజుకు క్షీణిస్తూ వచ్చింది. అతనిని ఎల్లప్పుడు సంతోషంగా ఉంచాలని వాళ్ళు మనస్ఫూర్తిగా చేసే ప్రయత్నంలో భాగంగా ఆ కుటుంబ సభ్యులంతా కలసి ప్రతిరోజూ సాయంత్రంపూట తమ యింట్లో భజన చేసేవారు. ఆ సమయంలో వారి యింటిలోని పూజగదిలో ఉన్న విగ్రహాలు, ఫోటోలన్నిటిపై భగవాన్ బాబావారి అనుగ్రహ చిహ్నములైన విభూతి, కుంకుమ, అమృతము వచ్చేవి. గౌతమ్ ఆరోగ్య పరిస్థితి క్షీణించినప్పుడల్లా అతనికి అవసరమైన మందులు, ఇంజక్షను సీసాలు చాలా అద్భుతంగా వారి పూజగదిలో ప్రత్యక్షమయ్యేవి. అవి ఆ బాలునికి సమయానికి స్వస్థత చేకూర్చేవి.

శ్రీ నరేంద్ర కుటుంబము చేసిన ఆర్తితో కూడిన ప్రార్థనలను మన్నించి భగవాన్ బాబావారు అనేకసార్లు వారి యింటికి వచ్చి భక్తి పాటలు పాడి వారికి ఆనందమును కలుగజేశారు. స్వామి ఎప్పుడు వారింటికి వచ్చినా ఆయన దృష్టి అంతా గౌతమ్‌పైననే ఉండేది. శ్రీ నరేంద్ర కుటుంబములో భగవాన్ బాబావారు ప్రవేశించడానికి, వారి కుటుంబము ఆధ్యాత్మిక మార్గంలో పయనించడానికి కారకుడైన ఆ బాలుని స్వామి ఎప్పుడూ "గురువు" అని పిలిచేవారు. గౌతమ్ శారీరక పరిస్థితి నానాటికి క్షీణిస్తూండినప్పటికి, అతడు అంతరంగములో ఎల్లప్పుడు దివ్యమైన ఆనందము ననుభవిస్తూండేవాడు. క్రమంగా అతని కాళ్ళు, చేతులు చచ్చుబడిపోయి, కంటిచూపు తగ్గిపోయి,

కేవలం వినికిడి శక్తి మాత్రమే స్థిరంగా నిల్చింది. భగవాన్ బాబావారు ఎంత నిశ్శబ్దంగా అతనిని సమీపించినా, ఆ బాలుడు ఏదో విధంగా ఆయన రాకను కనిపెట్టి సంతోషంగా పలకరించేవాడు. తమ కుమారుని తీవ్ర అనారోగ్యమువలన దుఃఖము, అధైర్యములతో నిండిపోవలసిన వాళ్ళ జీవితాలు భగవాన్ బాబావారి ప్రవేశముతో ఉత్సాహము, సంతోషములతో నిండిపోయాయి. నిజానికి, భగవాన్ బాబావారు ఆ బాలుని పేరు మార్చి "విజయ సాయి" అని నామకరణం చేస్తూ ఆ పేరు భౌతిక శక్తిపై మానసిక, ఆధ్యాత్మిక శక్తుల విజయమునకు సంకేతమని వివరించారు.

కాలం గడుస్తున్న కొద్ది, భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి అవతార కార్యక్రమంలో తాను కూడా ఒక ఉపకరణముగా సేవలందించాలని శ్రీ నరేంద్ర హృదయంలో తీవ్రమైన ఆకాంక్ష బయలుదేరింది. ఆయన భార్య మరియు తల్లిదండ్రులు కూడా అదే మార్గంలో నడిచారు. తాము ఎల్లప్పుడు భగవాన్ బాబావారి సంరక్షణలో, మార్గదర్శకత్వంలో ఉండాలని ఆ కుటుంబము స్వామిని మనసారా ప్రార్థించింది.

ఎట్టకేలకు, 1970వ సంవత్సరంలో భగవాన్ బాబావారు వారి ప్రార్థనలను మన్నించి శ్రీ నరేంద్రను బెంగుళూరు వచ్చి తమ అవతార కార్యక్రమంలో పాలు పంచుకోమని చెప్పారు. చాలా సంవత్సరాల తరువాత భగవాన్ బాబా ఆ సంఘటనను గురించి ప్రస్తావిస్తూ "నరేంద్రను బెంగుళూరు వచ్చి సేవ చేయుమని నేను కోరినప్పుడు ఆయన ఎటువంటి ప్రశ్నలు వేయలేదు. నిజానికి, ఆ సమయంలో అతనికి నేను ఏ పని చెయ్యాలో కూడా చెప్పలేదు. అయినప్పటికి, అతను ఎటువంటి సందేహము పెట్టుకోకుండా నేరుగా మద్రాసులో తాను పనిచేస్తున్న కాలేజికి వెళ్ళి తన ఉద్యోగానికి రాజీనామా చేసి కుటుంబముతో సహా బెంగుళూరు వచ్చేసి స్వామి ఆదేశముల కొరకు ఎదురుచూస్తూ ఉండిపోయాడు", అని శ్రీ నరేంద్రకు స్వామియందు గల అచంచల భక్తి, విశ్వాసములను కొనియాడారు. 1970వ సంవత్సరం జూన్ నెలలో శ్రీ నరేంద్ర బెంగుళూరులోని శ్రీ సత్యసాయి ఆర్ట్స్, సైన్స్, కామర్స్

కాలేజీకి ప్రిన్సిపాలుగా నియమింపబడేనాటికి ఆ కాలేజి స్థాపించి కేవలం ఒక సంవత్సరం మాత్రమే అయ్యింది. ప్రారంభ దశలో నున్న అటువంటి కాలేజీకి సారథ్యం వహించడం నిజానికి చాలా సాహసోపేతమైన కార్యమే! అయినప్పటికి, శ్రీ నరేంద్ర భగవాన్ బాబావారియందు సంపూర్ణ విశ్వాసముతో, అంకితభావముతో, శరణాగతితో తన బాధ్యతలను నెరవేర్చారు. మంచి మేధాశక్తి, సహృదయము వంటి ఉత్తమ లక్షణాలు గలిగిన శ్రీ నరేంద్ర, ఆ కళాశాలను మంచి ఆదర్శప్రాయమైన ఆధునిక గురుకులముగా తీర్చిదిద్దాలనే భగవాన్ బాబావారి స్వప్నము సాకారము కావడానికి తీవ్రమైన కృషి చేశారు. భగవాన్ కూడా శ్రీ నరేంద్రపై అపారమైన ప్రేమానుగ్రహములను వర్షించారు. ఫలితంగా వారిద్దరి మధ్య అత్యంత మనోహరమైన బాంధవ్యము నెలకొన్నది.

ఒక రోజు సాయంత్రం భగవాన్ బాబా కారును రప్పించి తాను అందులో కూర్చుని శ్రీ నరేంద్రను కూడా కూర్చోమన్నారు. కారు స్టార్టు కాగానే స్వామి శ్రీ నరేంద్రతో "ఈ రోజు సాయంత్రం నేను నిన్ను కారులో ఇంటికి దిగబెట్టుదామనుకుంటున్నాను", అని చెప్పారు. తన ప్రభువు తనపై చూపించిన అపారమైన అనుగ్రహమునకు శ్రీ నరేంద్ర పరవశులైనారు. అయితే, భగవాన్ తమ గృహమును సందర్శించనున్నారనే వార్తను తన భార్యా బిడ్డలకైనా ముందుగా తెలియజేసే అవకాశము లేనందువలన అక్కడ స్వామికి సరియైన స్వాగతసత్కారాలు ఏర్పాటు చేయలేమోనని శ్రీ నరేంద్ర ఆందోళన చెందారు. బెంగుళూరు నగరములోని ఉల్సూరులో తన ఇంటిదగ్గర కారు ఆగగానే శ్రీ నరేంద్రను కారులోనే కూర్చోమని చెప్పి భగవాన్ బాబా కారు దిగి వారింటి తలుపు దగ్గరకు వెళ్ళి బయట ఉన్న కాలింగ్ బెల్లునొక్కారు! తలుపు తీసిన శ్రీ నరేంద్ర భార్య సాక్షాత్తు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు చిరునవ్వు నవ్వుతూ అభయహస్తము పైకెత్తి అక్కడ నిలబడి ఉండడం చూసి దిగ్భ్రమ చెందింది. అప్పుడు బాబా లోపలికి అడుగుపెడుతూ "నరేంద్ర ఇంటికి వచ్చేశాడా?" అని అడిగారు. ఆయన భార్య "స్వామీ! ఆయన ఇంకా కాలేజీనుండి ఇంటికి రాలేదు," అని సమాధానం చెప్పింది. అప్పుడు భగవాన్ బాబా చిలిపిగా

చిరునవ్వు నవ్వుతూ బయటకు వచ్చి శ్రీ నరేంద్రను పిలిచారు. స్వామి పిలుపును అందుకున్న శ్రీ నరేంద్ర ఇంటిలోనికి వచ్చారు. దాంతో ఆ కుటుంబ సభ్యులందరూ స్వామి ఆడిన ఈ చిలిపి నాటకానికి మనసారా ఆనందించారు. తరువాత భగవాన్ బాబా వంట గదితో సహా వారి ఇల్లంతా తిరిగారు. వారి కుమారుడు విజయ సాయిని ఆశీర్వదించి కొద్ది నిమిషాలలోనే బృందావనమునకు తిరిగి వెళ్ళిపోయారు.

1974వ సంవత్సరములో వారి కుమారుడు విజయసాయి ప్రశాంతంగా కన్నుమూసినప్పుడు శ్రీ నరేంద్ర మరియు వారి కుటుంబ సభ్యులపై భగవాన్ బాబావారు కురిపించిన ప్రేమానుగ్రహములు అపారమైనవి. కొద్దిరోజులు పోయిన తరువాత భగవాన్ బాబా వారి గృహమును సందర్శించి "విజయసాయిది పూర్తిగా ఆధ్యాత్మిక జన్మ. తన కర్మశేషమును పూర్తి చేసుకోవడానికే అతడు ఈ ప్రపంచంలో అడుగుపెట్టాడు. కేవలం వినికిడి, స్పర్శ తప్పించి ఇతర ఇంద్రియాలేవీ పనిచేయక పోయినా స్వామియందు అతనికుండే భక్తి అతనిని తన జీవిత పరమార్థమైన ముక్తిపదమును చేరుకునేటట్లు చేసింది. భక్తి, శ్రద్ధలే మానవజీవితంలో అత్యంత విలువైన ఆస్తి. ఈ ధనముంటే మానవుడు తన జీవితంలో అన్ని రకాల ఆటంకములను అధిగమించవచ్చు", అని చెప్పారు. కుమారుడు పోయిన దుఃఖంలో ఉన్న ఆ తల్లిదండ్రులకు స్వామి చల్లని మాటలు సాంత్వనను చేకూర్చాయి.

ఉపాధ్యాయులు తమ విద్యార్థులను 'ప్రేమ పుత్రులు'గా భావించాలని భగవాన్ బాబావారు బోధించిన అత్యంత ప్రధానమైన ఆదేశమును శ్రీ నరేంద్ర 'తు,చ' తప్పకుండా పాటించారు. ఆయన తన విద్యార్థులను ఎంతగానో ప్రేమించారు. శ్రీ నరేంద్రను ఆయన దగ్గర చదువుకున్న విద్యార్థులు మంచి క్రమశిక్షణను పాటించే ప్రేమ, దయలతో నిండిన హృదయము గల అధ్యాపకునిగా జ్ఞాపకం పెట్టుకుంటారు. ఆయనకు విద్యార్థులయందు గల ప్రేమకు నిదర్శనంగా ఒకనాడు ఆయన క్లాసులో జరిగిన ఈ క్రింది హాస్యరసభరితమైన ఉదంతమును పేర్కొనవచ్చును :

బృందావనంలోని శ్రీ సత్యసాయి కళాశాల ప్రాంగణంలో నిర్దేశింపబడిన కఠినమైన జీవితానికి అలవాటుపడని క్రొత్తగా వచ్చిన విద్యార్థి ఒకడు తరుచుగా క్లాసురూములో నిద్రమత్తులో ఉండేవాడు. ఒక రోజున ఆ విద్యార్థి క్లాసులో పొరపాటున కుర్చీలో కూర్చున్న శ్రీ నరేంద్ర చేతిపై తన తలను ఆనించి కొద్దిసేపట్లో అలాగే నిద్రపోయాడు. శ్రీ నరేంద్ర మాత్రం ఎటువంటి అసౌకర్యము ఫీలవకుండా తన పని తాను చేసుకుపోయారు. ఆ పీరియడ్ అయిపోయి గంట కొట్టిన తరువాత మాత్రమే ఆ విద్యార్థిని లేపి "బెల్లు కొట్టేశారు, లే!" అని చెపుతూ ఆ విద్యార్థి తలక్రింద ఉన్న తన చేతిని వెనుకకు తీసుకున్నారు! దాంతో సిగ్గుపడిపోయిన ఆ విద్యార్థి ప్రిన్సిపాలు రూముకు పరుగెత్తి ఆయనకు క్షమాపణ చెప్పబోగా శ్రీ నరేంద్ర ఆ విద్యార్థికి కేంపస్‌లో అంతటి కఠినమైన దినచర్య పాటిస్తూ కూడా క్లాసురూములో మేలుకుని ఉండడం ఎలాగో చాలా శాంతంగా బోధించారు.

1976వ సంవత్సరంలో భగవాన్ బాబావారు బృందావనంలోని కాలేజీ బిల్డింగుకు ప్రక్కనే విద్యార్థులకొరకు సమస్త సౌకర్యములు గల ఒక విశాలమైన హాస్టలు బిల్డింగు కట్టించడానికి నిర్ణయించారు. అంతవరకు విద్యార్థులు ఆశ్రమంలోనే సరియైన సౌకర్యములు లేని పురాతనమైన ఒక చిన్న బిల్డింగులో ఉంటూండేవారు. ఆ క్రొత్త స్థలంలో భవన నిర్మాణానికి భూమి పూజ జరిపించడానికి అప్పటికే ఏర్పాట్లు జరిగిపోయాయి. అయితే, విద్యార్థులు మాత్రం ఆశ్రమంలో తమ ప్రియతమ ప్రభువు నివసించే మందిరానికి దూరంగా నిర్మింపబడే నూతన భవనములోనికి మారే ఆలోచనకు సుముఖంగా లేరు. ఒక రోజు ఉదయం భగవాన్ బాబావారు విద్యార్థుల హాస్టలును సందర్శించినపుడు ఒక విద్యార్థి తమను స్వామి దివ్య సన్నిధినుండి దూరం చేయవద్దని వేడుకుంటూ స్వామికి ఒక ఉత్తరం సమర్పించుకున్నాడు. అప్పుడు భగవాన్ బాబావారు ఆ ఉత్తరమును ప్రిన్సిపాలు శ్రీ నరేంద్రకిచ్చి ఆయనను అందరికి వినపడేలా గట్టిగా చదువమన్నారు. శ్రీ నరేంద్ర ఆ ఉత్తరం చదువుతూండగా విద్యార్థులందరూ కలసి ముక్త కంఠముతో తమ ప్రార్థనను మన్నించుడని స్వామిని వేడుకున్నారు.

అప్పుడు భగవాన్ క్రొత్త స్థలంలో భవన నిర్మాణానికి మార్కింగు చేస్తున్న శ్రీ జోగారావు మరియు ఇతర ఇంజనీర్లను వెంటనే తమవద్దకు రమ్మని కబురు పంపారు. · వాళ్ళు రాగానే స్వామి "జోగారావ్! ఆ క్రొత్త స్థలంలో హాస్టలు బిల్డింగు కట్టించడం విద్యార్థులకు ఇష్టం లేదు. వాళ్ళు ఇక్కడే ఉండాలనుకుంటున్నారు. ఏం చేద్దాం?" అని శ్రీ జోగారావును అడిగారు.

శ్రీ జోగారావు మాత్రం "స్వామీ! ఈ దశలో మనం ప్లాన్లను మార్పుచెయ్యలేం. ఆ క్రొత్త స్థలంలో మనం కట్టబోతున్న భవనము విద్యార్థులకు చాలా సౌకర్యంగా ఉంటుంది", అని తన నిశ్చితమైన అభిప్రాయమును తెలియజేశారు. అప్పుడు భగవాన్ బాబా విద్యార్థులవైపు 'మీరేమంటారు?' అన్నట్లు చూడగా వాళ్ళు మళ్ళీ "స్వామీ! మాకు ఎటువంటి సదుపాయములు, సౌకర్యములు అవసరం లేదు. మీకు దగ్గరగా ఉంటేనే మాకు సంతోషంగా ఉంటుంది", అని ఖచ్చితంగా తేల్చి చెప్పారు. అప్పుడు స్వామి మళ్ళీ ఈ విషయంలో శ్రీ నరేంద్ర అభిప్రాయం కోరారు : "నరేంద్రా! నీ అభిప్రాయమేమిటి?" అని అడిగారు. దానికి శ్రీ నరేంద్ర "స్వామీ! విద్యార్థులు తమ తల్లిదండ్రులకు దూరంగా ఉంటున్నారు. వాళ్ళు స్వామి కొరకే ఇక్కడకు వచ్చారు. అందువలన తాము స్వామి దివ్య సన్నిధిలోనే ఉండాలనే వారి కోరిక పూర్తిగా సమంజసమైనదని నా అభిప్రాయము. స్వామి మా ఈ చిన్న కోరిక తీర్చాలని నేను కూడా వినయపూర్వకంగా వేడుకుంటున్నాను", అని విన్నవించుకున్నాడు. ప్రిన్సిపాలు శ్రీ నరేంద్రయొక్క వినయపూర్వకమైన, నిశ్చితాభిప్రాయమును విన్న భగవాన్ బాబావారి హృదయము విద్యార్థులకు తమయందు గల ప్రేమకు ఆర్ద్రమైంది. వెంటనే భగవాన్ విద్యార్థుల క్రొత్త హాస్టలు బిల్డింగు ఆశ్రమ ప్రాంగణంలోనే నిర్మించాలని నిర్ణయించారు.

బృందావనంలోని శ్రీ సత్యసాయి కళాశాలకు ప్రిన్సిపాలుగా 18 సంవత్సరాలు పనిచేసిన తరువాత, సరిగ్గా రిటైరయ్యేముందు శ్రీ నరేంద్రకు పక్షవాతం వచ్చింది. వెంటనే ఆయనను బెంగుళూరులోని ఒక ప్రైవేటు

నర్సింగ్‌హోమ్‌లో చేర్పించి అక్కడ కొన్ని రోజులపాటు చికిత్స చేయించారు. ఆ సమయంలో భగవాన్ బాబావారు ప్రశాంతి నిలయంలో ఉన్నారు. ఒక రోజు తెల్లవారుఝామున, శ్రీ నరేంద్రతోబాటు ఆయనకు సహాయంగా నర్సింగ్‌హోంలో ఉన్న ఆయన చిన్న కుమారుడు భరత్ 5 గంటలకు మెలకువవచ్చి చూస్తే తన తండ్రి అప్పటికే మెలకువగా ఉండడం కనిపించింది. ఆ అబ్బాయి, తండ్రి మంచం దగ్గరకు వెళ్ళి చూస్తే శ్రీ నరేంద్ర ముఖంలో ప్రశాంత సుందరమైన చిరునవ్వు వెలుగుతూండడం కనపడింది. అప్పుడు శ్రీ నరేంద్ర కొంచెం తడబడుతూ "భరత్! కొద్ది నిమిషాలక్రితం స్వామి ఇక్కడకు వచ్చి వెళ్ళారు", అని చెప్పారు. నమ్మశక్యంగాని ఆ వార్తకు భరత్ ఆశ్చర్యపోయి తలుపువైపు చూచాడు. అయితే, తలుపు మామూలుగానే లోపలివైపు నుండి గడియపెట్టి ఉన్నది. శ్రీ నరేంద్ర తన అనుభవాన్ని కుమారునికి వర్ణించి చెపుతూ "నాకు కొద్ది రోజులలోనే నయమవుతుందని స్వామి అభయమిచ్చారు. స్వామి నా కొరకు విభూతి సృష్టించి కొంచెం నా నోట్లో వేసి నుదుటిపై కూడా పెట్టారు", అని చెప్పారు. ఆ తరువాతే భరత్ తన తండ్రి నుదుటిపై అప్పుడే తీర్చిదిద్దినట్లున్న విభూతి రేఖలను గమనించాడు.

ఆ రోజు ఉదయమే సుమారు 7 గంటల ప్రాంతంలో ప్రశాంతి నిలయంలో భగవాన్ బాబా మందిరం బయట వరండాలో కూర్చున్న శ్రీ నరేంద్ర తండ్రి జస్టిస్ దామోదరరావువద్దకు వచ్చి ఆయనతో "ఈ రోజు తెల్లవారుఝామున నేను బెంగుళూరులో నర్సింగ్‌హోంలో ఉన్న మన నరేంద్రవద్దకు వెళ్ళి చూచి వచ్చాను. అతను బాగున్నాడు", అని చెప్పారు. ఆ తరువాత శ్రీ నరేంద్ర చాలా వేగంగా కోలుకున్నాడని ఇంక వేరే చెప్పనవసరం లేదు. కొన్ని నెలల తరువాత శ్రీ నరేంద్ర తన విద్యార్థులతో మాట్లాడుతూ "ఆ విధంగా పక్షవాతంతో బాధపడడం కూడా నాకు ఎంతో మేలు చేకూర్చింది; ఎందువల్లనంటే, ఆ సమయంలో అహేతుక కరుణాసింధువైన భగవాన్ బాబావారి అపారమైన అనుగ్రహమును నేను పొందగలిగాను" అని చెప్పారు.

ఆ మరుసటి సంవత్సరం గురుపూర్ణిమ పర్వదినంనాడు శ్రీ నరేంద్ర చివరిసారిగా ప్రశాంతి నిలయంలో భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్నారు. బృందావనం తిరిగి వచ్చిన తరువాత కూడా తరుచు శ్రీ నరేంద్ర భగవాన్ తనపై ప్రసరించిన కరుణాపూరితమైన చిరునవ్వును పదే పదే గుర్తుచేసుకుంటూ ఆనందడోలికలలో విహరించేవారు. భగవాన్ బాబావారు ప్రసాదించిన ఆ చిరునవ్వు ఆయన హృదయాన్ని ఆకట్టుకుని ఏదో ఒక అలౌకికమైన ఆనందానుభూతితో నింపివేసింది. కొద్ది రోజులలోనే శ్రీ నరేంద్ర తిరిగి అస్వస్థులైనారు. అయితే, శారీరకమైన అనారోగ్యము ఆయన అంతరంగములోని దివ్యమైన ఆనందానుభూతికి ఏమాత్రము ఆటంకము కాలేదు. ఒక పదిహేను రోజులలోపునే ఆయన జీవయాత్ర ప్రశాంతంగా ముగిసింది. తనకు అత్యంత ప్రీతిపాత్రుడైన 'ప్రిన్సిపాల్' శ్రీ నరేంద్ర భౌతికకాయమును ప్రశాంతి నిలయమునకు తీసికొనివచ్చి ఇక్కడ చిత్రావతీ నది ఒడ్డున దహన సంస్కారము జరుపవలసినదని భగవాన్ బాబా ఆదేశించారు. ఆ మరునాడు భగవాన్, శ్రీ నరేంద్ర కుటుంబసభ్యులను ఇంటర్వ్యూకు పిలిచి వారి హృదయాలనుండి ఆయన పోయిన దుఃఖమును పూర్తిగా తుడిచివేశారు. శ్రీ నరేంద్ర అంత్యక్రియల సందర్భంగా పదమూడవరోజువరకు భగవాన్ వారి కుటుంబానికి కేంటీనునుండి భోజనం పంపే ఏర్పాటు చేశారు. అంతేకాదు, భోజనంతోపాటు స్వీట్లు కూడా పంపిస్తూ "సంతోషంగా ఉండండి; నరేంద్ర స్వామిలో ఐక్యమైనాడు", అని కూడా సందేశము పంపారు.

1964వ సంవత్సరం జూన్ నెల 18వ తేదీన తీవ్ర ప్రమాదానికి గురై బెంగుళూరులోని హాస్పిటలు మంచంమీద పడున్న ప్రొఫెసర్ అణిమా ముఖర్జీ ఆశానిరాశలమధ్య కొట్టుమిట్టాడుతున్నారు. నాలుగు రోజులలో ఉన్నత విద్యకై అమెరికా వెళ్ళబోతున్న తరుణంలో ఆమె తీవ్రమైన రోడ్డు ప్రమాదానికి గురైంది. తన సోదరితో కలసి బెంగుళూరులో స్కూటరుమీద వెడుతూండగా ఈ ప్రమాదం సంభవించి ఆమె కలలన్నీ చెదిరిపోయాయి. ఆమె కుడికాలియందలి పిక్క ముందు భాగములో గల ఎముకలు విరిగి ముక్కలైపోయాయి. డాక్టర్లు శస్త్రచికిత్స

చేసి ఫలితం లేకపోగా కాలు పూర్తిగా తీసివేయాలని అభిప్రాయపడ్డారు. పరిస్థితి పూర్తిగా నిరాశాజనకంగా ఉన్నది.

అటువంటి పరిస్థితులలో ఆశాకిరణం ఏవైపునుండి ఉదయించింది? ఆమె సోదరి కనక్ మరియు సోదరి భర్త డా॥ దిలీప్ కుమార్ బెనర్జీ భగవాన్ బాబావారికి గొప్ప భక్తులు. బెంగుళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్సు ప్రాంగణంలో గల వారింటికి భగవాన్ ఒకటి రెండుసార్లు విచ్చేశారు కూడా! ఆ ఇనిస్టిట్యూట్‌లోని ఇనార్గానిక్ కెమిస్ట్రీ విభాగమునకు డా॥ బెనర్జీ అధిపతిగా పనిచేస్తూండేవారు. భగవాన్ బాబావారు అణిమను తప్పక రక్షిస్తారని డా॥ బెనర్జీ దంపతులు విశ్వసించారు. అయితే, అణిమకు అంతటి నమ్మకం కుదరలేదు. డా॥ బెనర్జీ దంపతులు అణిమ విషయాన్ని భగవాన్ బాబావారి యెదుట ప్రస్తావించినప్పుడు ఆయన "ఆమెకు పూర్తిగా నయమవుతుంది. అయితే, రెండు కాలివ్రేళ్ళు మాత్రం తీసివేయవలసి ఉంటుంది" అని చెప్పారు. ఆమె కాలివ్రేళ్ళకు ఎటువంటి దెబ్బ తగిలినట్లు కనిపించకపోవడంచేత భగవాన్ మాటలు వారందరికి చాలా ఆశ్చర్యమును కలిగించాయి. కాని, రెండు రోజుల తరువాత భగవాన్ బాబావారు ముందే చెప్పినట్లు గేంగ్రీన్ (Gangrene అనగా క్రుళ్ళిన) సోకిన ఆమె రెండు కాలివ్రేళ్ళను తీసివేయవలసిన అవసరం ఏర్పడింది. అయితే, అప్పటికింకా ఆమె కాలును పూర్తిగా తీసివేయాలేమోననే భయం మాత్రం తొలగిపోలేదు. డా॥ బెనర్జీ దంపతులు ఈ పరిస్థితులలో భగవాన్ బాబావారి సహాయం కోరడానికి భగవాన్ బాబావారివద్దకు పరుగెత్తినపుడు అణిమ తనలో తాను "నేను ఒక్కసారి కూడా భగవాన్ బాబావారి దర్శనం చేసుకోవడానికి వెళ్ళకపోయినా ఆయన నాయందు ఇంత ఆసక్తి ఎందుకు చూపాలి?" అని తర్కించడం మొదలుపెట్టింది. కొంతసేపయిన తరువాత ఆమె సోదరి, బావ చాలా ఉత్సాహంగా తిరిగి వచ్చారు. ఆమె సోదరి కనక్ "ఈ రోజు సాయంత్రం భగవాన్ బాబావారు నిన్ను ఆశీర్వదించడానికి హాస్పిటలుకు వస్తున్నారు" అని ఆమెతో చెప్పింది. ఆ వార్త విన్న అణిమ మనస్సు కొద్దిక్షణాలపాటు పనిచేయడం మానివేసింది. భగవాన్ బాబావారు

తనపై అంతటి దయను చూపిస్తారని ఆమె ఊహించనుకూడా ఊహించలేదు. ఆమె ఆలోచనలన్ని స్తంభించిపోయాయి.

తన జీవితాన్ని ఒక మలుపు త్రిప్పిన ఆనాటి సంఘటనను ప్రొఫెసర్ అణిమ ఈ విధంగా వర్ణిస్తున్నారు : "భగవాన్ బాబా హాస్పిటలుకు వచ్చి నేనుండే గది తలుపు దగ్గర కొన్ని సెకన్లపాటు నిలుచుని నావైపు తీక్షణంగా చూశారు. చంద్రబింబమువంటి స్వామి దివ్యవదనారవిందములో అమాయకత్వము తొంగిచూసింది. ఒత్తైన నల్లని బుట్టతలవంటి గిరజాల జుట్టు తప్పించి ఆ క్షణంలో ఆయనలో నాకు ఎటువంటి ప్రత్యేకతగాని, అసాధారణమైన అద్భుతవైఖరిగాని నాకు కనపడలేదు. ఆయన కొంచెంసేపు డా॥ బెనర్జీ దంపతులతో ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. ఆ సమయంలో ఆయన వారి కుమారుడు చి॥ దీపక్‌ను ఆప్యాయంగా దగ్గరకు తీసుకుని కొంచెంసేపు ఎత్తుకున్నారు. ఆయన నిరాడంబర స్వభావము, సౌమ్యత, అన్నింటికి మించి నల్లని పెద్ద పెద్ద కళ్ళల్లో నుండి జాలువారే దయ, కరుణలు ఆ సమయంలో నాకు గోచరించి నా హృదయాన్ని కదిలించివేశాయి. ఇంతలో ఆయన తన కుడి అరచేతిని శూన్యంలో గుండ్రంగా త్రిప్పుతూ ఒక్క క్షణంలో కాషాయాంబరధారియైన తన ప్రతిమయే చెక్కబడిన ఒక పతకమును సృష్టించారు. ఆనందంతో మెరుస్తున్న కళ్ళతో ఆ పతకమువైపు చూస్తూ 'స్వామి ఇప్పుడు తాను ధరించిన కాషాయాంబరముతోనే ఆ పతకములో కన్పిస్తున్నారు' అని వ్యాఖ్యానించారు. ఆ సమయంలో అలౌకికమైన ఆయన సృష్టికంటె, ఆయన దివ్య సుందరవదనారవిందములో గోచరించిన అమాయకత్వమే నాకు ఎక్కువగా ఆనందమును కలుగజేసింది. తరువాత ఆ పతకమును స్వామి అవధులులేని ఆనందముతో పొంగిపోతున్న దీపక్‌కు అందజేశారు. అప్పుడు ఆయన లేచి నా మంచమునకు అవతలి ప్రక్కకు నడిచివెడుతూ "కనక్ యొక్క భక్తి, నీ ధైర్యము ఈ రెండూ కలిసి నన్నిక్కడికి రప్పించాయి", అని చెప్పారు. ఇంతలో నేను చూస్తుండగానే స్వామి తన కుడి అరచేతి నుండి పెద్ద మొత్తంలో విభూతిని సృష్టించి నా రెండు కాళ్ళపై ధారగా వర్షిస్తూ కొంచెం తీసి నా

నుదుటిపై బొట్టుపెట్టారు. తరువాత నా కళ్ళలోకి చూస్తూ 'అమెరికా వెళ్ళే ఛాన్సు తప్పిపోయిందని బాధపడుతున్నావా?' అని అడిగారు. ఆయనే మళ్ళీ 'విచారించకు, ఇంతకంటె మంచి ఛాన్సే వస్తుందిలే' అని మెత్తని కంఠస్వరంతో నన్ను ఓదార్చారు. తరువాత మా అక్క, బావలవైపు తిరిగి 'తొందరలోనే నేను ఆమెను పూర్తిగా బాగుచేస్తాను' అని చెప్పారు. అది నాకొక అద్వితీయమైన అనుభూతి. ఈ ఏక్సిడెంటు మూలంగా శారీరకంగా ఎంతో బాధననుభవిస్తూ, ఉన్నత విద్యకై అమెరికా వెళ్ళే మంచి అవకాశమును పోగొట్టుకుని మానసిక వేదన ననుభవిస్తున్న నేను స్వామి ఓదార్పువలన వెంటనే తేరుకున్నాను".

భగవాన్ బాబావారి దివ్యవాక్కు ననుసరించి కొన్ని నెలలలోపుగానే ప్రొఫెసర్ అణిమ కాళ్ళు బాగయి లేచి తిరగగలిగినది. ఆమె శారీరక పరిస్థితినిబట్టి డాక్టర్లు అంతకు ముందు వెలిబుచ్చిన అభిప్రాయము పూర్తిగా తప్పు కావడంతో వాళ్ళు ఆశ్చర్యపోతూ "భగవంతుడొక్కడే ఈ విధంగా నయం చేయగలడు", అని వ్యాఖ్యానించారు. 1965వ సంవత్సరం డిశంబరు నెలలో భగవాన్ బాబావారు ఆమెను లక్నోకు తిరిగి వెళ్ళి అక్కడి విశ్వవిద్యాలయ కళాశాలలో అంతకు ముందు ఆమె పనిచేసిన ఏంథ్రోపాలజీ డిపార్టుమెంటు హెడ్‌గా పదవీ బాధ్యతలు చేపట్టడానికి అనుమతించారు. వీడ్కోలు సమయంలో ఆమెను ఆశీర్వదిస్తూ "నీ భవిష్యత్తు చాలా ఉజ్వలంగా ఉంటుంది", అని చెప్పారు.

భగవాన్ బాబావారి అభయ వాక్కులు ప్రొఫెసర్ అణిమ జీవితంలో ఒక క్రొత్త వెలుగును, ఆశను నింపాయి. క్రమంగా, మానవ రూపములో అవతరించిన దైవమును తాను కలుసుకోగలిగాననే సత్యమును ఆమె తెలుసుకునేటప్పటికి 'భగవాన్ బాబావారి అవతార కార్యక్రమంలో ఒక ఉపకరణముగా సేవ చేయడమే తన జీవితమునకు సాఫల్యము', అని ఆమె గ్రహించింది. ఎట్టకేలకు ఆమె హృదయంలో గూడుకట్టుకున్న చిరకాల వాంఛ భగవాన్ బాబావారు ఆమెను 1969వ సంవత్సరం జూన్ నెలలో అనంతపురంలోని శ్రీ సత్యసాయి మహిళా కళాశాలకు ప్రిన్సిపాలుగా ఎంపిక చేసినప్పుడు తీరింది. అప్పటికి ఆ కాలేజి స్థాపించి కేవలం ఒక సంవత్సరం

మాత్రమే అయ్యింది. అనంతపురం పట్టణములో ఒక సామాన్యమైన భవనములో ప్రారంభింపబడిన ఆ కాలేజి 1971వ సంవత్సరంలో పట్టణం వెలుపల ఒక విశాలమైన కేంపస్‌లోనికి మార్చబడింది. తరుచు తాను అనారోగ్యంతో బాధపడుతున్నా, ప్రొఫెసర్ అణిమ కళాశాలయొక్క సర్వతోముఖాభివృద్ధికి గొప్ప ఉత్సాహంతో కృషిచేసింది. భగవాన్ ఆమెకు కాలేజీ బాధ్యతలు అప్పగిస్తూ "నీకేదైనా సమస్య ఎదురైనప్పుడు తప్పక నన్ను కలుసుకోవచ్చు, మాట్లాడవచ్చు. నా ఫోను నంబరు 1. నీవు ఎప్పుడు ఫోను చేసినా నేను తప్పక పలుకుతాను", అని అభయమిచ్చారు. ఇందులో ఒక అంతరార్థము కూడా ఉన్నది. భగవాన్ బాబావారితో ఆమెకు గల హృదయ సంబంధమును (Hotline) ఈ మాటలు గుర్తుకు తెస్తాయి.

స్వామి తన మాట నిలుపుకున్నారు. ఆమెకు ఎప్పుడు ఏ అవసరం వచ్చినా స్వామి వెంటనే స్పందించారు. అనంతపురం కళాశాల ప్రిన్సిపాలుగా పని చేస్తున్న తొలి సంవత్సరాలలో ప్రొఫెసర్ అణిమ రక్తమునకు సంబంధించిన ఏదో అనారోగ్య సమస్యతో బాధపడుతూండేవారు. డాక్టర్లకుకూడా ఆమె సమస్య ఏమిటో అంతుబట్టలేదు. చివరకు, ఆమె శస్త్రచికిత్స చేయించుకోవాలని డాక్టర్లు అభిప్రాయపడ్డారు. కాని, ఆ శస్త్రచికిత్స విజయవంతమవుతుందనే నమ్మకం వారికే లేదు. ఆ పరిస్థితులలో భగవాన్ బాబా ఆమెను పిలిచి "ఆరు నెలల వరకు నీవు ఎటువంటి శస్త్రచికిత్స మాట తలపెట్టకు" అని చెప్పి ఆమెను బెంగుళూరులోని ఒక డాక్టరు వద్దకు పంపించారు. ఆ డాక్టరు ఆమెకు అత్యవసరంగా రక్తం ఎక్కించాలని చెప్పాడు. అలా కొన్ని వారాలపాటు ప్రతివారం బెంగుళూరు వచ్చి రక్తం ఎక్కించుకున్నాకకూడా ఆమె పరిస్థితిలో మార్పులేదు. అందువలన ఆ డాక్టరుకూడా వెంటనే ఆమెకు శస్త్ర చికిత్స చెయ్యవలసిన అవసరం ఉందని చెప్పాడు. కాని, భగవాన్ బాబా అందుకు అనుమతి ఇవ్వలేదు. పైగా ప్రొఫెసర్ అణిమ యొక్క సోదరిని పిలిచి " ఆమె విషయం నేను చూచుకుంటాను. నువ్వెందుకు ఆందోళన చెందుతావు?" అని చెప్పారు. భగవాన్ బాబావారు అభయమిచ్చినట్లుగానే 6వ నెల పూర్తయ్యేసరికి

ఎవ్వరికి, చివరకు డాక్టర్లకు కూడా అంతుబట్టని ఆ వ్యాధి క్షణాలలో మటుమాయమైంది! ఆ తరువాత ఆమె ఎటువంటి మందులు కూడా తీసుకోవలసిన అవసరం లేకపోయింది.

ప్రొఫెసర్ అణిమా ముఖర్జీ 1975 సంవత్సరం వరకు, అంటే ఆరు సంవత్సరాల పాటు అనంతపురం కాలేజీ ప్రిన్సిపాలుగా పని చేశారు. ఆ తరువాత భగవాన్ బాబా వారు ఆమెను రాజస్థాన్‌లోని జైపూర్‌లో మరొక స్త్రీల కళాశాలను నెలకొల్పడానికి పంపించారు. అనంతపురం కాలేజీకి ప్రిన్సిపాలుగా పని చేసిన సమయంలో ప్రొఫెసర్ అణిమకు భగవాన్ బాబావారు అడుగడుగనా మార్గదర్శిగా ఉంటూ తమ నూతన విద్యావిధానమును అమలుపరచే కృషిలో ఆమెకు అండగా నిలిచారు. దానితో బాటే అవసరమనుకున్నప్పుడు ఆమెను మందలించి దారిలో పెట్టేందుకు కూడా స్వామి సందేహించ లేదు. స్త్రీ విద్య గురించి తన ఆశయాలు, ఆకాంక్షలను వివరిస్తూ భగవాన్ ప్రిన్సిపాలుకు, టీచర్లకు ఉత్తరాలు వ్రాశారు. అంతేకాకుండా తరుచు కేంపస్‌కు వెళ్ళి ఉన్నతమైన ఆధ్యాత్మిక తరంగాలతో అక్కడి వాతావరణాన్ని ఉత్తేజపరుస్తూండేవారు. ఆ కాలేజీ పనితీరుపై భగవాన్ బాబా వారి ప్రభావం పూర్తిగా ఉండి స్త్రీలకు ఉన్నత విద్య విషయంలో ఒక నూతన ఒరవడిని ప్రవేశపెట్టింది. అప్పట్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నరు అయిన శ్రీ కె.బి.దేశాయ్ 1973వ సంవత్సరంలో జరిగిన ఆ కాలేజీ నాలుగవ వార్షికోత్సవమునకు ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఆ వార్షికోత్సవ సభలో మాట్లాడుతూ ఆయన " భారతదేశ భవితవ్యమునకు ప్రణాళికలు రచించే విద్యావేత్తలను శ్రీసత్యసాయి కాలేజీకి వచ్చి పాఠాలు నేర్చుకోవలసిందిగా నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఇక్కడ వారు నేర్చుకునే పాఠాలు వారి ప్రణాళికా రచనకు ఎంతగానో ఉపయోగపడతాయని నా విశ్వాసం. విద్యారంగములో సంస్కరణలను చేపట్టి విద్యకు పూర్వోన్నత్యమును తెచ్చే కృషిలో ఈ విద్యాసంస్థ నిర్దుష్టమైన ప్రగతిని సాధిస్తున్నది. ఇక్కడ జరుగుతున్న కృషి అద్వితీయమైనది, ఇతర విద్యాసంస్థలకు ఆదర్శప్రాయమైనది," అని ఉద్ఘాటించారు.


ఈ అధ్యాయం వ్రాస్తున్న తరుణంలో ఎనభై వసంతాలు చూచిన ప్రొఫెసర్ అణిమా ముఖర్జీ ఈ విధంగా తెలియజేస్తున్నారు.

" శ్రీసత్యసాయి విద్యా ఉద్యమంలో రెండు దశాబ్దాలకు పైగా సేవలు అందించగలిగిన నేను ఎంతో అదృష్టవంతురాలనని భావిస్తున్నాను. ఈ సుదీర్ఘ సాన్నిహిత్యంలో భగవాన్ బాబావారు తమ నిజతత్వమును అప్పుడప్పుడు లీలామాత్రంగా నాకు గోచరింపజేశారు. అది కూడా మెట్టుమెట్టుగా నేనా అర్హతను సంపాదించుకున్న తరువాతనే! భగవాన్ బాబావారిని కేవలం దేహధారిగా భావిస్తూ భౌతికమైన ఆయన సాన్నిహిత్యమును మాత్రమే కోరుకోవడం సరియైనది కాదని ఇప్పుడు నేను తెలుసుకోగలిగాను. భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి రూపములో దివ్యత్వము అనే పదము అర్థవంతమైనది. అవతార పురుషుడు సాకార రూపుడై ప్రత్యక్షంగా మన మధ్య నిలిచారు. నా హృదయమందిరములో ఆ అవతార పురుషుని నేను ప్రత్యక్షంగా దర్శించుకోగలుగుతున్నాను. తద్వారా నా జీవితము సార్థకమైందనే పరిపూర్ణ తృప్తి నాకు కలుగుతున్నది".

1972వ సంవత్సరము జూలై నెల 7వ తేదీ డా॥జయలక్ష్మీ గోపీనాథ్ జీవితంలో మరుపురాని సుదినం. అందుకు కారణం, కేవలం ఆరోజున ఆమె అనంతపురంలోని శ్రీసత్యసాయి మహిళా కళాశాలలో అధ్యాపకురాలిగా సెలెక్టయిందని మాత్రమే కాదు; భగవాన్ బాబావారు ఆమెను పిలిచి "జయమ్మా! నువ్వు సెలెక్టయ్యావు. పిల్లల్ని బాగా చూసుకో" అని చెప్పినందుకు కూడా కాదు. అయితే, ఆ వార్త స్వయంగా భగవాన్ బాబావారి నోటి నుండి విన్నప్పుడు ఆమె ఆనందంతో పొంగిపోయిన మాట మాత్రం నిజం. కాని, ఆరోజు మధ్యాహ్నం భగవాన్ బాబావారు అనంతపురంనుండి వెళ్ళిపోయినతరువాత జరిగిన సంఘటన ఆమెను అతీతమైన, ఉన్నతమైన లోకాలలో విహరింపజేసింది.

ఆ రోజు మధ్యాహ్నం జయలక్ష్మి తన సహ ఉపాధ్యాయినులతో కలిసి స్టాఫ్ రూంలో కూర్చుని ఉండగా, వైస్ ప్రిన్సిపాల్ డా॥ హేమలత అక్కడికి వచ్చారు. ఆమె జయలక్ష్మిని ఆమె అదృష్టానికి అభినందిస్తూ "నువ్వు కిందటి

సంవత్సరమే ఈ కాలేజీలో అధ్యాపకురాలిగా ఎందుకు చేరలేదు?" అని ప్రశ్నించారు. తాను ఏ మాత్రం ఉహించని ఈ ప్రశ్నకు జయలక్ష్మి అవాక్కయి సమాధానం చెప్పకుండా ఉండిపోయింది. అయితే డా॥ హేమలత సంభాషణను పొడిగిస్తూ "క్రిందటి సంవత్సరం సెలెక్షన్ కమిటీ మీటింగు జరిగే రోజున భగవాన్ బాబా 'జయలక్ష్మి ఇంగ్లీషు టీచరు పోస్టుకు అప్లికేషను పంపించిందా?' అని నన్ను అడిగారు. "అభ్యర్థుల జాబితాలో అటువంటి పేరేదీ లేదని నేనే సమాధానం చెప్పాను," అని చెప్పారు. ఈ విషయాన్ని విని జయలక్ష్మి కుతూహలం అణచుకోలేక "బాబా నా పేరు చెప్పారా?" అని డా॥ హేమలతను అడిగింది. అందుకు సమాధానంగా "అవును; నీ పేరే కాదు, నీగతమంతా చెప్పారు" అని డా॥ హేమలత చెప్పారు. జయలక్ష్మి తిరిగి "ఏమని చెప్పారు?" అని ప్రశ్నించింది. "రాజమండ్రిలో కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థకు డైరెక్టరుగా పని చేస్తున్న నీ భర్త డా॥గోపీనాథ్ కొన్ని నెలల క్రిందటే చనిపోయారని, నువ్వు ఆ దుఃఖంతో క్రుంగిపోయావని బాబా చెప్పారు. అంతేకాదు, నువ్వు ఇక్కడికి వచ్చి ఈ కాలేజీలో సేవ చెయ్యాలని భగవాన్ వాంఛిస్తున్నారు," అని కూడా డా॥ హేమలత చెప్పింది. ఈ విషయం విన్న జయలక్ష్మికి స్మృతి తప్పినంత పనై ఎలాగో అలాగ మాట కూడ దీసుకుని "కాని, నా భర్త క్రిందటి జూలై నెలలో చాలా ఆరోగ్యంగానే ఉన్నారే! ఆయన ఈ సంవత్సరం ఫిబ్రవరి నెలలోనే పోయారు", అని తడబడుతూ చెప్పింది. ఆ తరువాత కొంతసేపు నిశ్శబ్దం రాజ్యమేలింది. ఇంతలో ఆ సంభాషణ వింటున్న ఒక అధ్యాపకురాలు లేచి " ఏడు నెలల తరువాత జరగబోయే సంఘటనను గురించి బాబా ఎలా చెప్పగలరు?" అని అమాయకంగా ప్రశ్నించింది. ఆసరికి జయలక్ష్మి పూర్తిగా తేరుకుని తన స్వానుభవం ఆధారంగా భగవాన్ బాబావారియందు ఏర్పరచుకున్న పరిపూర్ణ విశ్వాసంతో "ఆయనకు సర్వము తెలుసు; ఆయనే మన జీవితాలను నడిపించే డైరెక్టరు. ఆయనకు జీవులందరి భూత భవిష్యద్వర్తమానాలు తెలుసు", అని ఆ ప్రశ్నకు సమాధానం చెప్పింది.




"పూర్ణావతారి భగవాన్ శ్రీసత్యసాయిబాబా"

ఆమె మాటలలోని అంతరార్థము అక్కడున్న ప్రతి ఒక్కరికి అవగతమై అక్కడి వాతావరణమంతా గంభీరమైన నిశ్శబ్దంతో నిండిపోయింది. అప్పటి వరకు తాను గడిపిన జీవితమంతా ఆ రోజున భగవాన్ బాబావారిచే తనకు అప్పగించబడే బరువు, బాధ్యతలకు సన్నాహమేనని ఈ పాటికి జయలక్ష్మికి అర్థమైపోయింది. ఇక నుంచి ఈ పవిత్ర బాధ్యతను నెరవేర్చడమే తన జీవిత లక్ష్యము! అనాటినుండి మూడు దశాబ్దాలకు పైగా డా॥ జయలక్ష్మీ గోపీనాథ్ అనంతపురం కాలేజీలో ఇంగ్లీషు హెడ్ ఆఫ్ ది డిపార్టుమెంటుగా, హాస్టల్ వార్డెన్‌గా సేవలందిస్తున్నారు. దానితోబాటు కొద్ది సంవత్సరాలపాటు కళాశాల ప్రిన్సిపాలుగాకూడా పని చేశారు.

ఇక, ఆమె గతానికి వస్తే జయలక్ష్మి బెంగుళూరులోని దైవభక్తి గల ఒక సంపన్న కుటుంబములో జన్మించారు. శ్రీ కేశవ విఠల్ మరియు శ్రీమతి సరోజమ్మ దంపతులకు గల ముగ్గురు కుమార్తెలలో ఆమె ఆఖరిది. భారతీయ సంస్కృతీ సంప్రదాయములను శ్రద్ధతో అనుసరించే శ్రీ కేశవ విఠల్ మానవ సంబంధ వ్యవహారాలలో చాలా ఉదారంగా వ్యవహరించేవారు. జయలక్ష్మి తల్లి మంచి కళాభినివేశముగల కుటుంబమునకు చెందిన వ్యక్తి. సంగీతము వారి రక్తంలో ఉంది. జయలక్ష్మి చిన్నప్పుడే తన తల్లి నుండి భక్తి గీతాలు పాడడం నేర్చుకుంది. ఆ ముగ్గురు సోదరీమణులు మంచి పేరు పొందిన క్రిష్టియన్ మిషనరీ స్కూళ్ళలో విద్యాభ్యాసం చేశారు. జయలక్ష్మి మైసూరు విశ్వవిద్యాలయంనుండి తత్త్వ శాస్త్రము, సాంఘికశాస్త్రము మరియు ఆర్థిక శాస్త్రములలో డిగ్రీ పరీక్ష ప్యాసయి గోల్డ్ మెడల్ కూడా సంపాదించారు. మద్రాసులోని ప్రెసిడెన్సీ కాలేజినుండి ఆంగ్ల భాష మరియు సాహిత్యములో ఎమ్.ఏ. పరీక్ష ప్యాసయ్యారు. అంతే కాకుండా ఆ పరీక్ష ప్యాసైన విద్యార్థినులందరిలో అగ్రశ్రేణిలో నిలిచారు.

1948వ సంవత్సరములో శ్రీ కేశవ్ విఠల్ పదవీ విరమణ చేసి బెంగుళూరులో స్థిరపడ్డారు. అప్పటికి ఆయన పెద్ద కుమార్తెలిద్దరికి వివాహాలు అయిపోయాయి. ఒక రోజు ఉదయం ఆయన బెంగుళూరులోని లాల్‌బాగ్



"క్రీడోత్సవము ముగింపు సందర్భముగా భగవాన్ చేతుల
మీదుగా బహుమతిని అందుకుంటున్న
డా॥ జయలక్ష్మీ గోపీనాథ్ మరియు డా॥ హేమలత"



"అనంతపురం మహిళా కళాశాల నాదస్వర బృందం"

గార్డెన్స్‌లో వాహ్యాళికి వెళ్ళినపుడు ఒక అపరిచిత వ్యక్తి ఆయనకు 22 ఏళ్ళ యువకుడైన శ్రీసత్యసాయి బాబా గురించి చెప్పారు. ఆయన వెంటనే తన భార్య మరియు చిన్న కుమార్తెతో కలిసి ఆ సమయంలో బాబా ఉంటున్న కాఫీ తోటల యజమాని శ్రీమతి సాకమ్మ ఇంటికి వెళ్ళి ఆయన దర్శనం చేసుకున్నారు. ఆ ప్రథమ దర్శనంలోనే ఆ కుటుంబానికి భగవాన్ శ్రీసత్యసాయిబాబావారితో శాశ్వతమైన బంధము ఏర్పడింది. భగవాన్ బాబావారు బెంగుళూరులో ఉన్నంత కాలము ఆ కుటుంబము ప్రతి రోజూ శ్రీమతి సాకమ్మ ఇంటికి వెళ్ళి ఆయన దర్శనం చేసుకుంటూండేవారు. ఒక్కొక్కప్పుడు భగవాన్ కొందరు భక్తులతో కలిసి లాల్‌బాగ్ వెళ్ళినపుడు వారుకూడా ఆయన వెంట వెళ్ళేవారు. వందల ఎకరాల మేర విస్తరించియున్న ఆ తోటలో వాళ్ళు ప్రకృతి మాత ఒడిలో జనం అంతగా లేని ఒక మూల కూర్చుని భగవాన్ బాబావారి దివ్యదర్శనం చేసుకుంటూ అలౌకికమైన ఆనందము ననుభవించేవారు. ఆ ప్రశాంత వాతావరణంలో ఒక రోజున భగవాన్ బాబా మొట్టమొదటిసారిగా జయలక్ష్మిని ఒక పాట పాడుమని కోరారు. ఆ సందర్భంలో ఆమెకు విశ్వకవి రబీంద్రనాథ్ టాగూర్‌యొక్క సుప్రసిద్ధ కవిత " గీతాంజలి" లోని ఈ క్రింది పంక్తులు జ్ఞాపకం వచ్చాయి.

" When Thou Commandest me to sing
It seems my heart would break with pride;
And I Look to thy face,
And tears come to my eyes."

దీని భావం

"నీవు నన్ను పాట పాడమని ఆజ్ఞాపించగానే
నా హృదయం గర్వంతో పొంగి పొరలి బ్రద్దలయ్యేలా ఉంది
ఆ తరుణంలో నీ ముఖం వైపు చూడగానే
నా కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి."

ఆమె తన భావోద్రేకమును అణచుకుంటూ తన ప్రియతమ ప్రభువు కోరిక ననుసరించి హృదయపూర్వకంగా ఒక భక్తి గీతము పాడింది. ఆ తరువాత ఆమె లాల్‌బాగ్‌లో భగవాన్ సన్నిధిలో క్రమం తప్పకుండా ప్రతిరోజూ

మీరాభజనలు, పురందరదాసు మరియు కనకదాసుల కృతులు గానం చేయడం మొదలుపెట్టింది.

భగవాన్ బాబావారు బెంగుళూరునుండి పుట్టపర్తి తిరిగి వెళ్ళిపోయిన తరువాత వాళ్ళు ముగ్గురూ ఆ మారుమూల గ్రామానికి తరుచు వెళ్ళడం ప్రారంభించారు. అప్పట్లో పుట్టపర్తిలో పరిస్థితి, కనీస సౌకర్యాలు కూడా లేని రాతియుగంనాటి పరిస్థితికి దగ్గరగా ఉండేది (A Stone's throw, away from the Stone age). అయితే, వాళ్ళు మాత్రం అసౌకర్యములను, ప్రయాణంలోను తరువాత పుట్టపర్తిలోను కలిగే ఇబ్బందులను వేటిని పట్టించుకునేవారు కాదు. తమ ప్రభువైన భగవాన్ శ్రీసత్యసాయిబాబావారితో కలిసి యుండేటప్పుడు కలిగే సంతోషము, ఆయన దివ్య దర్శనంవలన కలిగే అవధులులేని ఆనందము ఆ అసౌకర్యములన్నిటిని పూర్తిగా మరపింపజేసేవి. అంతులేని ఆనందముతో పూర్తిగా పరవశులను చేసే ఆ రోజులు శాశ్వతంగా గతంలోకి వెళ్ళిపోయాయి. అయితే ఆ మధుర క్షణాలుమాత్రం ఇప్పటికి వారి స్మృతిపథంలో మెదులుతూనే ఉన్నాయి. 'పాత మందిరం' లోను, ఆ పరిసర ప్రాంతాలలోను, చిత్రావతీ సైకత తీరములోను ఆనాడు సాయి ప్రభువు సన్నిధిలో పొందిన దివ్యానుభూతులు ఎన్నో, ఎన్నెన్నో! వాటిలో రెండింటిని జయలక్ష్మి ఇలా వివరిస్తున్నారు :

"ఇది చాలా సంవత్సరాల క్రిందట 1948వ సంవత్సరంలో జరిగిన సంఘటన. నేను నా తల్లిదండ్రులతో కలిసి అప్పుడు పుట్టపర్తి వెళ్ళాను. అలనాటి 'పాత మందిరం' ఎటువంటి సౌకర్యములు లేని నిరాడంబరమైన కట్టడం. అందులో చాలా కొద్దిమంది భక్తులకు మాత్రమే వసతి ఉండేది. ఆ సమయంలో నేను, మా అమ్మ, బెంగుళూరునుండి వచ్చిన ఒక యువతి, ఒక వృద్ధ వితంతు స్త్రీ – మొత్తం నలుగురం కలిసి ముందున్న హాలులో పడుకునే వాళ్ళం. ఆ హాలుకు ఒక చివరగా పూజావేదిక ఉండేది. ఎత్తైన ఆ పూజావేదికపై వెండితో చేసిన ఆదిశేషుని చుట్టలు చుట్టుకున్న పీఠము దానిపై శ్రీషిరిడీసాయి వెండి విగ్రహము అమర్చబడియుండేది. ఆ విగ్రహమునకు ఇరువైపులా

శ్రీషిర్డిసాయిబాబా మరియు శ్రీసత్యసాయిబాబాల నిలువెత్తు తైలవర్ణ చిత్రాలు అమర్చబడియుండేవి. ఆ వేదికపై ఇరువైపులా రెండు పెద్ద పెద్ద ఇత్తడితో చేసిన దీపపు సెమ్మెలు నిలబెట్టబడియుండేవి. వాటిలో రాత్రింబగళ్ళు దీపాలు వెలిగేవి. ఇద్దరు బాబాల తైలవర్ణ చిత్రములు మరియు షిర్డీసాయిబాబా వెండి విగ్రహములను ఎన్నో పూలదండలతో అలంకరించేవారు. వీటన్నింటితో ఆ వేదిక చుట్టూ ఒక పవిత్రమైన దివ్య కాంతిమండలం అమరియుండేది.

అప్పటికి మా అమ్మ, ఆ వృద్ధ వితంతు స్త్రీ ఇద్దరూ పడుకుండిపోయారు. నేను, ఆ యువతి మాత్రం రాత్రి ప్రొద్దు పోయేదాకా స్వామిని గురించి, ఆయన బోధలను గురించి మాట్లాడుకుంటూ ఉండిపోయాము. సుమారు అర్ధరాత్రి అయ్యేటప్పటికి మేమిద్దరం లేచి హాలుయొక్క గ్రిల్ అమర్చబడిన గేటు వద్దకు నడిచి వెళ్ళాము. ఆ రోజుల్లో పుట్టపర్తిలో విద్యుద్దీపాలు ఉండేవి కావు. అది కృష్ణపక్షం కావడం చేత బయట అంతా చీకటిగా ఉంది. కాని అక్కడ హఠాత్తుగా వెలుగు కనబడడంతో మేము ఆశ్చర్యపోయాము. మేము గేటుదాటి బయటకు వెళ్ళేటప్పటికి మందిరం చుట్టూ పరిసరాలే కాక మొత్తం గ్రామం అంతా దేదీప్యమానమైన ఒక దివ్య కాంతిలో మునిగిపోయిందా అనిపించింది. ఆ అద్భుత దృశ్యము చూచి మా కళ్ళను మేమే నమ్మలేక పోయాము. అంతే కాదు, పుట్టపర్తి గ్రామంచుట్టూ ఉన్న కొండలన్నీ జాజ్వల్యమానమైన కాంతితో కళ్ళు మిరుమిట్లు గొలుపుతున్నాయి. ఆ దివ్యకాంతి ఇంచుమించుగా మమ్మల్ని అంధులను చేసివేసింది. ఆ కొండలచుట్టూ ఆవరించియున్న అద్భుతమైన దివ్య కాంతివలయం మొత్తం పుట్టపర్తి గ్రామాన్నే వెలుగుతో నింపివేసింది.

మరునాడు ఉదయం భగవాన్ బాబావారు నన్ను పిలిచి "ఏమి సమాచారం?" అని అడిగేటప్పటికి నాకు నోట మాట రాలేదు. కొంతసేపయిన తరువాత తేరుకుని అంతక్రితం రాత్రి మేము చూసిన అద్భుత దృశ్యమును గురించి ఆయనకు వివరించాను. అప్పుడు బాబా చిరునవ్వు నవ్వుతూ "ప్రజలు గుర్తించినా, గుర్తించకపోయినా ఆ కొండలచుట్టూ ఆ దేదీప్యమానమైన కాంతి ఎల్లప్పుడూ ఉన్నది. అది దిగ్బంధనము, అంటే సమస్తమైన దుష్టశక్తులు మరియు

దుష్ప్రభావములను నివారించి ఈ పుణ్య స్థలంలో ప్రవేశించకుండా చేసే పవిత్రమైన కాంతి", అని ఉద్ఘాటించారు. మానవుని అవగాహనకు అతీతమైన అనేక అద్భుతాలు ఉన్నమాట పూర్తిగా నిజం.

ఇక, రెండవ లీల భగవాన్ బాబావారి దివ్య సన్నిధిలోనే జరిగింది. ఒకసారి మేము పుట్టపర్తి వచ్చి కారు దిగేటప్పటికి భగవాన్ బాబావారు తమ అలవాటు ప్రకారం చిరునవ్వు నవ్వుతూ మాకు స్వాగతం పలుకడానికి మందిరం వెలుపల నిల్చుని ఉన్నారు. మేము మందిరంలోనికి వెళ్ళగానే భగవాన్ నావైపు చూసి "జయమ్మా! పాటలు పాడు", అని అడిగారు. భగవాన్ సన్నిధిలో పాటలు పాడాలంటే నాకెప్పుడూ భయమే! అయితే, ఇప్పుడు ఈ విధంగా అడుగుతారని నేను బొత్తిగా ఊహించలేదు. ఏమైతేనేం నేను కొంచెం ధైర్యం తెచ్చుకుని మొదట ఒక మీరా భజన పాడాను. ఆ పాట స్వామికి చాలా నచ్చింది. నేనా పాట పాడుతూండగా చాలా ఆశ్చర్యకరంగా శ్రీ షిర్డీసాయిబాబా పటానికి వేసిన పూలదండ నెమ్మదిగా ఇటు, అటు ఊగడం మొదలుపెట్టింది. క్రమంగా పాట వేగం పుంజుకోగానే బాబా నిలువెత్తు చిత్రపటానికి వేసిన ఆ పెద్ద దండకూడా చాలా వేగంగా ఊగుతూ చివరకు పాట పూర్తయ్యేటప్పటికి తెగి క్రింద పడిపోయింది! అప్పుడు బాబా నావైపు చాలా ఆనందంగా చూచి కరుణాపూరితమైన చిరునవ్వు నవ్వుతూ మరొక పాట పాడుమని ఆదేశించారు. ఈ మారు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి పటానికి వేసిన దండలు అదేవిధంగా ఊగుతూ పాట పూర్తయ్యేసరికి తెగి క్రిందపడిపోయాయి. స్వామి మళ్ళీ ఇంకొకసారి పాట పాడుమని ఆజ్ఞాపించారు. అద్భుతమైన స్వామి లీలకు ఆనందంతో పొంగిపోతూ నేను నా హృదయంలోని ఆర్తినంతా స్వామికి నివేదించుకుంటూ మరొక పాట పాడాను. ఆ సారి నేను పాడుతూండగా శ్రీ షిర్డీసాయిబాబావారి విగ్రహమునకు వేసిన దండలన్నీ ఒక దాని తరువాత ఒకటి చాలా అందంగా జారిపడిపోయాయి. నా పాట పూర్తయ్యేసరికి, మొత్తం పూలదండలన్నీ పూజా వేదికపై ఒకదానిపై ఒకటి గుట్టలా పడిపోయాయి. నేను ఆనందంతో ఉబ్బితబ్బిబ్బయ్యాను. అప్పుడు భగవాన్ బాబా నా తండ్రివైపు,

నావైపు మార్చి మార్చి చూస్తూ 'చూశారా?' అని వ్యాఖ్యానించారు. భగవాన్ బాబావారి అర్థవంతమైన ఆ ఒక్క చల్లని మాటతో మా ప్రయాణబడలిక అంతా తీరిపోయింది!" ఆ రోజుల్లో జరిగిన అటువంటి అద్భుతలీలలతో ఏకంగా మరొక గ్రంథమే వ్రాయవచ్చు.

జయలక్ష్మికి 1953వ సంవత్సరం సెప్టెంబరు నెలలో డా॥ గోపీనాథ్‌తో వివాహమైంది. డా॥ గోపీనాథ్ అప్పట్లో రాజమండ్రిలోని కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థకు డైరక్టరుగా పనిచేస్తూండేవారు. అందువలన వివాహమైన తరువాత ఆ దంపతులు రాజమండ్రిలో కాపురం పెట్టారు. భగవాన్ రాజమండ్రి వెళ్ళినప్పుడల్లా గోపీనాథ్ దంపతుల ఇంటికి వెడుతూండేవారు. "భగవాన్ బాబావారి మాటలలోని అర్థమేమిటో నాకు తెలియడం లేదు. కాని, జయ తాను నెలకొల్పబోయే అనంతపురం మహిళా కళాశాలలో సేవ చెయ్యాలని స్వామి ఎప్పుడూ నాతో అంటూంటారు", అని శ్రీ కేశవ్ విఠల్ తరుచు తన అల్లుడు గోపీనాథ్‌కు ఉత్తరాలు వ్రాస్తూండేవారు. ఈ విషయం స్వామి అనంతపురంలో కాలేజీ నెలకొల్పడానికి చాలా సంవత్సరాల ముందే జరిగింది! 1964వ సంవత్సరంలో భగవాన్ బాబా రాజమండ్రిలోని డా॥ గోపీనాథ్ ఇంటికి వెళ్ళినపుడు "స్వామీ! మీకెప్పుడు కావలిస్తే అప్పుడు జయను మీ కాలేజీలో పనిచేయడానికి తీసికొని వెళ్ళండి" అని ఆయన స్వామికి విన్నవించుకున్నాడు. అయితే అప్పట్లో బాబా "నేను ఇక్కడి నుంచి జయను తీసికొని వెళ్ళిపోతే నిన్ను ఎవరు చూచుకుంటారు?" అని ప్రశ్నించారు. తరువాత 1971వ సంవత్సరం అక్టోబరు నెల వరకు ఈ విషయం అందరూ మరచిపోయారు.

1964వ సంవత్సరంలో జయలక్ష్మి తల్లి చనిపోయిన తరువాత, తండ్రి శ్రీ కేశవ్ విఠల్ భగవాన్ బాబావారి ఆజ్ఞననుసరించి బృందావనంలో స్థిరపడ్డారు. ఒక రోజున తనతో ఉంటున్న తన కుమార్తెతో శ్రీ కేశవ్ విఠల్ చాలా విచారంగా సుమారు 15 సంవత్సరాల క్రితం భగవాన్ బాబావారు తనకు ప్రసాదించిన బాబా రూపము ముద్రింపబడిన వెండి పతకము కనపడటం లేదని, దానిని

తాను ఎక్కడో పెట్టి మరచిపోయానని చెప్పారు. ఆయన ఆ వెండి పతకమునకు ప్రతిరోజూ ఉదయం అభిషేకం చేసేవారు. ఆ రోజు సాయంత్రమే శ్రీ కేశవ్ విఠల్ మళ్ళీ జయలక్ష్మివద్దకు వచ్చి చాలా సంతోషంగా "జయా! స్వామి కరుణామయులు. ఈ రోజు ఉదయం నిన్ను కలిసిన తర్వాత నేను మళ్ళీ ఆ పతకంకొరకు వెతకడం మొదలుపెట్టాను. ఇంతలో ఎవరివో అడుగులచప్పుడు వినపడగానే నేను తల ఎత్తి పైకి చూచేటప్పటికి స్వామి నా యెదుట నిలబడి ఉన్నారు. 'నీవు దేని కొరకు వెతుకుతున్నావో నాకు తెలుసు. ఈ రోజు తెల్లవారుఝామున సరోజమ్మ నా దగ్గరకు వచ్చి అన్ని విషయాలు చెప్పింది. నేను నీకిచ్చిన వెండి పతకమును నీవు పోగొట్టుకున్నావు. ప్రతి రోజూ ఉదయం ఆ పతకములోని బాబా మూర్తికి అభిషేకము చేసి ఆ పవిత్ర జలమును త్రాగకపోతే నీ ఆరోగ్యం పాడవుతుందని ఆమె చాలా ఆందోళన పడిపోయింది. దానిని వెంటనే తిరిగి తెప్పించమని ఆమె నన్ను వేడుకుంది. విఠల్‌రావ్! విచారించకు. నీ భార్య సదా నిన్ను కనిపెట్టుకుని ఉండి దేవతవలె నిన్ను రక్షిస్తూంటుంది. ఆమె ఎల్లప్పుడు నీ వెంటనే ఉండి నీ క్షేమ సమాచారములు కనుక్కుంటూ ఉంటుంది', అని నాతో చెప్పారు. ఇక ఆ వెండి పతకము విషయానికి వస్తే తాను పండరీపురం వెళ్ళి వచ్చిన తరువాత కొద్ది రోజులలోనే దానిని తెప్పించి యిస్తానని చెప్పారు", అని వెల్లడించారు.

ఈ వృత్తాంతమును విన్న జయలక్ష్మి కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. ప్రేమమూర్తి అయిన తల్లి మరియు ప్రియతమ ప్రభువు సాయి పట్ల ఆమె హృదయంలో కృతజ్ఞతాభావము నెలకొన్నది. తన తండ్రి మళ్ళీ సంతోషంగా ఉండడం చూచి ఆమె ఆనందించింది. భగవాన్ బాబావారితో కలసి ఆ తండ్రీ కూతుళ్ళిద్దరూ ఆనందంగా పండరీయాత్ర చేసి వచ్చిన తరువాత స్వామి వాళ్ళిద్దరిని ఇంటర్వ్యూకు పిలిచారు. ఆ ఇంటర్వ్యూలో స్వామి శ్రీ కేశవ్ విఠల్‌తో "విఠల్‌రావ్! స్వామి ఎల్లప్పుడూ తన మాట నిలబెట్టుకుంటారు. నీకు ఆ వెండి పతకము తిరిగి యిచ్చేలోపుగా నీ భార్య సరోజమ్మ నాతో ఏమి చెప్పిందో నీకు చెపుతాను. ఆమె 'స్వామీ! ఆ వెండి పతకము ఒక్కటేగాక, నా భర్త ఆ పతకములో

చెక్కబడిన మీ రూపునకు పూజచేసి సమర్పించిన రెండు ఎండిపోయిన మల్లెపూలు కూడా ఉన్నాయి. ఇంకా, మీరు మీ చేతితో స్పృశించి ఆశీర్వదించిన ఒక అణాకాసు కూడా ఉన్నది', అని చెప్పింది. ఇప్పుడు నేను ఆ వెండి భరిణెను అందులో ఉండే వస్తువులతో సహా సృష్టించి నీకు యిస్తాను", అని చెప్పారు. అలా చెపుతూ ఆ తండ్రీ కూతుళ్ళు ఇద్దరూ ఊపిరి బిగబట్టి చూస్తూండగా స్వామి తన కుడిచేతిని మూడుమార్లు గుండ్రంగా త్రిప్పారు. వెంటనే ఆయన అరచేతిలో ఆ వెండి భరిణె ప్రత్యక్షమైంది. అప్పుడు బాబా ఆ భరిణె మూత తీసి అందులో ఉన్న వెండిపతకము, రెండు ఎండిన మల్లెపూలు మరియు ఒక అణా కాసును వారికి చూపించారు! ఆ భరిణెను దానిలో ఉండే వస్తువులతోబాటు శ్రీ కేశవ్ విఠల్‌కు ఇస్తూ "ఇకపై అజాగ్రత్తగా ఉండకు; దీనిని భద్రంగా దాచుకో! నీ ఆరోగ్యం గురించి సరోజమ్మ చాలా ఆందోళన చెందుతోంది", అని చెప్పారు. శ్రీ కేశవ్ విఠల్, ఆయన కుమార్తె జయమ్మ ఆనందము, కృతజ్ఞత మిళితమైన అశ్రువులతో తమ శాశ్వత రక్షకుడైన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి పాదాలపై వ్రాలారు. ఆ తరువాత శ్రీ కేశవ్ విఠల్ బృందావనానికి తిరిగి వచ్చి స్వామి సేవలో స్థిరపడ్డారు. జయలక్ష్మి, రాజమండ్రిలో తన భర్తవద్దకు తిరిగి వెళ్ళిపోయింది.

సంవత్సరాలు వేగంగా దొర్లిపోయాయి. 1971వ సంవత్సరములో డా॥ గోపీనాథ్ మూడు సంవత్సరాలపాటు విదేశాలలో ఉద్యోగం చేసే నిమిత్తమై ఇరాన్ దేశమునకు వెళ్ళాలని సన్నాహాలు మొదలుపెట్టారు. తాను విదేశాలలో ఉండే సమయంలో తన భార్య జయలక్ష్మి ఎక్కడ ఉండాలి అనే విషయమును గురించి ఆయన భగవాన్ బాబావారిని అడుగుదామనుకున్నారు. అందుకొరకు ఆయన బృందావనం వెళ్ళి తన సందేహమును స్వామికి నివేదించుకోగా, స్వామి ఆయన చేయి పట్టుకుని ఒక మూలకు తీసుకుని వెళ్ళి అక్కడ ఒక బల్లపై నిలుపబడిన, త్వరలో తాను నెలకొల్పబోయే అనంతపురం మహిళా కళాశాలయొక్క నమూనాను చూపిస్తూ "నువ్వేమీ ఆందోళన చెందకు. నువ్వు విదేశాలకు వెళ్ళినపుడు జయమ్మ ఈ కాలేజీలో ఉంటుంది. ఈ కళాశాల

ప్రాంగణంలో వాచ్‌మెన్లు తప్పించి మగవాళ్ళెవరూ ఉండరు", అని భరోసా యిచ్చారు. అంతే! ఒక్క క్షణంలో డా॥ గోపీనాథ్‌యొక్క ఆందోళన అంతా మటుమాయమైంది.

అయితే, గోపీనాథ్‌యొక్క ఇరాన్ ప్రయాణం కాగితాలవరకే పరిమితమయ్యింది. ఆయనకు గుండె జబ్బు వచ్చి ఆరు వారాలపాటు రాజమండ్రిలోని ఒక ప్రైవేటు నర్సింగ్‌హోంలో చికిత్స పొందిన తరువాత 22-2-1972వ తేదీన మరణించారు. డా॥ గోపీనాథ్ హాస్పిటలులో చికిత్స పొందుతూండగా భగవాన్ బాబా శ్రీ కారుణ్యానందద్వారా రెండు ఉత్తరాలు పంపించారు. అందులో ఒకటి ఆయనకు, రెండవది ఆయన భార్య జయలక్ష్మికి. డా॥ గోపీనాథ్‌కు వ్రాసిన ఉత్తరంలో స్వామి ఆయనపై దివ్య ప్రేమామృతమును వర్షించారు. అంతేకాకుండా స్వామి హృదయంలో ఆయనకు స్థానమున్నదని, ఆయనను ఎట్టి చింత పెట్టుకోవద్దని సలహాయిచ్చారు. అయితే, జయలక్ష్మికి వ్రాసిన ఉత్తరంలో అసలు ఆమె భర్త అనారోగ్యమును గురించిన ప్రస్తావనే లేదు. ఆమెను ధైర్యంగా ఉండమని మాత్రం వ్రాశారు.

తన భర్త చనిపోయిన తరువాత మూడవరోజున జయలక్ష్మి బృందావనం వెళ్ళి భగవాన్ దర్శనం చేసుకున్నారు. బాబా దూరం నుండే ఆమె వైపు ఆప్యాయంగా చూచారు. స్వామి ఆమెతో మాట్లాడలేదు; కాని, శ్రీ రామబ్రహ్మంద్వారా ఆమె తన భర్త అంత్యక్రియలన్నీ సక్రమంగా పూర్తిచేసి తరువాత ఇక్కడకు రావాలని కబురుచేశారు. జయలక్ష్మి స్వామి ఆదేశానుసారం భర్త అంత్యక్రియలు పూర్తయిన తరువాత బృందావనం చేరుకుంది. అప్పుడు భగవాన్ బాబా ఆమెను పిలిచి మాట్లాడారు. ఆ రోజు ఉదయం స్వామి ఆమెతో ఎంతో దయార్ద్ర హృదయంతో మాట్లాడారు. ఆ సంభాషణ మధ్యలో ఆమె కొంచెం ధైర్యం చేసి స్వామిని "స్వామీ! నా భర్త చనిపోయిన వెంటనే నేనిక్కడికి వచ్చినపుడు నాతో మీరు ఎందుకు మాట్లాడలేదు?" అని అడిగింది. దానికి సమాధానం చెపుతూ భగవాన్ బాబా "నువ్వు ఏడుస్తూంటే నేను చూచి

తట్టుకోలేను", అని చెప్పారు. అవతారమూర్తి యొక్క హృదయం మానవుల దుఃఖమును చూచి అస్సలు ఓర్చుకోలేదు! తరువాత స్వామి జయలక్ష్మిని తన తండ్రికి టెలిగ్రాం ఇచ్చి పిలిపించమన్నారు. ఆ సమయంలో శ్రీ కేశవ్ విఠల్ తిరునల్వేలిలో తన పెద్దకుమార్తె ఇంటివద్ద ఉంటున్నారు. ఆయన ఆ టెలిగ్రాం అందుకుని బృందావనం రాగానే స్వామి ఆయనను, జయలక్ష్మిని ఇంటర్వ్యూకు పిలిచారు. ఆ ఇంటర్వ్యూలో స్వామి ఆమెను "జయమ్మా! ఇక నువ్వు ఎక్కడ ఉందామనుకుంటున్నావు?" అని ప్రశ్నించారు. వెంటనే ఆమె "నేను స్వామితోనే ఉందామనుకుంటున్నాను" అని సమాధానం చెప్పింది. స్వామి మళ్ళీ శ్రీ విఠల్‌వైపు తిరిగి "నువ్వేమంటావు, విఠల్‌రావ్!" అని అడిగారు. అప్పుడు శ్రీ కేశవ్ విఠల్ "స్వామీ! నాకిప్పటికే 83 సంవత్సరాలు నిండాయి. మీరు తప్పించి జయను సరిగా చూచుకునేవారెవరూ నాకు కనపడలేదు", అని స్వామికి నివేదించుకున్నారు. వెంటనే స్వామి వృద్ధుడైన ఆ తండ్రి చేతిని తన రెండు చేతులలోనికి తీసుకుని "విఠల్‌రావ్! చింతించకు. నేను చివరిదాకా జయమ్మ బాగోగులు చూచుకుంటాను", అని అభయమిచ్చారు.

భగవాన్ బాబావారి ఆ అభయవాక్కు జయమ్మకు కలకాలం జ్ఞాపకం ఉండిపోతుంది. స్వామి మాటలు విన్న ఆ తండ్రీ కూతుళ్ళు కృతజ్ఞతా పూర్వకమైన ఆనందాశ్రువులతో ఆయన పాదాలచెంత మ్రోకరిల్లారు. వాళ్ళు తమనుండి సెలవు తీసుకుని వెళ్ళిపోయేలోగా స్వామి మళ్ళీ "నేను జయమ్మను అనంతపురం కాలేజీకి తీసుకువెళ్తాను" అని చెప్పారు.

అదీ, డా॥ జయలక్ష్మి గోపీనాథ్ 'భగవాన్ ఎంచుకున్న అధ్యాపకురాలు' గా మారిన వైనం! భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి అవతారోద్యమానికి అంకితమైన ఆమె జీవితం, గత మూడు దశాబ్దాలలో ఆ విద్యామందిరంనుండి ఉత్తీర్ణులైన వేలాదిమంది యువతుల జీవితాలతో అల్లుకొనిపోయి ఉన్నది.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు, అనంతపురంలోని శ్రీ సత్యసాయి మహిళా కళాశాలకు రెండు దశాబ్దాలకుపైగా ప్రిన్సిపాలుగా పనిచేసిన డా॥

హేమలతకు వ్రాసిన ఉత్తరాలలో స్త్రీలను గురించి, స్త్రీ విద్య గురించి అనేక విషయాలు వెల్లడించారు. తెలుగు భాష మరియు సాహిత్యంలో డాక్టరు పట్టా పొందిన హేమలతకు ధారాళముగా ఒక ప్రవాహమువలె సాగిపోయే చక్కటి తెలుగుభాషలో వ్రాసిన ఈ ఉత్తరాలలో స్వామి స్త్రీ విద్యకు సంబంధించిన (ముఖ్యంగా భారతదేశములో) అన్ని విషయాలను గురించి తెలియజేశారు. ఆ దివ్య లేఖలనుండి కొన్ని భాగాలను ఇక్కడ ఉదాహరించడం జరుగుతున్నది :

శ్రీ సత్యసాయి మహిళా కళాశాలను నెలకొల్పుటలో గల అత్యున్నతమైన ఆదర్శ వాదమును గురించి వివరిస్తూ భగవాన్ ఒక ఉత్తరంలో "సమాజమునకు స్త్రీ పునాది వంటిది. ఆమె హృదయము సమస్త సద్గుణములకు నిలయము. సమాజములో నీతి నిజాయితీలను పెంపొందించి భారతీయ సంస్కృతీ సంప్రదాయములయొక్క ఔన్నత్యమును ప్రపంచానికి చాటి చెప్పాలనే మహోన్నతమైన ఆదర్శముతో నేను ఈ కళాశాలను స్థాపించాను. ఈ కళాశాల సమాజములోని అన్ని రంగములలోను అత్యున్నతమైన ఆదర్శములను నెలకొల్పాలనేది నా ఆకాంక్ష. ఈ కళాశాలలో పనిచేసే ఉపాధ్యాయినులు మరియు విద్యాభ్యాసము చేసే విద్యార్థినులు పరస్పర ప్రేమ, అవగాహనలతో కలసి పనిచేయాలి", అని ఉద్బోధించారు.

విద్యను గురించి భగవాన్ ఈ విధంగా ఆకాంక్షించారు :

"మేఘములు మింటిపై చేరి మెదలుచుండ
వాటి దాపున విద్యుత్తు వరలునట్లు
విద్య వెనుక జ్ఞానంబు వెలయవలయు"

"జ్ఞానఫలము నందించని విద్య, అజ్ఞానమనే దట్టమైన పొగక్రమ్ముకున్న మేఘ సముదాయమువంటిది. ఆధ్యాత్మిక జ్ఞానము, ప్రపంచ జ్ఞానము లేని కేవల పుస్తక పరిజ్ఞానము వ్యర్థమైనది.

విద్యావంతులు సత్య నిరతి, క్షమ, వినయము మరియు దయ వంటి సద్గుణములను పెంపొందించుకొనలేకపోయిన, ఎమ్.ఏ., ఎమ్.ఎస్సి., పి హెచ్.డి., వంటి డిగ్రీలు కేవలం వారికి శిరోభారమే అవుతాయి. విద్యావంతులు సంకుచిత స్వభావులైన, అది విద్యకు అధిదేవతయైన సరస్వతీదేవికే అగౌరవము, అవమానము".

అధ్యాపకులు, విద్యార్థులు, విద్యార్థినుల శీలము మరియు ప్రవర్తన విషయంలో భగవాన్‌ది రాజీలేని నిశ్చితాభిప్రాయము. ఒక సందర్భంలో ఆయన "అధ్యాపకులు తాము స్వయంగా ఆచరించి చూపని ఆదర్శములను బోధించుటకు వారికి అర్హతలేదు. అధ్యాపకులు ఉత్తమ గుణములు, విశాలభావములు కలిగియుండాలి. అందుకు భిన్నంగా వారు ద్వేషము, అసూయ, స్వార్థము, ఆడంబరము, గర్వము అనే అల్ప బుద్ధుల అదుపులో కూరుకొనిపోతే విద్యార్థుల శీలము, క్రమశిక్షణ నాశనమవుతాయి. అటువంటి అధ్యాపకులు ఎంతటి విద్యావంతులైనా, విద్యార్థులు వారిని గౌరవించని కారణంచేత, విద్యార్థులను ఏవిధంగాను అదుపులో పెట్టలేరు. ఉన్నతమైన విద్యార్హతలతోపాటు, ఈ సంస్థలోని అధ్యాపకులు దైవభక్తి, పెద్దలయందు గౌరవము, మన సంస్కృతి, సాంప్రదాయములయందు పూజ్య భావము వంటి సద్గుణములను పెంపొందించుకోవాలి", అని ఉద్ఘాటించారు.

ఇంకా స్వామి "శీలము, సత్ప్రవర్తనలను గురించి విద్యార్థులకు గంటల తరబడి విసుగు పుట్టించే ఉపన్యాసములు ఇచ్చేకంటె, ఉపాధ్యాయులు తాము బోధిస్తున్న విషయాలను తాము ఆచరించి చూపడం ద్వారా ఆదర్శము నందించాలి. వేషభాషలు, జుట్టుతీరు, నడక, సంభాషణ, నవ్వడం వంటి లౌకిక విషయాలలో కూడా అధ్యాపకులు విద్యార్థులకు ఆదర్శప్రాయంగా ఉండాలి" అని,

"స్త్రీ గృహలక్ష్మి. ఆమె సమాజంలో ఉత్తమాదర్శములను సంరక్షించే దేవత. అయితే, అటువంటి స్త్రీలే గౌరవప్రదమైన వస్త్రధారణ లేకుండా జుట్టు విరబోసుకుని తిరిగితే వాళ్ళు రాక్షసులవలె, పిశాచులవలె కనపడతారు. అటువంటి వస్త్రధారణ, తలకట్టు ఉన్నత విద్యకు చిహ్నములుగా భావిస్తే అంతకంటె మూర్ఖత్వము మరేదీ ఉండదు", అని ఉద్బోధించారు.

అనంతపురం మహిళా కళాశాలలో ప్రతి గురువారం మొట్టమొదటి పీరియడు 'నీతిబోధకు' వినియోగించాలని నిర్ణయం తీసుకున్నప్పుడు, భగవాన్ "మనం బెంగుళూరు కళాశాలలో ఇప్పటికే నీతిబోధకు తరగతులు ప్రారంభించాము. అలాగే అనంతపురంలోకూడా ప్రారంభించవచ్చు. ప్రతి గురువారం ఉదయం మొదటి పీరియడ్‌లో నిర్వహింపబడే ఈ తరగతులకు కళాశాలలోని అధ్యాపకులు, విద్యార్థులు అందరూ హాజరుకావాలి. ఆ తరగతులలో భగవద్గీత, బైబిలు, ఖురాను, మహాభారతము, భాగవతము మరియు భారతదేశములోని సాధుసత్పురుషుల జీవితములకు సంబంధించిన అంశములు చర్చించవచ్చు. మన అధ్యాపకులు కూడా భారతీయ సంస్కృతిని గురించి కొన్ని తరగతులు నిర్వహించవచ్చు. నీతిబోధకు వినియోగింపబడే తరగతులను ఎప్పుడూ ప్రార్థనతో ప్రారంభించడం మంచిది. ఈ తరగతులను మనం కాలేజీ ఆడిటోరియంలో నిర్వహించవచ్చు. అంతేకాకుండా విద్యార్థినులకు నీతిబోధ చేసే ఈ తరగతులను క్రమం తప్పకుండా నిర్వహించడానికి వాళ్ళ టైమ్‌టేబిలులో అవసరమైన మార్పులు చేయవచ్చును", అని ఒక ఉత్తరంలో వ్రాశారు.

ఇక కళాశాలలో ఎటువంటి విద్యార్థినులను చేర్చుకోవాలి అనే విషయమును గురించి భగవాన్ బాబా " మీరు కాలేజీలో విద్యార్థినుల ప్రవేశము కొరకు నిర్దేశింపబడిన పద్ధతులు మరియు మార్గదర్శక సూత్రములను అనుసరిస్తున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. విద్యార్థినుల ప్రవేశం విషయంలో మీరు ఎవరి సిఫార్సులను పరిగణనలోనికి తీసుకోవద్దు. కేవలం ప్రతిభ ఆధారంగానే వివిధ కోర్సులలో ప్రవేశం జరగాలి. అంతేకాకుండా హాస్టల్‌లో తగినంత వసతి సౌకర్యము లేని విషయాన్ని కూడా దృష్టిలో పెట్టుకోండి. నేను ఈ విషయంలో ఎటువంటి జోక్యము చేసుకోను. వివిధ కోర్సులకొరకు విద్యార్థినులను ఎంపిక చేసేందుకు నిర్దేశించబడిన అన్ని నియమ నిబంధనలను అనుసరించడానికి మీకు పూర్తి స్వేచ్ఛ ఉన్నది. ఎవరైనా కళాశాలలో ప్రవేశము కొరకు నన్ను అర్థించినప్పుడు 'ప్రిన్సిపాల్‌ను కలుసుకోండి' అని నేను నిర్మొహమాటంగా చెపుతాను", అని వేరొక ఉత్తరంలో వ్రాశారు.

ఈ కళాశాలలో వివిధ తరగతులు నిర్వహించడానికి సరిపడే విశాలమైన, అందమైన భవనాలు నిర్మించడమే గాక, అవసరమైన పరికరాలు, పుస్తకాలు, ఇతర వస్తువులు అన్నీ సమకూర్చడంలో భగవాన్ బాబావారు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఈ సందర్భంగా అతి స్వల్ప విషయాలలో కూడా ఎంతో జాగ్రత్త వహించడం స్వామి వ్రాసిన ఉత్తరాలలోని ఈ క్రింద ఉదాహరించిన భాగములో మనకు కనబడుతుంది.

" కళాశాల ఉత్సవ సమయాల్లో విద్యార్థినులు వాయించే పూర్తి బేండ్‌సెట్‌ను నేను పంపిస్తున్నాను. ఇందుకొరకు నేను నూతనమైన వాయిద్యములన్నింటిని కొనుగోలు చేసినా, ప్రస్తుతం కొద్దిగా ఉపయోగించిన వాయిద్యములనే పంపుతున్నాను. ముఖ్యంగా గాలి ఊదడం ద్వారా వాయించే వాద్యముల విషయంలో విద్యార్థినులు చాలా గట్టిగా ఊదవలసియున్నందున సరిక్రొత్త వాద్యములు వాయించడం వారికి కష్టంగా ఉంటుంది. ఈ క్రొత్త బేండ్‌సెట్‌ను నేను స్వామి జన్మదినోత్సవ సమయానికి పంపుతాను. ఈ లోపుగా అందుబాటులో ఉన్న సమయాన్ని పురస్కరించుకొని మీరు ఒక టీచరును ఈ పనికి ప్రత్యేకంగా నియోగించి వారిచే విద్యార్థినులకు రెండు, మూడు ట్యూన్లకు అనుగుణంగా మార్చింగ్ చేయడం నేర్పించండి".

" ఈ నెల పన్నెండవ తేదీన నేను మీకు పంపించిన వస్తువులు అసలు నేను పంపుదామనుకున్న వస్తువులలో కేవలం ఒక భాగము మాత్రమే! ఇంకా నేను మీ కాలేజీకి ఎన్నో వస్తువులు పంపించాల్సి ఉంది. విద్యార్థినులకొరకు 150 కుర్చీలు, ఉపాధ్యాయినులకొరకు 16 టేబుల్స్, కుర్చీలు, ఫిజిక్సు లేబరేటరీకి, కెమిస్ట్రీ లేబరేటరీకి చెరి ఒక 8 టేబుల్స్, లేబరేటరీకి అవసరమైన పరికరాలు, ఇంకా ఇలా ఎన్నో వస్తువులు పంపించాలి. ఒకటి రెండు రోజులలో ఈ సామానులన్నీ అనంతపురం చేరవచ్చు. ఇవి మీకు అందిన తరువాత, ఇంకా ఏమైనా కావాలేమో నాకు తెలియజేయండి. మీకు కావలసిన వస్తువులన్నీ పంపిస్తాను."

" విద్యార్థినుల కొరకు 1000 నోట్సు పుస్తకాలు, డైరీలు పంపించాను. అంతే కాకుండా వాటిలో కొన్ని లైబ్రరీ పుస్తకాలు గల ప్యాకెట్టుకూడా ఉన్నది. ఆ పుస్తకాలలో విద్యార్థినులకు, ఉపాధ్యాయినులకు ఉపయోగపడనివి ఏవైనా ఉంటే, వాటిని తీసి ప్రక్కకు పెట్టెయ్యండి. తెలుగు పాఠ్యపుస్తకాలు ఒకటి, రెండు రోజులలో మీకు అందుతాయి. ఇంగ్లీషు, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ, ఫిజిక్సు, హిస్టరీ మొదలగు ఇతర సబ్జెక్టులకు సంబంధించిన పాఠ్యపుస్తకాలు మద్రాసు, బెంగుళూరు పట్టణాలలో కొనడం జరిగింది. అవి కూడా మీకు తొందరలోనే అందుతాయి.

" కళాశాలలో క్రొత్తగా చేరిన విద్యార్థినుల లిస్టు నాకు పంపితే వాళ్ళందరికి యూనిఫాం చీరలు పంపిస్తాను....."

భగవాన్ శ్రీసత్యసాయిబాబా వారు ఒక ఆదర్శప్రాయులైన వ్యవస్థాపకులుగా, విద్యాభిమానిగా తాను నెలకొల్పిన విద్యా సంస్థలను నిర్వహించే పరిపాలకులందరికి పూర్తి నైతిక బలమును, ప్రోత్సాహమును అందించారు. అనంతపురం మహిళా కళాశాల నిర్వహణలో ప్రారంభదశలో ప్రిన్సిపాలు కొన్ని సమస్యలను ఎదుర్కొంటున్న సందర్భంలో స్వామి "నీవు దేనిని గురించి చింతించవలసిన అవసరం లేదు. ఈ క్లిష్ట పరిస్థితులలో నీవు చూపిన ఓర్పుకు, సహనానికి సాయి ఎంతో సంతోషించారు. సాయికి అన్నీ తెలుసు. అందువలన నీవు చెయ్యవలసిందల్లా నీ కర్తవ్యమును నీవు నిర్వహించడమే. కదిలిపోయే మేఘములవంటి ఈ సమస్యలను మనస్సులో పెట్టుకుని నువ్వు బాధపడకు. నేను అన్నీ చూచుకుంటాను. కాలక్రమేణా అన్నీ చక్కబడతాయి," అని ఒక ఉత్తరంలో వ్రాశారు.

అవతార పురుషులైన భగవాన్ శ్రీసత్యసాయిబాబావారి విద్యాసంస్థలలో బోధించడానికి ఆయనచే స్వయంగా ఎంపిక చేయబడిన అధ్యాపకులు నిజంగా ధన్యులు. ప్రశాంతి నిలయంలోని కళాశాల అధ్యాపకులతో భగవాన్ బాబావారు ఒకసారి ముచ్చటిస్తున్న సమయంలో ఒక ప్రొఫెసరు "స్వామీ! ఆధ్యాత్మిక

మార్గంలో పయనిస్తూ లక్ష్యమును చేరుకునే సాధనలో నేను ఏవిధంగా ప్రగతిని సాధించాలి అనే విషయాన్ని దయచేసి నాకు తెలుపండి," అని ప్రార్థించాడు. అందుకు సమాధానంగా స్వామి "నా విద్యార్థులను జాగ్రత్తగా చూసుకుంటూ వారిని ఉత్తములైన, సమర్థులైన పౌరులుగా తీర్చిదిద్దు. అది చాలు. నీవు నిస్సందేహంగా నీ జీవిత సాఫల్యమును పొందగలవు. నీవింకేమీ చెయ్యనవసరం లేదు", అని ఉద్ఘాటించారు.

అవతార పురుషులైన భగవాన్ శ్రీసత్యసాయి బాబావారు నెలకొల్పిన స్కూళ్ళు, కాలేజీలలో సేవ చేసే అవకాశం లభించడం ఆ అవతారమూర్తి స్వయంగా సాధకునికి ప్రసాదించిన అమూల్యమైన కానుక. అదే స్వర్గ సామ్రాజ్యమునకు రాచబాట!





7

విశ్వవ్యాప్తమైన దివ్య ప్రేమతత్వము

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారివలె ఏ దివ్య పురుషుడు – ఆయన ఒక అవతారమూర్తి కానీయండి, ప్రవక్త కానీయండి లేదా పావన పురుషుడు కానీయండి, తన జీవిత కాలములోనే 100కు పైగా దేశములలో 'దైవం మానుషరూపేణ' అని లక్షలాదిమందిచే ఆరాధింపబడలేదన్నది చరిత్ర సత్యము. శాస్త్ర, సాంకేతిక రంగములలో సాధింపబడిన విశేష ప్రగతివలన ప్రపంచము, మానవుని హృదయము కూడా కుంచించుకుపోతున్న ప్రస్తుత క్లిష్టపరిస్థితులలో శ్రీ సత్యసాయి అవతారముయొక్క అవతరణ సంభవించింది. మొత్తం ప్రపంచం అంతా ఒక చిన్న గ్రామంగా (Global Village) కుంచించుకుపోవడంవల్ల ప్రపంచంలో ఒక మూల ఏదైనా సంఘటన జరిగితే దాని ప్రభావం యావత్ప్రపంచముపై ప్రసరిస్తున్నది. ఇక మానవుని హృదయము కుంచించుకుపోవడంవల్ల, మానవుని వ్యక్తిగత, సామాజిక జీవితములో దయ, కరుణలు మృగ్యమై మానవుని అంతరంగములోను, మనిషికి మనిషికి మధ్య, మానవునికి, ప్రకృతికి మధ్య గతంలో ఎన్నడూ లేనంతగా సంఘర్షణ నెలకొన్నది. ఆధునికయుగంలో ఇటువంటి సంఘర్షణ అసలు మానవుని ఉనికికే ముప్పు తెచ్చిపెడుతున్నది. ఈ పరిస్థితిని గమనించిన సుప్రసిద్ధ చరిత్రకారుడు ఆర్నాల్డ్‌టాయెన్‌బీ "మానవుడు సాధించిన సాంకేతిక విజయము అతని ఆధ్యాత్మిక ప్రగతిని కుంటుపరుస్తుంది" ("The Spiritual advancement of man will be inversely proportional to his technological mastery") అని హెచ్చరించాడు.

ఈనాడు మానవుడు ఆత్మ వినాశమునుండి రక్షింపబడాలంటే అతని తక్షణకర్తవ్యము మేధాశక్తికి, హృదయ స్పందనకు మధ్య సమతౌల్యమును సాధించడమే! అది కేవలం మానవుని హృదయంలో అంతరించిపోయిన ప్రేమ,




"భగవాన్ దివ్యాకర్షణ"

విశ్వాసములనే అమృతధారలను పునరుద్ధరించడంద్వారా సాధించే హృదయపరివర్తనవల్లనే సాధ్యమవుతుంది. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు అవతరించినది సరిగ్గా ఈ లక్ష్యసాధనకొరకే! భగవాన్ ఒక సందర్భంలో "మానవ జీవితోద్ధరణకు ప్రేమ, విశ్వాసములే ప్రధాన సూత్రములు. నా జీవితమే నా సందేశము. నేను ప్రతి ఒక్కరిని ప్రేమిస్తాను. అది నా స్వభావము. నన్ను ఈ పేరునగాని, ఏ పేరునగాని, అసలు ఏ పేరు లేకుండాకూడా పిలిచినా అందరూ నావారే! విశ్వజనీనమైన ప్రేమకు మూలాధారము, దివ్యత్వము. అట్టి ప్రేమను సాధించడానికి దివ్యత్వమునందు ప్రేమను పెంచుకోవాలి. మానవునియందు, తద్వారా ప్రపంచమునందు పరివర్తన తీసికొనిరావాలంటే, అది ప్రేమమార్గముద్వారానే సాధ్యపడుతుంది", అని ఉద్ఘాటించారు.

మూర్తీభవించిన ప్రేమావతారి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా కులము, మతము, వర్ణము, వర్గము, జాతి భేదము లేకుండా ప్రపంచములోని స్త్రీ, పురుషులందరికి తన దివ్యప్రేమను పంచి యిస్తున్నారు. భగవాన్ ఒక సందర్భంలో "మానవజాతి నంతటిని సోదరబంధముచే ఒకే కుటుంబముగా సంఘటితపరచే పరమ ప్రయోజనమును సాధించుటకు; విశ్వమంతటికి ఆధారమైన దివ్యత్వము ప్రతి జీవిలోను ఆత్మతత్త్వముగా భాసిల్లుతున్నదని తెలుపుటకు; మానవుడు తనలోని పశుప్రవృత్తిని తొలగించుకుని తన లక్ష్యమైన దివ్యత్వస్థాయికి చేరుకోవడానికి వీలుగా 'ఈశ్వర పితృత్వము, మానవ సోదరత్వము' అనే మహోన్నత సూత్రమును గుర్తించుమని బోధించుటకే ఈ సాయి అవతరించినది", అని ఉద్ఘాటించారు.

చాలా సందర్భాలలో భగవాన్ బాబావారే స్వయంగా తన సందేశమును తానే భక్తులకు అందించారు. ఆయన భక్తులలో ప్రతి ఒక్కరితోను ఆయనకుగల సంబంధము ఆంతరంగికమైనది, వ్యక్తిగతమైనదీను. ఆయనను ఒక్కసారికూడా ప్రత్యక్షంగా దర్శించుకోని భక్తులుకూడా ఆయనతో ఆంతరంగికమైన సంబంధము కలిగియుంటారు. దీనికి కారణం, ఆయన భక్తులతో పెట్టుకునే సంబంధము



"ఫారినర్స్ ఆర్ మై ఫార్-నియర్స్" (దూరంగా నివసిస్తూ దగ్గరైన విదేశీయులు)



"భగవాన్ శ్రీసత్యసాయిబాబావారికి ప్రణమిల్లుతున్న శ్రీ బొజానీ"

కేవలం భౌతిక పరిధికి మాత్రమే పరిమితమైనది కాకపోవడమే! భక్తులతో ఆయన వ్యవహరించే తీరు బహుముఖమైనది. ఎన్నో రకాలుగా ఉంటుంది. అయితే, వైవిధ్యభరితమైన ఆవిధానముయొక్క మూల సూత్రము భక్తులలో విశ్వాసమును నెలకొల్పి, ప్రేమను పెంపొందించి, తమ అంతరంగములోనే ఉన్న దివ్యత్వమును అన్వేషించేటట్లు వారిని ప్రోత్సహించడమే! భగవాన్ బాబావారి దివ్య ప్రేమను ప్రత్యక్షంగా అనుభవించిన ప్రతి ఒక్క వ్యక్తియొక్క గాథ చాలా ఆసక్తికరంగా, సమ్మోహనకరంగా ఉంటుంది. ఈ అధ్యాయములోను, రాబోయే అధ్యాయములోను భగవాన్ బాబావారి దివ్య ప్రేమకు పాత్రులైన అటువంటి భాగ్యశాలురలో కొందరి జీవితాలు మరియు వారి అనుభవాలను గురించి తెలుసుకుందాం. ఇందులో ప్రతి ఒక్కరి గాథ భగవద్విశ్వాసము, ప్రేమ అనే మార్గములో పయనిస్తున్న అటువంటి వేలాదిమంది సాధకుల ఆధ్యాత్మిక యాత్రకు ప్రతీకగా ఉంటుంది.

భారతదేశములోని కర్ణాటక రాష్ట్రమునకు చెందిన శ్రీ ఎన్.ఆర్. ద్వారకానాథ్, వృత్తిరీత్యా ఛార్టర్డ్ అక్కౌంటెంటు. ఆయన అరేబియన్ గల్ఫ్‌లోని బహ్రెయిన్ దేశములో గల 'నేషనల్ కేష్ రిజిష్టర్ కార్పొరేషన్' అనే ఒక అమెరికను కంపెనీలో అక్కౌంటెంటుగా పనిచేయడానికి 1978వ సంవత్సరములో బయలుదేరివెళ్ళారు. ఆయన 1974వ సంవత్సరంలో మొట్టమొదటిసారి భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్నారు. వెంటనే స్వామి భక్తులయ్యారు. ఆయన భార్య శ్రీమతి వసు చిన్నతనంలోనే తన తండ్రి ప్రభావం వలన భగవాన్ బాబావారియందు భక్తి ప్రపత్తులు పెంచుకున్నారు. శ్రీ ద్వారకానాథ్ కొంతమంది భక్తులతో కలసి బహ్రెయిన్‌లోని మనామాలో 1981వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో శ్రీ సత్యసాయి సెంటర్‌ను ప్రారంభించారు. ఆయన నివాసముంటున్న ఫ్లాట్‌లో వారం వారం జరిగే సాయి భజనలలో ముప్ఫయి, నలభైమంది భక్తులు పాల్గొనేవారు. భగవాన్ బాబావారు ఒక చేతిలో ఏపిల్ పండు పట్టుకుని ఉయ్యాలలో కూర్చున్నట్లు ఉండే ఒక అందమైన ఫోటో వారి హాలులో అందరికి బాగా కనపడేటట్లు ఏర్పాటు చేయబడింది.

1983వ సంవత్సరం మార్చి నెలలో శ్రీ ద్వారకానాథ్‌యొక్క అత్తమామలు తమ మనుమని మొట్టమొదటి పుట్టినరోజుకు బహ్రెయిన్ వచ్చారు. శ్రీ ద్వారకానాథ్ మామగారు శ్రీ సుందరం అయ్యంగార్ భగవాన్ బాబావారికి 1950వ సంవత్సరమునుండి భక్తులే! అత్తగారు శ్రీమతి పంకజం శ్రీ వేంకటేశ్వరస్వామికి గొప్ప భక్తురాలు. ఆమె చాలా ఆర్తితో భక్తిగీతాలను పాడుతారు. అయితే, ఆమెకు భగవాన్ బాబావారియందు అంతగా ఆసక్తి లేదు.

శ్రీ ద్వారకానాథ్ మార్చినెల 17వ తేదీ సాయంత్రం తన భార్య, మామగారితో కలసి ఒక స్నేహితుని ఇంటికి వెళ్ళారు. ఆ సమయంలో శ్రీమతి పంకజం తన మనుమణ్ణి పెట్టుకుని ఇంట్లో ఒంటరిగా ఉన్నది. ఆ రోజు రాత్రి సుమారు 9 గం॥ 15 ని॥లకు ఆమె ఎవరో తమ తలుపు తట్టడం విన్నది. అయితే, అంత త్వరగా తనవాళ్ళు ఇంటికి తిరిగివస్తారని ఆమె భావించకపోవడంవల్ల, తలుపు తీయడానికి కొంచెం సందేహించింది. ఇంతలో అవతలి వ్యక్తి విడవకుండా గట్టిగా తలుపు తట్టుతూండడంచేత ఆమె అయిష్టంగానే తలుపు తీసింది. తలుపు బయట భగవాన్ బాబావారు ఏపిల్ పండును తన కుడి చేతిలో పట్టుకుని నిలబడి ఉండడం చూచిన ఆమె నిర్ఘాంతపోయింది. ఆయన తమిళంలో మాట్లాడుతూ "ఈ ఏపిల్ పండును ద్వారకానాథ్‌కొరకు తెచ్చాను", అని చెప్పారు. ఆ మాట విన్న శ్రీమతి పంకజం షాకు తిని నోటమాట రాక ఎలా ఉన్నది అలాగే నిలబడిపోయింది. స్వామి నుండి ఏపిల్ తీసుకోవడానికి ఆమె చెయ్యికూడా చాచలేదు. ఇంతలో బాబా ఏపిల్ పండును తన కుడిచేతిలోనుండి ఎడమచేతిలోనికి మార్చి పట్టుకుని కుడిచేతిలో విభూతిని సృష్టించి ఆమె నుదుటిపై పెట్టారు. తరువాత భగవాన్ బాబా వెనుకకు తిరిగి నాలుగు అడుగులు వేసి అదృశ్యమైపోయారు! ఇంతలో రాత్రి 10 గంటలకు ద్వారకానాథ్, మిగిలినవాళ్ళు తమ ఫ్లాట్‌కు తిరిగివచ్చారు. ఆయన తలుపు తట్టినపుడు లోపలినుండి ఎంతసేపటికి సమాధానం లేకపోవడంచేత తప్పనిసరిగా తన వద్దనున్న మారు తాళంతో తలుపు తెరువవలసి వచ్చింది. లోపలికి రాగానే, శ్రీమతి పంకజం షాకుతో చెమటలు పట్టి

శూన్యంలో చూస్తూ ఉండిపోవడం వాళ్ళు గమనించారు. అంతేకాకుండా ఆమె నుదుటిపై చాలా ప్రస్ఫుటంగా ఒక విభూతి రేఖ ఉండడం చూసి వాళ్ళుకూడా ఆశ్చర్యపడిపోయారు. ఆమె చాలా దృఢ విశ్వాసముగల; ఇంచుమించు మూఢభక్తిగల విష్ణు భక్తురాలు కావడంచేత, ఆమెకు బాబాయందు ఏ మాత్రము నమ్మకము లేదు. ఆ కారణంగా ఆమె విభూతిని ధరించే ప్రసక్తే లేదు. అటువంటిది ఆమెను ఈ పరిస్థితిలో చూచేటప్పటికి వాళ్ళకు ఆశ్చర్యంతో నోట మాటరాలేదు. కొంచెంసేపయిన తరువాత ఆమె తనంతట తానే తేరుకుని నమ్మశక్యంగాని తన అనుభవమును వాళ్ళకు వివరించి చెప్పింది. అది విని వాళ్ళు ఉత్సాహం పట్టలేకపోయారు. కాని, తమ ఇంటి తలుపుదగ్గరే భగవాన్ బాబావారి దర్శనం చేసుకునే అపూర్వమైన అవకాశము పోగొట్టుకున్నందుకు వాళ్ళు చాలా నిరాశచెందారు. తమ ప్రియతమ సాయి ప్రభువు స్వయంగా తమ ఇంటికి వచ్చినపుడు కనీసం ఆయనను లోపలికి రమ్మని ఆహ్వానించనైనా లేదని వాళ్ళు చాలా విచారించారు. అంతేకాకుండా ఆయన ఏపిల్ పండును ప్రసాదంగా అందించినపుడు శ్రీమతి పంకజం దానిని అందుకోలేదని బాధపడ్డారు.

అదే రోజున భగవాన్ బాబావారు ప్రశాంతి నిలయంలో ఒక సామూహిక ఉపనయన మహోత్సవంలో 680 మంది వటువులకు బ్రహ్మోపదేశము చేశారు. ప్రశాంతి నిలయం స్కూలులో చదువుతున్న శ్రీ ద్వారకానాథ్ మేనల్లుడు ఒకరు భాగ్యశాలురైన ఆ వటువులలో ఉన్నారు. ఆ రోజున అక్కడ సమావేశమైన వటువులను, వారి తల్లిదండ్రులను, ఇంకా వేలాదిమంది భక్తులను ఉద్దేశించి మాట్లాడుతూ భగవాన్ బాబా గాయత్రీ మంత్రముయొక్క విశిష్టతనుగురించి వివరించారు.

ఆ మరుసటి సోమవారంనాడు మనామాలోని శ్రీ ద్వారకానాథ్ ఇంట్లో బాబా పటములో ఆయన అభయహస్తముపై విభూతి ఏర్పడింది. దానితో వారం వారం శ్రీ సత్యసాయి సెంటర్‌లో జరిగే భజనకు వచ్చే భక్తుల సంఖ్యకూడా బాగా పెరిగింది. రెండు నెలల తరువాత శ్రీ షిర్డీ సాయిబాబా పటముపైకూడా

విభూతి ఏర్పడింది. అయితే ఒక తేడా ఏమిటంటే, శ్రీ సత్యసాయిబాబావారి పటముపై ఏర్పడే విభూతి ఆయన స్వయంగా తమ దివ్య హస్తముతో సృష్టించే విభూతివలెనే మెత్తని చూర్ణమువలె సువాసన కలిగి బూడిద రంగులో ఉంటే, శ్రీ షిర్డీ సాయిబాబావారి పటముపై ఏర్పడే విభూతి గరుకుగా, గోధుమ రంగులో ఎటువంటి వాసన లేకుండా, షిర్డీలోని ధునినుండి తీసిన ఊదివలె ఉండేది. ఇంకొక విశేషమేమంటే, శ్రీమతి పంకజం భజనలకు హాజరైనప్పుడల్లా ఆమె నుదుటిపై విభూతి ఏర్పడేది. భగవాన్ బాబావారు బహ్రెయిన్‌లోని ఆమె ఇంటిలో ప్రత్యక్షమై దర్శనం ఇవ్వడానికి వారం రోజులముందు ఆమె కుడి మోకాలుక్రింద వాచి డాక్టర్లకు చూపించగా బహ్రెయిన్‌లోని అమెరికన్ మిషన్ హాస్పిటలు డాక్టర్లు దానిని ట్యూమరుగా నిర్ధారించి శస్త్రచికిత్సద్వారా తీసివేయాలని నిర్ణయించారు. అయితే, బహ్రెయిన్‌లో ఆమె భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్న తరువాత అత్యద్భుతమైన రీతిలో ఆ ట్యూమరు దానంతట అది మాయమైంది. ఈ దివ్యానుభూతిద్వారా తన ఆరాధ్యదైవమైన శ్రీ వేంకటేశ్వరస్వామి, భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ఒకరేనని శ్రీమతి పంకజం గుర్తించి మహదానందమును పొందారని వేరే చెప్పనవసరంలేదు.

అమెరికాకు చెందిన శ్రీమతి మరియు శ్రీ రాబర్ట్ బొజానీ "1980-86 సంవత్సరాలమధ్య అమెరికానుండి, ప్రపంచములోని అనేక ఇతర ప్రాంతములనుండి చాలా పెద్ద సంఖ్యలో భక్తులను భగవాన్ బాబా తమవద్దకు పిలిపించుకోవడం మేము చూశాము. ప్రపంచములోని వివిధ దేశాలలో నున్న శ్రీ సత్యసాయి సెంటర్లు ఎటువంటి ప్రచారము, మత మార్పిడివంటి ప్రక్రియలకు పాల్పడకుండానే ఇది సంభవించింది", అని చెప్పారు. నిజానికి, 1973 డిశంబరు నెలలో శ్రీ బొజానీయే 'భగవాన్ బాబావారు తనను పిలుస్తున్నట్లు' అనుభవమును పొందారు. తన తండ్రి చనిపోయిన సంవత్సరం తరువాత ఆయనకు ఈ అనుభవము కలిగింది. ఆ సమయంలో ఆయన జీవితముయొక్క పరమావధిని మరియు ప్రాపంచిక సుఖములు కదిలిపోయే మేఘములని తెలుసుకోలేకపోవడంవలన కలిగిన ఒక విధమైన అశాంతితో చాలా

బాధపడుతున్నారు. ఆ అశాంతియే ఆయనను ఆధ్యాత్మిక సత్యాన్వేషణకు పురికొల్పింది. శ్రీరాబర్ట్ మొట్టమొదటగా తన భార్య బార్బరానుండి భగవాన్ బాబావారిని గురించి తెలుసుకున్నారు. ఆమె భగవాన్ బాబావారి భక్తురాలు ఒకామెవద్ద యోగ సాధన నేర్చుకుంటున్నారు. శ్రీరాబర్ట్ భగవాన్ బాబావారి ఫోటోలను కొన్ని చూచారు. బాబా స్వయంగా పాడిన హృదయాన్ని కదిలించే కొన్ని భక్తి గీతములను గ్రామఫోను రికార్డులద్వారా విన్నారు. అయితే, అప్పట్లో ఆయన భగవాన్ బాబావారియందు అంతగా ఆసక్తి చూపించలేదు.

ఎట్టకేలకు 1973వ సంవత్సరం డిశంబరు నెల 9వ తేదీన శ్రీబొజానీకి భగవాన్ బాబావారినుండి 'పిలుపు' వచ్చింది. ఆరోజు రాత్రి అమెరికాలోని ఆయన యింట్లో భగవాన్ బాబావారు ఆయన యెదుట ప్రత్యక్షమయ్యారు. అది ఒక కల కాదు; కేవలం ఊహాజనిత దృశ్యము కాదు. బాబా ప్రత్యక్షంగా ఆయనముందు నిలిచారు. స్వర్గస్థులైన తన తండ్రి గొంతుకతో బాబా " విచారించకు; అన్నీ చక్కబడతాయి" (Don't worry, everything will be alright) అని చెప్పి అదృశ్యమయ్యారు. అయితే శ్రీ బొజానీకి అంతటితో తృప్తి కలుగలేదు. తన భార్య వచ్చి " మీరు నాతో వచ్చినా, రాకపోయినా నేను మాత్రం భగవాన్ శ్రీసత్యసాయి బాబావారిని చూడడానికి వెడుతున్నాను" అని నిర్ద్వంద్వంగా ప్రకటించేవరకు ఆయన తాత్సారం చేశారు. 1974వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో తన భార్య భారతదేశానికి బయలుదేరుతున్నప్పుడు అయిష్టంగానైనా సరే ఆమెవెంట వెళ్ళడంతప్ప ఆయనకు గత్యంతరం లేకపోయింది. ఆ యోగా టీచరు గైడ్‌గా ఆమె సారథ్యంలో వారంతా ఒక గ్రూపుగా కలిసి వెళ్ళారు. బెంగుళూరులో దిగగానే శ్రీ బొజానీ "నేను నిన్ను ప్రశాంతి నిలయంలో దిగబెట్టి, నీకు కావలసిన ఏర్పాట్లన్నీ చేసి మళ్ళీ బెంగుళూరు తిరిగివచ్చి ఈ చుట్టుప్రక్కల ప్రాంతాలన్నీ చూస్తాను", అని తన భార్యతో చెప్పారు. ఆ రోజు సాయంత్రానికే తిరిగి బెంగుళూరు వచ్చేసే ఉద్దేశ్యంతో ఆయన తాము దిగిన హోటలులో రూముకూడా ఖాళీ చెయ్యలేదు! కాని, ఆ రోజున వాళ్ళు ప్రశాంతి నిలయం

చేరుకునేటప్పటికి సాయంత్రం చాలా ఆలస్యమైంది. అందువలన, ఆ రాత్రికి అక్కడే వుండి మరునాడు ఉదయం బెంగుళూరు వెడదామని నిశ్చయించుకున్నారు.

ఆ మరునాడు ఉదయం భగవాన్ బాబా ఆ గ్రూపులోని వారందరిని ఇంటర్వ్యూకు పిలిచి వారితో 20 నిమిషాలపాటు మాట్లాడారు. భగవాన్ మాట్లాడుతూండగా వింటున్న శ్రీ బొజానీ హృదయంలో ఓ తీవ్రమైన ఆవేదన ప్రారంభమై తాను 12 సంవత్సరాల బాలునిగా ఉన్నప్పటినుండి తన మనస్సును వేధిస్తున్న మూడు ప్రశ్నలు ఆ సమయంలో ఆయన స్మృతి పథంలో తళుక్కున మెరిశాయి. ఆయనకు 12వ సంవత్సరం జరుగుతూండగా ఒక రోజు మతపరమైన విషయాలు బోధించే ఒక టీచరు క్లాసులో "మీరు వేరొక చర్చి దేనికైనా వెడితే భగవంతునికి చాలా కోపం వస్తుంది" అని చెప్పినపుడు ఆయన లేతమనసులో ఈ ప్రశ్న లుదయించాయి. అందులో మొదటి ప్రశ్న, "భగవంతుడంటూ ఉంటే ఆయన అందరికీ భగవంతుడే అయ్యుండాలి కాని వేరొక విధంగా ఎలా ఉంటుంది?". రెండవ ప్రశ్న,"భగవంతుడంటూ ఉంటే ఆయన జీసస్ జన్మించక పూర్వము, ఆయన శిలువపై మరణించిన తరువాత కూడా ఎందుకు అవతరించలేదు?" ఇక మూడవ ప్రశ్న, "ఈ ప్రపంచము మరియు విశ్వమునుగురించి మానవుని అవగాహనకు అతీతమైన విషయమేదో ఉండి ఉండాలి కదా!"అని. ఆ ఇంటర్వ్యూలో భగవాన్ బాబావారి దివ్యవాణిని వింటున్నప్పుడే శ్రీ బొజానీ అంతరంగమునుండి ఆ ప్రశ్నలకు సమాధానం లభించింది: "(i) అవును; భగవంతుడున్నాడు; ఆయన అందరికి భగవంతుడే!" (ii) అవును; ఆయన జీసస్‌కు ముందు, తరువాత కూడా అవతరించారు. ప్రస్తుతం ఆయన ఇక్కడే ఉన్నారు. (iii) అవును; మానవుని అవగాహనకు మించి విశ్వమును గురించిన విషయాలు ఎన్నో ఉన్నాయి".

ఆ ఇంటర్వ్యూ పూర్తయిన తరువాత శ్రీ బొజానీ తన భార్య వద్దకు వెళ్ళి "శ్రీ సత్యసాయిబాబా సాక్షాత్తూ భగవంతుడే! నేను బెంగుళూరు తిరిగి వెళ్ళను. ఇక్కడే ఉంటాను" అని చెప్పారు. భగవాన్ బాబావారివద్దకు శ్రీ బొజానీ

దంపతుల ఆధ్యాత్మిక యాత్ర ఆవిధంగా ప్రారంభమైంది. ఆ తరువాత ఆ దంపతులు ఒకసారి స్వామిని కలుసుకున్నప్పుడు ఆయన తాను 1973వ సంవత్సరంలో డిశంబరు 9వ తేదీన వారింటికి వచ్చినట్లు ధ్రువపరిచారు. ఆనాటి నుండి భగవాన్ బాబావారియందు వారికి గల ప్రేమయే వారి జీవితాలకు ఆలంబన అయ్యింది. సుప్రసిద్ధ జర్మను మతతత్వ శాస్త్రవేత్త రాబర్ట్ షుల్లర్ ఒక సందర్భంలో "ఎక్కడ దివ్యప్రేమ ఉట్టిపడుతుందో అక్కడ అద్భుతమైన మహిమలు జరుగుతాయి" ("In the presence of love, miracles happen") అని ప్రకటించారు. శ్రీ బొజానీ దంపతుల జీవితాలలో ఎన్నో అద్భుతాలు జరిగినాయి. అందులో కేవలం 'కేన్సరును కేన్సిలు చేశాను' ('Cancer is Cancelled') అనే భగవాన్ బాబావారి ఒక్క మాటతో శ్రీ బొజానీ కేన్సరు వ్యాధి నయమైన మహిమకూడా ఉన్నది. అయితే, తమ జీవితాలలో భగవాన్ బాబావారి ప్రేమానుగ్రహములు నిరంతరాయంగా ప్రవహించడమే అత్యద్భుతమైన మహిమని, దానివలన తాము జీవితంలో ఎదురయ్యే ఒడి దుడుకులను తట్టుకుని నిలబడగలుగుతున్నామని, శ్రీ బొజానీ దంపతులు భావిస్తారు.

శ్రీ బొజానీ ప్రస్తుతం అమెరికాలోని శ్రీ సత్యసాయి బుక్ సెంటరుకు ఛైర్మనుగాను, ఆయన భార్య శ్రీమతి బార్బరా శ్రీ సత్యసాయి న్యూస్ లెటర్‌కు ఎడిటరుగాను సేవలందిస్తున్నారు. 1980-86 సంవత్సరాలమధ్య భగవాన్ బాబావారు అమెరికా నుండి ఏవిధంగా అనేకమంది భక్తులను తమవద్దకు రప్పించుకున్నారో ("Calling to Him"), అందులో తమవంతు పాత్ర ఏవిధంగా ఉందో గుర్తు చేసుకుని ఇలా వివరిస్తున్నారు :

"1980వ దశాబ్దపు మొదటిభాగంలో మేము అమెరికాలోని పదిన్నర లక్షలకుపైగా జనాభా ఉన్న ఫోనిక్స్ అనే పెద్దనగరానికి మకాం మార్చాము. అక్కడికి వెళ్ళేముందు మేము భగవాన్ బాబావారిని ఫోనిక్స్‌లో ఒక సత్యసాయిబాబా సెంటరును ప్రారంభించమంటారా అని అడిగాము. అప్పుడు స్వామి 'తప్పకుండా అలాగే చెయ్యండి. అక్కడే కాదు. ఇంకా ఎన్నో సెంటర్లు వస్తాయి', అని నొక్కి వక్కాణించారు. ఈ క్రొత్తస్థలంలో కూడా భగవాన్

బాబావారి అవతార కార్యక్రమంలో పాలుపంచుకునే అవకాశం లభించినందుకు మేము ఎంతో సంతోషించాము. స్వామి ఆదేశానుసారము ఫోనిక్స్ నగరంలో మేము ఒక సత్యసాయిబాబా సెంటరును ప్రారంభించాము. మేమిద్దరం సంగీత పరిజ్ఞానము గలవారము కాము. అలాగే భజనలలో లీడ్ చెయ్యగల గాయకులం కూడా కాదు. అందువలన మేమిద్దరం ప్రతి గురువారం సాయంత్రం ఆ సత్యసాయిబాబా సెంటరుకు వెళ్ళి ఒక టేపు రికార్డరును మా లీడ్ సింగర్‌గా పెట్టుకుని దాని సహాయంతో భారతదేశంలో పాడే భజన పాటలను నేర్చుకోవడం మొదలుపెట్టాము. అయితే, మా ఇంట్లో ఒక పెంపుడు పిల్లి, ఒక కుక్క కూడా ఉన్నాయనుకోండి. అవి కూడా ఆ పాటలను వింటూ ఆనందిస్తున్నట్లు మాకు అనిపించింది!

కొన్ని వారాలు గడిచిన తరువాత ఒక యువతి మా ఇంటికి వచ్చి తలుపు తట్టింది. ఆమె అప్పుడే న్యూయార్క్‌నుండి ఫోనిక్స్‌కు మకాం మార్చింది. అందువలన మా సెంటర్‌లో చేరాలని అనుకుంది. ఆమె అమెరికాలోని ఒక ప్రఖ్యాత మ్యూజిక్ స్కూలు నుండి పట్టా తీసుకుంది. ఆమె భజన పాటలు పాడడమే కాక, అనేక సంగీత వాయిద్యములను వాయించగలదు కూడా. ఈ విధంగా సమర్థత, అనుభవము గల భజన గాయకురాలు లభించిన తరువాత స్వామి మా సెంటరుకు అంతకంతకు ఎక్కువ మందిని సభ్యులుగా పంపించడం మొదలుపెట్టారు. అసలు వాళ్ళు ఎక్కడుంటున్నారో, ఏ ప్రాంతానికి చెందినవారోకూడా మాకు తెలియదు. గురువారం సాయంత్రం అయ్యేటప్పటికి అలా అలా వచ్చి చేరేవారు. ఈ విధంగా సెంటరుకు వచ్చే సభ్యుల సంఖ్య పెరగడంతో మేము నెలకొకసారి ఒక ఆదివారంనాడు మధ్యాహ్నం మా సెంటరులో ఒక బహిరంగ సమావేశం ఏర్పాటుచేశాము. ఆ సమావేశాలలో శ్రీమతి ఎల్సీకోవాన్, శ్రీ ఛార్లెస్‌పెన్, జాన్‌హిస్లాప్ వంటి సుప్రసిద్ధ సాయి భక్తులు మరికొందరు వచ్చి వక్తలుగా ప్రసంగించేవారు. స్వామి చెప్పినట్లుగానే అంతకంతకు ఎక్కువమంది మా సత్యసాయి సెంటరుకు రావడం మొదలుపెట్టారు.

ఈ సమయంలో అమెరికా మరియు ప్రపంచంలోని ఇతర ప్రాంతాలలో శ్రీ సత్యసాయిబాబా సెంటర్ల సంఖ్య చాలా ఆశ్చర్యకరంగా పెరిగిపోయింది. 1970వ దశాబ్దంలో మా దేశంలో 20కి మించి సెంటర్లు లేవు. అయితే 1980వ దశాబ్దంలో ఒక్కసారిగా విస్తరించి ఇప్పుడు 225కు పైగా సెంటర్లు ఉన్నాయి".

1980వ దశాబ్దిలో భగవాన్ బాబావారు అమెరికాలో వేలాదిమంది భక్తులను తమ వద్దకు తమ సెంటర్లకు ఏవిధంగా రప్పించుకున్నారనే విషయమును గురించి శ్రీ బొజానీ తన అనుభవాలను వివరిస్తూ చెప్పిన కథలోని మరొక ఉదంతము ఈవిధంగా ఉన్నది : ఫోనిక్స్‌లోని శ్రీ సత్యసాయిబాబా సెంటర్‌లో జరిగే సమావేశాలలో శ్రీ బొజానీ అడిగినవారికందరికి విభూతి పేకెట్లు ఇచ్చేవారు. ఆ విధంగా ఒక సమావేశానంతరం విభూతి పేకెట్లు తీసుకున్న ఇద్దరు జంటలు ఇంటికి తిరిగివచ్చి తమ చేతులలో ఉన్న పేకెట్లు విప్పి చూచుకున్నారు. ఇంతలో చాలా ఆశ్చర్యకరంగా ఆ పేకెట్లలోని విభూతి చాలా అందమైన చిన్న చిన్న పువ్వులుగా మారిపోయింది! భగవాన్ బాబావారి అనుగ్రహ సూచకమైన ఈ అద్భుత లీలకు ఆ ఇద్దరు జంటలు వేరువేరు రకాలుగా స్పందించారు. ఒక జంట భగవాన్ బాబావారు తమపై చూపిన అనుగ్రహమునకు పొంగిపోయి మంచి దృఢ విశ్వాసముగల భక్తులుగా మారిపోయారు. వేరొక జంట ఆ హఠాత్పరిణామానికి భయపడిపోయి మళ్ళీ ఎప్పుడూ ఆ సెంటరు ఛాయలకుకూడా రాలేదు!

ఆ మొదటి జంటయొక్క జీవితాలలో ఈ సంఘటన జరిగిన తరువాత ఇంకా అనేకమైన భగవాన్ అనుగ్రహపూర్వక లీలలు జరిగాయి. అమెరికాలో కొన్ని రెస్టారెంట్ల సముదాయమునకు (Chain of Restaurants) కార్యనిర్వహణాధికారిణిగా పనిచేస్తున్న ఆమె తన ఉద్యోగమును విడిచిపెట్టేసి ఫోనిక్స్‌లోని శ్రీ సత్యసాయిబాబా సెంటర్‌లో ఒక క్రియాశీలక సభ్యురాలుగా చేరిపోయింది. ఆ సెంటరులో ఆమె మొట్టమొదటి బాలవికాస్ టీచరయ్యింది

కూడా. ఆమె భర్త చెయిన్ స్మోకర్ కావడంచేత రోజుకు పేకెట్లకు పేకెట్లు సిగరెట్లు ఊదేస్తూండేవాడు. ఈ దురలవాటు స్వామికి ఇష్టంలేదని అతనికి తెలిసినప్పటికి, అతను దానినుండి బయటపడలేకపోయాడు. అందుకొరకు అతడు స్వామిని ఎన్నోసార్లు ప్రార్థించాడు కూడా! అయితే స్వామి అతనిని ఈ దురలవాటునుండి తప్పించడానికి ఒక ఆశ్చర్యకరమైన పద్ధతిని అవలంబించారు. ఆ వ్యక్తిదగ్గర ఉండే ఒక సిగరెట్ పెట్టెలోని సిగరెట్లు ఎప్పటికీ అయిపోకుండా ఉండేటట్లు చేశారు! ఇక ఈయన ఆనందంగా మూడు రోజులపాటు వరుసగా ఒకటి తరువాత ఒకటిగా ఆ పేకెట్టులోని సిగరెట్లు తీసి మనసారా కాల్చాడు! చివరకు, మూడవరోజు మాత్రమే ఆయన అసలు ఏమి జరుగుతోందో తెలుసుకోగలిగాడు. అక్షయపాత్రలా ఆ పేకెట్టులోంచి వచ్చే వందల సంఖ్యలోని సిగరెట్లను కాల్చడంద్వారా తన ఆరోగ్యమును సర్వనాశనం చేసుకోవడం ఎంతటి మూర్ఖత్వమో అప్పటికి గ్రహించగలిగాడు. అతనికి జ్ఞానోదయమైంది. ఆ క్షణం నుండి ఆ దురలవాటును శాశ్వతంగా వదిలిపెట్టేశాడు!

మహారాష్ట్రలోని సాంగ్లీ మరియు కొల్హాపూర్ లా కాలేజీలలో పనిచేసిన ప్రొఫెసరు అబ్దుల్ రజాక్ బాబూరావు కోర్బు మంచి లా టీచరుగా పేరుపొందారు. 1981వ సంవత్సరంలో భగవాన్ బాబావారు ప్రశాంతి నిలయంలో క్రొత్తగా స్థాపించిన విశ్వవిద్యాలయమునకు 14 డిపార్టుమెంట్లలో విజిటింగు ప్రొఫెసర్లు కావాలని ఆయనకు తెలిసి చాలా సంతోషించారు. ఆయన అప్పటికి నాలుగు సంవత్సరాలుగా ప్రశాంతి నిలయం వచ్చి భగవాన్ బాబావారి దర్శనం చేసుకుని వెడుతున్నారు. బాబా మాత్రం ఆయనతో మాట్లాడలేదు. నిజం చెప్పాలంటే భగవాన్ కేవలం ఒక్కసారి మాత్రమే ఆయనవైపు చూశారు. అది 1977లో జరిగింది. అయితే, ఆయన హృదయాన్ని ఆకట్టుకుని భగవాన్ బాబావారితో శాశ్వత బంధం ఏర్పరచుకోవడానికి ఆ ఒక్క చూపే సరిపోయింది. ఈ విషయాన్ని ఆయన మాటలలోనే చెప్పాలంటే "ప్రథమ వీక్షణంతోనే నేను భగవాన్ బాబావారిని ప్రేమించేశాను (Love at first sight). ఆయనంటే నాకు పిచ్చి ప్రేమ ఏర్పడింది". తాను జీవితంలో మురికివాడలలో నివసించే ఒక వీధి

బాలుని స్థాయినుండి గౌరవనీయుడైన ఒక ప్రొఫెసరుస్థాయికి ఎదగడానికి దోహదం చేసినది భగవాన్ బాబావారేనని ఆయనకు గట్టి నమ్మకం ఏర్పడింది.

ఇప్పుడు భగవాన్ విశ్వవిద్యాలయం నెలకొల్పడంతో ఆయన యొక్క విద్యా కార్యక్రమంలో సేవచేసే మహత్తరమైన అవకాశం ఆయనకు లభించడానికి మార్గము సుగమమైంది. ఇంక ఆయన ఆనందానికి అవధులు లేకపోయాయి. ఆయన కొల్హాపూర్ లా కాలేజీలో తాను పనిచేస్తున్న టీచరు ఉద్యోగానికి రాజీనామా చేసి శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలోని బిజినెస్ మేనేజిమెంటు విభాగములో మర్కంటైల్ లా బోధించడానికి విజిటింగు ప్రొఫెసరు ఉద్యోగానికి దరఖాస్తు పంపించారు. 1981వ సంవత్సరం మార్చి నెలలో ఆయన పుట్టపర్తి వచ్చినపుడు, సనాతన సారథి మాసపత్రికలో ప్రచురింపబడిన ఒక ప్రకటనకు జవాబుగా కేవలం 14 ఉద్యోగాలకు ప్రపంచమంతటినుండి వేలాదిమంది గొప్ప గొప్ప ప్రొఫెసర్లు దరఖాస్తులు పంపుకున్నారని ఆయనకు తెలిసింది. దాంతో ఆయన శ్రీ సత్యసాయి విశ్వవిద్యాలయములో బోధించే అవకాశము తనకు లభించడం గురించి పూర్తిగా ఆశ వదులుకున్నారు. నిరాశతో సాంగ్లీ తిరిగివచ్చేశారు.

ఇంతలో అదే సంవత్సరం ఏప్రిల్ నెల రెండవవారంలో శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలో బోధించడానికి అవకాశం కల్పిస్తూ, తాను ఉద్యోగంలో నియమింపబడినట్లు ప్రశాంతి నిలయంనుండి ఆయనకు ఒక ఉత్తరం వచ్చింది! దాంతో ఆయన ఆనందం పట్టలేక ఆఫీసునుండి నేరుగా ఇంటికి వెళ్ళి తన పడకగది తలుపులు మూసి మంచంపై కూర్చుని చిన్నపిల్లవానివలె వెక్కివెక్కి ఏడ్చేశారు. ఆ స్థితిలో తాను ఎంతసేపు ఉన్నారో ఆయనకే తెలియలేదు. తరువాత నెమ్మదిగా తేరుకుని అపూర్వమైన ఆ అవకాశం తనకు ప్రసాదించినందుకు భగవాన్ బాబావారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. అసలు ఇంటర్వ్యూకూడా లేకుండా తనను ఏవిధంగా ఎంపిక చేశారో ఆయనకు అర్థం కాలేదు. రెండు రోజుల తరువాత ఆయన ప్రశాంతి నిలయం వచ్చి

విశ్వ విద్యాలయ వైస్ ఛాన్సెలరు డా॥ వి.కె. గోకాక్‌ను కలుసుకున్నప్పుడు ఆయన సందేహం తీరింది.

డా॥ గోకాక్ పరిస్థితిని వివరిస్తూ "దానీ మటుకు అది ఒక ఆసక్తికరమైన కథే! ప్రొఫెసరు కోర్బా! ఈ ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన వేలాదిమంది అభ్యర్థులను ఇంటర్వ్యూ చెయ్యడం మాకు సాధ్యమైన పనేనా? మీరే చెప్పండి. అందువలన ఈ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేసే విషయంలో మాకు ఒక దారి చూపమని మేము భగవాన్ బాబావారిని ప్రార్థించాము. అందుకు సమాధానంగా భగవాన్ తానొక రోజున ఆఫీసుకు వచ్చి ఈ విషయం చూస్తానని చెప్పారు. అభ్యర్థులు దరఖాస్తులు పంపుకున్న కవర్లను వేటిని తెరచి చూడవలసిన అవసరం లేదని, అలాగే వారెవరిని ఇంటర్వ్యూకు పిలువవలసిన అవసరంకూడా లేదని భగవాన్ చెప్పారు. తాను చెప్పినట్లుగానే ఒకరోజు ఉదయం దర్శన కార్యక్రమం పూర్తయ్యాక స్వామి మా ఆఫీసుకి వచ్చారు. నేను ఆయనను అనుసరించాను. అప్పుడు స్వామి ఆ దరఖాస్తులన్నింటిని నేలపై పరచుమని ఆదేశించారు. మేము అలాగే చేశాము. అందులోనుండి ఆయన కేవలం 14 సెకన్లలో 14 దరఖాస్తులు పైకి తీసి "ఈ అభ్యర్థులు సెలక్టయ్యారు" అని చెప్పి వెళ్ళిపోయారు. తరువాత మేము స్వామి తీసిన 14 దరఖాస్తులు గల కవర్లను తెరచి చూస్తే వాటిలో వివిధ శాఖలలోని 14 ఉద్యోగాలకు

14 మంది అభ్యర్థుల దరఖాస్తులు ఉన్నాయి! స్వామి ఎంపికచేసిన అభ్యర్థులలో మర్కంటైల్‌లా బోధించడానికి మీరొకరు. స్వామి లీలలకు ఈ పాటికి మేము అలవాటు పడిపోయాము. ఈ పధ్నాలుగు దరఖాస్తులు తప్పించి మిగతా దరఖాస్తులుగల కవర్లు ఇప్పటికీ సీలు చేయబడే ఉన్నాయి", అని చెప్పారు. స్వామి తనపై చూపిన అపారమైన, అనూహ్యమైన అనుగ్రహమునకు శ్రీ కోర్బు హృదయం చలించిపోయింది. ఆయనకు నోట మాట రాలేదు. తరువాత ఇంక ఆయనకు రిజిస్ట్రారును కలుసుకోవలసిన అవసరం ఉన్నట్లు కనపడలేదు. అందువలన ఆయన కొల్హాపూర్ తిరిగి వెళ్ళిపోయారు. అదే సంవత్సరం

జూన్ నెలలో శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలో విజిటింగు ప్రొఫెసరుగా పనిచేయడానికి శ్రీ కోర్బు ప్రశాంతి నిలయం చేరుకున్నారు.

విజిటింగు ప్రొఫెసరుగా పనిచేసిన మొట్టమొదటి సంవత్సరంలో శ్రీ కోర్బుతో భగవాన్ బాబావారు ఒక్కమాటకూడా మాట్లాడలేదు. ఒక రోజు సాయంత్రం దర్శన సమయంలో భగవాన్ నేరుగా ఆయన వద్దకు వచ్చారు. అప్పుడు శ్రీ కోర్బు భగవాన్ బాబావారి దివ్య చరణారవిందములను స్పృశిస్తూ కృతజ్ఞతా పూర్వకమైన ఆనందబాష్పములతో ఆయన పాదాలను అభిషేకించారు. భగవాన్ ఆయనను "హౌ ఆర్ యు సర్?" (మీరు ఎలా ఉన్నారు?) అని పలకరించారు. ఆయన "ఐ యామ్ ఆల్‌రైట్, బాబా!" (నేను బాగానే ఉన్నాను బాబా!) అని సమాధానం చెపుతూ "Now....." అంటూ అర్థోక్తిలో ఆగిపోయారు. శ్రీకోర్బు ఆ వాక్యమును పూర్తిచేసే లోపుగానే భగవాన్ బాబావారు మళ్ళీ "I know, I will see you later" ("నాకు తెలుసు. నేను నిన్ను తరువాత చూస్తాను") అని చెప్పి వెళ్ళిపోయారు. ఆమాటకు శ్రీకోర్బు చాలా ఆనందించారు. ఆ మరునాడు వైస్ ఛాన్స్‌లర్ ఆయనను పిలిచి "స్వామికి మీరంటే చాలా ఇష్టం. మీరు చాలా బాగా పాఠాలు చెపుతారని మీ విద్యార్థులంతా చెప్పుకుంటున్నారు," అని చెప్పారు. దీంతో ఆయన ఆనందం రెట్టింపయ్యింది.

ఆ మరుసటి ఆదివారం సాయంత్రం భగవాన్ భక్తులందరికి దర్శనం ప్రసాదించిన తరువాత మందిరం వరండాలో కూర్చున్న శ్రీకోర్బువద్దకు నడిచి వచ్చి "అయ్యా! మీ పేరేమిటి?" అని అడిగారు. ఆయన "అబ్దుల్ రజాక్ స్వామీ!" అని బదులు చెప్పారు. స్వామి మళ్ళీ అబ్దుల్ అంటే అర్థమేమిటి?" అని అడిగారు. "ఒక భక్తుడని అర్థం బాబా" అని శ్రీకోర్బు సమాధానం చెప్పారు. భగవాన్ బాబా తిరిగి "రజాక్ అనే మాటకు అర్థం ఏమిటి?" అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేక శ్రీ కోర్బు తడబడ్డారు. అప్పుడు స్వామియే స్వయంగా "రజాక్ అంటే అల్లా అని అర్థం. సరే! అల్లా అంటే అర్థమేమిటి?" అని ప్రశ్నించారు. "బాబా! భగవంతుడు అని ఆ మాటలకు అర్థం" అని శ్రీకోర్బు

సమాధానం చెప్పారు. అప్పుడు స్వామి " అది సరియైన సమాధానం కాదు. అల్లా అనగా సర్వోన్నతమైనవాడు లేక అందరికంటె ఉన్నతమైన స్థానంలో ఉన్నవాడు అని అర్థం. పరమేశ్వరుడన్నా అదే అర్థం - పరమ+ఈశ్వరుడు. అల్లా అనే పదానికి, పరమేశ్వరుడనే పదానికి ఎటువంటి భేదము లేదు. ఆ సర్వోత్కృష్టమైన భగవంతుడే ఈ విశ్వముగా అవతరించాడు," అని ఆయనకు బోధపరచారు.

స్వామి ఇచ్చిన ఈ వివరణకు శ్రీకోర్బు ఆనందంతో పొంగిపోయారు. అప్పుడు భగవాన్ బాబావారు ఆయనను ఇంటర్వ్యూకొరకు లోపలికి పిలిచారు. జీవితంలో మొట్టమొదటిసారిగా తన ప్రభువు, సంరక్షకుడైన భగవాన్ బాబావారితో ఏకాంతంగా కొంచెం సమయం గడిపే అవకాశం లభించినందుకు శ్రీకోర్బు ఆనందంతో వెక్కివెక్కి ఏడ్చేశారు. భగవాన్ ఆయనను ఊరడిస్తూ " స్థిమితంగా కూర్చో; ఏడవకు. నేనుండగా నీకు భయమెందుకు? నువ్వు అబ్దుల్‌వి - నా అబ్దుల్‌వి. నేను నీ రజాక్‌ను. ఆ సంగతి నీకు బాగా తెలుసు," అని చెప్పి ఆయనలో ఆ క్షణంలోనే ఏకాత్మభావమును నెలకొల్పారు. ఆ మరునాడు మళ్ళీ భగవాన్ బాబావారు ప్రసాదించిన ఇంటర్వ్యూ శ్రీకోర్బు జీవితంలో ఒక మైలురాయిగా నిలిచింది. ఆ అనుభవాన్ని శ్రీకోర్బు ఈవిధంగా గుర్తు చేసుకొని వివరిస్తున్నారు.

"ఆరోజున స్వామి నాతోబాటు 9మంది విదేశీయులను కూడా ఇంటర్వ్యూకు పిలిచారు. కొంచెంసేపు ఏవో కొన్ని ఆధ్యాత్మిక విషయాలను గురించి వివరించాక, స్వామి నన్ను ప్రత్యేకంగా అక్కడ ఒక మూలగానున్న ఒక లోపలి గదిలోనికి తీసికొనివెళ్ళి 'నీకు నాయందు విశ్వాసమున్నదని నాకు తెలుసు. అయితే నా సంకల్ప సృష్టియందు మాత్రం నీకు నమ్మకం లేదు; అవునా?' అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు నేను నిర్ఘాంతపోయాను. కాని, గత ఐదు సంవత్సరాలనుండి నా హృదయంలో దాగివున్న ఆ సందేహమును ఆ క్షణంలో స్వామి వెలికి తీశారని మాత్రం తెలుసు. స్వామియే స్వయంగా ఈ

ప్రస్తావన తెచ్చినందుకు నేను చాలా సంతోషించాను. అప్పుడు నేను ఆయనతో 'నన్ను క్షమించండి బాబా! మీరు చెప్పింది అక్షరాల నిజం' అని చెప్పి అంగీకరించాను. అప్పుడు స్వామి మళ్ళీ చాలా మృదువుగా 'నాకు వస్తువులను సృష్టించగల శక్తి ఉన్నదా అనే విషయములో నీ సందేహము సరియైనదే! నీ నిజాయితీ, నిర్మొహమాట ధోరణి నాకు నచ్చాయి. నువ్వంటే నాకు చాలా ఇష్టం. ఏ విషయాన్నైనా కూలంకషంగా పరిశీలించకుండా వెంటనే ఒప్పేసుకోకూడదనే నీ పద్ధతి మంచిది. ఇక, ఇప్పుడు నీవు ఏమైనా కోరుకో! నేను వెంటనే ఇప్పుడే, ఇక్కడే దానిని సృష్టించి ఇస్తాను. ఫరవాలేదు, కొంచెం టైము తీసుకుని నీకేం కావాలో ఆలోచించి మరీ కోరుకో!' అని నన్ను ప్రోత్సహించారు.

నేను కొద్దిసేపు ఆలోచించి, బాబా భక్తులలో ఎక్కువమంది ముస్లిములు లేరన్న విషయం గమనించి, 'బాబా! విశ్వమంతటిని తనలో ఇముడ్చుకొన్నది, నేను అనుసరించే మతముయొక్క చిహ్నము దానిపై చిత్రింపబడినది అయిన ఏదైనా ఒక వస్తువును సృష్టించి యివ్వండి' అని స్వామిని కోరుదామని నిశ్చయించుకున్నాను. అప్పుడు బాబా నావైపు చూసి మృదు మధుర దరహాసంతో 'అబ్దుల్! నాకు అసాధ్యమైన కోరిక నేదో కోరానని నీవు అనుకుంటున్నావా?' అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నకు ఏమి సమాధానం చెప్పాలో తెలియక నేను నిశ్శబ్దంగా స్వామి వైపు తేరిపార చూస్తూ ఉండిపోయాను.

అప్పుడు బాబా తన కుడి అరచేతిని నాకు చూపిస్తూ 'నా అరచెయ్యి చూడు. అందులో నీకేమైనా కనిపిస్తోందా? నా అరచేతిలోగాని, దాని వెనుకగాని ఏమీలేదు. నీవే స్వయంగా పరీక్షించి చూచుకోవచ్చు' అని చెప్పి తన అరచేతిని బోర్లించారు. ఆయన తొడుక్కున్న అంగీయొక్క చేతి భాగముకూడా మోచెయ్యివైకి మడిచి ఉంది. స్వామి నన్ను తన చెయ్యి పట్టుకుని పరీక్షించుమని చెప్పినా నేను అందుకు సాహసించలేదు. అప్పుడు స్వామి తనంతట తానే నా అరచేతిని గట్టిగా పట్టుకుని దానితో నేను తన మోచేతి నుండి క్రిందివరకు పూర్తిగా

తడిమేలా చేశారు. తరువాత ఆయన 'అబ్దుల్! నా అరచేతి మధ్య భాగముపై కొంచెంసేపు నీ దృష్టిని నిలిపి ఉంచు', అని నన్ను ఆదేశించారు. ఆ విధంగా నేను స్వామి అరచేతి మధ్యభాగమును తేరిపార చూస్తూండగా కొద్దిక్షణాలలోనే ఆయన అరచేతిలోని చర్మము తెరుచుకుని దాని మధ్య నుండి ఒక గుండ్రని వస్తువేదో బయటకి రావడం కనిపించింది. ఇంతలోనే అరచేతి చర్మము మామూలుగా అయిపోయి అరచేతినుండి తళతళ మెరుస్తున్న ఒక ఉంగరం జారి క్రింద పడింది. అప్పుడు బాబా 'ఆ ఉంగరాన్ని చేతిలోనికి తీసుకుని జాగ్రత్తగా పరిశీలించి మళ్ళీ నాకు ఇచ్చెయ్యి' అని నాతో చెప్పారు. స్వామి చెప్పినట్లుగా నేను ఆ ఉంగరమును చాలా జాగ్రత్తగా పరిశీలించి చూచేటప్పటికి ఆ బంగారు ఉంగరముపై చంద్రవంక, నక్షత్రము చెక్కబడి ఉండడం కనిపించింది. ఆ ఉంగరాన్ని నేను బాబాకు తిరిగి ఇచ్చివేస్తూ 'బాబా! ఈ ఉంగరం విషయం నాకేమీ బోధపడటం లేదు. దయచేసి నాకు కొంచెం వివరంగా చెప్పండి,' అని అడిగాను.

బాబా నవ్వి 'నువ్వు పుట్టుకచే మాత్రమే ముస్లిమువి. కాని, ఇస్లాం గురించి నీకేమీ తెలియదు,' అని వ్యాఖ్యానించారు. నిజమే! నాకు నా మతంగురించే ఎక్కువగా తెలియదు. అంతేకాకుండా, నిజం చెప్పాలంటే నేను ఎక్కువగా మతాచారాలు పాటించే వ్యక్తిని కూడా కాను. అప్పుడు బాబా 'నేను ఈ ఉంగరమును నవరత్నములు పొదగబడిన అష్టకోణములు గలదిగా సృష్టించాను. ఈ రెండు లక్షణాలుకూడా విశ్వమును సూచిస్తాయి. ఆ నవరత్నములమధ్య ఇస్లాంమత చిహ్నమైన చంద్రవంకను, నక్షత్రమును పచ్చని మరకతములతో సృష్టించాను. ఈ పచ్చని రాళ్ళు కూడా ఇస్లాం మత చిహ్నములే! ఇప్పుడు నేను ఈ ఉంగరమును నీ ఎడమచేతి ఉంగరం వ్రేలికి పెడతాను. ఎందుచేతనంటే నీ కుడిచేతి వ్రేళ్ళు దెబ్బతిన్నాయి కదా!' అని చెప్పారు.

నేను ఆశ్చర్యంతో నా కుడిచేతి వ్రేళ్ళను ఒకసారి చూచుకున్నాను. బాబా చెప్పిన మాట నిజమే! నా కుడిచేతి వ్రేళ్ళు దెబ్బతిని ఉంగరం పెట్టుకోవడానికి అనుకూలంగా లేవు. తరువాత భగవాన్ బరువైన, తళతళ మెరుస్తున్న ఆ

ఉంగరమును నా ఎడమచేతి ఉంగరం వ్రేలికి తొడిగారు. అది, ఆర్డరిచ్చి చేయించినట్లు సరిగ్గా సరిపోయింది. మేము ఇద్దరం మళ్ళీ ఇంటర్వ్యూ గదిలోనికి రాగానే భగవాన్ బాబా అక్కడ వేచియున్న విదేశీయులకు ఈ ఉంగరమును గురించి, స్వామియొక్క సంకల్ప సృష్టియందు నాకు నమ్మకం లేకపోవడాన్ని గురించి వివరించి చెపుతూ 'ఆయన చాలా చిలిపి (naughty), గట్టి (knotty), భక్తుడు', అని వ్యాఖ్యానించారు.

మందిరంనుండి బయటకు వచ్చిన తరువాత, అమెరికా దేశమునకు చెందిన ఒక ముస్లిం భక్తుడు భగవాన్ ప్రసాదించిన ఆ ఉంగరమును చూచి ఉంగరంమధ్యలో ఉన్న పచ్చని మరకతంపైన అరబిక్ భాషలో 'అల్లా' అనే పదము చెక్కబడియున్నదని నాకు చూపించాడు. అంతవరకు నేను కూడా ఆ విషయమును గమనించలేదు".

శ్రీ ఫిలిప్ మేథ్యూ ప్రసాద్ కేరళ రాష్ట్రములోని పాల్‌ఘాట్‌కు చెందిన ఒక గొప్ప దైవభక్తి గల కుటుంబములో జన్మించారు. ఆ పట్టణములో మతసామరస్యముతో నిండిన వాతావరణంలో పెరగడం వలన, చిన్నప్పటినుండి ఆయనలో అన్ని మతములలోని మౌలికమైన ఆధ్యాత్మిక, నైతిక విలువలను గురించిన అవగాహన పెంపొందింది. ఇంతలో 15 సంవత్సరాల వయసులో కాలేజీ చదువుకొరకు త్రివేండ్రంకు మకాం మార్చడంతో ఆయన దృక్పథంలో ఆకస్మికమైన మార్పు చోటు చేసుకుంది. అక్కడ ప్రచండంగా వీస్తున్న మార్క్స్ ఆలోచనా విధానపు పెనుగాలులు ఆయనలో అంతవరకు నెలకొన్న దైవభక్తిని కూకటివ్రేళ్ళతో సహా పెకలించివేశాయి. ఫలితంగా ఆయన పరమ నాస్తికుడుగా మారిపోయారు. 17 సంవత్సరాలు వచ్చేటప్పటికి మార్క్సిస్టు విద్యార్థి ఉద్యమానికి నాయకుడై ఆ మరుసటి సంవత్సరంలో మార్క్సిస్టు పార్టీలో సభ్యునిగా చేరిపోయారు. ఆ తరువాత 21 సంవత్సరాల వయసులో ఆయన చదువు విడిచిపెట్టేసి నక్సలైటు ఉద్యమంలో చేరారు. 1968వ సంవత్సరంలో కలకత్తా నగరంలో ప్రప్రథమంగా స్థాపించబడిన అఖిలభారత నక్సలైట్ల కమిటీలో ఆయన

ఒక వ్యవస్థాపక సభ్యునిగా కూడా చేరారు. అనతి కాలంలోనే ఆయన పోలీసులతో అనేక సాయుధ పోరాటాలలో పాల్గొన్నారు. కేరళలోని కొండప్రాంతాలలో నివసించే ప్రజల సంక్షేమం కొరకు ఉద్యమాలు నడుపుతూ భూస్వాములపై దాడిచేస్తూ వారి ఆస్తులను దోచుకోవడం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ఆవిధంగా ఆయన ఒక సుడిగుండంలో చిక్కుకున్నారు. ఫలితంగా ఒక సంవత్సర కాలంలోనే జైలు పాలయ్యారు.

శ్రీ ఫిలిప్ 1973వ సంవత్సరంలో కోజికోడ్‌లోని జిల్లా జైలులో తన గదిలో ఒంటరిగా ఉన్నప్పుడు ఆయన అంతరంగములో తీవ్రమైన సంఘర్షణ ప్రారంభమైంది. అప్పుడు ఆయన మానవజీవితంలో ఎదురయ్యే ప్రాథమిక సమస్యలను గురించి తీవ్రంగా ఆలోచించడం మొదలుపెట్టారు. ఆయన అంతరాత్మ ఆధ్యాత్మికపరమైన గాఢ అనుభూతికొరకు రాత్రింబగళ్ళు అనేక విధాల తపించింది. తాను ఎంచుకున్న సిద్ధాంతము మరియు దానిని సాధించుటకు అవలంబించిన మార్గము తలుచుకుని ఆయన భ్రమలన్నీ తొలగిపోయాయి. జీవితంలో అత్యంత క్లిష్టపరిస్థితులను ఎదుర్కొంటున్న ఆ తరుణంలో తాను చిన్నతనంనుండి నమ్మిన, ప్రార్థించిన భగవంతుడు మాత్రం ఆయనను విడిచిపెట్టలేదు. జైలులో ఆయన నిర్బంధింపబడిన సెల్‌కు సరిగ్గా ఎదుటనే స్థానిక శ్రీ సత్యసాయి సేవా సంస్థ సభ్యులు భజనలు నిర్వహించేవారు. సుమారు ఒక గంటసేపు కొనసాగే ఆ భజనలను చూసి, విని ఆయన చాలా చికాకుపడేవారు. దానికి కారణం ఆధ్యాత్మిక విషయాలపైన ఆయన పెంచుకున్న వ్యతిరేక భావమే. భజన పూర్తవ్వగానే ఒక వలంటీరు ఆయన సెల్‌వద్దకు వచ్చి ఇనుప ఊచలగుండా ఆయనకు ఒక కమలా ఫలమును ప్రసాదంగా అందించేవాడు. ఈ చర్యకు శ్రీ ఫిలిప్‌కు చాలా కోపం వచ్చి ఒకసారి ఆ పండును ఆ వలంటీరుపైననే గిరవాటు వేశారు. అది ఆ వలంటీరుయొక్క తల వెనకభాగమునకు తగిలి అతడు వెనుకకు తిరిగి ఫిలిప్‌వైపు చూశాడు. ఆ చూపులో ఎటువంటి కోపంగాని, భయంగాని లేదు. తరువాత ఆ వలంటీరు నెమ్మదిగా బయటకు వెళ్ళిపోయాడు. ఆ సంఘటనను గురించి ఫిలిప్‌లో

అంతర్మథనం ప్రారంభమై ఆయన నైతికపరమైన తీవ్ర సందిగ్ధావస్థలో చిక్కుకున్నారు.

ఒకరోజు రాత్రి ఆయన తన మనసును తూట్లుపొడుస్తున్న ఆవేదనను భరించలేక మనస్థైర్యము కోల్పోయి గట్టిగా ఏడవడం మొదలుపెట్టారు. చివరకు ఆయనలో భగవంతుని ప్రార్థించాలనే ఆపుకోలేని కోరిక బయల్వెడలింది. వెంటనే తాను చిన్నతనంలో తన తల్లినుండి నేర్చుకున్న, జీసస్ తన శిష్యులకు నేర్పిన 'లార్డ్స్ ప్రేయర్' (Lord's Prayer) గుర్తుకు తెచ్చుకుని ఆ విధంగా ప్రార్థించారు. ఆ ప్రార్థనా సమయంలో ఆయన ఒకే ఒక వరం – తనకు నిద్రను ప్రసాదించుమని – కోరుకున్నారు. భగవంతుడు ఆయన మొరాలకించాడు. వెంటనే ఆయన పశ్చాత్తాపంతో నిండిన అశ్రుధారలతో తడిసిన బెడ్‌షీట్‌పై వ్రాలి కొద్దిక్షణాలలోనే ప్రశాంతమైన గాఢనిద్రలోకి జారుకున్నారు.

ఆ రోజు రాత్రి భగవంతుడు ఆయనకు తిరిగి ప్రసాదించిన భగవద్విశ్వాసమనే కానుక ఆయన జీవితాన్నే పూర్తిగా మార్చివేసింది. ఆ తరువాత నాలుగు సంవత్సరాలపాటు ఆయన జైలులో హిందూ, క్రైస్తవ, ఇస్లాం, బౌద్ధ మతములకు చెందిన గ్రంథములను అధ్యయనం చేస్తూ ప్రార్థన, నామస్మరణ, ధ్యానములలో గడిపారు. వివిధ మతములు, మత విశ్వాసములు కలసి మనుగడ సాగించే వర్తమాన సామాజిక పరిస్థితులలో జీవనదివంటి భారతీయ సంస్కృతిలో మార్క్స్ సిద్ధాంతములు ఎంతవరకు కలసిపోగలవు అనే విషయమును పరిశోధిస్తూ శ్రీ ఫిలిప్ భగవద్గీతలోని సందేశమును లోతుగా అధ్యయనం చేశారు. అలా చాలా సంవత్సరాలు గడిచినాక, ఆయన అన్వేషణ ఫలించి ఆధునిక భారతదేశములో మతసామరస్యమును కాపాడిన రక్షకునిగా కీర్తింపబడిన శ్రీ షిరిడీ సాయిబాబా బోధలవైపు ఆయన ఆకర్షితులైనారు. వెంటనే ఆయనకు తెలియకుండానే ఆయన మనస్సులో కరుణామూర్తియైన శ్రీ షిర్డీసాయిబాబాతో అనుబంధము ఏర్పడింది.

చివరకు శ్రీ ఫిలిప్ తన శిక్షా కాలమును పూర్తిచేసుకుని జైలు నుండి బయటకు వచ్చాక లాయరు వృత్తిని చేపట్టి, ఒక రాజకీయ కార్యకర్తగా, సంఘసేవకునిగా సమాజంలోని బడుగువర్గాల ఉద్ధరణకు అంకితమయ్యారు. ఆ సందర్భంగా ఆయనకు బడుగువర్గాల ఉన్నతికి నడుంకట్టిన నాయకుడు మరియు శ్రీ నారాయణ గురువుకు శిష్యుడు, సన్యాసి అయిన స్వామి ఆనందతీర్థతో పరిచయం ఏర్పడింది. శ్రీ ఫిలిప్‌తో కలసి పనిచేస్తున్న రోజులలో ఒక సందర్భంలో శ్రీ ఆనందతీర్థ అనారోగ్యం పాలయ్యారు. అప్పుడు ఆ స్వామీజీ తన గురువైన శ్రీ నారాయణగురు వారి జన్మస్థలమైన చెంపళంతి (Chempazhanti)కి తీసికొని వెళ్ళమని కోరారు. అది, త్రివేండ్రంకు కొద్దిమైళ్ళ దూరంలో ఉన్నది. అప్పట్లో శ్రీ ఆనందతీర్థ లేచి నాలుగడుగులైనా వేయలేని స్థితిలో ఉన్నారు. అందువలన, వాళ్ళిద్దరూ కలసి కారులో వెళ్ళారు. ఆ స్థలమునకు చేరుకోగానే శ్రీ ఆనందతీర్థ ఉత్సాహంతో ఉరకలు వేస్తూ మందిరంచుట్టూ ఆనందంగా భక్తిపూర్వకమైన కన్నీరు కారుస్తూ ప్రదక్షిణలు చేశారు.

ఈ సంఘటనద్వారా శ్రీ ఫిలిప్ గురుభక్తియొక్క శక్తిని తెలుసుకోగలిగారు. ఆనాటినుండి ఆయన హృదయం సద్గురువు కొరకు పరితపించడం మొదలుపెట్టింది. స్వామి ఆనందతీర్థ రెండుసార్లు ప్రశాంతి నిలయమును సందర్శించారు. ఆయనకు భగవాన్ బాబావారియందు గొప్ప భక్తి, గౌరవములు ఉన్నాయి. భగవాన్ బాబావారినిగురించి ఆయన చేసిన గౌరవపూర్వకమైన వ్యాఖ్యలు శ్రీ ఫిలిప్‌పై గొప్ప ప్రభావమును చూపించాయి. దానితోబాటు ఆయన శ్రీ హోవర్డు మర్ఫెట్ వ్రాసిన "సాయిబాబా, అద్భుతమూర్తి" (Sai Baba, The Man of Miracles) అనే పుస్తకమును కూడా చదివారు. ఈ రెండూ కలసి ప్రశాంతి నిలయానికి ఆయన ప్రస్థానమునకు మార్గము సుగమం చేశాయి. మానసికంగా ఆయనను అందుకు సిద్ధం చేశాయి. చివరకు, 1984వ సంవత్సరంలో క్రిస్మస్ పర్వదినానికి మరునాడు సాయి ప్రభువు నుండి ఆయనకు చాలా అనూహ్యమైన రీతిలో పిలుపు వచ్చింది. అంతకు రెండు

రోజులముందు తన లాయరు గౌను, కేసులకు సంబంధించిన ఫైల్సు ఉన్న పెట్టెను ఆయన నగరంలోని తన తండ్రి ఇంటిలో మరచిపోయి వచ్చేశారు. ఆయన డిశంబరు 26వ తేదీ సాయంత్రం ఆ పెట్టెను తీసికొని శ్రీ ఫిలిప్ ఇంటికి వచ్చారు. శ్రీ ఫిలిప్ ఆ పెట్టెను తెరచేటప్పటికి అందులోనుండి శ్రీ షిర్డీసాయిబాబావారి రూపము ముద్రింపబడిన ఒక ఉంగరము చప్పుడుచేస్తూ క్రిందకు జారిపడింది. ఈ ఉంగరాన్ని పైకి తీసి తన వ్రేలికి పెట్టుకుంటే ఆర్డరిచ్చి చేయించినట్లు సరిగ్గా సరిపోయింది!

ఆ దివ్యానుభూతిని శ్రీ ఫిలిప్ మాటలలోనే వర్ణించాలంటే "ఆ ఉంగరమును చూడగానే నేను పరమానందభరితుడనయ్యాను. ఆ ఆనందానుభూతి మూడు రోజులపాటు నా శరీరంలో అణువణువునా వ్యాపించి ఉంది. ఇకపై భగవంతుడంటే నా దృష్టిలో మానవుని మేధాశక్తికి మాత్రమే పరిమితమైన తత్త్వ విచారణ కాదు. ఆ క్షణంనుండి నాకు భగవంతుడు ప్రత్యక్షంగా నా కళ్ళ ఎదుట నడయాడే దైవము". అయితే, ఆ మూడురోజులు గడిచిన తరువాత శ్రీ ఫిలిప్‌యొక్క సంశయాత్మక మనస్సులో మళ్ళీ అశాంతి, ఆందోళన మొదలైనాయి. తన పరిస్థితిని వర్ణిస్తూ శ్రీ ఫిలిప్ "బాబావారి సందేశమును వ్యాప్తిగావించే ఉద్దేశంతో ఎవరైనా మితిమీరిన ఉత్సాహవంతుడైన భక్తుడు ఆ ఉంగరమును నా పెట్టెలో ఉంచాడేమోనని నా మనసులో ఒక మూల సందేహము. కొట్టుమిట్టాడుతోంది. దాంతో నేను త్రివేండ్రం నగరంలో అటువంటి వస్తువులు అమ్మే షాపులన్నీ తిరిగి ఆ ఉంగరాన్ని పోలిన ఉంగరం ఎక్కడైనా దొరుకుతుందేమోనని చూచాను. అయితే, నా ప్రయత్నాలేవీ ఫలించలేదు. అందుకు నేను విచారించలేదు. పైగా సంతోషించాను కూడా!" అని చెప్పారు.

అనతికాలంలోనే శ్రీ ఫిలిప్ ప్రశాంతి నిలయం వెళ్ళి తన ప్రభువైన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దర్శనం చేసుకున్నారు. అయితే అక్కడకూడా ఆయన మనసులో గూడుకట్టుకునియున్న అపరాధ భావము, ఇతరులు తనను

అనుమానంతో చూస్తున్నారనే సంశయము వేధించి ప్రశాంతంగా, సంతోషంగా ఉండలేకపోయారు. ఎట్టకేలకు, 1985వ సంవత్సరంలో ప్రశాంతి నిలయంలో ఓణంపండుగ సందర్భంగా జరిగిన ఉత్సవ సమయంలో భగవాన్ బాబావారు ఆయనను కరుణించి ఆయన మనసుకు ప్రశాంతతను ప్రసాదించారు. ఆ రోజున స్వామి ఆయనకు ప్రసాదించిన మొట్టమొదటి ఇంటర్వ్యూ ఆయన జీవితానికి ఒక అర్థము, పరమార్థము చూపించింది.

నిర్మలమైన ఆ దివ్యానందానుభూతిని వర్ణిస్తూ శ్రీ ఫిలిప్ "ఆ రోజున స్వామి నాలోని లోపాలను, గుణగణాలను ఏవీ ఎంచకుండా నన్ను యథాతథంగా స్వీకరించారు. ఎట్టి షరతులు లేకుండా స్వామి నన్ను ఆవిధంగా స్వీకరించడం నాకు ఎంతో ఆనందమును చేకూర్చింది. 45 నిమిషాలపాటు కొనసాగిన ఆ ఇంటర్వ్యూలో స్వామి వరుసగా ఏడుసార్లు నన్ను 'నీ మనస్సులో ఎటువంటి శంక పెట్టుకోకు. పరిశుద్ధమైన నీ చిత్తమును అపరాధ భావముతో కళంకితం చేయకు', అని అనునయించారు. నేను ఆయనకు ఏకైక స్నేహితుడనైనట్లు, ఈ ప్రపంచం మొత్తంమీద ఆయనతో స్నేహమునకు అర్హుడైన వ్యక్తి నేనొక్కడనే అన్నట్లు ఆయన నాతో వ్యవహరించారు. ఆయన మాటలద్వారా నాలో ఎంతో ఆత్మవిశ్వాసము పెరిగింది. అంతకుముందు ఎవరూ కూడా, ఆఖరికి నా తల్లికూడా ఈవిధంగా నన్ను చేరదీయలేదు. ప్రపంచం నన్ను బాగుపరచి ఆ తరువాతనే నన్ను చేరదీయాలనుకుంది. కాని, స్వామి మాత్రం నన్ను యథాతథంగా స్వీకరించి ఆదరించారు. ఈ ఆప్యాయతవలన నాలో ఆనందబాష్పాలు పొంగిపొరలి నేను ధరించిన దుస్తులను, స్వామి యొక్క అంగీని కూడా తడిపివేశాయి. అప్పుడు స్వామి తన చేతిరుమాలుతో నా కన్నీటిని తుడిచి, విభూతి సృష్టించి నా నోట్లో వేశారు".

తరువాత భగవాన్ బాబావారు పచ్చరాయి పొదిగిన ఒక బంగారు ఉంగరమును సృష్టించి శ్రీ ఫిలిప్‌కు ఇస్తూ అప్పటికే ఆయన వ్రేలికి ఉన్న ఉంగరంవైపు చూసి చమత్కారంగా "ఆ ఉంగరం షాపులో దొరుకుతోందా?" అని ప్రశ్నించారు. బాబా తన సంశయాత్మక స్వభావమును ఎత్తి చూపుతూ

తనను ఆటపట్టిస్తున్నారని శ్రీ ఫిలిప్‌కు అర్థమైపోయింది. శ్రీ ఫిలిప్‌తోబాటు ఆయన కుటుంబ సభ్యులందరికి భగవాన్ బాబా కొన్ని వస్తువులు సృష్టించి కానుకగా ప్రసాదించారు. మూడు సంవత్సరాల ఆయన కుమారునికి ముత్యాలు పొదగబడిన బంగారు శిలువను సృష్టించి యిచ్చారు. ఆయన కుమార్తెకు ఒకవైపు బాబా రూపము, రెండవవైపు ఏసుక్రీస్తు రూపముగల లాకెట్‌ను సృష్టించి యిచ్చారు. ఇక ఆయన భార్య కొరకు శ్రీ షిర్డీసాయిబాబావారి ముఖచిత్రము, దాని క్రింద "Why fear when I am here?" ("నేనుండగా నీకు భయమెందుకు?") అనే వాక్యము చెక్కబడిన ఒక లాకెట్‌ను సృష్టించారు.

ఆ ఇంటర్వ్యూ తరువాత శ్రీ ఫిలిప్ కేరళ రాష్ట్రములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య సందేశమును వ్యాప్తిచేసే మంచి కార్యకర్తగా మారారని వేరే చెప్పనవసరంలేదు. రచయితగా, మంచి వక్తగా ఆయనకు గల ప్రతిభ మరియు ప్రజా సంక్షేమమునందు ఆయనకు గల అమితోత్సాహము భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి అవతార కార్యక్రమంలో పాలుపంచుకోవడంద్వారా ఫలప్రదమయ్యాయి. ఒకసారి ఆయన కేలికట్ జిల్లాలో సేవా కార్యక్రమాలలో పాల్గొంటున్నప్పుడు తన జీవితంలో అసలైన మార్పు తన ప్రభువైన (Master) భగవాన్ బాబావారు ప్రసాదించిన మొట్టమొదటి ఇంటర్వ్యూ కాదని, తన ప్రభువుయొక్క అత్యంత సామాన్య సేవకులు (A humble servant of his Master) ఒకరిపై చాలా సంవత్సరాలక్రితం తాను ఒక కమలాపండును విసిరివేసినప్పుడే సంభవించిందని తెలుసుకున్నారు. ఆనాటి సంఘటనను ఆయన ఈ విధంగా గుర్తు చేసుకున్నారు :

"ఒకసారి కేలికట్ జిల్లా శ్రీ సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు నన్ను నగరంలోని టౌన్‌హాలులో క్రిక్కిరిసిన జనసమూహం ఎదుట భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిని గురించి ప్రసంగించుమని కోరారు. ఆ ఉపన్యాసంలో నేను జైలులో ఖైదీగా ఉన్న సమయంలో అక్కడ సత్యసాయి భజనమండలివారు నిర్వహిస్తున్న భజన కార్యక్రమంలో నా కిష్టం లేకపోయినా తప్పనిసరిగా పాల్గొనవలసివచ్చిన తీరు, ఆ తరువాత నేను చాలా కోపంగా ప్రతిస్పందించిన

విషయం గురించి ప్రస్తావించాను. నా ఉపన్యాసం పూర్తయిన తరువాత ఒక వృద్ధుడు నావద్దకు వచ్చి నన్ను తప్పనిసరిగా అక్కడికి దగ్గర్లోనే ఉన్న తన ఇంటికి ఒకసారి వచ్చి వెళ్ళవలసిందని కోరాడు. ఆయన పేరు శ్రీ శంకర అయ్యర్. ఆయన హోల్‌సేల్ పూల వ్యాపారి, చాలా దశాబ్దాలకు పూర్వము నుండి భగవాన్ బాబావారి భక్తుడు. నేను ఆయన ఇంటికి వెళ్ళగానే నాకు ఒక కప్పు కాఫీ యిచ్చాడు. నేను కాఫీ త్రాగడం పూర్తయ్యాక ఆయన కళ్ళనీళ్ళు పెట్టుకుంటూ తన కథను వివరించాడు.

ఆ రోజున జైలులో కమలాపండును విసిరివేసినది శ్రీ శంకర అయ్యర్ పైననే! ఆ కమలాపండు తనకు తగలగానే ఆయనకు నాపై కోపానికి బదులు జాలి కలిగింది. వెంటనే ఆయన 'స్వామీ! ఈ అమాయక బాలునిపై నీ దయామృతమును వర్షించు. అతనిలో పరివర్తన కలుగజేసి అతను సంతోషంగా ఉండేటట్లు చెయ్యి. నీ అనుగ్రహంవల్ల ఏదో ఒక రోజున అతనిని మా ఇంటికి పిలిచి ఒక కప్పు కాఫీ ఇవ్వాలని ఉంది', అని భగవాన్ బాబావారిని ప్రార్థించాడు. స్వామి శ్రీ శంకర అయ్యర్ ప్రార్థనలు మన్నించి నన్ను రక్షించారు. బహుశా ఆ సమయంలోనే నా జీవితం మలుపు తిరిగి నేను కోల్పోయిన భగవద్విశ్వాసమును తిరిగి సంపాదించుకోగలిగాను. నేను శ్రీ శంకర అయ్యర్‌పై కమలాఫలమును విసిరిన ఆ జైలుగదినుండే సుదీర్ఘమయిన నా ఆధ్యాత్మిక యాత్రకు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు పచ్చజెండా ఊపి ప్రారంభం చేశారు.

అర్జెంటినా దేశమునకు రాజధానియైన బ్యూనస్ ఎయిర్స్ నగరములో నడుపబడుతున్న 'రాజయోగ ఆధ్యాత్మిక కేంద్రము' (Rajayoga Spiritual Organisation) లో సభ్యురాలైన ఒక స్త్రీద్వారా 1981వ సంవత్సరములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిని గురించి శ్రీ లియొనార్డో పి. గట్టర్ మొట్టమొదటిసారిగా తెలుసుకున్నారు. ఆయన ఆ సంస్థకు వైస్ ప్రెసిడెంటుగా పనిచేస్తుండేవారు. ఆమె భగవాన్ బాబావారిని గురించి ఏవిధంగా

తెలుసుకున్నది అనేది చాలా విభ్రాంతిని కలిగించే కథ. ఆమె ఒకసారి భారతదేశము వెడుతూ దారిలో లండన్‌లో కొన్ని రోజులు ఆగింది. ఒక రోజున ఆమె అక్కడ ఒక లైబ్రరీకి వెళ్ళి ఒక అలమారులో పేర్చబడిన పుస్తకాలను చూస్తూండగా పై అరనుండి ఒక పుస్తకం జారి ఆమె తలపై పడింది! అది భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారినిగురించి వ్రాయబడిన పుస్తకం. ఆ పుస్తకం చదువుతూండగా ఆమెకు బాబాను సందర్శించాలనే తీవ్రమైన కోరిక కలిగింది. అనుకున్నట్లుగానే ఆమె భారతదేశం వచ్చి ప్రశాంతి నిలయంలో స్వామి దర్శనం చేసుకుంది. అప్పుడు స్వామి ఆమెకు ఇంటర్వ్యూ ప్రసాదించారు. బ్యూనస్ ఎయిర్స్‌కు తిరిగి వచ్చిన తరువాత ఆమె తన సంస్థలోని సభ్యులకు భగవాన్ బాబావారిని గురించి చాలా ఉత్సాహంగాను, ఉద్రేకంగాను వివరించింది. ఆయన సాక్షాత్తూ అవతారపురుషులని, మానవజాతి తన ఆగమనం కొరకు నిరీక్షిస్తున్న 'మెస్సెయా' ((Messiah అనగా 'రక్షకుడు') అని వర్ణించింది. ఆ ఉపన్యాసం, శ్రీ లియొనార్డోను నగరంలోని కొందరు సాయి భక్తులు ఏర్పాటు చేసుకునే సమావేశాలలో పాల్గొనేటట్లు ఉత్సాహపరిచింది. అయితే, అంతమాత్రంచేత ఆయన తనను సాయిభక్తునిగా భావించుకోలేదు.

కొన్నాళ్ళ తరువాత భగవాన్ బాబావారు శ్రీ లియొనార్డోకు స్వప్నములో దర్శనమిచ్చారు. ఆ సమయంలో ఆయన తన స్నేహితులు కొందరితో కలసి ఒక గదిలో కూర్చుని మాట్లాడుతున్నారు. ఇంతలో బాబా అక్కడ తలుపుదగ్గర ప్రత్యక్షమై లోపలికి నడిచివచ్చారు. అప్పుడు లియొనార్డో తనలో తాను "బాబా నిజంగా అవతారపురుషులే అయితే ఆయన నన్ను సమీపించినప్పుడు నాలో ఏదో అనిర్వచనీయమైన అనుభూతి కలగాలి" అని అనుకున్నారు. సరిగ్గా అదే జరిగింది. భగవాన్ బాబావారు ఆయనను సమీపిస్తూండగా ఆయనలో ఒక అద్భుతమైన నమ్మశక్యంగాని అనుభూతి కలిగింది. ఆయన మాటల్లోనే చెప్పాలంటే "నా సూక్ష్మ శరీరములోని అణువణువునా ఏదో దివ్య చైతన్యం ప్రవహిస్తున్నట్లనిపించింది. ప్రతి ఒక్క క్షణం ఆనందానుభూతిలో నిండిన శక్తితో పొంగిపొరలుతున్నట్లు అనిపించింది. ఇంతకాలం ఆధ్యాత్మికాన్వేషణలో నేను

ఎదురుచూస్తున్న దివ్యానందము ఒక్క త్రుటికాలంలో నా స్వంతమైంది! నా శరీరములో నఖశిఖ పర్యంతం దివ్య చైతన్యము మరియు ఆనందముతో నిండిన కెరటాలు ఉవ్వెత్తున లేచాయి". ఆ అనుభూతితో ఆయన శరీరంలో పట్టుతప్పి నేలకూలారు. అయితే, ఆయన పూర్తి చేతనావస్థలోనుండి దివ్యమైన ఆనందాబ్ధిలో ఓలలాడుతున్నారు. అప్పుడు బాబా తలుపువైపు నడిచివెళ్ళడం చూచి తనలో తాను "బాబా! మీరు సాక్షాత్తూ భగవంతుడే!" అని పదేపదే ఉచ్చరించడం మొదలుపెట్టారు. ఇంతలో బాబా వెనుదిరిగి ఆయనవద్దకు వచ్చి ఆయనను లేవనెత్తి తలపై తడుతూ ఆశీర్వదించారు. దాంతో ఆయన కల చెదరిపోయింది. ఆయనకు మెలకువ వచ్చింది. ఆ స్వప్నము ఆయనలో భగవాన్ బాబావారిని ప్రత్యక్షంగా దర్శించుకోవాలనే తీవ్ర ఆకాంక్షను రేకెత్తించింది. ఆ కారణంగా ఆయన భారతదేశము వెళ్ళే కొందరు భక్తుల బృందములో చేరి వారితో కలసి 1982వ సంవత్సరము జనవరి నెలలో మద్రాసు వచ్చి అక్కడ ప్రప్రథమంగా భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్నారు.

భగవాన్ బాబావారు ప్రశాంతి నిలయమునకు తిరిగి వచ్చేటప్పుడు ఆ అర్జెంటీనా భక్త బృందముకూడా ఆయన వెంట వచ్చి స్వామితో ఇంటర్వ్యూకొరకు ఆత్రుతతో ఎదురుచూడసాగారు. వాళ్ళు ప్రశాంతి నిలయంవచ్చి 34 రోజులు గడిచిపోయాయి. కాని, ఇంటర్వ్యూ లభించలేదు. ఆ బృందములో కొందరు నిరాశ చెందారు కాని, శ్రీలియొనార్డో మాత్రం భగవాన్ బాబావారు తన భక్తులను నిరాశ పర్చరనే ధైర్యంతో ఉన్నారు. మిగిలిన వారివలె నిరాశతో క్రుంగిపోవడానికి బదులు ఆయన తన అంతరంగములో ఆత్మ పరిశీలన చేసుకోవడం మొదలుపెట్టారు. ఆ రోజు రాత్రి ఆయన "నేను భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిని యుగావతారిగా గుర్తించాను కాబట్టి ఆయన సేవచేస్తూ ఆయన దివ్యసందేశమును వ్యాప్తిగావించవలసిన బాధ్యత నాకున్నది. అందుకు నేను ఆయనకు సంపూర్ణ శరణాగతుడను కావాలి", అని ఆలోచించాడు. తన లక్ష్య సాధనకు అవసరమైన భక్తివిశ్వాసములను, శక్తిని ప్రసాదించుమని ఆయన భగవాన్ బాబావారిని ప్రార్థించారు.

మరునాడు ఉదయం భగవాన్ బాబావారు దర్శన సమయంలో లియొనార్డో దగ్గరకు వెళ్ళి "ఈ రోజు మధ్యాహ్నం మిమ్మల్ని ఇంటర్వ్యూకు పిలుస్తాను" అని చెప్పారు. స్వామి చెప్పినట్లుగానే ఆ రోజు మధ్యాహ్నం స్వామి వారిని ఇంటర్వ్యూకు పిలిచారు. ఆ ఇంటర్వ్యూలో స్వామి లియొనార్డో చెవిలో నెమ్మదిగా "నేను ఎప్పుడూ భక్తులను నిరాశపరచను", అని చెప్పారు. ఇంటర్వ్యూ పూర్తయ్యేటప్పటికి లియొనార్డోకు భగవాన్ బాబావారి దివ్య సందేశమును తాను నివసిస్తున్న ప్రాంతంలో వ్యాప్తి చేయడమే తన జీవిత లక్ష్యమని అర్థమైపోయింది.

1982 మార్చినెలలో ప్రశాంతి నిలయము విడిచి వెళ్ళేముందు, తిరిగి ఆ సంవత్సరం సెప్టెంబరు నెలలో భగవాన్ దర్శనానికి రావాలని శ్రీ లియొనార్డో మనసులో ఒక తీవ్రమైన కోరిక కలిగింది. అయితే, తన ఆర్థిక పరిస్థితి అందుకు అనుకూలించదని ఆయనకు తెలుసు. అయినప్పటికీ సెప్టెంబరు నెలలో తనను మళ్ళీ ప్రశాంతి నిలయానికి రప్పించుకోమని భగవాన్ బాబావారిని ప్రార్థించి శ్రీ లియొనార్డో బ్యూనస్ ఎయిర్స్‌కు తిరిగివచ్చేశారు. అర్జెంటీనాలోని సాయి భక్తులు కొద్ది మందే అయినా, వాళ్ళు చాలా అంకిత భావము, స్థిర సంకల్పము గలవాళ్ళు. వాళ్ళు దేశమంతా తిరిగి, చుట్టు ప్రక్కల దేశాలకుకూడా వెళ్ళి అక్కడ భగవంతుడు ప్రస్తుతం ఈ భువిపైన ప్రత్యక్షంగా అవతరించారనే శుభవార్తను ప్రచారం చేశారు. ముఖ్యంగా శ్రీ లియొనార్డో ఎక్కడికి వెళ్ళినా, ఎవరితో మాట్లాడినా భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిని గురించే మాట్లాడేవారు.

1982వ సంవత్సరం జూలై నెలలో ఆయన వ్యాపారరీత్యా ఈక్వెడార్ దేశమునకు వెళ్ళినపుడు, తన వ్యాపార వ్యవహారాలు ముగించుకున్న తర్వాత క్విటో నగరములో నున్న ఒక హఠయోగ శిబిర సభ్యులతో ప్రసంగించే అవకాశం లభించింది. ఆ సమావేశం ముగిసిన తరువాత ఆదేశములోని ఒక ప్రముఖ పారిశ్రామికవేత్త మరియు మాజీ రాయబారి శ్రీ లియొనార్డోను మరునాడు తన ఇంటికి భోజనానికి రావలసినదని కోరాడు. భోజన సమయంలో వారి

సంభాషణ భగవాన్ బాబావారి వ్యక్తుల వ్యాధులను నివారణచేసే మానవాతీత శక్తులవైపు మళ్ళింది. కొంత తడవైన తరువాత ఆ పారిశ్రామికవేత్త "ఈ సంవత్సరం సెప్టెంబరు నెలలో నాతో కలసి భారతదేశమునకు వెళ్ళి భగవాన్ బాబావారి దర్శనం చేసుకోవడానికి మీకేమీ అభ్యంతరం లేదు కదా! మీరు ఒప్పుకుంటే నేను ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేస్తాను", అని ఆయనను అడిగారు.

శ్రీ లియొనార్డో సంతోషం పట్టలేక వెంటనే అందుకు అంగీకరించారు. తన మనసులోని కోరికను నెరవేర్చినందుకు భగవాన్ బాబావారికి కృతజ్ఞతలు తెలుపుకున్నారు. సెప్టెంబరు నెల మొదటివారంలో వాళ్ళిద్దరూ కలసి ప్రశాంతి నిలయం వచ్చారు. ఆ ప్రయాణంలో లియొనార్డోకు తన స్నేహితుని భారతదేశ యాత్రకు గల అసలు కారణం తెలిసింది. నిజానికి ఆయనకు ఆధ్యాత్మిక సాధనయందు అంతగా ఆసక్తిలేదు. తన గొంతులో ఉన్న కేన్సరు వ్యాధిని నివారణ చేయుమని భగవాన్ బాబావారిని ప్రార్థించడానికి ఆయన ప్రశాంతి నిలయం వస్తున్నాడు. ఆయన అంతకుముందే ఆ వ్యాధికి అమెరికాలో శస్త్రచికిత్స చేయించుకున్నాడు గాని దానివలన ఉపయోగం లేకపోయింది. శ్రీ లియొనార్డోకూడా ఆయనపై దయచూపించి ఆయన కేన్సరు వ్యాధిని నయం చేయుమని స్వామిని ప్రార్థించారు.

వాళ్ళు ప్రశాంతి నిలయం చేరుకున్నాక తొమ్మిదవ రోజున సాయంత్రం భజన సమయంలో మందిర ప్రాంగణంలో కూర్చున్నప్పుడు ఒక వింత సంఘటన జరిగింది. ఆ పారిశ్రామికవేత్త భావోద్రేకం పట్టలేక వెక్కి వెక్కి ఏడవడం మొదలుపెట్టాడు. శ్రీ లియొనార్డో ఆయనను ఓదార్చడానికి ప్రయత్నించాడుగాని ఫలితం లేకపోయింది. కొంచెంసేపయిన తరువాత ఆయన చాలా ఆశ్చర్యంగా "భగవాన్ బాబా అపార కరుణామయులు. ఆయన నా కేన్సరు వ్యాధిని నయం చేశారు", అని ప్రకటించాడు. ఆ మాట విన్న శ్రీ లియొనార్డో నిర్ఘాంతపోయారు. ఆయన తన స్నేహితుని "ఏం చెపుతున్నావు? అసలు బాబా నీతో ఎప్పుడు

మాట్లాడారు?" అని అడిగారు. వెంటనే ఆ పారిశ్రామిక వేత్త "అదేమిటి? అలా అడుగుతున్నావు? కొద్ది నిమిషాలక్రితం స్వామి నా వద్దకు రావడం నీవు చూడలేదా?" అని అడిగాడు. శ్రీ లియొనార్డో తిరిగి "అదెలా సంభవం? బాబా అసలు బయటికి రానేలేదుకదా!" అని ప్రశ్నించారు. అందుకు సమాధానంగా ఆయన స్నేహితుడు "బాబా నా దగ్గరకు వచ్చి నా యెదుట నిలబడి నోరు తెరువుమని చెప్పారు. తరువాత నా నోట్లో తన చెయ్యి పెట్టి ఏదో వస్తువును బయటికి లాగి 'నీకు నయమైపోయింది' (You are cured) అని చెప్పారు. నాకు నిజంగానే నయమైందని గట్టి నమ్మకం కలిగింది" అని సమాధానం చెప్పాడు.

దిగ్భ్రాంతిని కలుగజేసే తన స్నేహితునియొక్క ఆ అనుభవమును విన్న శ్రీ లియొనార్డోకు నోట మాట రాలేదు. ఆ మరునాడు వాళ్ళిద్దరూ ప్రశాంతి నిలయంనుండి బయలుదేరి ఈక్వెడార్‌కు వచ్చేశారు. అంతకుముందు ఆ పారిశ్రామిక వేత్తకు ట్రీట్‌మెంటు ఇచ్చిన క్విటో నగరములోని కేన్సరు వైద్యుడు (Oncologist) ఆయనకు తిరిగి పరీక్షలు జరిపి అసలు కేన్సరువ్యాధి లక్షణాలు కూడా ఏవీలేవని నిర్ధారించాడు. ఇక ఆ పారిశ్రామికవేత్త భగవాన్ బాబావారికి గొప్ప భక్తుడుగా మారాడని వేరే చెప్పనవసరం లేదు కదా! అద్భుతమైన తన యీ అనుభవాన్ని ఆయన ఒక చిన్న పుస్తకముగా వ్రాసి 10,000 కాపీలు ముద్రింపించి ఈక్వెడార్ దేశమంతా పంచాడు.

ఈ సంఘటన జరిగిన ఒక దశాబ్దం తరువాత శ్రీలియొనార్డో పి.గట్టర్ లాటిన్ అమెరికా దేశములలో శ్రీ సత్యసాయి ఉద్యమానికి ఒక ప్రముఖ నాయకునిగా రూపొందారు.

శ్రీ చిదంబర కృష్ణన్ తిరునల్వేలి పట్టణానికి 25 కిలోమీటర్ల దూరములో నున్న ఒక ధనిక కుటుంబమునకు చెందిన యువకుడు. వాళ్ళ కుటుంబము దక్షిణ భారత దేశములో 'పొగాకు రాజులు' (Tobacco kings) గా పేరు పొందారు. ఒక సుప్రసిద్ధ జ్యోతిష శాస్త్రవేత్త ఆ యువకుడు 15-3-1960వ

తేదీలోగా చనిపోతాడని జ్యోతిషం చెప్పాడు. ఆ వార్త చిదంబర కృష్ణన్‌లో తీవ్రమైన భయాందోళనలను రేకెత్తించింది. ఆ తేదీనాటికి ఒక వారం రోజులముందు, భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు మధురైనుండి త్రివేండ్రం వెడుతూ తిరునల్వేలి మీదుగా ప్రయాణం చేస్తారని తెలిసిన అతని స్నేహితులు చిదంబరకృష్ణన్‌ను భగవాన్ బాబావారి దర్శనం చేసుకుని ఆయనను ప్రార్థించుమని సలహా యిచ్చారు. తిరునల్వేలి పట్టణములో భగవాన్ బాబావారు ఆనాడు కొందరు భక్తుల యిళ్ళకు వెళ్ళి వారిని ఆశీర్వదించి, ప్రక్కనే ఉన్న సురండాయ్ అనే పట్టణములో బసచేశారు.

చిదంబరకృష్ణన్‌కు మరొక సమస్య కూడా తలనొప్పిగా పరిణమించింది. అతడు తనకు నచ్చిన కన్యను వివాహం చేసుకోవడానికి వీలులేకుండా ఆ ప్రాంతంలో చాలా పలుకుబడిగల అతని అన్నగారు అభ్యంతరం లేవదీశాడు. ఆ కన్యకు ఇంకా మైనారిటీ తీరలేదనే నెపంమీద వాళ్ళ వివాహము జరుగకుండా ఆయన కోర్టునుండి ఒక ఉత్తరువు కూడా సంపాదించాడు. అటువంటి పరిస్థితులలో చిదంబరకృష్ణన్ సురండాయ్ వెళ్ళి భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్నాడు. అప్పుడు బాబా అతనివద్దకు నేరుగా నడచివచ్చి అతని చేయిపట్టుకుని తమ నివాసగృహములోనికి తీసుకొని వెళ్ళారు. స్వామి అతని భుజంతడుతూ "విచారించకు, నీకు దీర్ఘాయుష్షు ఉన్నది. మీ జ్యోతిష్కుడు చెప్పినట్లుగా నువ్వు ఇప్పుడప్పుడే చనిపోవు. నిన్ను రక్షించడానికే నేనిక్కడికి వచ్చాను" అని చెప్పారు. భగవాన్ బాబావారి అభయ పూరిత వాక్కును విన్న చిదంబరకృష్ణన్ తన చెవులను తానే నమ్మలేకపోయాడు. అతనికి నోటమాటరాలేదు. కళ్ళల్లో నీళ్ళు పొంగిపొరలాయి. భగవాన్ సంభాషణను పొడిగిస్తూ "అయితే, నీ పెళ్ళి సంగతేమిటి?" అని ప్రశ్నించారు.

అప్పటికి చిదంబరకృష్ణన్ కొంచెం తేరుకుని "మీకివన్నీ ఎలా తెలుసు"? అని అడిగాడు. స్వామి దానికి సమాధానం చెపుతూ "ఈ బుట్టతల బాబాకు అన్నీ తెలుసు. దేనిగురించీ ఆందోళన పడకు. నేను పుట్టపర్తిలో నీ పెళ్ళి

జరిపిస్తాను. ఆపెళ్ళికి మీ అన్నయ్య కూడా వస్తాడు", అని చెప్పారు. స్వామి మాటలలో చిదంబర కృష్ణన్‌కు నమ్మకం కుదరలేదు. అందువలన అతడు కొంచెం గట్టిగా "బాబా! మా అన్నయ్య చాలా పలుకుబడి కలిగిన వ్యక్తి, ఆయన ఎవరి మాటలను లక్ష్యపెట్టడు" అని చెప్పాడు. ఆ మాటలకు స్వామి చిరునవ్వు నవ్వుతూ "నా మాట నమ్ము. అన్నీ చక్కబడతాయి", అని అభయ మిచ్చారు. స్వామి మాటలకు ఆశ్చర్యపడుతూ చిదంబర కృష్ణన్ నోరు వెళ్ళబెట్టి చూస్తుండగా బాబా తన రూపము ముద్రింపబడిన ఒక బంగారు లాకెట్‌ను అతనికి సృష్టించి యిచ్చి "ఇది నీకు రక్షగా ఉపయోగపడుతుంది. దీనిని ఎల్లప్పుడు నీ దగ్గర ఉంచుకో!" అని చెప్పారు.

ఆ క్షణంనుండి చిదంబర కృష్ణన్‌లో గొప్పమార్పు వచ్చింది. సర్వశక్తిమయులైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు తనకు సంరక్షకులుగా ఉన్నారని తెలియడంతో అతని హృదయంలో ఒక క్రొత్త ఆశ చిగురించింది. అతనికి పూర్తి ధైర్యం చిక్కింది. భగవాన్ ఆజ్ఞననుసరించి ఆతడు ఆయనవెంట త్రివేండ్రం, కన్యాకుమారిలకు వెళ్ళాడు. ఆ సందర్భంగా ఆతడు కన్యాకుమారిలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు చూపించిన అద్భుతలీలకు, ఇంకా ఎన్నో లీలలకు ప్రత్యక్ష సాక్షిగా నిలిచాడు. తన్నుతాను చాలా అదృష్టవంతునిగా భావించుకున్నాడు. ఆతడు తన స్వగ్రామానికి చేరుకునేటప్పటికి ఆ జ్యోతిష్కుని జోస్యంవలన కలిగిన భయం పూర్తిగా తొలగిపోయి అతడు ఆనందంగా తిరిగివచ్చాడు. భగవాన్ అతనికి వీడ్కోలు సమయంలో "దైవానుగ్రహమును సంపాదించుకుంటే ఈ నవగ్రహములు నిన్నేమీ చేయలేవు" అని నొక్కి చెప్పారు. ఈ మాటలు ఎంతటి ప్రత్యక్షసత్యము! ఆ తరువాత మూడునెలలలోపుగానే భగవాన్ బాబావారు అతనికి ప్రశాంతి నిలయములోని మందిరంలో దగ్గరుండి వివాహం జరిపించారు. స్వామి చెప్పినట్లుగా అతని అన్నగారు కూడా ఆ వివాహమునకు హాజరయ్యారు.

తన సుదీర్ఘ జీవితములో శ్రీ చిదంబరకృష్ణన్ భగవాన్ బాబా వారే తన ఊపిరిగా జీవించాడు. ఎన్నో పాఠాలు నేర్చుకున్నాడు. ఎన్నో అద్భుతాలు

చూచాడు. భగవాన్ అతని స్వగ్రామానికి రెండుసార్లు వెళ్ళి, 1962 మార్చినెలలో 5 రోజులు, 1963 జూన్ నెలలో రెండు రోజులు అతని యింట్లో బస చేశారు. అతడు జీవితంలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్న సందర్భాలలో తనకు అత్యంత ప్రీతి పాత్రులైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి పాదాలకు అంటిపెట్టుకుని ఉన్నాడు. యుగావతారి భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారితో అతడు పొందిన అమూల్యమైన అనుభూతులు కలకాలం జ్ఞాపకముంచుకోదగినవి. తన ప్రియతమ ప్రభువు భగవాన్ బాబావారి దివ్య వైభవమును చాటిచెప్పే అతని జీవితంలోని రెండు ముఖ్య సంఘటనలను ఇక్కడ ఉదాహరించడం జరుగుతున్నది.

1960వ సంవత్సరం డిశంబరు నెలలో భగవాన్ బాబావారు వైట్‌ఫీల్డులోని నందనవనంలో కొన్నాళ్ళు నివసించారు. ఒకరోజు సాయంత్రం చిదంబరకృష్ణన్ తనకారులో ఆశ్రమానికి చేరుకోగానే భగవాన్ బాబావారు అప్పట్లో కేరళ రాష్ట్రమునకు గవర్నరుగా నున్న డా॥ బూర్గుల రామకృష్ణారావుగారితో కలసి తన కాటేజీ బయట నిలబడి ఉండడం చూశాడు. అప్పుడు అతను కారు దిగి భగవాన్ బాబావారివద్దకు పరుగెత్తుకుని వెళ్ళి పాదనమస్కారం చేసుకున్నాడు. బాబా అతనితో "చిదంబరం! సరిగ్గా సమయానికి వచ్చావు. మేము బెంగుళూరుకు వెడుతున్నాము. పద, నీ కారులో వెడదాం", అని చెప్పారు. అందుకు చిదంబరకృష్ణన్ కారు తుడిచి రెడీ చేయడానికి పది నిమిషాలు టైము ఇమ్మని స్వామిని అడిగాడు. అతను ఆ విధంగా అడగడానికి మరొక కారణం కూడా ఉన్నది. తనకారు వెనుక సీట్లో పెట్టిన డబుల్ బేరెల్ గన్‌ను భగవాన్ బాబావారు చూచేలోపుగా అక్కడినుండి తీసివేయాలని అతని ఉద్దేశ్యం! కాని, భగవాన్ అతనికి అంత సమయం ఇవ్వకుండా కారువద్దకు నడిచారు. ఈ తొందరలో చిదంబరం ఆ గన్‌ను సీటుక్రింద కాళ్లు పెట్టుకునే చోటుకు మాత్రం త్రోసివేయగలిగాడు! ఇంతలో భగవాన్ బాబా శ్రీ రామకృష్ణారావుగారితో కలసి కారు ఎక్కేశారు. చిదంబరం, భగవాన్ బాబావారితో కలసి ట్రివేండ్రంను

సందర్శించిన బృందములో ఒక సభ్యుడని శ్రీరామకృష్ణారావుకు తెలుసు. అప్పుడు బాబా గవర్నరు రామకృష్ణారావుగారికి చిదంబరంను పరిచయం చేస్తూ "చిదంబరం తిరునల్వేలికి చెందిన మంచి భక్తుడు. అతడు స్వామి కొరకు ఏమైనా చేయడానికి ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటాడు", అని చెప్పారు. ఇంతలో చిదంబరం కూడా గవర్నరుగారిని పలకరించాడు. శ్రీ రామకృష్ణారావు కారులో ఎక్కుతూ తాను కూర్చునే సీటు క్రింద గన్ ఉండడం చూసి ఆశ్చర్యపోయి చిరునవ్వుతో స్వామిని "స్వామీ! మీరు అతను చాలా మంచి భక్తుడని చెపుతున్నారు, అయితే ఈ తుపాకి ఎందుకు స్వామీ?" అని ప్రశ్నించాడు.

బాబా తుపాకిని, చిదంబరంను మార్చి మార్చి చూస్తూ "నువ్వు ఏమంటావు?" అని అతనిని అడిగారు. అప్పుడు చిదంబరకృష్ణన్ చేతులు జోడించి "స్వామీ! నన్ను క్షమించండి. నేను ఆత్మరక్షణ కొరకు ఈ తుపాకిని ప్రయాణాల్లో నా వెంట తీసికొని వెడుతున్నా, వేట అంటే నాకిష్టం. నేను కేవలం పక్షులను మాత్రమే షూట్ చేస్తాను. పుట్టుకచేత మాంసాహారిని కావడంచేత, నేను వాటిని చంపి తింటాను", అని చెప్పాడు. స్వామి మళ్ళీ "చిదంబరం! పక్షులైనా, మృగాలైనా, సకల జీవులలో నేనున్నాని నీకు తెలుసు కదా! అటువంటప్పుడు ఏ జీవికైనా నీవు ఎలా హాని చేయగలవు? మాటవరసకు, నువ్వు ఒక తల్లి పక్షిని చంపావనుకో; అప్పుడు దాని పిల్లల గతి ఏమిటి?" అని ప్రశ్నించారు. అందుకు చిదంబరం "స్వామీ! దయచేసి నన్ను క్షమించండి. ఇక మీదట నేను అలాచేయను. నా వాగ్దానమును నిలబెట్టుకునే శక్తిని నాకు ప్రసాదించండి", అని స్వామిని కోరుకున్నాడు. స్వామి అతని నిజాయితీకి సంతోషించి "నువ్వు చాలా మంచివాడివి. ప్రతి ఒక్కరు ఏదో ఒక తప్పు చేస్తారు. అయితే, నిజమైన భక్తుడు తాను చేసిన తప్పును సరిదిద్దుకోవడానికి సిద్ధంగా ఉండాలి", అని బోధించారు. కారు కదిలాకకూడా ఈ సంభాషణ కొనసాగింది. కారులో కూర్చున్న శ్రీ రామకృష్ణారావు భగవాన్ బాబావారిని "అయితే, స్వామీ! పాములు, అడవి జంతువులు వంటి

ప్రమాదకరమైన జీవులను కూడా మనం చంపకూడదా?" అని ప్రశ్నించారు. స్వామి సమాధానం చెపుతూ "నేను వాటిలోకూడా ఉన్నాను. ఈ సత్యమును నీవు గ్రహిస్తే, వాటికికూడా నీవు హాని కలిగించవు. ఒక వేళ గ్రహించకపోయినప్పటికి, నీ ఆనందంకొరకు ఇతర జీవులను ఎన్నడూ నీవు చంపకూడదు. అవి నిన్ను చంపడానికి వస్తే కేవలం ఆత్మరక్షణకొరకు నీవు వాటిని చంపవచ్చు. సమస్త జీవులయందు నీవు నీ హృదయంలో ప్రేమను పెంచుకుంటే, జంతువులుకూడా నీకు హాని కలిగించవు", అని వివరించారు.

జీవితంలో అహింసా సిద్ధాంతమును ఆచరణలో పెట్టాలనుకున్నవారికి, ఇది ఒక గొప్ప గుణపాఠము. ఆ క్షణం నుండి తాను పూర్తిగా శాకాహారిగా మారిపోవాలని, వేట అనే సరదాను విడిచిపెట్టెయ్యాలని చిదంబరకృష్ణన్ నిర్ణయించుకున్నాడు. అయితే, కొన్ని వారాల తరువాత తన కజిన్ సోదరుడు ఒకతను చేసిన రాజీ ప్రతిపాదనకు లొంగిపోయి తన నిర్ణయాన్ని మార్చుకోవాలా వద్దా అనే ఊగిసలాటలో పడ్డాడు. అతడు చిదంబరంతో "నువ్వు మాంసం తినకూడదనుకుంటే సరే. కాని, అంతమాత్రం చేత మనందరం కలసి వేటకు వెళ్ళే సరదాను మాత్రం పాడుచెయ్యకు. దయచేసి మాతో అడవికిరా. నువ్వు పక్షులను చంపడం వల్ల నీకు వచ్చే పాపమును నేను భరించడానికి సిద్ధంగా ఉన్నాను", అని చెప్పాడు. దీంతో అతడు తాను భగవాన్ బాబావారికి చేసిన వాగ్దానమును మరచిపోయి అడవికి వెళ్ళేదారిలో ఒక సరస్సులో ఈదులాడుతున్న రెండు బాతులను తుపాకీతో కాల్చి చంపాడు. వెంటనే అతని సోదరుడు జీపులోనుండి క్రిందకు దూకి ఆ బాతులను చేతితో పట్టుకున్నాడు. చిదంబరకృష్ణన్ తప్పించి మిగతా అందరూ ఈ సంఘటనకు ఆనందించారు. అతడు మాత్రం తాను తప్పు చేశాననే భావనతో గుండెబరువెక్కి ఇంటికి వచ్చేశాడు.

ఆ రోజు సాయంత్రమే చిదంబరకృష్ణన్ పుట్టపర్తి వెళ్ళాడు. భగవాన్ అతనితో చాలా ప్రేమగా, ఆప్యాయంగా ఏమీ జరుగనట్లు మామూలుగా

మాట్లాడారు. కాని, అతని హృదయంలో అపరాధ భావం బాధిస్తూనే ఉంది. అతడు అక్కడ ఇంకా కొన్ని వారాలు ఉందామనుకున్నాడు. కాని, భగవాన్ బాబావారు అతనిని కొద్దిరోజుల తరువాత ఇంటికి వెళ్ళమని చెప్పారు. "నీకు అక్కడ చాలా ముఖ్యమైన పనుంది" అని తొందర పెట్టారు. అంతేకాకుండా అతనికి విభూతి సృష్టించి యిచ్చి ఇంటికి తీసికొని వెళ్ళమని చెప్పారు. ఇంటికి తిరిగివచ్చేసరికి అతడు తన కజిన్ ఒక హాస్పిటలులో చాలా దయనీయస్థితిలో పడుకుని ఉండడం చూచాడు. ఆ రోజున చిదంబరం తుపాకితో చంపిన రెండు బాతులను తీసికోవడానికి జీపునుండి బయటకు దూకుతున్నప్పుడు జీపునుండి ముందుకు పొడుచుకు వచ్చిన ఒక ఇనుపరేకు అతని కాలికి తగిలి కాలు గీరుకుపోయింది. అదేదో స్వల్పమైన గాయం మాత్రమే అనుకుని అతడు దానిని లక్ష్యపెట్టలేదు. కాని, అది భయంకరమైన టెటనస్ వ్యాధిగా పరిణమించి, తీవ్రమైన జ్వరం కూడా వచ్చింది. చిదంబరకృష్ణన్‌ను చూడగానే, ఆతడు "నువ్వు సాయిబాబావారికి చేసిన వాగ్దానమును ఉల్లంఘించేటట్లు చేసి మహాపాపమునకు ఒడిగట్టాను. అందుకు నేనిప్పుడు అనుభవిస్తున్నాను. నా పాపకార్యమునకు పశ్చాత్తాపము చెందుతూ నేనిప్పుడు ఆ స్వామి కరుణకై ప్రార్థిస్తున్నాను. సాయిబాబా ఒక్కరే నన్ను రక్షించగలరు", అని అతి దీనంగా తన బాధను వెళ్ళబుచ్చాడు. ఈ పరిస్థితిని గమనించిన చిదంబరకృష్ణన్ భగవాన్ బాబావారు తన కజిన్‌ను రక్షించడానికి తనను అంత తొందరగా ఇక్కడికి పంపించారని తెలుసుకున్నాడు. వెంటనే ఆతడు స్వామి తనకిచ్చిన విభూతిని అతనికి అందించాడు. ఆ విభూతియే అతనిని కొద్దిరోజులలో పరిపూర్ణ ఆరోగ్యవంతుని చేసింది. అప్పటినుండి ఆ సోదరులిద్దరూ వేటాడడం మానివేసి పూర్తిగా శాకాహారులయ్యారు.

కాలంగడుస్తున్నది. చిదంబరకృష్ణన్‌కు లౌకిక, ఆధ్యాత్మిక రంగాలు రెండింటిలోను బాగా కలిసివచ్చింది. ఇంక తనకు ఏవిధంగాను ఢోకా లేదనుకుంటున్న సమయంలో అతని వ్యాపారం 70వ దశాబ్దం ప్రారంభమునుండి హఠాత్తుగా పడిపోవడం మొదలుపెట్టింది. 1980వ

సంవత్సరం వచ్చేసరికి ఆతడు పూర్తిగా బికారి అయిపోయాడు. దారిద్ర్యం, కష్టాలతో నిండిన జీవితానికి తట్టుకోలేక అతనికి భగవంతునియందు విశ్వాసము సన్నగిల్లింది. క్రమంగా ఆతడు పుట్టపర్తి ప్రయాణాలుకూడా తగ్గించుకుని, కొన్నాళ్ళు పోయిన తరవాత పూర్తిగా మానివేశాడు. అయితే, పుట్టపర్తి వెళ్ళిరావడానికి అతని దగ్గర డబ్బుకూడా లేదనుకోండి; అది వేరే సంగతి! ఇట్టి పరిస్థితులలో భగవాన్ బాబావారు తనను ఆదుకోనందుకు ఆయనను ఆతడు నిందించాడు. అంతేకాకుండా ఇన్ని సంవత్సరాలు తాను ఆయన వెంటపడినందుకు తనను తాను తిట్టుకున్నాడు కూడా! దీనికితోడు అతను జబ్బుపడి పూర్తిగా ఆరోగ్యం కోల్పోయాడు. ఆ అనారోగ్యం అతనిలో అసహనం, కోపం, చిరాకు పెంచింది. దాంతో అతని భార్యా బిడ్డలకు జీవితం దుర్భరమైంది.

ఈ పరిస్థితులలో ఒక మకర సంక్రాంతి పర్వదినంనాడు ఉదయం చిదంబరకృష్ణన్ తన దయనీయ పరిస్థితికి చింతిస్తూ ఇంట్లో కూర్చుని ఉండగా బయటినుండి "చిదంబరం! చిదంబరం!" అని ఎవరో పిలుస్తున్నట్లు వినిపించింది. ఆ గొంతుక వేరేగా ఉన్నట్లు అనిపించినా ఆ ఉచ్చారణ మాత్రం భగవాన్ బాబావారిదేనని అతనికి అనిపించింది. ఇంతలో అతని నౌకరు బయటికి వెళ్ళి చూచి వచ్చి షిర్డీ నుండి ఎవరో ఒక సన్యాసి అతనిని చూడడానికి వచ్చాడని చెప్పాడు. అందుకు చిదంబరకృష్ణన్ కోపంతో ఊగిపోతూ "నేనిప్పటికే ఒక సన్యాసి చేతిలో చాలా బాధలుపడ్డాను. ఇంక చాలు. నేనింకెవరినీ కలుసుకోదల్చుకోలేదు. అతడిని బయటకు పంపించెయ్యి", అని గట్టిగా అరిచాడు. అప్పుడు నౌకరు ఆవిధంగా చెయ్యడానికి ప్రయత్నించాడు గాని ఫలితం లేకపోయింది. దాంతో చిదంబరకృష్ణన్ లోపలికి వెళ్ళి తన తుపాకి తీసుకుని బయటకు వచ్చి పిలవని పేరంటంగా వచ్చిన భుజాల చుట్టూ ఒక శాలువా కప్పుకున్న ఆ సన్యాసిని "నువ్వు ఇక్కడనుండి వెళ్ళకపోతే నిన్ను తుపాకితో కాల్చి చంపుతా" నని బెదిరించాడు. ఆ సన్యాసి చిరునవ్వు నవ్వుతూ "ఎందుకు నీకంత కోపం? కోపం నీ వంటికి మంచిది కాదు. నీకు నాతో మాట్లాడడం ఇష్టం లేకపోతే నేను వెళ్ళిపోతా"నని చెప్పి బయటకు వెళ్ళిపోయాడు.

సరిగ్గా పది నిమిషాలలో ఆ సన్యాసి తిరిగివస్తూ చిదంబరకృష్ణన్‌కు కష్ట సమయాల్లో సహాయపడిన, గ్రామంలో అతనికి ఏకైక మిత్రుడైన చెల్లయ్యను వెంటబెట్టుకుని వచ్చాడు. అప్పుడు చెల్లయ్య చిదంబరంతో "ఈ సన్యాసి మామూలు వ్యక్తి కాదు. ఆయనకు అద్భుత శక్తులున్నాయి. ఆయన నీకు సహాయం చెయ్యవచ్చు. కొంచెం ఓపిక పట్టు" అని సలహాయిచ్చాడు. తన స్నేహితుని మనస్సు కష్టపెట్టడం ఇష్టంలేక చిదంబరకృష్ణన్ ఆ సన్యాసిని వరండాలోనికి ఆహ్వానించాడు. అప్పుడు ఆ సన్యాసి చిదంబరకృష్ణన్‌ను కోపం తెచ్చుకోవద్దని మళ్ళీ సలహాయిస్తూ ఆతడు అనుభవిస్తున్న కష్టాలు అతనిని భగవంతునికి సన్నిహితంగా చేర్చడానికి దోహదం చేస్తాయని, విచారించవలసిన పనిలేదని చెప్పి ఓదార్చాడు. తరువాత, అక్కడ పడిఉన్న కొన్ని ఎండిపోయిన పువ్వులను తీసుకుని వాటిపై తన నోటితో ఊదుతూ మొదట విభూతిగాను, తరువాత బంగారు బిల్వ పత్రములుగాను మార్చివేశాడు. అయితే, ఈ దృశ్యమును చూచిన చిదంబరం దానియందు ఆసక్తి కనపరచలేదు. పైగా కోపంతో, చికాకుతో "ఈ మేజిక్కులంటే నాకు ఇష్టం లేదు. నాకు కావలసింది డబ్బు, నేను పోగొట్టుకున్న ఆస్తిపాస్తులూను. నీకు చేతనయితే నాకు తిరిగి వాటిని తెప్పించు", అని ఆ సన్యాసిపై గట్టిగా అరిచాడు. దానికి ఆ సన్యాసి "నేను ఏదైనా చెయ్యగలనని, సర్వం నా చేతులలో ఉన్నవని నీకు తెలుసు. నేనెవరో నీకు తెలుసు; అయినప్పటికి నీవు తెలియనట్లు నటిస్తున్నావు. నన్ను మేడపైన నీ పూజగదిలోనికి తీసికొని వెళ్ళు", అని ఆజ్ఞాపించారు. కాని, చిదంబరకృష్ణన్ తన ఆగ్రహాన్ని అణచుకోలేక "ఏమైనా సరే! నిన్ను నా ఇంట్లోకి రానివ్వను. దయచేసి బయటకి వెళ్ళిపో. నువ్వు ఎందుకు నా వెంట పడతావు?" అని ఉద్రేకంగా జవాబిచ్చాడు. ఇంతలో కిటికీలో నుండి ఈ నాటకాన్నంతా చూస్తున్న చిదంబరకృష్ణన్ భార్య బయట వరండాలోనికి వచ్చి ఆ సన్యాసిని పైకి తీసికొని వెళ్ళమని తన భర్తను బ్రతిమలాడింది. ఇక చేసేదేమీలేక ఆతడు ఆ సన్యాసిని మొదటి అంతస్తులోనున్న తన పూజగదిలోనికి తీసికొని వెళ్ళాడు. అతని భార్యకూడా అతనివెంట వెళ్ళింది. అక్కడ ఆ సన్యాసి చిదంబరకృష్ణన్

జపం చేసుకునే రుద్రాక్షమాలను తన చేతిలోనికి తీసికొని దానిని గట్టిగా పిండాడు. ఆశ్చర్యకరంగా అందులోనుండి అమృతం వచ్చింది. దానిని ఆ సన్యాసి ఆ దంపతులకు ఇచ్చి నోట్లో వేసుకోమని చెప్పాడు. తరువాత, ఆ రుద్రాక్షమాలలోని ఒక రుద్రాక్షను త్రెంపి చిదంబరకృష్ణన్‌కు ఇచ్చాడు. దాంతో చిదంబరకృష్ణన్ కోపంతో ఊగిపోతూ "నన్ను కూడా నీలాగే సన్యాసం పుచ్చుకోమంటావా? నా వల్లకాదు. నాకు పెళ్ళాం, పిల్లలు, సంసారం ఉన్నాయి", అని గట్టిగా అరిచాడు.

అప్పుడు ఆ సన్యాసి చిదంబరకృష్ణన్ భార్యకేసి చూస్తూ "నీ భర్తను కోపం తగ్గించుకోమని చెప్పు" అని చెప్పాడు. అలా చెప్పి ఒక్క క్షణంలో తన భుజాలచుట్టూ ఉన్న శాలువా తీసివేసి తన నిజస్వరూపం వారికి చూపించాడు. వెంటనే కళ్ళు మిరుమిట్లు గొలిపే ఒక కాంతి కిరణము అక్కడ తళుక్కున మెరసి ఆ దంపతులు కళ్ళు మూసుకునేటట్లు చేసింది. వాళ్ళు కళ్ళు తెరచి చూచేటప్పటికి అక్కడ ఆ సన్యాసికి బదులు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు నిల్చుని ఉన్నారు. భగవాన్ బాబావారు దయార్ద్ర హృదయంతో "నన్ను నువ్వు సన్యాసి రూపంలో చూచిన క్షణమునుండి, నేనెవరో నీకు తెలుసు. అయినప్పటికి నువ్వు నన్ను అమర్యాదగా చూచి అవమానపరచావు", అని మృదువుగా మందలించారు.

ఆ మాటలకు చిదంబరకృష్ణన్ పశ్చాత్తాపంతో క్రుంగిపోతూ తన భార్యతో కలసి భగవాన్ బాబావారి చరణములపై వ్రాలాడు. భగవాన్ బాబావారిని "స్వామీ! నన్ను క్షమించండి. నేను చేసిన పాపానికి నాకు మరణ శిక్ష విధించండి. ఇంక నేను దారిద్ర్యంతో జీవించలేను", అని మొరపెట్టుకున్నాడు. అప్పుడు బాబా అతనిని అనునయిస్తూ "నీకు ప్రాణం ప్రసాదించడానికి వచ్చానుగాని తీసివేయడానికి రాలేదు. ఇరవై సంవత్సరాలక్రితం నీవు మొట్టమొదటిసారి నన్ను సురండాయ్‌లో దర్శనం చేసుకున్నప్పుడు నేను చేసినది అదే! ఆనాటి అనుభవం నీవెలా మరచిపోగలవు? నీవు పడుతున్న కష్టాలన్నీ

నాకు తెలుసు. సంతోషము, దుఃఖము రాత్రింబగళ్ళవలె ఒకదానివెనుక ఒకటి వస్తూనే ఉంటాయి. భగవంతుడొక్కడే నిన్ను శాశ్వతంగా అంటిపెట్టుకుని ఉంటాడు. ఇప్పుడు నువ్వు నేర్చుకోవలసిన పాఠం అదే!", అని బోధించారు.

తరువాత, భగవాన్ బాబావారు ఒక గ్లాసు పాలు తెప్పించుకుని త్రాగి ఆ దంపతులను తమకు హారతి ఇమ్మని చెప్పారు. వారిని ఆశీర్వదిస్తూ "కాలక్రమేణా అన్నీ సర్దుకుంటాయి. ఆ! ఇంక నేనిప్పుడు వెళ్ళాలి. నా వెంట రాకండి", అని చెపుతూ పూజగది నుండి బయటకు వెళ్ళి మెట్లు దిగి వెళ్ళిపోయారు. ఆ దంపతులు నిశ్చేష్టులై తామున్న చోటనే కదలక, మెదలక ఉండిపోయారు!

శ్రీ బిల్ లియాం మెకే ఎయిట్కిన్, స్కాట్లండుకు చెందినవారు. తన్ను తాను 'ఆధ్యాత్మిక పరివ్రాజకుని' గా (Spiritual Nomad) పిల్చుకునే శ్రీ బిల్ 1960వ దశాబ్దంలో భారతదేశమునకు వచ్చి స్థిరపడిపోయారు. ఆయన భారతదేశమంతటా విస్తృతంగా పర్యటించారు. ఆ సందర్భంగా ఆయన 'భారతదేశము యొక్క ఆధ్యాత్మిక భౌగోళిక పటము' (Spiritual Geography of India)ను రూపొందించారు. అందులో తన అనుభవమును ఆధారము చేసుకుని తన యాత్రా విశేషములను పొందుపరుస్తూ ఎన్నో పుస్తకాలు వ్రాశారు. అవన్నీ మంచి జనాదరణ పొందాయి. శ్రీ బిల్ భగవాన్ బాబావారిని గురించి కూడా "Sri Sathya Sai Baba, A Life" ('శ్రీ సత్యసాయిబాబా దివ్య జీవితచరిత్ర') అనే ఒక గొప్ప పుస్తకమును వ్రాశారు. ఆ పుస్తకంలో శ్రీ బిల్ భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య జీవితములోని ఆధ్యాత్మిక సారమును పొందుపరుస్తూ ఆయనను గౌతమ బుద్ధుడు, జీసస్ క్రైస్తువలె ఆధునికయుగంలో ఒక జగద్గురువుగా వర్ణిస్తారు. అవతార పురుషులైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి అనంతమైన దివ్యతత్వముయొక్క రహస్యమును తన మేధాశక్తిచే అన్వేషించడానికి చేసే శ్రీ బిల్ ప్రయత్నములతో సాయి భక్తులు ఏకీభవించకపోవచ్చు. అయితే, "భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు నాలో కలిగించే దివ్యానుభూతులు అత్యంత మనోహరమైనవి. ప్రపంచంలో ప్రతి

ఒక్కరు అటువంటి అనుభూతులను పొందాలని కోరుకుంటారని నా దృఢ విశ్వాసం", అని ఆయన చేసే నిర్ద్వంద్వమైన ప్రకటనతో అందరూ ఏకీభవించక తప్పదు.

శ్రీ బిల్ ఎయిట్కిన్ 1972వ సంవత్సరంలో మొట్టమొదటిసారి న్యూఢిల్లీలోని జింద్ మహారాణివారి నివాసంలో భగవాన్ బాబావారిని దర్శించారు. ప్రథమ దర్శనంలోనే ఆయన భగవాన్ బాబావారిని గురించి "నిస్సంశయంగా, నేనింతవరకు దర్శించిన ఏ పావన పురుషుడు లేక మానవునికంటె భగవాన్ బాబావారిలో అత్యధికంగా చైతన్యపరచే శక్తి ఉన్నది. అనంతమైన దివ్యశక్తితో కాంతులు విరజిమ్మే ఆయనను తాకితే షాక్ కొడుతుందా అని అనిపిస్తుంది", అని తన అభిప్రాయమును వ్యక్తము చేశారు. భగవాన్ బాబావారు తమ కాశ్మీరు పర్యటన ముగించుకుని ఢిల్లీ చేరుకున్నాక శ్రీ బిల్ 14-6-1980వ తేదీన స్వామిని మళ్ళీ అదే ప్రదేశంలో కలుసుకున్నారు. ఆ సమావేశం శ్రీ బిల్‌కు అత్యంత ప్రధానమైనది. దానికి కారణం ఆ సమావేశంలో స్వామి ప్రసాదించిన అనుగ్రహ, ఆశీస్సుల ఫలితంగా శ్రీ బిల్ కొన్ని వారాల తరువాత హిమాలయ పర్వతాలలో పర్వతారోహణ కార్యక్రమంలో నిమగ్నుడైయుండగా ఒకసారి ప్రాణాపాయ స్థితి నుండి రక్షింపబడ్డారు. ఈ సంఘటనను గురించి ఆయనే స్వయంగా ఇలా వివరించారు :

"ఆ సమయంలో నేను హిమాలయ పర్వతాలలోని అత్యంత క్లిష్టమైన నందదేవి పుణ్య స్థలమునకు పర్వతారోహణ యాత్ర కొరకు ఏర్పాట్లు చేసుకుంటున్నాను. ఆ సందర్భంగా నా యాత్రకు భగవాన్ బాబావారి ఆశీస్సులు పొందడానికి స్వామిని దర్శించే ఉద్దేశ్యంతో బయలుదేరాను. నా వెంట పర్వతారోహణకు ఉపయోగించే త్రాళ్ళు, రాతిని పట్టి ఉంచే క్లాంపులు (Rock Clamps) నాకు అత్యంత విశ్వాస పాత్రమైనది మరియు మహోన్నత మంచు పర్వతాలలో మంచు గడ్డలను ఛేదించి దారి ఏర్పాటు చేసుకోవడానికి తప్పనిసరిగా ఉపయోగించే పరికరము అయిన మంచు గొడ్డలి (Ice - Axe)

మొదలగు పరికరాలనుకూడా స్వామివద్దకు తీసికొనివెళ్ళాను. నేను స్వామి దర్శనం చేసుకోగానే ఆయన ఎంతో దయతో నా క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. నేను నా సాహసయాత్రకు స్వామి ఆశీస్సులను అర్థించాను. ఆ సమయంలో నా మంచు గొడ్డలినికూడా స్వామి చేతికిచ్చి ఆశీస్సులు పొందుమని నాకు ఢిల్లీలో ఆతిథ్యమిచ్చిన జింద్ రాణి సలహాయిచ్చారు. అప్పుడు బాబా చిరునవ్వుతో నా మంచుగొడ్డలిని తన చేతిలోనికి తీసుకుని పరీక్షగా చూస్తూ దానిని తయారుచేయడంలో ఉపయోగించిన స్టీలు, ఇతర లోహముల పరిమాణం, నిష్పత్తి మొదలగు వివరాలను గురించి చాలా నిశితంగా ప్రశ్నించారు. నిజానికి ఆ వివరాలేమీ నాకు తెలియవు. నా కంటె, స్వామి వెంట ఉన్న విద్యార్థులకే ఆ విషయాలు ఎక్కువగా తెలుసు. ఇంతలో స్వామి హఠాత్తుగా శూన్యములోనుండి విభూతిని (గతంలో నేను చూచినట్లు గాలిలో మూడు సార్లు తన అరచేతిని గుండ్రంగా త్రిప్పుతూ కాక) సృష్టించి, దానిని గొడ్డలియొక్క ఉక్కు పిడివైపు గట్టిగా రుద్ది "ఇక నీకేమీ ఫరవాలేదు. నీ యాత్ర విజయవంతమవుతుంది" అని చెప్పి నా చేతికి ఆ మంచు గొడ్డలిని ఇచ్చివేశారు.

'మహిమ' (Miracle) అనే పదానికి సరియైన అర్థమేమిటో నాకు తెలియదు గాని, ఒక నెల తరువాత అంటే జూలై నెల 26వ తేదీన నేను నందదేవీ పర్వతమును అధిరోహిస్తూండగా స్వామి తమ దివ్య హస్తముతో స్పృశించి విభూతిని రాసిన ఆ మంచు గొడ్డలి యొక్క ఉక్కు పిడియే నన్ను రక్షించింది. ఆ సమయంలో నేను 'రామని' అనే ప్రదేశంలో 'ఋషి-గంగ' అనే పేరుగల రెండు ఎత్తైన కొండల మధ్యనున్న ఇరుకైన మార్గమును కలుపుతూ పైన ఏర్పాటు చేయబడిన జారుజారుగా ఉన్న మంచుతో కప్పబడిన శిలా ఫలకములపై ఇద్దరు ఘర్వాలీ పోర్టర్ల సహాయంతో నెమ్మదిగా నడుస్తున్నాను. ఆ పోర్టర్లు ఇద్దరూ మంచి ధైర్య సాహసాలు, నైపుణ్యము గలవారు. వాళ్ళు త్రాడు సహాయం లేకుండా, పాద రక్షలుకూడా లేకుండా మంచుతో తడిసిన ఆ పలకలపై జారిపడిపోకుండా ఒక వైపు నుండి మరొకవైపుకు నడిచివెళ్ళగలరు. అలా వాళ్ళు ముందు నడుస్తూ నా కొరకు త్రాడును ఒక చివరనుండి ఇంకొక చివరకు


లాగి పట్టుకుని నేను సామానుతో సహా అవతలి ప్రక్కకు చేరుకునేదాకా వేచియుంటారు.

ఆ విధంగా మేము ఒక ఇరుకైన ప్రదేశం గుండా కొండ ఎక్కుతున్నాము. ఒక చోట నేల మరీ జారుడుగా, కాలువేస్తే క్రిందకు పడిపోయేలా ఉంది. కాలు భూమిపై స్థిరంగా మోపడానికి ఎక్కడా అవకాశం చిక్కలేదు. మేము కాలు మోపడానికి అనువైన స్థలం గొడ్డలితో చెక్కి తయారుచేసుకుంటూ ముందుకు వెళ్ళవలసి వచ్చింది. అలా పైకి ఎక్కుతూ ఒక చోట నేను వెనుకకు తిరిగి చూచేటప్పటికి సుమారు వెయ్యి అడుగులు లోతున అగాధంలో రెండు కొండల మధ్య ఒక ఇరుకు సందుగుండా ఒక నది ప్రవహించడం కనిపించింది. కొండ ఎక్కుతూ నేను కొంచెం తడి నేల ఉన్న ఒకచోట కాలి బొటనవ్రేలు మోపడానికి అనువైనంత జాగా నా మంచు గొడ్డలితో త్రవ్వి ఏర్పాటు చేయగలిగాను. తరువాత ఆ జాగాలో మంచు గొడ్డలి యొక్క మొనను, బలంగా ఒక్క వ్రేటుతో గ్రుచ్చుకునేలా దింపాను. అయితే, ఆశ్చర్యకరంగా ఆ మొన మూడు అంగుళాలు లోతుకి దిగబడి ఆ తరువాత ఖంగుమని రాయికి తగిలి ఆగి పోయింది. అందువలన, అది ఎట్టి బరువును ఆపలేని స్థితిలో ఉంది. ఇంతలో నా కాళ్ళ క్రింద మట్టి కదలిపోతూ నేను క్రింద అగాధంలోనికి జారిపోతానేమోననిపించింది. ఆ పరిస్థితులలో నేను కేవలం మూడు అంగుళాలు మాత్రం లోతుకు దిగిన నా మంచు గొడ్డలి ఆధారంగా అలా వ్రేళ్ళాడుతూ ఉండిపోయాను. ఒక్క క్షణంపాటు నా మొత్తం బరువంతా, నా వీపుపై నున్న సామానుతో సహా ఆ గొడ్డలి మొనపై ఆనింది. ఆ క్షణంలో, నేను అక్కడినుండి జారి క్రింద వెయ్యి అడుగుల లోతున ఉన్న అగాధంలో పడి నిశ్చయంగా ప్రాణాలు పోగొట్టుకుంటానేమోననే బాధ కంటె, నా అసమర్థతే నన్ను ఎక్కువగా బాధించింది. ఇంతలో నాకు సహాయంగా వస్తున్న ఆ ఇద్దరు పోర్టర్లు వెనుకకు వచ్చి నన్ను గట్టిగా పట్టుకున్నారు. ఈ మొత్తం సంఘటనలో అత్యద్భుతమైన విషయమేమిటంటే, కేవలం మూడు అంగుళాల లోతుకు దిగిన ఆ గొడ్డలి మొత్తని ఆ మట్టిలో నుండి జారిపోకుండా నన్ను, నా సామాను బరువును

వాళ్ళు వచ్చి నన్ను పట్టుకునేదాకా ఆపగలిగింది. ఇటువంటివే మరికొన్ని ప్రాణాపాయ పరిస్థితులను తప్పించుకుని మేము గురు పూర్ణిమనాడు మా లక్ష్యమైన పవిత్ర నందదేవి ఆలయమునకు విజయవంతముగా చేరుకోగలిగాము. మా తిరుగు ప్రయాణంలో కూడా మేము ఒళ్ళు గగుర్పొడిచే కొన్ని ప్రమాదకర సంఘటనలను ఎదుర్కొన్నాము. కాని, భగవాన్ బాబావారి దివ్య అనుగ్రహ, ఆశీస్సుల ఫలితంగా మేము వాటన్నింటిని తప్పించుకుని క్షేమంగా ఇంటికి చేరుకోగలిగాము. ఈనాడు ఈవిధంగా నా కథను మీకు వినిపించడానికి నేను జీవించి ఉన్నానంటే, అది భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి అనుగ్రహమే!"

భగవాన్ బాబావారు ప్రపంచ వ్యాప్తంగా ఎంతోమంది జిజ్ఞాసువులకు చేయూతనిచ్చి వారిని ఆధ్యాత్మిక మార్గంలో నడిపిస్తున్నారు. భగవాన్ వర్షించే అపారమైన ప్రేమ, కరుణలకు దూరముగాని, జాతి, మత, కుల విభేదములుగాని ఆటంకములు కావు. స్వామి తరుచుగా "There is no reason for love, no season for love" ('ప్రేమకు కారణంలేదు, ప్రేమకు సమయంలేదు') అని పాడుతూండడం మనందరికి అనుభవంలో ఉన్న విషయమే! ఆయన "అహేతుక కరుణా సింధువు". నిర్హేతుకమైన, నిరంతరాయంగా కొనసాగే భగవాన్ ప్రేమవాహినివలన స్ఫూర్తిని పొందిన కీ॥శే॥ శ్రీ కస్తూరి "నీకు ఆయన అవసరం ఉంటే, ఆయన్ని పొందడానికి అర్హత ఉన్నట్లే" ("You deserve Him, if you need Him") అని ఒక సందర్భంలో ఉద్ఘాటించారు. భగవాన్ కరుణకై పరితపించే అట్టి ఆర్తుల కొరకు ఆయన సాగించే అన్వేషణను గురించిన కథ తరువాయి అధ్యాయంలో కూడా కొనసాగుతుంది.





8

ప్రాపంచికమైన పేరు ప్రతిష్ఠలు - భగవంతుని దివ్యాశీస్సులు

1970వ సంవత్సరంలో బాలభానుని కిరణాలు వెచ్చగా తాకుతూ హృదయానికి ఆహ్లాదమును కలిగిస్తున్న ఒకనాటి ప్రభాత సమయం. శ్రీమతి మీనాల్ మనోహర్ గవాస్కర్ బొంబాయి నగరములోని దాదర్‌లో గల తన ఫ్లాట్‌లో ఒంటరిగా ఉన్నది. ఆ సమయంలో ఆమె ఆలోచనలన్నీ ఆ రోజున గుజరాత్ టీముతో బొంబాయి క్రికెట్ క్లబ్బు తరఫున బ్రాబోర్న్ స్టేడియంలో జరుగబోయే రంజీట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌లో పాల్గొంటున్న తన కొడుకు సునీల్‌పైనే ఉన్నాయి. ఆ రోజు జరుగబోయే ఆటలో పాల్గొనే పదకొండు మంది ఆటగాళ్ళ జట్టులో తన పేరు చేర్చబడలేదని సునీల్‌కు తెలుసు. అందువలన అతడు బ్యాటింగ్ చేసేటప్పుడు కాళ్ళకు దెబ్బలు తగులకుండా కట్టుకునే తన పేడ్స్ (Pads) ను కూడా తన వెంట తీసికొని వెళ్ళలేదు. తన యింటినుండి స్టేడియంకు లోకల్ ట్రైనులో వెడుతూండడంవలన ఆ పేడ్స్ బరువు కూడా ఎందుకని అతడు భావించాడు. తన కుమారుడు క్రికెట్ ఆటలో బాగా పైకి వచ్చి మంచి పేరు తెచ్చుకోవాలని శ్రీమతి మీనాల్ శ్రీ షిర్డిసాయిబాబావారిని ప్రతిరోజు ప్రార్థించేది. ఇంతకుముందు బొంబాయిజట్టు తరఫున ఆడిన రెండు మ్యాచ్‌లలోను సునీల్ ఆట అంత చెప్పుకోదగినంతగా లేనందున, అతనిని జట్టులో ఒక రెగ్యులర్ ఆటగానిగా పరిగణించలేదు.

శ్రీమతి మీనాల్ భర్త శ్రీ మనోహర్ బొంబాయి నగరములోని ఒక క్రికెట్ క్లబ్బు జట్టులో వికెట్ కీపర్ - బ్యాట్స్‌మన్‌గా పాల్గొనేవారు. ఆమె సోదరుడు శ్రీ మాధవ్ మంత్రి కూడా గొప్ప క్రికెట్ ఆటగాడే. ఆయన బొంబాయి జట్టులోను,

భారత క్రికెట్ జట్టులోను సభ్యునిగా చాలా మ్యాచ్‌లు ఆడారు. అందువలన, సునీల్ చిన్నప్పటినుండి క్రికెట్ ఆటలో మంచి ప్రతిభను కనపర్చాడు. 16 ఏండ్ల చిన్న వయసులోనే అతడు భారత స్కూలు పిల్లల జట్టు తరఫున లండన్ స్కూలు పిల్లల జట్టుతో వరుసగా కొన్ని క్రికెట్‌మ్యాచ్‌లు ఆడడానికి ఎంపిక అయ్యాడు. స్కూలు, కాలేజీ స్థాయిలో బ్యాట్స్‌మన్‌గా అతడు నెలకొల్పిన రికార్డు అందరి దృష్టిని ఆకర్షించింది. అయితే, ప్రథమ శ్రేణి క్రికెట్ మ్యాచ్‌లలో మాత్రం అతడు ఇంకా ఎక్కువ ప్రతిభ కనపరచవలసిన అవసరం ఉన్నది.

ఆ రోజు ఉదయం తన కుమారుడు మ్యాచ్‌లో పాల్గొనే జట్టులో లేనందున శ్రీమతి మీనాల్ అంత ఎక్కువగా ఆందోళన చెందడం లేదు. అయినప్పటికి, ఆమె వంటగదిలో తన పని తాను చేసుకుంటూనే తన కుమారుడు క్రికెట్ ఆటలో మంచి వృద్ధిలోనికి రావాలని భగవంతుని ప్రార్థిస్తున్నది. ఇంతలో ఆమె తల ఎత్తి పైకి చూచేసరికి కాషాయాంబరధారియైన ఒక మహా పురుషుడు తన ఎదురుగా నున్న గోడను ఆనుకుని నిలబడియుండడం చూచింది. ఆయన ఒత్తైన నల్లని ఉంగరాల జుట్టుతో, సుమనోహరమైన దరహాసవదనంతో సాక్షాత్కరించారు. ఆయన శ్రీమతి మీనాల్‌ను చూస్తూ తన దక్షిణ హస్తమును పైకి ఎత్తి ఆమెను ఆశీర్వదిస్తూ నిలబడ్డారు. ఆమె అంతకు ముందెన్నడూ ఆయనను చూడలేదు. ఆ కారణంగా ఆయనెవరో ఆమెకు తెలియదు. ఆయన ఎవరో ఒక దివ్యపురుషుడని తన అంతరాత్మ ప్రబోధంచేత ఆమె గ్రహించినా, ఆమె తొట్రుపాటు చెందింది. కొద్ది క్షణాల తరువాత ఆయన అదృశ్యమవుతూ "నువ్వు ఆందోళన చెందకు. కొంచెం ఓపికతో చూస్తుండు. అతడు సెంచరీ కొడతాడు", అని మృదుమధురమైన కంఠస్వరంతో మరాఠీ భాషలో చెప్పారు. ఆ మాటలు విన్న శ్రీమతి మీనాల్‌కు షాకుతో, ఆశ్చర్యంతో నోట మాటరాలేదు. కొన్ని క్షణాల తరువాత తేరుకుని ఆ దివ్యపురుషుని అనుగ్రహ, ఆశీస్సులకు చాలా ఆనందించింది. ఆ రోజు జరిగే ఆటలో పాల్గొనే జట్టులో తన కుమారుని పేరైనా లేకపోవడంతో ఆమె ఇదెలా సంభవమని ఆశ్చర్యపోయింది. తనను, తన కుమారుని ఆశీర్వదించిన ఆ దివ్యపురుషుడెవరో తెలుసుకోవాలని ఆమె

చాలా ఆత్రుత పడింది. తన యింటికెదురుగానున్న న్యూస్‌పేపర్లు, దేవుళ్ళ పోష్టర్లు అమ్మే దుకాణమువద్దకు నడిచివెళ్ళి అక్కడ ఆ దివ్యపురుషుని గురించి వాకబు చేసింది.

శ్రీమతి మీనాల్ చెప్పిన మాటలు, ఆమె హావభావములను బట్టి ఆ దివ్యపురుషుడెవరో ఆ షాపు యజమానికూడా తెలుసుకోలేకపోయాడు. ఆ అద్భుతమూర్తి ఎవరో తనకు తెలియదని, ఆయన చిత్రమేదీ తన వద్దలేదని ఆ షాపు యజమాని ఎంతగా చెప్పినప్పటికి ఆమె వినిపించుకోకుండా అతని షాపులో ఉన్న పోష్టర్లన్నిటిని మరొకమారు వెతకమని పట్టుబట్టింది. అయితే, ఆ ప్రయత్నం ఫలించలేదు. ఆమె వేరొక షాపులోనికి వెళ్ళి అక్కడ కూడా వెతికింది; కాని, ఫలితం లేకపోయింది. ఇక చేసేది ఏమీలేక ఇంటికి తిరిగి వస్తూ మళ్ళీ ఒకసారి ఆ మొదటి షాపులోనికి వెళ్ళి షాపు యజమానిని మరొక్కసారి ఆ చిత్రము కొరకు వెదకుమని బ్రతిమలాడింది. అప్పుడు అతడు "నాకు తెలియకుండా నా షాపులో ఎలా ఉంటుంది? అటువంటి పోష్టరుకొరకు నేను కనీసం ఆర్డరు కూడా పెట్టలేదే!" అని ప్రశ్నించాడు. అయితే, ఆమె ఆత్రుత గమనించి ఆ పోష్టరుకొరకు తన షాపులో మరొక్కసారి వెతకడానికి అంగీకరించాడు. అలా వాళ్ళిద్దరు కలసి మరొకసారి ఆ దివ్యపురుషుని పోష్టరు కొరకు వెదకుతూ ఉండగా అది గుట్టగా పడివున్న పోష్టర్లలో అట్టడుగున కనిపించింది! అంతే! శ్రీమతి మీనాల్ ఆశ్చర్యంతో, ఆనందంతో ఎగిరి గంతువేసింది! ఆ దివ్యపురుషుని పోష్టరుక్రింద 'భగవాన్ శ్రీ సత్యసాయిబాబా' అనే అక్షరాలు ముద్రింపబడి ఉన్నాయి. ఆ పోష్టరులోని బాబా చిత్రము సరిగ్గా తన వంటగదిలో ఆయన తన ముందు ప్రత్యక్షమైనప్పుడు ఉన్నట్లే ఉంది! వెంటనే ఆమె భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారికి ప్రప్రథమంగా ప్రణామములు అర్పించుకున్నది. మరొక విశేషమేమంటే, ఆ షాపు యజమాని ఆ పోష్టరు తనకు ఎవరో ఉచితంగా ఇచ్చారని చెప్పి దానిని ఆమెకు ఉచితంగా ఇచ్చివేశాడు!

శ్రీమతి మీనాల్ ఇంటికి వచ్చి సరిగ్గా వంటగదిలో తనకు స్వామి ప్రత్యక్షమైన చోట ఆయన పోష్టరు అతికించే సమయానికి ఆమె యింట్లో ఫోను

మ్రోగడం ప్రారంభించింది. ఫోనులో అవతలనుండి సునీల్ మాట్లాడుతూ తన కాలికి కట్టుకునే పేడ్స్ తీసుకుని వెంటనే స్టేడియంకు రమ్మని తల్లికి చెప్పాడు. ఆ రోజున టీమ్ కెప్టెను అజిత్‌వడేకర్‌కు ఉదయం నెట్ ప్రాక్టీసు చేస్తున్న సమయంలో దెబ్బ తగిలి ఆడడానికి వీలులేకపోయినందువలన, ఆఖరి క్షణంలో ఆయన స్థానంలో సునీల్‌కు ఆడడానికి అవకాశం కల్పించారు. అంతేకాకుండా, సునీల్‌కు ఇన్నింగ్సు ప్రారంభించే అవకాశం కూడా లభించింది. సునీల్ తల్లి పేడ్స్ తీసుకుని వెంటనే స్టేడియంకు చేరుకుంది. ఆమె అక్కడికి చేరుకునే లోపుగానే సునీల్, వడేకర్ యొక్క పేడ్స్ తాను కట్టుకుని ఓపెనింగ్ బ్యాట్స్‌మన్‌గా ఆట ప్రారంభించాడు. లంచ్ సమయానికి సునీల్ 71 పరుగులు చేసి, లంచ్ విరామం తరువాత ఆట కొనసాగించి సెంచరీ పూర్తి చేశాడు. భగవాన్ బాబావారు సునీల్ తల్లికి ముందే చెప్పినట్లు ఆతడు వంద పరుగులు చేశాడు. తాను శ్రీ షిర్డీసాయిబాబావారి పునరవతారమని భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు ప్రకటించినట్లుగా ఆమెకు అదే రోజున సాయంత్రం తెలిసింది. భగవాన్ బాబావారు తన ప్రార్థనలను మన్నించినందుకు ఆమె బ్రహ్మానందపడిపోయింది. ఆ రోజు సాయంత్రం వాళ్ళింట్లో పండుగ చేసుకున్నారు. భగవాన్ బాబావారు చాలా అద్భుతమైన రీతిలో తమ యింట్లో ప్రత్యక్షమై తనను ఆశీర్వదించిన విషయం తల్లి చెప్పగా విన్న సునీల్ ఈవిధంగా భగవాన్ తన జీవితంలో ప్రవేశించి తనను అనుగ్రహించినందుకు ఆయనకు మనసులోనే కృతజ్ఞతలు తెలుపుకున్నాడు. అతని హృదయంలో ఆయనయందు భక్తి భావం నెలకొన్నది.

ఆ మ్యాచ్ తరువాత సునీల్ క్రికెట్ జీవితంలో ఇంక తిరుగే లేకపోయింది. ఒకటి తరువాత ఒకటిగా ఆతడు మ్యాచ్‌లు ఆడుతూ సెంచరీలపై సెంచరీలు సాధించి వేలకొద్ది పరుగులు తన స్కోరుకు చేర్చాడు. అతని బ్యాటింగ్ తీరు కూడా చాలా సొగసుగా కొనసాగింది. 1971వ సంవత్సరంలో జరిగిన వెస్టిండీస్ పర్యటన తరువాత ఆతడు జాతీయ స్థాయిలో ఒక గొప్ప క్రికెట్ క్రీడాకారునిగా పేరుపొందాడు. పదహారు సంవత్సరాలపాటు నిర్విరామంగా అంతర్జాతీయ

స్థాయిలో ఎన్నో క్రికెట్ మ్యాచ్‌లు ఆడిన తరువాత ఆతడు క్రికెట్ ఆటనుండి విరమించుకునే సమయానికి, టెస్ట్ మ్యాచ్‌లలో 34 సెంచరీలు కొట్టి అత్యధిక సంఖ్యలో సెంచరీలు సాధించిన బ్యాట్స్‌మన్‌గా ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. 125 టెస్ట్ మ్యాచ్‌లలోని 208 ఇన్నింగ్స్‌లో సగటున ఇన్నింగ్సుకు 51 పరుగులు చేశాడు.

ఆ తరువాత ఒక సందర్భంలో నేను శ్రీ సునీల్ గవాస్కర్‌తో మాట్లాడుతూ "మీ క్రికెట్ చరిత్రలో మీరు సాధించిన విజయాలలో భగవాన్ బాబావారు సహాయం చేసిన ముఖ్య సంఘటనలను కొన్నింటిని వివరించగలరా?" అని ఆయనను ప్రశ్నించాను. ఆయన వెంటనే తడుముకోకుండా చాలా స్పష్టంగా "ముఖ్య సంఘటనలు అని ప్రత్యేకంగా నేను ఎంపిక చేసి చెప్పే విషయాలేమీ లేవు. ఆయన నా క్రికెట్ జీవితంలో మొదటినుండి చివరవరకు నిరంతరాయంగా నాకు సహాయపడుతూనే ఉన్నారు. భగవాన్ బాబావారి సహాయంలేకుండా నేను ఒక్క పరుగును కూడా చేసి ఉండేవాడిని కానని నిస్సంశయంగా చెప్పగలను", అని నొక్కి చెప్పారు. ఆయన సమాధానానికి నేను తడబడుతూ భగవాన్ బాబావారియందు ఆయనకు గల గాఢమైన భక్తికి విస్మయం చెందాను. ఆ సంభాషణను కొనసాగిస్తూ ఆయన "నేనెక్కడికి వెళ్ళినా భగవాన్ బాబావారి ఫోటోను ఒకటి నాతో తీసుకొని వెడతాను. ఉదయం లేవగానే నేను మొట్టమొదట చేసే పని భగవాన్ బాబావారికి నమస్కారం చేసుకోడం. రాత్రి పడుకోబోయేముందు ఆఖరిసారిగా నేను చేసే పనికూడా అదే!" అని చెప్పారు. ఇంతేకాక, "క్రికెట్ ఆటలోగాని, జీవితంలోగాని ఎప్పుడైనా నేను ఓటమి పాలైతే, నాకు ఒక గుణపాఠం నేర్పడానికి భగవాన్ బాబావారే ఈ విధంగా సంకల్పించారని నేను అనుకుంటాను. నా శక్తికి మించి నేను పరుగులు పెడుతున్నానేమో లేదా నాలో అహంకారం పెరిగిందేమో లేదా నేను ఏదైనా సాధించినందుకు గర్వపడ్డానేమో అని ఆత్మ పరిశీలన చేసుకుంటాను. ఈ రకమైన మనోభావం పెంచుకోవడంవల్ల జీవితంలో ఏదైనా సందర్భంలో ఓటమి చవి చూచినప్పుడు నిరాశకు లోనుకాకుండా ఉంటాను", అని కూడా శ్రీ సునీల్

గవాస్కర్ చెప్పారు. ఒక వ్యక్తియొక్క ఔన్నత్యానికి గీటురాయి నిస్సంశయంగా ఆ వ్యక్తిలో గల వినయమే!


1977వ సంవత్సరంలో ఆస్ట్రేలియాలోని విక్టోరియాలో ఒక మూడు రోజుల మ్యాచ్ ఆడుతున్నప్పుడు అప్పట్లో భారత జట్టుకు వైస్ కెప్టెన్‌గా ఉన్న శ్రీ సునీల్ గవాస్కర్‌కు కుడివైపు తొడలో కండరము లాగింది. ఫలితంగా, ఆయన భరించలేని బాధతో నిలబడలేకపోయారు. కుడికాలిని నేలపై మోపలేకపోయారు. ఆ సమయంలో అటువంటి ప్రమాదాలకు చికిత్స చేయడానికి జట్టులో ఫిజియోథెరపిస్టు కూడా లేరు. అందువలన ఆస్ట్రేలియా జట్టులోని ఫిజియోథెరపిస్టుకు తన కాలిని చూపించగా ఆయన నాలుగునుండి ఆరు వారాలవరకు పూర్తిగా విశ్రాంతి తీసుకోవాలని సలహాయిచ్చారు. ఇంకొక పదిరోజులలో బ్రిస్‌బేన్‌లో టెస్ట్‌మేచ్ ప్రారంభం కానున్న సమయంలో తన పరిస్థితి ఈవిధంగా అయినందుకు ఆయన చాలా విచారించారు. ఫిజియోథెరపిస్టు సలహాయిచ్చినట్లు నాలుగు వారాలు విశ్రాంతి తీసుకోవడమంటే కనీసం రెండు టెస్ట్‌మేచ్‌లలో తాను పాల్గొనకుండా పోవల్సి వస్తుంది. అప్పుడు ఆయన తన భార్యకు ఫోను చేసి తన పరిస్థితిని వివరించారు. వెంటనే ఆమె "నేను మీకు బాబా విభూతిని పంపిస్తాను. మీరు దానిని దెబ్బ తగిలిన చోట వెంటనే వ్రాయండి. తప్పకుండా మీకు నయమై మీరు టెస్ట్‌మేచ్‌లో ఆడగలరని నా నమ్మకం", అని ధైర్యం చెప్పింది. సరిగ్గా మేచ్ ఇంక మూడు రోజులుందనగా క్రికెట్ కామెంటేటరు శ్రీ సుశీల్ దోషిద్వారా భగవాన్ బాబావారి విభూతి శ్రీ గవాస్కర్‌కు అందింది. అంతవరకు, విశ్రాంతి తీసుకుని ఫిజియోథెరపీ చేయించుకున్నప్పటికి శ్రీ గవాస్కర్ పరిస్థితిలో ఎటువంటి మార్పు కనపడలేదు. భగవాన్ బాబావారి విభూతి తొడపై వ్రాయగానే చాలా అద్భుతమైన రీతిలో ఆయన పరిస్థితి మెరుగైంది. అలా నాలుగైదుమార్లు విభూతి రాయగానే ఒక్క రోజులో నొప్పి మాయమైంది. కండరంలో కొద్దిగా బిఱ్ఱు (Stiffness) ఉండిపోయింది. శ్రీ సునీల్ అంత త్వరగా అద్భుతమైన రీతిలో కోలుకోవడం చూచిన కెప్టెను, టీమ్ మేనేజరుకూడా చాలా ఆశ్చర్యపోయారు. తరువాత,




"భగవాన్ బాబావారితో 'లిటిల్ మాస్టర్' సునీల్ గవాస్కర్"



"క్రీడోత్సవంలో క్రికెట్ విన్యాసాలు"



ఛాన్సలర్ భగవాన్ బాబా విశ్వవిద్యాలయ క్రీడోత్సవమును ప్రారంభించుట.



భగవాన్ బాబా వారితో యువ విజేతలు

టెస్ట్‌మేచ్ ప్రారంభంకావడానికి ముందురోజున కెప్టెన్ శ్రీ సునీల్‌తో "మీ పరిస్థితి కనీసం సగం వరకు మేచ్ ఆడడానికి అనుకూలంగా ఉన్నా, రేపు జరిగే మేచ్‌లో మీరు ఆడాలని కోరుతున్నాను. అయితే, ఈ విషయంలో నిర్ణయం మాత్రం మీదే. రేపు మేచ్ ప్రారంభం కావడానికి టాస్ వేసేందుకు కొన్ని నిమిషాల ముందువరకు మన జట్టులో ఆడే ఆటగాళ్ళ పేర్లను ప్రకటించము", అని చెప్పాడు. ఆ రాత్రి పడుకోబోయేముందు శ్రీ సునీల్ బాబా విభూతిని మళ్ళీ తొడపైన రాసుకున్నారు. మరునాడు ఉదయం నిద్రలేచేటప్పటికి ఆయనకు నొప్పి తగ్గిపోయి చాలా హాయిగా ఉన్నట్లనిపించింది! ఆయన కొంచెంసేపు గ్రౌండులోనికి వెళ్ళి కొద్దిగా పరుగెత్తి తన శారీరక స్థితి టెస్ట్ మ్యాచ్ ఆడడానికి అనుకూలముగా ఉన్నదని నిర్ధారించుకున్నారు. అందువలన మేచ్‌లో పాల్గొనడానికి నిశ్చయించుకుని అందులో తన పదకొండవ టెస్ట్ సెంచరీ చేశారు!

శ్రీ సునీల్ గవాస్కర్, భగవాన్ బాబావారు తన తల్లికి ఆమె వంటగదిలో దర్శనం ఇచ్చిన ఎనిమిది సంవత్సరాల తరువాత ఆయనను మొట్టమొదటిసారిగా దర్శించుకున్నారు. అది 1978వ సంవత్సరంలో మద్రాసులో ఇండియా – వెస్టిండీస్ టెస్ట్‌మేచ్‌లో విశ్రాంతి దినమునాడు జరిగింది. ఆ సమయంలో శ్రీ గవాస్కర్ భారత జట్టుకు, శ్రీ కాళీచరణ్ వెస్టిండీస్ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నారు. ఆ రోజున భగవాన్ బాబా మద్రాసులోని ఏబట్స్‌బరీలో భక్తులకు దర్శనం ఇస్తున్నారు. శ్రీ సునీల్, శ్రీ జి. ఆర్. విశ్వనాథ్, శ్రీ కాళీచరణ్‌లను వెంటతీసుకుని స్వామి దర్శనానికి వెళ్ళారు. ఆ టెస్ట్‌మేచ్, మూడవరోజు తర్వాత విజయం ఏ జట్టును వరిస్తుందో తెలియని చాలా అయోమయ స్థితిలో ఉంది. అందువలన రెండు జట్ల కెప్టెన్లు కూడా చాలా మానసిక ఒత్తిడికి లోనయ్యారు. ముఖ్యంగా భారత జట్టు కెప్టెన్ మరింత ఎక్కువ ఒత్తిడికి లోనయ్యారు. భగవాన్ బాబావారిని మొట్టమొదటిసారి దర్శనం చేసుకున్న తరువాత శ్రీ సునీల్ ఆ అనుభూతిని వర్ణిస్తూ "ఆ ప్రథమ దర్శనమే చాలా ఆశ్చర్యకరంగా ఉంది. స్వామి దర్శన వరుసలలో భక్తులమధ్య నెమ్మదిగా నడుస్తూంటే మెల్లగా ప్రశాంతంగా పారుతున్న నదిపై తేలుతూ వస్తున్నారా అనిపించింది. ఆయన శరీరంచుట్టూ దివ్యమైన

కాంతి ప్రకాశిస్తోంది. నేను నా దృష్టిని స్వామి దివ్య సుందర వదనారవిందముపై నిలుపగానే నాలో ఏదో అనిర్వచనీయమైన ప్రశాంతత నెలకొన్నది. ఇక, ఆ క్షణంలో నేను క్రికెట్ సంగతి పూర్తిగా మరచిపోయి అంతరంగములో పరిపూర్ణమైన శాంతిని అనుభవించాను", అని చెప్పారు. దర్శన కార్యక్రమం పూర్తయిన తరువాత భగవాన్ బాబా వాళ్ల ముగ్గురిని కొద్దిసేపు ఇంటర్వ్యూకు పిలిచి ఆశీర్వదించారు. స్వామి దర్శనం, ఇంటర్వ్యూ పూర్తి చేసుకుని వాళ్ళు హోటల్‌కు తిరిగి వెడుతున్నప్పుడు దారిలో శ్రీ కాళీచరణ్ "అయితే మేము భగవాన్ బాబావారి ఆశీస్సులతో ఈ మేచ్‌ను గెలుస్తామన్నమాట", అని శ్రీ సునీల్ గవాస్కర్‌తో పరిహాసమాడారు. అందుకు శ్రీ సునీల్ "మేమిద్దరం – నేను మరియు విశ్వనాథ్. మీరు ఒక్కరే! మా ఇద్దరికి స్వామి ప్రసాదించిన ఆశీస్సులతో మేచ్ మేమే గెలుస్తాము", అని జవాబు చెప్పారు. సరిగ్గా అలాగే జరిగింది. ఆ మేచ్‌ను భారతదేశం గెలుచుకున్నది.

1982వ సంవత్సరంలో శ్రీ సునీల్ గవాస్కర్ మొట్టమొదటిసారి ప్రశాంతి నిలయమును సందర్శించారు. ఆయన వచ్చినరోజు సాయంత్రమే భగవాన్ బాబా ఆయనకు ఇంటర్వ్యూ ప్రసాదించి ఆశీర్వదించారు. ఇంటర్వ్యూ పూర్తయిన తరువాత భగవాన్ ఆయనను బాలుర హాస్టల్‌కు తమతో తీసుకొనివెళ్ళారు. విద్యార్థులందరూ ఆ సమయంలో భజన హాలులో సమావేశమయ్యారు. స్వామి ఆయనను తన ప్రక్కనే ఉన్న ఒక కుర్చీలో కూర్చొనమని చెప్పారు. కాని, శ్రీ గవాస్కర్ అందుకు కొంచెం ఇబ్బందిగా ఫీలవడం గమనించి "ఫర్వాలేదు, కూర్చో" మని చెప్పి ఆయన కూర్చున్న తరువాత "ఈ రోజు బక్రీద్ పండుగ. ఆ పండుగ యొక్క ప్రాముఖ్యతను గురించి విద్యార్థులకు చెప్పు", అని ఆదేశించారు.

శ్రీ సునీల్, స్వామి ఆదేశం విని చాలా ఆశ్చర్యపోయారు. ఆయనకు నోట మాటరాలేదు. దానికి కారణం, తాను భగవాన్ బాబావారి సన్నిధిలో లేచి నించుని ఏ విషయమును గురించైనా ప్రసంగించగలనని ఆయన కలలో కూడా భావించకపోవడమే! పైగా, తనకు ఇస్లాంమతమును గురించిగాని,

ఖురాను గురించిగాని, బక్రీద్ పండుగను గురించిగాని కొంచెం కూడా తెలియదు. అందువలన ఆయన "స్వామీ! బక్రీద్ గురించి నాకు ఏమీ తెలియదు. అలాంటప్పుడు నేనెలా మాట్లాడగలను?" అని భగవాన్ బాబావారికి విన్నవించుకున్నాడు. అప్పుడు బాబా "నువ్వు వెళ్ళి మైకు ముందు నిల్చో. అంతా అదే జరిగిపోతుంది", అని చెప్పారు. శ్రీ సునీల్ స్వామి ఆజ్ఞననుసరించి మైకుముందు నిలబడి మాట్లాడడం ప్రారంభించారు. ఆయన 10, 12 నిమిషాలసేపు ఇస్లాంమతమును గురించి, బక్రీద్ పండుగను గురించి మాట్లాడారు. ఆయన తన ప్రసంగమును ముగించేసరికి కరతాళధ్వనులు మిన్నుముట్టాయి. శ్రీ సునీల్ వెనుకకు వెళ్ళి కుర్చీలో కూర్చోగానే స్వామి ఆయనవైపు చూస్తూ "నేను చెప్పలేదా, నువ్వు బాగా మాట్లాడగలవని?" అని చెప్పారు. శ్రీ సునీల్ ఆరాధనాభావంతో తన చేతులు జోడించి స్వామికి నమస్కరించారు.

ఈ సంఘటన జరిగిన సుమారు 20 సంవత్సరాల తరువాత శ్రీ సునీల్ గవాస్కర్ నాతో మాట్లాడుతూ "ఆ రోజున నేను ఏమీ మాట్లాడానో నాకిప్పటికీ తెలియదు. స్వామి ఆజ్ఞననుసరించి నేను మైకుముందు నిల్చున్నానంతే! స్వామియే నా ద్వారా మాట్లాడారు", అని చెప్పారు.

1983వ సంవత్సరంలో భారతదేశము ఒక రోజు అంతర్జాతీయ క్రికెట్ పోటీలలో కపిల్‌దేవ్ సారథ్యంలో ప్రపంచకప్పును కైవసం చేసుకున్నప్పుడు శ్రీ సునీల్ గవాస్కర్‌కూడా ఆ జట్టులో సభ్యునిగా ఉన్నారు. ఆ పోటీలలో అత్యంత ప్రతిభావంతులైన వెస్టిండీస్ జట్టుపై భారత జట్టు గెలవడం భారతదేశంలో పట్టరాని ఆనందోత్సాహములను రేకెత్తించింది. ఆ తరువాత అంటే 1985లో ఆస్ట్రేలియాలో జరిగే మరొక టోర్నమెంటు 'బెన్సన్ అండ్ హెడ్జెస్ కప్'కు భారత జట్టుకు సారథ్యం వహించడానికి శ్రీ సునీల్ గవాస్కర్ ఎంపిక అయ్యారు. ఆ పోటీలో ప్రపంచంలో క్రికెట్ ఆడే దేశాలన్నీ పోటీపడ్డాయి. భారతదేశంలో, మన జట్టు యొక్క విజయంపై క్రికెట్ అభిమానులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు.

ఫలితంగా శ్రీ సునీల్ గవాస్కర్ నాయకత్వంపై విశేషమైన ఆశ, ఆయన భుజస్కంధాలపై విశేషమైన బరువు మోపబడినాయి. అయితే సరిగ్గా భారతజట్టు ఆస్ట్రేలియాకు బయలుదేరే ముందురోజున ఆయన మనోనేత్రంముందు ఒక దృశ్యం కనపడింది. అందులో ఆయనకు తన యింట్లో కాషాయాంబరధారియైన ఒక దివ్యపురుషుని సమక్షంలో తాను సగర్వంగా ఆ ఛాంపియన్ షిప్ కప్పును పైకి ఎత్తి పట్టుకున్నట్లు గోచరించింది. వెంటనే ఆయన మనసులో నెలకొనియున్న ఆందోళన, ఒత్తిడి తొలగిపోయాయి. ఇక నిశ్చయంగా భారతదేశము ఆ టోర్నమెంటులో నెగ్గి కప్పును కైవసం చేసుకుంటుందని ఆయనకు నమ్మకమేర్పడింది. అనుకున్నట్లే జరిగింది! ఆ ఘన విజయం కారణంగా భారతదేశము అంతకుముందు జరిగిన ప్రపంచ కప్ పోటీలలో కేవలం అదృష్టం కలిసిరావడం వల్లనే విజయం సాధించిందనే అపప్రథ తొలగిపోయింది.

ఒకసారి ప్రఖ్యాత క్రికెట్ కామెంటేటరు శ్రీ టోనీకోజియర్ మరియు శ్రీ సునీల్ గవాస్కర్ కలసి భారత, వెస్టిండీస్ జట్లమధ్య జరుగుతున్న టెస్ట్‌మేచ్‌కి కామెంటరీ చెపుతూ కామెంటేటర్స్ బాక్స్‌లో కూర్చున్నారు. ఒక సందర్భంలో మేచ్ కొంచెం మంద కొడిగా జరుగుతున్న సమయంలో వాళ్ళిద్దరిమధ్య సంభాషణ బంగారు నగలు మరియు విలువైన రాళ్ళవైపు మళ్ళింది. ఇంతలో శ్రీ టోనీకోజియర్ దృష్టి శ్రీ సునీల్ చేతికి ఉన్న వజ్రపు టుంగరంపై పడింది. అదే సమయంలో మేచ్‌ను వీడియో తీస్తున్న కెమెరా ఫోకస్ కూడా ఆ ఉంగరంపై పడింది. ఫలితంగా ధగధగ మెరుస్తున్న శ్రీ సునీల్ ఉంగరం మేచ్ చూస్తున్న ప్రేక్షకులందరికి టెలివిజన్ తెర నిండుకు కనపడింది. అప్పుడు శ్రీ టోనీ "ఈ ఉంగరం ఖరీదెంత?" అని శ్రీ సునీల్‌ను అడిగారు. క్రికెట్ ప్రపంచానికే వెలలేని అమూల్యమైన కానుకగా భగవాన్ బాబావారిచే ప్రసాదింపబడిన శ్రీ సునీల్ గవాస్కర్ ఆ ప్రశ్నకు జవాబు చెపుతూ "అది వెలలేనిది. ఆ అమూల్యమైన ఉంగరమును భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు నాకు కానుకగా ప్రసాదించారు", అని చెప్పారు.

1985వ సంవత్సరం నవంబరు నెలలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి 60వ జన్మదినోత్సవాలలో భాగంగా ఒక రోజు సాయంత్రం స్వామి తమ దివ్యోపన్యాసం ముగిస్తూ శ్రీ సత్యసాయి హిల్‌వ్యూ స్టేడియంలో సమావేశమైన అసంఖ్యాక భక్తజన సందోహము నుద్దేశించి "ఇప్పుడు శివకుమార్ శర్మ సంతూర్ వాయిస్తాడు. ఆతడు చాలాకాలంగా స్వామికి భక్తుడు. మీరు దివ్యత్వమును అనుభవంలోకి తెచ్చుకోవాలంటే అతడు వాయించే సంగీతమును వినండి", అని ప్రకటించారు. ప్రపంచమంతటి నుండి వచ్చి అక్కడ సమావేశమైన లక్షలాది భక్తులు ఆ ప్రకటనను విని దిక్కులు పిక్కటిల్లేటట్లు హర్షధ్వానాలు చేశారు. అసలు మొదట్లో అనుకున్న ప్రకారం శ్రీ శివకుమార్ భగవాన్ ఉపన్యాసమునకు ముందే తన సంగీత కచేరీ చెయ్యవలసి ఉన్నది. కాని, ఆఖరి నిమిషంలో కార్యక్రమంలో మార్పు చేయబడింది. దాంతో, భగవాన్ బాబావారు తమ ఉపన్యాసం ముగించుకుని కచేరీ అయ్యేవరకు ఉంటారా లేక వెళ్ళిపోతారా, ఒకవేళ వెళ్ళిపోతే ఇక కచేరి వినడానికి ప్రేక్షకులు ఎవరుంటారు, అని పండిట్ శివకుమార్ శర్మ మనసులో ఆందోళన ప్రారంభమైంది. ఇంతలో భగవాన్ బాబావారే స్వయంగా ఒక ప్రకటన చేశారు!

ఆనాటి ఆ దివ్యానుభూతిని జ్ఞప్తికి తెచ్చుకుంటూ శ్రీ శివకుమార్ శర్మ "భగవాన్ మాటలకు నేను పూర్తిగా పరవశుడనై నా కళ్ళ నుండి కన్నీళ్ళు ధారలుగా కారడం మొదలైంది. నేను లేచి నిలబడడం గాని, ఇటు అటూ కదలడంగాని చేయలేకపోయాను. నా చెవులను నేనే నమ్మలేకపోయాను. ఇన్ని సంవత్సరాలలో బాబా నన్నెప్పుడూ పేరుపెట్టి పిలువలేదు. అతి కష్టంమీద నేను లేచి నిలబడి స్టేజివద్దకు వెళ్ళగలిగాను. విశేషమైన భావోద్రేకమునకు లోనుకావడంచేత ఆ సమయంలో నేను సంతూర్ వాయించే స్థితిలో లేను. అప్పుడు భగవాన్ బాబావారు ప్రేమతో నా భుజం తట్టారు. భగవాన్ దివ్యస్పర్శ నాకు సాంత్వన చేకూర్చింది. నేను మళ్ళీ మామూలుస్థితికి వచ్చి సంతూర్ వాయించడం మొదలుపెట్టాను. కచేరీ పూర్తయ్యాక భగవాన్ బాబావారు ఒక వజ్రపుటుంగరం సృష్టించి నా వ్రేలికి తొడిగారు", అని వివరించారు.

తాము వాయించే సంగీత వాయిద్యముల కారణంగా గొప్ప పేరు ప్రఖ్యాతులు పొందిన మహా విద్వాంసులెందరో ఉన్నారు. కాని ఒక మహా విద్వాంసుని కారణంగా ఒక సంగీత వాయిద్యానికి ఒక ఉనికి అంటూ ఏర్పడిన సందర్భాలు ఎన్ని ఉన్నాయి? కాశ్మీరు రాష్ట్రంలో జానపద సంగీతములో ఉపయోగించే సంతూర్ వాయిద్యముయొక్క అసలు పేరు 'శత తంత్రి వీణ'. ఆ వాయిద్యమునకు శాస్త్రీయ సంగీత స్థాయి కల్పించినది, పండిట్ శివకుమార్ శర్మ. ఆయన తండ్రి పండిట్ ఉమాదత్ శర్మ జమ్ముకు చెందిన సుప్రసిద్ధ గాత్ర సంగీత కళాకారుడు. ఆయన సంతూర్ వాయిద్యమును శాస్త్రీయ సంగీత కచేరీలు నిర్వహింపబడే వేదికలపై ప్రవేశపెట్టే బాధ్యతను శ్రీ శివకుమార్ శర్మకు అప్పగించారు. శ్రీ శివకుమార్ శర్మ ఆ బాధ్యతను ఒక సవాల్‌గా తీసుకుని అనేక ప్రతికూల పరిస్థితులకు తట్టుకుని నిలబడి చివరకు విజయవంతముగా ఆ కార్యమును నెరవేర్చారు. విశేషమైన పరిశోధనా ఫలితంగా శ్రీ శర్మ ఆ శత తంత్రి వీణకు కొన్ని ముఖ్యమైన మార్పులు చేసి మంద్ర, మధ్యమ, ఉచ్ఛస్థాయిలు మూడింటిలోను సప్తస్వరాలు పలికించడానికి వీలుగా దాని పరిధిని పెంచారు. అంతేకాకుండా, ఆ వాయిద్యముపై వివిధ రాగములు పలికించేటప్పుడు స్వరమునకు స్వరమునకు మధ్య అంతరాయము లేకుండా సాగిపోయేందుకుగాను ఒక నూతన విధానమును కూడా కనిపెట్టారు. ఈనాడు భారతదేశములోనే కాక, ప్రపంచమంతటా సంతూర్ శాస్త్రీయ సంగీత వాయిద్యముగా గుర్తింపు పొందింది.

పండిట్ శివకుమార్ శర్మ 1968వ సంవత్సరంలో మొట్టమొదటిసారిగా తమ కుటుంబానికి వైద్యుడు మరియు ఆప్తమిత్రుడు అయిన డా॥ ఎమ్. ఎల్. శుక్లాద్వారా భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిని గురించి తెలుసుకున్నారు. ఆ రోజుల్లో ఆయన శాస్త్రీయ, సంగీత విద్వాంసునిగా నిలదొక్కుకోవడానికి ఇంకా తీవ్రంగా కృషి చేస్తూనే ఉన్నారు. సంతూర్ వాద్య సంగీత విద్వాంసునిగా తన భవిష్యత్తు ఏమిటో తనకే తెలియని అయోమయ పరిస్థితిలో ఉన్న శ్రీ శివకుమార్ శర్మ భగవాన్ బాబావారి దర్శనం చేసుకుని ఆయన ఆశీస్సులు పొందితే ఆయన

మార్గం సుగమమవుతుందని, ఆయన వృద్ధిలోనికి రాగలరని డా॥ శుక్లా భావించారు. అందువలన ఆయన శ్రీ శర్మను భగవాన్ బాబావారిని దర్శించుకోమని సలహాయిచ్చారు. ఒకసారి డా॥ శుక్లా శ్రీ శర్మను బొంబాయి నగరములోని విలే పార్లేలో ఒక సాయిభక్తుని ఇంటికి తీసుకొనివెళ్ళారు. ఆయన ఇంట్లో భగవాన్ బాబావారి అనుగ్రహ సూచకంగా తరచు అనేక చిహ్నములు కనిపించడం మొదలు పెట్టాయి. శ్రీ శివకుమార్ శర్మ ఒకసారి ఆ యింట్లో భగవాన్ బాబావారి చిత్రపటమునకు ఎదురుగా కూర్చొని సంతూర్ వాయిస్తూండగా బాబా చిత్రపటమునకు పైన కవరుగా అమర్చబడిన అద్దముపై విభూతి ఏర్పడింది. ఆ విధంగా ఆయన భగవాన్ బాబావారి దివ్యానుగ్రహముయొక్క అనుభూతిని మొట్టమొదటిసారి పొందారు.

1969వ సంవత్సరంలో భగవాన్ బాబావారు బొంబాయి సందర్శించినపుడు అంధేరిలోని ఆయన దివ్యధామమగు సత్యదీప్‌లో భగవాన్ సమక్షంలో సంతూర్ వాయించవలసిందిగా శ్రీ శివకుమార్ శర్మకు ఆహ్వానం అందింది. ఆ రోజు సాయంత్రం ఆ కార్యక్రమానికి బొంబాయి నగరములోని పలువురు ఉన్నతోద్యోగులు, పురప్రముఖులు హాజరయ్యారు. కార్యక్రమం పూర్తయిన తరువాత భగవాన్ బాబావారు శ్రీ శివకుమార్ శర్మను అభినందిస్తూ "నీ సంగీతము నాకు చాలా నచ్చింది. నేను నీతో మాట్లాడాలనుకుంటున్నాను. రేపు ఉదయం ఇక్కడికిరా!" అని చెప్పారు. అయితే శ్రీ శివకుమార్ మరునాడు ఒక రికార్డింగ్ కార్యక్రమానికి హాజరు కావలసియుండడంచేత, తాను స్వామి వద్దకు ఏవిధంగా వెళ్ళగలనా అని ఆయన ఆందోళన చెందారు. ఆయన ఇంకా తన మనసులోని ఆందోళనను స్వామికి విన్నవించుకునే లోపుగానే స్వామి "వద్దులే! రేపు నువ్వు చాలా హడావుడిగా ఉంటావు. ఎల్లుండి రా! వచ్చేటప్పుడు నీ భార్యను కూడా తీసికొని రా!" అని చెప్పారు.

శ్రీ శివకుమార్ శర్మ తన భార్యతో కలసి ప్రప్రథమంగా భగవాన్ బాబావారిని కలుసుకున్న ఆ పవిత్ర దినం ఆయనకు కలకాలం గుర్తుండిపోతుంది. కారణం, ఆ రోజున ఆయనకు తన భవిష్యత్తు మీద

అచంచలమైన విశ్వాసం ఏర్పడింది. ఆ రోజున భగవాన్ ఆ సంగీత విద్వాంసుడు తన భవిష్యత్తును గురించి పెట్టుకున్న ఆశలు, దానిని సాధించడానికి ఆయన చేస్తున్న తీవ్రమైన కృషిని గురించి మాట్లాడారు. అంతేకాకుండా జీవితంలో ఆయన ఎదుర్కొన్న అనేక క్లిష్ట పరిస్థితులు మరియు నిరాశాజనకమైన సంఘటనలను గురించి భగవాన్ వివరిస్తూ "బాధపడకు. ఇక మీదట నీవు చేస్తున్న ప్రయత్నాలన్నీ ఫలిస్తాయి", అని కూడా అభయమిచ్చారు. భగవాన్ బాబావారు తనపై చూపించిన అవ్యాజమైన దివ్య ప్రేమానుగ్రహములకు శ్రీ శివకుమార్ అవాక్కయిపోయారు. ఆయనలో తన జీవితాశయము నెరవేరనున్నదనే ఆనందము పొంగిపొరలింది. అటువంటి దివ్యమైన ఆనందానుభూతిని ఆయన అంతకు ముందెన్నడూ పొందలేదు. ఆ ఆనందానుభూతిలో ఆయన కొద్దిక్షణాలు నిశ్శబ్దంగా గడిపినాక భగవాన్ బాబా తిరిగి "నీకేమి కావాలి?" అని అడిగారు. శ్రీ శివకుమార్ అందుకు సమాధానంగా "స్వామీ! మీ దివ్యాశీస్సులు తప్ప నాకు వేరేమీ అక్కరలేదు", అని నెమ్మదిగా చెప్పారు. కాని, ఆయన భార్య మనోరమ మాత్రం "కాదు స్వామీ! మీ అనుగ్రహ సూచకంగా ఆయనకేదైనా వస్తువును సృష్టించి యివ్వండి" అని భగవాన్ బాబావారిని వేడుకుంది. అప్పుడు భగవాన్ తన హస్తచాలనంచేత గుండెలవరకు ఉన్న బంగారముతో తయారైన తన చిత్రము ముద్రింపబడిన ఒక వెండి ఉంగరమును ఆయనకొరకు సృష్టించారు. ఆ ఉంగరమును శ్రీ శివకుమార్ శర్మ వ్రేలికి తొడుగుతూ "సైజు సరిపోయిందా", అని అడిగారు. శ్రీ శివకుమార్ ఆనందంతో "సరిపోయింది స్వామీ!" అని చెప్పారు. తరువాత భగవాన్ బాబా ఆ భార్యాభర్త లిద్దరి వైపు ప్రేమగా చూస్తూ "ఈ రోజు నుండి ఇది మీ యిల్లు. ఇక, నా యిల్లు మీ హృదయమే! మీకు ఎప్పుడు కావాలనుకుంటే అప్పుడు నా దగ్గరకు రావచ్చు" అని చెప్పారు. ఆ విధంగా ఆ పర్వదినంనాడు అవతారమూర్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా అదృష్టవంతులైన ఆ దంపతులకు శాశ్వత ఆహ్వానమును అనుగ్రహించారు.

పండిట్ శివకుమార్ శర్మ ఎక్కడికి వెళ్ళినా భగవాన్ బాబావారు ప్రసాదించిన ఆ ఉంగరము ఆయన వ్రేలికి అలంకార భూషితమై యుండేది. ముఖ్యంగా ఆయన వేదికపై సంగీత కచేరీ చేస్తున్న సమయంలో సంతూర్ వాయిస్తున్నప్పుడు అందరి దృష్టి ఆ ఉంగరముపైననే ఉండేది. ఎవరైనా ఆ ఉంగరమును గురించి అడిగినప్పుడు ఆయన నిస్సంకోచంగా దానిని భగవాన్ బాబావారు తనకు కానుకగా ప్రసాదించారని చెప్పేవారు. ఆ కారణంగా ఆయనను కొందరు ధన్యజీవిగా భావించేవారు. మరికొందరు కుతూహలంతో "పండిట్‌జీ! ఆ ఉంగరం వలన మీ జీవితంలో ఏదైనా మార్పు వచ్చిందా?" అని గాని "ఆ ఉంగరం మీ జీవితంలో ఎటువంటి మంచి మార్పును తెచ్చింది" అని గాని ప్రశ్నించేవారు. శ్రీ శివకుమార్ శర్మ అటువంటి ప్రశ్నలకు తనకు స్వతహాగా అబ్బిన చిరునవ్వే సమాధానంగా ప్రకటించేవారు. ప్రతిరోజూ ఉదయం లేవగానే, మళ్ళీ రాత్రి పడుకోబోయే ముందు 'సాయిరాం' మంత్రమును జపిస్తూ తన వ్రేలికి ఉన్న ఉంగరంలోని భగవాన్ బాబావారి చిత్రమును నుదుటికి, కళ్ళకు అద్దుకోవడం పండిట్ శివకుమార్ శర్మకు ఒక అలవాటుగా మారింది.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారితో ప్రప్రథమంగా సమావేశమైన కొన్నినెలల తరువాత శ్రీ శివకుమార్ శర్మ జమ్ములోని తన స్వస్థలమునకు వెళ్ళారు. అది వేసవికాలం కావడంచేత ఆయన డాబాపై పడుకున్నారు. ఆ రోజు రాత్రి ఆయన పడుకోబోయేముందు తన అలవాటు ప్రకారం బాబా ప్రసాదించిన ఉంగరంవైపు చూస్తూండగా ఆయనకు అంతకు ముందు అనేకమంది వేసిన ప్రశ్న జ్ఞాపకం వచ్చింది. అప్పుడు ఆయన కూడా "గత కొన్ని నెలల్లో నా జీవితంలో నిజంగా ఏదైనా మంచి మార్పు వచ్చిందా?" అని తనను తాను ప్రశ్నించుకున్నారు. మళ్ళీ తనకు తానే 'విశేషమైన మార్పేదీ లేదు' అనుకుంటూ నిద్రపోయారు. మరునాడు ఉదయం లేచి ఉంగరంకేసి చూడగా ఉంగరంలో భగవాన్ బాబావారి చిత్రము మాయమవడం ఆయన గమనించారు. దాంతో ఆయన షాకయి ఆ ఉంగరంకొరకు పక్క మీద, చుట్టుప్రక్కల డాబా అంతా వెదకి చూచారు. కాని, ఎక్కడా ఉంగరం కనపడలేదు.

ఆ ఉంగరం మాయమవడానికి తన సంశయాత్మక మనస్సే కారణమని గ్రహించిన శ్రీ శివకుమార్ పశ్చాత్తాపంతో క్రుంగిపోయారు. అప్పుడే ఉదయిస్తున్న బాల భానుని చూస్తూ ఆయన తూర్పువైపున డాబా అంచువరకు నడిచివెళ్ళారు. ఇంతలో హఠాత్తుగా ఆ నునులేత కిరణాల సూర్యకాంతిలో డాబా క్రిందనున్న పోర్టికోయొక్క సన్నని పిట్టగోడపై ఏదో వస్తువు మిలమిల మెరుస్తూండడం గమనించారు. ఆ వస్తువుపై దృష్టి పెట్టి తేరిపార చూచేటప్పటికి అది తాను పోగొట్టుకున్న ఉంగరంలోని భగవాన్ బాబావారి బంగారు చిత్రమేనని గుర్తుపట్టారు. ఆ వస్తువు తన ఉంగరంలో నుండి ఊడిపడి అక్కడకు ఏవిధంగా చేరుకున్నదో శ్రీ శివకుమార్ శర్మకు అర్థం కాలేదు. ఆ రహస్యాన్ని ఏ తర్కము ఛేదించలేదు.

పోర్టికో పిటగోడపై పడియున్న స్వామియొక్క ఆ బంగారు చిత్రమును బయటకు తీయడం అంత తేలికైన పనికాదు. శ్రీ శివకుమార్ శర్మ ఒక చిన్న పిల్లవాడిని పిలిచి త్రాడు సహాయంతో వానిని పోర్టికోపైకి దింపి వాడిచేత ఆ వస్తువును పైకి తెప్పించారు. అప్పటికి ఆయన మనస్సు తేలికపడింది. అయితే, తరువాత ఆయన ఆ చిత్రమును ఎన్ని రకాల జిగురు పెట్టి ఉంగరముపై అతికించడానికి ప్రయత్నం చేసినా అది అతుక్కోలేదు. అందువలన ఆయన ఆ ఉంగరమును, స్వామి చిత్రమును విడివిడిగా ఒక చిన్న వెండి భరిణెలో పెట్టి తాను ఎక్కడకు వెళ్ళినా ఆ భరిణెను తనతో కూడా తీసికొని వెళ్ళేవారు. ఒకసారి ఆయన స్వీడన్ దేశములోని స్టాక్‌హోం నగరములో కచేరీ చేయడానికి వెళ్ళారు. అక్కడ ఆయనకు ఒక ప్రత్యేకరకం జిగురు లభిస్తే దాని సహాయంతో ఉంగరంపై బాబా చిత్రమును అతికించడానికి ప్రయత్నం చేశారు. అయితే, ఆ ప్రయత్నంకూడా ఫలించలేదు. ఒకరోజు రాత్రి భగవాన్ బాబా ఆయనకు కలలో కనపడి "నువ్వు ఆ ఉంగరం ఎందుకు పెట్టుకోవడం లేదు?" అని అడిగారు. సరిగ్గా ఆ మరునాడు శ్రీ శివకుమార్ శర్మ ఆ ఉంగరముపై బాబా చిత్రమును అతికించడానికి మరొకసారి ప్రయత్నించేసరికి చాలా ఆశ్చర్యంగా అది వెంటనే అతుక్కుంది!

ఈ సంఘటన జరిగిన కొన్ని నెలల తరువాత శ్రీ శివకుమార్ బొంబాయి తిరిగివచ్చారు. ఆ సమయంలో భగవాన్ బాబావారు బొంబాయి నగరమును సందర్శించారు. అప్పుడు భగవాన్, శ్రీ శివకుమార్ శర్మను ధర్మక్షేత్రమునకు వచ్చి తమ సన్నిధిలో సంతూర్ వాయించవలసిందిగా ఆహ్వానించారు. కార్యక్రమం ముగిసిన తరువాత భగవాన్ బాబా ఆయనను "నీ విదేశీ పర్యటన ఎలా సాగింది?" అని అడిగారు. శ్రీ శివకుమార్ "బాబా! మీ అనుగ్రహ, ఆశీస్సులవలన నా పర్యటన చాలా బాగా జరిగింది. కాని, నా ఉంగరం....." అని చెపుతూ అర్థోక్తిలో ఆగిపోయారు. అప్పుడు భగవాన్ బాబావారు కలుగజేసుకుని "అవును. నీకు స్వామిపై నమ్మకం ఉన్నా ఒక రోజు రాత్రి నీ మనసులో సందేహం చోటు చేసుకున్నది. అందువలన బాబా ఆ ఉంగరమునుండి అదృశ్యమయ్యారు. తరువాత ఆయన నీకు కలలో కనపడి ఉంగరం పెట్టుకోమని చెప్పారు. అప్పటినుండి ఆ ఉంగరం బాగుంది", అని జరిగిన సంగతంతా పూసగ్రుచ్చినట్లు వివరించారు.

సంవత్సరాలు గడుస్తున్నకొద్ది భగవాన్ బాబావారితో శ్రీ శివకుమార్‌కు గల అనుబంధం మరింత దృఢమవుతూ వచ్చింది. ఆయన భగవాన్ బాబావారి అపారమైన అనుగ్రహమును అనేక విధాల అనుభవించారు. ఒకసారి, భగవాన్ బాబావారి అనుగ్రహం వల్ల ఆయన కుమారుడు రాహుల్ దుబాయ్‌లో ఒక ఘోర కారు ప్రమాదంలో చిక్కుకుని మృత్యువునుండి రక్షింపబడ్డారు. భగవాన్ బాబావారు ఒకసారి బొంబాయి సందర్శించినపుడు పండిట్ శివకుమార్ శర్మ ఇంటికి వెళ్ళి ఆయనను, ఆయన కుటుంబమును ఆశీర్వదించారు. అయితే భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి అనేకమంది భక్తులవలెనే శ్రీ శివకుమార్ శర్మకూడా భగవాన్ చేతిలో "రిపేర్ షాప్ ట్రీట్‌మెంట్" తప్పించుకోలేకపోయారు. స్వామి తమ 'ఉపేక్ష' ద్వారా భక్తులను ఉత్తమమైన భక్తులుగా తీర్చిదిద్దే ఆ చికిత్స సమయంలో శ్రీ శివకుమార్ శర్మ "ఆయన మౌనమును అర్థం చేసుకోలేనివారు ఆయనయొక్క మాటలను కూడా అర్థం చేసుకోలేరు" అనే అమూల్యమైన గుణపాఠమును నేర్చుకున్నారు. అన్నిటికంటె ముఖ్యంగా "మన

అహంకారమును భగవంతుని దివ్య చరణారవిందములవద్ద అర్పణ చేయుడ" మనే మహోన్నతమైన గుణపాఠమును ఆయన నేర్చుకున్నారు. భగవాన్ బాబావారిపట్ల తన వైఖరిని, సంగీతముపట్ల తన దృక్పథమును గురించి ఒక ప్రశ్నకు సమాధానంగా పండిట్ శివకుమార్ శర్మ "నేను భగవాన్ బాబావారియందు శరణాగతిభావంతో నా సంగీత కచేరీలు చేస్తాను. నేను భగవాన్ దివ్య హస్తములలో కేవలం ఒక ఉపకరణమును మాత్రమేనని భావిస్తాను. నా సంగీతమే స్వామికి నా ప్రార్థన" అని వినమ్రతాభావంతో వెల్లడించారు.

నవానగర్ మహారాజైన కీ॥శే॥ శ్రీ రంజిత్ సింహ్‌జీయొక్క సింహాసనానికి వారసులు మరియు జామ్‌సాహెబ్‌గా ప్రసిద్ధి పొందిన మహారాజా శ్రీ దిగ్విజయ్ సింహ్‌జీ 1965వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో జామ్‌నగర్‌లోని తమ రాజమందిరంలో తీవ్ర అస్వస్థతకు గురై కదలలేని స్థితిలో ఉన్నారు. ఆయన గాల్ బ్లాడరులో రాయి చేరి నరకయాతన అనుభవిస్తున్నారు. దానికితోడు ఆయనకు మధుమేహ వ్యాధి కారణంగా కంటిలో గ్లకోమాచేత కంటిచూపుకూడా తగ్గింది. మానసికంగా ఆయన మంచి ధైర్యశాలి అయినా, గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో బాధపడుతూండడంచేత పూర్తిగా నిస్సహాయులయ్యారు. అందువలన తనకు మరణమే శరణ్యమని భావించారు. సుప్రసిద్ధ వైద్యులెందరో ఆయనకు చికిత్స చేసినా అవేమీ ఫలించలేదు. ఫలితంగా, అయిష్టంగానే అయినప్పటికి వారు శస్త్రచికిత్స చేయించుకోమని సలహాయిచ్చారు. శ్రీ జామ్‌సాహెబ్‌యొక్క దుర్బలమైన శరీరము శస్త్రచికిత్సకు తట్టుకోలేదని వారికి తెలిసినా గత్యంతరం లేక వారు ఆవిధంగా సలహాయిచ్చారు. అయితే మహారాణి గులాబ్ కున్వర్‌బా మాత్రం తన భర్త ఉన్న పరిస్థితులలో ఆయనను శస్త్రచికిత్సకొరకు బొంబాయికి తరలించడం తెలివైన పనికాదని భావించారు.


ఆ పరిస్థితులలో జామ్‌సాహెబ్ ఆ ప్రాంతములో గొప్ప యోగి పుంగవుడు మరియు పావన పురుషునిగా ప్రసిద్ధికెక్కిన తన గురువు శ్రీ అఘోరానందజీ



"భక్తుల హృదయ తంత్రులను మీటే భగవాన్ బాబా"



"ధర్మక్షేత్రంలో భగవాన్ బాబావారి దివ్య సన్నిధిలో పండిట్ శివకుమార్‌శర్మ సంతూర్ కచేరీ"



"ఆయన మౌనాన్ని అర్థం చేసుకోలేనివారు
ఆయన మాటలనుకూడా అర్థం చేసుకోలేరు"

మహారాజ్‌ను ఎలాగైనా కలుసుకుని ఆయన ఆశీస్సులు పొందాలని భావించారు. ఇంతలో రెండురోజుల తర్వాత ఆయన గురువే ఆయనను చూడడానికి రాజమందిరానికి వచ్చారు. అప్పుడు జామ్‌సాహెబ్ తన గురువును "మహారాజ్! ఈ బాధను నేనింక భరించలేను. దయచేసి నాకు నిద్రమాత్రలు ఇమ్మని డాక్టర్లకు చెప్పండి", అని ప్రార్థించారు. ఆయన ప్రార్థనకు గురూజీ హృదయం కరిగిపోయింది. అయితే, ఆ సున్నిత హృదయమును మరుగుపరుస్తూ ఆయనలో బాహ్యంగా గంభీర ప్రకృతికూడా ఉన్నది. అందువలన ఆయన "ఈ మాటలు మాట్లాడుతున్నది జామ్‌సాహెబా లేక వేరే ఇంకెవరైనానా? నీవు ఈవిధంగా బేలగా మాట్లాడడం నాకు నచ్చదు" అని కొంచెం మందలింపు ధోరణిలో చెప్పారు. జామ్‌సాహెబ్ అందుకు స్పందిస్తూ "అంతకు మించి నేనేమి చేయగలను?" అని నిస్సహాయంగా అడిగారు. అప్పుడు ఆయన గురువు తన సంచీలోనుండి ఒక ఫోటో తీసి జామ్‌సాహెబ్‌కు చూపిస్తూ "ఈయన నీకు తెలుసునా?" అని ప్రశ్నించారు. తానున్న పరిస్థితులలో జామ్‌సాహెబ్ ఆ ఫోటోను చూడడానికి కూడా అంగీకరించక "నా కెవరూ తెలియదు. మొట్టమొదట నా ఆరోగ్యం బాగుపడాలి. ఆ తరువాతనే నేను ఎవరినైనా చూడడంగాని, వారిని గురించి తెలుసుకోవడంగాని చెయ్యగలను", అని స్పష్టంగా చెప్పారు. జామ్‌సాహెబ్ నిర్ణయాన్ని విన్న ఆయన గురువు "తన శిష్యుని భగవంతునివైపు నడిపించడం గురువుయొక్క కర్తవ్యము. ఈ చిత్రములో ఉన్న వ్యక్తి మానవరూపములో అవతరించిన దైవము. ఆయనవైపు చూచి ఆయనను ప్రార్థించుకో", అని ఆజ్ఞాపించారు. తరువాత తన చేతిలో ఉన్న ఫోటోను తన శిష్యుడైన మహారాజు చూడగలిగేటట్లు దానిని దీపం క్రింద ఎత్తి పట్టుకున్నారు. జామ్‌సాహెబ్ కొంత శ్రమతో ఆ ఫోటోలో ఉన్న చిత్రమును చూచి "ఈయన సాయిబాబా" అని గొణిగారు. అప్పుడు ఆయన గురువు "అవును; ఆయన భగవాన్ శ్రీ సత్యసాయిబాబా. నీ మనస్సును, శరీరములో నొప్పి నుండి ఆయనవైపు మరల్చు. నీ బాధ తొలగించే శక్తి ఆయనకు ఉన్నది. నువ్వు చేయవలసిందల్లా నీ హృదయపు లోతులనుండి ఆర్తితో ఆయనను ప్రార్థించడమే",

అని చెప్పారు. ఆ గురూజీ యొక్క మాటలు పరిపూర్ణమైన విశ్వాసముతో నిండియుండి, తన శిష్యుడగు మహారాజా జామ్‌సాహెబ్‌లో జీవితముపై క్రొత్త ఆశను చిగురింపజేశాయి. ఇంతలో మహారాణి బయట ఎవరితోనో గట్టిగా మాట్లాడుతూండడం విని గురూజీ బయటకువెళ్ళారు.

అప్పుడు మహారాణి "ఎవరో ఒక వ్యక్తి వచ్చి మహారాజాను వెంటనే కలవాలని చెబుతున్నాడు. ఇదెలా సాధ్యపడుతుంది? మహారాజా వారి ఆరోగ్యం బాగులేనందువల్ల ఎవరినీ కలవడానికి వీలుపడదని చెప్పినా, అయన తాను మహారాజానో, మహారాణినో కలవకుండా అక్కడినుండి వెళ్ళనని భీష్మించుకు కూర్చున్నాడు" అని గురూజీకి పరిస్థితిని వివరించింది. అందుకు ఆయన "పాపం! ఆయన ఎంతో దూరంనుండి వచ్చి ఉంటాడు. ఒకసారి ఆయనను మిమ్మల్ని చూడడానికి అనుమతించకూడదా?" అని సలహాయిచ్చారు. మహారాణి తిరిగి "మహరాజ్! ఇక్కడ నా భర్త చావుబ్రతుకుల్లో ఉంటే నేనెలా ఆ వ్యక్తిని కలుసుకొనేది?", అని ఆయనను ప్రశ్నించింది. అప్పుడు గురూజీ "ఆ వ్యక్తి ఎవరో మనకు బాగా కావలసిన వ్యక్తి అయ్యుంటాడు. పద; మనిద్దరం వెళ్ళి ఆయనను కలుసుకుందాం!" అని తన నిర్ణయాన్ని ప్రకటించారు.

ఇంతలో ఆ వ్యక్తి వారి అనుమతిని తీసుకుని పైకి వచ్చాడు. ఆ వచ్చిన వ్యక్తి యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన డా॥ గాడియా. అయితే, అంతకు పూర్వము ఆయన జామ్‌నగర్‌కు చెందినవారే! ఆయన ఎంతో వినయంగా "మీకు ఇబ్బంది కలిగిస్తున్నందుకు క్షమించండి. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు నన్నిక్కడికి పంపించారు. రెండు రోజుల క్రితం నేను పుట్టపర్తిలో ఉన్నాను. భగవాన్ బాబావారు మహారాజావారికి ఆరోగ్యం బాగులేదని చెప్పి ఈ విభూతిని ఆయనకు అందజేయుమని నా చేతికిచ్చారు", అని చెపుతూ ఒక పెద్ద విభూతి పేకెట్‌ను మహారాణికి అందజేశారు. ఆమె ఆశ్చర్యపోయింది. కాని, ఆమె గురూజీకి మాత్రం ఎటువంటి ఆశ్చర్యము కలుగలేదు. నిజానికి, ఆ విషయం ఆయనకు అంతకుముందే తెలిసినట్లున్నది.

దాంతో ఆయన చిన్న పిల్లవానివలె చాలా సంతోషంగా "ఆయన మనకు చాలా కావలసినవారని నేను నీకు చెప్పలేదా? నేను ఇదివరకే భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి ఫోటోను మహారాజా మంచం ప్రక్కన పెట్టాను. ఇప్పుడేమో ఆయన పవిత్రమైన తన విభూతి ప్రసాదమును పంపించారు", అని చెప్పారు.

అప్పుడు మహారాణి డా॥ గాడియాకు కృతజ్ఞతలు తెలుపుతూ స్వామి పంపిన విభూతి ప్రసాదమును తీసుకున్నారు. డా॥ గాడియా మహారాణి వద్ద శలవు తీసుకుని వెళ్ళిపోయారు. మహారాణి వెంటరాగా గురూజీ మహారాజా పడుకున్న గదిలోనికి వెళ్ళి బయట జరిగిన విషయమంతా మహారాజాకు వివరించారు. తరువాత ఒక గ్లాసుతో మంచినీళ్ళు తెప్పించి స్వామి పంపిన విభూతి పేకెట్టులోనుండి కొంచెం విభూతి తీసి ఆ నీటిలో కలిపి జామ్‌సాహెబ్‌ను అది త్రాగుమని చెప్పారు. కొంత విభూతి తీసి ఆయన కడుపుపై వ్రాశారుకూడా. వాళ్ళిద్దరూ ఆ రోజు జరిగిన వింత సంఘటన గురించి ముచ్చటించుకుంటూండగానే గత మూడు రోజులనుండి కంటిమీద కునుకైనా లేని జామ్‌సాహెబ్ మెల్లగా నిద్రలోకి జారుకున్నారు. దాంతో అక్కడున్న వారందరికి ఎంతో విశ్రాంతి లభించింది. మరునాడు ఉదయం మహారాజావారు నిద్ర లేచేటప్పటికి ఆయన నొప్పి పూర్తిగా మాయమైంది. ఆ విధంగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు ఆ రాజ దంపతుల జీవితాలలో ప్రవేశించి వారికి ఉపశమనమును, ఆనందమును కలుగజేశారు. ధన్యుడైన ఆ దంపతులయొక్క గురువుకూడా తన శిష్యులను భగవంతునివైపు నడిపించే తమ కర్తవ్యమును నెరవేర్చారు.

ఆ రోజునుండి మహారాజావారి ఆరోగ్యము నెమ్మదిగానైనా, క్రమంగా మెరుగైంది. ఆరు నెలలు గడిచేటప్పటికి కొద్దిగా కంటి చూపులో దోషము తప్పించి, ఆయన పూర్తి ఆరోగ్యవంతులైనారు. 1965వ సంవత్సరం డిశంబరు నెలలో ఆయన ప్రశాంతి నిలయము వెళ్ళి భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్నారు. ఆయనతోబాటు ఆయన పెద్దల్లుడు రాజ్‌కుమార్ నరహరిసింహ్‌జీ

కూడా వెళ్ళారు. ఆ సందర్భంలో భగవాన్ బాబావారు ఒక స్వీటును సృష్టించి మహారాజాకు ఇచ్చారు. అయితే, అదేమి స్వీటో ఆయనకు అర్థంకాలేదు. అది పాలమీగడ రంగులో ఉన్నది. అది చేతికి అంటుకునేటట్లు లేదు; అలాగని చెప్పి పూర్తిగా పొడిగాను లేదు. ఇక, దాని రుచిని గురించి "నేను ప్రపంచమంతా తిరిగాను. కాని, అటువంటి రుచికరమైన స్వీటును ఎక్కడా చూడలేదు", అని మహారాజా వర్ణించారు. భగవాన్ బాబావారు ఆ అలౌకికమైన ప్రసాదములో ఎక్కువ భాగమును మహారాజావారి చేతిలో పెడుతూ "నువ్వు డయాబెటిక్ కదా!" అని అడిగారు. ఆయన "అవును స్వామీ!" అని బదులు చెప్పారు. స్వామి మళ్ళీ "ఫరవాలేదులే! స్వామి ప్రసాదంగా ఇచ్చినపుడు నువ్వు నిస్సంకోచముగా తినవచ్చు", అని ధైర్యం చెప్పారు. మహారాజా ఆ ప్రసాదమును భుజించిన తరువాత భగవాన్ "జామ్‌సాహెబ్! ఇప్పుడు చెప్పు; నీకేం కావాలి", అని అడిగారు. "స్వామీ! మీ ఆశీస్సులే నాకు చాలు", అని మహారాజా అమితమైన విశ్వాసంతో తెలియజేశారు. అప్పుడు స్వామి మళ్ళీ "నీ కంటి చూపు నీకు తిరిగిరావాలని కోరుకుంటున్నావా?" అని ప్రశ్నించారు. అందుకు మహారాజావారు "ఈ ప్రపంచములోని వస్తువును దేనినైనా చూడడానికి నా కంటి చూపు వద్దు స్వామీ! మీ స్వరూపమును నేను స్పష్టంగా దర్శించుకోలేకపోయినప్పటికి, మీ దివ్య మంగళ రూపము నా హృదయములో ఏనాడో ముద్రితమైయున్నది. నా జీవితంలో చివరిసారిగా సోమనాథ్ దేవాలయములోని దేవతామూర్తిని సందర్శించుకోవాలని నా ఆకాంక్ష", అని తెలియజేశారు. అందుకు భగవాన్ బాబా "నేనే స్వయంగా నిన్ను సోమనాథ్‌కు తీసికొని వెడతాను", అని ఆయనకు మాటయిచ్చారు.

భగవాన్ బాబావారి మాటలకు ఆనందంతో, తృప్తితో జామ్ సాహెబ్ జామ్‌నగర్ తిరిగి వచ్చేశారు. 1966వ సంవత్సరం ఫిబ్రవరి నెల రెండవతేదీ తెల్లవారుఝామున తన అంతిమక్షణాలు సమీపించేవరకు ఆయన చాలా ఆనందంగా గడిపారు. ఆ రోజున ఆ సమయంలో హఠాత్తుగా ఆయనకు తీవ్రమైన గుండెపోటు వచ్చింది. అయితే, దానివల్ల ఆయనకు ఎటువంటి

బాధ కలుగలేదు. చాలా ఆశ్చర్యకరంగా చుట్టుప్రక్కల ఉన్నవారు, ఆయనకు చికిత్స చేస్తున్న డాక్టర్లు కూడా విస్తుపోయి చూస్తుండగా జామ్‌సాహెబ్ తన నాడి జీరోకు పడిపోయినా అక్కడ ఉన్న కుర్చీలలో ఒకదానినుండి మరొకదానికి మారుతూ వచ్చారు! చివరకు ఆయన తన మంచంపైన ఎత్తుగా అమర్చబడిన దిండుకు ఆనుకుని కూర్చుని తనకు చికిత్స చేసిన డాక్టర్లకు, సేవ చేసిన నౌకర్లకు కృతజ్ఞతలు తెలిపారు. తరువాత మంచంపై పడుకోబోతూ మహారాణితో "మహారాణి! నీకుకూడా నా కృతజ్ఞతలు. నీవు చాలా ఉత్తమురాలవు. భగవంతుడు ఎల్లప్పుడూ నీకు తోడుగా ఉంటాడు", అని చెప్పి ఆమె అందించిన గంగాజలమును కొంచెం త్రాగి ప్రశాంతంగా కన్ను మూశారు.

జామ్‌సాహెబ్ మరణించిన వారం రోజుల తరువాత, మహారాణికి ప్రశాంతి నిలయమునుండి ఒక ఉత్తరం వచ్చింది. ఫిబ్రవరి 3వ తేదీన వ్రాయబడిన ఆ ఉత్తరం మహారాణికి మేనకోడలు మరియు కచ్ రాకుమారి అయిన నందకుమారివద్ద నుండి వచ్చింది. ఆ సమయంలో ఆమె ప్రశాంతి నిలయంలో ఉన్నారు. భగవాన్ బాబావారు ఆమెను పిలిచి మహారాజావారి మరణమును గురించి ఆమెకు తెలియజేసి తన తరపున మేనత్తకు ఒక ఉత్తరం వ్రాయమని చెప్పారు. ఆ ఉత్తరంలో వ్రాయవలసిన విషయాలను గురించి "మహారాణికి నా ఆశీస్సులను అందజేయి. మహారాజావారి ఆత్మ ఏ పరిస్థితులలో ఉన్నదని ఆమె చాలా ఆందోళనగా ఉన్నది. నేను ఆయన అంతిమ క్షణాలలో ఆయన వద్దనే ఉన్నదని, ఆయన అంతిమ కోరిక ననుసరించి ఆయనను సోమనాథ్ దేవాలయానికి తీసికొని వెళ్ళానని, చివరకు ఆయనకు మోక్షమును ప్రసాదించానని మహారాణికి తెలియజెయ్యి" అని భగవాన్ చెప్పారు. మహారాజావారి మరణంతో శోకతప్త హృదయురాలైన మహారాణికి ఆ ఉత్తరం కొంత ఉపశమనమును చేకూర్చింది. ఆ ఉత్తరంద్వారా భగవాన్ ఆమెకు తనయందు పరిపూర్ణమైన విశ్వాసము ఏర్పడేటట్లు, తనను "సాక్షాత్ పరమేశ్వర స్వరూపుని' గా విశ్వసించేటట్లు చేశారు. భగవాన్ బాబావారి భక్తులకు ఒక సందర్భంలో ప్రేమపూర్వకంగా సలహాయిస్తూ ఆమె "స్వామి సాక్షాత్తూ ఈశ్వరుడే!

ఆయన ఆడే మాయానాటకం చూసి భ్రాంతిలో పడవద్దు. ఆయన అటువంటి మాయానాటకం ఆడడంలో సిద్ధహస్తులు", అని చెప్పారు.

1966వ సంవత్సరం ఏప్రిల్ నెలలో తన కుమారుడు మరియు యువరాజు అయిన శ్రీ శత్రుశల్య సింహ్‌జీ సింహాసనానికి ఉత్తరాధికారి అయినప్పుడు 'మహారాణి' గులాబ్ కున్వర్‌బా 'రాజమాత' అయ్యారు. ఆ సమయంలో ఆమె తన కుమారుని ప్రవర్తనతో చాలా చాలా విసిగిపోయారు. ఆమె దృఢ సంకల్పము, గొప్ప ఆత్మగౌరవము గల వ్యక్తి. ఆ పరిస్థితులలో ఆమె భగవాన్ బాబావారిని మే నెలలో తన సోదరి కచ్ మహారాణి నివాసంలో కలిసినప్పుడు భగవాన్‌తో ఆ విషయం ఇంకా ఆమె ప్రస్తావించక ముందే ఆయన "నువ్వు దేనిగురించీ విచారించవలసిన అవసరం లేదు. నేనే నీ కుమారుణ్ణి", అని చెప్పారు. భగవాన్ బాబా వారి ఆ ఒక్క వాక్యము ఆమె ఆందోళనలనన్నింటిని శాశ్వతంగా దూరం చేసింది. అవతార పురుషులైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్యాశీస్సులతో ఆ 'రాజమాత' 'దేవమాత'గా మారిపోయింది. కొద్ది రోజుల అనంతరం భగవాన్ బాబావారు బొంబాయిలోని ఆమె నివాసమును సందర్శించారు. ఆమె కుమార్తె హిమాంశుకుమారి, భగవాన్ బాబావారి దివ్యత్వమునందు తనకు విశ్వాసము ఏర్పడడానికి ఏదైనా ఒక నిదర్శనము చూపవలసిందిగా ఆయనను తన మనసులోనే ప్రార్థించారు. కరుణామయులైన సత్యసాయి ప్రభువు తక్షణమే స్పందించారు. ఫలితంగా, ఆమె తన కీర్తిశేషులైన తండ్రిని భగవాన్ బాబావారిలో చూడగలిగింది. ఆమెకు దుఃఖము ఆగలేదు. భగవాన్ బాబావారియందు కృతజ్ఞతాభావంతో పొంగిపొరలిన కన్నీరు ఆమె హృదయంలో మిగిలిఉన్న సందేహమనే కళంకమును పూర్తిగా తుడిచివేసింది.

రాజమాత గులాబ్ కున్వర్‌బా భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి అవతార కార్యక్రమానికి తన్నుతాను పరిపూర్ణంగా అర్పించుకున్నది. 1968వ సంవత్సరంలో వయో వృద్ధురాలైన రాజమాత భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి

దివ్య సన్నిధిలో తన శేష జీవితమును గడపాలని బృందావనం చేరుకున్నారు. భగవాన్ ఆమెను తన మందిరంలోనే నివసించమని ఆహ్వానించారు. బృందావనంలోని ఆశ్రమంలో భగవాన్ బాబావారు ఆమె కొరకు కేటాయించిన స్థలంలో 1971వ సంవత్సరంలో 'దేవీ నివాస్' నిర్మింపబడేవరకు రాజమాత భగవాన్ మందిరంలోనే నివసించారు. 1972వ సంవత్సరంలో శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు నెలకొల్పబడినప్పుడు భగవాన్ బాబా ఆమెను అందులో సభ్యురాలిగా నియమించారు. తరువాత 1981వ సంవత్సరంలో పరిగణిత విశ్వవిద్యాలయమైన (Deemed University) శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ నెలకొల్పబడినప్పుడు స్వామి రాజమాతను విశ్వవిద్యాలయ ట్రస్టులో కూడా సభ్యురాలిగా నామినేట్ చేశారు. వీటితో బాటు ఆమె శ్రీ సత్యసాయి సేవా సంస్థల వరల్డు కౌన్సిలులో సభ్యురాలు కూడా. ఈ విధంగా భగవాన్ బాబావారి అవతారోద్యమంలో ఆమెయొక్క పాత్ర నిరుపమానమైనది.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారికి, రాజమాతకు మధ్య గల మధురమైన అనుబంధమునకు మచ్చుతునకలైన కొన్ని ఆసక్తికరమైన సంఘటనలు ఈ క్రింద ఉదహరించబడినవి. అయితే, భగవాన్ బాబావారి ఔదార్యమే ఆ మాధుర్యములోని పరిమళం.

1973వ సంవత్సరం మార్చినెల 31వ తేదీన భగవాన్ బాబావారు మూడవసారి జామ్‌నగర్‌కు వచ్చినపుడు, రాజ్‌కోట్‌లోని రాజ్‌కుమార్ కాలేజిలో శ్రీ దిగ్విజయ్ సింహ్‌జీ విభాగమునకు ప్రారంభోత్సవం జరిపి మధ్యాహ్నమునకు అమర్ విలాస్ పేలస్‌కు చేరుకున్నారు. ఆయన కారువెంట అనేక కార్లు బయలుదేరాయి. ఆ కార్లలో ఒకదానిలో రాజమాతకూడా ఉన్నారు. ఆమె కార్యక్రమాలు నిర్వహించడంలో అందె వేసిన చేయి. ప్రతి చిన్న విషయాన్ని స్వయంగా చూసుకుంటూ ఎక్కడా ఏ లోపము జరుగకుండా కార్యక్రమం చక్కగా జరిగిపోయేలా ఏర్పాటు చేస్తారు. ఆ రోజున స్వామి రాజ భవనమునకు వచ్చేటప్పుడు, ఆమె 'షేక్' అని అందరిచేత ఆప్యాయంగా పిలువబడే తన అరబ్ సెక్యూరిటీ గార్డును పిలిచి పోర్టికోలోనికి, భవనంలోపలికి ఎవరూ

చెప్పులతో రాకుండా ఉండేటట్లు చూడమని ఆదేశాలు జారీ చేశారు. తన ప్రియతమ ప్రభువైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు రాజప్రాసాదానికి వస్తున్నందున అక్కడి వాతావరణమంతా పవిత్రంగా ఉండాలని ఆమె ఉద్దేశ్యం. ఇంతలో భగవాన్ ప్రయాణిస్తున్న కారు పోర్టికోలోనికి వచ్చి ఆగింది. భగవాన్ కారు దిగుతూండగా ఆయనకు స్వాగతం పలుకడానికి అక్కడ చేరిన కమిటీ సభ్యులు సకల గౌరవ, లాంఛనాలతో స్వామిని లోపలికి తీసికొని వెళ్ళడానికి ముందుకు వచ్చారు. అయితే ఆ అరబ్‌షేక్ వీరందరిని దాటుకుని ముందుకు వచ్చి "బాబా! జోళ్ళు విడిచి లోపలికి రండి!" అని భగవాన్ బాబావారితో చెప్పాడు. దాంతో అక్కడున్న వాళ్ళందరూ భయపడిపోయారు. భగవాన్ బాబావారు మాత్రం ఆ సెక్యూరిటీ గార్డు కోరికను మన్నించి చెప్పులు తీసివేశారు! అంతేకాదు, ఆ మండుటెండలో కాలుతున్న ఇసుకపై ఉత్త పాదాలతో నడుస్తూ అక్కడ ఏర్పాటు చేయబడిన హోంగార్డుల గౌరవాభివందనం స్వీకరించడానికి ఉపక్రమించారు.

కొద్ది క్షణాలలోనే రాజమాత అక్కడికి చేరుకుని తన సెక్యూరిటీగార్డు చేసిన భగవదపరాధమును గురించి తెలుసుకున్నారు. వెంటనే ఆమె భగవాన్ బాబావారివద్దకు పరుగెత్తి ఆయనకు విశేషంగా క్షమాపణలు చెప్పుకుని, తన చేతులతో తీసికొని వచ్చిన పాదరక్షలను ధరించమని ఆయనను వేడుకుంది. అయితే, భగవాన్ బాబావారు మాత్రం ఆమె తొట్రుపాటును లెక్కచేయక నడివేసవిలో మండుటెండలో కాలిపోతున్న ఆ ఇసుకపై పాదరక్షలు లేకుండా సునాయాసంగా గాలిలో తేలిపోతున్నట్లు నడుస్తూ వెళ్ళి హోంగార్డుల గౌరవాభివందనం స్వీకరించారు! భగవాన్ పోర్టికోలోనికి తిరిగి వచ్చాక, అక్కడ రాజమాత ఆ అరబ్‌షేక్ చేసిన క్షమించరాని అపరాధమునకు అతనిని కోప్పడడం గమనించారు. ఆ సమయంలో ఆ సెక్యూరిటీగార్డుయొక్క ప్రార్థనాపూర్వకమైన నేత్రములు భగవాన్ బాబావారి కరుణాపూరిత నయనములను కలుసుకున్నాయి. అప్పుడు భగవాన్ రాజమాతయొక్క కోపమును ఉపశమించే ప్రయత్నం చేస్తూ "రాజమాతా! ఇందులో అతని తప్పేమీ లేదు. నీవు పాదరక్షలను గురించి


ఆదేశాలు జారీ చేసేటప్పుడు నా విషయంలో ఆ ఆదేశాలు వర్తించవని అతనికి చెప్పలేదు. అతని విశ్వాస పాత్రత, కర్తవ్యపాలనాదీక్ష నాకు నచ్చాయి", అని చెప్పారు. భగవాన్ బాబావారి మాటలు విన్న ఆ సెక్యూరిటీ గార్డు కళ్ళనుండి కృతజ్ఞతా పూర్వకమైన అశ్రువులు పొంగిపొరలాయి. భగవాన్ బాబావారు మానవరూపంలో అవతరించిన దైవమని నమ్మినా ఆతడు తన యజమానురాలి ఆజ్ఞల ననుసరించి తన కర్తవ్యమును తాను నెరవేర్చాడు. అందుకు భగవాన్ బాబావారు అతని భుజం తట్టి అభినందిస్తూ ఒక తాయెత్తును సృష్టించి అతనికి ప్రసాదించారు. అది ఆకుపచ్చ, సిమెంటు రంగులు కలసిన, 1"×1" సైజు గల, అరబిక్ భాషలో ఖురానునుండి ఒక సూక్తి చెక్కబడిన విలువైన రాయి. అనూహ్యమైన రీతిలో లభించిన భగవాన్ అనుగ్రహ ప్రసాదమునకు మురిసిపోతూ ఆ అరబ్‌షేక్ తన యజమానురాలివైపు కృతజ్ఞతా భావంతో చూశాడు. అందుకు కారణం, ఆమె తనను ఆ విధంగా కోప్పడకపోతే తనకు భగవాన్ బాబావారినుండి అమూల్యమైన ఆ కానుక లభించియుండేది కాదని అతడు భావించడమే!

1970వ సంవత్సరం డిశంబరు నెలలో భగవాన్ బాబావారు బెంగుళూరునుండి బొంబాయి వెడుతూ దారిలో పూనాలోని రాజమాత నివాస గృహమైన "జామ్‌నగర్ హౌస్"లో ఆగారు. మరునాడు ఉదయం ఆ భవన ప్రాంగణంలో ఒక బహిరంగ సభ ఏర్పాటు చేయబడింది. భగవాన్ ఆ సభలో తమ దివ్యోపన్యాసం చేశారు. ఆ సమయంలో రాజమాత తమ కుమార్తె హిమాంశు కుమారితో కలసి వంటగదిలో భోజన ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. అక్కడ కిటికీలోనుండి భగవాన్ దర్శనం చేసుకుంటూ ఆయన ఉపన్యాసాన్ని వాళ్ళు వింటున్నారు. ఉపన్యాసం పూర్తయిన తరువాత భగవాన్ కొన్ని భజన గీతములను ఆలపించడం మొదలుపెట్టారు. ఇక్కడ రాజమాత కూడా కన్నులు మూసికొని తన్మయత్వంలో స్వామిని అనుసరించి భజన పాటలు పాడుతున్నారు. భగవాన్ స్వయంగా కొన్ని భజన పాటలు పాడిన తరువాత భక్తులను భజన కార్యక్రమం కొనసాగించుమని చెప్పి వెనుకవైపు ద్వారమునుండి వంటగదిలోనికి

విచ్చేశారు. ఈలోపుగా రాజమాత భక్తి పారవశ్యంలో మునిగి స్వామి రాకను గమనించలేదు. భజన పాటలు పాడుతూ ఉండిపోయింది. అప్పుడు భగవాన్ అక్కడున్న ఆమె కుమార్తెను, మిగిలినవారిని ఆమె ఏకాగ్రతకు భంగము కలిగించవలదని సంజ్ఞ చేసి ఆమె వెనుకకు వెళ్ళి ఆమె పాటలను వింటూ ఉండిపోయారు. కొంతసేపైన తరువాత రాజమాత మామూలు స్థితికి వచ్చి వంటగదిలో ఏర్పాట్లు ఎంతవరకు వచ్చాయో తెలుసుకోవడానికి వెనుదిరిగి చూచింది. అక్కడ భగవాన్ బాబావారిని చూచి నిశ్చేష్టురాలైంది. అప్పుడు భగవాన్ ఆమెతో "రాజమాతా! నువ్వు చాలా బాగా పాడతావు. ఇప్పుడు నువ్వు పందిరిలోనికి వెళ్ళి అక్కడ భజన పాటలలో లీడ్ చెయ్యి", అని చెప్పారు. ఆ మాటలకు ఆశ్చర్యపోయిన రాజమాత "లేదు స్వామీ! నా వల్ల కాదు! నేనింతవరకు ఎప్పుడూ భజనలలో లీడ్ చెయ్యలేదు", అని చెప్పింది. స్వామి మళ్ళీ "అలా కాదు; ఇంతకాలం నేను ఎన్నోమార్లు భజన పాటలు పాడుతూంటే నువ్వు విన్నావు. ఇప్పుడు నువ్వు పాడితే నేను వినాలి", అని బలవంతపెట్టారు. రాజమాత "స్వామీ! దయచేసి నన్ను ఇబ్బంది పెట్టకండి....." అని మాట మారుస్తూ "అసలు మీరు ఇక్కడికి ఎందుకు వచ్చారు?" అని అడిగింది. అందుకు సమాధానంగా స్వామి "నువ్వు ఇక్కడ ఏమి చేస్తున్నావో చూద్దామని, నీ భజన పాటలు విందామని వచ్చాను! అది సరే! అసలు ఎంతమంది కొరకు వంట చేశారు?" అని అడిగారు. "సుమారు 60 మందికి భోజనం ఏర్పాట్లు చేశాము, స్వామీ!" అని రాజమాత సమాధానం చెప్పారు.

అప్పుడు భగవాన్ బాబా వండిన పదార్థాలు నిలువచేసిన చోటుకు వెళ్ళి ఒక్కొక్క పాత్రపైన మూత తీసి అందులో ఏ పదార్థం ఉందో తెలుసుకున్నారు. అలా వండిన వంటకములను అన్నిటిని స్వామి ఆశీర్వదించారు. తరువాత మళ్ళీ పందిరిలోనికి వెళ్ళి అక్కడ హారతి తీసుకున్నారు.


తరువాత అతిథులు కొందరితో కలసి స్వామి భోజనం చేస్తూ ఇంకా ఆ రోజున భోజనం చెయ్యవలసిన జనం సంఖ్యను పెంచుతూ వచ్చారు. ఆవిధంగా



"భగవాన్ బాబావారు అరబ్‌షేక్ కోరికను మన్నించుట"



"మండుటెండలో పాదరక్షలు లేకుండా హోంగార్డుల గౌరవవందనం స్వీకరిస్తున్న భగవాన్ బాబా"



"శ్రీ సోమనాథ దేవాలయంలోని గర్భగుడిలో భగవాన్ బాబా"



"దైవమాత అయిన రాజమాత"

భగవాన్ ఆదేశానుసారం అంతకంతకు ఎక్కువమంది జనం భోజనానికి ఆహ్వానించబడ్డారు. వేరొక ప్రక్క వండిన పదార్థాలు వచ్చిన అతిథులకు సరిపోవేమోనని రాజమాత ఆందోళన చెందుతున్నారు. నిమిష నిమిషానికి ఆమెకు గాభరా ఎక్కువైపోతోంది. అయితే భగవాన్ బాబావారు నిమ్మకు నీరెత్తినట్లు చాలా ప్రశాంతంగా ఆమెను చూచి చిరునవ్వు నవ్వుతూ ఉండిపోయారు. ఎట్టకేలకు భోజన కార్యక్రమం పూర్తయ్యేటప్పటికి, 700 మంది ఎటువంటి సమస్య లేకుండా హాయిగా, తృప్తిగా భోజనం చేశారని, ఇంకా పదార్థాలు మిగిలిపోయాయని తేలింది. ఆ రోజున వంటగదిలో ఉన్న ప్రతి ఒక్కరూ ప్రతి ఒక్క పాత్ర అక్షయపాత్రగా మారిన అద్భుత లీలకు ప్రత్యక్ష సాక్షులుగా మిగిలారు!

బెంగుళూరులోని వైట్‌ఫీల్డులో గల భగవాన్ బాబావారి ఆశ్రమం బృందావనంలో స్వామి భక్తులకు దర్శనం ఇచ్చే హాలులో ప్రతిష్ఠించడానికి శ్రీకృష్ణుని ఒక నూతన విగ్రహం తెప్పించబడింది. శ్రీకృష్ణుడు త్రిభంగి ముద్రలో నిల్చుని మురళి వాయిస్తున్నట్లు ఉన్న ఆ విగ్రహం అత్యంత మనోహరమైన కళాఖండము. ఆ విగ్రహమును ఒక ట్రక్కులో మందిరం ముందు భాగమునకు తెచ్చి క్రిందకు దింపిన తరువాత, విద్యార్థులు దానిని తమ చేతులతో ఎత్తి లోపలికి తీసికొనివెళ్ళారు. ఈ మొత్తం కార్యక్రమమంతా భగవాన్ బాబావారి పర్యవేక్షణలో జరిగింది. తరువాత స్వామి రాజమాతను పిలిచి విగ్రహమును ఒకసారి చూడమని చెప్పారు. ఆమె లోపలికి వచ్చి ఆనందం ముప్పిరిగొన్న ముఖంతో ఆ విగ్రహమును తేరిపార చూస్తూండగా స్వామి "రాజమాతా! ఈ కృష్ణుడు ఎలా ఉన్నాడు? చాలా అందంగా ఉన్నాడు కదూ!" అని ఆమెను అడిగారు. ఆ ప్రశ్నకు రాజమాత భగవాన్ బాబావారివైపు ఆరాధనా భావంతో చూచి "నా కన్నయ్య (కృష్ణుడు) అంత అందంగా ఎవరూ ఉండరు", అని సమాధానం చెప్పింది. ఆ మాట విన్న భగవాన్ బాబావారి సుందర ముఖారవిందముపై ముగ్ధ మనోహరమైన ఒక చిరునవ్వు వెలిసింది. అక్కడే ఉన్న బృందావనం కాలేజి ప్రిన్సిపాలువైపు తిరిగి స్వామి "ఆమె కన్నయ్య ఎవరో

నీకు తెలుసా?" అని అడిగారు. ఆ ప్రశ్నకు సమాధానం ఆయనకు తెలియకపోవడంచేత స్వామివైపు ఆయన తొట్రుపాటుతో చూశారు. అప్పుడు భగవాన్ సగర్వంగా తమవైపు చూపిస్తూ 'నేనే' నన్నట్లు లీవిగా తమ శిరస్సును అడించారు!

సెప్టెంబరు 26వ తేదీ రాజమాతయొక్క జన్మదినం. క్రితం సంవత్సరం ఆమె పుట్టిన రోజున భగవాన్ బాబావారు ఆమె నివాస గృహమైన 'దేవీ నివాస్'కు వెళ్ళి ఆమెకు దర్శనం అనుగ్రహించి ఆశీస్సులందజేశారు. ఆమెను చూడగానే స్వామి "హేపీబర్త్‌డే టు యూ రాజమాతా!" అని పాడడం మొదలుపెట్టారు. అప్పుడు ఆమెకూడా స్వామిని అనుకరిస్తూ పాటపాడుతూ ఆయనవద్దకు నడిచివెళ్ళింది. తరువాత స్వామిని "స్వామీ! ఈ రోజు మిమ్మల్ని నేను ఒక పుట్టినరోజు కానుక ఇమ్మని అడుగుదామనుకుంటున్నాను. మీరు తప్పక ఇవ్వాలి!" అని అడిగింది. "అదేమిటి, చెప్పు" అని ప్రశ్నించారు, స్వామి. అందుకు రాజమాత "అలా కాదు; ముందు మీరు ఇస్తానని మాట ఇవ్వాలి; ఆ తరువాతనే నా కోరిక ఏమిటో చెపుతాను" అని చెప్పింది. స్వామి మళ్ళీ ఆమెను "మొట్టమొదటి నీకు ఏమి కావాలో చెప్పు; నీ కోరిక తీరుస్తాను" అని కవ్వించారు. ఈవిధంగా భగవంతునికి, భక్తురాలికి మధ్య కొంతసేపు వాదన జరిగింది. చివరకు భగవంతుడే దిగివచ్చి "సరే! నీవు ఏది కోరుకుంటే అది ఇస్తానని వాగ్దానం చేస్తున్నాను. ఇప్పుడు చెప్పు, నీకేమి కావాలో" అని అడిగారు. అప్పుడు రాజమాత "భగవాన్! నాకు మరణమును ప్రసాదించండి" అని కోరింది. భగవాన్ బాబా ఆమె శిరస్సుపై తమ దివ్య హస్తమును ఉంచి 5 నిమిషాలపాటు అలాగే ఉండిపోయారు. అమూల్యమైన ఆ 5 నిమిషాల సమయంలో ఆమెకు ఏమైందో ఎవరికీ తెలియదు. దివ్యమైన ఆ అనుభూతిని గురించి కొన్నాళ్ళ తరువాత మాట్లాడుతూ రాజమాత "స్వామి సాక్షాత్తూ భగవంతుడే! నేను దర్శించాలనుకున్న దివ్య లోకములన్నిటిని ఆ ఐదు నిమిషాలలో ఆయన నాకు చూపించారు!" అని వర్ణించింది.

ఆనాటినుండి ఆమె తాను చనిపోయిన తరువాత ఎవరెవరు ఏయే విషయాలలో ఏమి చెయ్యాలో వివరంగా తన కుటుంబ సభ్యులందరికి ఆదేశాలు

జారీ చేస్తూ వచ్చింది. అంతేకాక, ఒక వ్యక్తి నిజంగా చనిపోయాడా, లేదా అనే విషయాన్ని తెలుసుకోవడం ఎలాగో అనే విషయాన్ని గురించి తన మనుమనికి వివరించింది. ఆరు రోజుల తరువాత ఒక రోజు తెల్లవారుఝామున 4 గంటలకు టేపు రికార్డరులో తన ప్రియతమ ప్రభువు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు పాడిన భజన పాటలు వింటూ ప్రశాంతంగా తన భౌతికకాయమును వీడింది. చనిపోవడానికి కొన్నిగంటల ముందు తన కుమార్తెను, మనుమని పిలిచి "ఇక నాతో ఎవరూ మాట్లాడకండి. నేను భగవాన్ బాబావారి కంఠస్వరమును మాత్రమే వినాలనుకుంటున్నాను" అని చెప్పింది.

ఆ రోజు సూర్యోదయం తరువాత భగవాన్ బాబావారు 'దేవీ నివాస్'కు వచ్చి తమ ప్రియ భక్తురాలి మృతదేహమును చూస్తూ తనలో తాను "ఇక నుంచి నాతో ఎవరు 'జగడ' మాడతారు?" అని గొణుక్కున్నారు. హిందీ భాషలో 'జగడా' అంటే 'పోట్లాట' అని అర్థం. భగవాన్ బాబావారికి, రాజమాతకు మధ్యగల అత్యంత రమణీయమైన అనుబంధములో ఒక అద్వితీయమైన అంశమేమిటంటే, అనేక సందర్భాలలో తనతో విభేదించే స్వతంత్రమును భగవాన్ ఆమెకు ప్రసాదించారు. ఒక్కొక్కప్పుడు తనతో వాదోపవాదాలు చేసే అవకాశం కూడా ఆమెకు ఇచ్చారు! రాజమాత తమ దివ్యచరణారవిందములలో ఐక్యమైన ఆ రోజు ఉదయం భగవాన్ బాబా ఆమె వాదోపవాదములను 'జగడా' అని చాలా ఆప్యాయంగా వర్ణించారు. నిస్సందేహంగా, ఆయనయొక్క అసంఖ్యాకమైన భక్తులలో ఆయనతో 'జగడా' వేసుకోగలిగే చనువు, ధైర్యము ఉన్న భక్తురాలు ఆమె ఒక్కరే!

ఇప్పుడు మనం భౌతిక ప్రపంచములో రాణియైన మహారాణి, మరియు రాజమాత, గులాబ్ కున్వర్‌బాయొక్క కథనుండి సంగీత సామ్రాజ్ఞి శ్రీమతి ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మియొక్క మహాప్రస్థానమునకు ప్రయాణం చేద్దాం. 'ఎమ్.ఎస్'గా ప్రపంచ ప్రఖ్యాతి చెందిన శ్రీమతి ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మిని గురించి సుప్రసిద్ధ హిందూస్తానీ సంగీత విద్వాంసుడు ఉస్తాద్ బడే గులాం ఆలీఖాన్ 'సుస్వరలక్ష్మి' అని ప్రశంసించారు. జాతిపిత మహాత్మాగాంధీ ఆమెను గురించి

మాట్లాడుతూ ఒకసారి "ఆమె స్వరం అత్యంత మధురమైనది. ఆమె భజనలు పాడుతూంటే అందులో తన్మయురాలై పాడుతుంది. భగవంతుని ప్రార్థించేటప్పుడు తన్మయత్వంతో ప్రార్థించాలి. భజనగీతములు పాడటం ఒక ఎత్తు, భగవంతునియందు పూర్తిగా తన్మయత్వం చెంది పాడటం వేరొక ఎత్తు", అని వ్యాఖ్యానించారు. శ్రీమతి ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మియొక్క సంగీతములో ఉండే విశిష్టత సరిగ్గా అదే! నాదోపాసనకు అంకితమైన శ్రీమతి సుబ్బులక్ష్మి ఆధునికయుగములో కర్ణాటక సంగీతములోని ఆధ్యాత్మిక సారమునకు పూర్వోన్నత్యమును కల్పించారు. భక్తిరసభరితమైన సంగీతమే మోక్ష సాధన. అదే ఆమె చేపట్టిన నాదోపాసన.

స్వతంత్ర భారతదేశమునకు ప్రథమ ప్రధానమంత్రి, మహామేధావియైన పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ఒక సందర్భంలో శ్రీమతి ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మియొక్క సంగీతమును మెచ్చుకుంటూ "సంగీత సామ్రాజ్ఞియైన ఈమె ముందు నేనెంత? నేను కేవలం ఒక ప్రధానమంత్రిని మాత్రమే!" (Who am I, a mere Prime Minister before this Queen of Music) అని ప్రశంసించారు. విశేష ప్రాచుర్యమును పొందిన ఆ ప్రశంస ఆయన జీవితకాలములోనే అనేకసార్లు ఉపయోగింపబడినది. ఆమె సంగీత కచేరీలలో ప్రసంగించడానికి తనకు అవకాశం లభించినప్పుడల్లా శ్రీ నెహ్రూ బహుళ ప్రచారమును పొందిన తమ ప్రశంసావాక్యములను వినిపిస్తూనే ఉండేవారు. ఆయనకు అది చాలా ఇష్టమైన కార్యక్రమం. శ్రీమతి సుబ్బులక్ష్మి ధర్మ కార్యములకు ధనము ప్రోగుచేసే నిమిత్తం ఎక్కువగా తమ సంగీత కచేరీలు చేసేవారు. అటువంటి ఒక సందర్భంలో శ్రీ నెహ్రూ "బహిరంగ సభలలో ధారాళంగా ప్రసంగించే అలవాటు నాకు ఉన్నా, ఈ సందర్భంలో ప్రసంగించడం అంత తేలికైన పనిగా నాకు అనిపించడం లేదు. సుబ్బులక్ష్మి సంగీతమునకు శ్రోతల హృదయాలను కదిలించే శక్తి ఉన్నది. ఆమె ఢిల్లీకి వచ్చినప్పుడల్లా అక్కడి ప్రజలలో ఆనందోత్సాహాలు వెల్లివిరుస్తాయి. తన సంగీత మాధుర్యంతో ఆమె వారి హృదయాలను దోచుకుంటుంది", అని చెప్పారు.


శ్రీమతి ఎమ్.ఎస్. అనేక ధార్మిక సంస్థలకు, ధర్మకార్యాలకు పెంపుడు తల్లి వంటిది. అందులో అత్యంత ప్రసిద్ధి కెక్కినవి, మహాత్మాగాంధీ నెలకొల్పిన కస్తూర్బా మెమోరియల్ ట్రస్ట్‌కు నిధుల కొరకు ఆమె చేసిన సంగీత కచేరీలు. నిజానికి, ఆమె ధనాశతో ఎన్నడూ సంగీత కచేరీలు చేయలేదు. ఆమె గొప్ప మానవతావాది. ఆమె నిరాడంబరత, వినయము మరియు ఔదార్యము, ఐతిహాసికమైనవి. భారత రాష్ట్రపతి చేతిమీదుగా జాతియొక్క అత్యున్నత పురస్కారము "భారతరత్న" ఆమెకు ప్రదానము చేయబడినప్పుడు అది సంగీతములోని ఆధ్యాత్మిక శక్తికి మానవాళి అర్పించే నివాళిగాను, భారతీయ ఆదర్శము మూర్తీభవించిన ఒక స్త్రీ మూర్తికి అంజలి ఘటించే సమర్పణగాను పరిగణింపబడింది.

శ్రీమతి ఎమ్.ఎస్. దృష్టిలో, ఆమెయే స్వయంగా చెప్పినట్లు, భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు కలియుగములో మానవజాతిని రక్షించడానికి అవతరించిన సాక్షాత్తూ శ్రీ కృష్ణ పరమాత్మయే! "బాబా మూర్తీభవించిన సత్యము, శివము. ఆయన యందు విశ్వాసము కలిగియుంటే ఆయన ఎల్లవేళలా మన ఇంట, వెంట, జంట ఉండి మనల్ని కాపాడుతారు", అని ఆమె తరుచు చెపుతారు. ఈ సంగీత సామ్రాజ్ఞి, జీవితంలో అనేక కష్టములు, విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్నారని తెలుసుకుంటే చాలామందికి ఆశ్చర్యం కలుగవచ్చు. నిజానికి అటువంటి కష్టకాలములోనే ఆమె సంగీత ప్రపంచములో అత్యున్నత శిఖరాలు అధిరోహించారు. సుప్రసిద్ధ ఆంగ్లకవి షెల్లీ "అత్యంత మధురమైన సంగీతము అత్యంత విషాదకరమైన జ్ఞాపకాల నుండే వెలువడుతుంది" ("The sweetest songs are those of our saddest memories"), అని వ్రాశారు. భగవంతుడు తనకు అత్యంత ప్రీతిపాత్రులైన భక్తులను వారి అంతిమకోరికగా తనలో ఐక్యము చేసుకోవడానికి అర్హులుగా తయారుచేసేందుకుగాను, వారిని కావాలని అనేక కష్టములకు, దుఃఖములకు గురిచేస్తాడని భారతదేశంలో జన సామాన్యంలో ఒక నమ్మకం ఉన్నది. 1940వ సంవత్సర ప్రాంతాలలో తమిళ, హిందీ


భాషలలో తీయబడిన 'మీరా' అనే చిత్రము బాగా ప్రజాదరణ పొందింది. ఆ చిత్రములో ఎమ్.ఎస్. నటించిన 'మీరా' పాత్ర ఆమె వ్యక్తిగత జీవితానికి అద్దం పడుతుంది.

శ్రీమతి ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి భగవాన్ బాబావారిని 1975వ సంవత్సరంలో బృందావనంలో మొట్టమొదటిసారి దర్శనం చేసుకున్నారు. ఆమె, ఆమె భర్త శ్రీ సదాశివం జీవితంలో అనేక కష్టాలు ఎదుర్కొన్న రోజులవి. అటువంటి కష్టసమయంలో ఆ దంపతులిద్దరూ కలిసి భగవాన్ బాబావారి దర్శనం చేసుకోవడానికి వెళ్ళారు. అప్పుడు ఆమె స్వామి పాదాలకు కన్నీళ్ళతో అభిషేకించి మ్రొకరిల్లినపుడు ఆయన "రా! వచ్చి, పది సంవత్సరాలుగా బాకీ పడిన పాదనమస్కారం చేసుకో", అని చిరునవ్వుతో ఆహ్వానించారు. తరువాత భగవాన్ వాళ్ళిద్దరిని ఇంటర్వ్యూకు పిలిచి వాళ్ళు జీవితంలో పడిన కష్టాలన్నీ ఒకటొకటిగా గుర్తు చేస్తూ వాటన్నిటిని వాళ్ళు తమ హృదయంలోనే నిశ్శబ్దంగా అనుభవిస్తూ వచ్చారని చెప్పారు. దాంతో ఆ దంపతులకు భగవాన్ బాబావారు తమ అంతర్యామి అనే విశ్వాసం కలిగింది. భగవాన్ బాబావారితో తన ప్రప్రథమ సమావేశమును గుర్తుకు తెచ్చుకుంటూ శ్రీమతి ఎమ్.ఎస్. తరువాత ఒక సందర్భంలో "అనేక సంవత్సరాల భక్తి, ప్రపత్తులతో కూడిన సాధనే మమ్మల్ని భగవాన్ బాబావారి దివ్యసన్నిధికి చేర్చి ఆనందానుభూతిని ప్రసాదించింది", అని చెప్పారు.

ఈ సంఘటనకు పది సంవత్సరాల ముందే శ్రీమతి ఎమ్.ఎస్. భగవాన్ బాబావారి భక్తులైన కొందరు శ్రేయోభిలాషులు మరియు తమ కుటుంబానికి మిత్రులనుండి ఆయన గురించి విన్నది. ఆయన దర్శనం చేసుకోవాలని చాలాకాలమునుండి అనుకుంటున్నా, 1975వ సంవత్సరమువరకు అది సాధ్యపడలేదు. ఆమె భర్త శ్రీ సదాశివంకు భగవాన్ బాబావారివద్దకు వెళ్ళడం ఇష్టంలేదు. ఆదర్శమూర్తి, భర్తకు మంచి విశ్వాసపాత్రురాలైన భారతీయ పత్ని కావడం చేత ఆమె తన భర్త వెంటలేకుండా ఎక్కడికి ప్రయాణం చేసేది కాదు. బెంగుళూరు వెళ్ళినప్పుడల్లా శ్రీమతి ఎమ్.ఎస్ మరియు శ్రీ సదాశివం,



"గానలోల శ్రీసత్యసాయి"



"భగవాన్ బాబావారు సుప్రసిద్ధ సంగీత విద్వాంసురాలు శ్రీమతి ఎమ్.ఎస్.సుబ్బులక్ష్మిని ఆశీర్వదించుట"



"బృందావనంలో భగవాన్ బాబావారితో శ్రీ టి.ఎన్.సదాశివం దంపతులు"

వెంకటాచలం దంపతుల యింట్లో బస చేసేవారు. శ్రీ ఎస్.ఆర్. వెంకటాచలం భగవాన్ బాబావారి భక్తుడు కావడంచేత ఆయన తరుచు బెంగుళూరులోని భగవాన్ ఆశ్రమం, బృందావనంకు వెడుతూండేవారు. ఒకసారి శ్రీమతి ఎమ్.ఎస్., స్వామికి తన ప్రణామములు అందజేయుమని, తనకు ప్రసాదం అనుగ్రహించుమని తన తరపున ఆయనను ప్రార్థించుమని శ్రీ వెంకటాచలంను కోరింది. శ్రీ వెంకటాచలం ఆమె ప్రార్థనను స్వామికి విన్నవించినపుడు ఆయన "ఎమ్.ఎస్. ఆ! నాకు తెలుసు, ఆమె భర్త సదాశివంకు ఇక్కడకు రావడం ఇష్టంలేదు. కాని ఏదో ఒక రోజున తప్పక వస్తాడు" అని చెపుతూ ఆమెకు అందజేయుమని ప్రసాదం ఇచ్చారు.

శ్రీ వెంకటాచలం అనేక సంవత్సరాలుగా తీవ్రమైన తలనొప్పి (Migraine) తో బాధపడుతూండేవారు. ఆ కారణంగా ఆయన భగవాన్ బాబావారి దర్శనం చేసుకుని ఆయన ఆశీస్సులు పొందాలనుకున్నారు. శ్రీ వెంకటాచలం మొట్టమొదటిసారి భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్న ఆ ఆసక్తికరమైన ఉదంతమును ఎమ్.ఎస్.కు వివరించారు. ఆ రోజున ఆయన బృందావనంకు వెడుతూ తనలోతాను "సాయిబాబా నా తలనొప్పిని నయం చేయగలరా?" అని అనుకున్నారు. దర్శన సమయంలో భగవాన్ బాబా ఆయన ముందునుండి నడిచివెళ్ళారు. ఇంతలోనే ఆయన రెండు అడుగులు వెనక్కువేసి శ్రీ వెంకటాచలంముందు నిలబడి "నీకేమి కావాలి" అని అడిగారు. అందుకు శ్రీ వెంకటాచలం "బాబా! మీ ఆశీస్సులకొరకు ప్రార్థిస్తున్నాను" అని విన్నవించుకున్నారు. అప్పుడు భగవాన్ బాబావారు ఆయన శిరస్సుపై తమ దివ్యహస్తమును ఉంచి ఆశీర్వదించారు. అంతే! అనేక సంవత్సరాలుగా ఆయనను వేధిస్తున్న తలనొప్పి ఆ క్షణంలోనే మాయమైంది. మళ్ళీ ఎప్పుడూ ఆయన తన జీవితంలో తలనొప్పితో బాధపడలేదు.

శ్రీమతి ఎమ్.ఎస్.ను ఎవరో ఆమె భగవాన్ బాబావారి భక్తురాలుగా ఎలా అయ్యింది అని అడిగినప్పుడు ఆమె "అనేకమంది ఆయన

గొప్పతనంగురించి, అత్యంతాశ్చర్యకరమైన రీతిలో తమ సమస్యలను పరిష్కరించిన తీరును గురించి నాకు వర్ణించి చెప్పారు. అయితే, ఆయన చేసే అత్యద్భుత లీల ప్రేమ, దయ నిండిన ఆయన దృష్టి మనపై పడినప్పుడు మనము అనుభవించే ప్రశాంతత. ఆయన దివ్య సన్నిధిలో మనము సర్వము మరచి ఆయనకు సంపూర్ణ శరణాగతులమైనప్పుడు ఎంతటి అద్భుతమైన భద్రతాభావం మనలో నెలకొంటుంది! ఆయన వాక్కు ఎల్లప్పుడూ సత్యవాక్కు. అది దివ్యవాణి", అని సమాధానం చెప్పారు.

ఆ తరువాత శ్రీ సదాశివం, శ్రీమతి ఎమ్.ఎస్. ప్రశాంతి నిలయము మరియు బృందావనములోని భగవాన్ బాబావారి ఆశ్రమాలకు క్రమం తప్పకుండా వెళ్ళడం మొదలు పెట్టారు. అవకాశం లభించినపుడల్లా శ్రీమతి ఎమ్.ఎస్. భగవాన్ బాబావారి దివ్య సన్నిధిలో తమ హృదయపూర్వకమైన సంగీతమును వినిపింప జేస్తూండేవారు. 1977వ సంవత్సరం మే నెలలో 'భారతీయ సంస్కృతి మరియు ఆధ్యాత్మికతను గురించి బృందావనంలో వేసవి తరగతులు నిర్వహింపబడుతున్నప్పుడు శ్రీమతి ఎమ్.ఎస్. మొట్టమొదటిసారి భగవాన్ దివ్యసన్నిధిలో తమ సంగీత కచేరీ చేశారు. అప్పట్లో భారత విదేశాంగశాఖ మంత్రిగా ఉన్న శ్రీ అటల్ బిహారి వాజ్‌పేయి జనంతో క్రిక్కిరిసిన కాలేజి ఆడిటోరియంలో నిర్వహింపబడుతున్న ఆనాటి సంగీత కచేరీకి ముఖ్య అతిథిగా విచ్చేశారు. భక్తి పారవశ్యంలో తన్ను తాను మరచి తన్మయత్వంతో శ్రీమతి ఎమ్.ఎస్. ఆ రోజున ఒక మీరాభజన పాడుతూండగా భగవాన్ లేచి ఆమె వద్దకు వచ్చి ఒక అందమైన బంగారు నెక్లెసును సృష్టించి ఆమెకు కానుకగా ప్రసాదించారు. ఆ నెక్లెసును అందుకుంటూ ఆమె అవధులు లేని భావోద్రేకమునకు గురి అయ్యారు. ఆమె ఆధ్యాత్మిక జీవితంలో భగవాన్ తమ దివ్య హస్తములతో సృష్టించి ప్రసాదించిన ఆ కానుక విశేష ప్రాముఖ్యతను సంతరించుకున్నది.

"నేను, నాభర్త ప్రశాంతి నిలయమునకుగాని, బృందావనమునకుగాని తరుచు వెడుతూండేవారము. స్వామి చెన్నై సందర్శించినపుడల్లా

'సుందరం'కుకూడా వెళ్ళేవారము. స్వామి భక్తులకు దర్శనం ప్రసాదిస్తూ వారి మధ్య నెమ్మదిగా నడిచివెడుతున్న సమయంలో మేముకూడా ఆయనను దర్శనం చేసుకోవాలనే కోరిక తప్ప మా మనసుల్లో వేరే ఏ కోరికా ఉండేది కాదు" అని శ్రీమతి ఎమ్.ఎస్. చెపుతూండేవారు. అయితే భగవాన్ బాబావారు మాత్రం ఆ సమయంలో ఆమెముందు ఒక్కనిమిషం ఆగి ఆమెను ఆశీర్వదిస్తూ ఒకటి, రెండు మాటలు మాట్లాడి, ఆమెకు విభూతి సృష్టించి యిచ్చి మరీ ముందుకు సాగేవారు. ఒక్కొక్కప్పుడు ఆ దంపతులిద్దరిని ఇంటర్వ్యూకు పిలిచేవారు. అంతేకాక, భగవాన్ కొన్నిసార్లు చెన్నైలోని వారి గృహమును సందర్శించారు కూడా! 1982వ సంవత్సరంలో వారి కుమార్తె రాధ తీవ్ర అనారోగ్యమునకు గురైనప్పుడు, భగవాన్ ఆ దంపతులను, వారి కుమార్తెను బృందావనంలోని తమ ఆశ్రమంలోనే ఉంచుకుని వారిపైన అపారమైన అనుగ్రహమును వర్షించారు.

శ్రీమతి ఎమ్.ఎస్., తన భర్త శ్రీ సదాశివం దర్శకత్వంలో తాను పాడిన సాయి భజనలను ఒక ఆల్బమ్‌గా అనేక భారతీయ భాషలలో వెలువరించారు. అందులో చాలా సంవత్సరాల క్రితం భగవాన్ స్వయంగా కూర్చిన "సాయిరామ చిలుక" అనే గీతముకూడా ఉన్నది. శ్రీమతి ఎమ్.ఎస్. ఒకసారి ఆ గీతమును పాడుతూంటే భగవాన్ బాబా ఆనందంగా వింటూ తమ దివ్య హస్తములతో పాటకనుగుణంగా తాళం వేస్తూ, మధ్య మధ్య తానుకూడా గొంతుకలిపి పాడుతూండగా చూచే అవకాశం కొందరు భాగ్యశాలురకు లభించింది. మిగిలిన పాటలలో కొన్ని ఆమె అంతకుముందు చేసిన సంగీత కచేరీలలో పాడినవి, మరికొన్ని ఆ ఆల్బమ్ కొరకు తాను నేర్చుకుని, స్వరకల్పన చేసినవి ఉన్నాయి. ఒడలు పులకరించే ఆ మధురక్షణాలను గుర్తు చేసుకుంటూ శ్రీమతి ఎమ్.ఎస్. "ఒక్కొక్క పాటను నేను పాడుతూంటే, కరుణామూర్తియైన భగవాన్ బాబావారి దివ్య సుందర వదనారవిందమును తలుచుకుంటూ మైమరచిపోయాను", అని వర్ణించారు. ఇంకా ఆమె భగవాన్ యందలి ఆరాధనాభావంతో "భగవంతుడు అవతార స్వరూపుడై దిగివచ్చి మనమధ్య నడయాడే ప్రస్తుత తరుణంలో ఆయనకు

సమకాలీనులుగా జీవించే భాగ్యమును పొందిన మనం ఎంతటి అదృష్టవంతులం!" అని కూడా వర్ణిస్తారు.

శ్రీమతి ఎమ్.ఎస్. చనిపోవడానికి కొన్ని నెలలముందు భగవాన్ బాబావారి ఆంతరంగిక సేవకులు ఒకాయన ఆమెను చూడాలని చెన్నైలోని ఆమె ఇంటికివెళ్ళారు. వచ్చేసేముందు ఆమె వద్ద సెలవు తీసుకుంటూ "అమ్మా! రేపు నేను ప్రశాంతి నిలయంకు వెడుతున్నాను, స్వామికి మీరు చెప్పవలసినది ఏమైనా ఉందా?" అని ఆమెను అడిగారు. ఆమె తన చేతులు జోడించి ఒక్క క్షణంపాటు పైకి చూచి, తరువాత ఆ గదిలో ఉన్న భగవాన్ బాబా వారి చిత్రపటముపైపు చూస్తూ గద్గద స్వరంతో "భగవంతునికి నేను చెప్పుకోవలసినది ఏమున్నది? నా హృదయంలో ఏదైనా కోరిక ఇంకా జనించక ముందే భగవాన్ దానిని తీరుస్తున్నారు", అని చెప్పింది. భగవాన్ బాబావారితో పరిపూర్ణంగా ఐక్యము చెందిన ఆ మహాభక్తురాలి సమాధానము ఆ ప్రశ్న అడిగిన వ్యక్తిని సిగ్గుపడేలా చేసింది! అయితే, ఆమె వద్దనుండి వచ్చిన మహోన్నత భక్తి భావముతో నిండిన ఆ సమాధానములోని ఉదాత్తతను గ్రహించిన ఆయనకు, తాను ఆ ప్రశ్న అడగడం సమంజసమేననిపించింది.



9

దివ్య భిషగ్వరులు

అనిత్యమైన దైహిక వాంఛలందు నిరంతర చింతనామగ్నమైన మానవుని మనస్సును నిత్యసత్యమైన ఆత్మతత్త్వముపైపు మళ్ళించడమే సద్గురువుయొక్క ప్రప్రథమ కర్తవ్యము. అందులోనే మానవునికి, అతడు నివసించే సమాజమునకు ముక్తి, మోక్షము ఉన్నవి. మానవుడు ఆధ్యాత్మిక లక్ష్యముపైపు పయనించినప్పుడే మానవ సమాజము పరిపూర్ణ సుఖ, సామరస్యములనే ఆదర్శముపైపు పయనించగలదు. మానవునియొక్క ఆధ్యాత్మిక విమోచనమే భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి ప్రాథమిక లక్ష్యమైనా, ఆయన భౌతిక పరిధిలో అతని సంక్షేమమును విస్మరించరు. దీనికి కారణం, ఆతడు స్వర్గానికి ఉత్తరాధికారియైనా, మౌలికంగా పృథ్వీ పుత్రుడు కావడమే! అందువలన భగవాన్ బాబావారు మానవునికి తనలో తాను, సాటి మానవులతోను మరియు ప్రకృతితోను సామరస్యముతో జీవించడం నేర్పడంతోబాటు, ఆతని మౌలికమైన భౌతిక అవసరాలు తీర్చడంలోకూడా శ్రద్ధ వహిస్తారు. మానవుని భౌతిక, ఆధ్యాత్మికావసరాలు రెండూ తీరినప్పుడే మానవుడు ఆశించే స్వర్ణయుగం ఆవిర్భవిస్తుంది.

మానవుని మానసిక గాయములను మాన్పి స్వస్థత చేకూర్చడానికి అవతరించిన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు నెలకొల్పిన మొట్టమొదటి సంస్థ, శారీరక రుగ్మతలను తొలగించే వైద్యాలయము. భగవాన్ బాబావారు 1954వ సంవత్సరములో తమ 29వ జన్మదినోత్సవ సందర్భముగా ప్రశాంతి మందిరమునకు వెనుకనున్న ఒక చిన్న కొండపై ఈ వైద్యాలయమునకు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత, హాస్పిటలు భవన నిర్మాణ కార్యక్రమము భగవాన్‌కు ఆయన భక్తులకుకూడా ప్రేమపూరితమైన శ్రమగా కొనసాగింది.

భగవాన్ ఇంచుమించుగా ప్రతిరోజూ నిర్మాణ స్థలమునకు వెళ్ళి ఆనందోత్సాహాలతో భవన నిర్మాణ కార్యక్రమంలో పాల్గొంటున్న పిన్న, పెద్ద భక్తులందరితోను కొన్ని గంటలసేపు గడిపేవారు. తమ తమ శక్తికొలది వాళ్ళు శారీరక శ్రమ అందిస్తున్నప్పుడు శ్రమ తెలియకుండా భజన పాటలు పాడేవారు. ఆ భవన నిర్మాణంలో ఉపయోగించిన ప్రతి ఒక్క రాయి, ఇటుక కూడా తమ ప్రియతమ భగవానునియందు ప్రేమతో నిండిపోయేది. ఆ పని జరుగుతున్నంతసేపు భగవాన్ అక్కడికి దగ్గరలోనే ఉన్న ఒక రాతిపై అధిష్ఠాన దేవతవలె ఆసీనులై ఆ మనోహర దృశ్యమును తిలకిస్తూండేవారు. మరపురాని ఆ దైవకార్యంలో పాల్గొన్న భాగ్యశాలురైన కొందరు భక్తులు తాము పనిచేస్తూంటే ఏవిధంగా భగవాన్ బాబావారు పండ్ల రసముతో నిండిన ఒక పెద్ద జగ్గును తమ చేతితో మోసుకుని అక్కడికి వచ్చి ఒక్కొక్కరికి ఒక్కొక్క గ్లాసును ఇచ్చి ఆ గ్లాసులో ఆ అమృతాన్ని స్వయంగా పోశారో ఆ వైనమును ఇప్పటికి స్పష్టంగా జ్ఞాపకం తెచ్చుకుంటారు.

తూర్పు దిక్కుకు అభిముఖంగా ఒక చిన్న కొండపై నిర్మితమవుతున్న ఆ హాస్పిటలు భవనము ప్రతిరోజూ ఉదయభానుని స్వర్ణకిరణములలో స్నానితమై భగవాన్ మరియు ఆయన భక్తుల ప్రేమామృతధారలను ఆస్వాదిస్తూ దినదినానికి నూతన శోభను సంతరించుకుంటూ రూపుదిద్దుకున్నది. ఆ రోజుల్లో కను చూపుమేరవరకు ఎటువంటి నిర్మాణములు లేక నయనాభిరామమైన దృశ్యమును గోచరింపజేసే ఆ కొండపైనుండి చూస్తే దూరంగా గలగలపారుతూ వంపులు తిరుగుతూ ప్రవహించే చిత్రావతి నది, దానివెనుక సమున్నతమైన పర్వతశ్రేణి అత్యంత శోభాయమానంగా కనిపించేవి. శ్రీ సత్యసాయి పేరుమీద నెలకొల్పబడిన మొట్టమొదటి సంస్థయగు ఆ హాస్పిటలుకు నవరాత్రి ఉత్సవములలో ఆనాటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రియగు డా॥ బెజవాడ గోపాలరెడ్డి ది. 4-10-1956వ తేదీన ప్రారంభోత్సవం జరిపారు. అప్పట్లో ఆ హాస్పిటలులో 5 గదులుండేవి. అందులో రెండు గదులను వార్డులుగాను, ఒక గదిని ప్రసూతి గదిగాను, మిగిలిన రెండింటిని వైద్యుల సలహా

సంప్రదింపులకు రోగులకు మందులు ఇవ్వడానికి మరియు గాయములకు కట్టుకట్టే డ్రెస్సింగ్ రూముగాను ఉపయోగించేవారు.

ఆ రోజుల్లో భగవాన్ బాబావారు రోగులకు ఉపశమన వాక్యాలు చెపుతూ డాక్టర్లను, వైద్యేతర సిబ్బందిని, వాలంటీర్లను ఉత్సాహముతో పనిచేసేటట్లు ప్రోత్సహిస్తూ చాలాసేపు హాస్పిటలులో గడిపేవారు. హాస్పిటలును ప్రారంభించిన మొదటి సంవత్సరంలోనే ఆ చుట్టుప్రక్కల గ్రామాలనుండి రోజుకు సుమారు 200 మంది రోగులు చికిత్సకొరకు వచ్చేవారు. ఒక్కొక్కప్పుడు ఆ హాస్పిటలులో ఉన్న ఒకే ఒక డాక్టరు (రిటైర్డు సర్జను) బాగా అలసిపోయినప్పుడు, భగవాన్ బాబావారు ఆయనను విశ్రాంతి తీసుకోమని చెప్పి తానే రోగులను పరీక్షించేవారు! నిజానికి, ఆ హాస్పిటలులో లభించే అత్యంత ప్రధానమైన మందు భగవాన్ బాబావారి అనుగ్రహమే! అది ఏనాడూ పనిచేయకపోవడమంటూ లేదని వేరే చెప్పనక్కరలేదు. సంవత్సరాలు గడుస్తున్నకొద్ది ఆ హాస్పిటలులో సేవచేసే డాక్టర్ల సంఖ్య క్రమంగా పెరిగింది. దాంతోబాటే భగవాన్ బాబావారు స్వయంగా హాస్పిటలుకు వచ్చి డాక్టర్లకు, రోగులకు సలహాలు ఇచ్చే సందర్భాలు కూడా క్రమంగా తగ్గిపోయాయి. అయినప్పటికి, భగవాన్ బాబావారి అదృశ్యహస్తము రోగులకు స్వస్థత చేకూర్చే వైద్య, వైద్యేతర సిబ్బందికి స్ఫూర్తినిచ్చి వారిని ముందుకు నడిపిస్తూనే ఉన్నది.

1956-1975 సంవత్సరాల మధ్య శ్రీ సత్యసాయి జనరల్ హాస్పిటలుకు ప్రప్రథమ మెడికల్ సూపరింటెండెంటుగా పనిచేసిన డా॥ బి. సీతారామయ్య ఈ సందర్భంగా ఇలా వ్రాశారు : "ఈ హాస్పిటలు ప్రారంభమునుండి భగవాన్ బాబావారు నేరుగా తమ మార్గదర్శకత్వంలో సేవచేసే అద్వితీయమైన అవకాశమును నాకు ప్రసాదించారు. నాకు వయస్సు పైబడుతున్న కారణంగా నన్నీ బాధ్యతలనుండి తప్పించమని భగవాన్ బాబావారిని నేను ఎన్నోసార్లు వేడుకున్నాను. కాని, ప్రతిసారి ఆయన నాకోరికను త్రోసిపుచ్చుతూ "భయపడకు, నువ్వు కేవలం నా చేతిలో ఒక పరికరముగా ఉండు. నేను సమస్త విషయాలు

చూసుకుంటాను" అని ధైర్యంచెప్పి నన్ను సేవలో కొనసాగుమని ప్రోత్సహిస్తూ వచ్చారు. ఒక్కొక్కప్పుడు కొన్ని నెలలపాటు నేనొక్కడినే ఆ హాస్పిటలులో డాక్టరుగా అందుబాటులో ఉండేవాడిని. అటువంటి కష్టసమయాల్లో భగవాన్ బాబావారి దివ్యానుగ్రహంతో నేను పెద్దసంఖ్యలో మొండి రోగాలకు వైద్యం చేస్తూ దానితోబాటు రోజుకు కొన్ని వందలమంది బయటినుండి వచ్చేరోగులకు రోగ నిర్ధారణ, మందులు వ్రాయడం చేయగలిగేవాణ్ణి. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్యానుగ్రహమే ప్రత్యక్షంగాను, పరోక్షంగాను రోగులకు స్వస్థత చేకూర్చే మందుకాబట్టి, అందులో ఒక్క కేసుకూడా ఫెయిలవలేదు". అయితే, హాస్పిటలుయొక్క ద్వితీయ వార్షికోత్సవమునాడు భగవాన్ బాబా సంస్థయొక్క విజయ పరంపరను వివరిస్తూ డా॥ సీతారామయ్య చదివిన రిపోర్టును గురించి ప్రస్తావిస్తూ "ఈ హాస్పిటలు భవన నిర్మాణ సమయంలో శ్రమదానం చేసిన భక్తులు ప్రదర్శించిన నిస్వార్థ సేవాభావమే ఇక్కడి డాక్టర్లకు స్ఫూర్తిదాయకమై వారిని చైతన్య పరచిందని నా అభిప్రాయము. ఈ హాస్పిటలు యొక్క విజయానికి అదే ముఖ్యకారణం", అని ఉద్ఘాటించారు.

శ్రీ సత్యసాయి హాస్పిటలులో ప్రారంభమునుండి సుమారు రెండు దశాబ్దలపాటు సేవలందించిన డా॥ సీతారామయ్య తన అనుభవాలను నెమరువేసుకుంటూ "భారతదేశములోను, విదేశాలలోను కూడ నయం చేయడానికి వీలుకావని విడిచిపెట్టేసిన వ్యాధులతో బాధపడుతున్న ఎంతోమంది హాస్పిటలులో చేరిన తరువాత వారి వ్యాధులు పూర్తిగా నయమై తిరిగి వెళ్ళారు. అటువంటి అద్భుతమైన, అనిర్వచనీయమైన రీతిలో స్వస్థతను పొందిన అనేకమంది రోగుల కేసులు చూచి వైద్య వృత్తిలో ఉన్న మేమే ఆశ్చర్యపోయాము. జీవితమనే పరుగు పందెంలో శారీరక, మానసిక వైకల్యమువలన వెనుకబడినవారు మరియు వివిధ వ్యాధులచే బాధపడుతున్నవారిపైన భగవాన్ బాబావారు మరింతగా తమ ప్రేమామృతధారలను వర్షిస్తారు. భక్తులు తమ శారీరక, మానసిక శక్తులను సమాజానికి మేలు కలిగించే సేవలలో వినియోగించే నిమిత్తమై భగవాన్ వారికి ఆరోగ్యమనే కానుకను ప్రసాదిస్తారు", అని

వివరించారు. భగవాన్ బాబావారియందు పరిపూర్ణమైన విశ్వాసమును పెంచుకోవడంవలన పరమాద్భుతమైన రీతిలో వ్యాధులు నయమై తిరిగి ఆరోగ్యమును పొందిన ఎన్నో కేసుల గురించి భక్తులకు తెలిసిన విషయమే! ఇటువంటి కేసులు ఆయన దివ్యసన్నిధిలో జరిగినవి, ఇంకా ప్రపంచవ్యాప్తంగాను కూడా ఉన్నాయి. అనేక క్లిష్టమైన కేసుల విషయంలో తమకు దిక్కుతోచక డాక్టర్లు సలహాకొరకు భగవాన్ బాబావారివద్దకు పరుగెత్తిన సందర్భాలు ఉన్నాయి. అంతేకాక, కొందరు భక్తుల విషయంలో తానే ఫిజీషియనుగా మారి అత్యంత నైపుణ్యముతో రోగ నిర్ధారణ చేసి, వాడవలసిన మందులు సూచించడం; అవసరమైతే అత్యవసరంగా శస్త్రచికిత్స చేసి ప్రాణాలను కాపాడడం చేసిన సందర్భాలు ఉన్నాయి. వీటన్నిటికి మించి, కొన్ని అరుదైన సందర్భాలలో భగవాన్ బాబావారు చనిపోయినవారిని తిరిగి బ్రతికించిన కేసులు కూడా ఉన్నాయి.

తాను హాస్పిటల్సును స్థాపించే కార్యక్రమం ఎందుకు చేపట్టవలసి వచ్చిందో వివరిస్తూ ఒకసారి భగవాన్ బాబా "నిత్య శుద్ధమైన ఆత్మతత్త్వమునందు విశ్వాసము కలిగియుండడమే సరియైన మందు మరియు టానిక్కు అని తెలుసుకోలేక హాస్పిటల్సులో ట్రీట్‌మెంటుద్వారా మాత్రమే మానసికమైన తృప్తి మరియు శాంతిని పొందేవారికొరకు నేను ఈ హాస్పిటల్సును నెలకొల్పాను. అటువంటి వ్యక్తులు ఒకసారి ఈ హాస్పిటల్సుకు వచ్చిన తరువాత, అన్ని మందులకంటె భగవదనుగ్రహమే ఎక్కువ శక్తిమంతమైనదని తెలుసుకుంటారు. అప్పుడు వాళ్ళు భగవంతుని యందు విశ్వాసమును పెంచుకుని ఆత్మ సాక్షాత్కార మార్గములో పయనిస్తారు", అని చెప్పారు. అద్భుత లీలలద్వారా వ్యాధి నివారణ చెయ్యడంలో గల పరమార్థమును వివరిస్తూ స్వామి "ఈ చరాచర సృష్టిలోని సమస్త జీవరాశులలోను నేను అంతర్యామిగా ఉన్నాను. సమస్త జీవులను నేను ప్రేమిస్తాను. దానికి కారణం, 'ఆత్మవత్ సర్వభూతాని'. అనగా, సమస్త జీవులలోను నన్ను నేను చూచుకుంటాను. ఎవరైనా ఒక వ్యక్తి తన హృదయపూర్వకంగా నన్ను ప్రేమిస్తే, నాప్రేమ, ఆవ్యక్తియొక్క ప్రేమ ఐక్యమై

అతని వ్యాధి నయమైపోతుంది. ఈ పరస్పర ప్రేమభావము లేనిచోట రోగనివారణ సాధ్యము కాదు", అని చెప్పారు. అయితే, భగవాన్ బాబావారి సంకల్పమాత్రంచేతనే వ్యాధులు నివారణ అయిన సందర్భాలు కూడా ఉన్నాయి. సుప్రసిద్ధ సాయి భక్తులు డా॥ జాన్ హిస్లాప్ ఒకసారి "ఎవరైనా వ్యక్తియొక్క కర్మ పరిపక్వము జరిగిన తరువాతనే స్వామి ఆ వ్యక్తియొక్క వ్యాధిని నయం చేస్తారా?" అని ప్రశ్నించారు. అందుకు భగవాన్ బాబా "అది కాదు; ఆ వ్యక్తి స్వామికి ప్రీతిపాత్రుడైతే, స్వామి వెంటనే అతని వ్యాధిని నివారణ చేస్తారు. అందుకు ఆ వ్యక్తికి ఉండవలసిన అర్హతలు పవిత్రమైన హృదయము మరియు స్వామి బోధలకు అనుగుణంగా నడుచుకోవడం. ఆ రెండూ ఉన్ననాడు స్వామియొక్క అనుగ్రహము తక్షణమే లభిస్తుంది", అని సమాధానం చెప్పారు.

ప్రశాంతి నిలయములోని శ్రీ సత్యసాయి హాస్పిటలులో వైద్య శాస్త్రమునకు అతీతంగా అత్యద్భుత రీతిలో వ్యాధులు నివారింపబడిన కొన్ని కేసుల వివరాలు ఈ క్రింద పొందుపరుపబడినాయి. ఇవన్నీ డా॥ బి. సీతారామయ్య ఇక్కడ మెడికల్ సూపరింటెండెంటుగా పనిచేస్తున్న సమయంలో జరిగాయి :

మైసూరు రాష్ట్రములోని మల్నాడుకు చెందిన ఒక కాఫీ తోటల యజమాని సుమారు 30 సంవత్సరాలుగా తీవ్రమైన కీళ్ళ నొప్పులతో (Rheumatoid arthritis) బాధపడుతున్నాడు. దీనికి తోడు ఒకసారి ఆ వ్యక్తికి తీవ్రమైన జ్వరం వచ్చింది. పైగా ఒక మూత్రపిండము కూడా చెడిపోయింది. ఇన్ని వ్యాధులతో ఆ వ్యక్తి శ్రీ సత్యసాయి హాస్పిటలుకు వచ్చాడు. అప్పుడు భగవాన్ బాబావారు డాక్టర్లను ఆ రోగికి పరీక్షలు జరిపి కొన్ని ఇంజక్షన్లు ఇమ్మని చెప్పారు. ఆ వ్యక్తి అప్పటికే ఈ రోగాలతో చిక్కి శల్యమై మంచాన పడ్డాడు. ఆతడు అల్లోపతి, ఆయుర్వేదము, హోమియోపతి, ఇంకా ఇతర రకం వైద్యాలు చేయించుకుని విసిగిపోయాడు. దాంతో అతనికి వైద్యవృత్తిమీదే ఏవగింపు కలిగింది. భగవాన్ బాబావారు మాత్రమే తనకు వ్యాధి నివారణ చేయగలరని, చెయ్యాలని ఆతడు కోరుకున్నాడు! కరుణాసముద్రులైన భగవాన్ అతని కోరికను

మన్నించారు. అతనికి ఒక చిన్న సీసాలో ఏదో ద్రవము సృష్టించి యిచ్చి రోజుకు రెండుసార్లు ఆ ద్రవము రెండు చుక్కలు నీటిలో వేసి త్రాగుమని చెప్పారు. ఇలా పదిరోజులు చేసేసరికి ఆతడు ఎవరి సహాయంలేకుండా తనంతట తాను ప్రశాంతి మందిరంలోని వరండాపైకి నడిచి రాగలిగాడు. ఒక నెల రోజులలో మందిరంలోనికి వెళ్ళి కూర్చుని భజన పాటలు పాడగలిగాడు. ఆ తరువాత 15 రోజులలో అతనికి పూర్తి స్వస్థత చేకూరి మామూలు మనిషి అయ్యాడు.

ఢిల్లీకి దగ్గరగా నున్న మొరాదాబాద్ పట్టణానికి చెందిన ఒక వ్యక్తి నాలుకకు కేన్సరు వ్యాధితో బాధపడుతున్నాడు. ఢిల్లీలోని పెద్ద పెద్ద ఆసుపత్రులలో గొప్ప పేరు పొందిన వైద్య నిపుణులు రెండు సంవత్సరాలపాటు అతనికి రకరకాల చికిత్సలు చేశారు; కాని, అతని వ్యాధి నయం కాలేదు. చివరకు ఏమీ చేయలేక తమకు సాధ్యంకాదని వైద్యులు విడిచిపెట్టేశారు. అట్టి పరిస్థితులలో ఆ వ్యక్తి "అన్యథా శరణం నాస్తి" అనుకుంటూ ప్రశాంతి నిలయం వచ్చేశాడు. ఒక రోజు ఉదయం భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్న తరువాత ఆతడు యథాలాపంగా శ్రీ సత్యసాయి హాస్పిటలులో అడుగుపెట్టి తన బాధలన్నీ డా॥ సీతారామయ్య ఎదుట ఏకరువు పెట్టాడు. అప్పుడు ఆయన ఆ రోగికి నిరాశ చెందవద్దని చెప్పి అతని నాలుకపై గ్లిసరిన్, బోరిక్‌తో పూతపూసి కొన్ని బి-కాంప్లెక్స్ మాత్రలు లోపలికి వేసుకోమని ఇచ్చారు. అయితే, తన వ్యాధి నివారణ నిమిత్తమై భగవాన్ బాబావారిని ప్రార్థించమని సలహాయిచ్చారు. రెండు రోజుల తరువాత ఆతడు భగవాన్ బాబావారు ప్రసాదించిన కొన్ని విభూతి పేకెట్లను తీసుకుని ప్రశాంతి నిలయమునుండి బయలుదేరి వెళ్ళాడు. అప్పటినుండి ఆ విభూతియే అతనికి మందు అయ్యింది. విభూతితోబాటు భగవాన్ బాబావారి ఒక ఫోటోను కూడా తనతో తీసికొనివెళ్ళి ప్రతిరోజూ ఆ పటమునకు తన యింట్లో పూజ చెయ్యడం మొదలుపెట్టాడు. ఒక సంవత్సరం తరువాత తన కేన్సరు వ్యాధి పూర్తిగా నయమై పరిపూర్ణ ఆరోగ్యవంతుడుగా ఆ వ్యక్తి ప్రశాంతినిలయమునకు తిరిగి వచ్చాడు. అతడు తన యింట్లో పూజగదిలో

ఇతర దేవతల ఫోటోలతోపాటు భగవాన్ బాబావారి ఫోటోను కూడా ఉంచి పూజ ప్రారంభించగానే స్వామి తనతోబాటే ఉన్నారన్న దానికి నిదర్శనంగా స్వామి ఫోటోతోబాటు ఆ పూజగదిలోని అన్ని ఫోటోలపై విభూతి వర్షంలా కురవడం మొదలుపెట్టింది. భగవాన్ బాబావారి ఈ అనుగ్రహలీలను ఆ వ్యక్తి డా॥ సీతారామయ్యకు వివరించాడు.

శ్రీ తంగవేలు బొంబాయిలోని ఒక టెక్స్‌టైలు మిల్లులో పనిచేస్తున్నాడు. అతనికి సుమారు 40 సంవత్సరాల వయసులో మలాశయము (Rectum) నందు కేన్సరు వ్యాధి సోకింది. దాంతో అతడు చాలా బాధపడుతున్నాడు. అతని యజమాని తరుచు అతనిని తనతోబాటు స్విట్జర్లాండుకు తీసికొని వెడుతూండేవాడు. శ్రీ తంగవేలు అక్కడ తన వ్యాధి నివారణకై అనేకమంది పేరుపొందిన డాక్టర్లను సంప్రదించాడు; కాని, ఫలితం లేకపోయింది. చివరకు అతడు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిని గురించి ఎవరో చెప్పగా విని, ఆయన ఆశీస్సులకొరకై ప్రశాంతి నిలయము వచ్చాడు. ఆ వ్యక్తి శ్రీ సత్యసాయి హాస్పిటలుకు వెళ్ళి డా॥ సీతారామయ్యను కలుసుకున్నప్పుడు ఆయన అతనికి ఏవో కొన్ని తాత్కాలిక ఉపశమనమును కలిగించే మందులు మాత్రమే ఇవ్వగలిగారు. అతని వ్యాధి మాత్రం నివారణ కాలేదు. ఒక రోజు రాత్రి అతడు ప్రశాంతి నిలయములోని షెడ్‌లో నిద్రిస్తూండగా భగవాన్ బాబావారు కలలో కనపడి, ఒక పదునైన పరికరముతో అతనికి శస్త్రచికిత్స చేశారు! మెలకువ వచ్చిన తరువాత అతడు చూస్తే ప్రక్కమీద, తన బట్టలపైన రక్తపు మరకలు కనపడ్డాయి. కాని, అతనికి వ్యాధి నివారణ అయ్యి చాలా హాయిగా ఫీలయ్యాడు. ఆ తరువాత, శ్రీ తంగవేలు భగవాన్ బాబావారు తనకు 'స్వప్నములో శస్త్రచికిత్స' చేసి తన వ్యాధి నివారణ చేశారని డా॥ సీతారామయ్యకు ఒక ఉత్తరం ద్వారా తెలియజేశారు.

చివరగా, డా॥ సీతారామయ్య "భగవాన్ బాబావారు గాల్‌స్టోన్స్ (Gall Stones) అనేవి ఊహల్లో తప్ప నిజంగా లేవని తేలికగా తీసివేసినప్పుడు, అత్యంతాశ్చర్యకరముగా అవి అదృశ్యమైపోతాయి. భగవాన్ సంకల్పించినపుడు

గుండె జబ్బులు చాలా అద్భుతంగా నివారణ అవుతాయి; ఆస్తమా జబ్బునుండి రోగులు విముక్తులవుతారు; ట్యూమర్లు ఆయన ఆజ్ఞననుసరించి వాటంతట అవి కరగిపోతాయి. నిజానికి, వ్యాధి నివారణ అనేది మానవ శరీరముపై భగవాన్ బాబావారి దివ్య సంకల్పముయొక్క ప్రభావమే; దానికి కారణం, ఆ శరీరములలో అంతర్యామిగా నివసించేది భగవాన్ బాబావారే! ఆర్తితో కూడిన ప్రార్థనద్వారా భగవదనుగ్రహమును పొంది వ్యాధి నివారణ గావించుకునే సులభమైన మార్గమును విడిచిపెట్టి కేవలం వైద్య శాస్త్రముపైననే ఆధారపడడం మూర్ఖత్వము, వ్యర్థము అని నా వంటి డాక్టర్లకు గుణపాఠం నేర్పడానికే భగవాన్ బాబావారు ఈ హాస్పిటలును నెలకొల్పారని నా దృఢ విశ్వాసము" అని చెప్పి తన కథనమును ముగించారు.

1975వ సంవత్సరములో శ్రీ సత్యసాయి హాస్పిటలుకు మెడికల్ సూపరింటెండెంటుగా పదవీ బాధ్యతలు స్వీకరించిన డా॥ నరోత్తమ్ మేంఘ్రూ ఆల్రేజా పరిపూర్ణమైన అంకిత భావముతో 30 సంవత్సరాలకు పైగా హాస్పిటలులోని వివిధ విభాగములలో సేవలు అందించారు. బొంబాయికి చెందిన డా॥ ఆల్రేజా చాలా గంభీర స్వభావము గల నిష్కపటమైన, ఆధ్యాత్మిక చింతనాపరుడు. నూట నాలుగు సంవత్సరాల పండు ముదుసలి వయస్సులో తన భౌతిక కాయమును వీడిన ఒక సిద్ధ పురుషుని ఆదేశానుసారం డా॥ ఆల్రేజా తన సద్గురువుకొరకు అన్వేషిస్తున్న సమయం అది. ఆ పావన పురుషుని ఏదైనా ఒక మంత్రము ఉపదేశించుమని ప్రార్థించినప్పుడు, ఆయన తొందరలోనే తాను భౌతిక కాయమును వీడనున్నందున తాను డా॥ ఆల్రేజాకు గురువుగా ఉండడానికి అంగీకరించలేనని తెలిపారు. అయితే, డా॥ ఆల్రేజాయొక్క అన్వేషణ ఫలించి ఆయన తొందరలోనే ఒక మహా గురువును కలుసుకోగలరని చెప్పారు. ఎట్టకేలకు ఆయన అన్వేషణ ఆయనను 1965వ సంవత్సరములో బెంగుళూరులో భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి ఆశ్రమమైన బృందావనమునకు చేర్చింది. డా॥ ఆల్రేజాను చూచిన వెంటనే భగవాన్ బాబా "డాక్టర్! బొంబాయి నుండి ఎప్పుడు వచ్చావు?" అని అడిగారు. అదే వారిద్దరి

మధ్య ప్రథమ సమావేశం. 'తాను చేసే వృత్తి, తన స్వస్థలం మొదలైన వివరాలు బాబాకు ఎట్లా తెలిసాయా', అని డా॥ ఆల్రేజా ఆశ్చర్యపోతూండగా భగవాన్ బాబావారు ఆయనను ఇంటర్వ్యూకు పిలిచారు. ఆ ఇంటర్వ్యూలో బాబా ఆయనను "నీకేమి కావాలి?" అని అడిగారు. అందుకు సమాధానంగా డా॥ ఆల్రేజా "భగవంతుని అనుగ్రహం వల్ల నాకు కావలసినవన్నీ లభించాయి. నేనింక కోరవలసినదేమీ లేదు", అని చెప్పారు. బాబా మళ్ళీ ఆయనను "నిజమే! కాని, నీవింకా కోరవలసినదేదైనా ఉండవచ్చు. కోరుకో! నీకేది కావలిసినా ఇస్తాను", అని ప్రోత్సహించారు. డా॥ ఆల్రేజా కూడా మళ్ళీ "బాబా! ప్రాపంచికమైన వస్తువులు వేటిని కోరవద్దని నా బుద్ధి నన్ను ప్రేరేపిస్తున్నది", అని సమాధానం చెప్పారు. స్వామి మరొకసారి డా॥ ఆల్రేజాను "అవును, నాకు తెలుసు. నీకు పరిపక్వత చెందిన బుద్ధి ఉన్నది. చాలా సంతోషం! నీకేం కావాలో చెప్పు", అని అడిగారు. వెంటనే డా॥ ఆల్రేజా "భగవాన్! నాకు భక్తి, శ్రద్ధలను ప్రసాదించండి", అని కోరుకున్నారు. అప్పుడు భగవాన్ బాబావారు ఆశీఃపూర్వకముగా ఆయన శిరస్సుపై తమ దివ్యహస్తమును ఉంచగానే డా॥ ఆల్రేజా క్రిందకు వంగి ఆయన పాదనమస్కారం చేసుకున్నారు. ఆ సమయంలో స్వామి పాదాలను చూచినప్పుడు చాలా ఆశ్చర్యకరంగా మిలమిల మెరుస్తున్న భగవాన్ బాబావారి చిన్న పాదాలు అంతకు ముందు తనకు మంత్రోపదేశము చేయడానికి నిరాకరించిన ఆ సిద్ధ పురుషుని పాదాలసైజుకు మారిపోవడం ఆయన గమనించారు. డా॥ ఆల్రేజా మహాగురువు కొరకు చేసిన అన్వేషణ ఆ రోజున ఆవిధంగా బృందావనంలో ఫలించింది.

ఆ తరువాత పది సంవత్సరాల కాలంలో డా॥ ఆల్రేజా పొందిన అద్భుతమైన అనుభూతులు చివరకు ఆయనను బొంబాయినుండి ప్రశాంతి నిలయమునకు చేర్చాయి. అటువంటి దిగ్భ్రమను కలిగించే ఒక అనుభూతిని ఇక్కడ వివరించడం జరుగుతున్నది : డా॥ ఆల్రేజా బొంబాయిలో సర్టిఫైయింగ్ సర్జను (Certifying Surgen)గా పని చేస్తున్నప్పుడు ఒకసారి జోసెఫ్ అనే పేరుగల ఒక వ్యక్తి యొక్క మృతదేహమును పోష్టమార్టం (శవ పరీక్ష) కొరకు

ఆయన వద్దకు తీసికొనిరావడం జరిగింది. ఆ వ్యక్తి అంతకుముందు నీటిలో మునిగిపోవడంవలన మరణించాడు. డా॥ ఆల్రేజా శవపరీక్ష జరిపి ఆవిధంగా సర్టిఫికేటు ఇచ్చారు. దానితోబాటు తన వృత్తి ధర్మమునుసరించి ఆ సర్టిఫికెట్ కాపీ ఒకటి పోలీసులకు కూడా పంపించారు. కొన్ని రోజుల తరువాత, చనిపోయిన ఆ వ్యక్తియొక్క బంధువులు అతని మరణము నీటిలో మునిగిపోవడం వలన కలిగిన సహజ మరణము కాదని, అతనిని ఎవరో హత్య చేసి ఉంటారని అనుమానించారు. డా॥ ఆల్రేజా జీవితంలో మొట్టమొదటిసారిగా ఆయన వృత్తిపరమైన నిజాయితీ శంకింపబడే పరిస్థితి ఏర్పడింది. ఆ పరిస్థితులలో తనకు సహాయం చేయుమని డా॥ ఆల్రేజా భగవాన్ బాబావారిని వేడుకున్నారు.

ఇంతలో, ఆ వ్యక్తియొక్క శవమును మళ్ళీ పైకి తీసి మరొకసారి పరీక్ష జరుపవలసినదని న్యాయస్థానము ఆదేశించింది. ఆ వ్యక్తి యొక్క శవమునకు పోష్టమార్టం జరిపిన 33 రోజుల తరువాత ఈ ఆదేశాలు జారీ అయినాయి. కోర్టు ఆదేశము ననుసరించి పోలీసు కమీషనరు జాన్ క్రాఫ్ట్, డా॥ ఆల్రేజాను ఆ వ్యక్తియొక్క మృత శరీరమును పాతి పెట్టిన సిమెటరీ (Cemetery) కి తీసికొని వెళ్ళారు. అక్కడ శవపేటికయొక్క మూతను పెకెత్తి చూడగానే అందులోని శవము అప్పుడే పాతిపెట్టినట్లు పాడవకుండా ఉన్నది. ఆ పోలీసు కమీషనరు శవముయొక్క కాళ్ళు, చేతులను ఇటు, అటు కదిలించి చూచి శవముపై ఎక్కడా గాయాలు కాని, ఫ్రాక్చర్లుగాని లేవని నిర్ధారించుకున్నాడు. పోలీసు అధికారులు అక్కడినుండి వెళ్ళిపోయిన తరువాత డా॥ ఆల్రేజా తన కారువైపు నడుస్తూండగా ఆయనకు "నెల రోజుల తరువాత కూడా మృతదేహము కుళ్ళిపోకుండా ఉండడం ఎలా సంభవం?" అని అనుమానం కలిగింది. దాంతో ఆయన వెనక్కు వెళ్ళి శవపేటిక యొక్క మూతను మళ్ళీ తెరచి చూస్తే అందులో శవం కుళ్ళిపోయి ఉన్నది! అక్కడ కుళ్ళిపోతున్న మాంసం ముద్ద తప్పించి మరేమీలేదు. అది చూచిన ఆయనకు ఆశ్చర్యంతో మూర్ఛ వచ్చినంత పనయ్యింది. కొద్దిసేపటికి ఎలాగో అలాగ తేరుకుని డా॥ ఆల్రేజా ఇంటికి తిరిగి వచ్చేటప్పటికి ఆయన భార్య అంతకంటె దిగ్భ్రాంతిని కలిగించే ఒక సమాచారమును ఉత్సాహంగా

ఆయనకు అందించింది. భగవాన్ బాబావారు తన చేతిలో ఒక పెద్ద చేపను పట్టుకుని దానిని ఇటూ అటూ ఊపుతూ తమ ఇంటి ఆవరణలో ఆమెకు దర్శనమిచ్చారు! ఆ దృశ్యము ఆమె మనసులో చెలరేగుతున్న ఆందోళనను పూర్తిగా తొలగించింది. వెంటనే ఆ దంపతులు, తమ పరువు ప్రతిష్ఠలు కాపాడిన తమ రక్షకుడు భగవాన్ బాబావారిని దర్శించుకునేందుకు ప్రశాంతి నిలయము పరుగెత్తారు. భగవాన్ దర్శనంతో ఆనందోత్సాహాలతో తన్మయులైన ఆ దంపతులను చూచి "అవును, నేనే ఆ శవమును కుళ్ళిపోకుండా తాజాగా ఉంచాను. లేకపోతే మీరు ఎన్నో సమస్యలలో చిక్కుకుని ఉండేవారు", అని బాబా ధ్రువపరచారు. అప్పుడు ఆ దంపతులు కృతజ్ఞతాభావంతో భగవాన్ బాబావారి పాదాలకు ప్రణమిల్లారు.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య సన్నిధిలో చిరకాలంపాటు సేవ చేసిన కారణంగా డా॥ ఆల్రేజా భగవాన్ యొక్క దివ్యశక్తి, జ్ఞానమునకు నిదర్శనములైన అనేక దివ్యానుభూతులను పొందారు. అందులో కొన్నిటిని ఇక్కడ వివరించడం జరుగుతున్నది.

డా॥ ఘోష్ కలకత్తా నగరములో ఒక విద్యా సంస్థలో ప్రొఫెసరు. ఆయన ఒకసారి భగవాన్ బాబావారి దర్శనంకొరకు ప్రశాంతి నిలయమునకు వచ్చారు. ఆ సమయంలో ఈస్ట్ ప్రశాంతి బ్లాకులోని ఒక ఫ్లాట్‌లో ఉన్నారు. అప్పుడు ఆయనకు గుండెపోటు రాగా భగవాన్ బాబా ఆయనకు వైద్యం చెయ్యడానికి డా॥ ఆల్రేజాను పంపారు. సాధారణంగా కేన్సరు, గుండెజబ్బులవంటి ప్రమాదకరమైన వ్యాధులతో బాధపడే రోగుల విషయంలో భగవాన్ బాబా "వారు పడుతున్న బాధ లేక నొప్పికి గల కారణమును గురించి వాళ్ళకు వెంటనే చెప్పకండి. దాంతో వాళ్ళు షాకయి సగం చచ్చిపోతారు. వీలయినంతవరకు అటువంటి రోగులకు అత్యుత్తమమైన వైద్యసేవలు అందించి తరువాత క్రమంగా వాళ్ళ వ్యాధికి అసలు కారణమును తెలియజెయ్యండి. ఇక గుండెపోటు వచ్చినవారిని, శ్వాస ఆడకపోతే తప్పించి, వెంటనే హాస్పిటలుకు పంపించకండి.

అంతకంటె మొట్టమొదట వారి యింట్లోనే ప్రథమ చికిత్స చేసి తరువాత వారిని హాస్పిటలులో చేర్చండి", అని వైద్యులకు సలహాయిస్తారు.

భగవాన్ బాబావారి ఆదేశానుసారం డా॥ ఆల్రేజా, డా॥ ఘోష్ ఉంటున్న ఫ్లాట్‌కు వెళ్ళి ఆయనను పరీక్ష చేశారు. ఆయనకు గుండెపోటు వచ్చిన నిదర్శనాలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. కాని, డా॥ ఆల్రేజా ఆయన భయాన్ని పోగొట్టడానికి కొన్ని మందులు ఇచ్చి, దాంతోబాటు భగవాన్ బాబావారి విభూతినికూడా ఇచ్చారు. భగవాన్ ఆదేశానుసారం ఆ మరునాడు ఉదయం డా॥ ఘోష్‌ను హాస్పిటలులో చేర్చారు. హాస్పిటలులో ఒక రోజు చికిత్స చేసినాగాని ఆయన పరిస్థితి మెరుగవలేదు. మూడవరోజు ఉదయం తన అలవాటు ప్రకారం డా॥ ఆల్రేజా హాస్పిటలుకు వెళ్ళి డా॥ ఘోష్‌ను చూడగా ఆయన ఆనందంతో వెలిగిపోతున్నారు. చాలా ఆరోగ్యంగా కనపడ్డారు. భగవాన్ బాబావారి దివ్య సంకల్పంవలన తప్పక ఏదో జరిగిందని, లేకపోతే డా॥ ఘోష్ ఆరోగ్యం విషయంలో అంతమంచి మార్పు కలిగియుండదని డా॥ ఆల్రేజా సరిగ్గా ఊహించారు. ఆయన అక్కడున్న బాబా ఫోటోవైపు తదేకంగా చూస్తూండగా డా॥ ఘోష్ "డాక్టర్! గతరాత్రి నా ఆరోగ్యం గురించిన ఆందోళనతో నాకు నిద్ర పట్టలేదు. వార్డులో నా ఎదురుగా గోడకు వ్రేలాడదీయబడిన భగవాన్ బాబావారి ఫోటోవైపు చూస్తున్నాను. ఇంతలో ఆ ఫోటోలోనుండి బాబా బయటకు వచ్చి నాకు విభూతిని ప్రసాదించి నా ఛాతీపై ఒకసారి తమ దివ్య హస్తముతో తట్టి తిరిగి వెనుకకు వెళ్ళి అదృశ్యమైపోయారు", అని తన అనుభవమును వివరించారు. ఈ సంఘటన జరిగిన కొద్దిరోజులలోనే డా॥ ఘోష్ పరిపూర్ణ ఆరోగ్యవంతుడై ఆనందోత్సాహములతో కలకత్తాకు తిరిగివచ్చారు.

ఒకసారి డా॥ ఆల్రేజాకు భగవాన్ బాబావారు తన ప్రక్కన నిలబడి ఉండగా తాను గడ్డపాఱతో నుయ్యిని త్రవ్వుతున్నట్లు కల వచ్చింది. అప్పటికి మూడుసార్లు ఆయన ఆ ప్రయత్నం చేసి ఫలించకపోగా నాలుగవసారి మళ్ళీ త్రవ్వడానికి ప్రయత్నించారు. అప్పుడు భగవాన్ ఆయనను "నువ్వు దేనికొరకు

త్రవ్వుతున్నావు?" అని ప్రశ్నించారు. "నీటి కొరకు, స్వామీ!" అని ఆత్రేజా సమాధానం చెప్పారు. అప్పుడు స్వామి మళ్ళీ "నువ్వు వృథా శ్రమ పడుతున్నావు. ఇప్పటికి మూడుసార్లు ప్రయత్నించి విఫలమై నాలుగవసారి మళ్ళీ ప్రయత్నం చేస్తున్నావు" అని వ్యాఖ్యానించారు. అందుకు డా॥ ఆత్రేజా "భగవాన్! నేనెందుకు విఫలమయ్యాను? దయచేసి నాకు చెప్పండి. నాలో ఏ లోపమున్నది?" అని అడిగాడు. స్వామి సమాధానమిస్తూ "నీలో తత్పరత లేదు" అని చెప్పి అదృశ్యమయ్యారు. కల కరిగిపోయింది. ఆ మరునాడు ఉదయం డా॥ ఆత్రేజా అలవాటు ప్రకారం హాస్పిటలుకు వెళ్ళారు. భగవాన్ బాబావారు మధ్యాహ్నం 1-30కు తనను ఆయన గదిలోనికి పిలిచేవరకు ఆయనకు రాత్రి వచ్చిన కల అస్సలు జ్ఞాపకమునకు రాలేదు. డా॥ ఆత్రేజా తన గదిలోనికి రాగానే భగవాన్ బాబా సంభాషణను ప్రారంభిస్తూ "నిన్న రాత్రి కలలో నువ్వు ఏమి చూశావు?" అని ప్రశ్నించారు. డా॥ ఆత్రేజా తనకు వచ్చిన కలను జ్ఞాపకం చేసుకుంటూండగా భగవాన్ మళ్ళీ "అవును; నీలో తత్పరత లోపించింది", అని వ్యాఖ్యానించారు. డా॥ ఆత్రేజా "స్వామీ! 'తత్పరత' అనే పదమునకు అర్థమేమిటి?" అని అడిగారు. "నువ్వే ఆలోచించి చెప్పు" అని ప్రోత్సహించారు, స్వామి. అప్పుడు డా॥ ఆత్రేజా 'తత్పరత' అనే పదము ఉన్న భగవద్గీతలోని నాలుగవ అధ్యాయములో 39వ శ్లోకమును గుర్తు చేసుకుని పైకి చదివారు. "ఆ శ్లోకానికి అర్థం చెప్పు", అని అడిగారు, స్వామి. "శ్రద్ధ, విశ్వాసము మరియు ఇంద్రియ నిగ్రహము కలిగిన మానవుడు జ్ఞానమును పొందగలుగుతాడు. తద్వారా పరమశాంతిని పొందుతాడు, అని నేను అర్థం చేసుకున్నాను స్వామీ!" అని డా॥ ఆత్రేజా సమాధానం చెప్పారు. అప్పుడు స్వామి మళ్ళీ "అయితే, 'తత్పరత' అనే పదానికి అర్థమేమిటి?" అని ప్రశ్నించారు. "శ్రద్ధ, దృఢ సంకల్పము మరియు సత్కర్మాచరణకు సిద్ధముగా ఉండడం అని అర్థం చెప్పుకోవచ్చు, స్వామీ!" అని జవాబు చెప్పారు డా॥ ఆత్రేజా. స్వామి ఆ శ్లోకార్థమును గురించి మరింత లోతుగా వెళ్ళి "ఆ శ్లోకము చెప్పబడిన సందర్భమును బట్టి, నీవు చెప్పినది సరియైన అర్థమే కావచ్చు. అది కాక, వేరే

ఏదైనా అర్థమున్నదేమో ఆలోచించగలవా?" అని అడిగారు. డా॥ ఆత్రేజా తన అశక్తతను తెలియబరుస్తూ "బాబా! నాకు తెలియదు. దయచేసి మీరే బోధపర్చండి", అని చెప్పారు. అప్పుడు స్వామి "తత్ అనగా బ్రహ్మము, పరత అనగా 'స్థిరముగా నిలిచియుండుట'. అందువలన, తత్పరత అనగా 'బ్రహ్మమునందు స్థిరముగా నిలిచియుండుట'. ఇప్పుడు అర్థమయిందా?" అని అడిగారు. "అర్థమైంది, స్వామీ! అయితే బ్రహ్మానుభవము లేకుండా పదమునకు అర్థము తెలుసుకోవడంవలన ఏమి ఉపయోగం?" అని బదులు చెప్పారు డా॥ ఆత్రేజా. "అదంత తేలికైనదా?" అని ప్రశ్నించారు, స్వామి. అందుకు ఆత్రేజా "స్వామీ! నాకు తెలుసు. మానవుడు దైవకృప, గురుకృప లేకుండా తాను ఎంత ప్రయత్నించినప్పటికి అత్యున్నతమైన బ్రహ్మానుభవమును పొందలేడుకదా!" అని విన్నవించుకున్నారు. అప్పుడు బాబా "సరియైన సమయం వచ్చినపుడు అన్నీ వాటంతట అవే సమకూరుతాయి. మానవునికి విశ్వాసము, ఓర్పు ఉండాలి. అది సరే! ఇప్పుడు నువ్వు ఏవైనా ప్రశ్నలు అడుగదలచుకుంటే అడుగు", అని డా॥ ఆత్రేజాను పురికొల్పారు. డా॥ ఆత్రేజా స్పందిస్తూ "బాబా! అష్టావక్ర మహర్షి జనక మహారాజుకు మంత్రోపదేశము చేసి తద్వారా ఆయనకు అత్యున్నతమైన బ్రహ్మానుభవమును కలిగించారని మీరు ఒక సందర్భంలో చెప్పినట్లు నేను విన్నాను. ఆ మంత్ర మేమిటి స్వామీ! నాకు తెలిసినంతవరకు ఆ మంత్రము ఏ గ్రంథములోను పేర్కొన బడలేదు", అని అడిగారు. "అయితే, ఆ మంత్రమును గురించి నీకు తెలుసుకోవాలని ఉందా?", అని ప్రశ్నించారు, స్వామి. "అవును, స్వామీ!" అని జవాబు చెప్పారు ఆత్రంగా, డా॥ ఆత్రేజా. అప్పుడు బాబా తమ కుర్చీనుండి లేచి డా॥ ఆత్రేజా చెవివద్దకు వంగి నెమ్మదిగా ఆయన చెవిలో "తత్త్వమసి", అని ఉచ్చరించారు. ఆ మంత్రమును విన్న డా॥ ఆత్రేజాకు జీవ, బ్రహ్మల అభేదతత్త్వము గోచరించి సర్వము బాబామయంగా మారిపోయింది. ఆ దివ్యమైన జీవబ్రహ్మైక్యానుభూతిలో ఆయన చాలాసేపు ఉండిపోయారు. మళ్ళీ భగవాన్ బాబావారు "ఆ! ఇప్పుడు అర్థమైందా?", అని ప్రశ్నించిన తరువాతనే ఆయన మామూలు స్థితికి వచ్చారు. అప్పుడు

డా॥ ఆల్రేజా "అర్థమైంది, స్వామీ! సర్వమూ బ్రహ్మమయమే", అని చెప్పి భగవాన్ బాబావారి పాదాలపై వ్రాలారు.

బొంబాయిలో నివసిస్తున్న డా॥ ఆల్రేజాయొక్క సోదరి బ్రెస్ట్ కేన్సరు వ్యాధితో బాధపడుతున్నట్లు వైద్యులు నిర్ధారించారు. టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చిలో న్యూక్లియర్ సైంటిస్టుగా పనిచేస్తున్న ఆమె భర్తకు బాబాయందుగాని, మరే సాధు సత్పురుషులయందుగాని నమ్మకం లేదు. ఆయన భార్యకు భగవంతునియందు నమ్మకం ఉన్నదిగాని, బాబాయందు ఆమె ఏమాత్రము ఆసక్తి చూపించలేదు. ఆమెకు కేన్సరు వ్యాధి ఉన్నదని కనుగొన్న డా॥ ఆల్రేజా యొక్క సోదరుడు, టాటా మెమోరియల్ హాస్పిటలులో చీఫ్ సర్జనుగా పనిచేస్తున్న డా॥ రామదాసును ఆమెకు శస్త్రచికిత్స చేయించే విషయంలో సంప్రదించవలసిందిగా సలహాయిచ్చారు. అప్పుడు డా॥ ఆల్రేజా బొంబాయి వెళ్ళి డా॥ రామదాసుతో మాట్లాడి శస్త్రచికిత్సకు తేది నిర్ణయించారు.

ఆ సమయంలో భగవాన్ బాబావారు బొంబాయిలో బస చేసి ఉన్నందున, డా॥ ఆల్రేజా ఆయన నివాసముంటున్న ధర్మక్షేత్రమునకు వెళ్ళి తన సోదరి శస్త్రచికిత్సకు భగవాన్ ఆశీస్సులు కోరారు. డా॥ ఆల్రేజా భగవాన్ బాబావారిని ప్రసాదము అర్థించినప్పుడు ఆయన "నా యందు ఆమెకు విశ్వాసమున్నదా?" అని ప్రశ్నించారు. డా॥ ఆల్రేజా ఆ ప్రశ్నకు "స్వామీ! మీయందు ఆమెకు విశ్వాసమున్నదో లేదో నాకు తెలియదు. ఆ విషయం నాకంటె మీకే ఎక్కువగా తెలుసు. ఒక వేళ ఆమెకు విశ్వాసం లేకపోయినా మీరు ఆమెలో విశ్వాసమును నెలకొల్పి ఆమె వ్యాధిని నయం చేయగలరు!" అని విన్నవించుకున్నారు. అప్పుడు భగవాన్ బాబావారు విభూతిని సృష్టించి డా॥ ఆల్రేజాకు ఇచ్చి ఆమె ఛాతీ ఎడమ భాగములో వారము దినములపాటు ఆ విభూతిని ప్రతిరోజూ రాయవలసిందిగా సూచించారు. ఇక రెండు రోజులలో ఆమెకు శస్త్ర చికిత్స జరగవలసి ఉండగా ఏడురోజులపాటు విభూతిని ఛాతీపై రాయడం ఎలా సాధ్యపడుతుందని, డా॥ ఆల్రేజా ఆశ్చర్యపోయారు. కాని, ఇంతలో డా॥

రామదాసు మద్రాసులో ఒక అత్యవసర శస్త్ర చికిత్సను నిర్వహించడానికి వెడుతున్నందున డా॥ ఆల్రేజా సోదరికి బొంబాయిలో నిర్వహించవలసిన శస్త్ర చికిత్స ఒక వారం రోజులపాటు వాయిదాపడిందని ఆయనకు తెలిసింది.

భగవాన్ బాబావారు ప్రసాదించిన విభూతి ప్రసాదము తన సోదరి యొక్క 'కేన్సరును కేన్సిలు' చేస్తుందని డా॥ ఆల్రేజాకు గట్టి నమ్మకం ఉంది. ఆయన తన దృఢ విశ్వాసమును తన బావకు తెలియపరచినపుడు ఆయన "నువ్వు వట్టి తెలివితక్కువవాడివి. కేన్సరు వ్యాధి విభూతివల్ల నయమవుతుందా?" అని చెప్పి, అనుకున్న ప్రకారం శస్త్ర చికిత్స జరగవలసిందేనని పట్టుబట్టారు. అంతేకాదు, ఆ విధంగా శస్త్ర చికిత్సకు ఆమెను ఒప్పించారు కూడా. డా॥ రామదాస్ ఆమెకు శస్త్ర చికిత్స నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తూండగా ఇక చేసేది ఏమీలేక డా॥ ఆల్రేజా చూస్తూ ఉండిపోయారు. కేన్సరు వ్యాధి సోకిన ఆమె శరీరమునుండి మూడు టిష్యూలు తీసి బయోప్సీకి (biopsy) పంపారు. అయితే, అత్యంతాశ్చర్యకరంగా ఆ మూడు టిష్యూలలో ఏ ఒక్కదానిలోను కేన్సరు ఛాయలు కనపడలేదు! అది చూసి డా॥ ఆల్రేజా యొక్క సోదరుడు, బావ ఇద్దరూ దిగ్భ్రాంతి చెందారు. ఆమెకు ఆపరేషను చేసిన డా॥ రామదాసు ఆపరేషనుకు ముందు పరిస్థితిని చూపే స్లైడు, ఆపరేషను జరిగిన తర్వాత పరిస్థితిని చూపే మూడు స్లైడ్లు, మొత్తం నాలుగు స్లైడ్లు కలిపి సుప్రసిద్ధ కేన్సరు వైద్య నిపుణులు (Oncologist) డా॥ పురందరేకు పంపమని, ఆయన పరీక్ష చేసి సరిగా సలహా యిస్తారని చెప్పారు. ఆ నాలుగు స్లైడ్లను పరీక్షించిన డా॥ పురందరే మొదటి స్లైడులో రోగికి తీవ్రమైన కేన్సరు లక్షణాలు (Malignancy) కనపడుతున్నాయని, మిగిలిన మూడు స్లైడ్లలో అసలు కేన్సరుయొక్క ఛాయలేవీ కనపడటంలేదని ధ్రువపరిచారు! ఈ సంఘటన మొత్తం ఆ కుటుంబ సభ్యులందరిపైన గొప్ప ప్రభావమును చూపించింది. భగవాన్ బాబావారు డా॥ ఆల్రేజా సోదరియొక్క కేన్సరు కేన్సిలు చేసి ఆ కుటుంబమంతటికి ఆనందమును ప్రసాదించడమే గాక, వారికి విశ్వాసమనే అమూల్యమైన కానుకనుకూడా ప్రసాదించారు. అయితే, డా॥ ఆల్రేజాయొక్క సోదరి, తాను

ఆపరేషనుకు ముందు తన సోదరుని మాటలు పూర్తిగా విశ్వసించనందుకు చాలా దుఃఖించారు. ఆపరేషను చేయించుకునేముందు తన ఛాతీపై ఉన్న ట్యూమరును మరొక్కసారి పరీక్ష చేయుమని తాను గట్టిగా పట్టుపట్టియుండవలసిందని ఆమె భావించింది.

సంవత్సరాలు గడుస్తున్నకొద్దీ ప్రశాంతి నిలయంలోని శ్రీ సత్యసాయి హాస్పిటలు చాలా అభివృద్ధిని సాధించింది. సేవకు అంకితమైన అనేకమంది డాక్టర్లు, వైద్య, వైద్యేతర సిబ్బంది భగవాన్ బాబావారి మానవసేవా కార్యక్రమంలో పాలుపంచుకుని తద్వారా తమ అంతరాత్మలను పరిశుద్ధము చేసుకునే లక్ష్యముతో ఈ హాస్పిటలులో చేరారు. సంవత్సర సంవత్సరానికి, ముఖ్యంగా 1979వ సంవత్సరం తరువాత ఈ హాస్పిటలులో అనేక సౌకర్యములు, పరికరములు, వైద్య విభాగములు ఏర్పాటు చేయబడినాయి. 1984వ సంవత్సరం ఫిబ్రవరి నెల 29వ తేదీన మహాశివరాత్రి పర్వదినంనాడు ప్రస్తుత హాస్పిటలు భవనమునకు దక్షిణంగా ఉన్న సువిశాలమైన ఖాళీ స్థలంలో నిర్మింపబడిన నూతన భవనమునకు ప్రారంభోత్సవం జరిగింది. ఆరోజునుండి శ్రీ సత్యసాయి హాస్పిటలులో సాధారణ శస్త్ర చికిత్స విభాగముకూడా ప్రారంభింపబడినది.

ప్రశాంతి నిలయం కేంపస్‌లో బాలుర హాస్టల్‌కు నేను వార్డెన్‌గా పనిచేస్తున్న సమయంలో శ్రీ సత్యసాయి హాస్పిటలులో భగవాన్ బాబావారు చనిపోయిన ఒక వ్యక్తిని పునర్జీవితుని చేసిన ఒక అత్యద్భుత సంఘటనను నేను ప్రత్యక్షంగా చూడడం జరిగింది. 1985వ సంవత్సరం అక్టోబరు నెలలో ఒక రోజు తెల్లవారుఝామున నారాయణ శర్మ అనే ఒక రీసెర్చిస్కాలరు తీవ్రమైన ఆస్తమా వ్యాధితో శ్రీసత్యసాయి హాస్పిటలులో చేర్చబడ్డారు. ఇంచుమించుగా చనిపోవడానికి సిద్ధముగానున్న ఆరోగిని చూచి హాస్పిటలు మెడికల్ సూపరింటెండెంటు డా॥ చారి చాలా గాభరా పడిపోయారు. ఎనస్తటిస్టు ఆరోగికి ఆక్సిజను పెట్టి అతనిని ప్రమాద పరిస్థితి నుండి తప్పించడానికి ప్రయత్నిస్తున్న సమయంలో డా॥ శాంత ఆవైపు వచ్చి పరీక్ష చేసి రోగికి

గుండెకొట్టుకోవడం లేదని, శరీరము కూడా నీలంరంగుకు మారిందని గమనించారు. దాంతో డా॥ చారి ఆరోగి చనిపోయినట్లు నిర్ధారించుకుని ఆ విషయం భగవాన్ బాబావారికి తెలియజేయడానికి మందిరానికి వెళ్ళారు. అలా వెళ్ళిన డా॥ చారి, భగవాన్ బాబావారు పంపిన రెండు విభూతి పేకెట్లు పట్టుకుని హాస్పిటలుకు తిరిగివచ్చారు. భగవాన్ ఆదేశానుసారం ఆ పేకెట్లలోని విభూతిని రోగి గుండెలమీద రాస్తూ వెనుకవైపున వీపుకు ఆనించి వేడి నీళ్ళ సంచీ పెట్టారు. ఇంతలో నేను హాస్పిటలుకు వెళ్ళి జరిగిన విషయం తెలుసుకుని, ఆత్రుతతో మందిరంలో భగవాన్ బాబావారివద్దకు పరుగెత్తాను. అప్పుడు భగవాన్ బాబా "కంగారుపడవలసిన పని లేదు. ఆ కుర్రవాడు కోలుకుంటాడు", అని నాతో చెప్పి వేడివేడి కాఫీ ఉన్న ఒక ఫ్లాస్కును నా చేతికిచ్చారు. "కొద్దికొద్దిగా అందులోని కాఫీ ఆ కుర్రవాడి చేత త్రాగించు", అని చెప్పారు. వెంటనే నేను హాస్పిటలుకు వెళ్ళి కాఫీఫ్లాస్కును డా॥ శాంతకు అందించాను. ఆమె చాలా యాంత్రికంగా నా చేతిలోని ఫ్లాస్కును తీసుకుంది. ఆమె మనసులో "చనిపోయిన కుర్రవాడు కాఫీ ఎలా త్రాగుతాడు", అనే సందేహం పీడిస్తోంది. అయితే ఆమె తన సందేహమును బయటకు వ్యక్తము చెయ్యలేదు. తరువాత ఈ విషయాన్ని నాతో చెప్పింది. మేమందరం ఆ కుర్రవాని శరీరముపైపు నిస్సహాయంగా చూస్తూ మనసులోనే భగవాన్ బాబావారిని ప్రార్థించుకుంటుండగా, అతడి కాలి బొటన వ్రేలు కొద్దిగా కదిలింది! అది చూసి మా గుండెలు లయ తప్పాయి! వెంటనే డా॥ శాంత ఆక్సిజను మాస్కు తీసివేసి అతని చెవిలో "స్వామి నీకు కాఫీ పంపించారు, తీసుకో!" అని నెమ్మదిగా చెప్పారు. తరువాత ఆమె కొంచెం కొంచెంగా స్పూనుతో ఆ కుర్రవానికి స్వామి పంపిన కాఫీ నోటికి అందిస్తూండగా అతడు త్రాగాడు.

తరువాత డా॥ శాంత అతని బ్లడ్ ప్రెషర్ కొలవడానికి చేతికి పట్టీని కడుతూండగా స్వామి అక్కడికి వచ్చారు. స్వామి ఆమెవైపు చూసి చిరునవ్వు నవ్వుతూ "అతడు చనిపోలేదా? అటువంటప్పుడు అతని చేతికి బి.పి. కఫ్ ఎందుకు కడుతున్నావు?" అని అడిగారు. ఇంతలో స్వామి కంఠస్వరం విన్న

ఆ కుర్రవాడు నెమ్మదిగా కళ్ళు తెరచి చూచాడు! భగవాన్ బాబా ఆ కుర్రవాడిదగ్గరకు వెళ్ళి "నువ్వు ఇంకా బ్రతికే ఉన్నావా? అందరూ నువ్వు చనిపోయావని చెప్పుకుంటున్నారే!" అని పరిహాసమాడారు. తరువాత డా॥ చారివైపు చూచి "అతడు నిజంగానే చనిపోయాడా?" అని అడిగారు. "అవును, స్వామీ!" అని డా॥ చారి సమాధానం చెప్పారు. డా॥ శాంత ఆయన అభిప్రాయమును బలపరుస్తూ "స్వామీ! ఆ కుర్రవానిలో నాడి కనపడలేదు, ఊపిరి ఆగిపోయింది. గుండె కొట్టుకోవడంకూడా వినిపించలేదు. బ్లడ్ ప్రెషరుకూడా కనిపించలేదు. అందువలన ఆతడు చనిపోయాడని మేము నిర్ధారించుకున్నాము", అని వివరించారు. అప్పుడు భగవాన్ బాబావారు చిరునవ్వు నవ్వుతూ హస్త చాలనం చేశారు. ఆయన చేతిలో గోధుమ రంగులో ఉన్న నలు చదరపు చాక్లెట్ వంటి పదార్థ మేదో ప్రత్యక్షమైంది. బాబా దానిని ఆ విద్యార్థి నోటిలో పెట్టి అతనిని నమిలి తినుమని చెప్పారు. ఆతడు తినడం పూర్తయిన తరువాత, భగవాన్ బాబా మళ్ళీ ఆ విద్యార్థియొక్క నాడి, బ్లడ్‌ప్రెషరు చూడుమని డాక్టరుకు చెప్పారు. డాక్టర్లు ఆ విధంగా చేసి చూచేసరికి రెండూ కూడా నార్మలుకు వచ్చేశాయి! అప్పుడు భగవాన్ మా వైపు తిరిగి "మీరు నమ్ముతారా? చనిపోయిన కుర్రవాడు తిరిగి బ్రతికాడు!" అని అడిగారు. మేము "అవును, స్వామీ!" అని చెప్పి అంగీకరించాము. తరువాత ఆయన డాక్టర్లవైపు తిరిగి అదే ప్రశ్న వారిని అడిగారు. వాళ్ళందరూ కూడా ముక్త కంఠంతో "అవును, స్వామీ!" అని అంగీకరించారు. వాళ్ళల్లో ఒకరు "బాబా! మీరు సాక్షాత్తూ దేవుడే! మీరు ఏమైనా చేయగలరు", అని విన్న వించుకున్నాడు. అప్పుడు భగవాన్ బాబా "మీకు ఆ విశ్వాసముందా?" అని అడిగారు. మేమందరం కలసి "ఉన్నది, స్వామీ!" అని సమాధానం చెప్పాము. స్వామి మళ్ళీ "అతడు చనిపోయిన మాట నిజమే! అయితే నేను తిరిగి అతనిని బ్రతికించాను" అని చాలా యథాలాపంగా వెల్లడించారు.

ఈ లోపుగా బయట చాలామంది విద్యార్థులు శర్మ ఆరోగ్య పరిస్థితి ఎలా ఉందోనని చాలా ఆందోళనతో ఎదురు చూస్తున్నారు. అప్పుడు బాబా నన్ను

పిలిచి వారికి నేను ఇక్కడ ఏమి చూచానో అదంతా వివరంగా చెప్పమని ఆదేశించారు. తమ తోటి విద్యార్థి ప్రాణాపాయస్థితినుండి భగవాన్ అనుగ్రహంవల్ల బయటపడి కోలుకుంటున్నాడని తెలుసుకున్న ఆ విద్యార్థులంతా సంతోషంగా హాస్టల్‌కు తిరిగి వెళ్ళిపోయారు.

తరువాత భగవాన్ బాబా ఆ విద్యార్థికి హైడ్రోకార్టిసోన్ డ్రిప్ పెట్టమని చెప్పి, మందిరానికి తిరిగి వచ్చేశారు. కొంతసేపైన తరువాత భగవాన్ బాబావారు ఏవో మాత్రలతో నిండియున్న మూడు సీసాలను సృష్టించి రోగికి వేళ ప్రకారం సరియైన మోతాదులో ఇవ్వమని హాస్పిటలుకు పంపించారు. ఆ రోజు సాయంకాలానికి ఆ విద్యార్థి పూర్తిగా కోలుకున్నాడు. అందువలన, బాబావారి ఆదేశానుసారం అతనిని హాస్పిటలు నుండి డిశ్చార్జి చేశారు.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు 1976వ సంవత్సరంలో బెంగుళూరులో బృందావనంలోని ఆశ్రమానికి మూడు కిలోమీటర్ల దూరంలో వైట్‌ఫీల్డులో రెండవ హాస్పిటలును నెలకొల్పారు. స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్‌యొక్క సహచరుడైన శ్రీ ఎన్.జి. గణ్పులే ముప్ఫయి సంవత్సరాలపాటు జర్మనీ దేశములో నివసించిన తరువాత 1969వ సంవత్సరములో భారతదేశమునకు తిరిగి వచ్చి వైట్‌ఫీల్డులో స్థిర నివాసము ఏర్పాటు చేసుకున్నారు. ఆయనలోని దేశభక్తి, పేద గ్రామీణ ప్రజలకు వైద్య సేవలు అందించేందుకుగాను ఒక చిన్న క్లినిక్ ప్రారంభించేటట్లు పురికొల్పింది. ఫలితంగా ఆయన తనవలె సేవాభావం కలిగిన కొందరు వైద్యులను చేరదీసి వారి సహాయంతో వైట్‌ఫీల్డులో "హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ సొసైటీ" (Health and Education Society) పేరుతో ఒక చిన్న వైద్య సహాయ కేంద్రమును నెలకొల్పారు. పది ఎకరాల సువిశాలమైన స్థలంలో 10'×10'ల కొలతలతో నిర్మింపబడిన ఒక చిన్న షెడ్డులో చుట్టుప్రక్కల గ్రామాలలోని ప్రజలకు ఉచితంగా వైద్య సహాయము మరియు మందులు అందించడానికి ఒక చిన్న క్లినిక్ ప్రారంభించబడింది. 1970వ సంవత్సరంలో శ్రీ గణ్పులే ఆ స్థలమును అందులో నడుపబడుతున్న క్లినిక్‌తోసహా గ్రామీణ

ప్రజలకు ఉచిత వైద్య సహాయము నందించే ఉన్నతాశయమును వ్యాప్తి గావించే ఉద్దేశ్యముతో శ్రీ సత్యసాయి హెల్త్ అండ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్‌కు ఉచితముగా ఇచ్చివేయడానికి సంకల్పించారు.

వైట్‌ఫీల్డులోని ఆ సువిశాల స్థలంలో నిర్మింపబడిన శ్రీ సత్యసాయి హాస్పిటలుకు తేదీ 28-8-1976న వినాయక చవితి పర్వదినాన ప్రారంభోత్సవం చేస్తూ భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు ఆరోగ్య పరిరక్షణను గురించి తమ దివ్య సంకల్పమును ఈ విధంగా వెల్లడించారు :

"మానవుడు శారీరక, మానసిక వ్యాధులనే రెండు రకాల అనారోగ్యముతో బాధపడతాడు. ఇక్కడ గమనించవలసిన ఒక ముఖ్యమైన విషయ మేమిటంటే, ఈ రెండు రకాల వ్యాధులుకూడా సద్గుణములను అలవరచుకోవడంద్వారా నివారింపబడతాయి. శారీరక, మానసిక ఆరోగ్యములు రెండూ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. మానసిక ఆరోగ్యమునకు, శారీరక ఆరోగ్యము అత్యవసరము. అలాగే మనస్సు ఆరోగ్యముగా ఉంటే శరీరముకూడా ఆరోగ్యంగా ఉంటుంది. శరీరము, మనస్సు పరస్పర సంబంధము గలవి. ఆరోగ్యవంతమైన శరీరమే ఆరోగ్యవంతమైన మనస్సుకు ఉత్తమమైన స్థానము.

లౌకిక, ఆధ్యాత్మిక జీవితములు రెండూ త్రాసులోని రెండు పళ్ళెముల వంటివి. ఆధ్యాత్మిక మార్గములో కనీసం ఒక స్థాయికి చేరుకునేవరకైనా, రెండింటికి సమానమైన ప్రాధాన్యత ఇవ్వవలసి యుంటుంది. మానవుడు జీవితంలో ఆధ్యాత్మిక దృష్టిని అలవరచుకోవడంవలన ఉదారబుద్ధి, కష్ట సమయాల్లో మనస్థైర్యము కలిగియుండడం, తన శక్తిమేరకు పరోపకారము మరియు సమాజసేవ చేయాలనే ఉత్సాహము మొదలైన సద్గుణములు అలవడతాయి. ఈ సద్గుణములు శరీరము, మనస్సు రెండింటికి బలమును చేకూరుస్తాయి".

శ్రీ సత్యసాయి వైద్య సంస్థలలో సేవచేసే డాక్టర్లకు భగవాన్ బాబా "మీరు ఇచ్చే మందులకంటె మీరు మాట్లాడే మృదు మధురమైన మాటలు మరియు

మీరు చూపించే ప్రేమ, సానుభూతి రోగులయొక్క వ్యాధులను తొందరగా, చక్కగా నయంచేస్తాయి. డాక్టర్లు రోగులను తమ ఆత్మబంధువువలె చూచుకుంటూ ప్రేమతో, నిస్సంకోచముగా వారికి వైద్య సహాయము అందజెయ్యాలి. రోగి యొక్క వ్యాధి నివారణ కావాలంటే ఆతడు తనతో పూర్తిగా సహకరించాలని; ఆవిధంగా వ్యాధి నివారణ జరిగిన తరువాత, ఆ రోగి ద్వారా తనకు పరిపూర్ణమైన తృప్తి, ఆనందము లభిస్తాయని వైద్యుడు గుర్తుంచుకోవాలి. అందువలన డాక్టరే రోగికి కృతజ్ఞుడై యుండాలి", అని సలహాయిస్తారు. అదేవిధంగా రోగులకుకూడా "ఎటువంటి వ్యాధికైనా భగవంతుని అనుగ్రహమునైన ఆధారపడడమే ఉత్తమమైన నివారణోపాయము. మందులపైన మీకు గల విశ్వాసమును భగవంతునిపై మళ్ళించండి. మందుపైన కాకుండా, భగవంతునియందు విశ్వాసమును పెంచుకోండి. ఆధునిక కాలములో వ్యాధి నివారణకొరకు టాబ్లెట్లు మరియు టానిక్కులపై ఆధారపడే జనంయొక్క సంఖ్య చూచి నాకు చాలా ఆశ్చర్యంగా ఉన్నది. అంతకంటె, ప్రార్థన, ఆధ్యాత్మిక సాధన మరియు ధ్యానముపై ఎక్కువగా ఆధారపడండి. అవే మీకు కావలసిన విటమిన్లు. అవే మీకు ఆరోగ్యమును కలుగచేసే సాధనాలు. భగవంతుని అనుగ్రహం లేకుండా మందులు, వైద్యులయొక్క ఉపయోగమేమిటి? భగవన్నామమును మించిన టాబ్లెట్ లేదు", అని భగవాన్ బాబావారు సలహాయిస్తున్నారు.

వైట్‌ఫీల్డులోని శ్రీ సత్యసాయి హాస్పిటలు నిర్మాణము మరియు నిర్వహణలో డా॥ రాజేశ్వరిని భగవాన్ బాబావారు తమ ఉపకరణముగా ఎంచుకున్నారు. తన ప్రత్యేక విభాగమగు "ఆబ్‌స్టెట్రిక్స్ అండ్ గైనకాలజీ" (Obstretrics and Gynaecology) లో అత్యున్నతమైన విద్యార్హతలు గల డా॥ రాజేశ్వరి వృత్తిపరంగా చాలా అంకితభావంతో పనిచేసే వైద్యురాలు. రోజులో సుమారు 12 గంటలకు పైగా ఆమె తన వైద్యవృత్తికి అంకితమై యుంటారు. ఆమెకు భగవంతుని యందు భక్తి, విశ్వాసములున్నా, సాధు సన్యాసులంటే అంతగా గౌరవభావం లేదు. 1972వ సంవత్సరంలో బృందావనంలో ఆమె మొట్టమొదటిసారి భగవాన్

శ్రీ సత్యసాయి బాబావారి దర్శనం చేసుకున్నారు. నిజానికి, ఆమె ఆ సమయంలో బృందావనంలోని శ్రీ సత్యసాయి కాలేజీలో చదువుతున్న తన కుమారుని చూడడానికి వచ్చింది. అప్పుడు ఆశ్రమంలో భగవాన్ బాబావారు ఉండడంవల్ల ఆయన దర్శనం చేసుకుంది. ఆ ప్రథమ దర్శనంలో ఆమెకు భవిష్యత్తులో తన జీవితంలో కలుగబోయే మార్పులను గురించిగాని లేదా భగవంతుని అవతార కార్యక్రమంలో తాను నిర్వహించబోయే పాత్రను గురించి గాని కొద్దిగా ఊహా మాత్రంగానైనా తెలియలేదు. ఆ తరువాత తన కుమారుని చూడడానికి ఆమె అనేకసార్లు బృందావనం వచ్చి వెడుతున్న సమయంలో స్వామి ఒకసారి తాను నెలకొల్పిన వైట్‌ఫీల్డులోని సత్యసాయి హాస్పిటలులో పనిచేయుమని ఆమెను కోరినప్పుడు కూడా ఆమె చాలా మర్యాదగా ఆ ఆహ్వానమును తిరస్కరించారు. 49 సంవత్సరాల వయస్సులో ఉన్న డా॥ రాజేశ్వరి వృత్తి రీత్యా మరియు ఉద్యోగరీత్యా అత్యున్నత పదవులు అధిరోహించే సమయం అది. అప్పట్లో ఆమె విదేశాలకుకూడా వెళ్ళి ఘనాదేశములోని కుమాసీలో 450 పడకలు గల కోంఫో అనోఖ్యే జనరలు హాస్పిటలుకు సూపరింటెండెంటుగా పనిచేస్తూండేవారు. అందువలన, సహజంగానే వైట్‌ఫీల్డులో 10'×10' ల షెడ్డులో నడుపబడుతున్న ఈ చిన్న క్లినిక్‌యొక్క బాధ్యతలు స్వీకరించడానికి ఆమె తయారుగా లేరు. అంతేకాక, ఆమె ఘనాదేశమునుండి ఇంగ్లాండు వెళ్ళి అక్కడ ఇంకా పెద్ద పదవులు చేపట్టడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అటువంటి సమయంలో భగవాన్ బాబావారి ఆహ్వానమును అంగీకరించడానికి ఆమె తయారుగా లేరు. అయితే, భగవాన్ బాబావారు మాత్రం అన్యథా భావించక "నాకు అన్నీ తెలుసులే" అన్నట్లు ఆమెపై కరుణతో ఒక చిరునవ్వు నవ్వారు! ఆయన అప్పటికే ఆమెకు తెలియకుండానే ఆమె హృదయంలో ప్రవేశించారు.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి పూర్వావతారమైన షిరిడీ అవతారంలో స్వామి తరుచుగా "నా భక్తుడు ఎంత దూరంలో ఉన్నా, వేలకొద్ది మైళ్ళ దూరంలో ఉన్నా సరే, నేను సంకల్పించినప్పుడు పిచ్చుక కాలికి దారం కట్టి లాగినట్లు అతనిని నా దగ్గరకు రప్పించుకుంటాను" అని చెబుతూండేవారు. డా॥ రాజేశ్వరి



"ప్రశాంతి నిలయములోని హాస్పిటలు నూతన భవనము"



"హాస్పిటలులో వైద్యులతో ముచ్చటిస్తున్న భగవాన్ బాబా"



"వైట్‌ఫీల్డులో నూతనంగా నిర్మింపబడిన హాస్పిటలుకు ప్రారంభోత్సవం జరిపిన భగవాన్ బాబా - శ్రీ కామావధాని వేదమంత్ర పఠనం"



"వైట్‌ఫీల్డులోని శ్రీసత్యసాయి జనరల్ హాస్పిటలు"

విషయంలో సరిగ్గా అలాగే జరిగింది. భగవాన్ బాబావారు సంకల్పించిన సమయమాసన్నమైనప్పుడు, వైట్‌ఫీల్డులోని శ్రీ సత్యసాయి హాస్పిటలు ప్రారంభోత్సవానికి కొన్ని నెలలముందు ఆమె బృందావనం వచ్చి అక్కడ స్థిరపడ్డారు. వస్తూనే ఆమె మనస్ఫూర్తిగా తన వైద్యసేవలో మునిగిపోయారు. నిజానికి, ఆమెకు తెలిసినది, నిస్వార్థ సేవాభావ మొక్కటే. శ్రీ సత్యసాయి హాస్పిటలులో బాధ్యతలు చేపట్టిన తరువాత, ఆమెలో స్వతహాగా ఉన్న సేవా సంస్థలను నిర్మించే శక్తి పరిపూర్ణంగా వికసించింది. ఆమెకు నాయకత్వ లక్షణాలు, అనుకున్నది సాధించేవరకు పోరాడే స్వభావము, పుట్టుకనుండే వచ్చాయి. ఆ కారణంగా ఆమె ఎటువంటి సవాళ్ళనైనా ఎదుర్కోవడానికి తయారుగా ఉండేవారు. అంతేకాకుండా తన లక్ష్య సాధనలో అవరోధములను అధిగమించి ముందుకు పోవడం ఆమెకు చాలా ఇష్టం. భగవాన్ బాబావారి అనుగ్రహము మరియు మార్గదర్శకత్వంలో ఆమె వైద్యసేవకు పూర్తిగా అంకితమైన కొందరు వైద్య, వైద్యేతర సిబ్బందిని కూడగట్టి వారి సహాయంతో ఆ చుట్టుప్రక్కల గ్రామాలనుండి శ్రీ సత్యసాయి హాస్పిటలుకు వచ్చే గ్రామీణ ప్రజలకు వైద్యసేవలు అందించడం మొదలుపెట్టారు. హాస్పిటలు నిర్వహణలో అత్యంత స్వల్పమైన విషయాలలోకూడా ఆమె కనపరచే శ్రద్ధ, ఇతరులకు ఆదర్శప్రాయమైనది. ఆమె దృష్టిలో పరిశుభ్రత (Cleanliness) తరువాతనే దివ్యత్వము (Godliness)నకు స్థానము! ఆమె తెల్లవారుఝామున చాలా తొందరగా స్వీపర్లకంటె ముందే హాస్పిటలుకు వచ్చి చేతిలో చీపురుకట్ట పట్టుకుని హాస్పిటలు పరిసరాలు తుడవడం నేను చాలాసార్లు గమనించాను. తనను అమితంగా ప్రేమించే తన తోటి ఉద్యోగులతో "ఈ పని చాలా గొప్పది, ఆ పని నీచమైనది అని సేవను విభాగించడం అర్థంలేనిది. హాస్పిటలులో మలిన వస్త్రములను ఉతికి శుభ్రపరచడం, కత్తి చేతబూని శస్త్రచికిత్స నిర్వహించడం రెండూకూడా పవిత్రమైన కార్యములే! రెండుకూడా మనసుకు తృప్తి కలిగించే సేవలే. భగవదర్పితంగా చేసిన ఏ కార్యమైనా, సాధకుని కర్మయోగిస్థాయికి చేర్చుతుంది. అటువంటి వ్యక్తి భగవదనుగ్రహమే ఊపిరిగా జీవిస్తాడు. భగవంతుని

సర్వాంతర్యామిత్వమునందు విశ్వాసము కలిగి, కర్తృత్వభావన మరియు కర్మఫలాసక్తి రెంటిని విడిచిపెట్టినపుడు, భగవంతునితో ఐక్యము చెందడమనే అంతిమ లక్ష్యము నెరవేరడమేగాక భగవంతుని దివ్యసన్నిధిలో స్థిరముగా ఉండే అంతులేని ఆనందము లభిస్తుంది", అని ఒక సందర్భంలో ఆమె చెప్పారు. నిజంగా ఆమె సాటిలేని అత్యున్నత స్థాయికి చెందిన కర్మయోగి. ఆధ్యాత్మిక స్థాయిలోనేగాక, ఆమె భౌతికంగా కూడా భగవాన్ దివ్యసన్నిధిని ప్రత్యక్షంగా అనుభవించిన వ్యక్తి.

1980వ సంవత్సరం నవంబరు 9వ తేదీ ఆదివారంనాడు ప్రాతఃసంధ్యా సమయంలో జరిగిన సంఘటన ఇది. అంతకు ముందురోజున, బృందావనంలోని బాలుర హాస్టల్‌కు వార్డెన్‌గా పనిచేస్తున్న ఆమె కుమారుడు సి. శ్రీనివాస్ పిల్లలందరిని తీసుకొని ప్రశాంతి నిలయంలో జరుగుతున్న ప్రపంచవ్యాప్త అఖండ భజనలో పాల్గొనడానికి వెళ్ళారు. ఆ సమయంలో డా॥ రాజేశ్వరి ఆశ్రమంలోని తన యింట్లో ఒంటరిగా ఉన్నారు. ఆ రోజున ఆమె తన అలవాటు ప్రకారం తెల్లవారుఝామున మూడు గంటలకే లేచి కాలకృత్యాలు తీర్చుకున్న తరువాత సుమారు 4 గంటల ప్రాంతంలో తన నిత్యపూజ మొదలుపెట్టారు. పూజ మధ్యలో ఉండగా బయట ఎవరో "డాక్టరమ్మా! డాక్టరమ్మా!" అని పిలవడం వినిపించింది. అదేదో తాను అత్యవసరంగా చూడవలసిన కేసుతాలూకు విషయమై ఉంటుందని ఆమె అనుకున్నారు. ఇంతలో మళ్ళీ అదే కంఠము "డాక్టరమ్మా! డాక్టరమ్మా!" అని పిలవడం ఆమెకు వినిపించింది. వెంటనే ఆమె కిటికిలోనుండి బయట ఎవరు పిలుస్తున్నారో చూడడానికి ప్రయత్నించింది; కాని, ఆ చీకటిలో ఆమెకు ఎవరూ కనపడలేదు. ఇంతలో మూడవసారికూడా అదే పిలుపు వినిపించేటప్పటికి ఆమె తలుపు తెరచి చూచారు. అక్కడ ఆమెకు కనపడిన దృశ్యము ఆమెకు షాకులా తగిలి హృదయమును ఆనందముతో నింపివేసింది. అక్కడ భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు ప్రత్యక్షంగా నిలుచుని ఉన్నారు! ఆ బ్రహ్మ ముహూర్తంలో

సాక్షాత్తూ తన యింటిముందు తలుపుదగ్గర అనుకోకుండా హఠాత్తుగా లభించిన భగవాన్ బాబావారి దర్శనంవలన కలిగిన ఆశ్చర్యానందములతో ఆమె అవాక్కయి నిల్చుండిపోయారు.

భగవాన్ బాబావారు ఆ నిశ్శబ్దతకు స్వస్తి పలుకుతూ "పూజ చేస్తున్నావా?" అని మృదుమధుర స్వరంతో ప్రశ్నించారు. ఆమె పాద నమస్కారం చేసుకుందామని క్రిందకు వంగినప్పుడు "చేస్కో, నమస్కారం చేస్కో" అని ప్రేమగా, ఆప్యాయంగా చెప్పారు. డా॥ రాజేశ్వరి స్వామికి పాద నమస్కారం చేసుకుని, తరువాత ఒక్క క్షణంపాటు ఆనందంతో కన్నులు మూసుకుని కృతజ్ఞతాపూర్వకంగా "స్వామీ!" అని పిలిచారు. ఆమె కన్నులు తెరిచేటప్పటికి, స్వామి అక్కడినుండి అదృశ్యమయ్యారు! ఆమె నెమ్మదిగా ఆ దివ్యానుభూతి నుండి తేరుకుని డ్రాయింగురూముద్వారా తన పూజగదిలోనికి వెడుతూండగా తన ముఖమంతా విభూతి జల్లబడియుండడం అద్దంలో ఆమెకు కనిపించింది!

ఆ రోజు ఉదయం ప్రశాంతి నిలయంలో ప్రపంచవ్యాప్త అఖండ నామ సంకీర్తన జరుగుతూండగా శ్రీనివాస్ మందిరంయొక్క వరండాలో కూర్చుని ఉన్నాడు. సుమారు 6-30 ప్రాంతంలో భగవాన్ బాబావారు అతనిని లోపలికి పిలిచారు. ఆయన చిన్న పిల్లవానివలె ఆనందంతో ముఖంపై చిరునవ్వు చిందులాడుతూండగా "నేను బృందావనం వెళ్ళి మీ అమ్మను చూచి వచ్చాను", అని శ్రీనివాస్‌తో చెప్పారు.

డా॥ రాజేశ్వరి, శ్రీ సత్యసాయి హాస్పిటలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి అనుగ్రహమునకు నిదర్శనంగా అద్భుతమైన వ్యాధి నివారణ జరిగిన ఎన్నో కేసులు, మృత్యు ముఖంలోనుండి ఎందరో రక్షింపబడటం ప్రత్యక్షంగా చూశారు. అయితే, వీటన్నిటికంటె ఆశ్చర్యకరమైనది, భగవాన్ బాబా తమ దివ్యాకర్షణ శక్తిచే ప్రపంచమంతటినుండి ఎందరో మేధావులైన వైద్య నిపుణులను ఆకర్షించి వారిని తమ ఉచిత వైద్యసేవా కార్యక్రమంలో అత్యంత సమర్థవంతమైన ఉపకరణములుగా తీర్చిదిద్దడం. వారిలో కొందరు

ప్రశాంతి నిలయము మరియు వైట్‌ఫీల్డులో గల శ్రీ సత్యసాయి హాస్పిటల్సులో పూర్తిస్థాయి (Full-time) ఫిజీషియన్లు మరియు సర్జన్లుగా సేవలందిస్తున్నారు. మరికొందరు అప్పుడప్పుడు వచ్చి కొంతకాలం సేవచేసి తమ తమ దేశాలకు వెడుతున్నారు (Visiting Doctors). వారందరిని గురించి ఈ అధ్యాయములో వివరించడం మాట అటుంచి, వారందరి పేర్లను ఇక్కడ ఉదాహరించడంకూడా కష్టమే! అయితే, వైట్‌ఫీల్డు హాస్పిటలుకు సంబంధించి డా॥ పి.వి. హెగ్డే, డా॥ బాల సుబ్రమణియన్, డా॥ నరసప్ప, డా॥ సరోజమ్మ మరియు డా॥ ప్రభ అందించే అంకితభావంతో కూడిన సేవలను గురించి ప్రత్యేకంగా చెప్పుకోవలసి ఉంటుంది. 1983వ సంవత్సరంలో వైట్‌ఫీల్డులోని శ్రీ సత్యసాయి హాస్పిటలులో ప్రవేశించిన డా॥ సావిత్రి అవిశ్రామంగా నిస్వార్థసేవకు అంకితమైన గొప్ప డాక్టరుగా పేరుపొందారు. అకుంఠిత సేవాభావంతో పనిచేసే ఆ వైద్యులలో ప్రతి ఒక్కరి వీరోచిత గాథ ఒక విస్తృతమైన గ్రంథమునకు సరిపడినంత ఉన్నది. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యాశీస్సులతో అటువంటి నిస్వార్థ సేవా తత్పరుల సంఖ్య దినదినాభివృద్ధి చెందుగాక!

వైట్‌ఫీల్డులోని శ్రీ సత్యసాయి హాస్పిటలు ప్రారంభింపబడిన కొద్దికాలంలోనే ఒక గొప్ప ప్రసూతి వైద్యాలయముగా పేరు ప్రతిష్ఠలు, గుర్తింపు పొందింది. క్రమంగా ప్రాథమిక ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి సమస్త సదుపాయములు కలిగిన ఒక అద్వితీయమైన వైద్యకేంద్రముగా రూపుదిద్దుకున్నది. 1980వ సంవత్సరం నవంబరు నెలలో ఈ హాస్పిటలులో సాధారణమైన అన్ని రకాల శస్త్రచికిత్సలు నిర్వహించేందుకై ఒక ఆపరేషను థియేటరు కూడా ప్రారంభింపబడినది. ఈ హాస్పిటలు అభివృద్ధి చరిత్రలో అదొక మైలురాయి.


ఆధునికయుగంలో వైద్యవృత్తికి మొట్టమొదటగా కొన్ని లక్ష్యములంటూ ఏర్పరచిన వ్యక్తి సర్ విలియమ్ ఓస్లర్. "వ్యాధి నిరోధము, బాధా నివారణ మరియు రోగులకు స్వస్థత చేకూర్చుట – ఇదే మా పని", అని ఆయన ఈ సందర్భంగా నొక్కి వక్కాణించారు. అలాగే సుప్రసిద్ధ వైద్యులు గాలెన్



"డా॥ రాజేశ్వరిని ఆశీర్వదిస్తున్న భగవాన్ బాబా"



"వైట్‌ఫీల్డులోని శ్రీసత్యసాయి జనరల్ హాస్పిటలు డాక్టర్లతో భగవాన్ బాబా"



"నేను సర్వాంతర్యామిని"

వైద్యవృత్తిలోని అత్యంత ప్రధానమైన మరియు శక్తిమంతమైన పద్ధతిని నిర్వచిస్తూ "నా పని మందులు ఇవ్వడంవరకు మాత్రమే; ఆ తరువాత భగవంతుడే ఆ రోగికి వ్యాధి నయం చేస్తాడు", అని ప్రకటించారు. వైద్య వృత్తిలో వ్యాపార దృష్టి ప్రబలంగా నాటుకుపోయి, పవిత్రమైన వైద్యరంగముయొక్క లక్ష్యములను, పద్ధతులను తప్పుదారి పట్టిస్తూ, వైద్య సహాయము సామాన్య మానవునికి అందరాని చందమామ వలె అందుబాటులో లేకుండా పోతున్న ప్రస్తుత తరుణంలో ప్రశాంతి నిలయములోను మరియు వైట్‌ఫీల్డులోను భగవాన్ బాబావారు నెలకొల్పిన వైద్యాలయములు అవసరంలో ఉన్న ఏ వ్యక్తికైనా అత్యుత్తమమైన వైద్యసేవలను ఉచితంగా అందిస్తున్నాయి. వైద్య వృత్తి యొక్క ఉత్తమ లక్ష్యములను, విశిష్టతను ప్రపంచములో ఉన్న డాక్టర్లందరికి చాటి చెపుతున్నాయి.





10

బృందావనంలో నూతన మందిర నిర్మాణము

"నా ప్రాణమునకు ప్రాణమైన ఓ దైవమా!
నా హృదయ మందిరంలో నీవు అధివసించియున్నావని తెలిసి
సమస్త దుర్గుణములను దూరము చేసి
నా హృదయమును ప్రేమ కుసుమముగా చేసుకుంటాను"

అని గానం చేశారు, గురుదేవులు శ్రీ రవీంద్రనాథ్ టాగూర్. అనేక సందర్భాలలో భక్తులు తమ తమ గ్రామాలలో, పట్టణాలలో శ్రీ సత్యసాయి మందిరములు నిర్మించుకోవడానికి భగవాన్ బాబావారి ఆశీస్సులు కోరినప్పుడు స్వామి "మీ హృదయమే నా మందిరము. దానిని పరిశుభ్రంగా, పవిత్రంగా ఉంచుకోండి. సిమెంటు, ఇటుకలతో కట్టిన మందిరాలు నాకు తృప్తి కలిగించలేవు", అని చెపుతారు. ఇంకా, అప్పుడప్పుడు స్వామి "బ్రహ్మాండమంతయు నిండియున్న తనకు ఆలయము నిర్మింపనలవి యగున?" అని వారిని ప్రశ్నిస్తారు. అయినప్పటికి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది భక్తులు తమ తమ గృహములకు భగవాన్ బాబావారే అదృశ్యరూపములోనున్న యజమాని అనే విశ్వాసంతో, ఆయన యందు భక్తి, ప్రేమలతో తమ యిండ్లలో స్వామికొరకు పూజా మందిరములు నెలకొల్పారు. పూరిగుడిసెలనుండి కోటీశ్వరుల భవనాలవరకు ప్రపంచమంతటా ఈనాడు భక్తుల గృహములలో అటువంటి పవిత్రమైన మందిరములు మనకు గోచరిస్తాయి. ఇవి కాక అనేక గ్రామాలలో, పట్టణాలలో, నగరాలలో వందల సంఖ్యలో శ్రీ సత్యసాయి మందిరములు మనకు దర్శనమిస్తాయి. ఒక మహా పురుషుని జీవితకాలంలోనే ఆయనను ఆరాధిస్తూ

ఆయన పేరిట మందిరాలు నెలకొల్పడమనేది మానవజాతి చరిత్రలో అద్వితీయమైన విషయం. ఆ విధంగా నిర్మింపబడిన అనేక మందిరాలలో (వ్యక్తుల గృహములలో కానీయండి లేదా సామూహిక ఆరాధనకొరకు·బహిరంగ ప్రదేశములలో నిర్మింపబడిన మందిరములలో కానీయండి) సర్వశక్తిమయులైన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యానుగ్రహ సూచకంగా విభూతి, కుంకుమ, అమృతమువంటి చిహ్నములు ఏర్పడుతున్నాయి. ఎన్నో లీలలు, మహిమలు జరుగుతున్నాయి. ఈ దివ్యలీలల మూలంగా అంతవరకు భగవాన్ బాబావారియందు విశ్వాసము లేని ఎందరో వ్యక్తుల హృదయాలలో విశ్వాస బీజములు నాటుకుంటున్నాయి. అయితే, ఇవన్నీ ఒక ఎత్తు; ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది మంది భక్తులు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారియందు తమకు గల ప్రేమ, భక్తికి నిదర్శనములుగా ఆయన నివాసముకొరకు నిర్మించిన కొన్ని ప్రత్యేకమైన కట్టడములు వేరొక ఎత్తు. భగవాన్, తమ భౌతిక శరీరముతో ఆ భవనములలో సంవత్సరంలో కొంత కాలంపాటు నివసించి వాటిని పావనం చేస్తున్నారు. అటువంటి వాటిలో అతిముఖ్యమైనవి పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయము మరియు బెంగుళూరులోని బృందావనములలో గల మందిరాలు. ఈ ఆశ్రమాలలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు సంవత్సరంలో ఎక్కువకాలం నివసిస్తారు. 1984వ సంవత్సరంలో నిర్మింపబడిన బృందావనంలోని నూతన మందిర నిర్మాణ చరిత్రను మనం ఇప్పుడు తెలుసుకుందాం! దీనివలన, అసలు బృందావనంలో ఆశ్రమ నిర్మాణం ఏవిధంగా ప్రారంభమైంది అనే విషయం కూడా మనకు తెలుస్తుంది.

పుట్టపర్తి గ్రామమునకు దక్షిణంగా 150 కిలోమీటర్ల దూరములో ఉన్న బెంగుళూరు నగరము భగవాన్ బాబావారికి ద్వితీయ గృహముగా సాక్షాత్తూ భగవాన్ బాబావారిచే స్వయంగా ఎంచుకోబడినందున, అది ఎంతో పుణ్యము చేసుకున్నది. భగవాన్ బాబా ఇంకా 18 సంవత్సరాల కౌమార దశలో ఉన్నప్పుడే 1944వ సంవత్సరంలో ఫిబ్రవరి నెలలో మొట్టమొదటిసారి బెంగుళూరుకు

వచ్చారు. అప్పుడు ఆయన శ్రీమతి కరణం సుబ్బమ్మ, ఆమె సోదరుడు శ్రీ పప్పూరు సత్యనారాయణ మరియు శ్రీమతి కమలమ్మలతో కలసి ఎడ్లబండిలో పెనుకొండ రైల్వేస్టేషను వరకు వచ్చి అక్కడినుండి రైలులో బెంగుళూరు చేరుకున్నారు. వారందరూ లాల్‌బాగ్‌కు దగ్గరగానున్న శ్రీ మావల్లి రామారావుగారి చిన్న యింట్లో సుమారు పదిరోజులపాటు ఉన్నారు. అప్పట్లో శ్రీమతి కమలమ్మ యొక్క కొద్దిమంది బంధుమిత్రులు మాత్రమే పుట్టపర్తి వెళ్ళి తన్ను తాను సాయిబాబాగా ప్రకటించుకుని శూన్యమునుండి వస్తువులను సృష్టిస్తూ, ఎట్టి మందులూ లేకుండానే అనేక వ్యాధులను నయం చేసే ఈ 'భట్రాజు కుర్రవాడి' దర్శనం చేసుకున్నారు. వాళ్ళందరూ విద్యుద్దీపములవంటి కనీస సౌకర్యములుకూడా లేని ఆయన ఇంటికి వెళ్ళి బెంగుళూరులోని తమ గృహములకు విచ్చేయుమని భగవాన్ బాబావారిని ప్రార్థించారు.

1944వ సంవత్సరంలో భగవాన్ బాబా మరొక నాలుగుసార్లు బెంగుళూరును సందర్శించారు. ఒకసారి ఆయన దివ్య సుందర విగ్రహమును దర్శించుకున్నవాళ్ళు తరువాత ఆయన ఎక్కడున్నాసరే పదేపదే వెళ్ళి ఆయన దర్శనం చేసుకోకుండా ఉండలేకపోయేవారు. భగవాన్ బెంగుళూరుకు ఎప్పుడు విచ్చేసినా భక్తుల యిండ్లలో పండుగ వాతావరణం నిండి వాళ్ళ హృదయాలలో నూతనమైన ఆనందోత్సాహాలు వెల్లివిరిసేవి. రానురాను బెంగుళూరు నగరానికి భగవాన్ బాబావారు తరుచుగా రావడం మొదలుపెట్టారు. ఇంచుమించుగా ప్రతి పండుగకు స్వామి బెంగుళూరు వచ్చేవారు. అంతేకాకుండా పుట్టపర్తినుండి మద్రాసు వెళ్ళేటప్పుడు, వచ్చేటప్పుడు ఆయన బెంగుళూరులో కొన్ని రోజులు బస చేసేవారు.

భగవాన్ బాబావారికి, ఆయన వెంట ఉన్న భక్త బృందమునకు ఆతిథ్యమివ్వడానికి చిన్న చిన్న యిళ్ళు సరిపోయేవికావు. అందువలన, విశాలమైన స్థలంలో నిర్మింపబడిన పెద్దపెద్ద భవనములు గల కొందరు భక్తులు భగవాన్ బాబావారిని తమ యిండ్లలో ఉండి పెద్దసంఖ్యలో వచ్చే భక్తులకు

దర్శనం ప్రసాదించుమని, అంతేకాక, ప్రతి గురువారం జరిగే భజనలలో ఎక్కువమంది భక్తులు పాల్గొనడానికి వీలు కలుగుతుందని ప్రార్థించారు. స్వామి, వారి కోరికను మన్నించి 1944వ సంవత్సరంలో తాను మళ్ళీ బెంగుళూరు వచ్చినపుడు చామరాజపేటలోని శ్రీ నరసింహారావునాయుడు మరియు శ్రీ నవనీతంనాయుడుగార్ల గృహములలో బస చేశారు. ఆ తరువాత 1945, 46 సంవత్సరములలో సెయింట్ జాన్స్ రోడ్డులో గల శ్రీ తిరుమలరావుయొక్క బంగళాచుట్టూ ఉన్న విశాలమైన ఆవరణ స్వామి దర్శనానికి వచ్చే భక్తులకు నిలయమైంది. 1946-48లో బసవనగుడిలోని ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ రణజోత్‌సింగ్‌యొక్క బంగళా, భక్తులకు ఆతిథ్యమిచ్చింది. 1947-50 సంవత్సరాల మధ్య బుల్ టెంపుల్ రోడ్‌లోని కాఫీ తోటల యజమాని శ్రీమతి సాకమ్మ గృహము భగవాన్ బాబా మరియు భక్తుల పాదధూళితో పావనమైంది. 1949-53 సంవత్సరాలలో రిచ్‌మాండ్ రోడ్డులోని శ్రీమతి నాగమణి పూర్ణయ్య నివాస గృహము మరియు విల్సన్ గార్డెన్‌లోని శ్రీ కేశవ విఠల్‌యొక్క గృహము ఆ అదృష్టమునకు నోచుకున్నవి. 1954-58 సంవత్సరాలమధ్య బెంగుళూరు నగరములో గొప్ప ఆడిటర్లుగా పేరుపొందిన శ్రీ వెంకటరామన్ మరియు శ్రీ శ్రీనివాసన్‌గార్లకు భగవాన్‌కు ఆతిథ్యమిచ్చే భాగ్యము లభించింది. వారి నివాస గృహములు కుమార పార్కు ప్రాంతములో ఉన్నవి. ఈ విధంగా ఆ సమయంలో బెంగుళూరు నగరములోని అనేకమంది భక్తులు భగవాన్ బాబావారి దయకు, ప్రేమకు పాత్రులైనారు. భగవాన్ బాబావారి దివ్య ప్రేమచే పునీతులై హృదయ పరివర్తన చెందిన అటువంటి అనేకమంది భక్తుల దివ్య చరిత్రలన్నిటిని గ్రంథస్థము చెయ్యడం ఎవరి తరమూ కాదు. అయినప్పటికి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి అపారమైన దయకు పాత్రులైన కొందరు భక్తుల అనుభవాలను కొన్నిటిని ఈ క్రింద పొందుపరచడం జరిగింది :

బెంగుళూరు వాస్తవ్యులైన శ్రీ కేశవవిఠల్‌యొక్క కుమార్తె కుమారి జయలక్ష్మి మొట్టమొదటిసారి భగవాన్ బాబావారిని దర్శనం చేసుకున్నప్పుడు ఆమె ఇంకా కౌమారదశలోనే ఉన్నది. భగవంతుని యందు మంచి భక్తి, విశ్వాసములు

గల కుటుంబములో పుట్టి పెరగడం చేత, భగవాన్ బాబావారి ప్రథమదర్శనంలోనే ఆమెకు స్వామియందు భక్తి, ప్రపత్తులు ఏర్పడినాయి. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు విల్సన్‌గార్డెన్‌లోగల తమ నివాసగృహమునకు విచ్చేసి తమ ఆతిథ్యము స్వీకరించినప్పుడు ఆమె లేత హృదయము ఆనందముతో నిండిపోయి, భగవాన్‌కు మరియు పెద్ద సంఖ్యలో ఆయన దర్శనంకొరకు వచ్చే భక్తులకు తగిన సౌకర్యములు కల్పించే పవిత్ర కార్యములో ఏదైనా చిన్న సేవ చేయాలని ఉవ్విళ్ళూరేది. తమ ఇంట్లో భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్యశక్తికి, ప్రేమకు నిదర్శనములుగా జరిగిన అనేక లీలలకు, మహిమలకు ఆమె ప్రత్యక్షసాక్షి. ఈ భువిపై తన మాతృమూర్తికి అత్యంత ప్రీతిపాత్రుడైన కుమారునిగా భగవాన్ బాబావారు ఎంతో నైపుణ్యముతో ప్రదర్శించిన లీలానాటకములో ఒక ఘట్టమును ఇక్కడ వర్ణించడం జరుగుతోంది. ఆ సంఘటన ఆమె లేత హృదయంపై ఒక చెరగని ముద్రవేసి ఆమె వ్యక్తిత్వముపై గొప్ప ప్రభావమును చూపింది. ఫలితంగా తరువాయి సంవత్సరాలలో ఆమె భగవాన్ బాబావారి అవతార కార్యక్రమంలో ఒక భాగమైన మహిళా విద్యారంగములో విశ్రాంతి యెరుగని కార్యశీలిగా, నాయకురాలుగా సేవ చేస్తూ వచ్చారు. 'భగవాన్ బాబావారు ఎంచుకున్న అధ్యాపకురాలు'గా ఆమె కథ ఈ గ్రంథములో ఇంతకు ముందే వివరింపబడింది. ప్రస్తుత సంఘటనను గురించి ఆమె మాటలలోనే విందాం:

"భగవాన్ బాబావారు ఒకరోజు ఉదయం ఇద్దరు స్త్రీలను తోడుగా ఇచ్చి తమ మాతృమూర్తి ఈశ్వరమ్మను బెంగుళూరు నగరము చూసిరమ్మని పంపారు. మధ్యాహ్నం దాటిన తరువాత వాళ్ళు తిరిగి వచ్చేసరికి, ఈశ్వరమ్మ అతికష్టంమీద ఇంట్లోకి నడిచివెళ్ళ గలిగింది. ఆమెవెంట ఉన్న ఇద్దరు స్త్రీలు ఆమెను చెరొకవైపు పట్టుకుని లోపలికి తీసుకొని వెళ్ళారు. ఈశ్వరమ్మ నేరుగా స్వామివద్దకు వెళ్ళి తన కుడిచేతిని చూపిస్తూ "స్వామీ! నా చెయ్యి చాలా నొప్పిగా ఉన్నది" అని చెప్పి కన్నీళ్ళు పెట్టుకున్నారు. ఆమె బెంగుళూరు నగరములో కారులో వెడుతూండగా విపరీతమైన రద్దీగా ఉన్న ఒక ఏటవాలు రోడ్డులో క్రిందకు

దిగుతూండగా కారుడ్రైవరు హఠాత్తుగా బ్రేకు వేయడంతో ఆమె కుడి మోచెయ్యి కారు ముందుసీటుకు కొట్టుకుని దెబ్బ తగిలింది. అప్పుడు స్వామి విభూతిని సృష్టించి చేతిపైన, మోచేతిమీద రాసి "ఫరవాలేదులే! తగ్గిపోతుంది" అని ఎంతో మృదువుగా, ఆప్యాయంగా ఓదార్చారు. తరువాత ఆమె స్వామి సలహాననుసరించి ఆ యింట్లో ఒక గదిలో విశ్రాంతిగా పడుకున్నారు. ఇంట్లో మిగిలిన వారందరూ భగవాన్ బాబావారి దర్శనంకొరకు వచ్చే భక్తులకు ఏర్పాట్లు చెయ్యడంలో పూర్తిగా నిమగ్నులయ్యారు.

భక్తులందరూ వెళ్ళిపోయాక స్వామి ఆమె గదిలోనికి వచ్చి "నొప్పి తగ్గిపోయిందా?" అని అడిగారు. అప్పుడు ఈశ్వరమ్మ చంటిపిల్లవలె అమాయకంగా ఉన్న కంఠస్వరంతో "లేదు, స్వామీ! ఇంకా చాలా నొప్పిగా ఉంది" అని చెప్పారు. అందుకు భగవాన్ తమ సహజమైన మాతృప్రేమను, ఆప్యాయతను కురిపిస్తూ "కొద్దిసేపే నొప్పి ఉంటుంది. రేపు ఉదయానికి తగ్గిపోతుంది. బాధపడకు", అని చెపుతూ హస్తచాలనం చేశారు. వెంటనే ఆయన దివ్యహస్తములో పెద్దమొత్తంలో విభూతి ప్రత్యక్షమైంది. స్వామి దానిని ఎంతో జాగ్రత్తగా మృదువుగా శ్రీమతి ఈశ్వరమ్మ చేతిపై వ్రాశారు. చీకటి పడుతున్నకొద్దీ నొప్పి ఎక్కువై ఆమె మూలగడం ప్రారంభించారు. నేను ఆమె ప్రక్కనే ఉన్నప్పటికి, ఆమె నొప్పి తగ్గడానికి నేను ఏవిధంగాను సహాయపడలేకపోయాను. అప్పటికి అప్పుడే రాత్రి 10 గంటలు దాటింది. అందరూ నిద్రలోకి జారుకున్నారు. అయితే లీలానాటక సూత్రధారియైన భగవాన్ బాబా మాత్రం మాతృమూర్తి అనుభవిస్తున్న బాధకు చలించిపోయారు. ఆ ప్రాపంచికమాతయొక్క బాధ ఆయనను నిద్రపోనీయలేదు. వెంటనే ఆయన నెమ్మదిగా నడుచుకుంటూ మాతృమూర్తి ఈశ్వరమ్మ పడుకున్న గదిలోనికి వచ్చారు. స్వామిని చూచి ఈశ్వరమ్మ మంచముపై లేచి కూర్చున్నారు. కుమారుని చూడగానే ఆమెకు బాధతో కూడిన దుఃఖము పొంగిపొరలింది. ఇక తట్టుకోలేక "స్వామీ! నేను ఈ నొప్పిని భరించలేకుండా ఉన్నాను", అని చెప్పి గట్టిగా ఏడ్చేశారు. అప్పుడు స్వామి ఆమె చేతిపై తన చేతితో మృదువుగా రాస్తూ 'ఒక

గంటలో తగ్గిపోతుంది, భయపడకు' అని చెప్పి ఓదార్చారు. అలా చెప్పి తన కుడిచేతిని గాలిలో గుండ్రంగా త్రిప్పుతూ మందగమనంతో బయటకు వెళ్ళిపోయారు.

స్వామి బయటకు వెళ్ళగానే ఈశ్వరమ్మ మంచంమీద పడుకుని నిద్రపోవడానికి ప్రయత్నం చేశారు. కాని విపరీతమైన నొప్పి వలన ఆమెకు నిద్రపట్టలేదు. నేను ఊహించినట్లుగానే స్వామి ఒక గంటపోయిన తరువాత మళ్ళీ అక్కడకు వచ్చి "నొప్పి ఇప్పుడెలా ఉంది?" అని అడిగారు. "కొంచెం నయం, స్వామీ!" అని ఆమె బదులు చెప్పారు. స్వామి తృప్తిగా "నేను చెప్పలేదా? ప్రొద్దుటికి పూర్తిగా నయమవుతుంది", అని చెప్పి తమ దివ్యహస్తముతో ఆమె చేతిని, తలను ఆప్యాయంగా నిమిరారు. తరువాత విభూతి సృష్టించి మళ్ళీ ఆమె చేతిపై రాశారు. ఒక నిమిషం తరువాత బయటకు వెళ్ళిపోయారు. ఈ లోపుగా ఈశ్వరమ్మకు నొప్పి తగ్గి హాయిగా నిద్రపోయారు. అయితే, నేను మాత్రం రాత్రంతా నిద్రపోలేదు. అసలు నాకు నిద్ర ఎలా వస్తుంది? కర్తవ్య పరాయణుడైన దివ్యసుతుడు తన మాతృమూర్తికి మాతగా నటిస్తూ పరిచర్యలు చేస్తున్న ఆ అద్భుత దృశ్యమును వీక్షించే భాగ్యమును పొందిన నాకు నిద్ర ఎలా వస్తుంది?

తెల్లవారుఝామున నాలుగు గంటలయ్యేటప్పటికి మాతృశ్రీ ఈశ్వరమ్మ లేచి మంచముపై కూర్చున్నారు. ఇంతలో ఆమె ప్రియతమ సుతుడు ఆ గదిలోనికి వచ్చారు. ఇంతటి అద్భుత దృశ్యమునకు సాక్షిగా నిలిచే భాగ్యమును ప్రసాదించిన స్వామి యందు కృతజ్ఞతా భావముతో నేనుకూడా లేచి నిల్చున్నాను. ఆ బ్రహ్మముహూర్తములో భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్యదర్శనం నాకు లభించింది. అప్పుడు స్వామి తల్లిని సమీపించి "ఇప్పుడెలా ఉంది?" అని మార్దవం ఉట్టిపడుతున్న కంఠంతో ప్రశ్నించారు. అందుకు ఈశ్వరమ్మ "నాకు ఇంచుమించుగా నయమైపోయింది. కొద్దిగా నొప్పి ఉంది, అంతే", అని జవాబు చెపుతూ ఆ దయామయుని వదనారవిందమువైపు ఒక పసిపాపవలె అమాయకంగా చూచారు. అప్పుడు స్వామి మళ్ళీ ప్రేమగా, ఆప్యాయంగా

ఆమె తల నిమురుతూ "సూర్యోదయంవేళకు నీకు పూర్తిగా నయమవుతుంది. బాగా విశ్రాంతి తీసుకో" అని చెప్పారు. ఆమాట చెప్పి ఆయన బయటకు వెళ్ళిపోతుండగా ఆయన ముఖకమలముపై ఒక చిరుదరహాసం వెలిసింది. అప్పటినుండి, అమూల్యమైన ఈ దివ్యానుభూతిని నా హృదయమందిరంలో పదిల పరచుకున్నాను".

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి భక్తులైన శ్రీ శ్రీనివాసన్ మరియు శ్రీ వెంకటరామన్ కలసి స్థాపించిన ఒక ఆడిటింగ్ మరియు ఇన్‌కమ్‌టాక్స్ ప్రాక్టీషనర్స్ సంస్థలో పనిచేస్తున్న శ్రీ కె.ఆర్. శాస్త్రి యువకుడు. అతడు సుప్రసిద్ధ వ్యాపారకేంద్రమైన చింతామణికి దగ్గరలోనున్న ఒక చిన్న గ్రామమునకు చెందినవాడు. అతడు 1954వ సంవత్సరం జూలై నెలలో బెంగుళూరులోని శ్రీ వెంకటరామన్ గృహములో మొట్టమొదటిసారి భగవాన్ బాబావారి దర్శనం చేసుకున్నాడు. శ్రీ రామచంద్రప్రభువునందు గాఢమైన భక్తిప్రపత్తులు కలిగిన యువకుడు శ్రీ శాస్త్రి, ఆ శ్రీరామచంద్రుడే ఈ భువిపైన దర్మస్థాపనకొరకు తిరిగి భగవాన్ బాబా రూపములో అవతరించాడని విశ్వసించాడు. అందువలన, భగవాన్ బాబావారు బెంగుళూరు వచ్చినప్పుడల్లా ఆతడు స్వామిసేవ చేసుకునేవాడు. భగవాన్ బాబావారియందు అతనికి గల భక్తి, విశ్వాసములను, తన పనిలో అతడు కనపరచే శ్రద్ధను, నిజాయితీని చూసి సంతోషించిన అతని యజమానులు భగవాన్ బాబావారి బెంగుళూరు పర్యటనకు కొద్దిరోజులు ముందుగానే అక్కడికి వచ్చి స్వామిని తమ యిండ్లకు ఆహ్వానించడానికి చేసే ఏర్పాట్లలో సహాయపడవలసిందిగా అతనిని ఆహ్వానించారు. భగవాన్ బాబావారి బెంగుళూరు పర్యటనలో ఆయన ఆంతరంగిక సేవకుడుగా ఆతడు చేసే సేవవలన ఆ భక్తునికి, భగవంతునికి మధ్య ప్రేమబంధము దినదినానికి మరింత బలపడుతూ వచ్చింది. పనిలో అతడు కనపరచే నిజాయితీ, దానికి తోడు అతని పొట్టి ఆకారము ఈ రెండూ కలసి అతనికి భగవాన్ బాబావారినుండి "లాల్ బహదూర్ శాస్త్రి" అనే సార్థక నామమును సంపాదించిపెట్టాయి. భగవాన్ బాబావారి సర్వాంతర్యామిత్వము నందు ఆ యువభక్తునికి గల విశ్వాసమునకు ప్రతీకగా అతడు పొందిన ఒక అనుభవమును ఇక్కడ వివరిస్తున్నాను:

1959వ సంవత్సరం ఏప్రిల్ నెలలో శ్రీ శాస్త్రి అకౌంటెన్సీ పరీక్ష వ్రాయడానికి పూనా వెళ్ళవలసివచ్చింది. అతని అదృష్టంకొద్దీ భగవాన్ బాబా ఆ సమయంలో బెంగుళూరులో ఉన్నారు. అందువలన పూనా వెళ్ళేముందు ఆతడు స్వామిని కలసి ఆయన ఆశీస్సులు అర్థించాడు. అప్పుడు భగవాన్ అతనితో "నా ఆశీస్సులు నీకు నిండుగా, దండిగా ఉన్నాయి. నేను ఎల్లప్పుడు నీ ఇంట, వెంట, జంట, కంట ఉంటాను", అని అభయమిచ్చారు. అతని యజమాని శ్రీ వెంకటరామన్ పూనాలో తన బావ యింట్లో అతనికి మకాం ఏర్పాటు చేశారు. ఆ కుటుంబములో అందరూ భగవాన్ బాబావారి భక్తులే కావడంచేత అక్కడి వాతావరణం అతనికి బాగా నచ్చి అక్కడున్నన్నాళ్ళు ఆతడు చాలా సౌకర్యంగా ఉన్నాడు. ముఖ్యంగా, శ్రీ వెంకటరామన్‌యొక్క మేనల్లుడు రంగరాజన్‌కు భగవాన్ బాబా అంటే మరీ అభిమానం. ఆతడు శ్రీ శాస్త్రిని, దాస్య భక్తికి ఒక ఆదర్శప్రాయమైన ఉదాహరణగా భావించాడు.

మొదటి పరీక్ష వ్రాసిన తరువాత శ్రీ శాస్త్రి, రంగరాజన్‌తో కలసి ఆ రోజు సాయంత్రం రైల్వేస్టేషనుకు వెళ్ళి బెంగుళూరుకు తిరుగు ప్రయాణముకొరకు టిక్కెట్టు రిజర్వేషను చేయించుకున్నాడు. ఇంటికి తిరిగివస్తూ దారిలో దగ్గరలోనున్న విక్టోరియా గార్డెన్స్ పార్కులో కొంతసేపు గడుపుదామని అక్కడికి వెళ్ళి ఒక సిమెంటు బెంచీమీద కూర్చున్నారు. ఆ సమయంలో పార్కులో ఎక్కువమంది జనం లేరు. రంగరాజన్ స్వామినిగురించి అనేక విషయాలు తెలుసుకోవాలని చాలా కుతూహలంగా ఉన్నాడు. శ్రీ శాస్త్రి కూడా తన అనుభవాలను అతనితో పంచుకోవాలని ఆత్రుతగా ఉన్నాడు. ఈ విధంగా వాళ్ళిద్దరూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారిని గురించి మాట్లాడుకుంటూండగా దగ్గరలో ఉన్న గడియారం ఆరు గంటలు కొట్టింది. ఇంతలో సుమారు 70 సంవత్సరాలు వయస్సుగల ఒక వృద్ధుడు అక్కడికి వచ్చి బెంచీమీద వాళ్ళ ప్రక్కన కూర్చున్నాడు. ఆయన చాలా పొడుగ్గా, మంచి ముఖ వర్చస్సుతో ఉండి, తలపై పొట్టిగా ఉన్న తెల్లటి జుట్టు కలిగియున్నాడు. పాత చెప్పులు తొడుక్కుని, పొడుగు చొక్కా, ప్యాంటు ధరించియున్నాడు. ఆ దుస్తులు బాగా

పాతబడి ఉన్నట్లు కనిపిస్తున్నాయి. ఆయన నెమ్మదిగా వాళ్ళతో సంభాషణ ప్రారంభిస్తూ శ్రీ శాస్త్రిని "నువ్వు ఎక్కడినుండి వచ్చావు?" అని అడిగారు. శ్రీ శాస్త్రి ఆ ప్రశ్నకు క్లుప్తంగా సమాధానం చెప్పి ఊరుకున్నాడు. ఇంతలో ఆ వృద్ధుడు సంభాషణను పొడిగిస్తూ "నేను తరుచు బెంగుళూరు వస్తూంటాను. అక్కడ చామరాజపేట, బసవన గుడి, కుమార పార్కు నాకు బాగా తెలుసు. నేను ప్రపంచమంతా చుట్టి వచ్చాను. కాని, భారతదేశము వంటి దేశము ప్రపంచంలో ఎక్కడా లేదు. భారతదేశమంటే నాకు చాలా ఇష్టము. ఈ భూమి, ప్రపంచములో ఆధ్యాత్మిక జ్ఞాన సంపదకు నిలయము", అని వర్ణించాడు.

పరిపూర్ణమైన భక్తి, విశ్వాసములతో నిండియున్న ఆ వృద్ధుని మాటలు వింటూంటే ఆ యువకులిద్దరికి చాలా ఆనందము కలిగింది. ఆయన మానవజాతి మరియు సమాజముయొక్క సంక్షేమమును గురించి అంతులేని అభిమానంతో, ఆత్రంతో మాట్లాడుతూంటే, వాళ్ళిద్దరూ అలా వింటూ ఉండిపోయారు. భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు, సనాతన విలువలు మరియు సమకాలీన సమాజములో మానవజాతికి వాటియొక్క ఆవశ్యకతను గురించి ఆ వృద్ధుడు అనర్గళంగా వివరిస్తూంటే వాళ్ళకు కాలగమనం కూడా తెలియలేదు. ఆయన తాను బోధిస్తున్న అంశములకు ఆధారభూతమైన అనేక శాస్త్రవాక్యములను ఇంగ్లీషు, హిందీ భాషలలో ఉదాహరించారు. చివరగా ఆ వృద్ధుడు భారతీయులే ఆ సనాతన విలువలను తమ తమ జీవితాలలో ఆచరించకపోవడం పట్ల విచారము, నిరాశ వ్యక్తం చేశారు. అందుకు ఆధారంగా అంతకుముందు తాను ఋషీకేశ్‌లో చూసిన ఒక సంఘటనను ఉదాహరిస్తూ "కొన్ని సంవత్సరాలక్రితం నేను కొందరు స్నేహితులతో కలసి ఋషీకేశ్ వెళ్ళాను. అక్కడ ఎంతోమంది సాధువులు కాషాయ వస్త్రములు ధరించి చేతితో జపమాలలు త్రిప్పడం చూశాను. అయితే, వాళ్ళ మనస్సులు మాత్రం ఎక్కడెక్కడో సంచరిస్తున్నాయి. నాకు నావారని చెప్పుకోవడానికి ఎవరూ లేరు. కాని, నేను ప్రతి ఒక్కరిని ప్రేమిస్తాను", అని చెప్పారు. ఈ మాటలు చెపుతూండగా గడియారం ఏడు గంటలు కొట్టింది.

వెంటనే ఆయన లేచి "మీరిక్కడ ఎంతసేపు కావలిస్తే అంతసేపు తీరికగా కూర్చోగలరు. మీకు ఎటువంటి బాధ్యతలు లేవు. కాని, నేను వెళ్ళాలి. నా కొరకు ఎంతోమంది వేచియుంటారు", అని చెపుతూ వెళ్ళిపోవడం మొదలుపెట్టారు. ఆ వృద్ధుని మాటలకు మంత్రముగ్ధులై వింటున్న ఆ యువకులిద్దరూ పార్కుబయట రోడ్డు వరకు ఆయనను అనుసరించి వెళ్ళారు. చివరగా ఆయన అక్కడినుండి వెళ్ళిపోతూ "మీ తల్లిదండ్రులయందు మీకు గల కర్తవ్యమును నిర్వహించడంలో అప్రమత్తులై యుండండి. మీరు ఎంతటి పని తొందరలో ఉన్నా భగవంతుణ్ణి మాత్రం మరచిపోకండి. ఆయనయందు కొద్దిపాటి భక్తి కలిగియున్నా, అది మిమ్మల్ని మహత్తరమైన విపత్తులనుండి కాపాడుతుంది", అని బోధించారు. తరువాత ఆయన వాళ్ళ దృష్టిని తమ వెనుకనున్న గడియారము వైపు మళ్ళిస్తూ దానిని చూడమని చెప్పారు. వాళ్ళు ఆవిధంగా వెనుకకు తిరిగి గడియారంవైపు చూస్తూండగానే ఆయన అక్కడినుండి అదృశ్యమయ్యారు! గడియారంలో అప్పుడు 7 గంటల 15 నిమిషాలు అయ్యింది. ఇంతలో వాళ్ళు వెనుకకు తిరిగి చూసి ఆయన అక్కడ కనపడకపోవడంతో షాకయ్యారు. అప్పుడు తట్టింది శ్రీ శాస్త్రికి, ఆ వచ్చిన వ్యక్తి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారేనని! "ఆయన మన బాబాయే! ఆయన తన గురించి తన సంభాషణలో ఎన్ని సూచనలు ఇస్తున్నా, మనం గ్రహించుకోలేకపోయాము. మన తెలివితేటలు అంతా బూడిదలో పోసిన పన్నీరువలె వ్యర్థమైపోయాయి. సరిగ్గా 7 గంటలకు ప్రశాంతి నిలయంలోని మందిరంలో భజన ప్రారంభమైయుంటుంది. బాబా అక్కడకు వెళ్ళిపోయి ఉంటారు", అని శ్రీ శాస్త్రి స్వామిని గుర్తించుకోలేని తమ అసమర్థతకు ఆక్రోశించారు.


శ్రీ కె.ఆర్. శాస్త్రి బెంగుళూరుకు తిరిగి వచ్చేసరికి, ఆయనను భగవాన్ బాబావారి రాక సందర్భముగా కూర్గు జిల్లాలోని మదికెరికి వెళ్ళి అక్కడ స్వామిని ఆహ్వానించేందుకు తగిన ఏర్పాట్లు చేయవలసిందని ఆదేశాలు అందాయి. మదికెరిలో శ్రీ శాస్త్రిని చూడగానే భగవాన్ బాబా "పూనాలో ఏమి జరిగింది"

అని ప్రశ్న వేశారు. ఆ ప్రశ్నకు ఆయన దిగ్భ్రాంతి చెంది ఏమీ సమాధానం చెప్పలేక మౌనంగా ఉండిపోయారు. ఆ సమయంలో ఆయనకు పూనాలో ఆ వృద్ధునితో పార్కులో గడిపిన అనుభవం జ్ఞాపకం వచ్చింది. అప్పుడు బాబా ప్రక్కనే ఉన్న శ్రీ కస్తూరితో పూనాలోని విక్టోరియా గార్డెన్స్‌లో జరిగిన సంఘటన అంతా వివరంగా చెప్పి "పాపం! వాళ్ళు నన్ను గుర్తుపట్టలేకపోయారు", అని వ్యాఖ్యానించారు.

కాలక్రమేణా శ్రీ కె.ఆర్. శాస్త్రి తన వృత్తిలో బాగా పైకివచ్చి ఆ జిల్లాలోనే ఒక ప్రముఖ ఆడిటరుగా పేరుపొందారు. దానితోబాటు, శ్రీ సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షునిగా ఆయన ఆ ప్రాంతములో తమ ప్రియతమ ప్రభువైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య సందేశమును విస్తృతంగా ప్రచారం చేశారు. ఎంతోమంది సాధకులను భగవాన్ బాబావారి దివ్య సన్నిధిలోనికి తీసికొనివచ్చారు. ప్రస్తుతం ఆయన చిక్‌బళ్ళాపురంలో భగవాన్ బాబావారికి అత్యంత ప్రీతిపాత్రమైన మానవతా విలువల బోధనకు అంకితమైన ఒక స్కూలును నడుపుతున్నారు.

కాలం గడుస్తున్నకొద్ది, భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి భక్తుల సంఖ్య విపరీతంగా పెరిగిపోయి, ఆయన దర్శనార్థం వచ్చే జనానికి ఆశ్రయం కల్పించడానికి ఏ భక్తుని గృహము చాలేది కాదు. ఫలితంగా ఎందరో భక్తులు స్వామి నివాసముంటున్న భక్తుల గృహముల వెలుపల రోడ్లపై ఎండనక, వాననక స్వామికొరకు వేచియుండవలసి వచ్చేది. ఆ దృశ్యం కరుణామయులైన భగవాన్ బాబావారి హృదయమును కదిలించింది. బెంగుళూరు నగర పొలిమేరలలోని ప్రశాంత వాతావరణంలో ఒక ఆశ్రమం నిర్మించాలని భగవాన్ సంకల్పించారు.

1958వ సంవత్సరం జనవరి నెల 1వ తేదీన భగవాన్ బాబా కొంతమంది భక్తులను వెంటబెట్టుకుని బెంగుళూరు నగరమునకు తూర్పుదిశలో 20 కిలోమీటర్ల దూరములో నున్న వైట్‌ఫీల్డు అనే ఒక చిన్న పట్టణమునకు వెళ్ళి రోజంతా అక్కడ ఒక పండ్ల తోటలో గడిపారు. తరువాత, 23-7-1959వ



"మందిరములు వేరు - పరమాత్మ ఒక్కడే"



" నందనవనంలో భగవానుని కుటీరము"



"బృందావనంలోని పాత మందిరం వెలుపల భగవాన్ బాబా"

తేదీన ఆ పట్టణానికి ఉత్తరదిక్కున, మెయిన్‌రోడ్డుకు తూర్పువైపున 20 ఎకరాల సువిశాలమైన స్థలం ఖరీదు చేయడంతో వైట్‌ఫీల్డు చుట్టుప్రక్కల ఒక ఆశ్రమం నిర్మించాలనే భగవాన్ సంకల్పం రూపుదాల్చింది. భగవాన్ బాబా·25-7-1960 తేదీన ఆ ఆశ్రమంలో ప్రవేశించి, దానికి "నందనవనం" అని పేరుపెట్టారు. పేరుకు తగినట్లుగా ఆ ఆశ్రమం 'ఆనంద వనం' (Garden of delight) లేదా 'నందుని దివ్యసుతుడైన గోపాలబాలుని క్రీడాక్షేత్రం' (Garden of the divine son of Nanda). వందలకొలది ఫలవృక్షాలతో అలరారుతున్న ఆ దీర్ఘచతురస్రాకారపు తోట వేలకొలది పక్షుల కిలకిలారావాలతో ప్రతిధ్వనించేది. ఆ ఆశ్రమానికి ఉత్తరదిక్కున ఒక చిన్న కొండ, దానిపై పచ్చని చెట్లతో ఆ ప్రాంతమంతా స్వర్గధామమువలె గోచరించేది. ఆ తోటమధ్య అందమైన ఒక చిన్న బంగళా ఉండేది. దానిలో భగవాన్ బాబా నివసించేవారు. ఇదికాక, నైఋతిమూలలో ఆశ్రమం మెయిన్‌గేటును ఆనుకుని ఒక ఔట్‌హౌస్ ఉండేది. 1961వ సంవత్సరాంతమువరకు భగవాన్ బాబావారు బెంగుళూరు వచ్చినప్పుడల్లా ఈ నందనవనంలో నివసించేవారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో "మైకాకింగ్స్"గా పేరుపొందిన శ్రీ గోగినేని వెంకట సుబ్బయ్యనాయుడు మరియు వారి కుటుంబమునకు భగవాన్ బాబావారి ఆశ్రమమైన నందనవనమునకు ఉత్తరదిశలో 5 కిలోమీటర్ల దూరంలో 13 ఎకరాల స్థలంలో నిర్మింపబడిన 'మోహన్ ప్యాలెస్' అనబడే ఒక సువిశాలమైన భవనము ఉండేది. వైట్‌ఫీల్డు రైల్వేస్టేషనుప్రక్కనే ఒక ప్లానుప్రకారం నిర్మింపబడిన మోహన్ ప్యాలెస్, చుట్టూ అందమైన పూల తోటలు, ఒక సరస్సు మరియు ఎన్నో ఫౌంటెన్లతో చాలా మనోహరంగా కనిపించేది. ఆ ఆవరణలో ప్రధానమైన బంగళానుండి వాయువ్యదిశలో ఒక మూలగా ఏర్పాటు చేయబడిన మెయిన్‌గేటువరకు ఇరుప్రక్కలా పూలచెట్లు గల ఒక కాలిబాట ఉన్నది. ఆ గేటులోనుండి కాంపౌండులో ప్రవేశించినవెంటనే కుడిప్రక్కన ఒక పెద్ద రావిచెట్టు, ఎడమ ప్రక్కన రెండు పెంకుటిళ్ళు, ఆ రెండింటిని కలుపుతూ పైకప్పు గల ఒక వసారా మనకు కనపడతాయి. మొత్తంమీద ఆ వాతావరణమంతా చాలా

ప్రశాంత గంభీరంగా ఉంటుంది. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు అత్యంత శక్తివంతమైన అయస్కాంతమువలె తమ దివ్యాకర్షణశక్తితో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఈ మైకాగనుల యజమానిని నందన వనమువైపుకు ఆకర్షించారు. కుటుంబ యజమాని శ్రీ గోగినేని వెంకటసుబ్బయ్య మరియు వారి ముగ్గురు కుమారులు శ్రీ వెంకటేశ్వరరావు, శ్రీ శేషగిరిరావు, శ్రీ మోహనరావు భగవాన్ బాబావారి భక్తులయ్యారు. భగవాన్ అనేకసార్లు వారి గృహమును సందర్శించారు కూడా. 1961వ సంవత్సరం సెప్టెంబరు నెలలో తమ తండ్రి చనిపోయిన తరువాత ఆ ముగ్గురు సోదరులు పుట్టపర్తి వెళ్ళి భగవాన్ బాబావారిని ఆయన బెంగుళూరు ఎప్పుడు వచ్చినా తమ నివాసమైన మోహన్ ప్యాలస్‌లో ఉండమని ప్రార్థించారు. భగవాన్ బాబావారు వారి ప్రేమపూరితమైన ఆహ్వానమును మన్నించి 1962వ సంవత్సరం వేసవిలో వారితో గడిపారు. ఆ సమయంలో ప్రతిరోజూ భగవాన్ బాబావారి దర్శనంకొరకు వచ్చే భక్తులకు ఆ ప్యాలెస్‌చుట్టూ ఉన్న ఆవరణలో కాలిబాట కిరువైపులా చెట్లక్రింద చల్లని నీడలో అద్భుతమైన ఏర్పాట్లు చేయబడినాయి. ఎంతో భక్తి, ప్రేమలతో భక్తులకు వారు చేసిన సేవలు భక్తవత్సలుడైన భగవాన్ బాబావారికి ప్రీతి కలిగించాయి. ఆ తరువాత ఆ ముగ్గురు సోదరులు భగవాన్‌యందు భక్తి, విశ్వాసములతో, ప్రేమతో తమ మోహన్ ప్యాలెస్‌ను ఆయనకు అర్పించగా, స్వామి దానిని తీసుకోవడానికి అంగీకరించారు. అయితే, తాను ప్రసాదించే ప్రేమ కానుక 'నందనవనము'ను వారు తీసుకోవాలని పట్టుబట్టారు. ఈ నూతన ఆశ్రమానికి, బృందావన బాల గోపాలుని లీలాభూమిని జ్ఞప్తికి తెచ్చే విధంగా "బృందావనం" అని, సాయి గోపాలుడు పేరు పెట్టారు.

1964వ సంవత్సరం ఏప్రిల్ నెల 13వ తేదీనుండి మూడు రోజులపాటు బృందావనంలో ఈ నూతన ఆశ్రమ ప్రారంభోత్సవ సందర్భంగా ఉత్సవాలు జరిగాయి. అప్పటినుండి సుమారు 18 నెలలపాటు ఆశ్రమంలో ఎన్నో కళాత్మకమైన మార్పులు, చేర్పులు జరిగాయి. ఆశ్రమ ప్రారంభోత్సవం క్రోధినామ సంవత్సర చైత్ర శుద్ధ పాడ్యమినాడు ఉగాది పర్వదినమున జరగడం

ఒకటి, రెండవది వసంత నవరాత్రులు ప్రారంభం – ఈ రెండు కారణాలచేత ఆ రోజు మరింత మంగళప్రదమైంది. ప్రారంభోత్సవానికి ఎంతోమంది ఉన్నతోద్యోగులు, గొప్ప గొప్ప వేదపండితులు, సుప్రసిద్ధ కళాకారులు ఇంకా భారతదేశము మరియు ప్రపంచమంతటినుండి వచ్చిన వేలాదిమంది భక్తులు హాజరయ్యారు. ఆనాటినుండి ఇంచుమించుగా సంవత్సరంలో ఆరునెలలు బృందావనం, అవతార పురుషులైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారికి ద్వితీయధామమైంది. ప్రారంభంలో బృందావన విహారి సాయి కృష్ణుడు ఆశ్రమంలోని కాలిబాట కిరువైపులా కూర్చున్న భక్తుల మధ్య నడుస్తూ వారికి దర్శనం అనుగ్రహించేవారు. తరువాత ప్రతి గురువారం, ఆదివారం శాఖోపశాఖలుగా విస్తరించిన విశాలమైన రావిచెట్టుక్రింద భజనలు నిర్వహించడం మొదలైంది. బ్రహ్మాండమైన ఆ రావిచెట్టుయొక్క ఘ్రానుచుట్టూ నిర్మింపబడిన ఎత్తైన వర్తులాకారపు అరుగుమీద, మనోహరమైన త్రిభంగి భంగిమలో ప్రతిష్ఠింపబడిన వేణుగోపాలుని చలువరాతి విగ్రహం ముందు భగవాన్ బాబా తమ సింహాసనంలో ఆసీనులయ్యేవారు. రానురాను బృందావనమునకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగినకొద్ది, ఆ రావిచెట్టుచుట్టూ రేకులతో పైన కప్పబడిన ఒక మంటపము వారి సౌకర్యార్థము నిర్మింపబడింది. ఈ మంటపమును 'సాయిరాం షెడ్డు' అని 'సాయిరాం మంటపము' అని పిలిచేవారు. క్రమక్రమంగా, భక్తుల సౌకర్యార్థం బృందావనం ఆశ్రమంలో అంతకంతకు అధికంగా అనేక సదుపాయాలు కల్పించబడినాయి.

బృందావనంలో బాలురకొరకు శ్రీ సత్యసాయి ఆర్ట్స్, సైన్సు మరియు కామర్స్ కళాశాలను నెలకొల్పడంతో అక్కడ స్వర్ణయుగం ప్రారంభమైంది. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారికి, విద్యార్థులకు మధ్య పెనవేసుకున్న దివ్య ప్రేమబంధమువలన ఆశ్రమానికి నూతనమైన ఒక కళ వచ్చింది. విద్యార్థులు తమ కులపతియైన భగవాన్ బాబావారి దివ్య ప్రేమసన్నిధిలో నివసిస్తూ విద్యాభ్యాసము చేయడంవలన ఆ విద్యా ప్రాంగణము ఒక ఆధునిక గురుకులముగా రూపు దిద్దుకున్నది. 1970-80 సంవత్సరాల మధ్య భగవాన్

ఒక దశాబ్దంపాటు సంవత్సరంలో ఎక్కువకాలం బృందావనంలో నివసిస్తూ తమ 'ప్రేమపుత్రు'లైన విద్యార్థులను తీర్చిదిద్దారు. భగవాన్ బాబావారి సంరక్షణలో పెరిగిన భాగ్యశాలురైన ఆ విద్యార్థులు ఆయన దివ్యశక్తికి నిదర్శనములైన ఎన్నో దివ్యలీలలు, మహిమలకు ప్రత్యక్ష సాక్షులుగా నిలిచారు. అమృతమయమైన ఆయన దివ్య ప్రేమవాహినిలో పునీతులై పరివర్తన చెందారు. 'భారతీయ సంస్కృతి మరియు ఆధ్యాత్మికత అనే అంశములపై నిర్వహింపబడే వేసవి తరగతులలో పాల్గొనడానికి భారతదేశమంతటినుండి అధిక సంఖ్యలో వచ్చే విద్యార్థులు, అధ్యాపకులతో బృందావనం ప్రతి సంవత్సరం వేసవికాలములో చాలా రద్దీగా తయారైంది. ప్రశాంతి నిలయము మరియు బృందావనం రెండు ఆశ్రమాలలోను భగవాన్ బాబావారి దివ్య సన్నిధిలో ఉండే భక్తులు కొందరు "ప్రశాంతి నిలయము ఆయన కార్యక్షేత్రము మరియు బృందావనం ఆయన దివ్యలీలా గృహము. ప్రశాంతి నిలయములో ఆయన శివశక్తి స్వరూపులు; బృందావనంలో లీలామానుష విగ్రహులైన శ్రీ కృష్ణ పరమాత్మ", అని వ్యాఖ్యానించారు.

బృందావనంలో ఆశ్రమం ప్రారంభమునుండి తమ జీవితాంతమువరకు సుమారు మూడు దశాబ్దాల పాటు భగవాన్ దివ్యాశీస్సులతో ఆశ్రమ నిర్వాహకులుగా సేవలందించిన శ్రీ రామబ్రహ్మం జీవితములో జరిగిన అనేకమైన అద్భుతము మరియు ఆసక్తికరమైన సంఘటనలలో ఈ దివ్యధామముయొక్క అందచందాలు ప్రతిఫలిస్తాయి. ఆశ్రమ నిర్వహణలో అతి చిన్న విషయాలనుకూడా దృష్టిలో ఉంచుకుని వాటిని ఏవిధంగా నిర్వర్తించాలో, ఆశ్రమంయొక్క పవిత్ర వాతావరణాన్ని ఎలా కాపాడాలో అనే విషయమును గురించి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు శ్రీ రామబ్రహ్మంకు 900కు పైగా ఉత్తరాలను ప్రశాంతి నిలయము మరియు ఇతర ప్రాంతముల నుండి వ్రాశారంటే భగవాన్ హృదయంలో బృందావన ఆశ్రమానికి ఎంతటి ప్రాధాన్యత ఉన్నదో మనకు తెలుస్తుంది. అంతేకాక, భగవాన్ బాబావారు శ్రీ

రామబ్రహ్మంపై అనంతమైన దివ్యప్రేమ, కరుణలను వర్షిస్తూ వ్రాసిన ఉత్తరాలు, భౌతిక, ఆధ్యాత్మిక పరిధిలో ఆయన సంక్షేమమును కాంక్షిస్తూ వ్రాసిన ఉత్తరాలు అనేకం ఉన్నాయి. ఆ ఉత్తరాలలో దివ్య మాతాపితరులైన భగవాన్ బాబావారి మాతృప్రేమ, తండ్రియొక్క కఠిన వైఖరి మరియు అవతార పురుషుని అపార జ్ఞానసంపద ప్రతిఫలిస్తాయి. భగవాన్ బాబావారు దివ్య ప్రేమామృతధారలు వర్షిస్తూ శ్రీ రామబ్రహ్మంకు వ్రాసిన ఒక ఉత్తరంలో ఈ విధంగా కవితా వెల్లువ పొంగి పొరలుతుంది :

"నా దర్శన భాగ్యముకొరకు ఆర్తితో సక్కుబాయి కార్చిన
కన్నీటి ధారలను నేను మరువగలనా?
నా ఆరాధన తప్ప అన్యచింతనలేని నందనార్
పడిన కష్టములను నేను మరువగలనా?
నా దర్శనముకొరకు నిరంతరం పరితపించిన మీరా
శోకతప్తగాథ నా స్మృతిపథంనుండి చెరిగిపోయిందా?
'రామా! రామా!' అంటూ నిరంతర రామ చింతనోన్మత్తుడైన
త్యాగరాజు మొరలను ఎన్నడైన ఏమరచితినా?
రామబ్రహ్మం! సర్వాంతర్యామి నీ సాయి కన్నీటి ధారలతో
చేసే నీ ప్రార్థనలను ఆలకించదా?
సాయి దయాదృష్టి నీపై వర్షించదా?
రామబ్రహ్మం! సర్వకాల సర్వావస్థలలోను
సాయి నిన్ను కాపాడుతాడని గుర్తుంచుకో!
అడవిలో నున్న ఆకసమునన్నున్న
పట్టణమునన్నున్న పల్లెనున్న
గుట్టమీదనున్న నట్టేటనున్నను
మదిని సాయి నిన్ను మరువడెపుడు.

- నీ బాబా"

శ్రీ రామబహ్మం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములోని సుప్రసిద్ధ పట్టణమైన విజయవాడకు దగ్గరగానున్న ఒక గ్రామమునకు చెందినవాడు. ఆయన వ్యవసాయమే వృత్తిగా చేపట్టిన మంచి సంపన్న కుటుంబమునకు చెందిన గృహస్థు; పైగా వ్యాపార వేత్తకూడాను. 1945వ సంవత్సరమునుండి ఆయన శ్రీ షిర్డీ సాయిబాబావారి భక్తుడు. 1953వ సంవత్సరములో మొట్టమొదటిసారి శ్రీ రామబ్రహ్మం 51 సంవత్సరాల వయస్సులో ప్రశాంతి నిలయములో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దర్శనం చేసుకున్నారు. ఆ ప్రథమ దర్శనంలోనే భగవాన్ బాబావారు "రామబ్రహ్మం! ఎలా వున్నావు?" అని పలకరించేటప్పటికి ఆయన 'తన పేరు బాబాకు ఎలా తెలిసిందా' అని ఆశ్చర్యపోయారు. ప్రశాంతి నిలయం చేరిన మూడవ రోజున స్వామి ఆయనకు పాదపూజ చేసుకునే అవకాశం కల్పించారు. ఆయన భగవాన్ బాబావారికి పాదపూజ చేస్తున్నప్పుడు, సింహాసనంలో ఆసీనులైన శ్రీ సత్యసాయి స్థానంలో ఆయనకు శ్రీ షిర్డీ సాయిబాబా దర్శనమిచ్చారు! ఆ విధంగా శ్రీ షిర్డీ సాయిబాబా మరియు శ్రీ సత్యసాయిబాబా ఒక్కరేననే విశ్వాసం స్వామి ఆయనలో నెలకొల్పారు. ఆ తరువాత శ్రీ రామబ్రహ్మం తన జీవితంలో ఎన్నడూ వెనుకకు తిరిగి చూడలేదు, సందేహమునకు తావివ్వలేదు. తరుచు పుట్టపర్తికి వచ్చి వెళ్ళడం మొదలుపెట్టారు. అలా వస్తున్నప్పుడు కొన్నిసార్లు తన భార్య, ఇద్దరు కుమార్తెలు, ముగ్గురు కుమారులను కూడా వెంటబెట్టుకుని వస్తూండేవారు.

1953వ సంవత్సరములో మొట్టమొదటిసారి పుట్టపర్తి యాత్ర చేసుకుని తిరిగి వచ్చాక శ్రీ రామబ్రహ్మం గుంటూరులో పొగాకు ఎగుమతి వ్యాపారం ప్రారంభించారు. ఆయనలో గల శ్రద్ధ మరియు కష్టపడి పనిచేసే గుణంవల్ల వ్యాపారం చాలా తొందరగా అభివృద్ధి చెందింది. ఆ కారణంగా ఆయనకు భగవాన్ బాబావారియందు భక్తి, విశ్వాసములు పెరిగాయి. ఈ విధంగా జీవితం సవ్యంగా, సాఫీగా సాగిపోతోంది. కాని ఇంతలో 1955వ సంవత్సరంనుండి ఆయనకు కష్టాలు ప్రారంభమయ్యాయి. ఇదంతా తనకు మానసిక స్థైర్యమును చేకూర్చి ఉత్తరకాలంలో తనను బృందావనంలో


Bhagawan Sri Sathya Sai Baba

PRASANTHI NILAYAM P. O.,
ANANTAPUR DIST.
ANDHRA PRADESH

DHARMAKSHETRA
MAHAKALI CAVES ROAD,
ANDHERI (EAST),
BOMBAY-69.

Camp: Kampala East-africa.

"తూర్పు ఆఫ్రికానుండి భగవాన్ బాబావారు శ్రీ రామబ్రహ్మంకు వ్రాసిన లేఖ"



"భగవంతునికొరకే జీవించి భగవంతుడినే సేవించిన శ్రీరామబ్రహ్మం"



"బృందావనంలో భగవాన్ బాబావారిచే గోకులమునకు ప్రారంభోత్సవం"

అత్యుత్తమమైన సేవాసాధకునిగా తీర్చిదిద్దే భగవాన్ బాబావారి శిక్షణలో ఒక భాగమేనని, శ్రీ రామబ్రహ్మం తరువాత గ్రహించారు. 1955వ సంవత్సరాంతములో ఆయన తీవ్ర అనారోగ్యమునకు గురయ్యారు. 1956 జూన్‌వరకు అసలు ఆయన వ్యాధి ఏమిటో ఎవరూ సరిగా కనిపెట్టలేకపోయారు. పోనీ, ప్రశాంతి నిలయం వెళ్ళి తన బాధను స్వామికి విన్నవించుకుందామనుకుంటే అక్కడ కూడా ఆయనకు కష్టాలే ఎదురైనాయి. భగవాన్ బాబా అసలు ఆయనవైపు చూడనే లేదు! చివరకు ఆయన వ్యాధిని డాక్టర్లు ఊపిరితిత్తులకు సంబంధించిన వ్యాధిగా (Lung infection) గుర్తించి, చికిత్స మరియు విశ్రాంతికొరకు కర్ణాటక రాష్ట్రములోని మైసూరుకు వెళ్ళమని సలహాయిచ్చారు. అక్కడ ఆయన 1956 జూన్ నుండి 1957 మార్చి నెలవరకు ఉన్నారు. ఇంతకాలం యజమాని దగ్గర ఉండి స్వయంగా చూచుకోకపోవడంచేత ఇక్కడ వ్యాపారం దెబ్బతిన్నది. వ్యాపారంలో వచ్చిన నష్టమును తట్టుకోవడానికి, అప్పులు తీర్చడానికి ఆయన ఇంచుమించుగా తన భూములు, ఇతర ఆస్తులన్నిటిని అమ్మివేయవలసివచ్చింది. ఫలితంగా ఒక్క సంవత్సరకాలంలో ఆయన కోటీశ్వరుని స్థాయినుండి కూటిపేద స్థాయికి జారిపోయారు. ఈ కష్టాల పరంపరవలన భగవాన్ బాబావారియందు ఆయనకు గల విశ్వాసము కఠిన పరీక్షకు గురయ్యింది. అయితే, స్వామి అనుగ్రహంవలన ఆయన ఆ పరీక్షలో నెగ్గారు. ఆయన అదృష్టంకొద్ది, ఆయన బంధువులు, స్నేహితులు అందరూ ఆయనను విడిచిపెట్టి వెళ్ళిపోయినప్పటికి భగవాన్ బాబావారు మాత్రం ఆయనకు అండగా నిలిచి అపారమైన ప్రేమను వర్షించారు. భగవంతునికి, భక్తునికి మధ్య ప్రేమబంధము మరింత దృఢతరమైంది.

ఆ తరువాత ఐదు సంవత్సరాల పాటు శ్రీ రామబ్రహ్మం యొక్క అంతరాత్మ అనేక కఠిన పరీక్షలకు, కోతలకు గురయి సానపట్టిన వజ్రంలా తయారైంది. భగవత్సాన్నిధ్యంకొరకు అంతకంతకు అధికంగా తపన పడసాగింది. చివరకు, ఆయన జీవితంలో పథనిర్దేశం చేసే ఆ దివ్యక్షణం 1963వ సంవత్సరంలో వచ్చింది. ఆ సమయంలో ఆయన తన చిన్నకుమార్తెకు వివాహము చేసే

ఉద్దేశ్యంతో అందుకు స్వామి దివ్యాశీస్సులు అర్థించడానికి స్వామి వద్దకు వెళ్ళారు. ఆమెకు కళ్యాణ ఘడియలు ఇంకా రాలేదుగాని, శ్రీ రామబ్రహ్మంయొక్క అంతరాత్మ భగవంతునితో పవిత్రబంధమును ఏర్పరచుకునే శుభముహూర్తం ఆసన్నమైంది. భగవాన్ బాబా సరియైన సమయంలో తానే ఆమెకు వివాహం నిశ్చయించి దగ్గరుండి జరిపిస్తానని మాటయిస్తూ, శ్రీ రామబ్రహ్మంను ఆయన భార్య, కుమార్తెతో కలసి బృందావనంకు వచ్చి స్థిరపడి అక్కడి ఆశ్రమంలో మేనేజరుగా పనిచేయుమని ఆదేశించారు. అనేక జన్మల తపఃఫలితంగా అనుగ్రహింపబడిన ఆ అవకాశమును భగవాన్ కానుకగా శ్రీ రామబ్రహ్మం స్వీకరించారు. అశాశ్వతము, అనిత్యము అయిన ఈ లౌకిక ప్రపంచములో శాశ్వతమైన పరమాత్మతత్వముకొరకు తాను కొనసాగించే అన్వేషణ ఇన్నాళ్ళకు ఫలించిందని ఆయన సంతోషించారు.

బృందావనంలో నాలుగు సంవత్సరాలపాటు శ్రీ రామబ్రహ్మంతో కలసి పనిచేసే అవకాశం నాకు లభించింది. ఆ సమయంలో, ఆయనకు భగవాన్ బాబావారియందు గల అచంచల భక్తి, విశ్వాసములు చూచి అటువంటి మహోన్నత ఆదర్శమూర్తితో కలసి పనిచేసే భాగ్యం లభించినందుకు నేనెంతో ఆనందించాను. వయసులో తనకంటె చిన్నవారైన తన తోటి ఉద్యోగులపట్ల శ్రీ రామబ్రహ్మం ఎంతో ఉదారంగా వ్యవహరిస్తూ తన సలహా కోరినప్పుడల్లా అందిస్తూండేవారు. భగవాన్ బాబావారితో తాను పొందిన అనుభవాలనుకూడా ఆ సలహాకు జోడించి ఉదాహరణలుగా వివరించేవారు. తన సలహాకోరి వచ్చే ఎవరికైనా ఆయన చెప్పే మొట్టమొదటి విషయం, "ఇక్కడ నీవు ఉద్యోగం చేయడానికి వచ్చానని ఎన్నడూ భావించకు. ఈ ఆశ్రమాన్ని నీ స్వంత ఆస్తిగా భావించి, అంకిత భావంతో దీనిని కాపాడుకో!" రెండవ సలహా "నీ స్వంత విషయాలనుగురించి భగవాన్ బాబావారిని ఎప్పుడూ అడుగకు. నీ స్వంతానికి ఎప్పుడూ ఏదీ అడుగకు. నీవు ఆయన పనిచేస్తే, ఆయన నీ పని చేస్తారు. నీ అవసరాలన్నీ తీరుస్తారు. నీవు అడక్కుండానే భగవాన్ నీకు రావలసినదానికంటె ఎక్కువే ఇస్తారు". ఇక మూడవ సలహా "భగవాన్ ఆదేశాలను తు.చ. తప్పకుండా

పాటించు. ఈ విషయంలో నీకు ఎట్టి స్వతంత్రము లేదు. ఆయన ఆజ్ఞలను అనుసరించడమే నీ కర్తవ్యము. నీ తర్కము, తెలివితేటలు; నీ అనుకూలముల ననుసరించి భగవాన్ ఆజ్ఞలకు వ్యాఖ్యానము చెప్పడానికి ప్రయత్నించకు". చివరగా శ్రీ రామబ్రహ్మం "శ్రీ సత్యసాయిబాబా సాక్షాత్తూ భగవంతుడే! సర్వకాల సర్వావస్థలలోను ఆయనను ఆ విధంగానే భావించు. ఒక్కొక్కప్పుడు ఆయన అతి సామాన్య వ్యక్తివలె మనతో మాట్లాడవచ్చు, పరిహాసమాడవచ్చు. అంతమాత్రంచేత మనం ఎట్టి పరిస్థితులలోను ఆయనను సామాన్య మానవునివలె భావించకూడదు. ఇప్పుడు నీకు లభించిన అవకాశమును పోగొట్టుకుంటే, నీకు మళ్ళీ అది లభించడానికి కొన్ని జన్మలు పట్టవచ్చు. నీ జీవితంలో ప్రప్రథమ కర్తవ్యము, భగవాన్ బాబావారిని సేవించడం; మిగిలిన విషయాలు, వ్యక్తులు అన్నీ ఆ తరువాతనే", అని నొక్కి చెపుతారు.

భగవాన్ బాబావారు ఒకసారి శ్రీ రామబ్రహ్మంను పిలిచి "నీ భార్య చాలా ఎక్కువగా మాట్లాడుతుంది. ఆశ్రమం అంతా వినపడేటట్లుగా గట్టిగా మాట్లాడుతుంది. నాకుకూడా మందిరంలోకి ఆమె గొంతుక వినపడుతుంది", అని చెప్పారు. వెంటనే ఆ మరునాడే శ్రీ రామబ్రహ్మం తన భార్యను తీసికొని 15 గంటలకు పైగా ప్రయాణం చేసి, తన స్వగ్రామంలో విడిచిపెట్టి వెనుకకు తిరిగివచ్చారు. భగవాన్ బాబావారు, తనభార్యమధ్య ఎవరిని ఎంచుకోవాలనే ప్రశ్న ఎదురైనప్పుడు ఆయన నిస్సందేహంగా, నిస్సంకోచంగా భగవాన్ బాబావారినే ఎంచుకున్నారు! తిరిగి వచ్చిన తరువాత ఆయన భగవాన్ బాబావారిని కలసి "స్వామీ! నా భార్య ఇంక ఎవరికి ఇబ్బంది కలిగించదు. ఇంతవరకు ఇక్కడ ఆమె కలిగించిన అసౌకర్యమునకు నన్ను, ఆమెను కూడా దయచేసి క్షమించండి", అని చెప్పారు. అప్పుడు బాబా "నేను నీ భార్యను ఇక్కడినుండి పంపించివేయమని చెప్పలేదే!" అని చెప్పారు. భగవాన్ వ్యాఖ్యలకు శ్రీ రామబ్రహ్మం మౌనం వహించారు. ఒక వారం రోజులు పోయిన తరువాత స్వామి మళ్ళీ "నీ భార్య ఎప్పుడు తిరిగి వస్తుంది?" అని శ్రీ రామబ్రహ్మంను అడిగారు. "నాకు తెలియదు, స్వామీ!" అని బదులు చెప్పారు, శ్రీ రామబ్రహ్మం.

ఆ తరువాత కొన్ని రోజులవరకు ప్రతిరోజు స్వామి అదే ప్రశ్న వేయడం, శ్రీరామబ్రహ్మం అదే జవాబు చెప్పడం జరిగింది. చివరకు భగవాన్ బాబావారు శ్రీ రామబ్రహ్మంపైన చికాకుపడుతూ "రామబ్రహ్మం! ఒక·వారం రోజులలోగా నీ భార్య ఇక్కడికి రాకపోతే, నీవే అక్కడికి వెళ్ళి ఆమెతో అక్కడే ఉండిపోవలసి వస్తుంది", అని హెచ్చరించారు. అప్పటికి శ్రీరామబ్రహ్మం భగవాన్ మాటలలోని తీవ్రతను అర్థం చేసుకుని, మూడు రోజులలోగా తన భార్యను తిరిగి బృందావనంకు తీసికొనివచ్చారు!

శ్రీరామబ్రహ్మంయొక్క మనుమరాలి వివాహము గుంటూరులో జరుపడానికి ఏర్పాట్లు చేయబడినాయి. వివాహానికి 15 రోజుల ముందు ఆయనకు తన స్వగ్రామమునుండి ఆ వివాహమునకు వచ్చి దగ్గరుండి శుభకార్యము జరిపించవలసిందని ఆహ్వానము అందింది. ఆయన ఆ ఆహ్వాన పత్రికను తీసికొని వెళ్ళి భగవాన్ బాబావారికి సమర్పించారు. కాని, వివాహమునకు వెళ్ళడానికి అనుమతి ప్రసాదించవలసిందని మాత్రం స్వామిని కోరలేదు. మౌనంగా స్వామి ఆదేశముకొరకు ఎదురుచూస్తూ ఉండిపోయారు. అప్పుడు భగవాన్ బాబావారే స్వయంగా "నీవు వెళ్ళి వివాహము జరిపించి రా!" అని చెప్పారు. ముహూర్తం దగ్గరపడే కొద్దీ ఆయన రెండు, మూడు రోజుల ముందుగా గుంటూరు వెళ్ళిరమ్మని స్వామి చెపుతారేమోనని ఎదురుచూశారు. అయితే, ఆ విషయంలో స్వామి ఏమీ చెప్పక మౌనంగా ఉండిపోయారు. శ్రీరామబ్రహ్మంకూడా మిన్నకుండిపోయారు. వివాహం జరిగిపోయిన మరునాడు భగవాన్ బాబా శ్రీరామబ్రహ్మంను పిలిచి "రామబ్రహ్మం! నీవు పెళ్ళికి ఎందుకు వెళ్ళలేదు?" అని అడిగారు. శ్రీరామబ్రహ్మం తనకేమీ పట్టనట్లు చాలా యథాలాపంగా "స్వామీ! నేను అక్కడికి వెళ్ళడం మీకు ఇష్టంలేదేమోననుకున్నాను. లేకపోతే మీరు తప్పక నన్ను వెళ్ళమని చెపుతారు కదా!" అని బదులు చెప్పారు. శ్రీరామబ్రహ్మం యొక్క స్వామి భక్తికి, విధేయతకు భగవాన్ బాబావారు పరమానంద భరితులై "గుడ్‌బాయ్! ఇదే నిజమైన భక్తుని లక్షణం", అని మెచ్చుకున్నారు. అప్పటికి

శ్రీరామబ్రహ్మం వయస్సు 75 సంవత్సరాలు. శ్రీరామబ్రహ్మంకు మనసా, వాచా, కర్మణా భగవాన్ బాబావారిని తృప్తి పరచడం తప్పించి మరేదీ పరిగణనలోనికి రాదు. నిజంగా ఆయన అత్యున్నత శ్రేణికి చెందిన భక్తుడు.

1964వ సంవత్సరం జూన్ నెల 3వ తేదీన శ్రీరామబ్రహ్మం రెండవ కుమారుడు నాగభూషణం హఠాత్తుగా చనిపోయాడు. ఆ సమయంలో ఒక తీవ్రమైన తుఫాను వలన విజయవాడ, బృందావనం మధ్య సమాచార సంబంధాలన్నీ పూర్తిగా తెగిపోయాయి. అయితే, ఆ రోజున భగవాన్ బాబావారు శ్రీరామబ్రహ్మంను పిలిచి "నీ కొడుకు నాగభూషణం చనిపోయాడు. నువ్వు, నీ భార్య కలిసి వెంటనే ఇంటికి వెళ్ళండి. అయితే, మీ ఊరు వెళ్ళేవరకు నీ భార్యకు ఈ విషయం చెప్పకు", అని చెప్పారు. శ్రీరామబ్రహ్మం భగవాన్ ఆజ్ఞలను 'తు,చ' తప్పకుండా పాటించారు. తన భార్యతో కలసి 17 గంటలపాటు చేసిన ఆ ప్రయాణంలో ఆయన తనను భగవాన్ బాబావారు ఒక ముఖ్యమైన పనిమీద విజయవాడ పంపించారనే సమాచారముతప్ప మరే విషయము తన భార్యకు తెలియనివ్వలేదు. చివరకు ఆమె ఇంటికి చేరుకునేటప్పటికి, అక్కడ తనకు అత్యంత ప్రీతిపాత్రుడైన తన కుమారుని మృతదేహమును చూచింది. తమ కుటుంబానికి సంభవించిన ఈ విషాదకర పరిస్థితిని భగవాన్ బాబావారికి వెంటనే తెలియజేయుమని ఆమె తన భర్తను కోరింది. అంతవరకు నిమ్మకు నీరెత్తినట్లు ఊరుకున్న శ్రీరామబ్రహ్మం అప్పుడు ఆమెకు నిజం చెప్పారు. ఆమెను ఓదారుస్తూ "నీ మీద అపారమైన దయతో మన కుమారుని మరణమును గురించి బృందావనంలో నీకు చెప్పవద్దని స్వామి నన్ను ఆదేశించారు. ఇంత సుదీర్ఘ ప్రయాణంలో తల్లివైన నీకు కుమారుని మరణవార్త తెలిస్తే దుఃఖం ఆపుకోలేవని స్వామి ఆవిధంగా చెప్పారు", అని బోధపరిచారు.

కుమారుని అంత్యక్రియలు ఆ దంపతులను పదిహేను రోజులపాటు విజయవాడలో ఉండేటట్లు చేశాయి. ఆ సమయంలో భగవాన్ బాబావారు మానవ జీవితము మరియు జనన, మరణములలో ఇమిడియున్న రహస్యమును

గురించి వారికి వివరిస్తూ సుదీర్ఘమైన ఒక ఓదార్పు లేఖ ఆ దంపతులకు వ్రాశారు. అయితే, ఆ మాతృ హృదయంలో చెలరేగిన దుఃఖాగ్ని జ్వాలలు అంత త్వరగా చల్లారేవి కావు. తన భర్తతో కలసి బృందావనంకు తిరిగి వచ్చాక ఆమె తన శోకతప్త హృదయమును భగవాన్ బాబావారిముందు పెట్టి "బాబా! నేను కుమారుని పోగొట్టుకున్నాను" అని విలపించింది. బాబా ఆమెను ఓదారుస్తూ "అతడు ఎక్కడికీ వెళ్ళలేదు. నా దగ్గరే ఉన్నాడు", అని చెప్పారు. "మీతోనే ఉన్నాడా? ఇది నిజమా", అని ఆ తల్లి హృదయం కుమారునికొరకు ఆక్రోశించింది. అప్పుడు భగవాన్ బాబావారు ఆ దంపతులను ఇంటర్వ్యూ రూములోనికి తీసుకువెళ్ళారు. అక్కడ వారు ఒక అద్భుతమైన దృశ్యమును చూచారు. ఒక పదిహేను రోజుల క్రితం కొన్ని వందలమైళ్ళ అవతల తమ స్వగ్రామంలో తమ చేతులతో స్వయంగా తమ కుమారుని మృతదేహమును దహనం చేసిన తరువాత, ఆతడు ఇప్పుడు ఇక్కడ బృందావనంలో స్వామి ఇంటర్వ్యూ గదిలో కూర్చొని వారికి కనిపించాడు! పుత్ర శోకముతో కుమిలిపోతున్న ఆ మాతృ హృదయానికి ఊరట కలిగించడానికి భగవాన్ ఈ విధంగా చేయవలసినదంతా చేశారు.

భగవాన్ బాబావారి సేవలో తమ జన్మ సార్థకం చేసుకోవాలని ఆశించే సేవాతత్పరులకు అవసరమైన అతి ముఖ్యమైన పాఠాలను నేర్పే శ్రీరామబ్రహ్మం జీవితములోని మూడు అనుభవాలను ఇక్కడ వివరించడం జరుగుతున్నది.

శ్రీరామబ్రహ్మం శారీరకంగా బాగా ఒడ్డు, పొడుగు కలిగిన మంచి దృఢకాయులు. ఒక రోజున భగవాన్ బాబావారు ఆయనకు తన కాషాయ అంగీని ఇచ్చి దానిని తొడుక్కోమని చెప్పారు! వేరే ఎవరైనా అయితే భగవాన్ మాటలను పరిహాసంగా తీసుకునేవారు. శ్రీరామబ్రహ్మం మాత్రం ఆ అంగీని తన చేతితో అందుకుంటూ స్వామివైపు ప్రశ్నార్థకంగా చూచారు. అప్పుడు భగవాన్ బాబా "ఊ! తొడుక్కో!" అని తొందర చేశారు. శ్రీరామబ్రహ్మం "స్వామీ! ప్రయత్నం చేస్తాను. కాని, నా పెద్ద తల, పొడుగాటి చేతులు ఈ అంగీలో ఏవిధంగా ఇమడగలవో నాకు తెలియడం లేదు", అని వాపోయారు.

అయినప్పటికి, భగవాన్ బాబా తన పట్టు వదలలేదు. ఇక చేసేదిలేక శ్రీరామబ్రహ్మం ఆ అంగీలోనికి ఎలాగో అలాగ కష్టపడి తన తలను, చేతులను దూర్చడానికి ప్రయత్నం చేసేసరికి ఆయనకు ఊపిరి ఆడలేదు. అయినప్పటికి, ఆయన తన ప్రయత్నం మానలేదు. ఇంతలో ఆ అంగీ నెమ్మదిగా సాగడం ప్రారంభించి చివరకు ఆయనకు సరిగ్గా సరిపోయింది! ఈ అద్భుత లీల చూచి శ్రీరామబ్రహ్మం ఆశ్చర్యపడిపోయారు. ఈ అనుభవమునుండి శ్రీరామబ్రహ్మం ఒక మంచి గుణపాఠము నేర్చుకున్నారు. ఆయన మాటలలోనే చెప్పాలంటే "భగవాన్ బాబావారు అప్పజెప్పిన పనిని చేయడానికి మీరు మనస్ఫూర్తిగా ప్రయత్నిస్తే, తప్పక ఆ కార్యము విజయవంతముగా నెరవేరేటట్లు ఆయనే సహాయం చేస్తారు".

ఒకసారి శ్రీరామబ్రహ్మం మందిరం క్రిందిఅంతస్తులో ఉండగా, మొదటి అంతస్తులోనుండి భగవాన్ బాబావారు ఆయనను పిలిచారు. ఆ సమయంలో తన చేతిలో ఒక ఫ్లాస్కు ఉండడం వలన అది పట్టుకుని స్వామి దగ్గరకు వెళ్ళడం సరికాదని ఆయన భావించారు. అందువలన ఆయన వంటగదిలోనికి వెళ్ళి, ఫ్లాస్కు అక్కడ పెట్టి, తరువాత మెట్లెక్కి స్వామివద్దకు వెళ్ళారు. అప్పుడు భగవాన్ ఆయనవైపు తీక్షణంగా చూచి "ఎందుకొచ్చావ్?" అని అడిగారు. "స్వామీ! మీరు పిలిచారు కదా!" అని బదులు చెప్పారు, శ్రీరామబ్రహ్మం. అందుకు స్వామి కొద్దిగా కఠిన స్వరంతో "కొద్ది నిమిషాలముందు పిలిచాను, ఇప్పుడు కాదు", అని చెప్పి పంపించివేశారు.

అంతగా ప్రాముఖ్యత లేనట్లు కనపడుతున్న ఆ సంఘటన జరిగిన నెలరోజుల తరువాత, శ్రీరామబ్రహ్మం పర్యవేక్షణలో బృందావనంలోని వ్యవసాయ క్షేత్రంలో ఒక బోర్‌వెల్ త్రవ్వకం పని సాగుతున్నది. అక్కడ పనిచేస్తున్న సేవాదళ్ వలంటీర్లకు భగవాన్ బాబావారు పంపిన స్వీట్లు పంచిపెట్టడానికి శ్రీరామబ్రహ్మం అక్కడకు వెళ్ళారు. ఆ పని పూర్తి చేసుకుని ఆయన తిరిగి మందిరంలోనికి వెళ్ళే ఉద్దేశ్యంతో పొలాలగుండా నడుస్తున్నారు. ఇంతలో ఆయన ఒకసారి తన వాచి చూసుకుని ఈ పాటికి స్వామి తనకొరకు

ఎదురు చూస్తూంటారని అనుకున్నారు. అందువలన తొందరగా అడుగులు వెయ్యడం మొదలుపెట్టారు. ఆ తొందరలో ఆయన కాలుజారి పడిపోయారు. అలా పడిపోయేముందు ఆయన "సాయిరాం" అని గట్టిగా కేకవేశారు. ఆ విధంగా ఆయన క్రింద పడిపోయినప్పటికి పెద్దగా దెబ్బలేవీ తగులలేదు. కేవలం ఆయన ధరించిన బట్టలు మాత్రం మురికి అయ్యాయి. ఈ లోపుగా ఆయన నెమ్మదిగా లేచి భగవాన్ బాబావారిదగ్గరకు వెళ్ళేటప్పటికి ఆయన "రామబ్రహ్మం! నువ్వు నాపేరు పిలవగానే నేను వెంటనే ఆ స్థలం వద్దకు పరుగెత్తి వచ్చి పెద్ద దెబ్బలేవీ తగులకుండా నిన్ను కాపాడాను. లేకపోతే నీ ఎముకలన్నీ విరిగిపోయి ఉండేవి. నువ్వు పిలవగానే నేను అక్కడికి వచ్చి ఉండకపోతే నీ పరిస్థితి ఏమైయుండేది? కాని, నేను నిన్ను పిలిచినప్పుడు మాత్రం, నువ్వు సావకాశంగా నీ పని అంతా చక్కపెట్టుకున్న తరువాత వస్తావు. ఇదేమైనా బాగుందా?", అని ప్రశ్నించారు. ఆ ప్రశ్నతో శ్రీరామబ్రహ్మంకు తల తిరిగినంత పనయ్యింది. వెంటనే ఆయన స్వామి పాదాలపై పడి క్షమాపణ వేడుకున్నారు.

ఒక రోజు సాయంత్రం 6 గంటలకు అప్పట్లో భారత ఉపరాష్ట్రపతిగా ఉన్న శ్రీ బి.డి. జట్టి జాతీయ ప్రాముఖ్యత గల ఒక విషయంలో భగవాన్ బాబావారి ఆశీస్సులు కోరడానికి బృందావనం వచ్చారు. ఆయనవెంట కొంతమంది కేంద్రమంత్రులు మరియు కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి కూడా ఉన్నారు. కాని, భగవాన్ బాబావారు అప్పటికే తమ విశ్రాంతి మందిరములోనికి వెళ్ళిపోయారు. భగవాన్ బాబావారి అనుమతి లేనిదే మందిర ప్రాంగణంలోనికి అతిథులు లేక సందర్శకులెవరూ ప్రవేశించడానికి వీలులేని కారణంచేత, శ్రీరామబ్రహ్మం ఉపరాష్ట్రపతిని ఆయన వెంట ఉన్న ప్రముఖ వ్యక్తులను "సాయిరాం మంటపం"లోనికి గౌరవప్రదంగా ఆహ్వానించి అక్కడ వారిని ఆసీనులను చేశారు. తరువాత వారికి పరిస్థితిని నెమ్మదిగా వివరించి, మరునాడు ఉదయం స్వామి దర్శనానికి రావలసిందిగా కోరారు. అప్పుడు ఉపరాష్ట్రపతి "రేపు ఉదయంలోగా నేను ఈ విషయమును గురించి ప్రధానమంత్రితో

మాట్లాడాలి. దయచేసి నేను భగవాన్ బాబావారిని కలుసుకోవడానికి ఇక్కడ వేచియున్నానని ఆయనకు నా తరఫున విన్నవించండి", అని కోరారు. శ్రీరామబ్రహ్మం చాలా మర్యాదగా, దృఢంగా "అయ్యా! స్వామి విశ్రాంతి మందిరంలోనికి వెళ్ళిపోయిన తరువాత ఎవరూ ఆయన తలుపుతట్టే సాహసం చేయలేరు. దయచేసి నన్ను క్షమించండి", అని బదులు చెప్పారు. పరిస్థితిని అర్థం చేసుకున్న ఉపరాష్ట్రపతి చాలా ఆందోళనతో "అయితే, ఇప్పుడు ఏం చేద్దామంటారు? నాకేదైనా సలహా చెప్పండి", అని అడిగారు. అందుకు సమాధానంగా చిరకాలంనుండి స్వామి భక్తుడైన శ్రీరామబ్రహ్మం "నాకు తెలిసినంతవరకు ఒకే ఒక మార్గమున్నది. దయచేసి ఇక్కడ కూర్చుని సాయినామం జపం చేస్తూ భగవాన్ బాబావారిని ప్రార్థించండి. ఆయనకు అన్నీ తెలుసు. ఆయన మీ ప్రార్థనలను ఆలకించవచ్చు", అని సలహాయిచ్చారు. శ్రీ జట్టి ఆయన సలహాను అంగీకరించి స్వామిని ప్రార్థించడం మొదలుపెట్టారు. శ్రీరామబ్రహ్మం మందిరంలోనికి వెళ్ళిపోయారు. ఇది జరిగిన కొద్ది నిమిషాలలోనే భగవాన్ బాబావారు తమ గది నుండి బయటకు వచ్చి శ్రీరామబ్రహ్మంను ఉపరాష్ట్రపతిని లోపలికి తీసికొని రమ్మని ఆదేశించారు. తరువాత స్వామి ఆయనతో 30 నిమిషాలకు పైగా మాట్లాడారు.

ఈ సంఘటనకు శ్రీరామబ్రహ్మం ఆశ్చర్యపోలేదు. ఆ సంఘటనద్వారా ఇతరులు నేర్చుకోవలసినది ఎంతో ఉన్నది. శ్రీరామబ్రహ్మం జీవితంలో తనకు కలిగిన అటువంటి అనేక అనుభవాలను ఆధారం చేసుకుని తనకంటె వయసులో చిన్నవారైన ఆశ్రమంలోని సేవకులకు "మనం చేసే పనులన్నీ సక్రమంగా ఉండి సత్ఫలితాల నిచ్చి స్వామికి సంతృప్తికరంగా ఉండేటట్లు మనకు స్ఫూర్తి కలిగించాలని మనం సదా స్వామిని ప్రార్థిస్తూండాలి. మన తెలివితేటలు, ఆలోచనలపై మనం ఆధారపడినప్పుడు పదింటిలో తొమ్మిదిసార్లు మనం తప్పు చేస్తాము", అని సలహా యిచ్చేవారు. నిస్సంశయంగా శ్రీరామబ్రహ్మం భగవంతుని మనిషి. ఆయన భగవంతుని కొరకే జీవించారు. భగవంతుని సేవే చేశారు.

1983వ సంవత్సరం జూన్ నెల తాలూకు 'సనాతన సారథి' ఇంగ్లీషు మాసపత్రికయొక్క లోపలి కవరు పేజీలో "బృందావనంలో నూతన మందిరం" అనే శీర్షికలో క్లుప్తంగా ఒక ప్రకటన వెలువడింది. ఆ ప్రకటనయొక్క తెలుగు అనువాదము ఈ విధంగా ఉంటుంది :

"సుమారు 20 సంవత్సరాలుగా భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి నివాస గృహముగా ఉంటూ కాలక్రమేణా అనేక మార్పులు, చేర్పులు చేయబడిన నూరు సంవత్సరాల భవనము ఇక మీదట బృందావన సందర్శకులకు కనపడదు. తేదీ 17-5-1983న భగవాన్ బాబావారు ఆ స్థలంలో నూతన మందిర నిర్మాణమునకు శంకుస్థాపన చేశారు".

ఈ ప్రకటన చాలామందికి పాత జ్ఞాపకాలను స్మరణకు తెచ్చింది. సాక్షాత్తూ భగవంతునితో తాము గడిపిన మధుర క్షణాలకు వేదికయై తమలో పరివర్తన తెచ్చిన ఆ కట్టడమును కూల్చివేస్తున్నారంటే వారు ఎంతో బాధపడ్డారు, నమ్మలేకపోయారు. అయితే, వంద సంవత్సరాలనాటి ఆ భవనం స్థానంలో ఒక సంవత్సర కాలంలో నిర్మింపబడిన నూతన మందిరము వారి విచారమును తొలగించి వారిలో నూతనోత్సాహమును, ఆనందమును నింపివేసింది.

భగవాన్ బాబావారు తాము నివసించే దివ్యధామమునకు "త్రయీ బృందావనం" అని పేరుపెట్టారు. ఇందులో ఎన్నో అర్థాలున్నాయి. అసలు మొదట్లో ఈ మందిరమునకు భగవంతుని యొక్క త్రివిధ అంశములైన "సత్యం, శివం, సుందరం" అనే మూడు అంశములను కలిపి పేరు పెడదామనుకున్నారు. అయితే అప్పటికే బొంబాయి, హైదరాబాదు, మద్రాసు నగరాలలో భగవాన్ బాబావారి మందిరములకు వరుసగా ఈ పేర్లున్నాయి. అందువలన ఈ మూడింటిని కలిపి 'సత్యం శివం సుందరం' అనే పేరు పెడితే, అది చాలా పెద్ద పేరు అవుతుందని భావించి ఆ ఆలోచన విరమించుకోవడం జరిగింది. భగవాన్ బాబావారు ఎంపిక చేసిన "త్రయీ బృందావనం" అనే పేరులోని "త్రయీ" పదంలో సత్యం శివం సుందరం, మూడు అంశములు ఉన్నాయి.

అంతేకాక, సనాతన ధర్మమునకు మూలాధారమైన ఋగ్వేదము, యజుర్వేదము మరియు సామవేదములను మూడింటిని కలిపి "త్రయీ" అని వ్యవహరించడం వాడుకలో నున్నది. "త్రయీ" అనే పదం పరబ్రహ్మ తత్త్వము యొక్క 'సత్', 'చిత్', 'ఆనంద' అనే మూడు లక్షణములకు ప్రతీకగా ఉండడం మరొక విశేషం! ఇక, శ్రీ లలితాసహస్ర నామ స్తోత్రంలో శ్రీ లలితాదేవియొక్క సహస్రనామాలలో 'త్రయీ' ఒకటి. ప్రపంచములోని ప్రధాన మతములన్నిటిలోను గోచరించే సృష్టి, స్థితి, లయ కారకుడైన త్రిమూర్తితత్త్వమును 'త్రయీ' పదము సూచిస్తుంది. ఇక, ఆధ్యాత్మిక మార్గంలో పయనించే సాధకులకు 'త్రయీ' పదము మనసులోని ఆలోచన, మాటలోని సూచన, క్రియలోని ఆచరణ – ఈ మూడు ఏకమయ్యే 'త్రికరణ శుద్ధి' ని నిరంతరం గుర్తు చేస్తూంటుంది. చివరగా, "త్రయీ" పదము భూత, భవిష్యద్వర్తమానములనే త్రికాలములకు సూచిక. ఈ త్రయీ బృందావన భవనమునకు మూడు ప్రవేశ ద్వారములు, అనగా, పశ్చిమంవైపున ప్రధాన ద్వారము, ఉత్తరంవైపున స్వామి భక్తులకు ఇంటర్వ్యూ అనుగ్రహించే గదిలోనికి వెళ్ళేదారి మరియు నైఋతి దిశగా సేవకుల ప్రవేశద్వారము ఉన్నాయి. శిల్పకళాశోభితమై కమలం ఆకారములో నిర్మింపబడిన రెండంతస్తుల భవనం త్రయీ బృందావనంలో, సర్వే సర్వత్రా కమలం చిహ్నమే ప్రధానంగా గోచరిస్తుంది. ఈ చిహ్నము 'బ్రహ్మ సంఖ్య'గా భావింపబడుతున్న, నిగూఢార్థముతో నిండియున్న 'తొమ్మిది సంఖ్య'తో సన్నిహిత సంబంధము కలిగియున్నది. సమకేంద్రకమైన (Concentric) రెండు వర్తులాకారపు భవనములు ఒక దానిలో ఒకటి ఇమిడి యుండేటట్లు త్రయీ బృందావన భవన నిర్మాణము జరిగింది. 36 అడుగుల వ్యాసముగల లోపలి వృత్తములో బ్రహ్మాండమైన 36 అడుగుల ఎత్తుగల డోము పైకప్పుగా ఒక హాలు నిర్మింపబడింది. దాని చుట్టూ 72 అడుగుల వ్యాసముతో వేరొక వృత్తము నిర్మింపబడింది. ఈ రెండు వృత్తములమధ్యనున్న ఖాళీ ప్రదేశములో పై అంతస్తులోను, క్రింది అంతస్తులోను కూడా గదులు, హాల్సు నిర్మాణము చేయబడినవి. ఆ వృత్తాకారపు హాలులో నిలబడి చూస్తే పైఅంతస్తులో 9

ద్వారములు మనకు కనపడతాయి. భవనములోని రెండు అంతస్తులు, ఒక్కొక్కటి 12 అడుగుల ఎత్తులో నిర్మింపబడినవి. లోపలి వృత్తము 9 స్తంభములు, వెలుపలి వృత్తము 18 స్తంభములు ఆధారముగా నిర్మింపబడినాయి.

మొదటి అంతస్తులోని వలయాకారపు హాలు వెలుపలి భాగములో పద్ధెనిమిది కిటికీలు, వాటికి పైకప్పుగా పద్మదళాకారములో 18 చాందినీలు నిర్మింపబడినాయి. హాలు చుట్టూ ఉండే బాల్కనీ పిట్టగోడకు తొమ్మిది వికసించిన కమలములు అలంకరింపబడినాయి. ఒక్కొక్క పద్మములో ఒక్కొక్క గ్రహము చొప్పున తొమ్మిది పద్మాలలో నవగ్రహములను ప్రతిష్ఠ చేశారు. హాలుయొక్క మహోన్నతమైన వలయాకారపు పైకప్పుపై 27 అడుగుల పరిధిగల దేదీప్యమానంగా ప్రకాశించే బ్రహ్మాండమైన గులాబీరంగు పద్మము చెక్కబడింది. ఇక, మొత్తం భవనం చుట్టూ పద్మాకారంలో నిర్మింపబడిన సరోవరం పరివేష్టించి ఉన్నది. ఆధ్యాత్మిక పరిపక్వతకు వికసించే హృదయ కమలం చిహ్నం. ఇది భగవాన్ బాబావారికి ప్రియమైన పుష్పము.

భవనముయొక్క రామణీయకతను ఇనుమడింపజేసే విధంగా అత్యద్భుతమైన శిల్పకళతో శోభిల్లే సింహద్వారము, లోపల ఇరుప్రక్కల రామాయణంలోని మనోహర దృశ్యాల చిత్రములు, శివశక్తుల లాస్యహేలను ప్రతిబింబించే దారు శిల్పాలు అలంకరింపబడినవి. లోపల ప్రవేశించగానే రోజ్‌వుడ్‌తో చేయబడిన శిల్పకళా సమన్వితమైన మందిరాంతర్భాగ ప్రవేశద్వారము, దానిని దాటగానే వలయాకారములో విశాలమైన ఎత్తైన హాలు మనకు దర్శనమిస్తాయి. ఆ హాలులో ప్రతిష్ఠింపబడిన పెద్ద వినాయక విగ్రహమునకు ఇరువైపులా నటరాజ, వేణుగోపాలస్వామిల విగ్రహములు అమర్చబడినాయి.

1984వ సంవత్సరం ఏప్రిల్ నెల 26వ తేదీన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు త్రయీ బృందావనమునకు ప్రారంభోత్సవం చేశారు. సుదూర, సమీప ప్రాంతములనుండి వచ్చిన వేలాది మంది భక్తులకు ఆ రోజు

తమ జీవితాలలో చిరస్మరణీయమైన రోజు. ఆ రోజు ఉదయం అశేష భక్తజన సందోహము మరియు ఆహ్వానితులు బృందావనంలోని సాయిరాం మంటపంలోను, నూతన మందిరమువద్ద ఏర్పాటు చేయబడిన షామియానాలోను సమావేశమయ్యారు. భగవాన్ బాబావారు ఆ ప్రక్కనే ఉన్న సువిశాలమైన స్థలంలో నిర్మింపబడిన తమ తాత్కాలిక నివాసగృహమైన 'దేవీ నివాస్' నుండి త్రయీ బృందావనమునకు ఊరేగింపుగా విచ్చేశారు. ఊరేగింపుముందు బ్రాస్ బేండ్, వేద పఠనము మరియు భజనలు పాడుతూ విద్యార్థులు నడిచారు. బృందావనంలోని గోకులములో పెంచబడుతున్న ఆవులకు అందముగా అలంకరణ చేసి వాటినికూడా ఆ ఊరేగింపులో నడిపిస్తూ తీసికొనివచ్చారు. ఆనాటి ఆ దృశ్యము శ్రీ మద్భాగవతములోని దృశ్యములను తలపింపజేసింది.

భగవాన్ బాబావారు త్రయీ బృందావన ద్వారమువద్దకు చేరుకునేటప్పటికి అంతకుముందు అక్కడ సాంప్రదాయికమైన హోమములు నిర్వహిస్తున్న ఋత్విక్కులు స్వామికి ఎదురేగి పూర్ణకుంభముతో స్వాగతం పలికారు. త్రయీ బృందావన ప్రారంభోత్సవమునకు ముందు భగవాన్ బాబావారు నూతన మందిర నిర్మాణములో పాలుపంచుకున్న ప్రతి ఒక్కరికి కానుకలను అనుగ్రహించారు. వారిలో బొంబాయికి చెందిన శిల్పి శ్రీ అతాలే, బ్రిగేడియర్ బోస్, భవన నిర్మాణమును పర్యవేక్షించిన శ్రీ విమలనాథన్ మరియు మందిరములో అలంకరణకు అపురూప కళాఖండములను, దారు శిల్పములను సమర్పించిన శ్రీ నటేశన్ మరియు శ్రీ సుకుమారన్ వంటి ప్రముఖులు ఉన్నారు. ఆ తరువాత స్వామి రిబ్బన్ కత్తిరించి, 'త్రయీ బృందావనం' అనే పేరు చెక్కబడిన శిలాఫలకమును ఆవిష్కరించి నూతన మందిరమునకు ప్రారంభోత్సవం చేశారు. భగవాన్ లోపల అడుగుపెట్టగానే ఆ చుట్టుప్రక్కల హర్షాతిరేకంతో జయజయధ్వానాలు మిన్నుముట్టాయి. ఆ సందర్భంలో కొంతమంది పత్రికా విలేకరులు స్వామిని ఏదైనా సందేశమివ్వండని కోరగా స్వామి తెలుగులో "మీ ఆనందమే నా ఆనందము", అని చిరునవ్వు నవ్వారు. ఈ త్రయీ బృందావన

మందిర నిర్మాణము, అనేకమంది భక్తుల ప్రేమపూర్వక శ్రమదాన ఫలితమని వారికి చెప్పారు. ఈ సందర్భంగా స్వామి, శ్రీరామావతార కాలంలో వానరులు, ఉడుతలు, ఇంకా అనేకమంది భక్తులు సేతు బంధన కార్యములో శ్రీరామచంద్రునికి ఏవిధంగా సహాయపడినారో గుర్తు చేశారు.

అశేష భక్తజన సందోహంలో ఆనందోత్సాహములు వెల్లివిరిసిన ఆ శుభదినాన వేలాదిమంది నారాయణులకు విందు భోజనం ఏర్పాటు చేయబడింది. పెద్ద సంఖ్యలో వృద్ధులు మరియు వికలాంగులకు వస్త్రదానం జరిగింది. ఆ రోజు సాయంత్రం మందిర ప్రాంగణమునకు, సాయిరాం మంటపమునకు మధ్య గల సువిశాలమైన బహిరంగ ప్రదేశము వేలాదిమంది భక్తులతో ఇసుకవేస్తే రాలనంతగా క్రిక్కిరిసిపోయింది. సుప్రసిద్ధ గాయకులు, సంగీత విద్వాంసుల హృదయాలను కదిలించే భక్తిరసభరితమైన గానముతో వాతావరణమంతా నిండిపోయింది. భక్తులు తనివితీరా తమ ప్రియతమ ప్రభువు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి అమృతమయమైన దర్శనం చేసుకున్నారు. 'దైవం మానుష రూపేణ' అవతరించిన భగవాన్ బాబావారి దివ్యసన్నిధిలో ఆనాడు సుప్రసిద్ధ కర్ణాటక సంగీత విద్వాంసురాలు శ్రీమతి ఎమ్.ఎస్. సుబ్బులక్ష్మి, ప్రఖ్యాత గాయనీమణులు శ్రీమతి ఎస్. జానకి మరియు శ్రీమతి పి. లీల హృదయపూర్వకంగా గానం చేశారు. ఆ పవిత్ర వాతావరణంలో సుప్రసిద్ధ వయొలిన్ విద్వాంసుడు పండిట్ జోగ్ తమ వాద్య సంగీతముతో శ్రోతలను ఆనందపారవశ్యంలో ముంచివేశారు.

ఆ విధంగా వేలాది భక్తుల హృదయ కమలములు వికసించిన ఆ పవిత్ర బృందావన ప్రాంగణంలో త్రయీ బృందావన నూతన మందిరమనే పద్మము వికసించింది.



II

"నమే పార్థాస్తి కర్తవ్యం....."

నోబెల్ బహుమతి గ్రహీత మరియు యునైటెడ్ కింగ్‌డమ్‌లోని రెకిన్ ట్రస్టుకు అధ్యక్షులు అయిన సర్ జార్జి ట్రెవిలియన్ 1983వ సంవత్సరం అక్టోబరు 30, 31వ తేదీలలో ఇటలీలోని రోమ్ నగరములో జరిగిన శ్రీ సత్యసాయి సేవా సంస్థల అంతర్జాతీయ సమావేశములో ప్రసంగిస్తూ మానవజాతి సమైక్యతవైపు పయనించే మహాప్రస్థానమును గురించి అత్యంత ఆశావహమైన భావము వ్యక్తము చేశారు. ఈ సందర్భంగా ఆయన "భగవంతుడు ఇందుకొరకు ఒక ప్రణాళిక రచించి దానిని అమలు చేస్తున్నాడు" అని ఉద్ఘాటించారు.

దక్షిణ అమెరికాలోని ఆర్జెంటీనా, చిలీ దేశములనుండి ఆస్ట్రేలియా, న్యూజీలాండు దేశములవరకు గల సువిశాల ప్రాంతములో గల 34 దేశముల నుండి 800 మంది మరియు ఇటలీ దేశమునుండి 1200 మందికి పైగా ప్రతినిధులు హాజరైన ఆ అంతర్జాతీయ సమావేశములో ఉత్తేజకరంగా ఉపన్యసిస్తూ సర్ జార్జి మానవాళికి భగవాన్ బాబావారు అనుగ్రహించిన అభయ వాక్కును జ్ఞప్తికి తెచ్చుకుంటూ భగవాన్ తప్పక తమ వాగ్దానమును నెరవేర్చుకుంటారని విశ్వాసమును వెలిబుచ్చారు :

"అవతారవాణిని ఆలకించండి : 'భగవత్సాన్నిధ్యమునకు చేర్చే ప్రాచీనమైన రహదారిని మరమ్మత్తు చేయడానికే నేను అవతరించాను. అవతార పురుషుల సంకల్పమునకు తిరుగులేదు. వారు సంకల్పించినది నెరవేరి తీరవలసిందే! వారి ప్రణాళిక అమలు జరిగి తీరవలసిందే! మానవజాతి చరిత్రలో అసత్యము పరాజయము పొంది, సత్యమునకు విజయము చేకూరి, ధర్మము రాజ్యమేలుతూ, సచ్ఛీలమువలన శక్తి పెంపొందే సువర్ణాధ్యాయమును లిఖించడానికి నేను అవతరించాను. అది జరిగిననాడు కేవల విషయ పరిజ్ఞానము, పరిశోధనా

నైపుణ్యము మరియు ధనమునకు విలువ తగ్గి విజ్ఞాన, సుజ్ఞాన, ప్రజ్ఞానములకు పట్టము కట్టడం జరుగుతుంది".

రెండు సంవత్సరముల తరువాత లండన్ నగరములోని వెస్ట్ మినిష్టర్ సెంట్రల్ హాలులో జరిగిన వేరొక సమావేశంలో ప్రసంగిస్తూ సర్ జార్జి ట్రెవిలియన్ "మానవజాతి చరిత్రలో అత్యంత అసాధారణమైన పరిణామమును మనము ఈనాడు చూస్తున్నాము. ఒక ప్రక్కన అన్నిరకాల దుష్టశక్తులు స్వైరవిహారం చేస్తూ ప్రపంచానికి తీరని నష్టం కలుగ జేస్తూ భయోత్పాతమును పుట్టిస్తూంటే మానవజాతి నిరాశా, నిస్పృహలతో క్రుంగిపోతోంది. వేరొకప్రక్క ఈ మహా సంక్షోభ సమయంలో భగవంతుడు మన మధ్య సంచరిస్తూ తన అవతార కార్యక్రమాన్ని నెరవేరుస్తున్నాడని, ఆయన వ్యాప్తిచేసే ప్రేమ సందేశమువలన మానవజాతికి తరుణోపాయము లభిస్తుందనే ఎఱుకవలన ఒక మహోన్నత ఆశాకిరణము పొడసూపుతున్నది", అని ఒక గొప్ప ప్రకటన చేశారు. ఈ సందర్భంగా ఆయన భగవాన్ బాబావారి "నేను ఎల్లప్పుడు మీతోనే ఉన్నాను. మీ హృదయమే నా మందిరము. ప్రపంచమే నా భవనము. నా అస్తిత్వమును శంకించేవారు కూడా నావారే! నన్ను ఏ పేరుతోనైనా పిలవండి; పలుకుతాను. నన్ను ఏ రూపముతోనైనా ధ్యానించండి; ఆ రూపముతో మీ ముందు సాక్షాత్కరిస్తాను. ఎవరినీ దూషించకండి; ఎవరికి హాని కలిగించకండి. ఆ విధంగా చేసినప్పుడు వారిలో అంతర్యామిగా ఉన్న నన్ను దూషించినట్లే అవుతుంది", అనే వాక్యములు ఉదాహరించారు.

1983వ సంవత్సరం అక్టోబరు నెల 30వ తేదీన రోమ్ నగరములో జరిగిన ఆ అంతర్జాతీయ సమావేశమును శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క వైస్ ఛాన్సెలరు అయిన డా॥ వి.కె. గోకాక్ ప్రారంభిస్తూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య సందేశమును ప్రతినిధులకు చదివి వినిపించారు. ఆధునికయుగంలో మానవజాతి ఎదుర్కొంటున్న రుగ్మతలకు నివారణోపాయమును సూచిస్తూ భగవాన్ బాబావారు పంపిన దివ్య సందేశము ఈ విధంగా ఉన్నది:

"దివ్యాత్మ స్వరూపులారా! 'అన్ని మార్గములు రోము నగరమువైపే దారి తీస్తాయి' అనే ప్రాచీన సూక్తి ఈనాడు ఋజువైంది. చరిత్రాత్మకమైన ఈ నగరంలో ఈనాడు ప్రపంచములోని వివిధ దేశములనుండి అనేక వందలమంది ప్రతినిధులు సమావేశమైనారంటే, అందుకు కారణం లేకపోలేదు. మీరింతకుముందు ఎన్నడూ కని, విని యెరుగని విషయాలను తెలుసుకోవడానికి, మానవజాతి పురోగమనానికి అవసరమైన నూతనాదర్శములను నేర్చుకుని వాటినుండి స్ఫూర్తిని పొందడానికి మీరిక్కడ సమావేశమయ్యారని గ్రహించాలి.

అపూర్వమైన ఈ అంతర్జాతీయ సమావేశము ఏ ఒక్క మతము, జాతి, దేశము, వర్ణము లేక వ్యక్తికి మాత్రమే పరిమితమైనది కాదు. ప్రపంచములోని సర్వ మతగ్రంథములు బోధించే మౌలికమైన సత్యమును వెల్లడించడానికి మరియు సత్య, ధర్మముల స్థాపన ద్వారా సమస్త మానవజాతియొక్క శాంతి, సంక్షేమములకొరకు కృషిచేసే ఉద్దేశ్యముతో ఈ సమావేశము ఏర్పాటు చేయబడినది.


మానవజాతికంతా ఒకే మతము; అదే ప్రేమ మతము. మానవులందరికీ ఒకే తండ్రి; ఆయనే భగవంతుడు. భగవంతుని బిడ్డలైన మానవులందరూ సోదరులు. 'ఈశ్వర పితృత్వము, మానవ సోదరత్వమే' ఈ సమావేశముయొక్క దీక్షావాక్యము. అందువలన, ఒక రకంగా చెప్పాలంటే ఈ సమావేశము ఒక కుటుంబ సభ్యుల సమావేశము వంటిది. ఇది వివిధ దేశముల, మతముల సమావేశము కానే కాదు. ఇది, వివిధ ఆలోచనా ధోరణులు కలిగిన వ్యక్తులయొక్క సమావేశము. ఇది ఏ ఒక్క సంస్కృతి లేక తత్త్వమునకు సంబంధించినది కాదు. ఇది, సమస్త మతములలోను అంతర్లీనముగానున్న దివ్య జీవన విధానమును వెలికి తెచ్చేందుకు ఏర్పాటు చేయబడిన సమావేశము.

దేశ, కాలపరిస్థితులకు అతీతమైన, సర్వమతములు బోధించే మౌలికమైన సత్యము ఒక్కటే! ఆ సత్యమును వివరించే తాత్త్విక చింతనలు, ఆ సత్యాన్వేషణలో అనుసరించే ఆచరణ విధానములు, పద్ధతులు వేరుకావచ్చు. కాని, వాటన్నిటి లక్ష్యము, ప్రయోజనము ఒక్కటే. ప్రపంచములోని సర్వమతములు

దివ్యత్వమొక్కటేనని ఘోషిస్తాయి; జాతి, మత, కుల, వర్ణ దేశములకతీతంగా విశ్వవ్యాప్తమైన ప్రేమతత్వమును అలవరచుకోమని బోధిస్తాయి. ఈ మౌలికమైన సత్యమును తెలుసుకోలేనివారు దివ్యత్వమును భిన్నభిన్నంగా నిర్వచిస్తూ ప్రపంచమును అయోమయస్థితికి గురిచేస్తూ అరాచకమును సృష్టిస్తున్నారు. అనంతమైన దివ్యత్వమును ఆవిధంగా విభజిస్తూ సంకుచితమైన ఆలోచనలకు పరిమితం చేయడం దైవాపరాధమే అవుతుంది. ఆధ్యాత్మికపరమైన, భగవద్భక్తితో నిండిన జీవితమునకు ఆధారము మానవుని అంతరంగములో అధివసించియున్న అంతరాత్మయే!

ఇతర మతములయందు సహనము, గౌరవభావము లేని వ్యక్తి తన మతమును సరిగా అనుసరించనివాడే అవుతాడు. కేవలం తన మతసూత్రములను మాత్రం తు.చ. తప్పకుండా పాటిస్తే సరిపోదు; సర్వమతైకభావమునుకూడా అలవర్చుకోవడానికి కృషిచేయాలి. అటువంటప్పుడే మానవుడు దివ్యత్వముయొక్క ఏకత్వమును గుర్తించగలుగుతాడు. మత విషయాలలో ఎటువంటి నిర్బంధము లేక ఒత్తిడి ఉండకూడదు. మతమునకు సంబంధించిన విషయాలను ప్రశాంత వాతావరణంలో నిష్పక్షపాతముగా చర్చించుకోవాలి. ఒకరి మతము గొప్పదని, వేరొకరి మతము హీనమైనదనే ఆలోచన ఎన్నడూ పెట్టుకోకూడదు. మతపరమైన సంఘర్షణలను పూర్తిగా విడనాడాలి. మతపరంగా మానవులను విభజించడం మానవజాతి యందు అపరాధమే అవుతుంది.


వ్యక్తి, సమాజము రెండూ కూడా భగవత్సంకల్పమువలన జనించినవేనని, విశ్వమంతా దివ్యత్వముతో నిండియున్నదని మానవజాతి గ్రహించాలి. ఈ సత్యమును గ్రహించినప్పుడే తన అహంకారమును దూరము చేసుకుని మానవుడు కర్తవ్య పరాయణుడవుతాడు. సమాజము స్వార్థపరులకు నిలయము కాకూడదు; దివ్యప్రేరణచే ఉత్తమ, ఉన్నత జీవితాలను గడిపే ఆదర్శ వ్యక్తులతో కూడిన సంస్థ కావాలి.







"నిరంతర కార్యశీలి భగవాన్ బాబా"



"మానవులందరికి ఈశ్వరుడే తండ్రి"

కేవలం భౌతిక సుఖములను సాధించడం మాత్రమే సామాజిక జీవనముయొక్క లక్ష్యము కాకూడదు. కేవలం ప్రాపంచిక సుఖాలను అనుభవించడమే లక్ష్యంగా పెట్టుకున్న వ్యక్తులతో కూడిన సమాజములో శాంతి, సామరస్యములు మృగ్యమైపోతాయి. ఒకవేళ వాటిని సాధించగలిగినా ఆ శాంతి, సామరస్యములు తాత్కాలికమైనవే! దానికి కారణం, అటువంటి సమాజములో బలవంతులు తమ స్వార్థముకొరకు బలహీనులను అణగద్రొక్కడం జరుగుతుంది. అదే విధంగా ప్రకృతిలోని సంపదను అందరికి సమానంగా పంచాలనే ఆలోచనకూడా సమాజంలో నామమాత్రపు సమానత్వమునే నెలకొల్పగలుగుతుంది. మానవులయొక్క కోరికలు మరియు వారి వారి సామర్థ్యమును పరిగణనలోనికి తీసుకుంటే అవి మనిషిమనిషికి మారతాయి. అటువంటప్పుడు ప్రాపంచికమైన వస్తువులు, సంపద సమానంగా పంచడం వలన మానవుల మధ్య సమానత్వము ఏవిధంగా నెలకొంటుంది? అందువలన, మానవులలో ఆధ్యాత్మిక దృక్పథమును అభివృద్ధి చేయడం మరియు మానవుని మనస్సును ప్రాపంచికమైన వస్తువులనుండి ప్రతి ఒక్కరి హృదయమందిరములోను అధివసించియున్న దివ్యత్వముపైపు మళ్ళించడంద్వారా కోరికలను అదుపు చెయ్యాలి. ప్రాపంచికమైన వస్తువులయందు తనకు గల ప్రేమను భగవంతునియందు ప్రేమగా మార్చుకోవడంద్వారా మానవుడు దివ్యత్వ అనుభూతిని పొందగలడు. ఈ అనుభూతి మానవుడు సాధించలేనిది, మానవునికి అతీతమైనది కాదు. నిజానికి, ఇది మానవుని స్వభావములో ఒక భాగమే! అదే మానవునిలోని మానవత్వము మరియు దివ్యత్వముయొక్క రహస్యము.

ప్రకృతి మరియు విశాల విశ్వమును గురించి సమస్తము తనకు తెలుసునని మానవుడు ఈనాడు భావిస్తున్నాడు. అయితే, తన్ను తాను తెలుసుకోకుండా ఈ విజ్ఞానమునంతా సంపాదించడంవలన కలిగే ప్రయోజనమేమిటి? తన్ను తాను తెలుసుకోగలిగిననాడే మానవుడు బాహ్య ప్రపంచమును గురించిన సత్యము తెలుసుకోగలడు. బాహ్యప్రపంచమును పరిశోధించి తెలుసుకోవడం

ద్వారా మానవుడు తన అంతరంగములోని నిత్య సత్యమును తెలుసుకోలేడు. తన దృష్టిని అంతర్ముఖం చేసి తనయందున్న దివ్యత్వమును తెలుసుకోగలిగిననాడు, మానవుడు సృష్టిలోని సమస్త జీవులయందు సమభావమును పెంపొందించుకోవడంద్వారా అనిర్వచనీయమైన ఆనందమును అనుభవించగలడు".

మానవజాతి చరిత్రలో ఒక నవయుగానికి నాంది పలికే ఆ అంతర్జాతీయ సమావేశములో ఉపన్యసించడానికి అతిథులుగా ఆహ్వానింపబడిన ముగ్గురు వక్తలలో సర్ జార్జి ట్రెవిలియన్ ఒకరు. ఆయన "మానవజాతియొక్క ఐక్యతను సాధించడం" (Towards Human Unity) అనే అంశమును గురించి ప్రసంగించారు. రెండవ వక్త, అమెరికాలోని జార్జియా రాష్ట్రములో లేక్‌మౌంట్‌వద్ద గల 'సెంటర్ ఫర్ స్పిరిట్యుయల్ ఎవేర్‌నెస్' (Centre for Spiritual Awareness) సంస్థకు వ్యవస్థాపక అధ్యక్షులైన శ్రీ యూజీన్ రాయ్ డేవిస్. ఆయన ప్రసంగ విషయం, "వేగంగా జాగృతమవుతున్న వర్తమాన ప్రపంచంలో ఆధ్యాత్మికపరమైన బాధ్యతలు" (Spritual responsibilities in our fast awakening world). ఇక మూడవ వక్త, యునైటెడ్ కింగ్‌డమ్ మరియు ఇతర దేశాలలో సియర్రాలియోన్ దేశము తరపున గతంలో రాయబారిగా పనిచేసిన శ్రీ విక్టర్ కానూ. ఆయన 'మానవజాతియొక్క ఆశాజ్యోతి, శ్రీ సత్యసాయిబాబా' (Sri Sathya Sai Baba, the hope of Mankind) అనే అంశముపై ప్రసంగించారు.

ఆ సమావేశములో మొత్తం 5 ప్రసంగ పాఠములపై (themes) చర్చ జరిగింది. ఇందుకొరకు ప్రతినిధులందరూ 5 కమిటీలుగా విడిపోయి ఒక్కొక్క కమిటీ ఒక్కొక్క అంశమును గురించి చర్చించింది. చివరగా, ఆయా కమిటీలయొక్క చర్చల సారాంశమును ఆయా కమిటీల అధ్యక్షులు సమావేశమునకు నివేదించారు :

1. 'మానవజాతియొక్క ఐక్యత' (The Unity of Mankind) ను గురించి
   శ్రీ వి.కె.నరసింహన్
2. 'నిత్యజీవితంలో సాయి ఆదర్శములు' (Sai Ideals in daily life) ను గురించి
   డా॥ జాన్ హిస్లాప్
3. 'శాస్త్ర విజ్ఞానము - ఆధ్యాత్మికత' (Science and Spirituality) ను గురించి
   డా॥ శామ్యూల్ శాండ్వీస్
4. 'సర్వమతముల సారాంశము' (The Essence of all Religions) ను గురించి
   శ్రీ హోవర్డు మర్ఫెట్
5. 'మానవుని గుణములు మరియు దివ్యత్వము (Human Qualities and Divine Nature) ను గురించి
   శ్రీ వి. శ్రీనివాసన్.

అప్పట్లో 'సనాతన సారథి' మాసపత్రికకు సహసంపాదకులైన శ్రీ వి.కె. నరసింహన్, డా॥ వి.కె. గోకాక్‌తో కలిసి ఆ సమావేశములో పాల్గొనడానికి భారతదేశమునుండి రోము నగరమునకు ప్రయాణమై వెళ్ళారు. అక్కడ ఆయనకు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి సర్వ వ్యాపకత్వమునకు నిదర్శనగా ఒక అద్భుతమైన అనుభవం కలిగింది. ఆ దివ్యలీల ఆ సమావేశములో పాల్గొన్న ప్రతినిధులందరికి చర్చనీయాంశమైంది. ఆ దివ్యలీలకు ప్రత్యక్షసాక్షిగా నిలిచిన ఆస్ట్రేలియా దేశమునకు చెందిన డా॥ సారా పవన్ మాటలలోనే ఒడలు గగుర్పొడిచే ఆ సంఘటనను గురించి విందాం :

"ఇప్పుడు నేను వివరించబోయే సంఘటన రోమ్ నగరములో జరిగింది. నేను శ్రీ వి.కె. నరసింహన్‌ను అక్టోబరు 27వ తేదీన ఎర్గిఫ్ హోటలులో కలుసుకుని నేను సంపాదకత్వము వహిస్తున్న ఆస్ట్రేలియా దేశమునకు చెందిన శ్రీ సత్యసాయి న్యూస్ లెటర్ వార్షిక సంచికయొక్క ప్రచురణకు సిద్ధముగానున్న కాపీని ఆయనకు ఇచ్చి అది ఆశించిన ప్రమాణములకు అనుగుణంగా ఉన్నదో లేదో చూడుమని కోరాను. శ్రీ నరసింహన్ ఆ కాపీని చూడడానికి అంగీకరించి

తన కళ్ళద్దాలకొరకు అటూ ఇటూ చూచారు. అయితే, కళ్ళజోడు తాలూకు పెట్టె అక్కడే ఉన్నా అందులో కళ్ళజోడు మాత్రం లేదు. ఆ చుట్టుప్రక్కల ఎంత వెతికినా కనపడలేదు. దానిని బయలుదేరేముందు బెంగుళూరులోని వైట్‌ఫీల్డులో బృందావన ఆశ్రమంలో గల తన ఫ్లాట్‌లో పొరపాటున వదిలేసి వచ్చేశానేమోనని ఆయన చాలా కంగారుపడిపోయారు. బెంగుళూరునుండి బయలుదేరే రోజున ఆయన రెండుసార్లు పాస్‌పోర్టు ఆఫీసుకు వెళ్ళవలసియుండడంచేత ఆయన చాలా హడావుడిగా ఎయిర్‌పోర్టుకు బయలుదేరారు. అందువలన ఇప్పుడు తన కళ్ళజోడు లేకపోతే నేను తనకిచ్చిన కాగితాలు చదవడం మాట అటుంచి, అసలు ఈ సమావేశములో తాను పాల్గొనేది ఎట్లా, అని ఆయన చాలా గాభరాపడ్డారు.

ఆ మరునాడు ఉదయం నేను ఆయనను హోటలులో కలుసుకున్నాను. మేమిద్దరం ఒక బల్లపై కూర్చుని స్వామివద్దకు ఏ సందర్భంలో ఏ విధంగా వచ్చామో మాట్లాడుకుంటున్నాము. ఇంతలో హఠాత్తుగా ఏదో వస్తువు మా ఇద్దరిమధ్య ఉన్న దిండుపై పైనుండి క్రిందపడినట్లు మాకు శబ్దము వినిపించింది. అదేమిటని చూస్తే, అక్కడ నల్లఫ్రేములో బిగింపబడిన కళ్ళద్దాలు ఉండడం చూచి మేము చాలా ఆశ్చర్యపోయాము. అప్పుడు శ్రీ నరసింహన్ దిండుమీద పడిన ఆ కళ్ళజోడు కేసి పరీక్షగా చూచి "ఈ కళ్ళజోడు నాదే! చూశారా, స్వామి మన వెంటే ఉన్నారు!", అని ఆశ్చర్యపడిపోతూ చెప్పారు. ఆయన ఈ మాటలు అంటూండగానే 'ఏదో ఒక అసాధారణమైన విషయం జరుగబోతోందని' నాకు కూడా అనిపించింది. అంతవరకు ఎంత వెదికినా కనిపించని, తాను ఎంతగానో ఆందోళన పడిపోతున్న తన కళ్ళజోడు చాలా అద్భుతంగా అక్కడ ప్రత్యక్షమయ్యేటప్పటికి శ్రీ నరసింహన్‌కు ఆశ్చర్యానందములతో నోట మాటరాలేదు. ఆయన కళ్ళ వెంట స్వామియందు కృతజ్ఞతా పూర్వకమైన కన్నీళ్ళు ధారాపాతంగా కారసాగాయి. రోము నగరంలో నా కళ్ళముందు ప్రత్యక్షంగా జరిగిన ఈ అద్భుత సంఘటన, స్వామియొక్క సర్వవ్యాపకత్వమును

గురించి నామనస్సులో అక్కడక్కడా మిగిలిపోయిన సందేహాలేవైనా ఉంటే వాటిని తొలగించి, పరిపూర్ణమైన విశ్వాసమును నెలకొల్పింది."

ఆ అంతర్జాతీయ సమావేశములో పాల్గొని శ్రీ నరసింహన్ ప్రశాంతి నిలయమునకు తిరిగివచ్చిన తరువాత స్వామి ఆయనను అడిగిన మొట్టమొదటి ప్రశ్న, "నరసింహన్! నీ కళ్ళజోడు ఏమైంది?" అని. దానిని ఎవరో తనకు తెచ్చియిచ్చినట్లు తనకు అనిపించిందని శ్రీ నరసింహన్ స్వామికి విన్నవించుకున్నారు. అప్పుడు స్వామి "నేనే ఆ కళ్ళజోడును బెంగుళూరునుండి రోముకు తీసికొని వచ్చి నీ కిచ్చాను", అని స్వామి ధ్రువపరిచారు.

శ్రీ సత్యసాయి ఉద్యమము ప్రపంచ వ్యాప్తముగా అభివృద్ధి చెందడానికి రోములో జరిగిన శ్రీ సత్యసాయి సేవా సంస్థల అంతర్జాతీయ సమావేశము విశేషంగా దోహదం చేసింది. ఒక విధంగా చెప్పాలంటే, ప్రశాంతి నిలయములో 1985వ సంవత్సరం, నవంబరు 17-21 తేదీల మధ్య భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారి 60వ జన్మదినోత్సవ కార్యక్రమాలలో భాగంగా జరిగిన శ్రీ సత్యసాయి సేవాసంస్థల నాలుగవ ప్రపంచ సమ్మేళనమునకు, రోములో జరిగిన సమావేశము నాందీ ప్రస్తావన వంటిది.

1982వ సంవత్సరములో శ్రీ సత్యసాయి సేవా సంస్థల వరల్డు కౌన్సిలు సభ్యులు 1985వ సంవత్సరము నవంబరు నెలలో జరుపబడే భగవాన్ బాబావారి 60వ జన్మదినోత్సవ వేడుకలను ప్రపంచస్థాయికి సరిపడేటట్లు విస్తృతపరిధిలో జరుపుకోవడానికి అనుమతిని ప్రసాదించవలసిందిగా స్వామిని ప్రార్థించారు. మొదట్లో స్వామి అందుకు విముఖంగా ఉన్నప్పటికి, చివరకు శ్రీ సత్యసాయి సేవా సంస్థలు చేపట్టి నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు అంతకంతకు విస్తరిస్తున్న దృష్ట్యా ఈ జన్మదినోత్సవ వేడుకలు వాటి యొక్క ప్రణాళికా రచనకు, ప్రపంచ వ్యాప్తంగా విస్తృత పరిచేందుకు దోహదం చేస్తాయని, అందువలన భక్తులు, ప్రపంచముకూడా లాభము పొందుతారని స్వామికి విన్నవించుకోగా ఆయన అందుకు అంగీకరించారు.

1970వ సంవత్సరంలో జరిగిన శ్రీ సత్యసాయి సేవా సంస్థల నాలుగవ అఖిల భారత సమావేశమును ప్రారంభిస్తూ భగవాన్ బాబావారు శ్రీ సత్యసాయి సేవా సంస్థలను నెలకొల్పడంలో గల ముఖ్యోద్దేశము తెలియజేస్తూ "వర్ష బిందువులు తమంతట తాముగా తమ మూలస్థానము మరియు లక్ష్యము అయిన సముద్రమును చేరుకోలేవు. అట్టి వర్ష బిందువులు అనేకం చేరి సెలయేళ్ళుగా, నదులుగా తయారై సముద్రములోనికి ప్రవహిస్తాయి. అదే విధంగా, భగవద్భక్తులు ఆనందమనే సాగరమునుండి ఉద్భవించిన వర్షపు బిందువులవంటివారు. అందువలన, వారందరూ కలసి సెలయేళ్ళు, నదులుగా రూపొంది తమ మూలస్థానమును చేరుకోవాలి. శ్రీ సత్యసాయి సేవా సంస్థ, ప్రపంచములోని వివిధ ప్రాంతములనుండి జాతి, మత, కుల, వర్ణ, భాషల కతీతంగా భక్తులందరిని ఒకచోట చేర్చి తిరిగి వారిని తమ మూలస్థానమైన దివ్యత్వమునకు చేర్చే ప్రవాహము వంటిది", అని ఉద్ఘాటించారు. మానవ జీవితగమ్యమైన మోక్షప్రాప్తికై, ముఖ్యంగా భారతదేశములో ప్రాచీనమైన వ్యక్తిగత సాధనను మార్గముగా ఎంచుకునే నేపథ్యంలో ఇందుకొరకై సామూహిక సాధనను ఒక మార్గముగా ప్రవేశపెట్టే ఆలోచన నిజంగా విప్లవాత్మకమైనది. మానవుడు వ్యక్తిగతమైన తన మోక్షసాధనలో సామాజిక ప్రయోజనమును విస్మరించరాదు. వ్యక్తి ప్రయోజనం, సామాజిక ప్రయోజనం రెండూ ఒకదానితో ఒకటి చేరియున్నటువంటివి. అందువలన, ఆ రెండూ కలసే ఉండాలి. మన శాస్త్రాలు ఘోషిస్తున్నట్లు మానవ జీవిత పరమార్థము, "ఆత్మనో మోక్షార్థం, జగద్ధితాయచ"(For the liberation of one's own self and for the good of the world). భారతదేశములోకాని, ప్రపంచములోకాని సమాజసేవయొక్క ఆధ్యాత్మిక ప్రయోజనమును ఇంతవరకూ ఎవరూ భగవాన్ బాబా వారివలె అంత చక్కగా వెలుగులోనికి తీసికొని రాలేదు. భక్తులందరూ కలసి సామూహికంగా సేవాసాధనలో ముందుకు పయనిస్తూ సేవద్వారా తమ లక్ష్యమైన మోక్షపదమును చేరుకోమని భగవాన్ బాబా వారు ఇచ్చిన పిలుపు శంఖారావమై శ్రీ సత్యసాయి సేవా సంస్థకు ఒక క్రొత్త ఊపు ఇచ్చింది. అప్పటికి

శ్రీ సత్యసాయి సేవా సంస్థ ఆవిర్భవించి కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే అయ్యింది.

ఆ తరువాత 15 సంవత్సరాలలో ప్రపంచమంతటా నెలకొన్న శ్రీ సత్యసాయి సేవా సంస్థల అభివృద్ధి ప్రశాంతి నిలయంలో 1985వ సంవత్సరము నవంబరు నెలలో జరిగిన నాలుగవ ప్రపంచ సమ్మేళనంలో స్పష్టంగా గోచరించింది. ఆ సమావేశంలో 46 దేశాలకు చెందిన 13,000 మందికి పైగా ప్రతినిధులు మరియు 4,00,000 మంది భక్తులు పాల్గొన్నారు. ఆ సమావేశముయొక్క చర్చనీయాంశము "Integration of the world community" ('ప్రపంచ ప్రజల సమైక్యత'). కేవలం 14 సంవత్సరాల బాలునిగా అలనాడు తన అవతార ప్రకటన చేస్తూ మానవజాతి హృదయాలలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు నాటిన ఆ బీజము 45 సంవత్సరాల తరువాత ఒక మహావృక్షమై శాఖోపశాఖలుగా విస్తరించింది.

ఆ ప్రపంచ సమ్మేళనము మరియు భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి 60వ జన్మదిన వేడుకలలోను పాల్గొనడానికి వచ్చిన అసంఖ్యాకమైన ప్రతినిధులు మరియు భక్తులకు పూర్ణచంద్ర సభా మంటపములో స్థలము సరిపోనందున, సమావేశముయొక్క ప్రారంభోత్సవము తప్పించి మిగిలిన అన్ని ఉత్సవాలు అక్కడకు దగ్గరలో ఉన్న హిల్ వ్యూ స్టేడియంలో జరుపబడినాయి. 1984వ సంవత్సరములో జరిగిన సేవాదళ్ సమావేశము తరువాత శ్రీ సత్యసాయి సేవా సంస్థల నాలుగవ ప్రపంచ సమ్మేళనము మరియు 60వ జన్మదిన వేడుకలు నిర్వహించడానికి వీలుగా హిల్ వ్యూ స్టేడియంను తీర్చిదిద్ది తయారుగా ఉంచడంలో భగవాన్ బాబా వారు ప్రత్యేక శ్రద్ధ వహించారు. దానికి కారణం, వాటిలో పాల్గొనే లక్షలాది భక్తులకు ఆశ్రయం కల్పించగలిగేది అదొక్కటే! ఆ స్టేడియం నిర్మాణంలో స్థలమును లెవెల్ చేయడం, శుభ్రపరచడం, శాంతి వేదికను నిర్మించడం మరియు కొండవాలులో గేలరీలను నిర్మించడంతో సహా అతి చిన్న విషయాలలో కూడా భగవాన్ బాబా వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తాము స్వయంగా అన్ని పనులను పర్యవేక్షించారు.

పూర్ణచంద్ర సభామంటపములో నవంబరు 17వ తేదీ ఉదయం సమావేశమైన ప్రపంచ సమ్మేళనములో పాల్గొనే ప్రతినిధులకు స్వాగతం పలుకుతూ నలభై సంవత్సరాలకు పైగా భగవాన్ బాబా వారికి సన్నిహితుడై మెలగిన, ఒక చిన్న మొక్కగా ప్రారంభమై ప్రపంచములోని అన్ని ఖండములలో గల అన్ని దేశాలకు విస్తరించి ఒక మహావృక్షముగా ఎదిగిన సాయి ఉద్యమమును ప్రత్యక్షంగా వీక్షించిన వ్యక్తి అయిన శ్రీ ఎన్. కస్తూరి భావోద్రేకముతో గద్గదమైన కంఠముతో "1968వ సంవత్సరములో జరిగిన సత్యసాయి సంస్థల ప్రథమ ప్రపంచ సమ్మేళనములో అవతార పురుషుని శాంతి సౌభాగ్యముల పిలుపును అందుకుని అక్కడ సమావేశమైన ప్రతినిధులతో స్వామి భగవంతునికి మానవుడు ఆపాదించే సర్వరూపనామములు తనలో ఇమిడి యున్నాయని ప్రకటించారు. ఈనాడు మనందరం ఇక్కడ సమావేశమైనది, నాలుగవ ప్రపంచ సమ్మేళన సందర్భంగా. ప్రపంచములోని అన్ని ఖండములనుండి వచ్చి ఇక్కడ సమావేశమైన అసంఖ్యాకమైన ప్రతినిధులు, భక్తులను చూస్తూంటే ప్రపంచములో లోభము, మదము, ద్వేషము అనే విషములకు ప్రేమ, సేవ మరియు శాంతి అనే సాయిసందేశమొక్కటే విరుగుడు అని లక్షలాది ప్రజలు అంగీకరించినట్లు గోచరిస్తున్నది. ఈ ప్రపంచ సమ్మేళనములోని చర్చనీయాంశము 'ప్రపంచ ప్రజల సమైక్యత'. నిజంగా మనందరం తమ దివ్యసంకల్పముచే మానవజాతినంతటిని ఏకము చేయగల భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్యసన్నిధిలో ఉన్నాము", అని ఉద్ఘాటించారు.

1967-1975 సంవత్సరాలమధ్య అఖిల భారత శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రప్రథమ అధ్యక్షులు మరియు 1975వ సంవత్సరమునుండి వరల్డుకౌన్సిలు చైర్మనుగా పనిచేస్తున్న శ్రీ ఇందూలాల్ షా తన ప్రసంగములో ప్రారంభమునుండి గత 20 సంవత్సరములలో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు సాధించిన అభివృద్ధిని విశదీకరించారు. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ "ఈ ఇరవై సంవత్సరాలలో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు భగవాన్ బాబావారి అవతారోద్యమంలో కేవలం ఒక భాగము మాత్రమేననే విషయము బుజువైంది.

ఇంకా, ఆయన మనకు తెలియని వివిధ స్థాయిలలో విభిన్న భూమికలు నిర్వహిస్తున్నారు. తనదైన విశిష్ట శైలిలో అనేక కార్యక్రమాలు నడిపిస్తున్నారు. శ్రీ సత్యసాయి సేవా సంస్థలు పూర్తిగా భగవాన్ బాబావారిపై ఆధారపడి ఆయన కనుసన్నలలో పని చేస్తున్నా, ఆయన మాత్రం సంస్థపై ఆధారపడి, సంస్థను నమ్ముకుని తన అవతారోద్యమాన్ని నడిపించడంలేదన్నమాట మాత్రం నిజం", అని ప్రకటించారు.

తరువాత భగవాన్ బాబావారు ఈ ప్రపంచ సమ్మేళనమును ప్రారంభిస్తూ తమ దివ్యోపన్యాసములో "నిస్వార్థసేవ ఒక్కటే సాయికి ప్రీతిని కలిగించేది", అని స్పష్టం చేశారు. సేవా సాధనయొక్క విశిష్టతను తెలియజేస్తూ కర్మయొక్క లక్ష్యము, జ్ఞానము. అలాగే జ్ఞానమునకు ఆధారము కర్మ. ఈ రెంటిని ఏకము చేసి ఆచరణలో చూపించడమే సేవ. అదే నిస్వార్థసేవ. సేవకు మించిన ఆధ్యాత్మిక సాధన లేదు. సాక్షాత్తూ త్రిలోకాధిపతియైన శ్రీ కృష్ణపరమాత్మయే మానవుని గమ్యమును నిర్దేశిస్తూ స్వయంగా జంతువులకు, పక్షులకు సేవచేసి ఆదర్శప్రాయుడైనాడు. ఆయన గుఱ్ఱములను, ఆవులను ప్రేమతో సాకాడు. కురుక్షేత్ర మహాసంగ్రామంలో ఆయన ఆయుధం పట్టడానికి నిరాకరించి, కేవలం రథసారథిగా ఉండడానికి నిర్ణయించుకున్నాడు. ఆ విధంగా ఆయన నిస్వార్థసేవ అనే ఆదర్శమును ఆచరణలో చూపాడు.

భక్తులు ఒక మూల కూర్చుని ఊపిరి బిగబట్టి 'సోహం', 'సోహం' అంటూ జపిస్తూ కూర్చోమని ప్రోత్సహించడం సాయితత్త్వం కాదు. 'ఓ సాధకుడా! లే! లేచి నడుం బిగించు! సమాజ సేవలో ప్రవేశించు', అన్నదే సాయి సందేశము. ఇంద్రియాలను అదుపులో ఉంచుకుని సమాజసేవలో ప్రవేశించండి. సేవాభావము లేని జీవితం చీకటి గుడివంటిది. అక్కడ దైవం కాదు, దయ్యాలు దేవులాడతాయి. సేవాజ్యోతియే ఆధ్యాత్మిక సాధకుని జీవితంలో వెలుగు నింపుతుంది.

మీరందరూ ఎంతో డబ్బు ఖర్చుపెట్టుకుని, శ్రమ కోర్చి ప్రపంచములోని సుదూర ప్రాంతములనుండి వచ్చి ఇక్కడ చేరారు. ఇక్కడకు వచ్చినందుకు

మీరు మంచి ఆలోచనలు, ఉన్నత భావాలు అలవరచుకోవాలి. తిరిగి వెళ్ళేటప్పుడు ఇకపై అత్యుత్తమమైన జీవితాలను గడుపుతామని, జీవితాలను ధన్యము చేసుకునే ఉత్తమ కార్యములను చేపడతామని పట్టుదలతో వెళ్ళాలి. ఇదే మీ అందరికి నేను చేసే అనుగ్రహ భాషణం", అని ఉద్బోధించారు.

చివరగా తమ దివ్యోపన్యాసమును ముగిస్తూ భగవాన్ బాబా "నా ఉపన్యాసం ముగించేముందు ఈ సమావేశముయొక్క ప్రాముఖ్యతను తెలియజేసే రెండు ఆదేశములను నేను మీకు ఇవ్వాలనుకుంటున్నాను – ఒకటి, ఇతరులకు చెప్పే విషయాన్ని ముందు నీవు ఆచరించి చూపు, రెండవది, నీవు ఆచరణలో పెట్టని ఏ విషయాన్ని ఇతరులకు బోధించకు. నీవు స్వయంగా ఆచరించని ఏ విషయాన్నైనా ఇతరులకు చెప్పడమంటే, అది మోసమే అవుతుంది. నీవు చెప్పినట్లు చేస్తే, అది నీ విశిష్ట వ్యక్తిత్వమునకు గుర్తుగా ఉంటుంది", అని సలహా యిచ్చారు.

ఆ తరువాత మూడు రోజులలో ప్రతినిధులందరూ కొన్ని సబ్ కమిటీలుగా విడిపోయి సమావేశ చర్చనీయాంశమైన 'ప్రపంచ ప్రజల సమైక్యతను సాధించడం'లో శ్రీ సత్యసాయి సేవా సంస్థలు నిర్వహించవలసిన వివిధ కార్యక్రమాలను గురించి చర్చించారు. ఈ సందర్భంగా వారు చర్చించిన అంశములు, (1) ఆధ్యాత్మిక సాధన, (2) మానవతా విలువల బోధన, (3) బాల వికాస్, (4) సేవాదళ్, (5) గ్రామీణాభివృద్ధి పథకములు మరియు (6) ధార్మిక సంస్థలు (ట్రస్టులు మరియు ఫౌండేషన్లు) నెలకొల్పడం.

ఈ ప్రపంచ సమ్మేళనముయొక్క ముగింపు సమావేశము హిల్‌వ్యూ స్టేడియంలో 21వ తేదీ ఉదయం జరిగింది. ఆ సందర్భంగా సభికులకు స్వాగతం పలుకుతూ అమెరికా దేశమునకు చెందిన వరల్డు కౌన్సిలు సభ్యుడగు డా॥ మైఖేల్ గోల్డ్‌స్టీన్ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సాయి భక్తులందరియొక్క ఆకాంక్షలను భగవాన్ బాబావారికి ఈ విధంగా విన్నవించారు:

"ప్రియతమ భగవాన్ బాబా! మానవులు నివసించే ఈ భువిపై ఉన్న అన్ని ఖండములనుండి, సుదూర ప్రాంతములనుండి, 46 దేశాలనుండి వచ్చి ఇక్కడ సమావేశమైన మీ భక్తులం మేమందరం. మానవ జీవితం అత్యంత విలువైనదని, ఇది మీరు మాకు ప్రసాదించిన అపూర్వమైన దివ్య చైతన్య స్రవంతియని గుర్తించాము. ఈ అమూల్యమైన పవిత్ర నిధిని వ్యర్థము చేయమని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాము. ఈ సమావేశములో తీసుకున్న నిర్ణయాలను అమలు చేయడానికి కృషి చేస్తామని, సాయి భక్తులుగా మాయందు మాకు మరియు మా దేశములోను ప్రపంచమంతటా గల కోట్లాది సోదర సోదరీమణుల విషయంలోను మాకు గల బాధ్యతలను మేము సక్రమంగా నెరవేరుస్తామని మేము ప్రతిజ్ఞ చేస్తున్నాము. సర్వకాల సర్వావస్థలలోను ఈ దైవ కార్యమును అత్యంత విశ్వాసముతో, నైపుణ్యముతో నెరవేర్చగలిగేటట్లు మమ్ములను అనుగ్రహించి ఆశీర్వదింపుడని మేము మిమ్ములను ప్రార్థిస్తున్నాము".

తరువాత వరల్డు కౌన్సిలు ఉపాధ్యక్షులైన శ్రీ వి. శ్రీనివాసన్ సమావేశములో తీసుకున్న నిర్ణయాలు మరియు చేసిన ప్రతిపాదనలను గురించి ఒక సమీక్షను సభకు సమర్పించారు. ఈ సమావేశము మొట్టమొదట సాయిసంస్థలోని సభ్యులంతా ఏకము కావాలని కోరింది. తరువాత, ప్రపంచ ప్రజలందరిని ఐక్యముచేసే కృషిలో మొట్టమొదటి మెట్టుగా మానవజాతి అంతటికి సంబంధించిన ఈ క్రింది కార్యక్రమాలను ప్రతి దేశములోను చేపట్టాలని సూచించింది:

1. జాతీయ ఆరోగ్యము మరియు సంక్షేమము
2. ఆధ్యాత్మిక పునాదిని గట్టిపరచడం
3. అవతార పురుషులైన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య సందేశమును ప్రపంచమంతటా వ్యాప్తిగావించడం
4. కోరికలపై అదుపు

భగవాన్ బాబావారు చరిత్రాత్మకమైన ఆ ప్రపంచ సమ్మేళనమునకు

ముగింపు ఉపన్యాసము ఇస్తూ "నేను ప్రపంచము నుండి ఒకే ఒక కానుకను స్వీకరిస్తాను; అదే, నిస్వార్థ నిర్మల ప్రేమ. ఆ ప్రేమ నిస్వార్థ సేవగా, సర్వ మానవ సోదరభావముగా, దయార్ద్రహృదయముగా, కరుణాభావముగా ప్రతిఫలించాలి" అన్నారు. వర్తమానకాలంలో ప్రపంచము ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను గురించి ప్రస్తావిస్తూ భగవాన్ బాబా "ఈ ప్రపంచ సమ్మేళనంలో ఈనాడు వివిధ దేశములకు, విభిన్న సంస్కృతీ సంప్రదాయములు, వేషభాషలు, ఆహారపుటలవాట్లు మరియు జాతులకు చెందిన ప్రతినిధులు ఇక్కడ సమావేశమైనారు. అయితే, ఈ వైవిధ్యము మీ అందరిలోను స్వతస్సిద్ధముగానున్న దివ్యత్వముయొక్క ఏకత్వ భావనను మరుగుపరచకూడదు. ప్రపంచము ఈనాడు అత్యంత క్లిష్టమైన అనేక సమస్యలతో సతమతమవుతున్నది. ముఖ్యంగా భయము ప్రపంచమంతటా చాలా వేగంగా వ్యాపిస్తున్నది. యుద్ధము, కరువు కాటకాలు, రాక్షసత్వముతో నిండిన జాతి, మత, ప్రాంతీయ విభేదాలు, ఆర్థిక సంక్షోభము, విద్యార్థుల అల్లర్లు, మతపరమైన కొట్లాటలు, మత మౌఢ్యము, అధికార దాహము మరియు అవధులు మించిన అహంకారము మొదలగు అనేక సమస్యల భయం ఈనాడు ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్నది. అంతకంతకు సమాజంలో అన్ని వర్గాలు, స్థాయిలలోనికి చొచ్చుకుపోతున్న ఈ భయాందోళనలకు ఒకే ఒక నివారణోపాయము ఉన్నది; అదే, ఆధ్యాత్మిక దృష్టితో కూడిన వైరాగ్యము. దేహాభిమానం ఉన్నంతవరకు నేను, నాది అనే సంకుచిత స్వభావము వీడనంతవరకు ఈ భయం మానవుని విడిచిపెట్టదు. ఈ బాహ్యప్రపంచములో మనం చూస్తున్నదంతా మన మనస్సుయొక్క కల్పనయేనని, విశ్వము అంతా విష్ణుస్వరూపము తప్ప అన్యము కాదనే అద్వైత భావనయే ప్రపంచము ఈనాడు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటికి పరిష్కారము. నిస్వార్థప్రేమతో చేసిన సేవయే గొప్ప ఆధ్యాత్మిక సాధన", అని ఉద్బోధించారు.

భగవాన్ తమ దివ్యోపన్యాసమును ముగిస్తూ శ్రీ సత్యసాయి సేవా సంస్థల సభ్యులు మరియు కార్యకర్తలకు, ఇంకా అక్కడ సమావేశమైన లక్షలాది భక్తులకు "దివ్యత్వమునకు దశ సూత్ర ప్రణాళిక" (The ten-fold path to Divinity)

పేరుతో నిత్యజీవితంలో ప్రతి ఒక్కరు ఆచరించవలసిన పది సూత్రములను ప్రసాదించారు. వాటిని "జగద్గురువు" అనే శీర్షిక గల ఈ పుస్తకములోని చివరి అధ్యాయములో పొందుపరచడం జరిగింది. శ్రీ సత్యసాయి సేవాసంస్థలు ఆధ్యాత్మిక, విద్య, సేవా రంగములలో ప్రపంచ వ్యాప్తంగా సాధించిన అభివృద్ధిని ప్రతిబింబించే నాలుగవ ప్రపంచ సమ్మేళనము, సాయి ఉద్యమంలో ఒక మైలురాయి. ఈ తరువాత పది సంవత్సరాల కాలంలో సాయి ఉద్యమం నూరు దేశాలకుపైగా వ్యాపించింది. అమెరికా దేశమునకు చెందిన శ్రీమతి బార్బరా బొజాని మాటలలో చెప్పాలంటే "శ్రీ సత్యసాయి సేవా సంస్థల నాలుగవ ప్రపంచ సమ్మేళనం అంతర్జాతీయ ప్రాముఖ్యత గల ఒక మహత్తర సంఘటన. కేవలం భగవాన్ బాబావారియందు తమకు గల ప్రేమ అనే ఒకే ఒక్క కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న లక్షలాది సాధకులు ఒకచోట చేరి జరుపుకున్న ఆధ్యాత్మిక సమావేశం". న్యూయార్కుకు చెందిన మనస్తత్వ శాస్త్రవేత్త డా॥ అల్‌లెవి 'ఈ ప్రపంచ సమ్మేళనం మానవజాతియొక్క ఆధ్యాత్మిక పరిణామక్రమంలో ఒక చరిత్రాత్మకమైన ఘట్టము, ఒక ముఖ్యమైన మలుపు మరియు ప్రధానమైన దశ' అని వ్యాఖ్యానించారు.

ఇక, శ్రీ ఇందూలాల్‌షా సమావేశానంతరం ఆనందాశ్చర్యములతో ఆ నాలుగు రోజుల ప్రపంచ సమ్మేళనంలో తాను పొందిన అద్భుత అనుభవాలను నెమరు వేసుకుంటూ "ఈ ప్రపంచసమ్మేళనం జరుగడానికి సుమారు ఒక సంవత్సరంముందు నేను భారతదేశములోను మరియు విదేశాలలోను గల సాయి సెంటర్లు, యూనిట్లు, చారిటబుల్ ట్రస్టులు మరియు విద్యాసంస్థలకు సంబంధించిన అన్ని వివరాలను భగవాన్ బాబావారికి సమర్పించాను. వాటిలోనుండి ఈ ప్రపంచసమ్మేళనంలో పాల్గొనడానికి అర్హులైన వ్యక్తులను ఎంపికచేసే విషయంలో నేను భగవాన్ బాబావారి సలహాను, మార్గదర్శకత్వమును అర్థించాను. కనీసం ఒక యూనిట్‌నుండి ఒక ఆఫీసు బేరర్‌ను ఎంపిక చేసినా సుమారు 10,000 మందికి పైగా డెలిగేట్లు (ప్రతినిధులు) ఈ సమావేశంలో పాల్గొనడానికి అర్హులవుతారని తేలింది. ప్రపంచ చరిత్రలో ఎక్కడా ఈ విధంగా

ఒక అవతార పురుషుని దివ్యసన్నిధిలో ఇంతటి విస్తృత స్థాయిలో ఒక ఆధ్యాత్మిక సంస్థయొక్క కార్యకర్తల సమావేశము జరిగిన దాఖలాలు మనకు కనపడవు. ఒక మహత్తరమైన ఆధ్యాత్మిక విప్లవమునకు నాంది పలికే ప్రపంచవ్యాప్తమైన మన సత్యసాయి సేవాసంస్థయొక్క బ్రహ్మాండమైన పరిమాణము (size) ను చూచి నేను ఆశ్చర్యపడిపోతున్నాను", అని వ్యాఖ్యానించారు.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య సంకల్పము మరియు అనుగ్రహము శ్రీ ఇందూలాల్‌షాను ప్రారంభమునుండి శ్రీ సత్యసాయి సేవాసంస్థల రూపురేఖలను తీర్చిదిద్దే ప్రధానశిల్పిగా నిలబెట్టాయి. 1965వ సంవత్సరంలో ఆయన మొట్టమొదటిసారి భగవాన్ బాబావారిని కలుసుకోకముందే, భవిష్యత్తులో ఆయన చేపట్టే ఈ బృహత్కార్యమునకు తగినట్లు ఆయన వ్యక్తిత్వము తీర్చిదిద్దబడి, ఆయన అందుకొరకు త్రయారుగా ఉన్నారు. కొన్ని సంవత్సరాల తరువాత ఆ విషయాన్ని గుర్తు చేసుకుంటూ శ్రీ ఇందూలాల్‌షా "అవతార పురుషులు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారియందు నాకు గల ప్రేమకు బీజము 1965వ సంవత్సరం వేసవిలో నాటబడింది. అంతవరకు భగవాన్ బాబావారి అవతరణను గురించి నాకు తెలియదు. ఈనాడు ఒకసారి వెనుకకు తిరిగి చూచుకుంటే, నేను ఆయనను కలుసుకోకముందే, ఆయనకు నా గురించి తెలుసునని అనిపిస్తోంది", అని చెప్పారు.

శ్రీ ఇందూలాల్‌షా తన స్వంత రాష్ట్రమైన గుజరాత్‌లోని స్వస్థలం నుండి 1937వ సంవత్సరములో కౌమారదశలో ఉన్నత విద్యాభ్యాసమునకై బొంబాయి వచ్చారు. ఆయన ఛార్టర్డ్ అక్కౌంటెంటు కావాలనుకున్నారు. సుమారు 5 సంవత్సరాలపాటు విద్యార్థిగా తాను నివసించిన హాస్టలు శ్రీరామకృష్ణా స్టూడెంట్సు హోమ్‌లో అక్కడి రామకృష్ణమిషన్‌యొక్క సన్యాసులు ఆయనకు భారతీయ సంస్కృతిలోని ప్రాథమిక సూత్రములను నేర్పారు. ఆ సన్యాసులందరూ ఎంతో ఆశ్చర్యముతో వర్ణించే స్వామి వివేకానంద యొక్క జ్వాజ్వల్యమానమైన వ్యక్తిత్వము ఆయన లేత హృదయంలో దేశభక్తి మరియు ఆదర్శవాదముతో

నిండిన తీవ్రమైన ఆసక్తిని రేకెత్తించింది. ఆ తరువాత జాతిపిత మహాత్మాగాంధీయొక్క వ్యక్తిత్వము మరియు ఆయన బోధలు ఆ ఉత్సాహమునకు మరింత బలమును చేకూర్చాయి. మహాత్మాగాంధీయొక్క సమ్మోహన శక్తి అనేకమంది యువకులపై తన ప్రభావమును చూపి వారిని స్వాతంత్ర్య పోరాటములో దుమికేటట్లు చేసిన రోజులవి.

శ్రీ ఇందూలాల్‌షా కూడా దానివైపు ఆకర్షితుడై 1942వ సంవత్సరములో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని, తరువాత 1946వ సంవత్సరంలో భారత జాతీయ కాంగ్రెస్‌లో ఒక ఉత్సాహవంతుడైన కార్యకర్తగా మారారు. 1951-60 సంవత్సరాల మధ్య ఆయన ఆ సంస్థ బొంబాయి ప్రాంతమునకు కార్యదర్శిగా పనిచేశారు. అదే సమయంలో ఆయన భారత ప్రభుత్వముయొక్క ఖాదీ మరియు గ్రామోద్యోగ కమీషన్‌తో సంపర్కము పెట్టుకుని ఆ సంస్థ తరుపున 1954 నుండి 1964 వరకు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను గురించిన ఒక పరిశోధనా కార్యక్రమంలో పనిచేశారు. ఆయన భార్య శ్రీమతి సరళాబెన్ ఆయన చేపట్టిన నిస్వార్థ సేవా కార్యక్రమాలలో ఆయనకు గొప్ప అండగా నిలిచారు. ఆయన ఏ పని తలపెట్టినా హృదయపూర్వకంగా అందులో పూర్తిగా నిమగ్నులై పనిచేయడం ఆయన స్వభావంలోనే ఉన్నది. ప్రతి ఒక్క పనిని అతిస్వల్ప విషయాలనుకూడా దృష్టిలో ఉంచుకుని ప్రణాళికా బద్ధంగా చేయడం, అత్యంత నైపుణ్యముతో కార్యమును నెరవేర్చడం ఆయన స్వభావం. గ్రామీణ పేదప్రజలకొరకు ఆయన చేపట్టి నెరవేర్చిన అనేక కార్యక్రమాలు ఆయనకు ఎంతో పేరుప్రఖ్యాతులను సంపాదించిపెట్టాయి. వీటన్నిటితోబాటు, శ్రీ ఇందూలాల్‌షా 1949-64 సంవత్సరాలమధ్య బొంబాయిలోని శ్రీ రామకృష్ణమిషన్ కార్యాలయములో అత్యంత నిపుణుడైన సేవకునిగాకూడా పని చేశారు.

1965వ సంవత్సరంనాటికి శ్రీ ఇందూలాల్‌షా జీవితంలో ఆధ్యాత్మికత అంటే కేవలం అధ్యయనంవరకు మాత్రమే పరిమితమైన ఒక తత్త్వము అనే భావమునకు బదులు అది ఒక జీవన విధానమనే భావన ప్రాధాన్యతను

సంతరించుకున్నది. ఆయన జీవిత గమనమునే మార్చివేసిన అత్యంత ముఖ్యమైన ఆ సంవత్సరంలో తొమ్మిది సంవత్సరాల ఆయన కుమారుడు యోగేష్ మరణించాడు. కుమారుని మరణంతో దుఃఖసాగరంలో మునిగియున్న శ్రీ ఇందూలాల్‌షాను ఆయన భార్య సరళ మరియు కుమార్తె దర్శనతో వచ్చి బెంగుళూరులో కొన్ని రోజులు తనతో గడుపుమని ఆయన స్నేహితులొకరు ఆహ్వానించారు. ఆ సమయంలో ఒక రోజు సాయంత్రం ఆయనకు ఆతిథ్యమిచ్చిన స్నేహితుడు ఆయనను మల్లేశ్వరంలో భగవాన్ బాబావారు ప్రసంగిస్తున్న ఒక సమావేశమునకు తనతో రమ్మని ప్రోత్సహించి తీసికొనివెళ్ళాడు. వాళ్ళిద్దరూ కలసి అక్కడకు చేరుకునేటప్పటికి భగవాన్ అప్పటికే తమ దివ్యోపన్యాసమును ప్రారంభించారు. వేలాదిమంది భక్తులు ఆయన దివ్యోపన్యాసమును అత్యంత శ్రద్ధతో నిశ్శబ్దంగా వింటున్నారు. అక్కడి వాతావరణమంతా ఒక విచిత్రమైన దివ్య తేజస్సుతో నిండియున్నట్లు అనిపించింది. శ్రీ ఇందూలాల్ తన దృష్టిని భగవాన్ బాబావారివైపు మళ్ళించగానే అంతవరకు ఆయనకు తెలియని ఏదో అనిర్వచనీయమైన దివ్యానుభూతి ఆయనను ముంచివేసింది. అయితే, అంతకంటె ఎక్కువగా ఆయనకు దిగ్భ్రాంతిని కలిగించిన విషయం, ఏ క్షణంలోనైనా వర్షంవలన సభకు అంతరాయం కలిగేటట్లు ఆకాశంలో గుమికూడిన నల్లని మేఘాలను బాబా చెల్లాచెదరు చేయడం. ఎవరైనా ఆవిధంగా హస్తచాలనంచేత కుంభవృష్టి కురవడానికి సిద్ధంగా ఉన్న మేఘాలను చెల్లాచెదరు చేసి, మళ్ళీ ఏమీ జరుగనట్లు తమ ఉపన్యాసమును కొనసాగించగలరా? అటువంటి అద్భుత దృశ్యములను గురించి శ్రీ ఇందూలాల్ పురాణాలలో మాత్రమే చదివారు. ఆ సంఘటన ఆయన జీవితానికి ఒక అర్థము, పరమార్థము తెలిపే క్షణముగా మారి, ఆయనలో భగవాన్ బాబావారిని వెంటనే కలుసుకోవాలనే ఒక తీవ్రమైన కోరిక బయలుదేరింది.

ఆ తరువాత వరుసగా ఐదు రోజులపాటు శ్రీ ఇందూలాల్‌షా తన భార్యతో కలసి బృందావనం సందర్శించారు. భగవాన్ బాబావారితో ఆంతరంగిక

సంభాషణ జరిపే అవకాశముకొరకు తీవ్రమైన ఆర్తితో నిరీక్షించారు. చివరకు వారి నిరీక్షణ ఫలించి ఐదవ రోజున భగవాన్ వారికి ఆ అవకాశమును అనుగ్రహించారు. వృత్తిపరంగా ఛార్టర్డు అకౌంటెంటు అయిన శ్రీ ఇందూలాల్‌షా యొక్క వృత్తినిగురించి భగవాన్ బాబా కొన్ని వ్యాఖ్యలు చేస్తూ ఆ భార్యాభర్తలిద్దరిని ఇంటర్వ్యూ రూములోనికి తీసికొనివెళ్ళారు. ఆ సమయంలో శ్రీ ఇందూలాల్‌కు తనను గురించి బాబావారికి పరిచయం చేసుకోవలసిన అవసరమే కనపడలేదు. భగవాన్ బాబావారికి తన జీవితమును గురించి తెరచిన పుస్తకంవలె సర్వమూ విదితమేనన్న సత్యమును ఆయన గ్రహించారు. భగవాన్ బాబావారి దివ్యసన్నిధిలో ఆ దంపతులు భగవానుని ఆశీఃపూర్వకమైన దివ్యానందమును అనుభవించారు. ఇక, వారు సెలవు తీసుకుంటూండగా భగవాన్ బాబావారు శ్రీ ఇందూలాల్‌తో "నేను ఒక వారం రోజులలో బొంబాయి నగరమునకు వస్తున్నాను. అక్కడ నన్ను నీవు కలుసుకోవచ్చు", అని చెప్పారు. ఆ ఆహ్వానంలో ఒక చిరకాల మిత్రుని ఆప్యాయత నిండియున్నది. ఆ తరువాత ఆ దంపతులు తాము భగవాన్ బాబావారికి చిరపరిచితులమనే భావనతో ఇంటర్వ్యూ రూమునుండి బయటకు వచ్చేశారు.


భగవాన్ బాబావారు ఆ మరుసటి వారంలో బొంబాయి వచ్చి మహారాష్ట్ర ప్రభుత్వంలో అప్పట్లో మంత్రిగా ఉన్న శ్రీ పి.కె. సావంత్ బంగళాలో బసచేశారు. ఆ సమయంలో విద్యార్థులకొరకు తాను రూపొందించిన పావన పురుషులు మరియు మహర్షుల జీవితాలలో ప్రతిబింబించే భారతీయ సంస్కృతిలోని సనాతన ధర్మమును కన్నులకు కట్టినట్లు చూపించే 'సంత్‌దర్శన్' అనే చిత్ర ప్రదర్శనను భగవాన్ బాబావారికి చూపించాలని శ్రీ ఇందూలాల్‌షా చాలా ఆత్రుతగా ఉన్నారు. శ్రీ ఇందూలాల్ స్వామి ఉంటున్న గదిలోనికి వెళ్ళగానే ఆయన "ఏదీ ఆ ఎగ్జిబిషన్?" అని అడిగారు. ఆ ప్రశ్నకు శ్రీ ఇందూలాల్ ఒక్క క్షణంపాటు నిశ్చేష్టులై ఉండిపోయారు. ఇంతకు ముందెన్నడూ తాను భగవాన్ బాబావారితో గాని లేక తన సన్నిహితులతోగాని ఆ ఎగ్జిబిషన్ గురించి ప్రస్తావించి యుండలేదు. అయినప్పటికి, ఈ విషయం స్వామికి తెలిసిపోయింది!

అదేరోజు సాయంత్రం భగవాన్ బాబావారు ఆ సంచార ప్రదర్శనను (Mobile Exhibition) ను చూచి దానిని ఆశీర్వదించారు. ఆ తరువాత ఆ ప్రదర్శన బొంబాయి నగరములోని ప్రతి ఒక్క స్కూలులోను మరియు గుజరాత్ రాష్ట్రములోని వందలాది స్కూళ్ళలోను ప్రదర్శింపబడింది. 1969వ సంవత్సరంలో గాంధీ శతజయంతి ఉత్సవాల సందర్భంగా సంచార రైలు ప్రదర్శనగా దేశములోని అన్ని ప్రాంతాలకు తీసికొని వెళ్ళబడింది. ఆ ఎగ్జిబిషన్ శ్రీ ఇందూలాల్‌షాను భగవాన్ బాబావారికి సన్నిహితుని చేసింది. ఆ తరువాత రెండు నెలల లోపుగానే శ్రీ ఇందూలాల్, భగవాన్ బాబావారి దివ్యజీవితము మరియు సందేశమును వివరిస్తూ మరొక చిత్ర ప్రదర్శనను రూపొందించాలని సంకల్పించారు. ఆ సందర్భంగా ఆయన అనేక రోజులపాటు వరుసగా భగవాన్ బాబావారిని గురించి, ఆయన దివ్యసందేశమును గురించి ప్రచురింపబడిన ప్రతి ఒక్క పుస్తకమును పరిశీలించారు. జాతి మత వివక్షత లేకుండా మొత్తం మానవజాతి కంతటికి వర్తించే భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్య బోధలయొక్క విశ్వజనీనతను గురించి ఈ అధ్యయనంలో ఆయనకు ఒక అవగాహన ఏర్పడింది. ఫలితంగా, మానవజాతిని పట్టిపీడిస్తున్న అన్ని సమస్యలకు ఇదొక్కటే సర్వ రోగనివారిణి అని, దాని కొరకే మానవజాతి అంతా ఎదురు చూస్తున్నదని ఆయన భావించారు.

1965వ సంవత్సరం అక్టోబరు నెలలో నవరాత్రి ఉత్సవాల సందర్భంగా 'శ్రీ సత్యసాయి దివ్యబోధలు' ('Teachings of Sri Sathya Sai') అనే పేరుతో ప్రదర్శింపబడిన ఆ ఎగ్జిబిషన్‌కు భగవాన్ బాబా ప్రారంభోత్సవం చేశారు. భారతదేశములోనే మొట్టమొదటగా నెలకొల్పబడి శ్రీ ఇందూలాల్‌షాయొక్క తీవ్ర కృషితో బొంబాయి నగరములోని ఛారిటీ కమీషనర్ యెదుట రిజిష్టరు కాబడిన భగవాన్ శ్రీ సత్యసాయి సేవాసమితియొక్క రిజిష్ట్రేషను పత్రము మరియు సంబంధిత పత్రాలను ఆ సందర్భంలోనే భగవాన్ బాబావారికి సమర్పించడం జరిగింది. ఆవిధంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థలనే మహావటవృక్షమునకు ఆనాడు బీజము నాటబడింది.

ఆ తరువాత శ్రీ ఇందూలాల్‌షా అంతవరకు తాను సభ్యుడైన అన్ని సంస్థలకు రాజీనామా చేసి మనస్ఫూర్తిగా శ్రీ సత్యసాయి సేవా సంస్థయొక్క కార్యకలాపాలలో మునిగిపోయారు. తరుచు భగవాన్ బాబావారి దర్శనం చేసుకుంటూ, స్వామి దివ్యబోధలను అధ్యయనం చేస్తూ వాటిని ఆచరణలో పెట్టడానికి మనస్ఫూర్తిగా కృషి సలుపుతూండడంవలన ఆయనకు, భగవాన్ బాబావారికి మధ్య ఒక పవిత్ర బంధము ఏర్పడి శ్రీ ఇందూలాల్ తన జీవితంలో ఒక నూతనాధ్యాయమును ప్రారంభించారు. ఆయన మాటలలోనే చెప్పాలంటే "భగవాన్ బాబావారు నా జీవితంలో ప్రవేశించిన తరువాత, నేను చేస్తున్న పనిలో పెద్దగా మార్పేదీ లేకపోయినా, నా అంతరంగములో ఏదో పరివర్తన కలిగి అప్పటినుండి నా జీవితంలో ఒక నూతన శక్తిని, ఆనందమును, కాంతిని నింపివేసింది. ఆయనతో నాకు పరిచయం ఏర్పడిన తరువాతనే సమాజసేవయొక్క ప్రాముఖ్యతను నేను గ్రహించగలిగాను. అంతకుముందు నేను చేసిన సమాజసేవ నాకు సంతోషమును కలిగించింది కాని, ఆధ్యాత్మికంగా నేను ఉన్నతస్థాయికి చేరుకునేందుకు అవకాశం కలుగలేదు. 'సాంఘిక జీవితానికి, ఆధ్యాత్మిక జీవితానికి మధ్య గల సంబంధము కేవలం యాదృచ్ఛికమైనది కాదు. సాంఘిక జీవితము, ఆధ్యాత్మిక జీవితానికి పునాది వంటిది', అనే భగవాన్ బాబావారి దివ్య సూక్తి నా జీవితముపై గొప్ప ప్రభావమును చూపింది. దివ్యత్వమును గురించి తెలుసుకునే అవకాశమును నాకు ప్రసాదించింది". 'సమాజసేవను భగవత్కార్యముగా చేపట్టినపుడు, అటువంటి సేవ మనలను భగవంతుని దివ్యసన్నిధికి చేరుస్తుంది,' అనే సత్యమును శ్రీ ఇందూలాల్‌షా గ్రహించారు.


భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యత్వమునకు నిదర్శనములైన అనేక అద్భుత దృశ్యములను, లీలలను వీక్షించే, అనుభవించే మహత్తరమైన అవకాశము శ్రీ ఇందూలాల్‌షాకు లభించింది. ఆయనయొక్క అంతర్ముఖ ప్రయాణంలోను మరియు భగవాన్ బాబావారి అవతార కార్యక్రమంలో ఆయన చేసిన అద్భుతమైన సేవలోను వాటి పాత్ర కూడా ఉన్నది.



"సర్వ హృదయవాసి"

1967వ సంవత్సరంలో శ్రీ ఇందూలాల్‌షా భగవాన్ బాబావారిని ఆయన ఎప్పుడు బొంబాయి వచ్చినా తన ఆతిథ్యము స్వీకరించుమని ప్రార్థించాడు. ఆవిధంగా ఒకసారి స్వామి బొంబాయి వచ్చినపుడు శ్రీ ఇందూలాల్ గృహములో తమతోబాటు వచ్చిన కొందరు భక్తులతో కలసి ఉదయం పూట ఫలహారం చేస్తున్నారు. శ్రీ ఇందూలాల్ భార్య సరళాబెన్ ఆ సమయంలో వేడివేడి వడలు వడ్డిస్తున్నది. ఇంతలో స్వామి తనకు వడ్డించిన ఒక వడను చేతితో తీసి ఆమె కుమార్తె దర్శనకు ఇచ్చి "మీ అమ్మ వడ్డించిన ఈ వడ చూడు! దీన్ని విరిచి దాంట్లో ఏముందో నువ్వే చూడు", అని ఫిర్యాదు చేశారు. ఆమె ఆ వడను తీసుకుని రెండు ముక్కలుగా విరిచినప్పుడు వాటిమధ్య రెండు చెవి రింగులు తళతళా మెరిసిపోతూ కనిపించాయి! వాటిని చూచి ఆమె ఆశ్చర్యపోయింది. అప్పుడు బాబా చిరునవ్వు నవ్వుతూ ఆ రింగులను బయటికి తీసి అక్కడున్న వారందరికి చూపించారు. ఈ అద్భుత లీల వారందరిని ఆశ్చర్యానందములలో ముంచివేసింది. చివరకు, స్వామి ఆ రెండు రింగులను శ్రీ ఇందూలాల్‌షా కుమార్తె దర్శన రెండు చెవులకు పెట్టారు.

1967వ సంవత్సరంలోనే మద్రాసు నగరంలో జరిగిన అఖిలభారత సత్యసాయి సేవా సంస్థల ప్రథమ సమ్మేళనంలో దేశవ్యాప్తంగా సత్యసాయి సంస్థలు నిర్వహించే సేవా కార్యక్రమాలలో సారూప్యమును సాధించడానికి ఏర్పడిన కమిటీలో శ్రీ ఇందూలాల్‌షా సభ్యునిగా నియమింపబడ్డారు. ఆ సమయంలో ఒక రోజు సాయంత్రం స్థానిక సత్యసాయి సంస్థ భగవాన్ బాబావారిని సన్మానించడానికి ఒక బహిరంగ సమావేశమును ఏర్పాటు చేసింది. ఆ సమావేశంలో భగవాన్ తెలుగులో ప్రసంగించారు. శ్రీ ఇందూలాల్‌షాకు ఆ భాష తెలియదు. పైగా స్వామి దివ్యోపన్యాసమును ఇంగ్లీషులోనికి తర్జుమా చేయడం కూడా జరుగలేదు. మరునాడు ఉదయం శ్రీ ఇందూలాల్‌షా మరియు ఇతర సభ్యులు కలసి స్వామి వద్దకు వెళ్ళి సమావేశ నిర్ణయాలను ఖరారు చేసే విషయంలో ఆయన సలహాలను అర్థించారు. ఆ కమిటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి మరియు కేరళ, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలకు మాజీ గవర్నరు



"భగవాన్ బాబావారితో శ్రీ ఇందూలాల్‌షా"



"భగవాన్ బాబావారి దివ్య సందేశము - చిత్ర ప్రదర్శన"

అయిన శ్రీ బూర్గుల రామకృష్ణారావుగారుకూడా సభ్యులుగా ఉన్నారు. ముందుగా స్వామి క్రితంరోజు సాయంత్రం జరిగిన బహిరంగ సమావేశమును గురించి తెలుగులో వారితో మాట్లాడడం ప్రారంభించారు. ఆ గ్రూపులో తెలుగుభాష అర్థం కాని వ్యక్తి శ్రీ ఇందూలాల్‌షా ఒక్కరే! ఇంతలో శ్రీ రామకృష్ణారావు ధైర్యం చేసి "స్వామీ! ఇందూలాల్‌షాకు తెలుగురాదు. మీరు అనుమతిస్తే మీ ప్రసంగమును నేను ఇంగ్లీషులోనికి అనువదిస్తాను" అని విన్నవించుకున్నారు. అప్పుడు బాబా "వద్దు; ఇప్పుడంత సమయం లేదు. అతడు తెలుగు అర్థం చేసుకోగలడు", అని చెపుతూ శ్రీ ఇందూలాల్‌షా శిరస్సుపై తన వ్రేళ్ళతో నెమ్మదిగా తట్టారు. చాలా ఆశ్చర్యకరంగా, స్వామి యొక్క వ్రేళ్ళు తన శిరస్సును స్పృశించిన క్షణంనుండి శ్రీ ఇందూలాల్ తెలుగులో జరుగుతున్న ఆ చర్చలను అర్థం చేసుకోగలిగారు! అయితే, ఆ శక్తి ఆయనలో ఆ చర్చ పూర్తయ్యే వరకు మాత్రమే ఉన్నది!

బొంబాయిలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు తమ దివ్య సంకల్పముచే నెలకొల్పిన ఆధ్యాత్మిక దీపం, ధర్మక్షేత్రము ఒక అద్భుతమైన కట్టడము. ఆ ఆశ్రమ నిర్మాణంలో శ్రీ ఇందూలాల్‌షా ప్రముఖ పాత్ర వహించారు. 1967వ సంవత్సరం మార్చినెలలో భగవాన్ బాబావారు బొంబాయిలో ఆశ్రమ నిర్మాణముకొరకు అనేక స్థలములను చూచి, చివరకు కేవలం కొండలు, గుట్టలతో నిండియున్న ఒక స్థలమును ఎంపిక చేశారు. ఆ ప్రాంతమును చేరడానికి కనీసం ఒక కచ్చారోడ్డుకూడా లేదు. అదే సంవత్సరం నవంబరు నెలలో దీపావళినాడు భగవాన్ బాబా అక్కడ ఆశ్రమ నిర్మాణమునకు శంకుస్థాపన చేసి వచ్చే సంవత్సరం, అంటే 1968వ సంవత్సరం మే నెలలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల ప్రథమ ప్రపంచసమ్మేళనం జరిగే సమయానికి మందిర నిర్మాణము పూర్తయి తయారుగా ఉంటుందని ప్రకటించారు. అప్పటికి, మందిర భవన నిర్మాణమునకు ప్లానులు కూడా తయారుగా లేవు. ఎలాగైతేనేం, నిర్మాణము 26-1-1968 తేదీన ప్రారంభమైంది. అనుకున్న సమయానికే మనోహరమైన కమలం ఆకారములో నిర్మింపబడిన భవన నిర్మాణము తయారైంది. భగవాన్

బాబావారు అంతకు ముందు తాను ప్రకటించినట్లుగా మే నెల 12వ తేదీన ధర్మక్షేత్ర భవనమునకు ప్రారంభోత్సవము చేశారు. ఆ రోజు ఉదయం భగవాన్ బాబా శ్రీ ఇందులాల్‌షాను పిలిచి "భవన నిర్మాణమునకు ఎన్ని రోజులు పట్టింది?" అని ప్రశ్న వేశారు. హఠాత్తుగా స్వామి అడిగిన ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేక శ్రీ ఇందూలాల్‌షా కొంచెం తడబడుతూ లెక్కలు వేసి "స్వామీ! సుమారుగా మూడు నెలలు అంటే 90 రోజులు పట్టింది", అని జవాబిచ్చారు. అప్పుడు స్వామి చిలిపిగా ఆయనవైపు చూసి చిరునవ్వు నవ్వుతూ "కాదు, కాదు. సరిగ్గా 108 రోజులు పట్టింది. కావాలంటే నువ్వు మందిరం కట్టిన కంట్రాక్టరును పిలిచి అడుగవచ్చు", అని శ్రీ ఇందూలాల్‌షా లెక్కలను సరిదిద్దారు! ఇంతలో కంట్రాక్టరు కూడా అక్కడికి వచ్చి తన పుస్తకాలు చూచి సరిగ్గా 108 రోజులు పట్టిందని ధ్రువపరిచాడు.

సర్వశక్తిమయులైన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారికి ప్రకృతిపై గల పరిపూర్ణమైన ఆధిపత్యమునకు నిదర్శనగా అత్యంత సహజమైన రీతిలో జరిగిన ఒక ఆసక్తికరమైన సంఘటనను గురించి ఇక్కడ వివరించడం జరుగుతున్నది. ఎప్పటిలాగే ఈ సందర్భంలోకూడా భగవాన్ బాబావారి అపారమైన కరుణ ఆయనను ప్రకృతి సూత్రాలను అధిగమించేటట్లు చేసింది. భగవాన్ బాబావారు ఆ సంవత్సరం జూలై నెలలో బొంబాయిని సందర్శించారు. అక్కడి సత్యసాయి సేవాసంస్థ భగవాన్ బాబావారి గౌరవార్థం ధర్మక్షేత్రంలో ఒక బహిరంగ సభను ఏర్పాటు చేసింది. ఆ రోజు ఆదివారం; సాయంత్రం సమయం. సభ 6 గంటలవరకు ప్రారంభం కావలసియున్నది. సరిగ్గా 5 గంటల 15 నిముషాలయ్యేటప్పటికి ఆకాశమంతా దట్టంగా నల్లని మేఘాలు క్రమ్ముకున్నాయి. ఏ క్షణంలోనైనా కుంభవృష్టి కురిసి సభకు అంతరాయము కలుగుతుందేమోనని సంస్థ కార్యకర్తలు భయపడ్డారు. పెద్ద సంఖ్యలో అక్కడ చేరిన సభాసదులకు కలిగే అసౌకర్యమును నివారించే ఉద్దేశ్యంతో వారిలో కొంతమంది బాబావారిని సభను ఒక అర్ధగంట ముందుగా ప్రారంభించుమని కోరదామనుకున్నారు. అయితే రాహుకాలం సాయంత్రం 6 గంటలవరకు ఉండడంచేత స్వామి వారి

ప్రార్థనను అంగీకరించరేమోనని శ్రీ ఇందూలాల్ భావించారు. అయినప్పటికి ఆయనతో పనిచేస్తున్న తోటి కార్యకర్తలు భగవాన్ బాబావారికి రాహుకాలమువంటి పట్టింపులేమీ లేవని, తామందరూ కలసి వెళ్ళి ముందు అనుకున్నట్లుగా స్వామిని సభను అర్ధగంట ముందుగా ప్రారంభించుమని ప్రార్థించాలని పట్టుబట్టారు. ఇక చేసేది ఏమీ లేక శ్రీ ఇందూలాల్ భగవాన్ బాబావారి వద్దకు వెళ్ళి "స్వామీ! సభను ఒక అరగంట ముందుగా ప్రారంభిద్దామా?" అని వేడుకున్నారు. స్వామి "ఎందుకు?" అని అడిగారు. అలా అడుగుతున్నప్పుడు ఆయన కంఠస్వరంలోనే ఆ ప్రశ్నకు సమాధానం గోచరించింది. అయితే, శ్రీ ఇందూలాల్‌కు స్వామి ప్రశ్నలోని ఆంతర్యం బోధపడలేదు. అందువలన ఆయన మళ్ళీ "స్వామీ! వర్షం వచ్చేలా ఉన్నది. సభకు అంతరాయం కలుగుతుంది. పైగా భక్తులకు కూడా అసౌకర్యము కలుగుతుంది", అని విన్నవించుకున్నారు. బాబా అందుకు సానుభూతితో చిరునవ్వు నవ్వుతూ శ్రీ ఇందూలాల్‌షా చెయ్యి పట్టుకుని ఆయనను దగ్గరలో ఉన్న కిటికీ వద్దకు తీసికొని వెళ్ళి ఆకాశమువైపు చూపించారు. అప్పటికప్పుడే వర్షం ప్రారంభమవడం ఆయనకు కనిపించింది. ఆకాశమంతా దట్టమైన మేఘములు క్రమ్ముకుని ఉండడం, క్రింద అసంఖ్యాకమైన భక్తులు చేరియుండడం వారు చూచారు. అప్పుడు భగవాన్ "అవునవును; చాలా పెద్ద వర్షం కురుస్తుంది", అని వ్యాఖ్యానించారు.

భగవాన్ బాబావారి మాటలు శ్రీ ఇందూలాల్‌షాకు మరింత ఆందోళనను కలిగించాయి. అప్పటికప్పుడే వర్షములో తడవకుండా ఉండేందుకుగాను భక్తులు గొడుగులు తీసి తెరచిపట్టుకోవడం ఆయనకు కనపడింది. ఈ పరిస్థితులలో భగవాన్ బాబావారిని ఏమని ప్రార్థించాలో ఆయనకు తోచలేదు. ఇంతలో స్వామి కిటికీ నుండి తమ దివ్యహస్తమును బయటకు చాచి ఆకాశమువైపు ఎత్తి ఏదో ఒక సంజ్ఞ చేశారు. తక్షణమే చినుకులు ఆగిపోయి, దట్టంగా క్రమ్ముకున్న మేఘాలు చెదరిపోవడం ప్రారంభమైంది. ఎంతో ఆందోళనతో నిండిన మనస్సుతో ఉన్న శ్రీ ఇందూలాల్, భగవాన్ బాబావారు చూపిన ఆ

అద్భుతలీలను గమనించలేదు. ఆయన తన ధోరణిలో తాను ఉండి, స్వామిని ప్రార్థించుకుంటూ ఉండిపోయారు. ఇంతలో స్వామి "మనం అనుకున్నట్లుగానే ఆరు గంటలకు సభను ప్రారంభిద్దాం", అని ప్రకటించారు.

భగవాన్ బాబావారి ఆజ్ఞను తన తోటి కార్యకర్తలకు తెలియజేయడానికి శ్రీ ఇందూలాల్ వెంటనే క్రిందకు పరుగెత్తారు. సభ సరిగ్గా ఆరు గంటలకు ప్రారంభమైంది. ఆకాశములో మబ్బులు కూడా విడిపోయి వారి భయాలు తొలగిపోయాయి. ఆ సభ జరుగుతున్నప్పుడు గాని, శ్రీ ఇందూలాల్‌కు తాను భగవాన్ బాబావారిని ముందుగా సభను ప్రారంభించుమని కోరడం ఎంతటి పొరపాటో తెలిసిరాలేదు. బహుశా ఆయన తన ఆందోళనలో శ్రీ సత్యసాయి బాబావారు సాక్షాత్తూ భగవంతుడేనని, ఆయనకు ప్రకృతి శక్తులపై సర్వాధిపత్యము ఉన్నదనే సత్యమును మరచిపోయి ఉంటారు. సభ సక్రమంగా ముగిసేటప్పటికి కార్యకర్తలందరూ చాలా సంతోషించారు. వెంటనే శ్రీ ఇందూలాల్‌షా భగవాన్ బాబా వారి వద్దకు పరుగెత్తి ఆనందాశ్రువులతో ఆయన పాదాలను అభిషేకించారు. అప్పుడు స్వామి ఆయనవైపు చూచి "నువ్వు మరచిపోయావు కదూ!" అని అడిగారు. అది శ్రీ ఇందూలాల్‌షాకు జీవితంలో మరపురాని క్షణం!

శ్రీ సత్యసాయి సేవాసంస్థకు శ్రీ ఇందూలాల్‌షా చేసిన బ్రహ్మాండమైన సేవలకు ఆయనకు కృతజ్ఞతాంజలి ఘటిస్తూ వరల్డు కౌన్సిలుకు వైస్ చైర్మనుగా ఆయనతో అత్యంత సన్నిహితంగా పనిచేసిన శ్రీ వి. శ్రీనివాసన్ "శ్రీ సత్యసాయి సేవాసంస్థకు ఒక రూపమును, ఆకారమును కల్పించిన వ్యక్తి శ్రీ ఇందూలాల్‌షాయేనని ప్రపంచమంతటా ప్రతి ఒక్కరికి తెలుసు. భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్యబోధలచే స్ఫూర్తిని పొందిన వారందరికి వ్యక్తిగత సాధన మరియు సాయిసేవకొరకు శ్రీ సత్యసాయి సేవా సంస్థను ఒక వేదికగా ఆయన తీర్చిదిద్దారు. ఆయన భగవాన్ బాబావారి దివ్యబోధలనన్నిటిని పరిపూర్ణంగా ఆకళింపు చేసుకున్నారు. అవతారపురుషులైన భగవాన్ శ్రీ

సత్యసాయి బాబావారి అవతార కార్యక్రమమును గురించిన పూర్తి అవగాహన ఆయనకున్నది. ఈ అవగాహనను, ఎఱుకను ఆయన ప్రపంచవ్యాప్తంగా ఉన్న అనేక లక్షలమంది సాయి సేవకులను తీర్చిదిద్దడంలో, వారిని సేవా కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొనేటట్లు ప్రోత్సహించడంలో వినియోగించారు. శ్రీ సత్యసాయి సేవాసంస్థను ప్రపంచ వ్యాప్తమైన సేవాసంస్థగా విస్తరింపజేయడంలో ఆయన ముందుచూపు మరియు ఆయన కన్న కలలను నేను స్వయంగా దగ్గరుండి చూచాను, అందులో పాలు పంచుకున్నాను. ఉన్నత భావాలు గల శ్రీ ఇందూలాల్‌షా, శ్రీ సత్యసాయి సంస్థలలోని ప్రతి ఒక్కరు తమ జీవిత లక్ష్యమైన భగవాన్ ఆశయ సాధనకు కృషి చేసేటట్లు వారికి స్ఫూర్తిని కలిగించారు. మనం స్వామి కార్యములో నిమగ్నులమై యున్నప్పుడు మనం సాధించలేని కార్యమేదీ ఉండదని ఆయన తరుచు చెపుతూంటారు. భగవాన్ బాబావారియందు ఆయనకు గల ప్రగాఢమైన మరియు అచంచలమైన విశ్వాసము నుండి ఆయనకు ఈ ఆత్మవిశ్వాసము సంక్రమించింది. సాయి సేవకులందరికి శ్రీ ఇందూలాల్‌షా ఇచ్చే మొట్టమొదటి సలహా 'ఆధ్యాత్మిక మార్గంలో పయనిస్తూ పవిత్రమైన జీవితం గడపటం అంటే ఎట్టి పరిస్థితులలోను 'అన్యథా శరణం నాస్తి' అని పరిపూర్ణ విశ్వాసంతో మన జీవితాలను సాయికి అంకితం చేయడమే!' సాయి చేతులలో మన జీవితాలను పెట్టడమంటే నిరంతర సాయి చైతన్యంలో ఉండటమే! ఆయనను మన హృదయపీఠముపై స్థిరముగా నిలుపుకున్నంత కాలం, మనం ఆయన దివ్యహస్తాలలో భద్రంగా ఉన్నట్లే! ఆయనను మన ఆలోచనలనుండి దూరము చేసుకున్నప్పుడు, ఆయననుండి మనము దూరమైపోయి అగాధంలోనికి కూరుకుపోతాము", అని.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి 60వ జన్మదినోత్సవ వేడుకలు ముగిసిన తరువాత, పది రోజులపాటు ప్రపంచమంతటి నుండి వచ్చిన లక్షలాది భక్తుల సమక్షంలో జరిగిన బ్రహ్మాండమైన ఆ ఉత్సవాలకు పెద్ద ఎత్తున ఏర్పాట్లకు సారథ్యం వహించిన శ్రీ ఇందూలాల్‌షా మాట్లాడుతూ "ప్రపంచంలో ఇంతవరకూ ఎక్కడా ఏ అవతార పురుషుని జన్మదినోత్సవాలు అంత పెద్ద యెత్తున మూడు

సంవత్సరాల ముందునుండి, జరుగలేదు. ఇందులో ఒక ముఖ్య విషయమేమిటంటే ఈ జన్మదినోత్సవాల సందర్భంగా శ్రీ సత్యసాయి సంస్థ చేపట్టిన చిన్న, పెద్ద, ప్రతి ఒక్క కార్యక్రమం కూడా సమాజంలో సుఖ, సంతోషాలు నెలకొల్పడానికి దోహదం చేసే ఒక నూతనమైన కార్యక్రమానికి బీజమును నాటింది. అంతకంతకు అధికంగా మానవునకు భగవంతునియందు విశ్వాసమును పెంచే కృషికి దోహదం చేసింది. భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి 60వ జన్మదినోత్సవ సందర్భంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించడంలో సాయి సేవకులు, కార్యకర్తలు చూపిన సమధికోత్సాహము ఉత్సవాలు ముగియడంతోటే చల్లారిపోలేదు. అందుకు భిన్నంగా, నిజమైన సమాజ సేవా కార్యక్రమం ఇప్పుడే ప్రారంభమైనదని ప్రతి ఒక్క క్రియాశీలక కార్యకర్త మనస్ఫూర్తిగా భావించారు.

ఈ ఉత్సవ నిర్వహణానుభవంద్వారా మేము ఒక ముఖ్యమైన విషయం నేర్చుకున్నాము. అంతటి బ్రహ్మాండమైన స్థాయిలో నిర్వహింపబడిన ఆ జన్మదినోత్సవాలు విజయవంతమైనాయా, లేదా; వాటిలో ఏయే కార్యక్రమాలు నిర్వహించారు అనేది ప్రశ్న కాదు. అవి సమాజంలోని వ్యక్తులయొక్క సంక్షేమము, ఆరోగ్యము మరియు సంతోషములకు ఎంతవరకు దోహదం చేశాయి; సాయి సేవకులు చేపట్టిన సేవా కార్యక్రమాలన్నిటిలోను భగవంతునియందు వారికి గల ప్రేమ, భక్తులు ఎంతవరకు ప్రతిఫలించాయి అన్నదే పరిగణనలోనికి తీసుకోవలసిన విషయం. ఈ కోణంనుండి చూస్తే శ్రీ సత్యసాయి సేవాసంస్థలు భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి 60వ జన్మదినోత్సవ సందర్భముగా చేపట్టిన సేవా కార్యక్రమాలు మరియు ఉత్సవాలు పూర్తిగా తమ లక్ష్యమును సాధించాయి అని చెప్పవచ్చును", అని ఉద్ఘాటించారు.

1985వ సంవత్సరం నవంబరు 14వ తేదీన ప్రారంభమైన భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి 60వ జన్మదిన వేడుకలు పదిరోజులపాటు జరిగినాయి. ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీ సత్యసాయి సంస్థలు అంతకుముందు మూడు

సంవత్సరముల నుండి నిర్వహిస్తున్న ఉత్సవాలు మరియు వివిధ సేవా కార్యక్రమాలకు అవి పరాకాష్ఠ. భగవాన్ 60వ జన్మదినోత్సవ వేడుకలు దివ్యకాంతులను విరజిమ్మే ఆనందోత్సవాలు. ఆ ఉత్సవాలు జరిగిన పది రోజులలోను ప్రశాంతి నిలయములో గోచరించిన అద్భుత దృశ్యములు మానవ మేధస్సుకు అతీతమైనవి. భగవాన్ జన్మదినమైన 23వ తేదీన కనీసం నాలుగు లక్షలమంది భక్తులు ఆ ఉత్సవాలను కన్నులారా దర్శించుకుని ఆనందోత్సాహాలతో పొంగిపోయారు. జన్మదినోత్సవాలు జరిగిన పది రోజులలోను భక్తులందరికి ఉదయం టిఫిన్, కాఫీ; మధ్యాహ్నం భోజనం; సాయంత్రం టీ, కాఫీ, టిఫిన్ మళ్ళీ రాత్రి భోజనం షడ్రసోపేతంగా పూర్తిగా ఉచితంగా అందించబడినాయి. వివిధ దేశాలనుండి వచ్చిన భక్తుల రుచుల కనుగుణంగా అనేక రకాల శాకాహార వంటకాలను వండి వడ్డించడం జరిగింది. సుమారు రెండు వేలకు పైగా సేవాదళ్ వలంటీర్లు బ్రహ్మాండమైన అక్కడి వంటశాలలు మరియు భోజన శాలలలో సేవ చేశారు. అసంఖ్యాకంగా వచ్చిన భక్తులు మరియు సందర్శకులయొక్క అవసరాలను గమనిస్తూ వారికి తగిన సేవలు అందించి ఉత్సవాలను జయప్రదం చేసేందుకుగాను కనీసం పదివేలమంది వలంటీర్లు రాత్రింబగళ్ళు కష్టపడి పనిచేశారు.

భగవాన్ 60వ జన్మదినోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేయబడిన వివిధ సేవలు మరియు కార్యక్రమాలు నిజంగా చాలా విశిష్టమైనవి. నవంబరు 14-16 తేదీల మధ్య శ్రీ సత్యసాయి తాలూకాలోని వివిధ గ్రామాలలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహింపబడినవి. భారతదేశములోని అన్ని ప్రాంతములు మరియు ఎన్నో విదేశములనుండి కొన్ని వందలమంది వైద్యులు ఆ గ్రామాలకు వెళ్ళి అనేక వేలమంది గ్రామస్థులకు వైద్య, ఆరోగ్య సేవలు ఉచితంగా అందించారు. ఉత్సవాలు జరిగిన పదిరోజులలోను ప్రశాంతి నిలయములోని వివిధ స్థలాలలో పది వైద్య శిబిరాలు రాత్రింబగళ్ళు నిర్వహింపబడినాయి. నవంబరు 16వ తేదీన హిల్‌వ్యూ స్టేడియంలో చుట్టుప్రక్కల గ్రామాలనుండి వచ్చిన 10,000 మంది పేద ప్రజలకు నారాయణ సేవ, వస్త్రదానము జరిగాయి.

భగవాన్ బాబావారే స్వయంగా కొందరు నారాయణులకు ప్రసాదము వడ్డించి, వస్త్రములు పంచిపెట్టి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అదే రోజున భగవాన్ బాబావారు 'కరణం సుబ్బమ్మ నగర్' పేరుతో అర్హులైన పేద ప్రజలకొరకు నిర్మింపబడిన 60 ఇళ్ళు గల ఒక కాలనీకి ప్రారంభోత్సవం చేశారు. భగవాన్ బాబావారి బాల్యంలో ఆయన దివ్యత్వమును గుర్తించిన మొట్టమొదటి వ్యక్తి అయిన కరణం సుబ్బమ్మ అనే ఒక పవిత్ర స్త్రీమూర్తి పేరుమీద ఆ గృహ సముదాయము నిర్మింపబడింది. 17వ తేదీ ఉదయం ప్రశాంతి మందిరంలో వందకు పైగా ఋత్విక్కులచే అఖండ వేదమంత్ర పఠనం ప్రారంభమై జన్మదినోత్సవాలు పూర్తయ్యేవరకు కొనసాగింది. తమ 60వ జన్మదినోత్సవాల సందర్భంగా ప్రచురింపబడి సమర్పించబడిన 90కు పైగా పుస్తకాలను భగవాన్ బాబా పూర్ణచంద్ర సభామంటపములో 17వ తేదీ ఉదయం శ్రీ సత్యసాయి సంస్థల నాలుగవ ప్రపంచసమ్మేళనమునకు ప్రారంభోత్సవం చేస్తూ, ఆవిష్కరించారు. ఆ ప్రపంచసమ్మేళనములో పాల్గొనడానికి వచ్చిన ప్రతినిధులందరూ కలసి 19వ తేదీ సాయంత్రం భగవాన్ బాబావారికి హిల్‌వ్యూ స్టేడియంలో ఘనంగా స్వాగతం పలికారు. ఆ సందర్భంగా భగవాన్ బాబావారికి రెండు, మూడు దశాబ్దాల నుండి సన్నిహితులుగా ఉంటూ సేవ చేస్తూన్న కొందరు చిరకాల భక్తులకు స్వామికి కృతజ్ఞతాంజలులు ఘటించే అవకాశం కల్పించబడింది. వారిలో భారతదేశమునకు చెందిన శ్రీ ఆర్.పి.వి. రాయనింగార్, శ్రీ జి.కె. దామోదర్ రావు, శ్రీమతి కమలా సారథి, శ్రీమతి ఎ.ముఖర్జీ మరియు శ్రీ ఎమ్.ఎమ్. పింగే, సింగపూరుకు చెందిన శ్రీ వీలిన్, జపాన్‌కు చెందిన శ్రీమతి చియూకా టుసియామా, అమెరికాకు చెందిన శ్రీ రాబర్ట్ బోజాని మరియు మలేషియాకు చెందిన శ్రీ జగదీశన్ ఉన్నారు. అదే సమయంలో భగవాన్ బాబావారికి వివిధ రకాలుగా సేవచేసిన 80 సంవత్సరాలు పైబడిన ఐదుగురు వృద్ధ భక్తులకు భగవాన్ జ్ఞాపికలను ప్రసాదించి గౌరవించారు. వారు, శ్రీ ఎన్. కస్తూరి, శ్రీ ఎన్.ఎస్. క్రిష్ణప్ప, డా॥బి. సీతారామయ్య, శ్రీమతి టి. కృష్ణమ్మ మరియు శ్రీమతి కోనమ్మ. ఆ మరునాడు ఉదయం ప్రపంచములోని

వివిధ దేశాలనుండి వచ్చిన భక్తులు హిల్‌వ్యూ స్టేడియంలో భగవాన్ బాబావారు నిర్వహించిన అద్వితీయమైన గోదాన కార్యక్రమాన్ని కన్నుల పండుగగా తిలకించారు. తమ ప్రభువైన సాయి గోపాలుడు భాగ్యశాలురైన అరవైమంది గ్రామస్థులకు ప్రథమకాన్పులో జన్మించిన కోడె దూడతో సహా 60 గోవులను స్వయంగా ప్రదానం చేయడం తిలకించిన ఆ విదేశీయులకు అదొక అపూర్వమైన అనుభూతి.

నవంబరు 22వ తేదీన భారతదేశంలో విద్యా ప్రయోజనాల కొరకు అత్యంత ఆధునికమైన అంతరిక్ష పరిశోధనా కేంద్రము (Space Theatre) గా ప్లానిటేరియమును (Planetarium) నెలకొల్పిన ఏకైక విశ్వవిద్యాలయముగా శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థ గౌరవమును అందుకున్నది. అద్వితీయమైన శిల్పకళా వైభవంతో శోభిల్లే ఈ ప్లానిటేరియం భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి నిరంతర, ప్రత్యక్ష పర్యవేక్షణలో రికార్డు టైములో నిర్మింపబడింది. ఆ రోజు ఉదయం భగవాన్ బాబా ఈ ప్లానిటేరియంకు ప్రారంభోత్సవం చేశారు. అదేరోజు సాయంత్రం హిల్‌వ్యూ స్టేడియంలో ప్రపంచమంతటినుండి వచ్చిన సుమారు నాలుగు లక్షలమంది జనం ఆసక్తితో గమనిస్తూండగా శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క నాలుగవ స్నాతకోత్సవము నిర్వహింపబడింది. ఉన్నత విద్యారంగ చరిత్రలో ప్రపంచంలో ఎక్కడాకూడా ప్రకృతి సౌందర్యముతో విరాజిల్లే అటువంటి పరిసరాలమధ్య ఆసక్తితో పాల్గొన్న అన్ని లక్షలమంది జనం సమక్షంలో అటువంటి స్నాతకోత్సవము ఇంతవరకు జరుపబడలేదు. సుప్రసిద్ధ శాస్త్రవేత్త డా॥ ఇ.సి.జి.సుదర్శన్ స్నాతకోపన్యాసం చేశారు. భగవాన్ బాబావారు తమ అనుగ్రహ భాషణంతో అక్కడ సమావేశమైన ఆ అశేష భక్తజన సందోహమును ఆశీర్వదించారు.

హిల్ వ్యూ స్టేడియంలో 'శాంతివేదిక' అని సార్థక నామధేయమును పొందిన సమున్నతమైన వేదిక, భగవాన్ బాబావారు అసంఖ్యాకంగా అక్కడ చేరిన భక్తులకు దర్శనమివ్వడానికి మరియు దివ్యోపన్యాసములు అనుగ్రహించడానికి మాత్రమే

గాక 17వ తేదీ నుండి 24వ తేదీవరకు ఎనిమిది రోజులపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి వేదికగా కూడా ఉపయోగపడింది. భారతదేశములో వివిధ రాష్ట్రములలోని సత్యసాయి సేవాసంస్థలు ప్రదర్శించిన అద్భుతమైన జానపద నృత్యములు, నృత్యనాటకములు, సుప్రసిద్ధ సంగీత విద్వాంసులచే కచేరీలు మరియు భగవాన్ బాబావారి విద్యార్థులచే మూడు నాటకాలు ఆ సాంస్కృతిక కార్యక్రమాలలో చోటు చేసుకున్నాయి. శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క అనంతపురం కేంపస్‌కు చెందిన విద్యార్థినులు నవంబరు 20వ తేదీన "ఈశ్వరః సర్వభూతానం" అనే నాటకమును ప్రదర్శించారు. తరువాత 21 మరియు 22వ తేదీలలో ప్రశాంతి నిలయం కేంపస్‌కు చెందిన విద్యార్థులు 'రాధాకృష్ణ' అనే తెలుగు నాటకమును, 'హియర్ అండ్ దేర్' (Here and there) అనే ఇంగ్లీషు నాటకమును ప్రదర్శించారు. ఆ రెండు నాటకములకు భగవాన్ బాబావారే స్వయంగా దర్శకత్వం వహించారు. భగవాన్ బాబావారు అంతకు ముందు నెలలో ఈ రెండు నాటకముల రిహార్సల్సులో ప్రత్యేక శ్రద్ధ తీసుకుని విద్యార్థులకు పాటలు పాడడం, డైలాగులు చెప్పడం మరియు పాత్రల పోషణ విషయంలో సరియైన శిక్షణను ఇచ్చారు. ఇంకొక ముఖ్యమైన విషయం, 'రాధాకృష్ణ' నాటకానికి భగవాన్ బాబావారే స్వయంగా పాటలు వ్రాశారు! భగవాన్ బాబావారి జన్మదినోత్సవాల ముగింపు సందర్భముగా 23వ తేదీ సాయంత్రం ఝూలా ఉత్సవంలో స్వామి అందముగా అలంకరింపబడిన ఉయ్యాలలో నయనానందకరముగా ఊగుతూ అక్కడ చేరిన లక్షలాది భక్తులకు కనువిందు చేస్తూండగా ప్రశాంతి నిలయం కేంపస్‌కు చెందిన సీనియర్ విద్యార్థులు తెలుగు, హిందీ, ఇంగ్లీషు భాషలలో ఆ ఉత్సవం కొరకు ప్రత్యేకంగా కూర్చబడిన కొన్ని భక్తి గీతములను హృదయాలను కదిలించే రీతిలో గానం చేశారు.

ది. 23-11-1985 తేదీ సూర్యోదయంవేళకు ప్రశాంతి నిలయములోని హిల్ వ్యూ స్టేడియం ప్రపంచములోని అన్ని ప్రాంతాలనుండి వచ్చి చేరిన

లక్షలకొలది భక్తులతో ఒక మానవ సముద్రమువలె గోచరించింది. వైభవోపేతమైన ఆ పర్వదినం నాడు ప్రాతస్సంధ్యా సమయంలో ఒక్క లిప్తపాటు కాలం అవతార పురుషులైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య దర్శనం చేసుకునేందుకు ఇసుక వేస్తే రాలనంతగా ఎక్కడ చూచినా జనం తీవ్ర ఉత్కంఠతో ఎదురుచూచారు. ఆ రోజున ఉదయంపూట కార్యక్రమం పూర్తయ్యేవరకు సూర్య భగవానుడుకూడా మబ్బుల చాటున దాగుండి బయటకు రాలేదు. చల్లని, ఆహ్లాదకరమైన ఆ వాతావరణం అక్కడ భగవాన్ బాబావారి ఆగమనానికి ఎదురు చూస్తూ కూర్చున్న 5 లక్షలకు పైగా భక్తుల హృదయానందమునకు దోహదం చేసింది. అపూర్వమైన ఆ దివ్యానుభూతిలో పాలు పంచుకున్న కొందరు భాగ్యశాలుర నోటినుండి ఆ కథనమును విందాం.

ఆరోజున ప్రశాంతి మందిరంనుండి హిల్ వ్యూ స్టేడియం వరకు సాగే ఊరేగింపులో భగవాన్ బాబావారి రథముముందు భాంగ్రా మరియు నాగా నృత్యములు చేస్తూ వెళ్ళే బృందములో విశ్వవిద్యాలయము మరియు స్కూలులో చదివే విద్యార్థులు కొందరికి అవకాశం లభించింది. వారి ఆనందదాయకమైన అనుభవం ఈ విధంగా ఉన్నది. "మేము ఆ నృత్యములో పాల్గొనడంకొరకు అవసరమైన దుస్తులు, మేకప్ వేసుకునేందుకు ఉదయం 5 గంటలకు ప్రశాంతి మందిరంవద్దకు వెళ్ళాము. ఊరేగింపు 7-30కు బయలుదేరవలసి యున్నది. ఇంతలో స్వామి 6 గంటల 45 నిమిషాలకు ఇంటర్వ్యూగదినుండి బయటకు వచ్చారు. అప్పుడు మేమంతా భజనహాలులో ఉన్నాము. స్వామి భజనహాలులోనికి నేరుగా నడచి వచ్చారు. అది చూచి మేమంతా చాలా ఆనందించాము. పరమ పవిత్రమైన భగవాన్ జన్మదినంనాడు ఐహుశా ఆయనను మొట్టమొదటగా దర్శనం చేసుకున్నది మేమే నేమో! ఆయన మా అందరివైపు పరీక్షగా చూచి చాలా సంతోషించారు. మాలో కొందరి తలపాగాలను ఆయన స్వయంగా సరిచేసి అందంగా ఉంచేటట్లు చేశారు. తరువాత ఆయన 'పిల్లలూ! మీరందరూ టిఫిన్ తిన్నారా?' అని అడిగారు.

మేము ఎవ్వరమూ అప్పటికి ఇంకా బ్రేక్‌ఫాస్ట్ చేయనందున, మౌనంగా ఉండిపోయాము. మేము గనుక నిజం చెపితే స్వామి బాధపడతారని మాకు తెలుసు. అప్పుడు బాబా చిరునవ్వు నవ్వుతూ 'నాకు తెలుసు, నాకు తెలుసు.. మీరేమీ తినలేదు. టిఫిన్ తినకపోతే డాన్స్ ఎలా చేస్తారు? కార్యక్రమం పూర్తయ్యేదాకా ఎలా ఉండగలరు? కార్యక్రమం అయ్యేటప్పటికి చాలా ఆలస్యమవుతుంది. .... సరే! మీరేం బాధపడకండి, నేను మీకు ఫలహారం ఏర్పాటు చేస్తాను'; అని చెప్పి కొందరు వలంటీర్లను పిలిచి మాకు బ్రేక్‌ఫాస్ట్ తీసుకురమ్మని చెప్పారు. ఆయన మాతృప్రేమకు మేమంతా పులకించిపోయాము. మాలో కొందరికి కన్నీళ్ళు కూడా వచ్చాయి. తమ 60వ జన్మదినోత్సవంనాడు భగవాన్ మాపై అనుగ్రహమును వర్షిస్తూ నెరవేర్చిన మొట్టమొదటి కార్యక్రమం అదీ! ఆ ఊరేగింపులో స్వామి రథంముందు నృత్యం చేస్తూ వెళ్ళే అవకాశం లభించడం మా అదృష్టం. అంతసేపు ఊరేగింపులో నృత్యం చేస్తూ వెళ్ళిన మాకెవ్వరికి అలసట అనిపించలేదు. పైగా, అయ్యో! అప్పుడే ఊరేగింపు అయిపోయిందా! అని మేము విచారించాము కూడా!"

శ్రీమతి నామగిరియమ్మ భగవాన్ బాబావారికి చిరకాలమునుండి భక్తురాలు. ఆమె పుట్టపర్తిలోని 'పాతమందిరం'లో స్వామి దివ్యసన్నిధిలో చాలా సంవత్సరాలు జీవించారు. భగవాన్ బాబావారి 60వ జన్మదినోత్సవం తరువాత తన అనుభవాలను ఆమె ఈ విధంగా వర్ణిస్తున్నారు.

"1950 వ సంవత్సరానికి పూర్వం మేము పాత మందిరంలో నివసిస్తున్నప్పుడు, స్వామి పూర్తిగా మాతో కలసే ఉండేవారు. రోజస్తమానం ఆయన మాతో గడిపేవారు. ఒక్కొక్కప్పుడు, రోజంతా ఆటపాటలతో గడిచిపోయేది. ఆ రోజుల్లో ఒకనాడు నన్ను, సాకమ్మను పిలిచి 'నా 60వ జన్మదినోత్సవంనాడు ఈ గ్రామంలో లక్షలాది భక్తులు చేరుతారు. నేనొక విశ్వవిద్యాలయమును కూడా నెలకొల్పుతాను. శ్వేతాశ్వములు పూన్చిన బంగారు రథంలో నేను ఊరేగింపుగా వెడతాను', అని చెప్పారు. ఆయన మాటలలో ఎక్కడా హాస్యధోరణి కనిపించలేదు. చాలా గంభీరంగా ఉన్నాయి.

ఆ రోజుల్లో సుమారు ఒక వందకు లోపు మాత్రమే స్వామిని వెంటనంటి ఉండేవారు. మేమిద్దరం స్వామి మాతో పరిహాసంగా ఈ మాటలు చెపుతున్నారని అనుకుని నవ్వు ఆపుకోలేకపోయాము. అప్పుడు స్వామి మావైపు గంభీరంగా చూస్తూ 'నేను చెపుతున్న విషయాలలో మీకు నమ్మకం కలిగినట్లులేదు. అప్పటికి వాటిని చూడడానికి సాకమ్మ బ్రతికి ఉండదు' అని చెపుతూ నావైపు తిరిగి 'కాని నువ్వు మాత్రం బ్రతికే ఉంటావు, చూస్తావు. అయితే, ఇప్పుడున్నంత దగ్గరగా ఆనాడు నన్ను చూడలేవు' అని చెప్పారు.

ఈనాడు సుమారు నలభై సంవత్సరాలకు పూర్వము స్వామి చెప్పిన మాటలు పూర్తిగా నిజమయ్యాయని నేను ఘంటాపథంగా చెప్పగలను! 23వ తేదీ ఉదయం నేను గణేశ్ గేటు బయట రోడ్డు ప్రక్కన బ్రహ్మాండమైన జన సమూహంమధ్య స్వామిని ఒక్కక్షణం పాటు దర్శించుకోవడానికి నిలబడి ఉన్నాను. దూరంనుండి స్వామి ఆసీనులైయున్న బంగారు రథం చూస్తూంటే స్వామి ఆనాడు మాతో అన్న మాటలు గుర్తుకు వచ్చి నాకు కన్నీళ్ళు ఆగలేదు. రథం నాముందునుండి వెడుతున్నప్పుడు ఆయన నావైపు చూడడం మరచిపోలేదు. నన్ను చూచి చిరునవ్వు నవ్వారు. ఆ చిరునవ్వులో పాత జ్ఞాపకాలను గుర్తుకు తెచ్చే ఎన్నో అర్థాలున్నాయి. 'చూడు! ఆ రోజు నువ్వు నా మాటలు నమ్మలేదు', అని ఆయన నాతో అంటున్నట్లు అనిపించింది. భగవాన్ బాబావారి దివ్య వైభవమును ఈనాడు కన్నులారా కాంచే అదృష్టం నాకు లభించినందుకు నేను స్వామికి ఎంతో కృతజ్ఞురాలిని".

ట్రినిడాడ్, టొబాగోకు చెందిన శ్రీ నైపాల్ సుఖ్‌దేవ్ శ్రీ సత్యసాయి సేవాసంస్థల నాలుగవ ప్రపంచ సమ్మేళనంలో ప్రతినిధిగా పాల్గొనేందుకు 1985వ సంవత్సరంలో మొట్టమొదటిసారిగా ప్రశాంతి నిలయమునకు వచ్చారు. అయితే, ఆయన చాలా సంవత్సరాలనుండి భగవాన్ బాబావారి భక్తులుగా

ఉంటూ తన దేశములో స్వామియొక్క ఎన్నో లీలలను ప్రత్యక్షంగా చూచారు. నవంబరు 23వ తేదీన భగవాన్ బాబావారి 60వ జన్మదినోత్సవమునాడు హిల్‌వ్యూ స్టేడియంలో తాను చూచిన దృశ్యాలను ఇలా వర్ణిస్తున్నారు :

"అలనాడు కురుక్షేత్ర సంగ్రామంలో శ్రీ కృష్ణ పరమాత్మ నడిపిన రథము నమూనాలో తయారు చేయబడి అందమైన నాలుగు శ్వేతాశ్వములు పూన్చిన బంగారు రథముపై ఆసీనులై భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు హిల్‌వ్యూ స్టేడియంకు వచ్చారు. ఆ రథమునకు ముందు నాదస్వర బృందము, విద్యార్థుల బేండు మరియు రంగురంగుల, కళ్ళు మిరుమిట్లుగొలిపే దుస్తులు ధరించిన విద్యార్థులు నాట్యము చేస్తూ ఊరేగింపుగా వెళ్ళారు. ఆ రథం మా ముందు నుండి వెడుతూన్నప్పుడు నాలో 'ఆహా! ప్రస్తుత కలియుగములో అవతార పురుషులు భగవాన్ బాబావారే కదా!' అనే ఒక ఆలోచన నా మనసులో మెదిలింది. చిరునవ్వులు చిందులాడే భగవాన్ బాబావారి సుందర వదనారవిందమును మేమంతా స్పష్టంగా దర్శించుకోగలిగాము. మల్లెపూలవంటి తెల్లని పలువరుస, నల్లని కిరీటమువంటి ఉంగరాల జుట్టుతో నిండిన భగవాన్ బాబావారి వదనముపై బంగారు కాంతులీనే దేహచ్ఛాయ దేదీప్యమానంగా వెలిగిపోతూ దర్శనమిచ్చింది. ఆ విధంగా రథంలో ఆసీనులైన దివ్య మంగళ విగ్రహుడైన భగవాన్ అక్కడ సమావేశమైన అశేష భక్తజన సందోహమును చూచి రెండు చేతులూ పైకెత్తి ఆశీర్వదిస్తూ ముందుకు సాగిపోయారు.

నా నేత్రములు నా ప్రభువును దర్శించుకునే భాగ్యమునకు నోచుకున్నాయి. ఆయనే నా రాముడు, కృష్ణుడు, శివుడు, దుర్గ, ఏసుక్రీస్తు, అల్లా, ఇంకా నా సర్వస్వమూ! స్వామి అందముగా అలంకరింపబడిన శాంతి వేదికపై అమర్చబడిన సింహాసనమును అధిరోహించగానే లక్షలాది భక్తులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ 'భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారికి జై!' అని దిక్కులు పిక్కటిల్లేటట్లు జయజయ ధ్వానాలు చేశారు. ఆ జయజయ ధ్వానాలతో ఆకాశమే దద్దరిల్లుతోందా అనిపించింది. ఇంతలో ఆకాశంపై

దట్టమైన నల్లని మేఘాలు క్రమ్ముకుని ఏ క్షణంలోనైనా కుంభవృష్టి కురుస్తుందా అనిపించేటట్లు వాతావరణం మారింది. ఒక పెను తుఫాను ఆంధ్ర తీరమును దాటనున్నదని, దాని ప్రభావం వలన ఆ ప్రాంతములో కుంభవృష్టి కురిసే అవకాశమున్నదని అంతకు ముందు వెలువడిన ఒక వాతావరణ హెచ్చరిక ఆ సమయంలో మాలో చాలామందికి జ్ఞాపకం వచ్చింది. అయితే, మన సాయి ప్రభువు దివ్యసన్నిధిలో ఉన్న మనం భయపడవలసిన అవసరం ఏమున్నది? ప్రభువు దివ్య సంకల్పము వలన కార్యక్రమం జరుగుతూన్నంతసేపు ఒక చిన్న చినుకుకూడా పడలేదు. దానికి బదులుగా సూర్యరశ్మివలన కలిగే వేడి మాకు తగులకుండా ఆహ్లాదకరమైన మబ్బుతెర ఆకాశమును కప్పివేసింది!".

భగవాన్ బాబావారు తమ దివ్యోపన్యాసంలో అత్యంతాశ్చర్య కరంగా ఆ తుఫాను మటుమాయమవడం గురించి కూడా ప్రస్తావించారు. 'కార్యక్రమం మొదలు పెడుతూనే కస్తూరి నావద్దకు వచ్చి స్వామీ! నెల్లూరు, ఒంగోలు వైపు తుఫాను వస్తుందని రేడియోలో చెప్పారు. రాయలసీమకు కూడా వస్తుందట', అని చెప్పాడు. 'నీవేమీ భయపడకు కస్తూరీ! మన భక్తులకు ఏవిధమైన అననుకూలము జరుగదు. వారి భక్తే వారిని ఛత్రమువలె కాపాడుతుంది, అన్నాను. ఆ తుఫానే వచ్చివుంటే ప్రజలందరు ఎన్ని అవస్థలకు గురి అయ్యేవారో! ఇదంతా స్వామి చేశారా? కాదు, కాదు, మీ ప్రేమ హృదయమే స్వామిని అట్లా మార్చగలిగింది. వెన్న చేతిలో పెట్టుకున్నంత మాత్రాన కరుగుతుందా? వేడి చూపాలి కదా! అదే విధముగా స్వామి హృదయం వెన్నవంటిదైనప్పటికి భక్తి ప్రపత్తులనే వేడి చూపినప్పుడే అది కరుగుతుంది. రెండవ దినము చూస్తే తుఫాను ఎక్కడికి పోయిందో, ఏమైనదో ఎవరికి తెలియదు. ఈ పది దినములు వాతావరణము ఎంత పవిత్రంగా ఉన్నదో, ఎంత దివ్యమైన భావములతో మీరు కార్యక్రమములలో పాల్గొన్నారో మీకు, స్వామికి మాత్రమే తెలుసు. అన్యులకు ఇది అర్థమయ్యేది కాదు'.

నాతోటి భక్తులు, ప్రతినిధులతో కలసి ఆ సభాప్రాంగణంలో కూర్చున్నప్పుడు కలియుగ అవతారియైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి 60వ జన్మదినోత్సవ సందర్భముగా స్వామి దివ్య చరణారవిందముల వద్ద చేరిన మనందరం ఎంతటి అదృష్టవంతులమోనని నేను ఆశ్చర్యపోకుండా ఉండలేకపోయాను".

చరిత్రాత్మకమైన, 90 నిమిషాలపాటు కొనసాగిన తమ జన్మదిన సందేశములో భగవాన్ బాబావారు మానవునికి, భగవంతునికి మధ్యగల విడదీయరాని సంబంధమును గురించి వివరిస్తూ ఈ సందర్భంగా భక్తుల అపోహలు అనేకం తొలగించారు. మానవజాతిపై తమకు గల అపారమైన కరుణతో భగవాన్ 'సాయి సంకల్పము' మానవజాతి సౌభాగ్యముకొరకు ఏవిధంగా పనిచేస్తున్నదీ వెల్లడించారు. తాను ప్రపంచమంతటిలోను గొప్ప ధనవంతుడనని, తన కున్నంత సంపద, ఐశ్వర్యము లోకములో మరెవ్వరికి లేదని, తన సంపదంతా నిస్వార్థ, నిర్మల ప్రేమయేనని ప్రకటించారు. ఆ దివ్యోపన్యాసములోని కొన్ని భాగములను ఇక్కడ ఉదహరించడం సమంజసంగా ఉంటుందని భావిస్తున్నాను.

"మానవత్వమునకు ఆధారమైనది దైవత్వమొక్కటే! ఎంతధనమున్నా ఎంత బలమున్నా, విద్య ఉన్నా, వినయమున్నా భక్తి, ముక్తులకు అవి పనికిరావు. త్యాగమునందే అమృతత్వము ప్రాప్తిస్తుందిగాని, లోభమునందు కాదు. దురదృష్టవశాత్తు బాధలను కలిగించే లోభమందు మాత్రమే వాసనలను అభివృద్ధి పరచుకుని, మానవుడు బంధితుడవుతున్నాడు. కనుక, మానవత్వములోని దివ్యత్వమును గుర్తించడానికి సత్సంగములో చేరి, సన్మార్గములో ప్రవేశించడానికి కృషి చేయాలి. ఇదే ప్రధానమైన మానవధర్మము".

"మానవునకు దైవము ఎంత ప్రధానమో, దైవమునకు మానవుడు అంతే ప్రధానము. మానవుడే లేకపోతే దివ్యత్వ ప్రకటనకే అవకాశము లేదు. కుమారుడు ఉన్నప్పుడే తండ్రి అనే పదానికి అర్థం ఉంటుంది. నరుడు అనే

పదమున్నప్పుడే నారాయణుడు అనే పదానికి విలువ. దైవము మానవుని ఏవిధంగా సృష్టిస్తున్నాడో, మానవుడు కూడా సాధన రూపంలో దైవాన్ని సృష్టించుకోవాలి. అదే సాక్షాత్కారము. తన తత్త్వాన్ని తాను గుర్తించి, సరియైన మార్గములో ప్రవర్తించినప్పుడే తన స్వరూపాన్ని, తన ఆకారాన్ని తాను గుర్తించడానికి వీలవుతుంది. దైవత్వాన్ని గుర్తించడం అందరికి సాధ్యం కాదు. కొన్ని బలహీనతల కారణంగా మానవుడు మూర్ఖత్వమును పెంచుకుంటున్నాడు. ఈ మూర్ఖత్వము చేతనే కృతఘ్నుడుగా మారుతున్నాడు".

"అన్ని ఆకారములకు శత్రుత్వమున్నది గాని, సాయికి మాత్రము ఎక్కడా శత్రువులు కనిపించరు. కొందరు అపోహలను అభివృద్ధి పరచుకుని బాహ్యచర్యలను మాత్రమే చూస్తూ హృదయ తత్త్వమును విస్మరించడంచేత, సాయికికూడా శత్రువులు వున్నట్లు భావిస్తారు. వారి దృష్టిలో శత్రువులు ఉన్నట్లు కనిపించవచ్చునుగాని, నా దృష్టిలో శత్రువులు ఎవ్వరూ లేరు. నాకు అందరూ ప్రియులే! నాకున్నంత సంపద, ఐశ్వర్యము లోకములో మరెవ్వరికి లేదు. నాకున్నంత సంపద ప్రపంచబ్యాంకులో కూడా లేదు. ఏమిటా సంపద? ఏమిటా ఐశ్వర్యము? నిస్వార్థమైన, నిర్మలమైన ప్రేమ. నిస్వార్థ, నిర్మల ప్రేమతో జీవితం గడపడం చేతనే నా శరీరముకూడా ఎంతో తేజోమయంగా ఉంటున్నది. ఈ దేహములో ఎట్టి బలహీనతలు లేవు. దీనికి కారణము నా పవిత్రమైన గుణమే! ఇట్టి తత్త్వమును లోకులు గుర్తించడానికి ప్రయత్నించరు. బాహ్య చర్యలను మాత్రమే దృష్టియందుంచుకుని బలహీనతలుగా భావిస్తూ మాట్లాడుతూంటారు.

నాది నిస్వార్థ స్వభావము. పరోపకార దృష్టిగల హృదయము. అందరి యోగక్షేమాలను కోరే స్వభావము. లోకానందమే నా ఆనందముగా భావించే హృదయము. ఇట్టి హృదయం కనుకనే దినదిన ప్రవర్ధమానమైన ఆనందముతో జీవితము గడుపుతున్నాను. నాలో ఏక్షణమైనా విచారమన్నది కనిపించదు".

"సంకల్పించినంతనే సిద్ధించడం సాయితత్త్వం. కాలేజీ నిర్మాణ సంకల్పం కలిగిన తక్షణమే రాజమాత కాలేజీ కట్టించింది. భిక్షమడగలేదు. ఆశయాల అభివృద్ధి ఈ రూపం దాల్చింది. చిన్నతనమునుండియే పిల్లలను చక్కగా అభివృద్ధి పరచడానికి స్కూలు పెట్టాలని సంకల్పించడంతోటే ఇటలీ ప్రధాని సోదరుడు క్రాక్సీ వచ్చి ఈ స్కూలు నేను కట్టిస్తానన్నాడు. హయ్యర్ సెకండరీ స్కూలు కూడా ఉంటే చిన్నప్పటినుండి పిల్లలను చక్కని క్రమశిక్షణతో పెంచవచ్చును గదా అని సంకల్పించుకున్నాను. తక్షణమే అమెరికా నుండి బొజానీ అనే ఆయన వచ్చి హయ్యర్ సెకండరీ స్కూలు కట్టించాడు. బెంగుళూరులో హాస్టలు, కాలేజీలుకూడా సంకల్పించుకున్న తక్షణమే కోవన్ సతీమణి వచ్చి వీటిని పూర్తి చేస్తానని బాధ్యత వహించింది. సిద్ధి జరిగే రీతిగా ఉంటేనే సాయికి సంకల్పము కలుగుతుంది. అలాంటి సంకల్ప బలము ఉన్నందుననే ఇలాంటి కార్యములు చేయడానికి వీలవుతుంది. దీనిని మీరు గుర్తించాలి".

"మీ భక్తి ప్రపత్తులు చాలా ఉత్తమమైనవి. మీ సహనము, శాంతము ఇంత, అంత అని చెప్పడానికి సాధ్యంకాదు. అయితే, నా వారిని నేను పొగడడం భావ్యంకాదు. ఎన్ని దేశాలనుండో వచ్చారు. విదేశీయులు ఎన్నో అనుకూలములు, సౌకర్యములు అనుభవించినటువంటివారు. కాని, ప్రశాంతి నిలయములో అన్నీ అననుకూలములే! ఇట్టి పరిస్థితులలో సాయి ప్రేమను సాధించడమే నిజమైన తపస్సు. ఈ తపస్సును దినదినాభివృద్ధి గావించుకుని మీ ఆదర్శములను, మీ ప్రేమతత్త్వమును గ్రామగ్రామాల్లో వీధివీధిన ప్రబోధించి, ఆనందించి, భారతదేశమునకు కీర్తిని తేవాలి. సాయి కోరేది ఒక్కటే! సోదర మానవులను ప్రేమించి, సమాజసేవలు చేసి, మానవత్వమునకు సార్థకతను సంపాదించుకోవాలి. స్వార్థమును త్యాగం చెయ్యండి. పరార్థములో ప్రవేశించండి. పవిత్రతను పెంచుకోండి. దీనులను ఆదుకోండి.

60వ జన్మదినోత్సవములో ఒక పరీక్ష కూడా ఉన్నది. ఇందులో నెగ్గినవారే నిజమైన సాధకులు. ఎన్ని కష్టములకైనా, నష్టములకైనా, ఎన్ని దుఃఖములు,

నిందలు, నిష్కారములకైనా వెరువకుండా దీనిని సాధించడానికి కంకణం కట్టుకోండి. పంటపండించిన రైతు ధాన్యాన్ని ఇంటికి తెచ్చుకునే సమయంలో తూర్పారపడతాడు. అప్పుడు గట్టి గింజలు క్రింద నిలుస్తాయి. పొల్లు గాలికి కొట్టుకు పోతుంది. అదే విధముగా, ఇందులో గట్టిగింజలెన్నో, ఒట్టి గింజలెన్నో తేలిపోతుంది".

"మరొక విషయం. 60 సంవత్సరముల తరువాత స్వామి అందరికి చిక్కడని, స్వామిలో మార్పు వస్తుందని భక్తులు ఆందోళన పడుతున్నారు. నాది మారే స్వభావము కాదు. స్వామి భక్తులకు దూరమవుతారని అనుకుంటున్నారు గాని, అట్లు ఎన్నటికి జరుగదు. ఇంకా అధికంగా స్వామి సమీపమైపోతాడు. మారేది దైవత్వము కాదు. సత్యమైనది, సత్యసాయి తత్త్వము. కనుక, నాలో మార్పు ఏనాటికి రాదు. అపోహలను దూరం చేసుకుని సేవలలో పాల్గొనండి.

సాయిని వదలి మీరుగాని, మిమ్మల్ని వదలి సాయిగాని ఉండడం వీలుకాదు. దీనిని దృఢం చేసుకుని మీరు సేవలో ప్రవేశించండి".


సాక్షాత్తూ భగవంతుడే అవతార పురుషుడై దిగివచ్చి కార్యక్షేత్రంలో ప్రవేశించి నిరంతర కర్మతత్పరుడైయున్న తరుణంలో మనం మన భాగ్యంకొద్ది జీవిస్తున్నామని సదా జ్ఞప్తియందుంచుకోవాలి. నిజానికి, అవతార పురుషులు నెరవేర్చవలసిన కర్తవ్యములు గాని, పొందవలసిన, పొందదగిన ఫలములుగాని ఉండవు. అయినప్పటికి వారు నిరంతరం లోక కళ్యాణంకొరకు శ్రమిస్తూనే ఉంటారు. అవతార పురుషుడైన శ్రీ కృష్ణపరమాత్మయే స్వయంగా ఈ విషయాన్ని భగవద్గీతలో ఉద్ఘాటించాడు:

"న మే పార్థాస్తి కర్తవ్యం త్రిషు లోకేషు కించన
నానవాప్త మవాప్తవ్యం వర్తఏవచ కర్మణి".

సుమారు రెండువేల సంవత్సరాలకు పూర్వం ఈ భువిపై నడయాడిన రక్షకుడు (Messiah) ఏసుక్రీస్తును గురించి ఖలీల్ జిబ్రాన్ ఈ విధంగా వ్రాశాడు:

"మానవులం మనందరం ప్రవహించే నదులవలె కాలగమనంలో పయనిస్తూ నామరూపాలు లేకుండా పోతాము. అయితే, కాల ప్రవాహంలో కాలాతీతుడైన ఆ భగవంతునితో కొంతకాలం గడిపినవారు మాత్రం చిరకాలం జ్ఞాపకముండిపోతారు".

అవతారపురుషుడైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారికి మనం కేవలం సమకాలికులుగా మాత్రమే భావితరాలవారికి గుర్తుండిపోకూడదు. ఆ అవతార పురుషునితో చేయి, చేయి కలిపి ఈ ప్రపంచమును మనకు, మన భావితరాలవారికి కూడా ఒక సుందర స్వప్నసీమగా తీర్చిదిద్దే కృషిలో పాలు పంచుకుందాం! కదలిరండి!



12

జగద్గురువు

మానవుని, దేహాభిమానముచే బంధింపబడిన స్థాయినుండి ఆత్మవిమోచనస్థాయికి చేర్చే అవతార పురుషుని అవతరణకు అత్యంత ప్రామాణికమైన నిదర్శనము, అత్యున్నతమైన సత్యములను సమస్త మానవులకు అర్థమయ్యే రీతిలో అత్యంత సరళమైన భాషలో వివరించగలిగే అద్భుతశక్తి మరియు మానవ జీవిత పరమార్థమును గురించి సాధకులు ఏర్పరచుకునే బాహ్యంగా పరస్పర విరుద్ధముగా కనిపించే అభిప్రాయములను సమన్వయ పరచగలిగే దివ్య జ్ఞానసంపద. మానవాతీతమైన ఈ ప్రజ్ఞ, మహోన్నత సత్యములను సమకాలీన పరిస్థితులకు అనుగుణంగా సామాన్య మానవుల నిత్యజీవితంలోనుండి ఉదాహరణలను ఎంచుకుని వాటితో సమన్వయ పరుస్తూ బోధపర్చడంలో గోచరిస్తుంది. చిన్నలనుండి పెద్దలవరకు, పండితులనుండి పామరులవరకు ప్రతి ఒక్కరిని ఆకట్టుకునేలాగ చిన్న చిన్న కథలతో విశదీకరించడంలో ప్రస్ఫుటమవుతుంది. మానవ జీవితమునకు సంబంధించిన గంభీరమైన సూత్రములను అతి తేలికైన పదములతో, పదవిన్యాసముతో తేటతెల్లముగా బోధించడంలో వెల్లడవుతుంది. వీటన్నిటికి తోడు, మేధాసంపత్తితో సమకూర్చుకున్న విజ్ఞానమునకు, అంతరంగ అనుభూతికి మధ్యగల అంతరమును అనుసంధానము చేస్తూ ప్రాచీన మత గ్రంథములలో నిక్షిప్తమైన నిగూఢతత్త్వమును బహిర్గతం చేయగలిగే సహజ స్ఫూర్తి అవతార పురుషుల మరొక లక్షణము.

అటువంటి అవతార పురుషుని దివ్యబోధలు సర్వశాస్త్రములకు, సర్వజ్ఞానమునకు మూలాధారమైన విశ్వవిరాట్స్వరూపుని హృదయ సీమనుండి బయల్వెడలడంచేత, అవి తక్షణమే శ్రోతల హృదయాలకు హత్తుకుంటాయి.

అవి సులభ గ్రాహ్యమైనవి, ఆచరణ సులభమైనవి. వాటిని గనుక మనం త్రికరణశుద్ధిగా ఆచరిస్తే మనం మన జీవిత పరమార్థమును తప్పక చేరుకోగలము. దివ్య ప్రేమామృతధారలతో నిండిన ఆ బోధలను ఆలకించడానికి పండిత, పామరులందరూ ఉత్సుకత చూపుతారు. శ్రోతల హృదయాలలో ఆ అమృతవాక్కులు శాంతిని, ఆనందమును నింపుతాయి.

1980-85 సంవత్సరాలమధ్య అవతార పురుషుడైన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్యోపన్యాసములలోని బోధనాంశము, బోధనాశైలి, విధానము మరియు విషయ ప్రాధాన్యతలను గురించి అధ్యయనం చేసే ప్రయత్నం జరిగింది. అందులో 1980-82 సంవత్సరాలమధ్య భగవాన్ ఎంచుకున్న ముఖ్యాంశము, విద్య. ప్రశాంతి నిలయములోని శ్రీ సత్యసాయి కాలేజి 1980వ సంవత్సరములో స్థాపించబడింది. పరిగణిత విశ్వవిద్యాలయమైన శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ 1981వ సంవత్సరములో నెలకొల్పబడింది. 1983వ సంవత్సరములో స్వామి దివ్యోపన్యాసములలో ప్రధానంగా ఉద్ఘాటించిన అంశములు సర్వమత సమైక్యత, మానవజన్మయొక్క విశిష్టత మరియు అవతార ప్రాముఖ్యత. 1984వ సంవత్సరంలో భగవాన్ మానవుని పరివర్తన చెందుమని, దివ్యత్వమునుండి ఉద్భవించి దివ్యత్వములో ఐక్యమయ్యే మానవజన్మయొక్క అంతరార్థమును గుర్తించుమని ఉద్బోధించారు. ఇక 1985వ సంవత్సరములో స్వామి తమ దివ్యోపన్యాసములలో ముఖ్యంగా 'సేవ' మరియు 'సాధన' అనే రెండు అంశములపై దృష్టిని సారించారు. భగవాన్ బాబావారి 60వ జన్మదిన సంవత్సరమైన ఈ సంవత్సరంలోనే జన్మదిన సందర్భముగా పది రోజులపాటు జరిగిన వివిధ కార్యక్రమాలలో భాగంగా శ్రీ సత్యసాయి సేవా సంస్థల నాలుగవ ప్రపంచ సమ్మేళనం జరిగింది. అయితే, ఎప్పటి వలెనే భగవాన్ బాబావారు ఆ సందర్భంలో తమ దివ్యోపన్యాసములలో మానవునియొక్క ఆధ్యాత్మిక పరివర్తన మరియు సమాజ సంక్షేమములను గురించి నొక్కి చెప్పారు.

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారు అత్యున్నతమైన వేదాంత సత్యములను

అతిసరళమైన భాషలో వ్యక్తం చేస్తారు. ఉదాహరణకు "భ్రమ తొలగితే బ్రహ్మ సాక్షాత్కరిస్తుంది", అని ఆయన చెప్పిన మాటలలో వేదాంత సారము గోచరిస్తుంది. మానవ జీవిత పరమావధి, బ్రహ్మపదమును పొందడం. అదొక్కటే మానవునికి శాశ్వతమైన ఆనందమును ప్రసాదించి సమస్త దుఃఖమును, బాధలను నివారిస్తుంది. భగవాన్ తరచుగా 'సర్వం ఖల్విదం బ్రహ్మ' అనే ఉపనిషద్వాక్యమును ఉదహరిస్తారు. ఈ విశ్వమంతటా ఉన్నది బ్రహ్మము తప్ప వేరుకాదు. అయితే, మానవుడు మనోకల్పితమైన దేహాభిమానము లేక అహంకారముచే భిన్నత్వమును, భేదభావములను పెంచుకుంటాడు, దర్శిస్తాడు. ఇదే మహోన్నత సత్యమును భగవాన్ బాబావారు చాలా సులభశైలిలో ఒక చిన్న ఉదాహరణద్వారా వివరిస్తారు. "ఆధ్యాత్మిక గణితములో 3-1=1!" ఈ సందర్భములో భగవాన్ పరబ్రహ్మ తత్త్వమును పరమాత్మ, ప్రకృతి మరియు జీవాత్మలతో కూడిన త్రిమూర్త్యాత్మక తత్త్వముగా వర్ణిస్తారు. ప్రకృతిని ఒక దర్పణముగాను, పరమాత్మను బింబముతోను మరియు జీవాత్మను ప్రతిబింబముతోను పోలుస్తారు. దర్పణమును తొలగించినప్పుడు, కేవలం బింబము మాత్రమే మిగులుతుంది. దర్పణంతోపాటే ప్రతిబింబము కూడా అదృశ్యమవుతుంది. దేహాభిమానముచే ఏర్పడిన ప్రకృతి అనే మాయను తొలగించినప్పుడు, అనగా మనస్సును లయం చేసినప్పుడు జీవాత్మ పరమాత్మగా మారుతాడు.

అయితే, ఈ మాయను తొలగించడం ఎలా? భగవాన్ బాబా వారు దీనికి ఒక చక్కని ఉపాయమును సూచిస్తారు. "దృష్టి ప్రేమమయమైనప్పుడు, సృష్టి బ్రహ్మమయమవుతుంది. అదీ మనం చేయవలసిన సాధన. మన దృష్టిని ప్రేమమయంగా చేసుకోవాలి. ప్రేమ అనే సులోచనములద్వారా మనం ఈ ప్రపంచమును చూచినప్పుడు, సర్వమూ దైవమయంగానే కనపడుతుంది. అందువలన ప్రేమయే సర్వరోగనివారిణి". ఇంతేగాక, భగవాన్ బాబా వారు సమస్త సాధనల యొక్క సారమును ఈ విధంగా అతి తేలికైన పదములలో సూచించారుః

"విశ్వాసమెక్కడో ప్రేమ అక్కడ
ప్రేమ ఎక్కడో శాంతి అక్కడ
శాంతి ఎక్కడో సత్యమక్కడ
సత్యమెక్కడో ఆనందమక్కడ
ఆనందమెక్కడో దైవమక్కడ"

మానవతా విలువలన్నిటిలోను అత్యంత ప్రధానమైనది, మరియు అన్ని విలువలకు మూలాధారమైనది, ప్రేమ. అటువంటి ప్రేమను గురించి భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు

"ప్రేమ ఆలోచనారూపముగా ఉన్నప్పుడు సత్యముగా మారుతుంది, ప్రేమ కార్యరూపము దాల్చినప్పుడు ధర్మముగా రూపొందుతుంది, ప్రేమ భావములో ప్రతిఫలించినప్పుడు శాంతిగా వ్యక్తమవుతుంది, ప్రేమ అవగాహనాపరమైనప్పుడు అహింసగా వెల్లడవుతుంది,"

అని ఉద్ఘాటించారు.

"ఆధ్యాత్మిక మార్గములో విజయం సాధించడానికి ప్రధానమైన అర్హత ఏమిటి?" అనే ప్రశ్నకు భగవాన్ తనదైన శైలిలో అనృతత్వమును తొలగించడమొక్కటే అమృతత్వమునకు మార్గము (Removal of immorality is the only way to attain immortality) అని నొక్కి చెపుతారు. పవిత్ర హృదయము మరియు అకళంకమైన శీలము, ఈ రెండే ఆధ్యాత్మిక జీవితమునకు పునాదులు. అదే విషయాన్ని ఆయన ఒక చిన్న వాక్యములో చెప్పారు– "చిత్తశుద్ధియే జ్ఞానసిద్ధి". అయితే, అటువంటి చిత్తశుద్ధిని ఏవిధంగా అలవరచుకోవాలి, అనేది ప్రశ్న. అందుకు బాబాయే మళ్ళీ "నిష్కామకర్మద్వారా చిత్తశుద్ధి సిద్ధిస్తుంది", అని ఉద్ఘాటిస్తారు. నిస్వార్థసేవ ఒక్కటే ప్రాపంచికమైన కోరికలు మరియు అభిమానము అనే మనస్సుకు పట్టిన మాలిన్యమును తొలగించగలదు. అందువలన "సేవాసాధనయే అత్యున్నతమైన తపస్సు", అని స్వామి ఘోషిస్తారు. "ప్రేమతో భగవత్ప్రీత్యర్థముగా నెరవేర్చిన కార్యము ఆరాధనగా రూపొందుతుంది. అట్టి ఆరాధనా భావంతో నెరవేర్చిన

కార్యమువలన జ్ఞానము సిద్ధిస్తుంది", ("Work is transformed into worship when it is offered to God with love, work done with a sense of worship leads to wisdom") అని భగవాన్ ఒక సూక్ష్మమైన వాక్యములో ఆధ్యాత్మిక సాధనకు అవసరమైన మౌలికాంశములనన్నింటిని ఇమిడ్చి చెపుతారు. ఈ విధంగా ఆధ్యాత్మిక సాధనలోని ప్రథమ సోపానము, భగవద్విశ్వాసము మరియు భగవంతునియందు ప్రేమ. ఆ తరువాత మెట్టు, సాటి మానవులకు, జీవులకు నిస్వార్థసేవ చెయ్యడం.

ఈనాడు ప్రపంచము ఎదుర్కొంటున్న అనేక సమస్యలకు భగవాన్ బాబావారు సూచించే పరిష్కారము, చాలా మౌలికమైనది మరియు ఆచరణ యోగ్యమైనదీను. ప్రపంచ సంక్షేమానికి మార్గం, వ్యక్తి యొక్క పరివర్తనే! భగవాన్ బాబావారి దృష్టిలో

"హృదయంలో ధర్మచింతన ఉంటే
శీలంలో సౌందర్యం ఉట్టిపడుతుంది;
శీలంలో సౌందర్యం ప్రతిఫలిస్తే
గృహంలో సామరస్యం నిండియుంటుంది;
గృహంలో సామరస్యం ఉంటే
దేశంలో క్రమశిక్షణ నెలకొంటుంది;
దేశంలో క్రమశిక్షణ ఉంటే
ప్రపంచంలో శాంతి నెలకొంటుంది".

అధర్మ వర్తనులైన వ్యక్తులు సమాజంలో అలజడులను, అశాంతిని సృష్టిస్తారు. అందువలన, మానవుని హృదయంలో ధర్మచింతన సుస్థిరంగా నెలకొల్పడం ఎలా అన్నదే ముఖ్యమైన సమస్య. ఈ సందర్భంగా భగవాన్ బాబా "భగవద్విశ్వాసములేని మానవ సమాజము మృగములు సంచరించే అరణ్యముగా మారిపోతుంది", అని హెచ్చరిస్తారు. మానవుడు ఆధ్యాత్మికంగా పరివర్తన చెందినప్పుడే సమాజములో ధర్మప్రవృత్తి అభివృద్ధి చెందుతుంది.

ఇక, మానవుని హృదయంలో ఆధ్యాత్మిక పరివర్తన ప్రారంభం కావడం ఎలా? అందుకు భగవాన్ బాబా వారే నాలుగు 'F' ల పరిష్కారమును సూచిస్తున్నారు.

"Follow the Master,
Face the Devil,
Fight till the end and
Finish the game".

దీని భావం ఇంచుమించుగా ఇలా ఉంటుంది:

"అంతరాత్మను అనుసరించు,
దుర్గుణములను దూరం చేసుకోవడానికి ప్రయత్నించు,
లక్ష్యం నెరవేరేవరకు పోరాటం కొనసాగించు,
విజయాన్ని కైవసం చేసుకో"!

ఈ నాలుగు "F" ల మార్గము మానవుని హృదయంలో ఉండే అంతరాత్మను మరుగుపరచే అజ్ఞానపు తెరను నిర్మూలిస్తుంది. మానవ జీవితములో ఉండే నిత్యపోరాటము, అంతరాత్మ పిలుపుననుసరించి ఇంద్రియములు పన్నే మాయాజాలమునుండి తప్పించుకోవడానికి మనస్సు పడే అంతర్మథనం. ఆ అంతరాత్మ పిలుపే భగవంతుని దివ్యవాణి. ఈ సందర్భంగా భగవాన్ బాబా ఒక చిన్న పద్యంలో మనస్సుకు, బుద్ధికిగల భేదమును ఇలా వివరిస్తారు.

"మనసు నాధారముగ గొను మానవుండు
పశువుకంటెను హీనమై పతనమగును
బుద్ధి నాధారముగ గొను బుధజనుండు
పశుపతిగ మారునని పల్కె పర్తిసాయి"

అయితే, ఈ పోరాటము జరుపడానికి మానవుడు తాను జీవించే సమాజమునుండి దూరంగా అడవిలోనికి పోనవసరం లేదు. అందుకు మారుగా సమాజంలోనే జీవిస్తూ తన లక్ష్యమును సాధించవచ్చు. అందుకు కావలసిందల్లా

"ఆలోచనలు అడవిలోను (అనగా వైరాగ్యము) మరియు చేతులు సమాజంలోను! అనగా, నీ చేతులతో సమాజంలో పనిచెయ్యి; కాని, నీ మనస్సును భగవంతునిపై లగ్నం చెయ్యి",

అని బోధిస్తారు భగవాన్ బాబా. ఈ విధంగా, ప్రపంచములో సుఖశాంతులు మానవులు తమ హృదయంలో పెంచుకున్న భగవద్విశ్వాసముపై ఆధారపడి ఉంటాయి.

భగవాన్ బాబావారు సూక్ష్మమైన మహోన్నత సత్యములను హృదయాలను ఆకట్టుకునే రీతిలో చిన్న చిన్న ఉదాహరణలతో బోధిస్తారు. భారతీయ తత్త్వశాస్త్రములో 'కర్మ', 'ధర్మ', 'బ్రహ్మ'లను గురించిన చర్చ బహుకాలంగా జరుగుతున్నది. 'కర్మ' అనగా పుట్టినప్పటినుండి గిట్టేవరకు ప్రతిక్షణం ప్రతి జీవి ఆచరించేది. 'ధర్మ'మనగా ఆ కర్మలను నియంత్రించే సూత్రములు. 'బ్రహ్మ' అనగా మానవ జీవిత పరమావధి. ఈ మూడింటిమధ్య గల సంబంధమును వివరించడానికి భగవాన్ బాబా ఒక సామాన్య గృహిణియొక్క నిత్య జీవితంలోని ఉదాహరణను ఎంచుకున్నారు.

"మీరు తయారు చేసే కొబ్బరిపచ్చడిలో కొబ్బరి, ఉప్పు, మిరపకాయలు, చింతపండు అనే నాలుగు ముఖ్యమైన పదార్థాలు కలసి ఉంటాయి. ఈ పదార్థాలనన్నింటిని తెచ్చి సమపాళ్ళలో కలిపి రుబ్బటం 'కర్మ'. తరువాత ఆ పచ్చడిని కొంచెం తీసి నోటిలో వేసుకుని రుచిగా ఉందా లేదా అని చూచి, అవసరమైతే కొద్దిగా మార్పులు, చేర్పులు చేసి రుచిగా తయారు చేయడం, 'ధర్మం'. చివరగా, అలా తయారు చేసిన కొబ్బరి పచ్చడిని భోజనంలో కలుపుకుని తిని ఆనందించడం 'బ్రహ్మ'. దాంతో మీకోరిక తీరి, మీరు తృప్తిచెంది, ఆనందిస్తారు. అదియే 'బ్రహ్మ' – ఆనందము. ఆచరణ, అర్పణ, ఆరాధన – ఈ మూడింటితో కూడిన సాధన, నిర్మలాంతఃకరణకు మార్గము".

ఈ విశ్వమంతా దివ్యత్వము నిండియున్నది. ఈ విషయాన్నే భగవద్గీతలో శ్రీకృష్ణపరమాత్ముడు.

"బీజం మాం సర్వభూతానాం
విద్ధి పార్థ సనాతనం.....", అని చెప్పాడు.

అనగా "ఓ అర్జునా! సకల భూతములలోను అనాదిగా ఉన్న బీజమును నేనే!" అని ప్రకటించాడు. భగవాన్ బాబావారు ఈ మహోన్నత సత్యమును ఒక సర్వసామాన్యమైన ఉదాహరణ ఆధారంగా వివరించారు. "మనం ఒక చిన్న విత్తనమును నాటుతాము. అది ఒక మహావృక్షముగా పెరుగుతుంది. వేలకొద్దీ కాయలు కాస్తాయి. అవి పండుతాయి. వాటన్నిటిలోను మళ్ళీ విత్తనాలు ఉంటాయి. అదే విధంగా, భగవంతుని ఆ ఆదిమమైన బీజముతోను మరియు విశ్వమును ఆ మహావృక్షముతోను పోల్చవచ్చును. ఈ విశ్వములోని సమస్త జీవులు, దివ్యత్వము అంతర్భూతమైయున్న ఆ మహావృక్షముయొక్క ఫలములు. మానవుడు తనలో అంతర్భూతమైయున్న దివ్యత్వమును తెలిసికొనడానికి ప్రయత్నం చేసినప్పుడు అతనిలో ఉన్న దివ్యత్వము బహిర్గతమవుతుంది. ఇదే మానవజీవితమునకు గమ్యము".

భగవాన్ బాబా భగవంతుని బింబముగాను ఈ ప్రపంచమును ప్రతిబింబముగాను పోల్చారు. ఈ సందర్భంగా ఆయన ఒక ఉదాహరణను ఇస్తూ "చెట్టునిండా గెలలు వేసిన ఒక కొబ్బరి చెట్టును ఊహించుకో. ఆ కొబ్బరి చెట్టుయొక్క నీడ పొడుగ్గా ప్రక్కనే ఉన్న నేలమీద పడుతుంది. ఎవరైనా ఒక వ్యక్తి ఆ కొబ్బరి చెట్టును ఎక్కి కొబ్బరి కాయలు కోస్తున్నప్పుడు ఆ నీడలోని వ్యక్తి కూడా కొబ్బరి కాయలు కోస్తున్నట్లు కనపడుతుంది. అయితే, కేవలం నీడలోని కొబ్బరి చెట్టుయొక్క కాయలు కోయడానికి ప్రయత్నిస్తే, ఆ వ్యక్తి రెంటికి చెడిన రేవడిగా మారతాడు. అదేవిధంగా ఎవరైనా సాధకుడు భగవత్సాక్షాత్కారమును పొందగలిగితే, ఆతడు భౌతిక ప్రపంచములో కూడా విజయమును సాధిస్తాడు", అని చెపుతారు.

కర్మ, భక్తి, జ్ఞాన మార్గములు మూడూ ఆత్మసాక్షాత్కారమనే ఒకే గమ్యమునకు చేరుస్తాయి. అయితే, ఈ మార్గములలో మన ప్రయాణసాధనం మాత్రం కొంచెం వేరువేరుగా ఉండవచ్చు. ఈ విషయాన్ని బోధపరుస్తూ

భగవాన్ బాబా ఈ మూడు మార్గములను ఒకే గమ్యమునకు చేర్చే మూడు రకాల రైలు ప్రయాణముతో పోలుస్తారు. కర్మయోగము, ఒక వ్యక్తి ఒక రైలులో కొంతవరకు ప్రయాణంచేసి ఒక స్టేషనులో దిగి తరువాత రెండు, మూడు రైళ్ళు మారి తన గమ్యమును చేరుకోవడంవంటిది. భక్తియోగము, ఆ వ్యక్తి ప్రయాణం చేస్తున్న రైలు బోగీని మధ్యలో ఒక జంక్షనులో ఆ రైలునుండి విడదీసి గమ్యమునకు చేర్చే వేరొక రైలుకు తగిలించడం వంటిది. ఇక్కడ ఆ వ్యక్తి తాను ప్రయాణం చేస్తున్న రైలు దిగి వేరొక రైలు ఎక్కవలసిన అవసరం లేదు. అతను ప్రయాణం చేస్తున్న బోగీయే మరొక రైలుకు తగిలించబడుతుంది. ఇక, జ్ఞానయోగము రైలు ఎక్కినప్పటినుండి గమ్యము చేరేవరకు నేరుగా ఒకే రైలులో ప్రయాణం చేయడంవంటిది. ఈ సందర్భంగా భగవాన్ బాబా ఈ ఉదాహరణకు కొద్దిగా మార్పుచేసి కర్మ, భక్తి, జ్ఞాన మార్గములను ఈ విధంగా పోలుస్తారు.

"కర్మ మార్గంబు విడరాని కాలిబాట
భక్తిమార్గంబు సులువైన బండిబాట
జ్ఞానమన విమానంబుపై యాన మరయ"

భగవాన్ ధ్యానమును గురించి మాట్లాడుతూ "చాలా మంది పొరపాటుగా 'ధ్యానము'ను 'ఏకాగ్రత'గా భావిస్తారు. ఇది సరికాదు. ధ్యానము, ఇంద్రియాతీతమైనది, కాని ఏకాగ్రత ఇంద్రియ స్థాయిలో ఉంటుంది. ఈ రెండింటికి మధ్య చింతన (Contemplation) అనే సరిహద్దు రేఖ ఉన్నది", అని చెపుతారు. ఈ విషయాన్ని ఇంకా సులువుగా బోధపరచడానికి భగవాన్ బాబా ఒక ఉదాహరణను కూడా ఇస్తారు:

ఒక గులాబీ మొక్క ఉన్నది. దానికి కొమ్మలు, రెమ్మలు, ఆకులు, పువ్వులు మరియు ముళ్ళు ఉంటాయి. ఆ మొక్కనుండి గులాబీ పువ్వును కోయాలంటే ఏకాగ్రత అవసరం. అనగా,ముళ్ళు

గ్రుచ్చుకొనకుండా అతి జాగ్రత్తగా పువ్వును కోయడం, 'ఏకాగ్రత'.

ఆ విధంగా కోసిన గులాబీ పుష్పమును చేతిలో ఉంచుకుని దాని అందమును, పరిమళమును ఆనందించడం 'చింతన'. ఆ పువ్వును ప్రేమతో భగవంతుని పాదాలవద్ద సమర్పించడమే 'ధ్యానం'.

'మానవుని బంధ, మోక్షములకు రెండింటికి కారణ భూతమైనది మనస్సే' అనే విషయాన్ని గుర్తుచేస్తూ భగవాన్ బాబా 'మనయేవ మనుష్యాణాం కారణం బంధ మోక్షయోః' అనే సూక్తిని తరుచు ఉదాహరిస్తారు. ఆధ్యాత్మిక మార్గంలో ప్రగతికి మనోనిగ్రహమే ఉత్తమోత్తమమైన సాధన. అయితే, మనో నిగ్రహమును సాధించడం ఎలా అన్నదే ప్రశ్న. భగవాన్ ఈ సందర్భంగా 'మనస్సు ఒక తుమ్మెద వంటిది. నిస్సంశయంగా అది చాలా దృఢమైనది. ఎంతటి గట్టికర్రనైనా తొలిచి రంధ్రము చేయగల శక్తి దానికి ఉన్నది. అయితే, అదే తుమ్మెద ఒక పువ్వులోని మకరందమును పీలుస్తున్నప్పుడు సాయం సంధ్యాసమయంలో మెత్తని ఆ పువ్వు యొక్క రెక్కలు ముడుచుకొనిపోయి అందులో బంధింపబడుతుంది. అదే విధంగా, నిరంతరం యుక్తి, ప్రతియుక్తులతో చెలగాటమాడే, అవిశ్రామంగా ఒక విషయమునుండి మరొక విషయముమీదకు, ఒక వస్తువుమీదనుండి మరొక వస్తువుమీదకు, ఒకచోటనుండి మరొకచోటుకు ప్రతిక్షణం మారుతూ ప్రపంచమంతటా సంచారము చేసే చంచలమైన మనస్సును భగవంతునిపై లగ్నము చేసినప్పుడు, దాని చంచలత్వము నశించి భగవత్సాన్నిధ్యమును పొందుతుంది', అని వివరిస్తారు. ఈవిధంగా, భగవద్భక్తివలన మనో నిగ్రహము చేకూరుతున్నదనేది సుస్పష్టము.

"ఈ లౌకిక ప్రపంచములో జీవిస్తూ నిత్యజీవితంలో సూర్యోదయమునుండి సూర్యాస్తమయంవరకు అనేక కార్యములలో నిమగ్నులమైయున్న మనకు ప్రాపంచిక సంబంధాలు మరియు ఆకర్షణలకు లొంగి మనస్సు కలుషితం కాకుండా పవిత్రంగా ఉండడం సాధ్యమైన పనేనా?" అని మనలో ఒక సందేహము పొడసూపవచ్చు. భగవాన్ బాబావారు నిస్సందేహంగా ఇది సాధ్యమేనని ఉద్ఘాటిస్తున్నారు. 1983వ సంవత్సరం జూన్ నెల 16వ తేదీన

శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థలో విద్యాభ్యాసము చేసే విద్యార్థులతో మాట్లాడుతూ "ప్రియమైన విద్యార్థులారా! కాలము ఎంతో విలువైనది. మానవజీవితంలో విద్యార్థిదశ చాలా విలువైనది మరియు పవిత్రమైనది. అందువలన మీగందరు కాలమును సద్వినియోగము చేసుకోవాలి. పాలతో నీళ్ళు కలిసిన తరువాత ఎంత ప్రయత్నించినప్పటికి, వాటిని వేరుచేయుట మరియు పాలయొక్క స్వచ్ఛతను తిరిగి తెప్పించడం సాధ్యంకాదు. కాని పాలను మరిగించి తోడుపెట్టి పెరుగుగా చేసి అందులోనుండి వెన్న తీసిన తరువాత, ఇక దానికి నీటితో సంబంధము ఉండదు. ఆ వెన్న నీటిపై తేలుతూ తన ప్రత్యేకతను నిలుపుకుంటుంది. ప్రాపంచికమైన కోరికలు మరియు బంధములతో నిండిన సంసారము నీరువంటిది. మానవుని మనస్సు స్వచ్ఛమైన పాల వంటిది. స్వచ్ఛమైన, పవిత్రమైన, కాలుష్యరహితమైన మానవుని మనస్సు ప్రాపంచికమైన కోరికలనే నీటితో చేరినప్పుడు, కోల్పోయిన ఆ స్వచ్ఛతను తిరిగి పొందడం సాధ్యంకాదు. అయినప్పటికి, పవిత్రమైన ఈ విద్యార్థి దశలో స్వచ్ఛమైన మనస్సుతో విషయ పరిజ్ఞానము, జ్ఞానసంపద మరియు సచ్ఛీలము అనే వెన్నను పొందగలిగితే ఈ ప్రపంచములో ఉంటూకూడా ప్రపంచముయొక్క ఆకర్షణలనుండి మీ మనస్సు కలుషితం కాకుండా నీటిపై వెన్నవలె తేలుతూ ఉండగలరు."

"సుజ్ఞాన, ప్రజ్ఞానములను అందుకోవడానికి దేహాత్మ భావమును, అహంకారమును విసర్జించాలి. ఇది ఏ విధంగా సాధ్యపడుతుంది?" భగవాన్ బాబావారు ఒక చక్కని ఉపమానముతో ఈ ప్రశ్నకు సమాధానం చెపుతారు. మన శరీరముపై ఏదైనా ఒక కురుపు లేచినప్పుడు మనం దానిపై ఏదైనా ఆయింట్‌మెంట్ వ్రాసి అది తగ్గేదాకా రోజూ కట్టు కడతాం. అయితే, ఆయింట్‌మెంట్ రాయకుండా కట్టుమాత్రమే కడితే, అది సెప్టిక్ అయి ప్రమాదానికి దారి తీస్తుంది. అంతేకాకుండా మనం ప్రతిరోజూ ఆ కురుపును స్వచ్ఛమైన నీటితో శుభ్రంచేసి కట్టుకట్టాలి. అదే విధంగా, మన జీవితంలో మన వ్యక్తిత్వమనే శరీరముపై అహంకారమనే కురుపు లేచిందనుకోండి. ఈ

కురుపును మాన్పడానికి మనం ప్రతిరోజూ నిర్మలమైన ప్రేమ అనే నీటితో కడిగి, విశ్వాసమనే ఆయింట్‌మెంట్‌ను రాసి, దానిచుట్టూ వినయమనే బాండేజి కట్టాలి. లేకపోతే, ఆ కురుపువలన కలిగే నొప్పి మరియు బాధనుండి మీకు నివారణ లేదు".

ఆధ్యాత్మిక విషయాలను బోధించే ఏ ఆచార్యుని ప్రబోధలలోనైనా అత్యంత ఆసక్తికరము మరియు సందేశాత్మకము అయిన చిన్న చిన్న నీతికథలు ప్రముఖ స్థానమును వహిస్తాయి. జగద్గురువు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు ఉత్తమోత్తమమైన కథకులు. ఆయన చెప్పే కథలలో విజ్ఞాన, వినోదాలు రెండూ మిళితమై యుంటాయి. ఒకే కథనం వివిధ సందర్భాల్లో చెప్పినపుడు సందర్భానుసారంగా అందులో నూతనమైన సందేశము గోచరిస్తుంది. దానికి కారణం, ఆయన కథాకథనంలో చొప్పించే మార్పులు మరియు క్రొత్త కొత్త అంశములు. భగవాన్ తమ దివ్యోపన్యాసములలో సందర్భోచితంగా చెప్పే "చిన్న కథలు"; శ్రోతలను మంత్ర ముగ్ధులను చేస్తాయి.

భగవంతుని అనుగ్రహం పొందడానికి పాండిత్య ప్రకర్ష మరియు వాగాడంబరము సహాయపడవు. అమాయకమైన, స్వచ్ఛమైన పసిపాపవంటి హృదయమునిండా నిండిన భగవద్విశ్వాసమొక్కటే అద్భుతాలు సాధించగలదు. 1982వ సంవత్సరం జనవరి 23వ తేదీన మద్రాసు నగరంలో దివ్యోపన్యాసం చేస్తూ భగవాన్ బాబావారు ఈ విషయమును ఒక చిన్నకథ ఆధారంగా వివరించారుః "ఒకప్పుడు, భాగవతమును చక్కగా అధ్యయనం చేసిన ఒక గొప్ప పండితుడు బాలకృష్ణునియందు బృందావన గోప, గోపికలకు గల భక్తిని గురించి గొప్పగా వర్ణిస్తున్నాడు. బాలకృష్ణుడు పీతాంబరధారియై విలువైన ఆభరణాలను ధరించాడని చెపుతూ నెమలిపింఛమునుండి కాలి అందెలవరకు కృష్ణుడు ధరించిన ఆభరణాలను రసవత్తరంగా వర్ణించడం ప్రారంభించాడు. హరికథా కాలక్షేపమునకు వచ్చిన వారిలో ఒక దొంగకూడా ఉన్నాడు. ఆతడు సర్వాలంకార భూషితుడైన చిన్ని కృష్ణుని రూపవర్ణనకు ఆకర్షితుడైనాడు. ఎలాగైనా శ్రీ కృష్ణుని వెతికి పట్టుకుని ఆయన వంటిమీద ఉన్న ఆభరణాలను దోచుకోవాలనే

కోరిక కలిగింది ఆ దొంగకు. హరికథ పూర్తయ్యాక ఆ దొంగ ఆ పండితునివద్దకు వెళ్ళి కృష్ణుడు ఎక్కడుంటాడో చెప్పమని అడిగాడు. ఆ ప్రశ్నకు కొంచెం చికాకు చెందిన పండితుడు 'బృందావనంలో యమునా తీరంలో రాత్రిపూట ఉంటాడు, పో!' అని కటువుగా బదులు చెప్పాడు. అమాయకుడైన ఆ దొంగ పండితుని మాటలు నమ్మి వెంటనే అక్కడకు వెళ్ళాడు. శ్రీకృష్ణ పరమాత్మ సర్వాభరణ భూషితుడై పన్నెండేళ్ళ బాలునిగా ఆ దొంగకు దర్శనమిచ్చాడు. అయితే, ఆ బాలుని అలౌకిక సౌందర్యమునకు ముగ్ధుడైన దొంగ మనస్సులో అతని వద్దనుండి నగలను ఏ విధంగా దొంగిలించాలా అనే ప్రశ్న ఉదయించింది. సాక్షాత్తూ శ్రీకృష్ణపరమాత్ముని ముగ్ధమోహన సౌందర్యమును ఆస్వాదిస్తూ ఆనందానుభూతిలో మునిగియున్న దొంగకు బాహ్యస్మృతి లేదు. గంటలకు గంటలు శ్రీ కృష్ణునివైపు చూస్తూ ఉండిపోయాడు. తాను వచ్చిన పనే మరచిపోయాడు. ఆ అపురూప సౌందర్యరాశి శరీరమునుండి ఆభరణములను తీసియిమ్మని అడగడానికి నోరు రాక, సిగ్గుపడుతూ ఉండిపోయాడు. అయితే, సర్వాంతర్యామియైన శ్రీకృష్ణునికి ఈ సంగతి తెలుసు. అందువలన ఆయన ఒక్కటొక్కటిగా తన వంటిమీద ఉన్న ఆభరణములను తీసి నిశ్చేష్టుడై నిలబడిన ఆ దొంగకు ఇచ్చివేసి, తరువాత అదృశ్యమైపోయాడు!".

మరొక సందర్భంలో భగవాన్ బాబా విశ్వాసముయొక్క శక్తిని నిరూపించే రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో జరిగిన ఒక యథార్థ సంఘటనను గురించి కథగా చెప్పారు.

"రెండవ ప్రపంచయుద్ధసమయంలో భారత సైనికులు కొంతమంది ప్రయాణిస్తున్న ఒక ఓడమీద జపాను సైన్యం బాంబులు వేశారు. ఆ బాంబుల తాకిడికి ఓడమునిగిపోయింది. చాలామంది సైనికులు చనిపోయారు. కాని, ఐదుగురు మాత్రం లైఫ్‌బోట్ సహాయంతో ఒడ్డుకు చేరవచ్చని సముద్రములో దూకేశారు. సముద్రపు అలలమధ్య కొన్ని గంటలసేపు తేలియాడారు. చివరకు, అందులో ఒక సైనికుడు నిరాశా నిస్పృహలతో 'ఈ సముద్రం నన్ను మింగివేయటం తథ్యం! ఇందులో సొర చేపలు, తిమింగలాలు నన్ను

తినివేస్తాయి' అని భయంతో సముద్రంలో పడిపోయాడు. రెండవవాడు 'నేనిప్పుడు చనిపోతే నాకుటుంబం సంగతేమి కాను? నేను వారి భవిష్యజీవితానికి ఏమీ ఏర్పాటు చేయలేదు. ఎంతకష్టపడతారో!' అనుకుంటూ భయాందోళనలతో సముద్రపు అలలకు బలియైపోయాడు. 'ఇక, అయ్యో! నా ఇన్సూరెన్సు పాలసీ తాలూకు పత్రాలన్నీ నాదగ్గరే ఉండి పోయాయి. ఇప్పుడు నేను చనిపోతే నాభార్యకు ఇన్సూరెన్సు డబ్బు ఎలా వస్తుంది?' అని విలపిస్తున్న మూడవ సైనికునికూడా సముద్రము కబళించివేసింది. మిగిలిన ఇద్దరూ ఒకరికొకరు ధైర్యం చెప్పుకొని తమ విశ్వాసమును బలపరుచుకున్నారు. వారు 'మేము భయమునకు లొంగిపోము. భగవంతుని సర్వశక్తిమయత్వము మరియు కరుణలపై మాకు విశ్వాసమున్నది. ఆ విశ్వాసమును మేము విడిచిపెట్టము' అని తమలో తాము అనుకున్నారు. అయితే వారి పరిస్థితి ఏమంత ఆశాజనకంగా లేదు. వాళ్ళు ప్రయాణిస్తున్న లైఫ్‌బోటుకు చిల్లుపడి నీరు లోపలికి వచ్చేస్తోంది. ఆ పరిస్థితులలో దానినికూడా విడిచిపెట్టవలసివచ్చింది. అయినప్పటికీ వారిలో విశ్వాసము సడలలేదు. ఒడ్డుకు ఈదుకుంటూ రావడం మొదలుపెట్టారు. ఇంతలో కొద్ది నిమిషాలలో ఆ ప్రాంతంలో తిరుగుతున్న ఒక ఓడ వీరు ప్రయాణిస్తున్న ఓడ మునిగిపోవడంగురించి సంకేతములు పంపగా అందుకున్న ఒక హెలికాప్టరు వారిద్దరిని గుర్తించి క్షేమంగా ఒడ్డుకు చేర్చింది. ఆ తరువాత వాళ్ళిద్దరూ ఒకరికొకరు 'చావు బ్రతుకులమధ్య మనకు కేవలం ఒక్క ఐదు నిమిషాల వ్యవధి మాత్రమే ఉండింది' అని చెప్పుకున్నారు. భగవంతునియందు వారిద్దరికి గల అచంచల విశ్వాసమే జీవన్మరణ పోరాటంలో వారికి విజయము చేకూర్చింది. మిగిలిన ముగ్గురి విషయంలో విశ్వాసరాహిత్యమే వారి ఓటమికి, మరణమునకు కారణమైంది".

మనం చేసే ప్రతి పని భగవంతుని పనిగాను మరియు 'సర్వకర్మ భగవత్ప్రీత్యర్థం' అనగా మనం చేసే సర్వకర్మలు భగవంతుని ప్రీతికొరకేనని విశ్వసించాలి. ఆ విధంగా చేసినప్పుడు మనం చేసే కర్మలు భగవదారాధనగా

రూపొందడమే గాక మనం చేపట్టే ప్రతి కార్యక్రమములోను అత్యుత్తమ నైపుణ్యం ప్రతిఫలిస్తుంది. భగవాన్ బాబావారు, మొఘలుచక్రవర్తి అక్బరు జీవితంలోని ఒక ఆసక్తికరమైన సంఘటన ఆధారంగా ఈ సత్యమును నిరూపిస్తారు:

"ఒకనాడు అక్బర్ చక్రవర్తి తన ఆస్థానములోని ప్రఖ్యాత గాయకుడైన తాన్‌సేన్‌తో 'నీవు ఇంత మధురముగా, ఇంత మనోహరముగా, బ్రహ్మానందముగా పాడుచున్నావే? నీకు సంగీతము నేర్పిన గురువెవరు? వారిని ఒక పర్యాయము ఆహ్వానించి మన ఆస్థానములో వారి గాత్రకచేరి ఏర్పాటు చేయకూడదా?' అని అడిగారు. 'మహారాజా! నా గురువుగారు తన గ్రామమును విడిచి పట్టణములకు వచ్చెడివారు కాదు. వారి దివ్య గానమును వినగోరువారు ఆ గ్రామమునకే వెళ్ళవలసి యున్నది,' అని తాన్‌సేన్ చెప్పాగా 'సరి, అచ్చటికి యిపుడు వెళ్ళెదమురా',అని చక్రవర్తి లేచినాడు.

మారువేషములో ఇద్దరూ ఆ మహాపురుషుని సమీపమున చేరిరి. గురువుగారు తంబూరిని మీటుతూ యింటిలోని తన పూజామందిరమున భక్త్యావేశమున తన్మయులై తుంబుర, నారదాదులవలె బ్రహ్మానందమును వెదజల్లుతూ గానము చేసినారు. అది గ్రామమా, నగరమా, అరణ్యమా, గృహమా అనే స్మరణ లేకుండా యిద్దరూ ఆ గానానందములో మునిగి తేలిరి.

తరువాత ఢిల్లీ వచ్చినారు. రాజభవనమును చేరినారు. అప్పుడు ఆ గురువుగారి గానసుధను పొగడుతూ అక్బర్ చక్రవర్తి 'తాన్‌సేన్! నీవు సమర్థ గురువుదగ్గర శిక్షణ పొందిననూ ఒక దినమైననూ ఆ రకముగా నా యెదుట పాడలేదే', అన్నాడు. దానికి తాన్‌సేన్, 'మహారాజా! ఆయన దేవునికొరకై పాడుతాడు. కాబట్టి, ఆ గానము దివ్యముగా ఉన్నది. నేను నీకొరకు పాడుతాను. కావున నా గానము ఆ అమితానందమీయదు' అని జవాబిచ్చినాడు. పరమాత్మ ప్రీతిగా చేసే కర్మలే మధురముగా హృదయానందకరముగా వుండును. దానికే కర్మలను కృష్ణార్పణముగా చేయవలయునని గీత బోధించుచున్నది".

భగవాన్ బాబావారు ఒక్కొక్కప్పుడు ఏదైనా ఒక అంశమును లేదా భావమును శ్రోతల హృదయాలకు హత్తుకునేటట్లు బోధించాలనుకున్నప్పుడు, మాటలను చమత్కారంగా ఉపయోగించడం, మాటలతో గారడీ చేయడం చేస్తూంటారు. ఈ సందర్భంగా కొన్ని ఉదాహరణలు:

"స్వార్థపరుడు అత్యున్నతమైన భగవత్తత్త్వమును అందుకోలేడు. అందువలన మనం విశాలదృక్పథం అలవర్చుకొని సాటి మానవులకు నిస్వార్థభావముతో సేవ చెయ్యాలి. ముక్తిపథంలో కూడా మానవుడు కేవలం తన ముక్తికొరకే పాటుపడకూడదు. ఎంతసేపు 'నా ముక్తి', 'నాముక్తి' అని కాంక్షించడం, 'న ముక్తి' అనగా అసలు ముక్తియే లేని స్థితికి దారి తీస్తుంది".

ఆధునిక మానవుడు అణు విస్ఫోటనం సాధించగలిగే శాస్త్ర పరిజ్ఞానమును సంపాదించగలిగాడుగాని, హృదయంలో ప్రేమను పెంపొందించుకోలేక పోయాడనే సత్యమును వెల్లడి చేస్తూ భగవాన్ బాబా "ఈనాడు మనకు కావలసినది ప్రేమను పెంపొందించే శాస్త్ర విజ్ఞానము. అయితే, దురదృష్టవశాత్తూ 'ప్రేమ భావము'ను (Spirit of love) పెంపొందించుకోవడానికి బదులు, 'ప్రేమ విచ్ఛిన్నమే' (Split of love) మనకు సర్వత్రా గోచరిస్తున్నది. గడచిన యుగాలలో ఎన్నడూ లేనంతగా ఈనాడు శాస్త్ర విజ్ఞానము, నాగరికత అభివృద్ధి చెందాయి. అయినప్పటికి, శాస్త్రసాంకేతిక రంగాలలో ఎటువంటి పరిజ్ఞానము లేని అజ్ఞానాంధకారముతో నిండిన యుగాలుగా భావింపబడే ఆ కాలంలో మానవుడు ఇప్పటికంటె సుఖశాంతులతో నిండిన ఉత్తమ జీవితము గడిపాడు. ఈనాడు మానవుడు క్రూర మృగములకంటె హీనంగా ప్రవర్తిస్తున్నాడు. ప్రాణమంటే విలువ, గౌరవం లేకుండా పోయింది. అటువంటప్పుడు, మనం గొప్పగా చెప్పుకుంటున్న నాగరికతద్వారా సాధించిన ప్రగతి ఎక్కడున్నది"? అని ప్రశ్నిస్తున్నారు.

ప్రతి ఒక్కరూ మనశ్శాంతి కావాలని కోరుకుంటారు, కాని కొందరికి మాత్రమే దానిని ఏవిధంగా సాధించాలో తెలుసు. భగవాన్ బాబావారు

శాంతిసాధనలోని రహస్యమును తేటతెల్లముగా తెలియజేశారు. "చాలా మంది 'నాకు శాంతి కావాలి' అని కోరుకుంటారు. ఈ వాక్యములోని 'నాకు' మరియు 'కావాలి' అనే రెండు పదములు తీసివేస్తే మిగిలేది 'శాంతి'యే! అయితే, ఏ ఒక్కరూ కూడా 'నేను, నాకు' అనే అహంకారమును, 'కావాలి' అనే కోరికను విడిచిపెట్టడానికి ఇష్టపడడం లేదు. అటువంటప్పుడు, 'శాంతి' ఎక్కడినుండి వస్తుంది? చివరకు మిగిలేది 'పీస్' (Peace, అనగా శాంతి), కాదు, పీసెస్ (Pieces అనగా ముక్కలే)! అనగా, మానవ జీవితం అశాంతితో ముక్కలవుతుంది".

మానవుని జీవితములో 'క్షమ' యొక్క ప్రాముఖ్యతను గురించి ప్రస్తావిస్తూ భగవాన్ బాబా

"క్షమ సత్యము క్షమ ధర్మము
క్షమ వేదము క్షమ మహింస క్షమ యజ్ఞంబౌ
క్షమ సంతోషము క్షమ దయ
క్షమయే ఆధారమగును సర్వంబునకున్"

అని నొక్కి వక్కాణించారు. ఇంకా 'క్షమ లేకుండా మానవుడు క్షణమైనా సంతోషంగా జీవించలేడు. అది మానవునిలో దైవీగుణములను పెంచుతుంది. మానవుని అంతరంగములోనున్న దివ్యత్వమును వెలికితీస్తుంది', అని కూడా చెప్పారు.

భగవంతుని మనం ధనముచేత గాని అధికారముచేత గాని లేక శారీరక బలముచేత గాని మెప్పించలేము. "భగవంతుడు నీ భక్తిని చూస్తాడు, నీ శక్తిని కాదు, నీ గుణమును చూస్తాడు, కులమును కాదు, నీ చిత్తమును చూస్తాడు, నీ విత్తమును కాదు", అని భగవాన్ బాబా ఒక సందర్భంలో ఉద్ఘాటించారు.

వేరొక సందర్భంలో "ఏదైనా ఒక కార్యమును సాధించడానికి కృషి, కృప- రెండూ అవసరమే. ఇవి రెండూ అయస్కాంతము యొక్క పాజిటివ్, నెగటివ్ ధ్రువములవంటివి. విశ్వాసముతో భగవంతుని అనుగ్రహముకొరకు

ప్రార్థించాలి. హృదయ పూర్వకముగా భగవంతుని అనుగ్రహముకొరకు ప్రార్థించినప్పుడు, తప్పక లభిస్తుంది", అని వివరించారు.

ఆధునిక యుగంలో పెరిగిపోయిన ఆడంబరము మరియు బూటకపు భక్తిని నిరసిస్తూ భగవాన్, "భగవంతుడు భక్తుల ప్రార్థనలను మన్నించి వారిని రక్షించడానికి సదా సంసిద్ధుడై యుంటాడు. కాని, ఈనాడు 'డివోషన్ (Devotion అనగా భక్తి) గా చలామణి అవుతున్నదంతా నిజమైన భక్తికాదు, 'డీప్-ఓషన్ (Deep ocean అనగా ప్రాపంచిక జీవితమనే సముద్రంలో మునిగిపోవడం) మాత్రమే! ప్రజలు 'డివైన్' (Divine అనగా దివ్యత్వము) గురించి పెద్దగా ఉపన్యాసాలు చెపుతారు, కాని వారి ఆసక్తి అంతా 'డీప్ వైన్' (Deep wine అంటే మధుపానం) లోనే, 'కంపేషన్' (Compassion అనగా కరుణ) గురించి మాట్లాడుతారు, కాని 'ఫ్యాషన్' (Fashion అనగా బాహ్యమైన వేషభాషలు) యందు వారికి మక్కువ! 'కో ఆపరేషన్' (Co operation అనగా సహకారము) గురించి మాట్లాడుతారు, కాని 'ఆపరేషన్' (Operation అనగా విభేదాలు సృష్టించడం) మాత్రమే వారు చేసేది! ఈరోజుల్లో భక్తి ఆడంబర స్థాయికి దిగజారిపోయింది", అని విచారము వ్యక్తము చేశారు.

భగవాన్ బాబావారి దివ్యబోధలలో చోటు చేసుకున్న చమత్కార భరితమైన, పద విన్యాసముతో నిండిన మరికొన్ని ప్రకటనలు:

"ప్రేమ యివ్వడం (giving) మరియు క్షమించడం (forgiving) ద్వారా వర్ధిల్లుతుంది. స్వార్థము పుచ్చుకొనడం (getting) మరియు మరచిపోవడం (forgetting) ద్వారా మనుగడ సాగిస్తుంది".

"ఆస్తిపాస్తుల (Properties) అనుబంధం సరియైన బంధము (proper ties) కాదు".

"మనోలయము (Die mind), వజ్రము (Diamond) కంటె విలువైనది.

"తత్త్వశాస్త్రము (Philosophy) మేధోపరమైన కసరత్తు (Intellectual gymnastics) స్థాయికి దిగజారినప్పుడు, శూన్యవాదము (Full-loss-ophy) అవుతుంది".

"నిజమైన సేవకుడే (Sevak) మంచి నాయకుడు (Nayak) కాగలడు".

"కింకరుడు కానిదే శంకరుడు కాలేడు".

భగవంతుని అవతరణ, తన దివ్యబోధలద్వారా మానవోద్ధరణకే గాని మానవజాతి వినాశనమునకు కాదు. వివిధ మతములయొక్క మతగ్రంథములు, ఒకే భగవంతుడు భిన్న భిన్న కాలాలలో భిన్నభిన్న దేశముల ప్రజలకు వెల్లడించిన నిత్యసత్యముల యొక్క సారాంశమే. అయితే, కాలం గడుస్తున్నకొద్ది ఆధ్యాత్మికానుభవం లేని కేవల శుష్కపాండిత్యమును సంపాదించిన కొందరు 'మేధావులు' ఈ మత గ్రంథములకు వ్యాఖ్యానము చెప్పడం, ఆ వ్యాఖ్యానములకు మళ్ళి వ్యాఖ్యానాలు వ్రాయడం, ఇంకా అనేక సందర్భాలలో తప్పుడు వ్యాఖ్యానములు చెప్పి అపప్రధలను వ్యాప్తిచేయడం జరిగింది. ఫలితంగా ఆ గ్రంథములలోని అంశములయొక్క నిజమైన అర్థము ఈ విపరీత వ్యాఖ్యానాల దుమ్ము, ధూళిక్రింద మరుగున పడింది. ఆ నిత్య సత్యాలను బోధించిన దివ్య పురుషుడే తిరిగి అవతరించి వాటిని మరొక్కమారు మానవజాతికి వివరించడానికి పూనుకున్నప్పుడు, అవి తేటతెల్లముగా ప్రకాశిస్తాయి. ప్రాచీనమైన ఆ మతగ్రంథములలోని యథార్థమును కాలానుగుణ్యమైన సరిక్రొత్త రీతిలో మానవాళికి వివరిస్తాడు.

ఉదాహరణకు, భగవద్గీత విషయమే తీసుకోండి. భగవాన్ బాబావారు, భగవద్గీతయొక్క సారాంశము మొట్టమొదటి శ్లోకములోని ప్రథమ భాగములో అనగా "ధర్మ క్షేత్రే కురుక్షేత్రే" అనే పదములలో ఇమిడి యున్నదని గుర్తు చేస్తారు. ఆ పదములను కొద్దిగా ముందు, వెనుకలుగా మార్చి అమర్చి భగవద్గీత మానవులను "క్షేత్రేక్షేత్రే ధర్మం కురు" అని ఉద్బోధిస్తుందని వెల్లడి చేశారు. అనగా మానవుడు తన జీవితములోని ప్రతి రంగములో, అంశములో ధర్మమును ఆచరించాలని వివరిస్తారు. అదే విధంగా, భగవద్గీతలోని మొట్టమొదటి అధ్యాయములో గల మొట్టమొదటి శ్లోకములోని మొట్టమొదటి పదము 'ధర్మ' మరియు ఆఖరి శ్లోకములోని ఆఖరి పదము 'మమ' రెంటిని కలిపి 'మమ

ధర్మ'మే అనగా 'నాకర్తవ్యమే' గీతా సారాంశమని ఉద్ఘాటించారు. భగవద్గీతలో శ్రీకృష్ణ పరమాత్మ

"పత్రం పుష్పం ఫలం తోయం
యోమే భక్త్యా ప్రయచ్ఛతి
తదహం భక్త్యుప హృత
మశ్నామి ప్రయతాత్మనః"

అని వచించాడు. అనగా, ఏ వ్యక్తి అయినా భక్తితో పత్రం, పుష్పం, ఫలం, తోయం (నీరు) అర్పిస్తే తాను తప్పక స్వీకరిస్తానని భగవంతుని వాగ్దానం. దీని అర్థం, భగవంతునికి భావమే ప్రధానము, అర్పించే వస్తువు కాదు. భగవాన్ బాబావారు ఈ శ్లోకమునకు మరింత వివరంగా భాష్యం చెప్పారు. "పత్రమంటే ఏమిటి? ఇది రోజూ మీరు మామూలుగా చూచే చెట్టు ఆకుకాదు. దీని అంతరార్థము పత్రమంటే మీ శరీరమే! పుష్పమనగా మీ హృదయ పుష్పము. ఫలమనగా మీ మనస్సనే ఫలము. తోయమనగా నదినుండి కాని, కుళాయినుండి కాని తీసుకు వచ్చిన నీరు కాదు, ఆనంద బాష్పములు – భగవంతుని యందు మనఃపూర్వకముగా పెంచుకున్న భక్తివలన మీ హృదయములో పెల్లుబికిన ఆనందమువలన జాలువారే కన్నీరు".

'ఆధ్యాత్మ రామాయణం'లో శ్రీరాముడు 14 సంవత్సరాల బాలునిగా ఉన్నప్పుడు ఒక సందర్భంలో ఆయనకు జీవితంపట్ల నిరుత్సాహము కలిగినట్లు చెప్పబడింది. ఆ పరిస్థితి తల్లిదండ్రులు మరియు పెద్దలలో సందిగ్ధావస్థను, విస్మయమును కలిగించింది. ఆ సన్నివేశమును వర్ణిస్తూ భగవాన్ బాబా "శ్రీరాముడు చాలా కాలంపాటు దేశములోని పుణ్యక్షేత్రములను, దేవాలయములను దర్శించిన తరువాత 14వ సంవత్సరం ముందు కొన్ని సంవత్సరాల పాటు ఏకాంతముగా ఆత్మావలోకనం చేసుకుంటూ గడిపాడు. ఆహారము మరియు రాజదుస్తులయందు ఆయనకు విరక్తి కలిగింది. చుట్టూ ఉన్న మనుషులయందుగాని, వస్తువులయందుగాని అతడు ఎటువంటి ఆసక్తి

చూపలేదు. ఆకాశంలో చూస్తూ చేతులను వ్రేళ్ళను కదిలిస్తూ అకారణంగా నవ్వుతూ ఉండిపోయేవాడు. తన వ్రేళ్ళతో శూన్యములో ఏదో వ్రాస్తూన్నట్టుండేవాడు. క్లుప్తంగా చెప్పాలంటే ఆతని మాటలు, చేష్టలు సరిగ్గా పధ్నాలుగు సంవత్సరాలకు కొద్ది రోజుల ముందు నేను ఏవిధంగా చేసేవాడినో అలాగే ఉండేవి. వశిష్ఠ మహర్షి అతని మనస్సును మళ్ళీ మామూలు స్థితికి తీసికొని రావడానికి ప్రయత్నం చేశాడు. అయితే, అవతార పురుషులందరూ తమ అవతార కార్యక్రమాన్ని ప్రారంభించేముందు అటువంటి అవస్థకు గురి కావలసిందే! ఆ దశలో అవతార పురుషుడు తన భవిష్య కార్యక్రమానికి ప్రణాళికలు రచిస్తూంటాడు. ఆ దశ ముగిసిన తరువాత, విశ్వామిత్ర మహర్షి రంగప్రవేశము చేసి తన ఆశ్రమంలో తాను నిర్వర్తిస్తున్న వైదిక కర్మలకు విఘాతము కలిగిస్తున్న రాక్షసులను సంహరించడానికి శ్రీరాముని పంపుమని దశరథ మహారాజును కోరతాడు. అప్పటినుండి శ్రీరామచంద్రుని అవతార ప్రణాళిక బహిర్గతం కావడం మొదలుపెట్టింది", అని వివరించారు. కేవలం అవతార పురుషుడు మాత్రమే మరొక అవతార పురుషుని తత్త్వమును, అవతార కార్యక్రమమును అర్థం చేసుకోగలడు. ఆ సమయంలో శ్రీరామచంద్రునియొక్క అటువంటి వింత ప్రవర్తననుగురించి వేరెవరూ ఆవిధంగా వివరణ ఇవ్వలేరు.

విశ్వవిరాట్స్వరూపునికి "సహస్ర శీర్షా పురుషః సహస్రాక్ష సహస్రపాత్", అనగా వేయి శిరస్సులు, వేయి కన్నులు, వేయి పాదములు ఉంటాయని పురుషసూక్తములో వర్ణింపబడింది. ఈ విషయాన్నిగురించి వివరణ ఇస్తూ భగవాన్ బాబా "విశ్వవిరాట్స్వరూపుడంటే చిత్రకారుడైన రవివర్మ చిత్రించిన ఆకారమువంటి ఆకారము కలిగినవాడు గాని లేదా ఎవరైనా ఒక మహాకవి వర్ణించినట్లుండే ఆకారము గాని కాదు. విశ్వమంతా వ్యాపించి, వేలకొద్ది రూపములలో ఆవిర్భవించే విశ్వావతారి. అంతేకాకుండా, విశ్వమంతా విష్ణు స్వరూపమని ఈ పదమునకు వేరొక అర్థము", అని చెప్పారు.

"న కర్మణా న ప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వమానశుః" అని ఉపనిషత్తులు ఘోషిస్తున్నాయి. అనగా మానవుడు ధనముచే గాని, సంతానముచే

గాని లేక కేవల వైదిక కర్మలచే గాని అమృతత్వమును పొందలేదు, ఒక్క త్యాగము చేతనే పొందగలడు, అని అర్థము. అయితే, త్యాగమునకు సరియైన నిర్వచనం ఏమిటి? భగవాన్ ఈ ప్రశ్నకు సమాధానం చెపుతూ "ఇల్లు, వాకిలి, భార్య, బిడ్డలను విడిచిపెట్టి అడవిలోనికి పారిపోవడం త్యాగము లేక సన్యాసము కాదు. నీచమైన, స్వార్థపూరితమైన కోరికలను విడిచి పెట్టడమే త్యాగము. అటువంటి త్యాగమే యోగమవుతుంది. దీని అర్థం, మానవుడు తనయొక్క మనోవాక్కాయకర్మల నన్నింటిని త్రికరణశుద్ధిగా భగవంతునికి అర్పించడమే త్యాగమవుతుంది. ఆ విధంగా చేయడానికి ముందుగా మానవుడు ప్రేమను పెంపొందించుకోవాలి. ప్రేమకు ఊపిరి త్యాగమే"! అని వివరించారు.

మతాచారములలో భాగముగా 'జంతుబలి' అనే దురాచారమునకు పాల్పడే కొందరు వ్యక్తులను గురించి మాట్లాడుతూ భగవాన్ బాబా "బలి యివ్వవలసినది దురదృష్టవంతురాలైన పశువును కాదు. నీలో ఉన్న పశుత్వమును", అని ఉద్ఘాటించారు. ఈ సందర్భముగా అశ్వమేధ యాగమును గురించి వివరిస్తూ భగవాన్ "అశ్వమేధ యాగమంటే అశ్వమును బలిచేసే వైదిక కర్మకాదు. ఇక్కడ అశ్వమంటే మనస్సు. అశ్వము వలెనే మనస్సు చాలా చంచలమైనది. అశ్వము ఏ విధంగా తన కాళ్ళు, తోక లేదా చెవులను ప్రతిక్షణం కదిలిస్తూ చంచలంగా ఉంటుందో మానవుని మనస్సుకూడా ప్రతిక్షణం ఏదో ఒక ఆలోచన చేస్తూ విరామం లేకుండా ఉంటుంది. అశ్వమేధ యాగమునకు సరియైన అర్థము, చంచలమైన మానవుని మనస్సును భగవంతునికి అర్పించి స్థిరంగా, శాంతంగా ఉండేటట్లు చేయడం. శాస్త్రములలోని పదములకు అనేక అర్థములుంటాయి. వాటియొక్క అంతరార్థమును తెలుసుకోవడం చాలా కష్టం. సనాతన ధర్మములోని సత్య, ధర్మ, శాంతి, ప్రేమ మరియు అహింస అనే మహోన్నత విలువలద్వారా మాత్రమే వాటియొక్క సరియైన అర్థమును గ్రహించడానికి వీలవుతుంది. వేద సూక్తములు, వైదిక కర్మలు మరియు శాస్త్రములలోని ఆదేశములయొక్క అంతరార్థమును నిస్వార్థమైన, నిర్మలమైన మరియు ఆనందము నిండిన చిత్తైకాగ్రతతో శ్రవణం చేసి అంతరార్థమును తెలుసుకోండి.

వాటిని మీ హృదయంలో పదిలపరచుకుని, నిత్య జీవితంలో ఆచరిస్తూ తోటి సాధకులతో పంచుకోండి".

భగవాన్ బాబాహారి దృష్టిలో ఆచరణలేని జ్ఞానసముపార్జన నిరర్థకమైనది. నిత్య జీవితంలో ఆచరించడంద్వారా మాత్రమే జ్ఞానఫలమును పొందడానికి వీలవుతుంది. ఈ సందర్భంగా భగవాన్ ఇలా ప్రశ్నిస్తారు:

"అంధకారంబెల్ల హతమారునే జూడ
వసుధలో దీపంపు వార్త వలన?
ఆకొన్నవారికి ఆకలి తీరునే
పంచభక్ష్యపు పేర్లు పరగవిన్న?
నిరుపేదవాని పేదరికంబు పోవునే
విత్త ప్రభావంబు విన్నయంత?
రోగపీడితుని బల్‌రోగాలు పోవునా
ఔషధ మహిమంబు ఎంత విన్న?

శాస్త్రజాలంబు నంతయు చదివినంత
దట్టమైనట్టి యజ్ఞానతమము తెగున
ఆచరణలేని విద్యలు అవనియందు
దండినేర్చిన ఫలమేమి? గుండుసున్న".

భగవాన్ బాబావారి దివ్య బోధలలో ఆచరణకు విశేష ప్రాధాన్యత ఉన్నది. 1985వ సంవత్సరములో జరిగిన శ్రీ సత్యసాయి సేవాసంస్థల నాలుగవ ప్రపంచ సమ్మేళనముయొక్క ముగింపు సందర్భంలో స్వామి 'దివ్యత్వమునకు దశసూత్ర ప్రణాళిక' అనే పేరుతో సాధకులకు నిత్యజీవితంలో ఆచరణకొరకు పది సూత్రములను అందించారు:

(1) ప్రతి మానవుడు దేశాభిమానం కలిగియుండాలి. కాని, పరదేశమును ద్వేషించవద్దు.

(2) అన్ని మతాలను గౌరవించండి. అన్ని మతములు ఒకే భగవంతుని చేరే మార్గములే!

(3) ఏవిధమైన భేదభావము లేకుండా మానవులందరిని ప్రేమించి, సేవించండి. మానవులందరూ ఒక్కటే అనే సత్యాన్ని గుర్తించి వర్తించండి.

(4) మీ గృహమును, పరిసరాలను శుభ్రముగా ఉంచుకోండి. దాని వలన మీకు, సమాజానికి ఆరోగ్య, ఆనందములు చేకూరుతాయి.

(5) భిక్షగాళ్ళకు ఒక ఉపాధిని కల్పించవచ్చునేగాని, దానం అలవాటు చేయకూడదు. వారికి ఉపాధి కల్పించి, ఆహారము, వస్త్రము మరియు ఆశ్రయమును కల్పించండి, కాని అడిగిన వారికందరికి డబ్బు ఇచ్చి సోమరత్వమును పెంచవద్దు.

(6) లంచమిచ్చి పని చేయించుకోవడం గాని, లంచం పుచ్చుకుని పని చేయడం కాని కూడదు.

(7) ఎట్టి పరిస్థితులలోను ద్వేషము, ఈర్ష్య, అసూయలను పెంచుకోవద్దు. ప్రతి ఒక్కరిని సోదర భావంతో ప్రేమించాలి. జాతి, మత భేదభావాలు ఏమాత్రం పెంచుకోరాదు.

(8) తమ పనులు తామే చేసుకోలేనివారు సమాజసేవ ఏ రీతిగా చేయగలరు? సత్యసాయి సంస్థలకు చెందిన ప్రతి సభ్యుడు తనపని తానే చేసుకోవాలి గాని ఇంకొకరితో చేయించుకోరాదు.

(9) ప్రభుత్వ శాసనములను, చట్టములను తు,చ తప్పకుండా అనుసరిస్తూ ఆదర్శపౌరునిగా జీవించండి.

(10) పాపభీతి, దైవప్రీతి ప్రతి ఒక్కరికి ఉండాలి.

శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క బృందావనం కేంపస్‌లో ది. 29-2-1985 తేదీన విద్యార్థులతో మాట్లాడుతూ భగవాన్ బాబావారు "మానసిక, నైతిక బలమును పెంచుకోవాలంటే మనస్సును నిగ్రహించే సాధన అవసరం. అందుకొరకు పది రకాల పవిత్రతను పాటించాలి. ఇవి యువతీ, యువకులందరికి వర్తించే మార్గదర్శక సూత్రాలే:

1. ప్రప్రథముగా నీవు నివసించే ప్రదేశమును పరిశుభ్రంగా, పవిత్రంగా ఉంచుకోవాలి. నీ గది శుభ్రంగా, నిర్మలంగా, సాత్త్వికమైన వాతావరణంతో నిండియుండాలి. ఎటు చూచినా పవిత్రమైన భావాలను మీలో ఆవిర్భవింపజేసే చిత్రములో లేక ప్రశాంత చిత్తమును కలుగజేసే దృశ్యములతోనో నిండియుండాలి. మనస్సును విచలితంచేసే వస్తువులు, చిత్రములు గదిలో ఉండరాదు.

2. కుటుంబములో అందరు ప్రేమతో, అన్యోన్యతతో జీవించేటట్లు వాతావరణం కల్పించడానికి కృషి చెయ్యాలి. పరస్పర విద్వేషాలు, భేదాభిప్రాయాలు సామరస్య వాతావరణమునకు విఘాతము కలిగించి శాంతియుత జీవనానికి, విద్యాభ్యాసమునకు ఆటంకమును కలుగజేస్తాయి.

3. తామసిక, రాజసిక ఆహారమును భుజించకూడదు. అనగా, ఎక్కువ పులుపు, కారము మరియు మసాలాలు గల పదార్థములను భుజించరాదు. ముఖ్యంగా మాంసాహారమును ముట్టకండి. సాత్త్వికమైన శాకాహారము ఆరోగ్యమునకు, దైవీ భావములు పెంపొందడానికి దోహదం చేస్తుంది.

4. మీరు స్వీకరించే పానీయములు శుభ్రంగా, సాత్త్వికంగా ఉండాలి. ఎట్టి పరిస్థితులలోను మద్యమును, మత్తు పదార్థములను తీసుకోరాదు.

5. మంచి భావములు, ఆలోచనలను పెంపొందించుకోవడానికి కృషి చెయ్యాలి. చెడు భావములు, ఆలోచనలను విడిచిపెట్టాలి.

6. సాత్త్విక భావములు, ఆలోచనలు మీలో అభివృద్ధి చెందాలంటే మీ దృష్టికూడా సాత్త్వికంగా ఉండాలి. అందుకొరకు మీరు ఎల్లప్పుడు మంచి దృశ్యములనే చూడాలి. చెడు దృశ్యములు చెడు తలంపులనే కలుగజేస్తాయి. ఎట్టి దృష్టియో అట్టి సృష్టి. మీ కంటె వయసులో పెద్దవారైన ప్రతి స్త్రీని తల్లిగాను, చిన్నవారిని సోదరిగాను భావించాలి.

7. మీరు చదివే పుస్తకాలు మీలో పవిత్ర భావములను కలుగజేయాలి. దుర్భావములను కలిగించే పుస్తకములను దూరంగా ఉంచండి. సాహిత్యేతర

విషయాలకు సంబంధించిన పుస్తకాలు మీ శీలముపై ప్రభావమును చూపలేవు. అయినప్పటికి, సాహిత్య గ్రంథములను ఎంచుకునేటప్పుడుకూడా జాగ్రత్త వహించండి. సద్గ్రంథములనే ఎన్నుకోండి. పొరపాటున ఏవైనా అవాంఛనీయమైన పుస్తకాలను మీకు పాఠ్యపుస్తకాలుగా నిర్ణయించినప్పుడు వాటిని ఆ దృష్టితోనే చూడండి, కాని, మీ జీవితమునకు మార్గదర్శక గ్రంథములుగా భావించవద్దు.

8. మీరు పాల్గొనే సేవా కార్యక్రమాలపట్ల జాగ్రత్త వహించాలి. అవి మీలో పవిత్రతను పెంచి ఆనందమును కలుగజేయాలి. అంతేకాక, మీ సేవలను అందుకునేవారిలోకూడా అవి ఆనందమును పెంపొందించేవిగా ఉండాలి. అందుకొరకు మీ సేవలను స్వీకరించేవారిని కేవలం సాటి మానవులుగా కాక, సాక్షాత్తు దివ్యాత్మ స్వరూపులుగా భావించండి. దరిద్ర నారాయణులకు సేవ చెయ్యండి, వారు సాక్షాత్తూ నారాయణులే!

9. క్రమం తప్పకుండా మీ ఆధ్యాత్మిక సాధనను కొనసాగించాలి. అలా చేసినప్పుడే మీ మనస్సు పవిత్రంగా నిర్మలంగా ఉంటుంది. సమస్త సాధనలయొక్క సారము ప్రతి ఒక్కరి పట్ల నిర్మల, నిస్వార్థ ప్రేమను పెంపొందించుకుని ప్రతి ఒక్కరిలోను, ప్రతి జీవిలోను దైవత్వమును దర్శించడమే!

10. మీకు అనుకూలమైనది, మీ ప్రవృత్తికి తగినది అయిన వృత్తిని చేపట్టాలి. సమాజము లేక జాతియే మీకు జీవనాధారమును కల్పించేది. అందువలన, మీరు సమాజ సంక్షేమమునకు దోహదం చేసే కార్యక్రమాలలో పాల్గొనే అవకాశముకొరకు ఎదురు చూడాలి. మీ కర్తవ్య నిర్వహణలో మీరు ఎల్లప్పుడు నిజాయితీగా, న్యాయంగా, ధర్మబద్ధంగా, సర్వుల క్షేమం కాంక్షించేటట్లు వ్యవహరించండి.


మానవులందరూ సుఖ, సంతోషములతో కూడిన, ప్రయోజనకరమైన జీవితాలను గడిపేందుకు అవసరమైన సాధారణ సూత్రములను నిర్దేశించడంతోబాటు, భగవాన్ బాబా ఆర్తులైన సాధకులకు వారివారి

ఆధ్యాత్మికస్థితికి అనుగుణంగా ఆచరణ పూర్వకమైన మార్గదర్శక సూత్రములనుకూడా అందిస్తారు. అందుకు ఒక ఉదాహరణ. "నీకు కోపము రాబోతోంది అనే విషయమును గ్రహించిన తక్షణమే అక్కడినుండి లేచి ఒక ప్రశాంతమైన స్థలమునకు వెళ్ళి భావోద్రేకమును తగ్గించుకోవడానికి ప్రయత్నం చెయ్యి. లేదా ఒక గ్లాసు చల్లని నీరు త్రాగి ప్రశాంతంగా కూర్చో. లేక, కొంచెం దూరం వడివడిగా నడిచి కోపం తగ్గించుకో. లేదా, అద్దంముందు నిలబడి కోపంతో జేవురించియున్న నీ ముఖాన్ని అద్దంలో చూసుకో! అదీ కాదంటావా, భగవంతుని స్తుతిస్తూ కొన్ని కీర్తనలను గానం చెయ్యడం ప్రారంభించు".

భిన్నభిన్న మతములు మరియు మతతత్వములలోని సందేశమును సమన్వయపరచడంలో భగవాన్ శ్రీ సత్యసాయి బాబా వారు సాటిలేని మేటి సమన్వయకర్త. భగవాన్ బాబావారి దివ్యబోధలలో సర్వధర్మ సమన్వయము మరియు సర్వయోగ సమన్వయము మనకు ప్రస్ఫుటంగా గోచరిస్తాయి. సర్వమతములలోను అంతర్లీనముగా ఉన్న నిస్వార్థ ప్రేమబంధము మరియు సర్వమతములను సమైక్యపరచే జ్ఞానసంపదలను గుర్తించినప్పుడు, వివిధ మతములు మరియు మతాచారములలో మనకు బాహ్యంగా గోచరించే పరస్పర విరుద్ధమైన అంశములు అదృశ్యమవుతాయని భగవాన్ బాబా గుర్తు చేస్తారు. భగవాన్ బాబా తమ దివ్యసన్నిధిలో చేరిన భక్తులందరు ఆ సర్వమతైక తత్త్వమును అంతర్వాణి ప్రబోధముచేత అనుభవంలోనికి తెచ్చుకునేటట్లు చేస్తారు. ఆ అంతరంగ అనుభూతియొక్క దివ్యకాంతిలో వివిధ మతములయొక్క దృక్పథములలో బాహ్యంగా గోచరించే భిన్నత్వము అదృశ్యమవుతుంది. స్వామి దృష్టిలో లౌకిక జీవితం వేరు, ఆధ్యాత్మిక జీవితం వేరు కాదు. రెండూ కలసి ఒక సమగ్ర జీవనవిధానముగా రూపొంది భక్తులను భగవంతుని అవతార కార్యక్రమంలో పాలుపంచుకుంటూ దివ్యమైన ఆనందము ననుభవించేటట్లు దోహదం చేస్తాయి. భగవాన్ బాబావారు నిర్దేశించిన బంగారు బాటలో శాస్త్ర

విజ్ఞానమునకు, ఆధ్యాత్మిక తత్త్వమునకు మధ్యగల ఊహాజనితమైన అడ్డుగోడలు కూలిపోయి ఏకోన్ముఖమైన సత్యాన్వేషణకు మార్గము సుగమమవుతుంది.

"నా జీవితమే నా సందేశము" అనేది భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్యబోధల సారాంశము. మానవజాతికంతటికి మహోన్నత ఆదర్శప్రాయమైన భగవాన్ బాబావారి దివ్యజీవితము ప్రతి ఒక్కరికి తెరచిన పుస్తకం వంటిది. వర్తమానంలోనే గాక, భావితరాలవారు కూడా నిత్యనూతనంగా ఆవిష్కృతమవుతున్న భగవాన్ బాబావారి దివ్య జీవిత గాథనుండి స్ఫూర్తిని పొందవచ్చు.



అనుబంధము

భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి దివ్య జీవిత చరిత్రలోని 1980-85 సంవత్సరాలకు సంబంధించిన ముఖ్య సంఘటనలు, వరుసగా...

1980

10-02-1980 : బృందావనంలో విద్యావిధానముపై శ్రీ సత్యసాయి అధ్యయన మండలి సమావేశం.

17-02-1980 : భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి అనంతపురం మహిళా కళాశాల సందర్శనం.

18-02-1980 : బెంగుళూరులోని ఒక సత్యసాయి అధ్యయన మండలి సమావేశములో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసము.

07-03-1980 : ఉదకమండలం (ఊటీ)లోని శ్రీ సత్యసాయి విద్యావిహార్ విద్యార్థులతో ఫోటోలు తీయించుకున్న సందర్భంలో భగవాన్ తమ దత్తాత్రేయ స్వరూపమును వెల్లడించుట.

25-03-1980 : బృందావనంలో శ్రీరామనవమి పండుగ.

01-06-1980 : హైదరాబాద్-ఢిల్లీ మీదుగా భగవాన్ బాబావారి జమ్మూ-కాశ్మీర్ పర్యటన ప్రారంభం.

06-06-1980 : శ్రీనగర్‌కు 15 మైళ్ళ దూరములో నున్న దచిగామ్‌లో భగవాన్ బాబా అమర్‌నాథ్‌కు చెందిన స్ఫటికలింగమును మరియు బదరీనాథ్‌కు చెందిన లక్ష్మీనారాయణ విగ్రహమును సృష్టించుట.

07-06-1980 : పహల్‌గాంలో భగవాన్ బాబా పవిత్రమైన శ్రీ చక్రమును మరియు సుప్రసిద్ధ చిదంబరం, కేదార్‌నాథ్ దేవాలయములలోని లింగములను సృష్టించుట.

18-06-1980 : భగవాన్ బాబా కాశ్మీరు పర్యటన ముగించుకుని ఢిల్లీ, బొంబాయిల మీదుగా బృందావనమునకు తిరిగి వచ్చుట. బొంబాయిలోని ధర్మక్షేత్రంలో ఒక విశాలమైన హాలుకు శంకుస్థాపన.

10-07-1980 : బృందావనంలోని శ్రీ సత్యసాయి కళాశాలలో దివ్యోపన్యాసము.

13-07-1980 : బృందావనంలోని కళాశాల హాస్టలులో దివ్యోపన్యాసము.

27-07-1980 : ప్రశాంతి నిలయంలో గురుపూర్ణిమ ఉత్సవం

08-08-1980 : భగవాన్ బాబావారిచే ఉదకమండలంలోని శ్రీ సత్యసాయి విద్యా విహార్‌యొక్క నూతన భవనమునకు ప్రారంభోత్సవం.

13-08-1980 : ప్రశాంతి నిలయంలోని బాలుర కళాశాల హాస్టల్‌లో భగవాన్ దివ్యోపన్యాసము.

21-09-1980 : ప్రశాంతి నిలయంలోని బాలుర కళాశాల హాస్టల్‌లో భగవాన్ దివ్యోపన్యాసము.

01-11-1980 : పుట్టపర్తి మరియు చుట్టుప్రక్కల 100 గ్రామాలను కలిపి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము నూతనంగా శ్రీ సత్యసాయి తాలూకాను ఏర్పాటు చేసింది.

08-11-1980 : ప్రతి సంవత్సరం నవంబర్ నెల రెండవ శనివారం సాయంత్రం ప్రారంభమయ్యే 24 గంటల

ప్రపంచవ్యాప్త అఖండ నామ సంకీర్తన ప్రశాంతి నిలయంలో ప్రారంభం.

18-11-1980 : ప్రశాంతి నిలయంలో నూతన కళాశాల భవనమునకు భగవాన్ బాబావారిచే ప్రారంభోత్సవం.

19-11-1980 నుండి 21-11-1980 } ప్రశాంతి నిలయంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల తృతీయ ప్రపంచ సమ్మేళనం.

23-11-1980 : భగవాన్ బాబా వారి 55వ జన్మదినోత్సవం.

03-12-1980 : బృందావనంలో యూదుల దీపావళి ఉత్సవం, హనూకా జరుపబడింది. విదేశాలలోని సత్యసాయి సెంటర్లు ఉపయోగించే సర్వధర్మ చిహ్నములో యూదుల చిహ్నమునుకూడా చేర్చుటకు భగవాన్ బాబా అంగీకరించారు.

24-12-1980 : ప్రశాంతి నిలయంలో బాలుర నూతన హాస్టల్ భవనమునకు భగవాన్ బాబా వారిచే ప్రారంభోత్సవం.

25-12-1980 : ప్రశాంతి నిలయంలో శ్రీ సత్యసాయి ప్రైమరీ స్కూలు ప్రారంభం. భక్తులు, భగవాన్ బాబా వారి దివ్యసన్నిధిలో క్రిస్మస్ వేడుకలను జరుపుకున్నారు.

1981

04-01-1981 : భగవాన్ బాబావారిచే ప్రశాంతి నిలయంలో శ్రీ సత్యసాయి సేవా సంస్థల వరల్డు కౌన్సిలు యొక్క కేంద్రకార్యాలయమునకు ప్రారంభోత్సవం.

14-01-1981 : ప్రపంచవ్యాప్తంగా ఉన్న శ్రీ సత్యసాయి సేవా సంస్థలకు, శ్రీ సత్యసాయి సెంట్రల్ ట్రస్టు అధీనంలో పనిచేసేటట్లు భగవాన్ బాబా వారిచే ఛార్టరు ప్రదానం.

19-01-1981 : చెన్నైలో నిర్మింపబడిన నూతన మందిరం 'సుందరం'కు ప్రారంభోత్సవం జరిగింది. ప్రశాంతి నిలయములోని ప్రశాంతి మందిరం నమూనాలో నిర్మింపబడిన 'సుందరం' రెండంతస్తులు కలిగి, మధ్యన గోపురము దానికి ఇరువైపులా డోములు మరియు మొదటి అంతస్తులో బాల్కనీ ఉన్న, శిల్పకళా వైభవంతో శోభిల్లే అపురూపమైన మందిరం. భగవాన్ బాబావారిచే వెలిగింపబడిన ఆధ్యాత్మిక జ్యోతులు మూడింటిలో 'సుందరం' వరుసగా మూడవది. మొట్టమొదటి మందిరం, బొంబాయిలోని అంధేరి ప్రాంతములో నిర్మింపబడిన ధర్మక్షేత్రములోని సత్యదీప్. రెండవ మందిరం మహోన్నతమైన శివలింగాకారములో హైదరాబాదులో నిర్మింపబడిన 'శివం'.

22-01-1981 : చెన్నైనుండి ముంబాయికి భగవాన్ బాబావారి ప్రయాణం. అక్కడ అంధేరి మరియు ఆ చుట్టుప్రక్కల ప్రాంతాలలో నివసిస్తున్న పిల్లల కొరకు ధర్మక్షేత్రములో నెలకొల్పబడిన ప్రైమరీ స్కూలు, సెకండరీ స్కూలు మరియు టెక్నికల్ స్కూలుయొక్క నూతన భవనమునకు భగవాన్ ప్రారంభోత్సవం చేశారు.

23-01-1981 : మానవతా విలువల బోధనలో పాలుపంచుకుంటున్న ఉపాధ్యాయుల శిక్షణా సంస్థలను భగవాన్ బాబా బొంబాయిలో ప్రారంభించారు.

05-02-1981 : 'కింగ్‌డమ్ ఆఫ్ మదర్‌సాయి' పేరుతో అనంతపురం మహిళా కళాశాల పూర్వ విద్యార్థినుల సంస్థ ఆవిర్భావం.

01-03-1981 : 'సనాతన సారథి' మాసపత్రికలో 'విద్యా వాహిని' అనే నూతన ధారావాహిక వ్యాస పరంపర ప్రచురణ ప్రారంభం.

07-03-1981 : భగవాన్ బాబావారు హైదరాబాద్ సందర్శనం

08-03-1981 : హైదరాబాదులోని మెహిదీపట్నంలో నెలకొల్పబడిన శ్రీ సత్యసాయి విద్యావిహార్ కొరకు నూతన భవన సముదాయమును నిర్మించుటకు భగవాన్ బాబా శంకుస్థాపన చేశారు.

09-03-1981 : మానసిక వికలురైన బాల బాలికలకొరకు ప్రత్యేకంగా నెలకొల్పబడిన పాఠశాలను భగవాన్ బాబా సందర్శించారు. తరువాత హైదరాబాదులోనే వి.డి. ప్రసాదరావు స్మారక భవనమునకు శంకుస్థాపన చేసి ప్రశాంతి నిలయమునకు తిరిగి వచ్చారు.

05-04-1981 : ప్రశాంతి నిలయంలో ఉగాది పర్వదినమునాడు భగవాన్ బాబావారు "శ్రీ సత్యసాయి వాహిని" పుస్తకమును ఆవిష్కరించారు.

12-04-1981 : బృందావనంలోని కళాశాల హాస్టలులో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసము.

13-04-1981 : బెంగుళూరులోని లాల్‌బాగ్‌లో గల గోల్డెన్ జూబిలీ హాలులో భగవాన్ బాబావారి దివ్య సన్నిధిలో శ్రీరామనవమి పండుగ.

19-04-1981 : బెంగుళూరులో శ్రీ సత్యసాయి అధ్యయన మండలి, నగరంలోని 250 మంది కామర్సు విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత బోధనా తరగతులు నిర్వహించిన

సందర్భముగా భగవాన్ బాబావారు వారిని ఉత్తేజపరుస్తూ చేసిన దివ్యోపన్యాసము.

11-05-1981 : భగవాన్ బాబా బొంబాయి నగరమునకు విచ్చేశారు.

14-05-1981 : భగవాన్ బాబావారు బొంబాయినుండి విమానములో బయలుదేరి విజయవాడ వచ్చి అక్కడినుండి ఏలూరు, కొవ్వూరు మీదుగా రాజమండ్రి చేరుకున్నారు.

15-05-1981 : భగవాన్ బాబావారు రాజమండ్రిలోని శ్రీ సత్యసాయి గురుకులమును తమ అధీనములోనికి తీసుకున్నారు.

17-05-1981 : భగవాన్ బాబావారు బెంగుళూరులోని లాల్‌బాగ్‌లో గల జూబిలీ హాలులో కర్ణాటక రాష్ట్రమునకు చెందిన గురువులకు 10 రోజుల పాటు నిర్వహింపబడే మానవతా విలువల బోధన గురించి పునశ్చరణ తరగతులకు ప్రారంభోత్సవం జరిపారు.

15-06-1981 : ప్రశాంతి నిలయంలో శ్రీ సత్యసాయి ప్రైమరీ స్కూలు మరియు హయ్యర్ సెకండరీ స్కూలును ప్రారంభించడంతో భగవాన్ బాబా వారి విద్యా కార్యక్రమ విస్తరణ.

27-06-1981 : కింగ్‌డమ్ ఆఫ్ సత్యసాయి మరియు కింగ్‌డమ్ ఆఫ్ మదర్ సాయి సభ్యులనుద్దేశించి భగవాన్ దివ్యోపన్యాసము.

04-07-1981 : భగవాన్ బాబావారు ప్రశాంతి నిలయంలో శ్రీ సత్యసాయి ప్రైమరీ స్కూలు అధ్యాపకుల నుద్దేశించి ప్రసంగించారు.

17-07-1981 : ప్రశాంతి నిలయంలో జగద్గురువైన భగవాన్ బాబావారి

దివ్యసన్నిధిలో భక్తులు గురు పూర్ణిమ పండుగను జరుపుకున్నారు.

18-07-1981 : కింగ్‌డమ్ ఆఫ్ సత్యసాయి సభ్యులనుద్దేశించి భగవాన్ బాబావారి దివ్యోపన్యాసము.

01-08-1981 : విదేశములనుండి వచ్చిన బాలవికాస్ గురువులకు భగవాన్ బాబావారు శిక్షణా శిబిరమును ప్రారంభించారు.

06-08-1981 : శిక్షణ శిబిరము పూర్తయి మధ్యాహ్నం 12 గంటలకు భగవాన్ బాబా బృందావనమునకు బయలు దేరారు.

29-08-1981 నుండి 31-08-1981 : బృందావనంలో 'వేల్యూ ఓరియంటేషన్ టు హయ్యర్ ఎడ్యుకేషన్' అనే అంశముపై ఒక సెమినార్ నిర్వహింపబడింది.

30-09-1981 : పూర్ణ చంద్రహాలులో శ్రీ సత్యసాయి హాస్పిటలు యొక్క రజతోత్సవ దినము నిర్వహింపబడింది.

02-10-1981 : దసరా ఉత్సవాలు, వాటితోబాటు వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞము ప్రారంభింపబడినవి.

08-10-1981 : విజయదశమినాడు భగవాన్ బాబావారు తమ దివ్యోపన్యాసములో శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ (డీమ్డ్ యూనివర్సిటీ) యొక్క ఆవిర్భావమును గురించి ప్రకటించారు. ఆ రోజున విశ్వవిద్యాలయ పరిపాలనా భవనమునకు భూమి పూజ జరిగింది.

26-10-1981 : ప్రశాంతి నిలయంలో దీపావళి పండుగ.

06-11-1981 : కర్ణాటక రాష్ట్రములోని నందికొండల దిగువనగల మనోహరమైన శ్రీ సత్యసాయి గ్రామం భగవాన్

బాబావారి ఆగమనంతో పునీతమైంది. ముద్దెనహళ్ళిలోని విద్యా ప్రాంగణంలో ఒక భాగమైన ఆ గ్రామంలో భగవాన్ బాబా జూనియర్ కాలేజి బిల్డింగుకు భూమిపూజ నిర్వహించారు.

19-11-1981 నుండి 21-11-1981 : శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యుల ఐదవ అఖిల భారత సమావేశము

22-11-1981 : డీమ్డ్ యూనివర్సిటీగా గుర్తింపబడిన శ్రీ సత్యసాయి ఉన్నత విద్యా సంస్థను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ వై.వి. చంద్రచూడ్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రశాంతి నిలయములోని హయ్యర్ సెకండరీ స్కూలు యొక్క నూతన భవనము ప్రారంభింపబడింది.

23-11-1981 : భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి 56వ జన్మదినోత్సవము.

26-11-1981 : శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థను ప్రారంభిస్తూ భగవాన్ బాబావారి దివ్యోపన్యాసము.

24-12-1981 : ప్రశాంతి నిలయంలోని రౌండ్ బ్లాకులో మొట్టమొదటిసారిగా క్రిస్మస్ ముందురోజున వేడుకలు ప్రారంభం.

25-12-1981 : క్రిస్మస్ పండుగ.

1982

14-01-1982 : బృందావనం కళాశాల హాస్టలులో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం

21-01-1982 : మద్రాసు పర్యటన

22-01-1982 : మద్రాసులోని ఏబట్స్‌బరీలో తమిళనాడు రాష్ట్ర శ్రీ సత్యసాయి సేవాసంస్థయొక్క నాలుగవ రాష్ట్రస్థాయి సమావేశం

24-01-1982 : భగవాన్ బాబావారి నైవేలీ సందర్శనం

26-01-1982 : భగవాన్ బొంబాయి నగరమునకు వెళ్ళారు

27-01-1982 : బొంబాయిలో బాలవికాస్ పిల్లలు, గురువుల ర్యాలీ

04-02-1982 : బృందావనం సమీపములో శ్రీ సత్యసాయి కళాశాల దత్తత తీసుకున్న గ్రామం 'సిగెహళ్ళి'లో నిర్మింపబడిన ప్రాథమికోన్నత పాఠశాల నూతన భవనమునకు భగవాన్ బాబావారిచే ప్రారంభోత్సవం

22-02-1982 : ప్రశాంతి నిలయంలో మహాశివరాత్రి ఉత్సవం

26-03-1982 : ప్రశాంతి నిలయంలో ఉగాది పండుగ

02-04-1982 : బృందావనంలో శ్రీరామనవమి ఉత్సవాలు

03-04-1982 : భగవాన్ బాబావారి ఎనిమిది రాష్ట్రాల పర్యటన ప్రారంభం

04-04-1982 : హైదరాబాదులోని రవీంద్రభారతి హాలులో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమునకు చెందిన ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలు మరియు ఇతర వృత్తులవారిని ఉద్దేశించి భగవాన్ బాబావారి ప్రసంగం

05-04-1982 : భగవాన్ బాబావారి శ్రీ సత్యసాయి విద్యావిహార్ సందర్శనం

06-04-1982 : భగవాన్ బాబావారు విమానంలో ఢిల్లీ నగరానికి రాక

07-04-1982 : న్యూఢిల్లీలోని భారతీయ విద్యాభవన్ ప్రాంగణ సందర్శనం

08-04-1982 : భగవాన్ బాబావారు ఆశిస్తున్నట్లుగా విద్యార్థులు మానవతా విలువలను పెంపొందించుకోవాలనే

భావనతో ఆ అంశమును నొక్కి చెప్పడానికి ఢిల్లీలో ప్రారంభింపబడుతున్న స్కూలు భవన నిర్మాణమునకు స్వామి భూమిపూజ చేశారు. సాయంకాలం 6 గం॥ 15 ని॥లకు భగవాన్ న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మేధావుల నుద్దేశించి ప్రసంగించారు

09-04-1982 : సూర్యోదయ వేళలో భగవాన్ హిమాలయ పర్వతాల దిగువ ప్రాంతములో ఉన్న ఋషీకేష్‌ను, తరువాత ముస్సోరిని సందర్శించడానికి కారులో వెళ్ళారు. దారిలో ఘజియాబాద్, మీరట్, రూర్కీ, హరిద్వార్‌లలో కొంచెంసేపు ఆగారు. ఋషీకేష్‌లో ఉత్తరప్రదేశ్ సత్యసాయి సేవాసంస్థ ఆధ్వర్యంలో నడుపబడుతున్న వేద పాఠశాల భవన నిర్మాణమునకు భూమిపూజ చేశారు. డెహ్రాడూన్‌లో భక్తులకు దర్శనం ప్రసాదించిన తరువాత ముస్సోరికి వెళ్ళి అక్కడ జింద్ మహారాణి భవనములో బస చేశారు

11-04-1982 : భగవాన్ బాబా ముస్సోరినుండి పానిపట్, కర్నాల్‌ల మీదుగా ఢిల్లీకి తిరిగి వచ్చారు

12-04-1982 : జైపూర్‌కు విమానంలో వెళ్ళి అక్కడ తాను నెలకొల్పిన శ్రీ సత్యసాయి మహిళా కళాశాలను సందర్శించారు.

13-04-1982 : భగవాన్ బాబా జైపూర్ నుండి భోపాల్ వెళ్ళారు

14-04-1982 : భోపాల్‌నుండి విమానంలో ప్రయాణం చేసి జామ్‌నగర్ చేరుకున్నారు

15-04-1982 : జామ్‌నగర్‌లో భగవాన్ బాబా "శ్రీ రంజిత్ సింహ్‌జీ నిరాధార్ ఆశ్రమం" పేరుతో ఒక వృద్ధాశ్రమమును ప్రారంభించారు. అదే రోజున జామ్‌నగర్‌నుండి బొంబాయి మీదుగా బెంగుళూరుకు తిరిగి వచ్చారు

12-05-1982 : బొంబాయి వెళ్ళి అక్కడ ధర్మక్షేత్రముయొక్క 14వ వార్షికోత్సవసందర్భంగా దివ్యోపన్యాసము చేశారు

14-05-1982 : బొంబాయిలో భగవాన్ ఒక ప్రత్యేక ఆహ్వానముపై ట్రాంబేలోని భాభా ఎటామిక్ రిసెర్చ్ సెంటరును సందర్శించారు

20-05-1982 నుండి 29-05-1982 వరకు } ప్రశాంతి నిలయములోని విద్యాగిరిపై నిర్వహింపబడిన 'మానవతా విలువల బోధన' కార్యక్రమంయొక్క ద్వితీయ శిక్షణా శిబిరములో భగవాన్ ఇంచుమించుగా ప్రతిరోజు దివ్యోపన్యాసం చేశారు

01-07-1982 మరియు 02-07-1982 } మద్రాసు నగర సందర్శనము

06-07-1982 : ప్రశాంతి నిలయంలో గురు పూర్ణిమ మహోత్సవం

08-07-1982 : ప్రశాంతి నిలయములోని శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క సభాప్రాంగణంలో భగవాన్ దివ్యోపన్యాసము

12-08-1982 : ప్రశాంతి నిలయములో శ్రీ కృష్ణ జన్మాష్టమి పండుగ

22-08-1982 : ప్రశాంతి నిలయములో వినాయక చవితి పండుగ

01-09-1982 : ప్రశాంతి నిలయములో ఓణం పండుగ

01-10-1982 : 'సనాతన సారథి' మాసపత్రికలో ధారావాహికగా వెలువడుతున్న 'విద్యావాహిని' ముగిసి 'సూత్ర వాహిని' ప్రారంభమైంది

21-10-1982 : దసరా ఉత్సవాలు, వేద పురుష సప్తాహ జ్ఞాన యజ్ఞము ప్రారంభం

27-10-1982 : ప్రశాంతి నిలయంలో విజయ దశమి పండుగ

13-11-1982 : ప్రపంచవ్యాప్త అఖండ నామ సంకీర్తన

15-11-1982 : ప్రశాంతి నిలయంలో దీపావళి పండుగ

18-11-1982 : రథోత్సవం

19-11-1982 నుండి 21-11-1982 : ప్రశాంతి నిలయములో అఖిల భారత శ్రీ సత్య సాయి సేవాసంస్థల పదవ సమావేశము

20-11-1982 : శ్రీ సత్యసాయి హాస్పిటలు వార్షికోత్సవము

22-11-1982 : డీమ్డ్ యూనివర్సిటీ, శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క ప్రథమ స్నాతకోత్సవమును ఛాన్సెలరు భగవాన్ శ్రీ సత్యసాయిబాబా ప్రారంభిస్తూ ఒక ప్రకటన చేశారు. అదే రోజున విద్యాగిరిపై నిర్మింపబడిన శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క పరిపాలనా భవనమునకు ప్రారంభోత్సవం చేశారు

23-11-1982 : భగవాన్ బాబావారి 57వ జన్మదినోత్సవం

01-12-1982 : భగవాన్ బాబావారిచే శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క అనంతపురం కేంపస్ సందర్శనం

25-12-1982 : ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు

30-12-1982 : భగవాన్ బాబా బృందావనంలో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగం

1983

01-01-1983 : నూతన ఆంగ్ల సంవత్సరాది సందర్భముగా భగవాన్ దివ్యోపన్యాసము

08-01-1983 : ప్రశాంతి నిలయంలో కళాశాల హాస్టలులో భగవాన్ దివ్యోపన్యాసము

16-01-1983 : కనుమ పండుగ పర్వదినం సందర్భంగా భగవాన్ మద్రాసులోని 'సుందరం'కు రాక. భగవాన్ ప్రశాంతి

పతాకమును ఎగురవేసి అక్కడ నూతనంగా నిర్మింపబడిన 'శాంతి వేదిక' మంటపమును ఆవిష్కరించారు

19-01-1983 : భగవాన్ బాబావారు పెరంబూరులో దక్షిణ రైల్వే ఉద్యోగుల సంఘము నెలకొల్పిన ట్రేడ్ యూనియన్ కళాశాలకు ప్రారంభోత్సవం జరిపారు

21-01-1983 : భగవాన్ బాబా మద్రాసునుండి బొంబాయి వెళ్ళారు

23-01-1983 : బొంబాయిలో లయన్స్‌క్లబ్బుయొక్క ప్రాంతీయ సమావేశమును ఉద్దేశించి భగవాన్ బాబా ప్రసంగించారు. మానవతా విలువల బోధనా కార్యక్రమంలో ప్రాథమికోపాధ్యాయులకు శిక్షణనిచ్చే జోనల్ ట్రైనింగు సెంటరు భవనమునకు భగవాన్ బాబా శంకుస్థాపన చేశారు

11-02-1983 : ప్రశాంతి నిలయంలో మహాశివరాత్రి ఉత్సవం

17-02-1983 : బెంగుళూరులోని జయనగర్‌లో గల ఎన్.ఎమ్.కె.ఆర్.వి. స్త్రీల కళాశాలయొక్క దశవర్ష ఉత్సవములలో పాల్గొని భగవాన్ బాబా కళాశాల ఆవరణలో అధ్యాపకులు మరియు విద్యార్థినులనుద్దేశించి ప్రసంగించారు

17-03-1983 : ప్రశాంతి నిలయములో 680మంది పటువులకు సామూహిక ఉపనయనం

03-04-1983 : భగవాన్ బృందావనంనుండి హైదరాబాదుకు బయలుదేరారు

06-04-1983 : భగవాన్ బాబా మధ్యలో విజయవాడ మీదుగా గుంటూరు వెళ్ళి అక్కడ జిల్లా సత్యసాయి సేవా సంస్థచే నిర్మింపబడిన "శ్రీ సత్యసాయి శాంతి సుధ" అనే

నూతన మందిరమునకు ప్రారంభోత్సవం చేశారు

07-04-1983 : రాజమండ్రిలోని గురుకులంలో నిర్మింపబడిన విద్యార్థుల నూతన హాస్టలు భవనమును భగవాన్ ప్రారంభించారు. ఏలూరు, కొవ్వూరు పట్టణములనుకూడా దర్శించారు

08-04-1983 : తెల్లవారుఝామునే హైదరాబాదుకు ప్రయాణమై వెళ్ళి సాయంత్రానికి బృందావనంకు తిరిగి వచ్చారు

21-04-1983 : ప్రశాంతి నిలయంలో శ్రీరామనవమి ఉత్సవం

06-05-1983 : ప్రశాంతి నిలయంలో ఈశ్వరమ్మ సంస్మరణ దినం జరుపబడింది

11-05-1983 : భగవాన్ బాబా బృందావనంనుండి బొంబాయి వెళ్ళారు

17-05-1983 : బృందావనంలో నూతన మందిరం "త్రయీ బృందావనం" నిర్మాణమునకు భగవాన్ భూమిపూజ జరిపారు

19-05-1983 : ముద్దెనహళ్ళిలోని శ్రీ సత్యసాయి గ్రామములో భగవాన్ బాబా అళికె మరియు ముద్దెనహళ్ళిలోని విద్యాసంస్థలలో పనిచేసే ఉపాధ్యాయులకొరకు పదిరోజుల ఆధ్యాత్మిక మరియు విద్యా శిబిరమును ప్రారంభించారు

16-06-1983 : నూతన విద్యా సంవత్సర ప్రారంభము సందర్భంగా భగవాన్ బాబా ప్రశాంతి నిలయములో శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క సభా ప్రాంగణంలో దివ్యోపన్యాసము చేశారు

12-07-1983 : రంజాన్ పండుగ సందర్భముగా భగవాన్ దివ్యోపన్యాసము

22-07-1983 : ప్రశాంతి నిలయంలో భగవాన్ బాబావారిచే భద్రతా

శిక్షణ సంస్థ ప్రారంభం. ఈ సందర్భంగా భగవాన్ ప్రశాంతి నిలయంలో పండుగలు మరియు కొన్ని ప్రత్యేక సమయాలలో వచ్చే అశేష భక్తజన సందోహమును క్రమపద్ధతిలో ప్రవేశ పెట్టుటకు 'భద్రతా దళం' పేరుతో ఏర్పాటు చేయబడిన ఒక ప్రత్యేక టాస్కుఫోర్సుకు మూడు రోజుల శిక్షణా శిబిరమునుకూడా ప్రారంభించారు

24-07-1983 : ప్రశాంతి నిలయంలో గురుపూర్ణిమ పండుగ జరుపబడింది. ఈ సందర్భంగా భగవాన్ బాబా శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థలో విద్యార్థులు, ఉపాధ్యాయులకొరకు ఒక సమాజసేవా కార్యక్రమమును ప్రారంభించారు

14-08-1983 : ప్రశాంతి నిలయములోని కళాశాల హాస్టలులో భగవాన్ దివ్యోపన్యాసము

14-08-1983 నుండి 18-08-1983 వరకు : భారతదేశము మరియు విదేశములలోని బాలవికాస్ గురువులకు ప్రశాంతి నిలయములో శిక్షణా తరగతులు

22-08-1983 : ప్రశాంతి నిలయంలో ఓణం పండుగ

31-08-1983 : ప్రశాంతి నిలయంలో శ్రీకృష్ణజన్మాష్టమి పండుగ

07-10-1983 : ప్రశాంతి నిలయంలో దసరా ఉత్సవాలు మరియు వేదపురుష సప్తాహ జ్ఞాన యజ్ఞము ప్రారంభం

30-10-1983 మరియు 31-10-1983 : ఇటలీలోని రోమునగరంలో శ్రీ సత్యసాయి సంస్థల అంతర్జాతీయ సమావేశం

12-11-1983 : ప్రపంచవ్యాప్త అఖండ నామ సంకీర్తన

18-11-1983 : రథోత్సవం

19-11-1983 నుండి 21-11-1983 వరకు : శ్రీ సత్యసాయి సేవా సంస్థల అఖిల భారత సమావేశము

22-11-1983 : శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ యొక్క ద్వితీయ స్నాతకోత్సవము

23-11-1983 : భగవాన్ బాబావారి 58వ జన్మదినోత్సవం

25-12-1983 : ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ పండుగ

27-12-1983 : పూర్ణచంద్ర సభా మంటపంలో భగవాన్ బాబావారిచే ఐదురోజులపాటు జరిగే బాలవికాస్ గురువులు మరియు విద్యార్థుల ప్రపంచ సమ్మేళనంకు ప్రారంభోత్సవం

29-12-1983 : ప్రపంచ బాలవికాస్ విద్యార్థినీ, విద్యార్థుల ర్యాలీ

30-12-1983 : భగవాన్ బాబావారు పూర్ణచంద్ర సభా మంటపంలో సమావేశమైన బాలవికాస్ మరియు ప్రి-సేవాదళ్ విద్యార్థుల నుద్దేశించి ప్రసంగించారు

1984

13-01-1984 : సంక్రాంతి మరియు క్రీడోత్సవముయొక్క ముగింపు

18-01-1984 : భగవాన్ బాబావారు మద్రాసు వెళ్ళి అక్కడి నుండి తమిళనాడులోని ఆరు (తిరుచినాపల్లి, చెంగల్పట్టు, మదురై, కోయంబత్తూరు, పెరియార్ మరియు సేలం) జిల్లాలలో పర్యటించారు

23-01-1984 : మద్రాసు నుండి విమానంలో బయలుదేరి తిరుచినాపల్లిలో దిగారు. భోజనం అయిన తరువాత బాబా తన బృందముతో కలసి కొడైకెనాల్ వెళ్ళారు

26-01-1984 : కంగాయం, పెరుందురాయ్ మరియు చెన్నిమలై చూసుకుంటూ భగవాన్ బాబా మెట్టూరుకు వెళ్ళారు

27-01-1984 : సేలం సందర్శించి కృష్ణగిరి మీదుగా బృందావనం చేరుకున్నారు

04-02-1984 : భగవాన్ బాబా బృందావనంలో సైన్సు ఎగ్జిబిషన్ ప్రారంభించారు

05-02-1984 : హాస్టలు డే సందర్భంగా తల్లిదండ్రుల నుద్దేశించి ఉపన్యసించారు

09-02-1984 : ప్రశాంతి నిలయంలో శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క ఆడిటోరియంలో భగవాన్ దివ్యోపన్యాసము

29-02-1984 : భగవాన్ బాబావారు ప్రశాంతి నిలయములో శ్రీ సత్యసాయి జనరల్ హాస్పిటలుయొక్క నూతన భవనమునకు ప్రారంభోత్సవం చేశారు

01-03-1984 : 'సనాతన సారథి' మాసపత్రికలో 'సూత్రవాహిని' అనే ధారావాహిక వ్యాస పరంపర ముగిసి 'లీలాకైవల్య వాహిని' ప్రారంభింపబడింది

11-03-1984 : ప్రశాంతి నిలయములోని కళాశాల హాస్టలులో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసము

19-03-1984 : భగవాన్ బాబావారు శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ మరియు భారతీయ విశ్వవిద్యాలయాల సమాఖ్య కలసి "పరీక్షా విధానములో సంస్కరణలు" అనే అంశముపై 5 రోజులపాటు నిర్వహింపబడే వర్కుషాప్‌ను ప్రారంభించారు

23-03-1984 : శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ ఆడిటోరియంలో నిర్వహింపబడిన పై వర్కుషాపుయొక్క ముగింపు ఉత్సవము

02-04-1984 : ప్రశాంతి నిలయంలో ఉగాది పండుగ

10-04-1984 : బృందావనంలో శ్రీరామనవమి ఉత్సవం

11-04-1984 : భగవాన్ బాబావారు కొందరు ఎంపిక చేసిన భక్తులను తీసికొని తెల్లవారుఝామున బృందావనం నుండి బయలుదేరి మధ్యాహ్నం 2-30కు ఊటీలోని శ్రీ సత్యసాయి విద్యావిహార్‌కు చేరుకున్నారు

13-04-1984 : భగవాన్ బాబావారు విద్యావిహార్‌లో తమిళ సంవత్సరాదినాడు గణేశ మందిరమునకు ప్రారంభోత్సవం చేశారు. ఆ రోజున గణేశ విగ్రహము అడుగున ప్రతిష్ఠించేందుకు ఒక బంగారు యంత్రమును సృష్టించారు

26-04-1984 : బెంగుళూరులోని వైట్‌ఫీల్డు ఆశ్రమంలో నూతనంగా నిర్మింపబడిన "త్రయీ బృందావనం" మందిరంలో భగవాన్ బాబావారి ప్రవేశం

06-05-1984 : బృందావనంలో ఈశ్వరమ్మ సంస్మరణ దినం వేడుకలు

11-05-1984 : భగవాన్ బొంబాయికి ప్రయాణం

12-05-1984 : ధర్మక్షేత్రముయొక్క పదహారవ వార్షికోత్సవము

14-05-1984 : భగవాన్ బాబావారు బ్రాబోర్న్ స్టేడియంలో ఇండియన్ మర్చంట్స్ ఛేంబరు సభ్యుల నుద్దేశించి ప్రసంగించారు

19-05-1984 : భగవాన్ హైదరాబాదుకు ఆగమనం

20-05-1984 : హైదరాబాదులోని 'శివం'లో భగవాన్ బాబావారు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సేవాదళ్ సమావేశమును ప్రారంభిస్తూ దివ్యోపన్యాసం చేశారు

29-05-1984 : భగవాన్ విమానంలో మదురైకి చేరుకుని అక్కడినుండి కారులో కొడైకెనాల్ వెళ్ళారు

02-07-1984 : భగవద్గీతపై ప్రశాంతి నిలయంలో వరుసగా ప్రతిరోజూ

భగవాన్ బాబావారి దివ్యోపన్యాసాలు ప్రారంభం

13-07-1984 : ప్రశాంతి నిలయంలో గురుపూర్ణిమ ఉత్సవం

16-08-1984 : భగవాన్ బాబావారిచే బుక్కపట్నంలో నూతనమైన పాఠశాల భవనమునకు ప్రారంభోత్సవం

19-08-1984 : ప్రశాంతి నిలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి పండుగ

30-08-1984 : ప్రశాంతి నిలయంలో గణేశ చతుర్థి

07-09-1984 : ప్రశాంతి నిలయంలో ఓణం పండుగ

26-09-1984 : ప్రశాంతి నిలయంలో దసరా ఉత్సవాలు ప్రారంభం

24-10-1984 : ప్రశాంతి నిలయంలో దీపావళి పండుగ

10-11-1984 : ప్రపంచవ్యాప్త అఖండ నామ సంకీర్తన

15-11-1984 నుండి 17-11-1984 వరకు : 'శ్రీ సత్యసాయి సేవా దర్శన్' పేరుతో గ్రామ సేవా కార్యక్రమాల ప్రదర్శన

18-11-1984 : పూర్ణచంద్ర సభా మంటపంలో భగవాన్ బాబావారిచే ప్రథమ అంతర్జాతీయ సేవాదళ్ సమావేశమునకు ప్రారంభోత్సవం. ఈ సమావేశములో భారతదేశములోని అన్ని ప్రాంతములనుండి మరియు ఇరవై దేశాల నుండి వచ్చిన 8500 మంది సేవాదళ్ ప్రతినిధులు పాల్గొన్నారు

22-11-1984 : శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థయొక్క తృతీయ స్నాతకోత్సవము

23-11-1984 : భగవాన్ బాబావారి 59వ జన్మదినోత్సవ సందర్భంగా ప్లానిటేరియంకు భగవాన్‌చే శంకుస్థాపన

25-12-1984 : ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ ఉత్సవాలు

31-12-1984 : మానవతా విలువల బోధన గురించి ప్రప్రథమంగా

ఒక జాతీయ స్థాయి వర్క్‌షాపును నిర్వహించిన సందర్భంగా భగవాన్ బాబావారు బాలవికాస్ గురువుల నుద్దేశించి ప్రశాంతి మందిరంలో ప్రసంగించారు

1985

14-01-1985 : ప్రశాంతి నిలయంలో సంక్రాంతి పండుగ

18-01-1985 : భగవాన్ బాబా ప్రశాంతి నిలయమునుండి బయలుదేరి అనంతపురము, మదనపల్లి మీదుగా మద్రాసు చేరుకున్నారు

21-01-1985 : మద్రాసులోని అన్నానగర్‌లో గల తిరుమంగళం కాలనీలో పునరుద్ధరింపబడిన దేవాలయములో భగవాన్ బాబావారు తిరువీధి అమ్మన్ విగ్రహమునకు మహా సంప్రోక్షణం చేశారు

22-01-1985 : భగవాన్ బాబావారు 'సుందరం' మందిరములో తమిళనాడు రాష్ట్ర సత్యసాయి సేవా సంస్థలు దత్తత తీసుకున్న 300 గ్రామాలలో సేవచేస్తున్న క్రియాశీలక కార్యకర్తల నుద్దేశించి ప్రసంగించారు

25-01-1985 : భగవాన్ ఏబట్స్‌బరీలో శ్రీ సత్యసాయి సేవాదళ్ సభ్యులకొరకు 'ఆరోగ్యము మరియు పరిశుభ్రత' అనే అంశముపై నిర్వహింపబడిన వర్క్‌షాపును ప్రారంభించారు

26-01-1985 నుండి 29-01-1985 వరకు : భగవాన్ బొంబాయి, అకోలా పర్యటన. ధర్మక్షేత్రములో భాగముగా భగవాన్ మానవాభ్యుదయ క్షేత్రమును ప్రారంభించారు. ఈ నూతన భవనములో 'మానవతా విలువల బోధనా సంస్థ' మరియు 'శ్రీ సత్యసాయి ట్రైనింగు స్కూలు' రెండు కూడా పనిచేస్తున్నాయి

17-02-1985 : ప్రశాంతి నిలయంలో మహాశివరాత్రి పర్వదినం

20-03-1985 మరియు 21-03-1985 : ఢిల్లీ నుండి వచ్చిన విద్యావేత్తలకు భగవాన్ ఇంటర్వ్యూ ప్రసాదించారు

22-03-1985 : ప్రశాంతి నిలయంలో ఉగాది పండుగ

04-05-1985 : తమిళనాడు రాష్ట్రమునకు చెందిన శ్రీ సత్యసాయి సేవాసంస్థయొక్క వెస్ట్‌జోన్ విభాగము, మధురైలోని అరవింద్ నేత్ర వైద్యశాలతో కలసి ఈశ్వరమ్మ హైస్కూలులో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరమును భగవాన్ బాబా ప్రారంభించారు

06-05-1985 : ప్రశాంతి నిలయంలో ఈశ్వరమ్మ సంస్మరణ దినోత్సవము

13-05-1985 : ప్రశాంతి నిలయంలో విద్యార్థుల నుద్దేశించి భగవాన్ బాబావారి దివ్యోపన్యాసము

26-05-1985 : భగవాన్ బాబావారు శ్రీ సత్యసాయి ఉన్నత విద్యాసంస్థ విద్యార్థులను తీసికొని కమ్మవారి పల్లె మరియు అమ్మగొండపాలెం గ్రామాలకు వెళ్ళి అక్కడ వారిచే వివిధ సమాజసేవా కార్యక్రమాలు నిర్వహించారు

01-06-1985 : భగవాన్ బాబా ప్రశాంతి నిలయంలో మానవతా విలువల బోధన గురించి నిర్వహింపబడిన ప్రథమ జాతీయ సెమినార్ - కమ్ - వర్క్‌షాపును ప్రారంభించారు

12-06-1985 : ప్రశాంతి నిలయంలో సామూహిక ఉపనయన మహోత్సవం

02-07-1985 : ప్రశాంతి నిలయంలో గురుపూర్ణిమ పండుగ. ఈ సందర్భంగా భగవాన్ బాబావారు పుట్టపర్తి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకొరకు నూతనంగా

శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్ట్

దిగుమతి / ఎగుమతిదారు కోడ్ నెం. 2001198

ప్రస్తుతం మా వద్ద లభ్యమయ్యే తెలుగు పుస్తకముల జాబితా

వనెం.	పేరు	ధర(రూ॥లు)	బరువు (గ్రాలు)
	శ్రీవారి రచనలు, దివ్యోపన్యాసములు		
01.	ఉపనిషత్‌వాహిని	15.00	160
02.	గీతావాహిని	28.00	300
03.	ధర్మవాహిని	19.00	140
04.	ప్రశాంతివాహిని	17.00	175
05.	ప్రశ్నోత్తరవాహిని	12.00	120
06.	భాగవతవాహిని	33.00	405
07.	రామకథారసవాహిని (1వ భాగం)	45.00	508
08.	రామకథారసవాహిని (2వ భాగం)	36.00	360
09.	లీలాకైవల్యవాహిని	7.00	75
10.	సత్యసాయివాహిని	32.00	285
11.	జ్ఞానవాహిని	15.00	145
12.	ధ్యానవాహిని	15.00	150
13.	ప్రేమవాహిని	15.00	165
14.	విద్యావాహిని	15.00	145
15.	సూత్రవాహిని	8.50	55
16.	ప్రబోధపంచామృతము	28.00	130
17.	శ్రీసత్యసాయి దివ్యబోధ(1978)	35.00	215
18.	మనస్సు - మర్మము	17.00	155
19.	సందేహనివారిణి	20.00	195
20.	చిన్నకథ (1వ భాగం)	21.00	230
21.	చిన్నకథ (2వ భాగం)	20.00	205
22.	చిన్నకథ (3వ భాగం)	25.00	230
23.	చిన్నకథ (బొమ్మల పుస్తకం 1వ భాగం)	20.00	194
24.	చిన్నకథ (బొమ్మల పుస్తకం 2వ భాగం)	24.00	200
25.	చిన్నకథ (బొమ్మల పుస్తకం 3వ భాగం)	18.00	152

26. చిన్నకథ (బొమ్మల పుస్తకం 4వ భాగం)	24.00	202
27. చిన్నకథ (బొమ్మల పుస్తకం 5వ భాగం)	23.00	198
28. చిన్నకథ (బొమ్మల పుస్తకం 6వ భాగం)	25.00	196
29. చిన్నకథ (బొమ్మల పుస్తకం 7వ భాగం)	19.00	175
30. చిన్నకథ (బొమ్మల పుస్తకం 8వ భాగం)	20.00	185
31. చిన్నకథ (బొమ్మల పుస్తకం 9వ భాగం)	22.00	205
32. వచనామృతము (1984)	45.00	410
33. శ్రీసత్యసాయి దివ్యబోధ (1993)	27.00	250
34. శ్రీ సత్యసాయి గీతామృతం	41.00	490
35. మధురోపన్యాసాలు (వేసవి తరగతులు, 1995)	23.00	295
36. శ్రీ సత్యసాయి సూక్తులు	30.00	390
37. వాక్యవిభూతి	10.00	70
38. శ్రీసత్యసాయి వచనామృతం (1961-62)	45.00	345
39. శ్రీసత్యసాయి వచనామృతం (1963-64)	46.00	360
40. దసరా యజ్ఞసప్తకం (1997)	22.00	210
41. దసరా యజ్ఞసప్తకం (1998)	20.00	180
42. దీనసేవే దైవసేవ (దసరా సందేశాలు,2000)	30.00	165
43. ప్రవృత్తి-నివృత్తి (దసరా సందేశాలు,2001)	21.00	165
44. శ్రీసత్యసాయి వచనామృతం (1990)	46.00	390
45. శ్రీసత్యసాయి వచనామృతం (1991)	48.00	405
46. ఆధ్యాత్మిక భారతి (వేసవితరగతులు, 2000)	25.00	307
47. రామాయణ దర్శనము (వేసవితరగతులు, 2002)	23.00	250
48. సత్యదర్శనము (దసరా సందేశాలు, 2002)	18.00	190
49. ఈశ్వరుని అమ్మ ఈశ్వరమ్మ	11.00	100
50. శ్రీ సత్యసాయి సూక్తిముక్తావళి	19.00	160
51. శ్రీ సత్యసాయి వేదవాణి	47.00	542
52. శ్రీ సత్యసాయి పద్యసూక్తులు	16.00	150
53. 'నేను నేనే' (దసరా సందేశాలు, 2004)	10.00	65
54. ఏకత్వమే దైవత్వము (దసరా సందేశాలు, 2005)	10.00	50
55. భగవాన్ శ్రీ సత్యసాయివాణి (ప్రథమ భాగం)	37.00	405
56. భగవాన్ శ్రీ సత్యసాయివాణి (ద్వితీయ భాగం)	30.00	310
57. 'అహం సత్యబోధకః' (జన్మదిన సందేశాలు)	42.00	480
58. భగవాన్ శ్రీ సత్యసాయి స్వీయ చరిత్ర	25.00	250
59. నిత్య జీవితంలో ఆధ్యాత్మిక సాధన	44.00	470

నూతనంగా వెలువడిన పుస్తకములు

60. శ్రీ సత్యసాయి వచనామృతం 2000	49.00	380
61. శ్రీ సత్యసాయి వచనామృతం 2001	43.00	390
62. శ్రీ సత్యసాయి వచనామృతం 2002	40.00	450
63. శ్రీ సత్యసాయి వచనామృతం 2004	31.00	325
64. శ్రీ సత్యసాయి వ్రత కల్పము	9.00	70
65. శ్రీ సాయిబాబా నా మార్గం, నా గమ్యం	50.00	485
66. సకల వేదసారమే రుద్రము (అతిరుద్ర మహాయజ్ఞం దివ్యోపన్యాసాలు)	20.00	105
67. ప్రేమతరంగిణి	39.00	320
68. ప్రేమబంధం	19.00	175
69. శ్రీ సత్యసాయిదేవుని దివ్యసూక్తులు	43.00	415
70. బాలవికాస్ నాటికలు	35.00	370
71. సత్యోపనిషత్	33.00	360
72. శ్రీ సత్యసాయి దివ్య కృపాశ్రయం	43.00	370
73. కాంతిరేఖలు	45.00	390
74. చైతన్య స్రవంతి	26.00	235
75. శ్రీకృష్ణ చరితామృతం (కృష్ణాష్టమి దివ్యోపన్యాసాలు)	54.00	490
76. శ్రీ సత్యసాయి - ఆర్తత్రాణపరాయణుడు	42.00	410
77. భాష్యార్థ గోప్యములు	21.00	220
78. మానస భజరే గురు చరణం (గురుపూర్ణిమ దివ్యోపన్యాసాలు, 1975 - 2005)	55.00	476
79. శ్రీ సత్యసాయి భగవానునిగురించిన దివ్యస్మృతులు	45.00	
80. లీలా మోహన సాయి	20.00	

భక్తుల రచనలు

01. సత్యం శివం సుందరం (1వ భాగం)	45.00	420
02. సత్యం శివం సుందరం (2వ భాగం)	45.00	400
03. సత్యం శివం సుందరం (3వ భాగం)	35.00	295
04. సత్యం శివం సుందరం (4వ భాగం)	50.00	530
05. సత్యం శివం సుందరం (5వ భాగం)	75.00	
06. సత్యం శివం సుందరం (6వ భాగం)	50.00	

07. మణిమాల	20.00	215
08. భక్తోద్ధారక శ్రీ సత్యసాయి	28.00	220
09. ప్రేమజ్యోతి	36.00	400
10. మాతృశ్రీ ఈశ్వరమ్మ	27.00	280
11. శ్రీసత్యసాయి ప్రేమసుధా స్రవంతి	50.00	550
12. సాయిభాగవతం	20.00	180
13. భజనావళి	25.00	300
14. శ్రీ సత్యసాయి ఆనందదాయి	65.00	680
15. శివశక్తి సాయి	12.00	120
16. శ్రీ సత్యసాయిమార్గంలో పిల్లల పెంపకం	43.00	410
17. శ్రీ సత్యసాయి అవతార వైభవం	14.00	155
18. ప్రశాంతినిలయ సమాచారదర్శిని	12.00	105
19. స్వామి నా ప్రత్యక్ష దైవం	39.00	410
20. వేద పుష్పాంజలి	23.00	284
21. యజ్ఞవేది (వేదపండితుల వ్యాస సంకలనము)	50.00	505
22. నివేదన (శ్రీవారి 80వ జన్మదినోత్సవ సావనీర్)	47.00	340

గమనిక: మీకు కావలసిన పుస్తకాల ధర, పోస్టు ఖర్చులు కలిపి మనియార్డరు ద్వారాగాని, డ్రాఫ్ట్‌ద్వారాగాని **"కన్వీనర్, శ్రీ సత్యసాయి బుక్స్ అండ్ పబ్లికేషన్స్ ట్రస్టు, ప్రశాంతినిలయం, అనంతపురం జిల్లా, పిన్ - 515134"** అనే చిరునామాకు ముందుగా పంపిన మీదట మావద్ద లభ్యమౌతున్న పుస్తకాలను పంపుతాము. పోస్టు ఖర్చులకు పుస్తకాల బరువుతో పాటు ప్యాకింగ్ మెటీరియల్ బరువునుకూడా పరిగణనలోకి తీసికొనవలెను.

ప్యాకింగ్ మెటీరియల్ బరువు : 100 గ్రాములు (రెండు కిలోలలోపు ప్యాకెట్‌కు); 300 గ్రాములు (రెండు కిలోల నుండి ఐదు కిలోల ప్యాకెట్‌కు)

పుస్తకాలను రిజిస్టర్డ్ పోస్టులో మాత్రమే పంపడం జరుగుతుంది. వి.పి.పి. ద్వారా పంపించటం జరుగదు.

పోస్టు ఖర్చుల వివరాలు (ప్యాకింగ్ ఛార్జీలతో కలిపి): 500 గ్రాములలోపు ప్యాకెట్‌కు రూ.లు 37; 500 గ్రాములనుండి ఒక కిలో ప్యాకెట్‌కు రూ.లు 42; ఒక కిలోనుండి రెండు కిలోల ప్యాకెట్‌కు రూ.లు 52; రెండు కిలోలనుండి మూడు కిలోల ప్యాకెట్‌కు రూ.లు 72; మూడు కిలోలనుండి నాల్గు కిలోల ప్యాకెట్‌కు రూ.లు 82; నాల్గునుండి ఐదు కిలోల ప్యాకెట్‌కు రూ.లు 92.



ఈ గ్రంథములో 1980-85 మధ్యకాలమునకు సంబంధించిన భగవాన్ శ్రీ సత్యసాయి బాబావారి అవతార గాథను ఒక క్రమపద్ధతిలో, అత్యంత ప్రామాణికతతో వివరించడానికి ప్రయత్నం జరిగింది. ప్రతి అధ్యాయములోను భగవాన్ బాబావారి దివ్య లీలలు, మహిమలు పన్నీటి జల్లులవలె జాలువారుతాయి. పాఠకులు ఈ గ్రంథమును చదువుతున్నప్పుడు అవతార వైభవమును ప్రతిఫలించే భక్తుల కథలు ఈ గ్రంథ రచనకు ఉపకరణములుగా వినియోగింపబడటాన్ని గ్రహించగలరు. ఇందులో ఒక్కొక్క భక్తుని కథ భగవాన్ బాబావారి ప్రేమానుగ్రహములకు పాత్రులైన వందలు, వేల అదృష్టవంతులైన భక్తులకు ప్రతీకలని చెప్పవచ్చును.

- కస్తూరి

Prasanthi Nilayam

T00TEL013002
SSSBPT
7834
Rs. 75

ISBN 978-81-7208-559-9
978-81-7208-533-9(Set)

1980-85

సత్యం శివం సుందరం (ఐదవ భాగం)

Prasanthi Nilayam

సత్యం శివం సుందరం

(ఐదవ భాగం)

